UNIVERSAL
LIBRARY
OU_204945
UNIVERSAL
LIBRARY

Osmania University Library

Call No. T81 S77K

Accession No. T 624

Author శ్రీనాథుడు

Title కాశీఖండము,

This book should be returned on or before the date last marked below.

ప్రకాశకవిజ్ఞప్తి

1914-వ సంవత్సరాంతమున శ్రీనాథమహాకవి కృతమైన కాశీఖండమును ముద్రింప దలచి అచ్చుప్రతితో సంప్రతించుకొనుచు ఓరియంటలులైబ్రరీలోనుండు వ్రాతప్రతులప్రకారము రెండు పర్యాయములు శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారిచే పాఠములు సమకూర్పించితిమి. తరువాత ఆంధ్రసాహిత్యపరిషత్తులోని వ్రాతప్రతిపాఠములను సమకూర్చితిమి. అప్పటిలో మాపండితులును కీర్తిశేషులగు శ్రీ ఉత్పల వేంకటనరసింహాచార్యులుగారు దీనిని పరిష్కరింపగా 1917 సం॥లో ప్రకటించితిమి. నేడీ కాశీఖండప్రతులత్యావశ్యకముగ కానవచ్చుటచే దీనిని పునర్ముద్రణము గావించినారము. శ్రీనాథకవి తక్కిన గ్రంథములు త్వరలో పునర్ముద్రణము గావించుచున్నాము.

ఇట్లు
ప్రకాశకులు

కాశీఖండము

కవిసార్వభౌముడు శ్రీనాథమహాకవి 'ప్రాయ మింతకు మిగులఁ గైవ్రాలకుండ' రచించిన ప్రౌఢకావ్యము కాశీఖండము. రాజమహేంద్రవరము నేలిన రెడ్డిరాజు వీరభద్రారెడ్డి కంకితముగా క్రీ.శ. 1440 సం|| ప్రాంతమున రచినమైనది. ఇది స్కాందపురాణమునందలి యేబదిఖండములలోగల సంస్కృత కాశీఖండమునకు అనువాదము. మహాపురాణైకదేశ మగు సంస్కృత కాశీఖండము సులభగ్రాహ్యమై పురాణరీతితో నుండఁగా, తెనుఁగున శ్రీనాథుఁడు ప్రౌఢతరమగు కావ్యశైలిలో దీనిని రచించెను కావుననే "కాశీఖండమయః పిండమ్" అను నాభాణకము తెలుగు కాశీఖండమునుబట్టియే యేర్పడినది.

సంస్కృతమూలమున, ద్వాదశసహస్రగ్రంథపరిమితిగల విషయమును తెలుగున నేడాశ్వాసములును (1-142, 2-167, 3-248, 4-306, 5-339, 6-310, 7-265) 1777 గద్యపద్యములుగల కావ్యమైనది. మూలగ్రంథములోని పౌరాణికవిషయములను, జాతివార్తా చమత్కార విలసితముగను, శైవతత్త్వప్రతిపాదకములుగను శ్రీనాథకవి విపులీకరించి, ఆంధ్రతాముద్రసీగ్రంథమున నచ్చొత్తినవాఁడు.

కాశీఖండమున కాశీక్షేత్రమహిమయే చెప్పబడినను, అందందు సాముద్రిక, పాతంజలయోగశాస్త్ర, మంత్రశాస్త్ర విశేషములు పొందుపడినవి కావున నిది శ్రీనాథుని కవితా శైలికేగాక పాండితీప్రతిభకు నికషోపలము.

ఇందలిశైలి కావ్యశైలి గావున సంస్కృతాంధ్రసాహితీ పారగుఁ డగు శ్రీనాథుఁడు, పూర్వకవుల రచనారీతుల నెట్లు జీర్ణించుకొన్నదనియు తెలిసికొనుటకు నీగ్రంథ మెంతేని యుప యోగపడును. సంస్కృతమున, మయూరుని సూర్యశతక శ్లోకానువాదములు ప్రధానస్థాన మాక్రమించును. వాల్మీకిరా మాయణము, భవభూతియుత్తరరామచరిత్రము, విశాఖదత్తుని ముద్రారాక్షసము, భట్టగోపాలుని సాహిత్యచింతామణి (కావ్య ప్రకాశికవ్యాఖ్య) అవతారికారచనముల కనువాదము లిందు గలవు. తెలుగున వేములవాడ భీమన యుద్దండలీల - నన్నయ భట్టారకుని యుభయవాక్ప్రౌఢి, తిక్కయజ్వ రసాభ్యుచిత బంధము ప్రబంధపరమేశ్వరునిసూక్తి వైచిత్రియు నిందుగలవు. ఇవియన్నియు ప్రత్యేకముగ జూపిన గ్రంథవిస్తరమగును. సూక్ష్మముగను విశాలముగను బరిశీలించి శ్రీనాథమహాకవి రచనమున పదబంధములకు మూలములు మనము కనుగొనుట కవకాశములు గలవు.

కాశీఖండము శ్రీనాథుఁ డాంధ్రీకరించిన వెనుక వేఱెవ్వ రును పద్యకావ్యముగ దీని నాంధ్రీకరింప దలపెట్టలేదు. ఈవిష

యమే దీనిప్రత్యేకత తెలుపగలదు. కంచెర్ల శరభకవి (క్రీ. శ. 1500) యు మోచర్లఅన్నయు (క్రీ. శ. 1650) దీనిని ద్విపద కావ్యములుగ పరివర్తించిరి. కాని యవి లభ్యమగుటలేదు. దీనిని కర్ణాటాంధ్రభాషలలో వచనరూపముగ హాలాస్యమాహాత్మ్య కృతికర్త యగు నంజరాజు రచియించియున్నాడు. ఈవచనకాశీ ఖండము నముద్రితమైయున్నది. లాక్షణికులగు తాతంభట్టు, అప్పకవి కాశీఖండములోని లక్ష్యము లుదాహరించిరి. కూచి మంచి తిమ్మకవి తన సర్వలక్షణ సారసంగ్రహమున నిందలి పద్యములను డెబ్బదింటికిపైగా నుదాహరించియున్నాడు. ప్రామాణికాగ్రగణ్యుఁడగు పరవస్తు చిన్నయసూరి దీనియందలి పాఠ భేదములను గుర్తించినాడు. భాషావిషయమున నీగ్రంథ మెంతప్రమాణమో పై యుదాహృతులే తెలుపగలవు.

శ్రీనాథుఁడు సంస్కృతకాశీఖండమునందలి వ్యాసుఁడు కాశిని బాయుట అను వృత్తాంతమును గ్రహించి, దక్షిణకాశి యనఁదగిన దాక్షారామక్షేత్రమాహాత్మ్యమును (భీమఖండము) రచించెను. అఖిలభారతవర్ష ప్రసిద్ధమగు కాశీక్షేత్రమహిమను దెలుపుగ్రంథమే స్కాందపురాణమున నున్నది. ఆగ్రంథవిషయ మును గ్రహించి, ఆంధ్రదేశమున నూతనముగ వెలసిన దాక్షా రామముయొక్క మాహాత్మ్యమును తెలుగులో రచించి, ఆవెనుక దానికి పురాణప్రామాణ్యమును మూలగ్రంథగౌరవమును నొసం గుటకు శ్రీనాథుఁడు తెలుగుగ్రంథమును యథామాతృకముగా

సంస్కృతీకరించెను. సంస్కృతభీమఖండము శ్రీనాథోపజ్ఞమే యనుటకు నీవ్యాసఘట్టమే ప్రమాణము. కాశిని వ్యాసుఁడు బాసినవృత్తాంతము రెండుగ్రంథములయందును, భిన్నభిన్నరీతు లుగ నుండుట కిదియే కారణము. ఈగ్రంథములను రెంటిని మూలగ్రంథములతో పరిశీలించి చూచిన నీవిషయము తేట తెల్లము కాఁగలదు.

క్షేత్రమహిమలు వెలయించుటయందు శ్రీనాథునికిఁగల ప్రత్యేకతను శ్రీయుత మహామహోపాధ్యాయ కొక్కొండ వేంకటరత్నముపంతులవారు తమ బిల్వేశ్వరీయమున నవతారి కలో నిట్లు ప్రశంసించియున్నారు —

శా. స్కాందం బందనువందివందితమునౌ ఖండద్వయం బాంధ్రభా
షం దివ్యంబుగఁ జేసి క్షేత్రమహిమాచార్యం డనన్ గౌరవం
బం దె న్మున్నుగ బిల్వనాథసమనామాఢ్యం డెవం డెంతు స
త్సందోహ స్తుతు నమ్మహాకవిని విద్వన్నాథు శ్రీనాథునిన్.

శ్రీనాథుని రచనము లనఁగా, పదునాల్గు పదునైదవశతా బ్దిలోని యాంధ్రదేశరాజకీయ, సాంఘిక, సారస్వత చరిత్రప్రతి బింబములు. ఆంధ్రమహాజనుల సాహితీమయ జీవితమున సరస త్వమును, జాతీయతను, సభ్యతను ముద్రించి యజరామరకీర్తి గడించిన శ్రీనాథమహాకవి గ్రంథములు సప్రమాణికపాఠములతో సంస్కృతమూలములతో, సవ్యాఖ్యానములతో సమగ్రముగ

ముద్రితము లగునేని యప్పు డామహాకవిలోకోత్తరస్వప్రతిభా విశేషము, సర్వతోముఖ పాండిత్యము, సాహిత్యవిద్యాపారీణత, జాతీయకవిశేఖరత్వము ప్రస్ఫుటములై, ఆతనికీర్తిమూర్తిని దేదీప్యమానముగ విరాజిల్లఁజేయ సమర్థములగును. ఆంధ్రమహాజను లట్టి మహాకార్యమునకు గడంగుదురుగాక!

నిడుదవోలు వేంకటరావు, ఎం., ఏ.

విషయసూచిక

పీఠిక

విషయము.		పుట.
ఇష్టదేవతాప్రార్థనాదికము	...	1
కృతిపతివంశవర్ణనము	...	7
షష్ఠ్యంతములు	...	17

ప్రథమాశ్వాసము

పురాణప్రశంస	...	19
నైమిశశబ్దనిర్వచనము	...	20
కాశీఖండప్రశంస	...	21
నారదుండు వింధ్యమున కేతెంచుట	...	23
వింధ్యవర్ణనము	...	25
సూర్యోదయవర్ణనము	...	32
ఆశ్వాసాంతము	...	39

ద్వితీయాశ్వాసము

దేవతలును మునులును బ్రహ్మకడ కేగి స్తుతించుట	41
బ్రహ్మ దేవతలకును మునులకును గోబ్రాహ్మణ ప్రభావంబు చెప్పుట	44
దేవరులు బ్రహ్మనియోగమున నవిముక్తంబున కేతెంచి యగస్త్యుని దర్శించుట	49

విషయము.	పుట.
బృహస్పతి దేవర్షినియుక్తుండై యగస్త్యునితో సంభాషించుట	60
బృహస్పతి లోపాముద్రకుఁ బతివ్రతాధర్మంబులు చెప్పుట	61
బృహస్పతి యగస్త్యునితోఁ దమవచ్చినకార్యంబు నెఱిఁగించుట	67
అగస్త్యుండు కాశీవియోగంబునకుఁ బరితపించుట	70
అగస్త్యుండు లోపాముద్రతోఁ గాశిఁ బెడబాయుట, వింధ్యగర్వాపహరణము	84
ఆశ్వాసాంతము ...	87

తృతీయాశ్వాసము

అగస్త్యుండు దక్షిణకాశికిం బోవుట ...	91
అగస్త్యుండు కొల్లాపురంబున కేఁగుచు మార్గమున వీరభద్రేశ్వరు దర్శించుట	95
అగస్త్యుండు లక్ష్మిని స్తోత్రముచేయుట ...	93
/ అగస్త్యుండు శ్రీశైలంబున కేతెంచుట ...	102
అగస్త్యుండు లోపాముద్రకు బాహ్యాభ్యంతరతీర్థ మాహాత్మ్యంబుఁ జెప్పుట	107
శివశర్మోపాఖ్యానము ...	111
సప్తపురీప్రశంస ...	113
విష్ణుదూతలు శివశర్మకు సంయమినీస్వరూపంబుఁ దెల్పుట	126
అప్సరోలోకవర్ణనము ...	133
సూర్యలోకవర్ణనము ...	135
స్వర్గలోకవర్ణనము ...	142

విషయము.		పుటం.
వైశ్వానరమాహాత్మ్యము	...	146
వీరేశ్వరప్రభావవర్ణనము	...	155
ఆశ్వాసాంతము	...	161

చతుర్థాశ్వాసము

వైశ్వానరజననము	...	162
నిరృతిలోకవృత్తాంతము	...	174
వరుణలోకవృత్తాంతము	...	177
వరుణోత్పత్తి	...	177
గంధవతీవృత్తాంతము	...	181
కుబేరవృత్తాంతము	...	182
ఈశానలోకవృత్తాంతము	...	204
చంద్రలోకవృత్తాంతము	...	206
నక్షత్రలోకవృత్తాంతము	...	210
బుధలోకవృత్తాంతము	...	211
శుక్రలోకవర్ణనము	...	220
అంగారకలోకవృత్తాంతము	...	222
బృహస్పతిలోకవృత్తాంతము	...	224
శనైశ్చరలోకవృత్తాంతము	...	226
సప్తర్షిలోకవృత్తాంతము	...	231
ధ్రువపదవర్ణనము	...	232
శివశర్మ బ్రహ్మవిష్ణుమహేశ్వరలోకంబుల కేగుదెంచుట		234
విష్ణుపట్టాభిషేకవర్ణనము	...	235
శివశర్మనిర్యాణము	...	237

విషయము.		పుట.
అగస్త్యుండు కుమారస్వామిని దర్శించుట	...	239
ఆశ్వాసాంతము	...	"

పంచమాశ్వాసము

కుమారాగస్త్యసంవాదము	...	241
వారాణస్యాదినామనిర్వచనము	...	242
మణికర్ణికామాహాత్మ్యము	...	244
కాశీతీర్థమాహాత్మ్యకథనము	...	247
కాలభైరవచరిత్రము	...	259
హరికేశచరిత్రము	...	271
జ్ఞానవాపికాతీర్థమాహాత్మ్యము	...	272
కళావత్యుపాఖ్యానము	...	275
సదాచారనిరూపణము	...	288
స్త్రీలక్షణనిరూపణము	...	297
యోగనిరూపణము	...	298
కాలజ్ఞానకథనము	...	304
దివోదాసవర్ణనము	...	307
ఈశ్వరుండు నిఖిలదేవతలంగూడి మందరాద్రి కేగుట		310
ఈశ్వరుండు యోగినులం గాశి కంపుట	...	321
ఈశ్వరుండు సూర్యునిం గాశి కంపుట	...	323
ఉత్తరార్కప్రభావవర్ణనము	...	325
ఆశ్వాసాంతము	...	329

షష్ఠాశ్వాసము

సాంబాదిత్యమాహాత్మ్యము	...	330

విషయము.		పుట.
గరుడాదిత్య మయూఖాదిత్యఖఖోల్కా-దిత్య వరుణాదిత్య మాహాత్మ్యము		333
శివుండు బ్రహ్మం గాశి కనుపుట	...	337
ఈశ్వరుండు ప్రమథులం గాశి కంపుట	...	338
కపర్దీశ్వర ప్రభావకథనము	...	339
వినాయకుండు గాశి కేగుట	...	346
శివుండు విష్ణునిఁ గాశి కనుపుట	...	349
విష్ణువు మాయావేషంబునఁ గాశియందు బౌద్ధధర్మంబు స్థాపించుట		350
దివోదాసనిర్యాణము	...	355
శివుండు సపరివారుండై కాశికేతెంచుట	...	358
ఈశ్వరకృతఢుంఢి స్తవము	...	359
పంచనదతీర్థ మాహాత్మ్యము	...	363
బిందుమాధవసంభవము	...	365
వైష్ణవతీర్థమాహాత్మ్యము	...	366
మణికర్ణికా ప్రభావవర్ణనము	...	367
వృషభధ్వజావిర్భావము	...	377
కందుకేశ్వర వ్యాఘ్రేశ్వరసంభవము	...	383
శైలేశ్వరరత్నేశ్వరప్రాదుర్భావము	...	385
కృత్తివాసతీర్థమాహాత్మ్యము	...	387
కలహంసతీర్థాదిమాహాత్మ్యము	...	390
దుర్గామాహాత్మ్యము	...	397
ఓంకారేశ్వరమాహాత్మ్యము	...	406

విషయము.		పుట.
త్రివిష్టపేశ్వరమాహాత్మ్యము	...	418
కేదారేశ్వరమాహాత్మ్యము	...	421
ఆశ్వాసాంతము	...	423

సప్తమాశ్వాసము

ధర్మరాజేశ్వరలింగమాహాత్మ్యము	...	425
విశ్వభుజాఖ్యానము	...	427
ధర్మేశమాహాత్మ్యము	...	428
వీరేశ్వరాఖ్యానము	...	429
దుర్వాసోలింగమాహాత్మ్యము	...	431
విశ్వకర్మేశ్వరలింగప్రాదుర్భావము	...	435
దక్షేశ్వరలింగప్రాదుర్భావము	...	436
వ్యాసేశ్వరమాహాత్మ్యము	...	452
కాశీతీర్థమహిమాభివర్ణనము	...	455
వ్యాసుండు కాశిమీఁదఁ గోపించుట	...	459
క్షేత్రతీర్థకదంబవర్ణనము	...	478
విశ్వేశలింగమాహాత్మ్యము	...	486
దేవతాయాత్రావిధానము	...	494
ఆశ్వాసాంతము	...	495

శ్రీకాశీఖండము

పీఠిక

ఇష్టదేవతాప్రార్థనాదికము

శా. శ్రీకాశీనగరాధి రాజ్యపదవీసింహాసనాధ్యాసి లో
కైకగ్రామణి విశ్వనాథుఁడు విశాలాక్షీమనోభర్త సు
శ్లోకుం దొడ్డయయల్లభూవరతనూజున్ వీరభద్రేశ్వర
క్ష్మాకాంతుంజగనొబ్బగండనిమహైశ్వర్యాన్వితుం జేయుతన్.

సీ. కంఠాగ్రకరిరాజు డుంఠివిఘ్నేశుండు
 వడఁకుగుబ్బలికూఁతుకొడుకుకుఱ్ఱ
యాకాశమండలం బను నల్లకలువకు
 నకరు వాద్యుండు లోలార్కమూర్తి
గోపాలరామలగుబ్బచన్నుల మెచ్చు
 గీర్వాణవంద్యుండు కేశవుండు
కరటి వ్రీడాశూన్యకటి గోపురద్వార
 పరిరక్షకుఁడు కాలభైరవుండు

తే. కాలకంఠునిశిరసుపూ గగనగంగ
కాశికాక్షేత్రమున కేడుగడయునైన
యిందఱును నిత్తు రెల్లప్పు డీప్సితమ్ము
లల్లయప్రభు వీరభద్రాధిపునకు. 2

సీ. కబరికాభారంబు గై పెక్కు విరులతో
 నవటు భాగంబుపై నర్తమిల్ల

నలఁతి లేఁజెమటచే నసలుకొన్న లలాట
కుంకుమంబునఁ జిన్నికురులు మునుఁగఁ
బసిఁడికుండలఁ బోలుపాలిండ్లభరమున
సన్నపుఁగౌఁదీఁగె జలదరింపఁ
ధవళతాటంకరత్నప్రభారింఛోళి
గండస్థలంబులఁ గౌఁగిలింపఁ
తే. గాశికారామకల్పవృక్షములనీడఁ
గుతపవేళలయందు నాఁకొన్నవారి
కమృతదివ్యాన్న మిడువిశాలాక్షి గౌరి
శాశ్వతైశ్వర్యములు కృతిస్వామి కొసఁగు. 3
ఉ. పాయక నిర్నిరోధనిరపాయసమగ్రకృపాగుణైకపా
రాయణతావిలాసము తిరంబుగ నంబుజసూతి వీరనా
రాయణు దానవైభవధురంధరు సంగరసవ్యసాచి దీ
ర్ఘాయురుపేతుఁ జేయుత నృపాగ్రణి నల్లయవీరభద్రునిన్. 4
తే. కంఠపీఠిక నోంకారఘంట మొరయఁ
జెలఁగుఁ గావుత మన్మనగక్షేత్రసీమఁ
గవికుటుంబంబుపాలిటిదివిజసురభి
జలజసంభవుబోటి భాషావధూటి. 5
వ. అని సముచితప్రకారంబునఁ బూజ్యపూజాతత్పరుండనై
యొక్కనాఁ డాత్మగతంబున నిట్లని వితర్కించితి. 6
సీ. చిన్నారిపొన్నారిచిఱుతకూఁకటినాఁడు
రచియించితిని మరుద్రాట్చరిత్ర
నూనూఁగుమీసాలనూత్నయౌవనమున
శాలివాహనసప్తశతి నొడివితి

సంతరించితి నిండుజవ్వనంబునను శ్రీ
హర్షనైషధకావ్య మంధ్రభాషఁ
బ్రౌఢనిర్భరవయఃపరిపాకమునఁ గొని
యాడితి భీమనాయకునిమహిమఁ

తే. ప్రాయ మెంతయు మిగులఁ గైవ్రాలకుండఁ
గాశికాఖండ మనుమహాగ్రంథ మేను
దెనుఁగుఁ జేసెదఁ గర్ణాటదేశకటక
పద్మవనహేళి శ్రీనాథభట్టసుకవి. 7

ఉ. స్కాందపురాణసంహితకు ఖండము లేఁబది యందులోన నా
నందవనానుభావకథనంబున శ్రోతకు వక్తకుఁ శుభా
నందపరంపరావహము నైజగుణంబని గాశిఖండ మా
కందు వెలింగి నేను సమకట్టితిఁ గావ్యముగా నొనర్పఁగాన్.

వ. ఇమ్మహాప్రబంధప్రారంభంబుఁ గర్ణాకర్ణికావశంబున నాక
ర్ణించి కర్ణాంతవిశ్రాంతవిశాలనేత్రుండును, బంటవంశకమల
మిత్త్రుండును, నశ్రాంతవిశ్రాణనక్రీడాపరాయణుండును,
వీరనారాయణుండును, నిత్యసత్యుండును, బల్లవాధి
త్యుండును, భూభువనభారభరణదీక్షాదక్షదక్షిణభుజా
భుజంగుండును, రాయవేశ్యాభుజంగుండును, కీర్తిగంగా
తరంగిణీప్రవాహపవిత్రితస్వర్గమర్త్యపాతాళుండును, జగ
దగోపాలుండును, విమలధర్మశీలుండును సంగడిరక్షాపాలుం
డును నగునల్లయవీరభద్రభూపాలుం డొక్కనాఁడు. 9

సీ. త్రైలోక్యవిజయాభిధంబైన సౌధంబు
చంద్రశాలాప్రదేశంబునందు

సచివసై నాన్యధీశసామంతనృపవర
  సీమంతినీజనశ్రేణి గొలువ
శాస్త్రమీమాంసయు సాహిత్యగోష్ఠియు
  విద్వత్కవీంద్రులు విస్తరింపఁ
గర్పూరకస్తూరికాసంకుమదగంధ
  సారసౌరభము దిక్పూరితముగ
తే. నిజభుజావిక్రమంబున నఖిలదిశలు
గెలిచి తను రాజ్యపీఠ మెక్కించినట్టి
యన్న వేమేశ్వరునిజాంక మాశ్రయించి
నిండుకొలు వుండెఁ గన్నులపండు వగుచు. 10

వ. అప్పుడు నన్నుం బిలువం బంచి సముచితాసనంబునం
గూర్చుండ నియమించి యన్న యవసరంబున. 11

తే. రాయవేశ్యాభుజంగ సంగ్రామపార్థ
గాయిగోవాడ వేమనక్ష్మాధవుండు
గూర్మి యనుజన్మహృదయంబుకోర్కి యెఱిఁగి
యర్థి ననుఁ జూచి యిట్లని యానతిచ్చె. 12

సీ. వచియింతు వేములవాడభీమనభంగి
  నుద్దండలీల నొక్కొక్కమాటు
భాషింతు నన్నయభట్టుమార్గంబున
  నుభయవాక్ప్రౌఢి నొక్కొక్కమాటు
వాక్రుత్తు తిక్కయజ్వప్రకారము రసా
  భ్యుచితబంధముగ నొక్కొక్కమాటు
పరిఢవింతు ప్రబంధపరమేశ్వరుని త్రోవ
  సూక్తివైచిత్రి నొక్కొక్కమాటు

తే. నైషధాదిమహాప్రబంధములు పెక్కు
చెప్పినాఁడవు మాకు నాశ్రితుఁడ వనఘ!
యిపుడు చెప్పఁ దొడంగిన యీ ప్రబంధ
మంకితము సేయు వీరభద్రయ్య పేర. 13

శా. ఈక్షోణి న్నినుఁ బోలుసత్కవులు లే రీనేఁటికాలంబునన్
దాక్షారామచళుక్యభీమవరగంధర్వాప్సరోభామినీ
వక్షోజద్వయగంధసారఘుసృణద్వైరాజ్యభారంబు న
ధ్యక్షించున్ గవిసార్వభౌమ! భవదీయప్రౌఢసాహిత్యముల్.

వ. అనియనంతరంబ కర్పూరవసంతరాయండు వీరభద్రేశ్వరుండు
కర్పూరతాంబూలసహితంబుగా జాంబూనదాంబరాభరణంబు
లిచ్చినం బరిగ్రహించి. 15

సీ. ఆంధ్రక్షమామండలాఖండలుం డైన
వేమభూపతికృపావీక్షణంబు
ఘోడెరాయాంకసద్గురురాజభీమేశ్వ
రస్వామిపదసమారాధనంబు
కమలాద్రినిలయమార్కండేయశివమౌళి
చంద్రాంశునవసుధాసారధార
వేదాద్రినరసింహవిపులవక్షస్స్థలీ
కల్హారమాలికాగంధలహరి

తే. గారణంబులు నుద్బోధకములు గాఁగ
సంభవించిన సాహిత్యసౌష్ఠవమున
వీరభద్రేశ్వరుఁ బ్రబంధవిభునిఁ జేసి
కాశికాఖండముఁ దెనుంగుఁగా నొనర్తు. 16

తే. కలిగెఁ బదియాఱువన్నె బంగారమునకుఁ
బద్మరాగంబుతోడిసంపర్కలబ్ధి
కాశికాఖండ మనుమహాగ్రంథమునకు
నాయకుఁడు వీరభద్రభూనాథుఁ డగుట. 17

వ. అని తన్మహాప్రబంధకల్పనాకుతూహలాయత్తచిత్తుండ నై.

సీ. బాదరాయణుపాదపద్మంబులకు మ్రొక్కి
ప్రాచేతసుని మనఃపదవి నిలిపి
భట్టబాణమయూరభవభూతిశివభద్ర
కాళిదాసుల మహాకవులఁ గొలిచి
రాజశేఖరుని భారవి మాఘుఁ గీర్తించి
ప్రవరసేనుని దండి భాసుఁ దలఁచి
హర్షు బిల్హణుని మల్హణుఁ జోరుఁ గొనియాడి
క్షేమేంద్రు వేడుకఁ జిత్తగించి

తే. శబ్దశాసను నన్నపాచార్యుఁ దలఁచి
సత్కవిశ్రేష్ఠుఁ దిక్కయజ్వను భజించి
సత్ప్రబంధమహేశ్వరు శంభుదాసు
నధికసద్భక్తి సంయుక్తి నాదరించి. 19

తే. మత్పితామహుఁ గవిపితామహునిఁ దలఁతుఁ
గలితకావ్యకళాలాభుఁ గమలనాభుఁ
జంద్రచందనమందారసదృశకీర్తి
సరససాహిత్యసామ్రాజ్యచక్రవర్తి. 20

వ. అని యనంతరంబ కృతీశ్వరు వంశం బభివర్ణించెద. 21

కృతిపతివంశవర్ణనము

సీ. కలశాబ్ధికన్యకా కరపల్లవద్వయీ
సంవాహనక్రియాసముచితంబు
నిఖిలవేదాంతవాఙ్నిధివధూధమ్మిల్ల
బహుళపుష్పామోదభాసితంబు
ప్రణతనానాసుపర్వకిరీటసంఘాత
రత్నాంశురాజినీరాజితంబు
సనకాదిసన్మునీశ్వరమనోమందిరా
భ్యంతరరత్నదీపాంకురంబు
తే. పతగకేతను శ్రీపాదపంకజంబు
గారణంబుగ జన్మించె భూరిమహిమ
గంగ నైదోడు రిపుకోటిగళము త్రాడు
నాలుగవజాతి సమధికోన్నతవిభూతి. 22

శా. ఆవర్ణంబున నుద్భవించి గుణరత్నార్ణోనిధానంబు శ్రీ
దూపూరం బెరుమాళ్లు రెడ్డి యభివృద్ధుల్గాంచె మృత్యుంజయ
గ్రీవాక్ష్వేళకలంకపంకహరణక్రీడాకళాగర్విత
ద్యావాపృథ్వ్యవకాశపేశలయశోధారానభస్సింధువై. 23
తే. అతనియర్ధాంగలక్ష్మి శ్రీయన్నమాంబ
గాంచెఁ దనయుల నర్థార్థికల్పకముల
నల్లయాధీశ పెదకోట యాన్న ప్రోల
దొడ్డయేశుల పినకోటరెడ్డివిభుల. 24
సీ. అవనిభారధురీణతాధరీకృతమహా
క్రోడప్రధానుఁ డల్లాడనృపతి

ధాటీసమాటీకనాటోపవిధ్వస్త
కుటిలాహితుఁడు పెదకోటశౌరి
పంటాన్వయక్షీరపాథోధిసంపూర్ణ
పూర్ణిమావిధుఁడు తా ప్రోలవిభుఁడు
ప్రోద్దామదోర్గప్రతాపోదయవ్యతికర
చ్ఛాయాధిపుండు దొడ్డాయనృపతి

తే. కోటకాచలధైర్యుండు మేటిబిరుదు
పాటి[illegible]లవాఁడు కరహాటలాటబోట
గౌళకర్ణాటదేశరాట్కటకసుకవి
కోటినుతకీర్తి శ్రీపిన్నకోటరెడ్డి. 25

తే. పంటకులరాజు దొడ్డభూపాలునకును
బరమకల్యాణి యన్నమాంబకును సుతులు
ప్రోలభూపతియును గోటభూపతియును
భువననుతకీర్తి యల్లాడభూపతియును. 26

వ. అందు. 27

సీ. కుటిలారిరాట్కంఠకుహరాంతములఁ గాని
క్రీడింపనీఁడు కౌక్షేయకాహి
హరిదంతసౌధశృంగాగ్రవీథులఁ గాని
తిలకింపనీఁడు కీర్తిధ్వజంబు
నాశ్రితబంధుమిత్త్రారామములఁ గాని
సాగనీఁడు కృపావసంతలక్ష్మి
హరిణభృన్మూర్ధన్యచరణాబ్జములఁ గాని
మరుగనీఁడు నిజాత్మమధులిహంబుఁ

తే. ప్రళయసంరంభశుంభదారభటిపటిమ
భయదఫాలాక్షభావసంభవదభంగ
దహనమహనీయదివ్యప్రతాపవిసర
దతులజయహారి దొడ్డయయల్లశౌరి. 23

మ. జయధాటీవిజయంబులన్ విలయజంఝామారుతాడంబర
స్మయహారిప్రతిజృంభమాణఘననిస్సాణోగ్ర భేరీస్వనం
బయి యొడ్డాడి భయంకరోడ్డమరశౌర్యం బైనశ్రీ రెడ్డిదొ
డ్డయయల్లాడనృపాలురాహునకు బి ట్టల్లాడు దిక్చక్రముల్.

మ. లలితాహంకృతి దొడ్డభూవిభునియల్లాడక్షమానాథు నా
జుల మార్కొన్నవిరోధిరాజు లమరస్తుత్యప్రతాపప్రభా
కలితశ్రీయుతులై సుఖింతు రెలమిం గల్యాణశైలంబుపైఁ
గలధౌతామలహర్మ్యరేఖలమరుత్కాంతాకుచాగ్రంబులన్.

మ. అనవేమక్షితిపాలుపౌత్రియగు వేమాంబామహాదేవికిన్
ఘనుఁ డయ్యల్లడభూమిపాలునకు సంగ్రామస్థలీగాండివుల్
తనయుల్వేమవిభుండు వీరవసుధాధ్యక్షుండు దొడ్డప్రభుం
డునునన్నయ్యయు బాహువిక్రమకళాటోపప్రతాపోద్ధతుల్.

వ. అం దగ్రజుండు. 32

మ. కొనియెం గంచుకముల్ సముద్ఘటనటద్ఘోటీభటప్రౌఢిఁ గై
కొనియె న్వేడుకఁ జీడికాడ యహితక్షోణీశు లల్లాడఁ జే
కొనియె న్నాకవరంబు వీఁక మదవద్ఘోరారిసంహారి యై
ఘనుఁ డల్లాడమహీశువేమన నిరాఘాటైకధాటీగతిన్. 33

సీ. సప్తమాడియరాయచంద్రబింబాననా
చికురవల్లరులపైఁ జిన్నిపువ్వు
ఝూడెజంతుర్నాటిజననాథశుద్ధాంత

కుచకుంభములమీఁది కుంకుమంబు
బారహద్దొంతిభూపాలలీలావతీ
గండస్థలంబులఁ గలికినవ్వు
కలువపల్లొడ్డాదికటకాధిపతివధూ
సీమంతవీథులఁ జేరుచుక్క

తే. యల్లడాధీశు వేమక్షమాధినాథు
భూరినిష్ఠురధాటీవిహారచటుల
సైన్యనాసీరతుక్ఖారశఫపుటోత్థ
వింధ్యపార్శ్వవసుంధరావిపులధూళి. 34

సీ. పండువాసురధాని పావడం బంపిన
భద్రేభములు వీటఁ బాళె ముందు
నోడ్డెధాత్రీనాథుఁ డుపదఁ బుత్తెంచిన
బింబాధరోష్ఠి సంబెళ వహించుఁ
గర్ణాటభూపతి కానుక యనిపిన
ముక్తాతపత్త్రంబు మ్రోల మెఱయు
యవనాఘపతి యుపాయనముగా నొసఁగిన
పాగాహయంబులు వాగె వచ్చు

తే. దూర మంతంత బారుహద్దొంతిమన్నె
సప్తమాడియ రాజన్యసమితి మ్రొక్కు
రాయవేశ్యాభుజంగసంగ్రామపార్థ
గాయిగోవాడ వేమనక్ష్మాధవునకు. 35

క. చటులత నల్లయవేమన
పటుధాటీవిజయభేరిభాంకృతి మొరయుఁ

లటహామదన్నృహారిసమధిక
కటుకంఠగభీరకుహారకహాకహారవమై. 36
సీ. ధరియింప నేర్చిరి దర్భవెట్టిన వ్రేళ్ల
లీల మాణిక్యాంగుళీయకములు
కల్పింప నేర్చిరి గంగమట్టియ మీఁదఁ
గస్తూరికాపుండ్రకంబు నొసల
సవరింప నేర్చిరి జన్నిదంబుల మ్రోలఁ
దారహారములు ముత్యాలసరులు
చేర్పంగ నేర్చిరి శిఖలనెన్నడుములఁ
గమ్మనిక్రొత్తచెంగల్వవిరులు
తే. ధామముల వెండి పసిడియుఁ దడఁబడంగ
బ్రాహ్మణోత్తము లగ్రహారములయందు
వేమభూపాలునసుజన్ము వీరభద్రు
ధాత్రి వాలింప గౌతమీతటములందు. 37
తే. ప్రకటశాఖోపశాఖలఁ బంటవంశ
ముద్ధరించినవేమేంద్రుఁ డుదయవేళ
శివు విశాఖునిఁ బూజించు భక్తి
లలితబిల్వత్రిశాఖపలాశసమితి. 38
త్ర్యంబకాచలకన్యకాంబుపూరంబున
నఘమర్షణస్నాన మాచరించి
నిద్ధమైన మడుంగుసీర్యా-విదోవతి
కనకమేఖలతోడఁ గట్టి ఘటించి
మూలమంత్రాక్షరంబుల భూతి మంత్రించి
పుండ్రకం బొగి ఫాలమున ధరించి

క్రొత్తము త్తెములతో రుద్రాక్షమాలిక
లష్టోత్తరశతంబు లలుతఁ దాల్చి
తే. పుండరీకాజినమునఁ గూర్చుండి శంభు
నర్చనముఁ జేయునపుడు మహాప్రమథుఁడు
చాల నొప్పారు రెండవశంభునట్లు
వీరనారాయణుం డల్ల వేమవిభుఁడు. 59

శా. చంచల్లీలల హస్తకంకణమణిచ్ఛాయల్ ప్రకాశింపఁ బూ
జించు న్వేమమహీవిభుండు నవరాజీవంబులం గల్హారా
బ్రాంచత్కాంచనపుష్పకేసరములం బ్రాసాదపంచాక్షరీ
మంచుంగొండయనుంగుఁబెండ్లికొడుకు న్మధ్యాహ్నకాలం
[బునన్.
వ. తదనుసంభవుండు.

ఉ. రాజశశాంకశేఖరుఁడు రాజకిరీటవతంస మష్టది
గ్రాజమనోభయంకరుఁడు రాజులదేవర రాజరాజు శ్రీ
రాజమహేంద్రభూభువనరాజ్యరమారమణీమనోహరుం
డాజిఁ గిరీటి కీర్తినిధి యల్లయవీరనరేంద్రుఁ డున్నతిన్.

మ. మనుతుల్యుం డగుకోటభూవిభుని వేమక్ష్మాతలాధీశునం
దనఁ బాణిగ్రహణంబుచేసెఁ బ్రియ మొందన్ వీరభద్రేశ్వరుం
డనితల్లి న్ననితామతల్లి సుదయాస్తాద్రీంద్రసీమావనీ
ఘనసామ్రాజ్యసమర్థన ప్రతిమసాక్షాదిందిరాదేవతన్. 43

తే. అట్టియనితల్లి పుణ్యగుణాభిరామ
దనకుఁ బట్టంపుదేవిగా ధన్యలీల
వసుధయెల్ల నేకాతపవారణముగ
నేలు నల్లయవీరభద్రేశ్వరుండు. 44

సీ. మకరకుండలదివ్యమాణిక్యదీప్తులు
చెక్కుటద్దములపై జీరువాఱ
డాకాలిగండపెండారంబుదాపున
బొమ్మలై వైరిభూభుజులు వ్రేలఁ
గమియంగ నలఁదినకస్తూరినెత్తావి
యష్టదిక్కులయందు నవఘళింప
మొగము చూచినమాత్ర మూర్ధాభిషిక్తులు
మోడ్పుఁజేతులు మస్తముల ధరింప
తే. మెఱుఁగుఁదీఁగెలఁ బోలుభామినులు గొలువ
నిండుకొలువుండెఁ గన్నులపండు వగుచు
రాయవేశ్యాభుజంగవీరప్రతాప
విభవుఁ డల్లాడభూపతి వీరవిభుఁడు. 45

స్రగ్ధర. జంభారాతీభశోభాచకచకనిభముల్ శాంభవీయాట్టహా
సా, రంభానష్టంభరేఖారభటలటహాముల్ రాజరాజాద్రితే
జ, స్సంభారభ్రాంతిదంబుల్ సకలభువనవీథీకరంభంబుల
య్యున్, జృంభించున్ వీరభద్రక్షితిరమణయశశ్శ్రీవిధూవి
[భ్రమంబుల్.

క. వేరి ధరణిపు లల్లయ
వీరక్ష్మాపతికి సాటి వితరణగరిమన్
ధారాధరధారాధవ
ధారాధరవాహదానధారానిధికిన్. 47

సీ. గోదావరీపావనోదకంబుల హేమ ఋ
కలశీశతంబుల జలక మార్చుఁ
గర్పూరకస్తూరికాకుంకుమంబులఁ
గలపంబుఁ గూర్చి శ్రీగంధ మలఁదు

సప్తగోదావరస్వర్ణపుష్కరహేమ
సౌగంధికముల నర్చనము సేయు
గలధౌతపాత్రలఁ గాలాగురుచ్ఛేద
బహుళధూపంబులు బరిఢవించు
తే. వేనవేలు నివాళులు విస్తరించు
నమృతదివ్యాన్నముల నుపహార మిచ్చు
సంఘటించు నశేషోపచారములను
బ్రమథనాయకునకు వీరభద్రనృపతి. 48
చ. విలసితకీర్తిశాలి యగువీరమహేశ్వరు *గేహారంబు శ్రీ
నిలయమునం ద్రిసంధ్యమును నిర్మలసౌధసువర్ణజాలకం
బుల వెడలుఁ గిరీశగళమూలహలాహలకాంతిఁ బోలి గు
గ్గులుమహిసాక్షివాసనలఁ గ్రొవ్వినమంగళధూపధూమముల్.
ఉ. ఈశ్వరుఁ డింటివేల్పు జగదేకగురుం డగుఘోడెరాయభీ
మేశ్వరుఁ డాత్మవంశగురుఁ గీగులు నిత్యవినోదకృత్యముల్
శాశ్వతధర్మకీర్తులుఁ దలంపఁగ నమ్మినసొమ్ము లాదిగ
ర్భేశ్వరుఁ డౌట నైజ మెసయే నృపు లల్లయవీరశౌరికిన్. 50
సీ. తెంచు నెవ్వనిహేతి దృప్తారినరవర
గ్రైవేయపరిలసత్కంధరముల
ముంచు నెవ్వనికీర్తి ముగ్ధేందుధరకంఠ
కాకోలవిషమషీకాళిమంబుఁ
బెంచు నెవ్వనిబుద్ధి పంచాస్త్రపరిపంథి
పాదపాథోధితాత్పర్యచర్య
మించు నెవ్వనిమూర్తి మీనచిహ్నజయంత
నల నలకూబరాదుల జయించి

తే. యతఁడు వొగడొందు రాయవేశ్యాభుజంగుఁ
డవధిమహీధరచరమగాఢాంధకార
ధట్టఘట్టనలటహాప్రతాపతపనుఁ
డల్లనరనాథుదొడ్డభూవల్లభుండు. 51

శా. ఔరా! యల్లయరెడ్డిదొడ్డవసుధాధ్యక్షుండు ధాటీచమూ
భేరీభాంకృతిఘోరఘోషమున నిర్భేదించె నొడ్డాది శృం
గారంకోటయు లోఁతుగడ్డ (ద్ద)యునునుద్ఘాటించెనత్యుద్ధతి
క్షీరాంభోధితటంబున న్నిలిపె దిక్సీమాజయస్తంభముల్.

మ. హరి దాఁటించెఁ బురోపకంఠమున వాహ్యాళిప్రదేశంబునం
దరరే యల్లయరెడ్డినందనుఁడు దొడ్డయ్యక్షమాధీశ్వరుం
డిరువైనాలుగుమూళ్ల మేర యనుగో సెక్కింపఁగా నేలయ
ద్ధరణీనాథునికీర్తి దాఁటెఁ గడు నుద్దండించి బ్రహ్మాండముల్.

మ. సరి వేరీజలరాశివేష్టితమహీచక్రంబున న్విక్రమా
పరగాండీవికిఁ జక్రవాళమహీభృత్పర్యంతవిశ్వంభరో
ద్ధరణప్రౌఢభుజాభుజంగమునకున్ ధాత్రీశు లల్లాడభూ
వరునన్నయ్యకకుంఠవాఙ్మయకళావైకుంఠరాట్సయ్యకున్.

సీ. జిష్ణువైభవరేఖఁ జెలువొందుటయుఁ గాక
పావకవిస్ఫూర్తిఁ బరఁగు టెట్లు
ధర్మరాజవిభూతి దర్పించుటయుఁ గాక
పుణ్యజనోపాఖ్యఁ బూను టెట్లు
మహినిఁ బ్రాచేతసమహిమఁ దాల్చుటయ కా
తగ జగత్ప్రాణాఖ్యఁ దాల్చు టెట్లు
ధనదత్వవిఖ్యాత ఘనత నొందుటఁ గాక
శంకరసుషమచే జరగు టెట్లు

తే. తెలిసి దిక్పాలకాంశావతీర్ణుఁ డగుట
భోగమున శుద్ధ సూనృతమున జయమున
నాజ్ఞ బలమున ధనమున నధికకరుణ
నల్లభూపాలనందనుఁ డన్న విభుఁడు. 55

ఉ. వల్లకిచక్కికాహళమువంశముడక్కహుఁడుక్కఝర్ఝరుల్
ఝల్లరి యాదిగాఁ గలుగుశబ్దపరంపర తాళబద్ధమై
యుల్లసితప్రబంధముల నొప్పఁగ నాడుదు రగ్రవేదిపైఁ
బల్లవపాణు లీశ్వరునిఁ బంటమహీశులు పూజసేయఁగన్. 56

శా. మార్కండేయ మహేశ్వరుండఖిలసామ్రాజ్యంబు పాలింపఁ
గా, నర్కేందుల్గలయంతకాలము తదీయాంఘ్రిద్వయీభక్తి
సం, పర్కోదంచితభాగ్యసంపదలనాక్ష్మామండలీవల్లభుల్
కోర్కుల్నిండఁగ సేవకత్వమునఁ గైకొందు రాయురైశ్వర్యముల్.

సీ. ఉండు నేవీట మార్కండేయమునినాథ
సజ్జలింగ మనంగశాసనుండు
ప్రవహించు నేవీటిపశ్చిమ ప్రాకార
మొరసి గంగమ్మ సాగరముకొమ్మ
యావిర్భవించినాఁ డేవీటికోటలో
బలభేది మదనగోపాలమూర్తి
పాలించు నేవీటి ప్రాగుదక్కోణంబు
సుమబోటి శ్రీముల్లగూరిశక్తి
తే. ప్రబలధారాసురత్రాణభద్రజాతి
కరిఘటాసైన్యదుస్సాధకనకలోహ
గోపురద్వారకవాటప్రదీపిత మది
సాంద్రవిభవంబు రాజమహేంద్రపురము. 58

మ. కలపుంస్కోకిలకంఠకోమలకుహూకారస్ఫురత్పంచమ
స్ఖల[1]సద్వాశ్యములైనకాలముల మార్కండేయనాథేశ్వరుఁ
లలితోరస్కుఁడు వీరభూపతి వసంతం బాడు నీవీటివీ
థులఁ గర్పూరహిమాంబుసంకుమదకస్తూరీపటీరంబులన్. 59

ఉ. * ప్రాకటవిక్రమస్ఫురణ రాజమహేంద్రము రాజధానిగా
నేకసితాతపత్త్రమున నేలెను వీరనృపాలుఁ డుత్తమ
శ్లోకుఁడు వేమశౌరియనుజుండు సమున్నతవైభవాఢ్యుఁడై
చీఁకటియుఁ గళింగయునుజిల్కసముద్రముసింహశైలమున్.

షష్ఠ్యంతములు

క. ఈదృశగుణగణనిధికిని
వేదార్థకవిత్వతత్త్వవిధివత్ప్రతికిఁ
ద్వాదివిజకవిజనాశీ
ర్వాదప్రవితీర్యమాణవైభవనిధికిన్. 61

క. ఛురికాకరబేతాళున
కరిభయదభుజాపరాక్రమాభీలునకుఁ
శరణాగతకురుకేరళ
కురుభూపాలునకు జగదగోపాలునకున్. 62

క. అంభోధివలయితావని
సంభరణప్రౌఢనిజభుజాయుగయుగళీ
సంభావితకిటికచ్ఛప
కుంభీనససార్వభౌమకులకుధరునకున్. 63

క. వేమాధిపానుజునకును
రామామదనునకు ఘోడెరాయగురు శ్రీ

1. దధ్వాన్య; వద్వాస్య; దుర్వాస్య. * ఈపద్యము కొన్నిప్రతులలోఁగనప్పడు.

భీమేశ్వరశిష్యునకు
న్వేమాంబాగర్భసలిలనిధిచంద్రునకున్. 64

క. త్రైలోక్యవిజయసౌధవి
శాలమహాచంద్రచంద్రశాలాసతత
వ్యాలోకితగౌతమక
న్యాలహరీవిరహతాండవాటోపునకున్. 65

క. అనితల్లివల్లభునకు
గనకాద్రివినిద్రకల్పకద్రుమలీలా
వనభవనకిన్నరస్త్రీ
జనతాజేగీయమానచారిత్రునకున్. 66

క. నిర్ఘృణనిర్ఘాతస్ఫుట
నిర్ఘోషకఠోరధాటినిస్సాణమహా
దీర్ఘతరధణధణాంకృతి
ఘూర్ఘటననిర్దళితచతుర్దిక్కునకున్. 67

క. హాటకకుభృద్ధనుర్ధర
జూటీకోటీకుటీరసుమనస్తటినీ
వ్యాటీకోర్మిసంఘో
ద్ఘాటవచోవైఖరీజితద్రుహిణునకున్. 68

క. గజదళవిభాళబిరుదున
కజగవధరభక్తిభావితాత్మునకు సమి
ద్విజయునకు రాయవేశ్యా
భుజగునకును వీరభద్రభూపాలునకున్. 69

వ. అభ్యుదయపరంపరాభివృద్ధిగా నాయొనర్పంబూనిన కాశీ
ఖండంబు. 70

ప్రథమాశ్వాసము

కథాప్రారంభము

పురాణప్రశంస

సీ. పద్మాదికంబులు పదియు నెనిమిదియు
నాదిపురాణంబు లాపురాణ
జాతంబు నాల్గులక్షలసంఖ్యగలయది
యుపపురాణంబు లం దుద్భవించెఁ
బదునొకండవది యై బహుసంహితలతోడ
బహుఖండములతోడ బహువిచిత్ర
కథలతో నేకలక్షగ్రంథపరిమాణ
కలితమై శ్రీమహాస్కాంద మొప్పు

తే. నమ్మహాస్కాందమునకు సారాంశ మనఁగ
నాల్గుపురుషార్థములకుఁ దావక మనంగ
బ్రహ్మవిద్యకు నాదికారణ మనంగ
నఖిలఖండంబులందుఁ బ్రఖ్యాతి వడసె. 71

తే. మూఁడులక్షలుఁ బదియేడు ముగిసిపోవఁ
దాఁ బ్రవర్తిల్లు లక్షగ్రంథంబుతోడ
సమధికస్ఫూర్తి నేపురాణములు సాటి
గరిమ కందంబునకు మహాస్కాందమునకు. 79

తే. పదుస నెనిమిది యన్యదేవతలఁ దెల్పుఁ
బదిపురాణంబు లీశ్వరుఁ బ్రస్తుతించుఁ

జంద్రమౌళిప్రభావంబు సమధికముగ
శ్రుతులయట్ల [1]పురాణసంహితలు నడుచు. 73

తే. సరవి సర్గంబు నాఁ బ్రతిసర్గ మనఁగ
వరుసతో వంశవంశానుచరితము లనఁ
గ్రమపరిప్రాప్తి మన్వంతరము లనంగ
లలిఁ బురాణంబునకు నైదు లక్షణములు. 74

తే. గ్రంథపరిసంఖ్య నాల్గులక్షలు పురాణ
మది చతుర్దశవిద్యలయందుఁ బెద్ద
చాలఁ గర్తార్థ మం దానుషంగిక మన
యాదికారికయందె బ్రహ్మార్థగరిమ. 75

ఉ. అట్టి[1]దివ్యపురాణముమహత్త్వముసూతుఁడుదద్విదుండుగాఁ
బట్టి కనిష్ఠజన్మమునఁ బ్రాకృతుఁ డయ్యునురుప్రభావులై
నట్టిమహామునీంద్రులకు నంబుజసంభవునంతవారికిన్
దిట్టతనంబుమీఱ నుపదేశ మొనర్చుచు నుండు బ్రహ్మమున్.

నైమిశశబ్ద నిర్వచనము

సీ. ఆది మనోమయం బగునొక్కచక్రంబుఁ
గల్పించె బ్రహ్మ జగద్ధితముగఁ
గల్పించి యాబండికలు డోల్చె సత్యలో
కంబుననుండి యాకమలగర్భుఁ
డది డొల్లగిలివిష్టపాంతరంబులు దాఁటి
క్రమముతో భూమిచక్రమున వ్రాలె
వ్రాలి రంహస్స్ఫూర్తి వచ్చి వచ్చి ధరిత్రి
నిమ్నోన్నతుల శీర్ణనేమి యయ్యె

1. పురాణతత్త్వము ప్రియంబున.

౭౮౭౯

తే. నేమి విరిసినకతన నన్నేలనెలవు
నైమిశంబయ్యె నదియ తా నైమిశంబుఁ
దన్మహాపుణ్యవనమున ద్వాదశాబ్ది
సత్త్రయాగంబుఁ గావించె శౌనకుండు. 77

వ. ఆసత్త్రయాగంబునందు శౌనకాదిమహామునులును సూతా
న్వయసంభవుం డైనసూతు నర్చించి తన్ముఖంబునం బురా
ణేతిహాససంహితలు వినిరి గావున నమ్మహావిద్యాస్థానంబు
సూతమునిసంవాదాత్మకంబు. 78

తే. స్కాందమందుల నేఁబదిఖండములకు
బహుకథాసంగతులు సేయ బాడి గాదు
ఖండఖండంబులందును గలిగినట్టి
కథలపాలివి సంగతిగ్రహణమునకు. 79

వ. ఇమ్మహాస్కాందమ్మునకు నవయవంబు లాఱుసంహిత లవి
క్రమంబున సనత్కుమారసంహిత పంచపంచాశత్సహస్రిక,
సూతసంహిత షట్సహస్రిక, శాంకరసంహిత త్రింశత్సహ
స్రిక, వైష్ణవసంహిత పంచసహస్రిక, బ్రహ్మసంహిత త్రిసహ
స్రిక, సౌరసంహిత యేకసహస్రిక, ఈసంహితలయందుఁ
(బంచ)నాగరఖండంబు గమలాలయాఖండంబు, రేవాఖండం
బు, నేకవీరాఖండంబు, మైలారఖండంబు, గోదావరీఖండంబు
నాదిగాఁగల పంచాశత్ఖండంబులందు. 80

కాశీఖండప్రశంస

శా. ప్రాశస్త్యంబు వహించు ద్వాదశసహస్రగ్రంథసంక్షిప్తివి
శ్వేశక్షేత్రవియన్నదీవటుకడుంఠీనాథ సత్కీర్తనో
ద్దేశప్రక్రమశోభితాద్భుతకథాధిష్ఠాన మై శ్రేష్ఠ మై

కాశీఖండమఖండవైభవమునర్ స్కాందాబ్ధిమధ్యంబునన్.

వ. ఈకాశీఖండంబు వేదవ్యాససూతసంవాదాత్మకం బనియు నుం గొందఱు చెప్పుదురు. దీనికిం గథాక్రమణిక వింధ్యనారదసంవాదంబు, బ్రహ్మలోకప్రభావంబు, గోదానమాహాత్మ్యంబు, వారాణసియం దగస్త్యాశ్రమవర్ణనంబు, మునిదేవతాసమాగమంబు, పతివ్రతాచరిత్రంబు, కుంభసంభవప్రార్థనంబు, తీర్థప్రశంస, శివశర్మోపాఖ్యానంబు, సప్తపురీప్రశంస, సంయమనీప్రశంస, మహేంద్రలోకదర్శనంబు, వహ్నిసముత్పత్తి, క్రవ్యాద్వరుణసంభవంబు, గంధవత్యలకావర్ణనంబు, చంద్రలోకప్రాప్తి, యుడులోకవృత్తాంతంబు, శుక్రసముద్భవంబు, శనైశ్చరలోకవర్ణనంబు, సప్తర్షిలోకధ్రువలోకవర్ణనంబులు, కుమారాగస్త్యసంవాదంబు, మణికర్ణికాసముద్భవంబు, గంగామాహాత్మ్యంబు, భైరవావిర్భావంబు, దండపాణిజన్మంబు, కళావత్యుపాఖ్యానంబు, సదాచారంబు, బ్రహ్మచారిప్రకరణంబు, స్త్రీలక్షణంబు, కృత్యాకృత్యప్రకరణంబు, గృహస్థధర్మంబు, యోగనిరూపణంబు, కాలజ్ఞానంబు, దివోదాసవర్ణనంబు, యోగినీవర్ణనంబు, లోలార్కోత్తరార్కసంజ్ఞాదిత్యద్రుపదాదిత్యారుణాదిత్యవర్ణనంబు, దశాశ్వమేధతీర్థమాహాత్మ్యంబు, పిశాచమోచనంబు, గణేశ్వరప్రేషణంబు, గణేశ్వరమాయాప్రపంచంబు, ఢుంఢిప్రాదుర్భావంబు, విష్ణుమాయాప్రపంచంబు, దివోదాససముచ్చాటనంబు, పంచనదోత్పత్తి, బిందుమాధవసంభవంబు, వైష్ణవతీర్థమాహాత్మ్యంబు, మందరాచలంబుననుండి యిందుమౌళి వారాణసీపురంబున కేతెం

చుటయు, జైగిషవ్యాపాఖ్యానంబు, కృత్తివాససముత్పత్తి, దుర్గామాహాత్మ్యంబు, ఓంకారమాహాత్మ్యంబు, త్రిలోచన సముద్భవంబు, కేదారేశధర్మేశమాహాత్మ్యంబులు, పక్షి కథ, విశ్వభుజాఖ్యానంబు, దుర్దమకథ, విశ్వేశ్వరాఖ్యానంబు, కామేశ్వరవిశ్వకర్మేశ్వరసరస్వతీశ్వరామృతేశ్వరవర్ణనంబులు, వ్యాసభుజాస్తంభంబు, క్షేత్రతీర్థకదంబవర్ణనంబు, ముక్తిమంటపవర్ణనంబు, విశ్వేశ్వరావిర్భావంబు దేవతాయాత్రావిధానంబు నన బుణ్యాఖ్యానంబు లేకోత్తరశతంబునుం గలిగి.

శా. ఆశాస్యంబులు సంఘటించును బహూపాఖ్యానశాఖోపశా
ఖాశోభాసముదంచితాభ్యుదయమై స్కాందాబ్ధిసంజాతమై
యీశానుగ్రహలబ్ధముక్తిఫలమై యెక్కాలముం శ్రోతకుం
గాశీఖండ మఖండవైభవముగం గల్పద్రుమప్రక్రియన్.

వ. పూర్వఖండంబున బ్రహ్మర్షి నారదుండు తీర్థయాత్ర చరించె నని సూతుండు శౌనకాదిమహామునులకుం జెప్పి వారడుగం గాశీవృత్తాంతం బిట్లని చెప్పం దొడంగె. కృష్ణద్వైపాయనుండు ప్రియశిష్యుండైనసూతున కనంతరకథాక్రమంబునం గాశీఖండకథాకథనప్రారంభంబున నిట్లనియె. 84

నారదుఁడు వింధ్యమున కేతెంచుట

తే. ఇవ్విధంబునఁ దీర్థంబు లెల్ల నాడి
నర్మదానది నవగాహనం బొనర్పఁ
దలఁచి గోదావరీసింధుతటము పట్టి
దండకారుణ్యవీథిమధ్యంబు దరిసి. 85

వ. ముందట. 86

శా. కాంచెన్ గ్రాంచన్నగర్భసంభవుఁ డుదగ్రగ్రావకోటిస్ఖల
చ్చంచన్నిర్ఝరవేణికానివహసంజాతాభిసాంగత్యముం
బంచాస్యస్ఫుటకంఠనాదహతశుంభత్కుంభిదర్పాంధ్యముం
బ్రాంచద్ధాటకభూమిభృచ్ఛిఖరగర్వావంధ్యము న్వింధ్యమున్.

క. రేవాతరంగశీకర
సేవాహేవాకపాకశిశిరసముత్ప్ర
స్తావపరికంప్యమానజ
టావలి యగు చతఁడు వింధ్య మల్లనఁ జేరెన్. 88

క. తాపసకులాగ్రగణ్య
శ్రీపాదాంభోజయుగళచిహ్నశ్రేణీ
నైపథ్యపరమపుణ్యశి
లాపట్టం బగుచు నయ్యిలాధర మలరెన్. 89

సీ. త్రసరేణుపరిమాణధాతుధూళీపాళి
యలికంబులకు వింతచెలువ మొసఁగ
ఘన మైనరారాపుచనుదోయిరాయిడి
నిఱుపేదనడిమికి వెఱపు చూపఁ
పోలుపాఱు మెఱుఁగుఁదీఁగెల బోలుకన్నులు
వడ దాఁకి యొక్కింత వాడఁ బాఱ
సిందూరతిలకంబు చెమటచిత్తడిఁ దాఁకి
యలికభాగంబునం దసలుకొనఁగఁ

తే. కనకమేఖల జఘనచక్రమునఁ జాఱ
నీవిబంధంబు నాలోన నెమ్మి వదల
మహతి ధరియించి యొకతనుమధ్య దన్ను
ననుచరించుచు గాంధర్వ మభ్యసింప. 90

వింధ్యవర్ణనము

సీ. కర్పూరకదలికాకాంతారపవనంబు
లధ్వనీనశ్రాంతి నపనయింప
మదురంగఁ బండినమాలూరఫలములు
చెంచుకన్యలకుచశ్రీలఁ జెనయ
నురగవల్లీగాఢపరిరంభణంబులఁ
బోఁకమ్రాఁకులకింపు పుఱువుకొనఁగఁ
బాటలీవకుళచంపకసౌరభముతోడ
విచికిలామోదంబు వియ్య మంద
తే. గమియ నామూలచండంబుగా ఫలించి
యంబరము మోచి యున్నయుదుంబరములు
లీల బ్రహ్మాండభాండమాలికలభూష
లవధరించిన వృషభాంకు ననుకరించె. 91

క. దరవికచవకుళకురవక
పరిమళసంభారలోలబంభరమాలా
పరిషజ్ఝంకారధ్వని
తెరువరులకు మన్మథప్రదీపన మొసఁగున్. 92

వ. వెండియుఁ గర్కరేటుకఠోరతారతరరటనంబునుదాత్యూహవ్యూహకహకహారావకోలాహలంబును గలకంఠకంఠకోమలకుహూకారంబును మదకలకలవింకచూంకృతంబును కాకకాకలీకలకలంబునుబుంఖానుపుంఖఝిల్లీఝంకారధారాప్రసారంబును సముద్ధతధ్వాంక్షనిధ్వానపాటవాటోపంబును సముత్కటోత్క్రోశవాసితవ్యాఘ్రసంరంభ సంభ్రమంబును గోయష్టివదననిష్ఠ్యూతనిష్ఠురారావనిష్ఠాసౌష్ఠవంబు

నుం గూడి కిటిశరభగండవేదండశార్దూలసింహగవయసృ
మరచమరవాతప్రమీలులాయఖడ్గరురుకురంగ భల్లూకఫేరవ
గోలాంగూలాదినానామృగంబులయేలుంగులతోడఁ గిక్కి
ఱిసి లతాకుడుంగగర్భంబులం బ్రతిశబ్దంబులావిర్భవింపం
జేయఁగిసలయముకుళకుసుమశలాటుఫలభరితంబై బిసరుహ
బాంధవునికి కిరణవిసరంబులను సుంగనీయకమసుమసుకని
యిరులసలుకొనుచు నిసుకచల్లిన రాలనిపసరుడాలవింధ్య
వసుంధరాధరప్రాంతకాంతారంబు దఱిసి చనువాఁడు
ముందట. 93

మ. నలినప్రోద్భవసూతి గన్గొనియె వింధ్యక్షోణిభృత్కందరా
బలవద్గండశిలాభిఘాతవిలుఠత్పాథస్తరంగచ్ఛటా
స్ఖలసంరంభవిజృంభమాణపటుఝంకారస్ఫుటాంతర్మదా
కలనాతత్పరభక్తలోకపరితాపాశర్మదన్ నర్మదన్. 94

తే. దివిజముని నర్మదానదిఁ దీర్థమాడి
విమలభస్మంబు నిఖిలాంగకముల నలఁది
యఱుత రుద్రాక్షమాలిక లనువుపఱచి
భవుని నోంకారనాథునిఁ భక్తిఁ గొలిచి. 95

వ. అప్పుడు. 96

తే. స్థావరం బైనరూపంబు జలదవీథి
నావరించుచు మొదల నున్నట్ల యుండ
జంగమం బైనరూపంబు సవదరించి
యెదురుగా వచ్చె వింధ్యమహీధరంబు. 97

తే. అతిథి గడునల్పుఁ డైన నత్యధికుఁ డైన
నింటి కేతేరఁ బ్రియ మందు నెవ్వఁ డేని

వానిగౌరవ మది గౌరవంబు గాని
కాదు గౌరవ మాకారగౌరవంబు. 98

సీ. మొగులు ముట్టినమహామూర్ధంబు ధర మోవఁ
బాదాంబుజములకుఁ బ్రణతిఁ జేసి
యంతరంగముకంటె నత్యున్నతం బైన
పృథుహేమపీఠంబు వెట్టఁ బంచి
దధ్యాజ్యమధుపుష్పదర్భాదికము లైన
యష్టాంగములతోడి యర్ఘ్య మిచ్చి
యాత్రాసముత్థితాయాసఖేదము వాయ
నంఘ్రిసంవాహనం బాచరించి
తే. శ్రాంతి దీఱుట యొఱిఁగి హ స్తములు మోడ్చి
వినయవినమితగాత్రుఁడై విన్నవించె
తనగుహారంధ్రములు ప్రతిధ్వనుల నీన
వేల్పుఁదపసికి నిట్లని వింధ్యశిఖరి. 99

వ. మహానుభావా! భవదీయకృపాకటాక్షవీక్షాసుధారసప్రవాహంబున రజఃప్రసరంబును ద్వదంఘ్రినఖచంద్రమండలజ్యోత్స్నాసమున్మేషణంబునం దమఃకాండంబును ఖండింపఁబడియె. ఇంతగాలంబునకుఁ బ్రాగ్జన్మకృతంబు లైనసుకృతంబులు ఫలించె. విశ్వంభరాభారభరణదీక్షాధురంధరంబు లగునాకులంబు వసుంధరాధరంబులలోన మాన్యుండ నైతి ధన్యుండ; గృతార్థుండ; భాగ్యవంతుండ; అది యట్లుండె. యుష్మత్పాదారవిందసందర్శనంబునం బ్రభవించినయానందప్రవాహం బుల్లంబున వెల్లివిరిసినకతంబున నేయర్థంబునకు నవకాశంబు లేదు. ఐనను నొక్కవిన్నపంబు సావధాన

మతి వై యవధరింపుము. నీకు సేవాంజలీపుటంబు పంచాశ త్కోటివిస్తీర్ణంబైనభూమండలంబునందు నీవుచూడనియట్టి మహీధరంబులు లేవ. కొండలు లెక్కకుబెక్కు కలుగుం గాక, యెనిమిది దిక్కుంజరంబులకుదిక్కై కూర్మంబునకు నర్మిలియై క్రీడాక్రోడంబునకుం దోడై పాంపఱేనికిం బ్రాపై యేనుబోలె నెక్కటి యీసర్వసర్వంసహాచక్రంబును భరియింపంగలయదియే? మందరంబు మందరశి, నీలంబు నీలనిలయం, బస్తం బస్తవ్యస్తం, బుదయం బనభ్యుదయంబు, క్రౌంచంబకించనంబు, గంధమాదనంబు పేద, పారియాత్రం బేతన్మాత్రంబు, మలయదర్దుర త్రికూటంబు లోకపాటివి, మహేంద్ర నిషధ ద్రోణంబులు దరిద్రాణంబులు, హేమకూటంబు గిటగిటన, తక్కుంజిఱుకొండలంబేర్కొనం గారణం బేమి? ఇప్పు డిప్పాట నాతోడం బ్రతిభటింపం గలయది సురగరుడఖచరవిద్యాధర యక్ష కిన్నర గంధర్వదర్వీకరాశ్రయంబును, గల్పతరువాటి కామధుగ్ధేనుమండలంబును, విబుధవేదండశుండాదండచుళికితోద్గీర్ణ స్వర్ణదీకాండగండూషితబ్రహ్మాండగోళంబును నగు సుమేరుశైలంబు. మాయిద్దఱతారతమ్యంబును నెఱుంగుదు. నాకు నగ్గిరికి నిప్పుడు గొన్ని వాసరంబులనుండి యీర్ష్యరసంబు పెరుఁగం గఱకఱిక నెట్టుకొని సాగుచున్నది. ఇంక నెట్లుండు? భట్టారకా! మొకమోటయుడిగి పక్షపాతంబు పరిత్యజించి యానతిమ్ము.

తే. అని యవష్టంభసంరంభ మతిశయిల్లఁ
బలుకుటయు నాత్మ గర్హించి నలువపట్టి
యొం డనాక యొక్కింతసే వూరకుండి

యున్న రనుచు వేఁడినిట్టూర్పు వుచ్చి. 101

వ. పదంపడి నిలింపమౌనికలహప్రియుండు గావునఁ ద్రిభువనోప
ద్రవకారణంబైనను నమ్మహామహీధరంబులసంఘర్షణంబునకు
సమ్మతించి శక్తిసంధుక్షణార్థంబు వింధ్యంబున కిట్లనియె. 102

శా. నాతో నీ విపు డెట్టులాడితి ప్రధానత్వం బపేక్షించి ప్ర
స్ఫీతాటోపమహాప్రతాపగుణగంభీరార్థయుక్తంబుగా
నాతో నట్లన యాడె మేరువు ప్రధానత్వం బపేక్షించి ప్ర
స్ఫీతాటోపమహాప్రతాపగుణగంభీరార్థయుక్తంబుగన్. 103

తే. నీ వెలుంగుదు నీలావు నిక్కువముగ
నెఱుఁగుఁ దనలావు తా సమ్మహీధరముదానె
తప్పకుండ మీయిద్దఱతారతమ్య
మెంతవారును దెలియంగ నెంతవారు. 104

వ. శ్రీశైలవేంకటాహోబలశోణాద్రిసాలగ్రామాది పర్వతంబులు
మహానుభావంబున మీయిద్దఱకంటె నధికంబులు. మీగ
ర్వాలాపంబులు విని యోర్వవచ్చునే? మిమ్ము నేమనవచ్చును?
హెచ్చుకుం దాడ నేరక విషాదంబున నిట్టూర్పునిగుడించితి.
మముఁబోటి తీర్థయాత్రాపరాయణులకు నిది యేటిచింత?
మీకు మేలయ్యెడుఁ బోయి వచ్చెద నని నారదుం డెం
దేనియుం జనియెఁ దదనంతరంబ. 105

తే. విబుధమునిమాట చెవికిఁ గ్రొవ్వేఁడి యగుడు
వంధ్యగర్వోదయుం డైన వింధ్యశిఖరి
చాల నుద్వేగ మంది విచారపరత
నాత్మగతమునఁ దాను నిట్లనుచు నుండె. 106

తే. శాస్త్ర మాచార్యసన్నిధిఁ జదువఁ దేని

సిద్ధబోధంబు మది సంగ్రహింపఁ డేనిఁ
దెగువ మీఱి ప్రతిజ్ఞ సాధింపఁ డేని
జ్ఞాతిజయ మందఁ డేని తజ్జనుఁడు జనుఁడె? 107

ఉ. కంటికి నిద్ర వచ్చునె? సుఖం బగునే రతికేళి? జిహ్వకుం
వంటక మిందునే? యితరవైభవముల్ పదివేలు మానసం
బంటునె? మానుషంబుగలయట్టిమనుష్యునకెట్టివానికిం
గంటకుఁ డైనశాత్రవుఁ డొకండు దనంతటివాఁడుగల్గినన్.

క. ఎవ్వనితో నెచ్చోటం
జివ్వకుఁ జే సాఁపవలదు చే సాఁచినచో
నివ్వల నవ్వల నెవ్వరు
నవ్వక యుండంగఁ బగసనందీర్ప నగున్. 109

శా. ఆచందంబున నంతరంగమున కత్యంతంబుఁ దీవ్రవ్యథా
ప్రాచుర్యంబు ఘటింపఁ జాలదతిఘోరం బైనదావానలం
బేచందంబున నంతరంగమున కిట్లీజ్ఞాతిభూభృజ్జిగీ
షాచింతాభరమావహించునతిదుస్సాధ్యవ్యథాభారమున్.

సీ. భేషజం బెద్దాని భేదింపఁ జాలదు
లంఘనంబున నెద్ది లావు చెడదు
తఱిగించు బుద్ధినిద్రామహోత్సాహతు
ష్ట్యాకార తేజోబలాది నెద్ది
నాసత్యచరకధన్వంతరప్రభృతివై
ద్యులకు నసాధ్యమై యుండు నెద్ది
దివసంబు లీరే డతిక్రమించినయప్డు
జీర్ణత్వదశ నధిష్ఠింప దెద్ది

తే. ప్రత్యహంబు నవత్వంబు వడయు నెద్ది

యట్టిచింతాజ్వరంబు తన్నలముకొనియె
నేమి సేయుదు నింక నే నెచటఁ జొత్తు
నెట్టు నిర్జింతు మేరుమహీధరంబు. 111

క. ఉప్పర మెగసి యజాండము
చిప్పలు రాలంగ మేరుశిఖరంబులపైఁ
గుప్పించి దాఁటుకొందునొ
తప్పక నామనసులోని తహతహ దీఱన్. 112

ఉ. ఒక్కఁడు మాకులంబున సముద్ధతిఁ జూపిన జాతరోషుఁడై
తెక్కలు దెంచి వేలుపులఱేఁ డటు పాపముచేసెఁ గాక యా
తెక్కలు నేఁడు గల్గిన నెఱిం గగనంబునఁ బాఱు తెంచి బి
ట్టెక్కనె కూటకోటితటు నెల్లను నుగ్గులు గాఁగ మేరువున్.

తే. అడుసులోపలఁ దాటిపం డదిమినట్టు
లదుముదునె కాదె పాతాళ మంటికొనఁగ
వేల్పు లెల్లను విభ్రాంతి విహ్వలింపఁ
బాదముల మెట్టినాదాయఁ బసిఁడికొండ. 114

శా. ఈగ్రైశ్వర్యముఁ జూడఁ జాలుదునె నే నిప్పాటనానాఁటికి
న్రేయిందుగ్రహతారకంబులు పగల్ నీరేరుహాప్తుండు నే
వారయోగంబు మెయిన్ బ్రదక్షిణమ్ముగావర్తిల్లఁగా నిర్భరా
సూయామానపరీతచేతసుఁడనై సూర్యోదయప్రక్రియన్.

తే. అడ్డపెట్టెదఁ గాక తీవ్రాంశురథము
ప్రహరిఁ దిరుగక యుండంగ భర్మగిరికి
దరతరంబ యజాండకర్పరము దాఁక
ఘనశిరశ్శృంగశృంగాటకములఁ బెంచి. 116

వ. అని యవష్టంభసంరంభంబున. 117

మ. అవరోధించెనువింధ్యభూధరము బ్రధ్నాధ్వంబుదర్పోద్ధుర
వ్యవసాయోద్భవభంగినింగినురులింగాకారుఁడై యీశ్వరుం
డవరోధించినగర్వరేఖ బలిదైత్యధ్వంసినారాయణుం
డవరోధించినశేవమూర్ధ మొగి బ్రహ్మాండంబుతో రాయఁగన్.
తే. మేదినీధర మిబ్భంగి మిన్ను ముట్టి
నిట్టనిలుచుండి చూచె నిర్నిమిషదృష్టిఁ
దనయనుష్ఠానకాలంబుఁ దప్పకుండ
బ్రాహ్మణుఁడు తేపకడఁ బోలె భానుపొడుపు. 119

వ. * అంత. 120

సూర్యోదయ వర్ణనము

సీ. చిలుసానఁ బట్టించి చికిలి సేయించిన
గండ్రగొడ్డలి నిశాగహనలతకుఁ
గార్కొన్ననిబిడాంధకారధారాచ్ఛటా
సత్త్రవాటికి వీతిహోత్ర జిహ్వ
నక్షత్రకుముదకాననము గిల్లెడుపాంటె
ప్రాచి యెత్తినహస్తపల్లవాగ్ర
మరసి మింటికి మంటి కైక్యసందేహంబుఁ
బరిహరింపంగఁ బొల్పడ్డ యవధి
తే. సృష్టికట్టెఱ్ఱ తొలుసంజచెలిమికాఁడు
కుంటి వినతామహాదేవికొడుకుఁగుఱ్ఱ
సవితృసారథి కట్టెఱ్ఱచాయవేలు
పరుణుఁ డుదయించెఁ బ్రాగ్దిశాభ్యంతరమున. 121

---

* ఇయ్యది కొన్ని మాతృకలలో లేదు.

సీ. ప్రాలేయకిరణబింబంబు వెల్వెలఁ బాఱె
యస్తాచలంబుపై నత్తమిల్ల
వరుసతో నోషధీవల్లీమతల్లుల
కాంతివైభవలక్ష్మి కచ్చువదల
రవికాంతపాషాణరత్నంబులం దుబ్బి
యగ్ని ప్రత్యుత్థాన మాచరింపఁ
బ్రబలాంధకారధారాచ్ఛటాపటలంబు
పంచబంగాళ మై పాఱిపోవ
తే. నుదయపర్వతకటకగండోపలములఁ
బఱుమూలచ్ఛిదావ్రణప్రభవ మైన
నెత్తు రనియెడువిచికిత్స నివ్వటిల్ల
భానుకిరణంబు లొకకొన్ని ప్రాఁకె నభము. 122

సీ. తఱిపివెన్నెలలోని ధావళ్య మొకకొంత
నవసుధాకర్దమద్రవము గాఁగఁ
జిన్నారిపొన్నారి చిఱుతచీఁకటిచాయ
యసలుకొల్పినమషీరసము గాఁగ
నిద్ర మేల్కాంచిన నెత్తమ్మిమొగడల
పరువంపుఁబుప్పొళ్లు హారిదళముగఁ
దొగరువన్నియ లేఁతతొలుసంజకెంజాయ
కమనీయధాతురాగంబు గాఁగ
తే. వర్ణములు కూడి యామినీవ్యపగమమున
జగము చిత్రింపఁ దూలికచంద మైన
కులుకుఁబ్రాయంపునూనూఁగుఁగోదమయొండ
ప్రాచి కభినవమాణిక్యపదక మయ్యె. 123

తే. ప్రాగ్దిశాకాంతనిండుగర్భంబునందు
సూర్యుఁ డుదయింపఁ బ్రొద్దులు చొచ్చి యుండ
మొదలఁ దీండ్రించు లేఁతక్రొమ్మొలకయొండ
నింగి యింగిలికాన నభ్యంగ మార్చె. 124

చ. కమలము లుల్లసిల్ల రవికాంతశిలాధమనీలతాసహ
స్రములఁ గృపీటసంభవుఁడు రాజుఁగఁ జీఁకటియారుసారు
గాఁ, గుముదము నిద్రవోఁ బొడుపుఁగొండపయిన్ రవి
యొప్పెఁ జూడఁగా, సమధికలీల నింద్రునిహజారపు
మేడకుఁ బైఁడికుండయై. 125

సీ. చరమరింఖాపుటాంచలటంకశిఖరంబు
లుదయాద్రిచటి జాఱకుండ మోపి
తీఁగ సాఁగినభంగి దీర్ఘదీర్ఘము లైన
యంగకమ్ముల రాజు లలమి యెత్త
నుత్తానుఁ డై వెన్క కొఱిగి పిచ్చుకకుంటు
విప్రతీపంబుఁ గా వినుతి సేయ
నపగతవ్యాసంగ మగుటఁ జిత్కారంబు
వెలిగాఁగఁ జక్రంబు విభ్రమింప

తే. నభ్రవీథికి లంఘించె నమ్మహాద్రి
గంధవాహప్రవాహాభిఘట్టనమునఁ
గేతనముమీఁదిపసిఁడికింకిణులు మొరయ
మెఱుఁగు మెఱసినచందాన మిహిరురథము. 126

సీ. ధూర్దండఘట్టనత్రుటితగ్రహగ్రా(వ)మ
ధూళీపాళిమిళద్దుశ్శస్థలములు

ధ్వజపటపల్లవోద్ధతమరుత్సంపాత
పరికంపమానోడుపరివృఢములు
గ్రాసాభిలాషానుగతవిధుంతుదపునగ
ప్రాప్తచక్రవ్యథోపద్రవములు
శ్రాంతాశ్వనిబిడనిశ్వాసధారోద్ధుర
స్వర్ధునీనిర్ఝరజలభ(ధ)రములు
తే. గగనపదలంఘనైకజంఘాలికములు
పద్మ (వనజ) బాంధవనిజరథ ప్రస్థితములు
సాఁగె నని దక్షిణాయనసమయ మగుట
దర్దురముమీఁద మలయభూధరముమీఁద. 127
తే. నడచె భాండీర దేశంబునడిమిచాయ
గగనఘంటాపథంబునఁ గమలహితుఁడు
పాండ్యభూపాలశుద్ధాంతభవనహేమ
దీర్ఘికలయందుఁ దననీడ తేజరిల్ల. 128
సీ. ఒకదీవి కొకకొండ యుదయాద్రియై యుండు
నది యొండుదీవికి నస్తశిఖరి
యొకదీవిఁ దొలుసంజ యున్మేషమునఁ బొందు
నుదయించు మలుసంజ యొండుదీవి
నొకదీవి నిండుచంద్రికలు మిన్నులు ప్రాఁకు
నొకదీవిఁ బేరెండ యుబ్బి కాయు
నొకదీవి రవణిల్లు నొకఋతుప్రారంభ
మొకదీవి నిగురొత్తు నొండుఋతువు
తే. దక్షిణాయన మొకదీవి దళుకుఁ జూపు
నుత్తరాయణ మొకదీవి నుప్పతిల్లు

నిన్నిటికి యత్ప్రభావంబు హేతుభూత
మట్టిరవితేరు సాఁగె లంకాద్రి మీఁద. 129

సీ. మలయాచలంబుపైఁ జిలువయిల్లాండ్రుల
ఫణరత్నములయందుఁ బ్రతిఫలించి
లంకాపురంబున శాంకరీదేవర
మకుటేందురేఖతో మచ్చరించి
కాంచీపురోపాంతకంపాతరంగిణీ
నాళికావనరాజి మేలుకొలిపి
ద్రవిళసీమంతినీస్తనమండలంబుల
నవకంపుఁజెమటబిందువుల నిలిపి

తే. సహ్యగిరిరాజకన్యకాజలనిధాన
సలిలహేళిపరస్పరాస్ఫాలనోత్థ
కణలవాసారనీహారగంధవాహ
సంగమంబులఁ బథపరిశ్రాంతిఁ దొఱఁగి. 130

వ. ఇవ్విధంబున దక్షిణాపథంబునం జనునప్పుడు. 131

సీ. విస్ఫురదర ధ్వాంతౌఘవిధ్వంసనక్రియా
బరమదీక్షారంభగురుమయూఖ
దశశతపరిషదాధారమండలుఁడైన
చండభానుని కధిష్ఠాన మగుట
భారంబు భరియింప బరువుపడ్డది వోలె
మూఁపుమూఁపున నంది (టి) మొక్కలముగ
ననిలంబు లేడును నంచెలంచెలు గట్టి
యాకాశవీథి నందంద నడవ

తే. నడచురవితేరు మింటివన్నడిమిచక్కిఁ
బ్రగ్గనఁగఁ దాఁకె వింధ్యపర్వతముచఱులఁ
గఠిననిర్ఘోషనిర్ఘాతఘట్టనమునఁ
బంకజాతభావాండకర్పరము వగుల. 132

క. తగులువడి యప్పుఁడు వడి సెడి
గగనమణిరథంబు దోరగలువడి నిలిచెఁ
బోగరు మొగకడలియక్కలి
దగిలి నిలువఁబడినకలపతతి యుంబోలెన్. 133

క. ఒక్కనిమేషము రాహువు
పుక్కిటిలోఁ దగులువడక పోయెడుభానుం
డిక్కొండ ప్రక్కఁ జిక్కెం
బెక్కేఁడులు విధివశంబుపెం పెట్టిదియో ? 134

తే. రెండువేలును నిన్నూటరెండుయోజ
నంబు లర్ధనిమేషమాత్రంబునందు
నంబరంబునఁ బాఱుతీవ్రాంశురథము
నిలిచె బహుకాల మిట్టిదే నియతిమహిమ. 135

క. స్థితిసర్గవిసర్గములకు
గతి భానుఁడు గేవలంబ కాన తదీయ
ప్రతిబంధము త్రైలోక్య
ప్రతిబంధం బై విపత్పరంపరఁ బెనచెన్. 136

సీ. లేవయ్యె స్వాహాస్వధావషట్కారంబు
లుడివోయెఁ ద్రేతాగ్నిహోత్రవిధులు
కాలంబుకొలఁది లెక్కలు వెట్ట నేరక
చిత్రగుప్తాదులు చిక్కువడిరి

యిది సంజ యిది రాత్రి యిది వాసరం బను
సమయపర్వంబులు సంక్రమించె
సావితో వర్షంబు సమకూర కుండుటఁ
బంటలు లేవయ్యెఁ బాఁడిదొఱఁగె
తే. కొన్ని దేశంబు లెండచే గుమిలిపోయెఁ
కొన్ని దేశంబు లీఁకచేఁ గొంకుపోయెఁ
కొన్ని దేశంబు లిడులచే గుడ్డివడియెఁ
కొన్ని దేశంబు లివచేతఁ గుందువడియె. 137
సీ. పూఁచినకొరవిపూఁబొదరింటిచందానఁ
గత్తెర యొక్కచోఁ గదలకుండె
నొకచోఁ దగుల్పడె నుపకారికొఱటికిఁ
దర మైనరోహిణీతారకంబు
నొకచోఁ బునర్వసు పూఁగె వృషముకొమ్ము
సుడిబడ్డముత్యాలజోఁగువోలె
శయనించె నొకచోట శ్రవణనక్షత్రంబు
గుంటమీఁదటిప్రత్తికొడుపువోలె
తే. స్వాతిచిత్తలు తోరణస్తంభయుగము
ననుకరించుచు నొక్కచో నత్తమిల్లెఁ
జిలువవోయినమూఁకుటిచెలువుఁ దాల్చి
హత్తె నొకచో విశాఖ వింధ్యాద్రియందు. 138
సీ. నేత్రంబు లున్మేషనిష్ప్రహత్వము నొంద
శ్రుతిపుటంబుల శక్తి చొక్కుమడఁగ
జ్ఞానేంద్రియజ్ఞానకళలొరుసొరుగా
జిహ్వావివేకంబు చిదువవోవ

నంతరంగమున మహాంధకారము గ్రమ్మఁ
దనువు చేష్టాదరిద్రత వహింపఁ
బ్రాణముల్ శ్వాసమాత్రమునఁ బర్యవసింప
దలచిన యెఱుఁగనివశ ఘటిల్లఁ

తే. బాము గఱచిన మూర్ఛిల్లి పడినయట్లు
వితతనిద్రాసమావేశవివశు లగుచు
తరణిదీధితి లేమిఁ జైతన్య మెడలి
పడిరి పాశ్చాత్యదేశంబుపంచజనులు. 139

వ. అనిన విని నైమిశారణ్యమునీశ్వరు లటమీఁదివృత్తాంతం
బెయ్యది యని యడిగిన. 140

ఆశ్వాసాంతము

శా. పారావారపరీతవిశ్వధరణీభారోద్ధతిప్రక్రియా
ధౌరంధర్య! సరోరుహేక్షణ! సమిద్గాండీవకోదండ! దా
షౌరామర్త్యప్రమదాకరోరుకుచకుంభాభోగసంక్లిష్టక
స్తూరీస్థాపకముద్రితస్థగితవక్షోవీథికాభ్యంతరా! 141

క. వేమాంబాప్రియనందన!
హేమాచలధీర! భువనహితచారిత్రా!
వేమాధిపానుసంభవ!
రామారతిరాజ! రాజరాజకిరీటా! 142

భుజంగప్రయాతము:—

హరశ్రీపదాంభోరుహద్వంద్వపూజా
పరాధీన! కారుణ్యపాథోనిధానా!

కురంగేక్షణాపుష్పకోదండమూర్తీ!
శరచ్చంద్రికాస్నిగ్ధసంసిద్ధకీర్తీ! 143

గద్య. ఇది శ్రీమత్కమలనాభపౌత్ర మారయామాత్యపుత్ర సుకవిజనవిధేయ కవిసార్వభౌమ శ్రీనాథనామధేయప్రణీతంబైన కాశీఖండం బనుమహాకావ్యంబునందుఁ బ్రథమాశ్వాసము.

ద్వితీయాశ్వాసము

క. శ్రీ రాజమహేంద్రవరీమ
హారాజ్యశ్రీస్వయంవరాధీశ్వర ! శృం
గారకళాఝషకేతన !
యారాధితభుజగహార ! యల్లయవీరా ! 1

దేవతలును మునులును బ్రహ్మకడ కేగి స్తుతించుట

వ. అక్కథకుండు శౌనకాదిమహామునుల కిట్లనియె. ఇవ్విధం
బున నకాండప్రళయంబు సంభవించిన నమరాసురోరగం
బగులోకంబు గాందిశీకం బగుటయు మునులును దేవతలును
గూడి బ్రహ్మలోకంబునకుం బోయి బ్రహ్మ నిట్లని స్తుతియించిరి.

తే. బ్రహ్మ! బ్రహ్మస్వరూప! హిరణ్యగర్భ!
యమృత! కేవల! యప్రతర్క్యానుభావ!
వేదవేద్య! చిదాత్మ! యనాదినిధన!
చిత్తగింపుము సంస్తుతించెదము నిన్ను. 3

తే. డెందమును వాక్కు నెవ్వాని నంటలేవు
కాంతు రెవ్వాని హృదయపుష్కరములందుఁ
బరమయోగీంద్రు లధికతాత్పర్యలీల
నట్టినీకు నమస్కార మఖిలవంద్య ! 4

తే. ప్రకృతిరూప! గుణత్రయోపాధియుక్త!
కాల! కాలాతిరిక్త! నిష్కామహృదయ!
సత్త్వగుణమున హరి వై రజస్తమోగు
ణముల శంభుఁడ వగు నీకు నతి విరించి! 5

సీ. బుద్ధ్యహంకారరూపుని భజింతుము నిన్నుఁ
బంచతన్మాత్రరూపా! భరింపు
పంచకర్మేంద్రియపంచబుద్ధీంద్రియా
త్మక! మనోరూప! యేమఱకు మమ్ము
క్షిత్యాదిపంచకాకృతి మమ్ము రక్షింపు
విషయాత్మకా! మమ్ము విడువ వలదు
బ్రహ్మాండరూప! మాపాలిపెన్నిధి వీవు
పాలింపు మముఁ దదభ్యంతరస్థ!

తే. కొలుతు మిమునీశ్వరాకృతిఁ గోరి నిన్ను
విశ్వరూపుని నిన్ను సేవింతు మెప్పు
డవధరింపుము నిత్యసత్యస్వరూప!
సవసదీశ్వర! యభయహస్తంబుఁ జూపు. 6

సీ. నిగమత్రయంబు నీనిశ్వాసపవనంబు
నీమూర్తిభేదంబు నిఖిలజగము
నీయంఘ్రి మేదిని నీమూర్ధ మాకాశ
మంతరిక్షము నాభి యండ్రు నీకుఁ
జంద్రుండు హృదయంబు చక్షు వబ్జహితుండు
తనురుహవ్రాతంబు దరులు నీకు
నీవు సర్వంబును నీయందు సర్వంబు
స్తోతృస్తుతిస్తవ్యజాత మీవు

తే. మ్రొక్కెదము నీకు నని మహామునులు సురలు
నళికతలమున సేవాంజలులు ఘటింప
ద్రుహిణుఁ డెంతయు నాత్మ సంతోషమంది
యందఱిని జూచి యిట్లని యానతిచ్చె. 7

తే. ఆద్య మగునీ స్తవంబున కనఘులార!
యేను బరితుష్టి నొందితి నిచ్చయందు
నేమి వలసిన నట్టిద యిత్తుఁ గాన
యిది యభీప్సిత మనుఁడు మీ రింపు మిగుల. 8

మ. నిరవద్యస్థిరభక్తితోడి ననుఁ గానీ శంభు గానీ రమే
శ్వరుఁగానీగుఱియించి యెవ్వరేఁటయీసార స్తవంబుల్ జపిం
తురు వారందఱి కేము మువ్వురముసంతుష్టిం బ్రసాదింతుమిం
పరువారన్ ధనధాన్యపుత్త్రపశుసత్సౌఖ్యాయుస్సుఖారోగ్యముల్

వ. మీ కెయ్యది యభీష్టం బట్టివరంబు గోరుం డిచ్చెద. ఇక్క
డికి వచ్చియు నిట్లేటికి నాకులత్వంబు విడువరు? స్వస్థులరు
గండు. నాలోకంబునఁ గామక్రోధలోభమోహమదమా
త్సర్యహింసాసూయాదులు లేవు. మూర్తంబులగు
నీయామ్నాయంబులు విద్యలు యజ్ఞంబులు దక్షిణలు సత్య
ధర్మతపోబ్రహ్మచర్యముఖ్యంబులు నుల్లసిల్లెడుం జూడుం డని
మఱియు నిట్లనియె. 10

సీ. తల్లిదండ్రులకు నిద్ధపుభక్తి ఠవణిల్ల
శుశ్రూష చేసిన శుద్ధమతులు
పతులకు నిర్వ్యాజపరమతాత్పర్యతఁ
బరిచర్య సలిపినపద్మముఖులు
సజ్జనావళికి నిష్కారణంబున. నుప

కార మొనర్చినధీరగుణులు
దఱి దప్పకుండ సంధ్యాజపహోమాది
తంత్రముల్ నెఱపినధర్మవిదులు
తే. బ్రహ్మరతులు తపస్వులు భవ్యతీర్థ
సేవకులును సద్వ్రతులు నిస్పృహులు మొదలు
గాఁగ నొప్పెడు తత్పుణ్యకర్మపరులు
వీరె కనుగొండ్రు సుఖ మున్నవార లిందు. 11
క. నతిచేసి యిష్టధనములు
క్షితిసురులకు నొసఁగినట్టిసిద్ధులు సుండీ!
యతులహిరణ్యయహార్య
స్థితు లగుచుఁ జరించువారు చిరశుభలీలన్. 12
తే. ఉభయముఖ లగుగోవుల నొండె నొండెఁ
గపిల లగుధేనువులఁ బుణ్యకాలతిథుల
దాన మొనరించినట్టిసత్యప్రతిజ్ఞు
లీమహాస్వర్గపీఠంబుల నెసఁగువారు. 13

బ్రహ్మదేవతలకును మునులకును గోబ్రాహ్మణప్రభావంబుసెప్పుట

వ. అనిచెప్పి యప్పరమేష్ఠి బ్రాహ్మణులసామర్థ్యంబున గోవుల మాహాత్మ్యంబును నొక్కించుక వర్ణించుతలంపున ని ట్లనియె.
తే. నాకు శంభునకును బద్మనాభునకును
దుష్టికరములు రెండువస్తువులు గలవు
విప్రులును గోవులును నన వినుఁడు మొదల
నొక్కకులము ద్విధాభంగి నొంది యుండు. 15
చ. సకలఫలంబులుం గురియు జంగమతీర్థము లెందు బ్రాహ్మణ
ప్రకరము లట్లుఁ గాక పెడవాయుటయట్లుతదీయభాషణో

దకముల సేవకావళికి దత్క్షణమాత్రన జన్మజన్మబం
ధకృత సహాగతంబు లగుతత్తద నేకమహాఘసంఘముల్. 16

చ. వినుఁ డనయంబు గోవులు పవిత్రముగోవులు మంగళంబుద
ద్ఘనఖురటంకశృంగపరిఘట్టదళద్ధరణీరజశ్ఛటల్
కనుకని నవ్వుచుండుఁ బురఘుస్మరమూర్ధజటాటవీనట
ద్ఘనపథసింధువార్ల హరిగర్వభరార్భటిఁ బావనోన్నతిన్. 17

చ. ప్రతివసియించు గోవులఖురాగ్రములందుఁ సమస్తతీర్థసం
తతియును సర్వపర్వతవితానము గోమ్ములమధ్యసీమ న
ద్భుతచరితుండు శంకరుఁడు భూధరకన్యయుఁ దానునుండుఁద
ద్వ్రతతకు చేభ కుంభపరిదిగ్ధపటీరపవిత్రవక్షుఁడై. 18

క. కొనియాడు బితృగణంబులు
గొనియాడు ఋషివ్రజంబు గురుసమ్మదముల్
జనియించు వేల్పులకుఁ గం
దని పెంపు(న) నరుండు గోవుదానము సేయన్. 19

శ్లో. గోమయం యమునా సాక్షా ద్గోమూత్రం నర్మదా శుభా,
గంగా క్షీరస్తు యాసాం వై కిం పవిత్ర మతః పరమ్. 20

శ్లో. గవా మఙ్గేషు తిష్ఠన్తి భువనాని చతుర్దశ,
యస్మా త్తస్మాచ్ఛివం మే స్యా దిహ లోకే పరత్ర చ. 21

క. అనుమంత్రంబులు చెప్పుచు
నొనరించును ధేనుదాన ముర్వీసురవ
ర్యున కెవ్వఁ డాతఁ డధికత
వినుతులు గను జగమునందు విశ్రుతలీలన్. 22

క. స్తుతిపూర్వకముగఁ బ్రదక్షిణ
మతిభక్తిఁ జరించు విప్రుఁ డావుల కతనిఁ

ధృతిఁ బొందు నపుడు సకల
క్షితికిఁ బ్రదక్షిణము నియతిఁ జేసినఫలముల్. 23

క. ముంగిటఁ బిఱుఁదం గ్రేపల
డెందమునం గరము సంపదిలవలదా యు
స్పంచశుభావహములు గో
బృందము లని మాకుఁ బుట్టు బ్రియ మెల్లపుడున్. 24

క. నీరాజనంబు నెఱపుడు
దారఁగ గోపుచ్ఛమున నిజాంగంబుల కె
వ్వారలు వారలయఘములు
దూరమున దొలంగు నిండ్ల దొరకునుఁ బ్రియముల్. 25

తే. వినుఁడు గోవులు విప్రులు వేదచయము
సతులు లోభవిహీనులు సత్యపరులు
దానశీలు రియ్యేడ్వురు దాల్తు రెపుడు
నవని నెంతయు విగతభయంబు గాఁగ. 26

గీ. నాదులోకంబునకు మీఁదు నలిననాభు
లోకమున నూర్ధ్వమగు గుహాలోక మవల
భర్గులోకంబు దత్సమీపస్థలమున
గోకులంబను లోకంబు గొమరు మిగులు. 27

సీ. ప్రవహించు నెచ్చోటఁ బరిపూర్ణసంపదఁ
దొలుకాడువీచుల దుగ్ధనదులు
సవరిల్లు నెచ్చోట జర డగ్గఱఁగ నీక
సంతతకౌమారసౌష్ఠవంబు
లల రొందు నెచ్చోట నాజ్యనిర్ఝరులతో
బహుసంఖ్యఁ బాయసపర్వతములు

బెడఁగారు నెచ్చోటఁ గడను యింతయు లేమి
సామగ్రి శుభవస్తుసంచయంబు
తే. నట్టిగోలోకమునయందు నధివసింతు
రభవుచేఁ నెల్ల ప్రొద్దు నెయ్యంబుఁ గనుచు
నలుమూర్తులు గోమాతృకలు సుశీల
యాదిగాఁ గలపరమకల్యాణనిధులు. 48

వ. అట్లు గావున గోవులకు మిగిలినయుపాసనీయంబు లేదు. గోప్రదాతలకు మిగిలినపుణ్యవంతులు లేరు. వెండియు నాకర్ణింపుఁడు. సరస్వతీతీర్థమృతులును, మార్తాండుండుమకరస్థుండై యుండఁ బ్రయాగతీర్థంబునమాఘస్నానంబుచేసినకృతార్థులును, వారణాసియందుఁబంచనదంబునం గార్తికమాసమందుఁ దీర్థమాడినవిశుద్ధదేహులును, గురుక్షేత్రంబునంగణికామాత్రంబైనను హిరణ్యంబు దానంబిచ్చినదాతలు మొదలుగాఁగలనానాధర్మపరు లస్మదీయలోకంబున వీరె నిజకర్మోచితపదంబులం గల్పస్థాయి సుఖంబు లనుభవించుచున్నవారు మీకును నింక భయంబువలదు మీరు వచ్చిన కార్యం బె నెఱుంగుదు వింధ్యం బవంధ్యగర్వోదయంబున గీర్వాణభూధరంబుతో మచ్చరించి శృంగోచ్ఛ్రియంబులఁ బతంగమార్గంబు నిరోధించి బుధజనంబులకు బాధ సేయుచున్నయది. ఈయకాండప్రళయంబులకు బెగ్గలంబంది యాపత్పరిహారార్థంబు నన్ను శరణు జొచ్చితిరి. అరిష్టనిరసంబునకు నుపాయంబు చెప్పెద. మహామునియగస్త్యుండవిముక్తంబనుపముక్తిక్షేత్రంబున విశ్వేశ్వరువిరూపాక్షుభోగమోక్షప్రదాయకుందారకబ్రహ్మోపదేశార్థంబు సేవిం

చుచున్న వాఁడు. అతఁడు మీ కార్యంబు సంఘటింపంగల
వాఁడు. మీ రచ్చోటి కరిగి యమ్మహాత్ము నభ్యర్థింపుఁడు.

క. వాతాపీల్వలు లనియెడు
దైతేయులఁ గుపితకపటతంత్రోద్ధతులన్
భ్రాతల వధించె వేల్మిడి
నాతం డెవ్వరును వెఱతు రమ్మునిపతికిన్. 30

వ. పొండు మీకు మే లయ్యెడు నని పుండరీకభవుండు వీడ్కొల్పిన వారును మహాప్రసాదంబని ప్రసన్నాంతరంగులై సత్యలోకంబు వెలువడి *(వచ్చువా రంతరాంతరంబుల మూర్తిమంతంబులైన వేదంబుల వేదాంగంబుల యజ్ఞంబుల దక్షిణల సత్యంబు ధర్మంబు దపంబు శ్రుతిస్మృతిపురాణేతిహాసంబులం బతివ్రతల బ్రహ్మచారుల మాతాపితృభక్తుల గోగ్రహణహితుల గాయత్రీజపపరాయణుల నుభయముఖగోప్రదాతలఁ గపిలాదానతత్పరుల బ్రాహ్మణపాదోదకప్రాశనుల సరస్వతీతీర్థమృతుల మకరరాశిస్థితుం డై మార్తాండుం డుండ మాఘస్నానంబు ప్రయాగతీర్థంబునం జేసినకృతార్థుల వారణాసియందుఁ బంచనదంబునం గార్తికమాసంబునం దీర్థంబాడినవిశుద్ధదేహులఁ గురుక్షేత్రంబునం గాకిణీకామాత్రం బైనను గనకంబు దానంబు చేసినదాతలను విలోకించుచు.) 31

తే. విమలకైవల్యకల్యాణవిత్తనిధికి
విశ్వనాథుని మొదలి శ్రీవేశ్మమునకుఁ
గాశికాక్షేత్రమున కేఁగఁ గదలి రపుడు
కోర్కు లిగురొత్త బృందారకులును మునులు. 32

వ. హర్షోత్కర్షంబునం దమలోన. 33

సీ. మనభాగ్యమునఁ గాదె కనకాచలేంద్రంబు
విశ్వాధికౌన్నత్యవిభవ మొందె
మనభాగ్యమునఁ గాదె మార్తాండమండలి
వినువీధి రోధించె వింధ్యశిఖరి
మనభాగ్యమునఁ గాదె మత్స్యపాత్రాళి త్రి
విష్టపంబులకు సరిష్ట మొదవె
మనభాగ్యమునఁ గాదె కనకగర్భుండు ప్ర
త్యక్షమై యుపదేశ మానతిచ్చె

తే. నహహా! మనభాగ్యమునఁ గాదె యమరతటిని
దరి వసించినవాఁడు వాతాపదమనుఁ
డిన్ని సౌభాగ్యములు (గు) గూడియిచ్చె మనకుఁ
గాశికాక్షేత్రరాజవీక్షాసుఖంబు. 34

క. ఏకక్రియ ఫలయుగ్మము
నాకర్షింపంగఁ జాలు నది లోపాము
ద్రాకాంతుఁ గుఱిచి పోవఁగ
శ్రీకాశీదర్శనంబుచే సిద్ధించున్. 35

దేవర్షులు బ్రహ్మనియోగంబున నవిముక్తంబునకేతెంచి యగస్త్యునిదర్శించుట.

వ. అనుచు బ్రహ్మలోకంబుననుండి డిగ్గి వారు వారణాసీపురో
పకంఠంబున శ్రీకంఠజటాటవీకుటజకోరకంబును బరమేష్ఠి
కమండలుతీర్థసలిలధారాధోరణియును గుపితకపిలమునిపరి
వృఢకపిలదృగనలచులికితవపురఖిలసగరసుత స్వర్గారోహణ
సోపానమార్గంబును నగుభాగీరథియందు మణికర్ణికాకుండం

బునఁ దీర్థంబాడి తీర్థోపవాసులకు వాసోహిరణ్యగంధసార
కర్పూరకస్తూరికాకుంకుమంబులను ఖండశర్కరాపూపసూపా
జ్యదధిపయఃఫలాదితర్పణద్రవ్యంబులను సుపానత్పాదుకా
చ్ఛత్రంబులనుగుండికాదండవల్లకవ్యజనచామరంబులఁ గాపీ
నకౌటికాకరండ బులను దైలలవణేంధనంబులను గుగ్గులు
మహిసాక్షిప్రముఖధూపద్రవ్యంబులను వెండియుం గ్రియా
కాండంబులనుం బరితోషంబు సంపాదించి విశుద్ధహృద
యులుఁ బ్రసన్నాత్ములు నై శ్రుతిస్మృతిపురాణేతిహాసప్రతి
పాదితవేదానువచన యజ్ఞ దాన తపోవ్రతాదులచేతం
బ్రక్షీణసకలకల్మషులు భస్మోద్ధూళితాంగులు రుద్రాక్ష
మాలికాలంకృతాంగులునై శంకరుంగురంగాంకశేఖరునిరస్త
సమస్తోపాధిక స్వప్రతిష్ఠాఖండ సంచితానందైకరసాద్వితీయ
స్వరూప విరూపాక్షు విశాలాక్షీహృదయాధీశ్వరు విశ్వే
శ్వర శ్రీమన్మహాదేవు సందర్శించి ప్రణమిల్లి జగన్నిర్మాణ
నియమపరిపాలనాది శక్తియుక్తుం డగునద్దేవుం బంచబ్రహ్మ
పంచాక్షరప్రణవమంత్రంబుల నావాహనస్థాపన సాన్నిధ్య
సన్నిరోధనసంకలీకరణాదులగు దశవిధసంస్క్రియాకలాపం
బుల నుపచరించి వెండియు. 36

క. ఆడిరి ప్రమోదనృత్తము
పాడిరి మంద్రకమహాప్రబంధంబుల మో
మోడిరి తైర్థికులకుఁ గొ
ల్లాడిరి కైవల్యలక్ష్మి నమరులు మునులున్. 37

సీ. అందంద చేసిరి యభవుగేహమునకు
ధన్యాత్ము లలర ప్రదక్షిణములు

యోగపీఠారూఢ నుమబోటి నర్చించి
రభ్యర్హితులు సువర్ణాంబుజముల
నాడుంఠివిఘ్నేశు నాపూపమోదకా
ద్యుపహారములఁ దృప్తి నొందఁ జేసి
యవధరించిరి పురాణాఖ్యానముఖముల
సమధికం బగుమహాస్థానమహిమ
తే. వీటిపెద్దతలారి నిస్సాటికలికి
దిస్సమొలవేల్పు పార్వతీదేవిపట్టిఁ
గాలభైరవుఁ గుక్కురగణపరివృతు
ననుచరించిరి మునులు నాకౌకసులును. 38

వ. అనంతరంబ. 39

సీ. పంచాక్షరీమంత్రపారాయణమునకు
నెవ్వానిమానసం బేడుగడయు
దర్పోద్ధతు లగువాతాపికిల్వలునకు
వధశిలాస్థాన మెవ్వానికుక్షి
యాది నెవ్వానిదివ్యావతారమునకుఁ
బూర్ణాంబుకుంభంబు పురిటియిల్లు
మెఱసి లోపాముద్ర మెఱుఁగుఁబాలిండ్లపైఁ
బవళించు నెవ్వానిభవ్యమూర్తి
తే. కసరి యెవ్వానికంఠహుంకారరవము
కొండపాములకులములోఁ గూర్చె నహుషు
నట్టి పరమమహాశైవు నలఘుతేజు
వెదకి రానందవనములో విబుధమునులు. 40

సీ. ఢుంఠివిఘ్నేశుఁ డుండుప్రదేశ మీక్షించి
లోలారునగరిమోసాల వెదకి
దండపాణ్యాసవభాండేశ్వరంబులు
గుక్కుటస్థానంబు గుద్దలించి
కేశవస్వామిలోఁగిలి పరామర్శించి
కాలభైరవదేవుగవను జూచి
శ్రీవిశాలాక్షిగోష్ఠివాటి శోధించి
యపవర్గమంటపోపాంత మరసి
తే. విబుధగంగాతరంగిణీవేణిమధ్య
సైకతోత్సేకవేదికాసంప్రరూఢ
తరుణమంజులకుంజవైతసకుడుంగ
వీధికలయందు దృష్టి యావిష్కరించి. 41

వ. కుంభసంభవు నన్వేషించువారు జగద్ధితకార్యారంభులు జంభమథనపురోగములైనసురలును గీష్పతిప్రధానులైన మునులును నానందకాననంబన మహాశ్మశానంబన రుద్రావాసంబనఁ గాశియన వారణాసియన నవిముక్తక్షేత్రంబన లోలార్కకేశవులు కోటిద్వయంబును, భాగీరథి నారియు, ధర్మంబుశరంబును, గలిలక్ష్యంబును, విరూపాక్షుండు ధన్వియుంగాను త్రిపురంధ్రీభ్రూలతానుకారంబును, జంద్రరేఖాఛాయాప్రకారంబై తాను గోదండంబుభంగి నంగీకరించి విశ్వేశ్వరశ్రీమహాదేవునకు నిఖిలదేవతాసార్వభౌమునకుఁ ద్రైలోక్యసామ్రాజ్యపట్టాభిషేకంబునకుఁ దగిన హేమపీఠంబునుంబోని యమ్మహాస్థానంబుఁ గలయఁ

గ్రుమ్మరి యే చోఁటి పెద్దలవలన గందువ యెఱింగి చని తత్పు
ణ్యాశ్రమంబుఁ బ్రవేశించి రందు. 42

సీ. కంఠూరాయణము సేయుఁ గరటి శుండాదండ
పుష్కరమ్మున సింహపోతకంబు
వాలాగ్రనఖముల వదన మించుక యొత్తి
ముద్దాడుఁ బులి లేటిముద్దరాలి
నిండుకౌఁగిటఁ జేర్చి నెమ్మిమైఁ దోఁడేలు
గోవమచింబోతును గుస్తరించుఁ
గుంజమంటపకుటీ క్రోడమధ్యంబున
నాఖుతోఁ జెఱలాడు నడవిపిల్లి
తే. యెండ దాఁకక యుండంగ నెత్తి పట్టుఁ
బగలు ముంగికి భుజగంబు పడగగొడుగు
కోఁతితో మైత్రి వాటించుఁ గొండగొఱియ
యావ్వశేయుసిపుణ్యాశ్రమాంతరమున. 43

వ. వెండియు నవ్వనంబున నీవారోదనమండం బుష్ణమధురం
బు(గ)గండూషించి క్రొత్తపురిటాలికిం గురంగికి మెత్తమెత్తన
కురంగంబు గ్రోల్చు. ప్రసప్పత్సర్పిరభిఘార(ప్రవాహ)ధారా
గంధపాణింధమం బై కర్కంధూపలోన్మిశ్రశాకపాకంబుల
తాలింపులకమ్మనికంపుపాంథఘ్రాణంబుల కింపుసొంపుసంపా
దించు, సరసీతీరంబున సారసంబు సారస్యంబు పక్షులింపలక్ష్మ
ణాకంఠోపకంఠంబునంగంఠంబుఁ జేర్చి సుఖపారవశ్యంబునం
జొక్కెనో? ముక్కంటి లోఁగంటం గనుంగొనుచు నిశ్చల
ధ్యానయోగానుసంధానంబున మాధుర్యంబు భజించెనో?
యెఱుఁగరాకుండ నుండు. శ్రుతిస్మృతిపురాణేతిహాససం

షింతాత్మాత్పరత్యపర్యాలోచనఁ బచేళిమం బైనవివేకంబున మత్స్యమాంసం బభ్యవహ్రితులు గవహ్రింతు రని యెఱింగి కాఁబోలుఁ బంకజోత్పలకుముదకహ్లారసంకులంబులగు కొలంకులఁ బెద్దమీను కొండుకమీనుం దాఁకదు. దరవికచవకుళకురవకనవ్యకేసరపరాగధూసరంబు లగుమధుమాసవాసరంబులందును బంచబాణుం డించువిల్లెక్కువెట్టఁ జెఱచుం గావునఁ గొంచి కొంచి యప్పశుపక్షిమృగమిథునంబులు నిధువనక్రీడ లాచరించు. కంఠగతప్రాణు లగుజంతువులకుం గాలకంఠుండు గరుణావశంవదుండై కర్ణోపకంఠంబుఁ జేరి తారకబ్రహ్మమంత్రరాజంబు నుపదేశింప నంతనంబున విని ఘుటుంగుటం జేసి మధుమదోల్లాసంబున నది వెల్లివిరి(సే)యుచున్నయదియో యన నిందిందిరంబులు మంద్రస్వనంబున ఝుంకారంబు సేయ నక్తభోజనవ్రతస్థులతోడిసంసర్గంబుననో చకోరవర్గంబు నక్తంబులం జంద్రచంద్రికాకరంభంబునఁ గౌక్షింభర్యంబు సంభావించు నట్టిపుణ్యాశ్రమంబు దరిసి చనునప్పుడు మునులు బృందారకులు నిజాంతర్గతంబున. 44

తే. ఎన్నఁడును సేగి లేనట్టి యిమ్మహాశ్మ
శానమున (యందుఁ) గాఁపురంబున్న జంతువులకు
నేటి నాకంబు? పున్నియం బెడలినప్పు
డొఱకమునఁ గూలవలయుఁ గీలూడినట్లు. 45

తే. అపునరావృత్తిశంభులోకాధివాస
సౌఖ్య మొనగూడు నిచ్చోటిజంతువులకుఁ

గాన మనకంటెఁ గడు మేలు కాశినుండు
కీటపక్షిసరీసృపక్రిమికులంబు. 46

సీ. కాశికానగరంబుకడసీమమున నున్న
చండాలుఁ బోల డాఖండలుండు
నానందవనములో ననశనస్థితి నున్కి
భువనసామ్రాజ్యవైభవముఁ బోలు
నవిముక్తదేశస్థుఁ డయ్యెనేఁ బతితుండు
నశ్వమేధాధ్వరాహర్త దొరయు
వారణాసీసంభవం బైనమశకంబు
నైరావణముతోడి నవఘళించు

తే. నాటుకొని శ్రీమహాశ్మశానమున నున్న
యణుకనగ్నాలవటుఁ డైన నాగ్రహమున
గర్వితోద్ధతి నేతెంచుకాళరాత్రి
మృత్యుదేవతమునిపండ్లు మెఱుకఁ జాలు. 47

తే. ఎన్నికల్పంబు లరిగిన నెడలిపోవ
దెంద రింద్రులు గడచిన నెలమి దప్ప
దెన్ని మన్వంతరంబులు చన్న నెపుడుఁ
బసిమి దప్పదు కాశికాపట్టణంబు. 48

ఉ. తత్తరపాటు లేక నదిఁ దాన మొనర్చి పినాకపాణి దే
వోత్తము విశ్వనాథుఁ గరుణోదధిఁ గమ్మనిపూవుగుత్తులన్
బత్తిరిఁ బూజ చేసి నుతిపాఠములన్ శ్రవణించువారికిం
దొత్తులువోలెనుబ్బుదురు దొప్పలుదోరలుము క్షీకామిముల్.

సీ. ధర్మంబు కాశికాస్థానమధ్యంబున
నాలుపాదంబుల నడచి యాడు

నర్థంబు కాశీపురాంగణంబునయందు
నానాప్రకారమై నటన మిగులుఁ
గామంబు కాశికాకటకఘంటావీథి
గర్వించు రాజలోకంబు శేవ
మోక్షసంపదలు గాశీక్షేత్రమునయందుఁ
ద్రవ్వితండంబులై నివ్వటిల్లుఁ
తే. గాశి కల్యాణముల కాకారణంబు
కాశి యణిమాదిసిద్ధులకాటపట్టు
కాశి జనలోక సంకల్పకల్పకంబు
కలుషపిశితంబు మెసవురాకాసి కాశి. 50
సీ. ఉర్వీధరశ్రేణు లుఱ్ఱూఁత లూఁగంగ
నేడుగాడ్పులు వీచు నెన్నఁ డేనిఁ
జండభానుండు పండ్రెండుమూర్తులు దాల్చి
యెసఁగ నెండలు గాయు నెన్నఁ డేని
బుష్కలావర్తకాంభోధరవ్రాతంబు
లెలగోలు వర్షించు నెన్నఁ డేని
భూర్భువస్స్వర్లోకములు ముంచి జలరాసు
లేకోదకముఁ జూపు నెన్నఁడేని
తే. నెన్నఁడే నుండు గాలంబు మిన్నుదక్కి
భూతములు గ్రాఁగ నెన్నఁడేఁ బుట్టినిండ్ల
నపుడు వారణాసీపుర మైదుక్రోసు
లంతమేర యుపద్రవ మడరకుండు. 51
తే. ఉత్తరోత్తర మభివృద్ధి నొందుచుండుఁ
గాశి ధర్మార్థకామమోక్షములు నాల్గు

చంద్రకళయట్లు శుక్లపక్షంబు రేలు
నాఁడునాఁటికి గనువర్ధనంబు కరణి. 52

సీ. పాలిండ్లు గదలంగఁ బసపుఁబయ్యెద వీచు
నచలాధిపతికూర్మి యాఁడుబిడ్డ
ఘూత్కార మొనరించుతొండంబుముక్కున
శీకరాసారంబుఁ జిలుక దుంతి
ప్రత్యక్షమై వచ్చి భాగీరథీగంగ
మృదులహస్తము సాఁచి మేను నివురఁ
బ్రమథోత్తముఁడు భృంగి భయరక్షణార్థమై
ఫాలాగ్రమునఁ దీర్చు భసితరేఖ

తే. దక్షిణశ్రుతి మీఁదుగా ధాత్రిఁ ద్రెళ్లి
పెద్దనిద్రకు మ్రాఁగన్ను పెట్టువేళఁ
బంచజనులకుఁ దారక బ్రహ్మవిద్య
యభవుఁ డుపదేశ మొనరించు నపుడు కాశి. 53

వ. అని వారణాసీపురంబు వర్ణించుచు. 54

తే. వృక్షశాఖాంచలంబుపై వ్రేలుచున్న
కోటిసంఖ్యల నీర్కావికోప్పణములు
విఘ్నమృగములఁ బట్టంగ వేసినట్టి
చీరతెర లనసంస్మృతిఁ జిగురు గొలుపు. 55

సీ. ఎదుర లోపాముద్రపదపద్మములముద్ర
సికతిలం బగు నేలఁ జెలువు మిగుల
శ్యామాకముష్టియాచ్ఛాదంబు మృగములు
ఋషికన్యకల రాక కెదురుచూడ

దేవార్చనాధూపదివ్యగంధములతో
హోమధూమముతావి గొబ్బిగ వడయ
వటుజనస్వాధ్యాయవర్ణసందోహంబు
శారిశుకంబులు చర్చచేయఁ

తే. గాశికాపట్టణమునకుఁ గ్రోశమాత్ర
గహనగంగా ప్రవాహసైకతికభూమి
బ్రహ్మలోకమునకు ననుప్రాస మైన
కలశజునిపర్ణశాల డగ్గఱిరి వారు. 56

వ. అప్పుడు. 57

మ. శివుఁడే దాత శివుండె భోక్త శివుఁడే చేయు న్మఖాదిక్రియల్
శివుఁడే విశ్వము నేశివుండ ననుచున్ జింతించుచున్ జాహ్నవీ
సవిధ శ్రీఫలవృక్షవాటమున భస్మస్నానశుద్ధాంగుఁడై
భవ! కాశీధవ! నీలకంఠ! యనుచున్ భావించు భవ్యాత్మునిన్.

క. రుద్రాక్షభూతిముద్రా
ముద్రితనిఖిలావయవుని ముక్తిపద శ్రీ
భద్రాసనస్థు లోపా
ముద్రాపరిపూర్ణపార్శ్వు మునిపుంగవునిన్. 59

మ. నిజధామంబున శంభులింగము భవానీపృక్కదంబంబు నం
బుజగర్భాదిసురేంద్రవందితపదాంభోజంబుఁ గల్పించె మం
త్రజపధ్యానపరాయణుండగుచుఁ దత్పార్శ్వంబునన్ దీపిరా
డజినాగ్రంబున నున్న పాశుపతవిద్యారాజ్యపీఠస్థునిన్. 60

క. పాటలజటాకిరీటు ల
లాటంతపసప్తసప్తి లలితమనోజ్ఞ

స్ఫాటికమణిజపమాలా
వ్యాటికితకృరసరోరుహాంగులిపార్శ్వన్. 61

క. పంచ బ్రహ్మంబును శ్రీ
పంచాక్షరమును నఘోరపాశుపతంబుఁ
గించిత్ప్రస్ఫుటదధరో
ష్ఠాంచలముగ జపము సేయునావిమలాత్మున్. 62

మ. అవధానంబున నప్పటప్పటికి భక్త్యావిష్టుఁడై పార్వతీ
ధవ! గంగాధర! నీలకంఠ! మదనధ్వంసీ! మహాదేవ! రు
ద్ర!విరూపాక్ష!భుజంగహార!యనుచుఁ ధారాధరవ్యూహసం
భవగర్జారభటిఁ బఠించుఁ బరమబ్రహ్మర్షిలేఖర్షభున్. 63

సీ. అంతర్విలోకనవ్యాప్తి యుద్వాసించి
బాహ్యంబునకు దృష్టి పాఱ విడిచి
లీల రుద్రాక్షమాలిక దక్షిణశ్రవ
శ్ష్కులీశిఖయందు సంతరించి
పదిలంబుగా మున్ను పరిధవించినయట్టి
నలినాసనంబుబంధము వదల్చి
వేదాగమపురాణవిదోద్భవము లైన
పురమర్దనస్తోత్రముల పఠించి

తే. యప్పు డప్పుడ యోగసమాధి యుడిగి
యధికశాంతిఁ బ్రసన్నాత్ముఁ డైనవానిఁ
బ్రణవపంచాక్షరీమంత్రపరమసిద్ధుఁ
గుంభసంభవమునిఁ గనుంగొనిరి వారు. 64

తే. జయజయధ్వను లెసఁగంగ సంయములును
నమరులును మ్రొక్కి రపు డమ్మహాత్మునకును

బిన్న పెద్దతనంబు రూపింప నీదు
శాంభవంబైన దివ్యతేజంబుమహిమ. 65

వ. అగస్త్యుండును బ్రత్యుత్థానంబు చేసి యందఱకు నాతిథ్య సత్కారం బొనర్చి సుఖాసీను లైనవారిం గుశలప్రశ్న పూర్వకంబుగా నాగమనకారణం బడిగిన. 66

తే. మునులు నమరులు నత్యంతవినయపరతఁ
బారు వచ్చినకార్య మంతయును జెప్ప
యానవద్యపదోక్తివిద్యానిరూఢు
డాంగిరసుఁ బ్రార్థనము చేసి రధికభక్తి. 67

వ. బృహస్పతియు నమ్మహా(ను)భాగు నవలోకించి యిట్లనియె. 68

ఙ బృహస్పతి దేవర్షినియుక్తుండై యగస్త్యునితో సంభాషించుట ఙ

సీ. ధన్యాత్మకుండవు మాన్యుండ వెంతయుఁ
గృతకృత్యుఁడవు జగద్ధితకరుఁడవు
ప్రత్యాశ్రమంబును బ్రతినగంబును బ్రత్య
రణ్యంబు శంసితవ్రతులు లేరె?
నీప్రతాపంబును నీ ప్రభావంబును
నీదునౌదార్యంబు లేదు గానఁ
బ్రణవపంచాక్షర బ్రహ్మవిద్యామహో
పనిషత్తు నీపాణిపల్లవాగ్ర

తే. మిట్టి నిను వేఁడ వచ్చితి మిందఱమును
గమలగర్భునియానతిఁ గాశిపురికి
భువనసంక్షోభకారియై పుట్టె నొక్క
కడిఁదియుత్పాత మది నీవు గడపవలయు. 69

వ. అని పలికి వాచస్పతి పుష్పంబునకువాసనయుంబోలె నవినాభావసంబంధంబున నమ్మహామునికి సహధర్మచారిణి యై యరుంధతికి సావిత్రికి ననుసూయకు శాండిల్యకు సరస్వతికి లక్ష్మికి నుమకు శతరూపకు మేనకకు సునీతికి సంజ్ఞకు స్వాహకుం దోడిజోడగులోపాముద్ర నీక్షించి యిట్లనియె. 70

బృహస్పతి లోపాముద్రకుఁ బతివ్రతాధర్మంబులు సెప్పుట

తే. అమ్మ! కుశలంబె? సాధ్వి! యనామయంబె?
దేవి! భద్రంబె? లెస్సలా? పూవుఁబోడి!
సారపరమపతివ్రతాచారవైభ
వాధిరాజ్యంబు జరుగుచున్నదియె? తరుణి! 71

సీ. ప్రాణేశుఁ డారగింపక భుజింపవు భర్త
నిద్రింపకయమున్న నిద్రవోవు
నాథుండు మేలుకొనకమున్న మేల్కాంతు
కైసేయ కెన్నడుఁ గదియ వధిపు
ధవుఁడు రోషితుఁడైనతఱి వాడి యుండుదు
పతికి నెప్పుడు మాఱు పలుక వీవు
పురుషునీగికి నల్ప మనక సంతోషింతు
మొగ మెత్త నేరవు మగనియెదురఁ

తే. జెఱఁగుమాసినమూన్నాళ్లు సిగ్గుతోడఁ
బతివిలోకనమార్గంబుఁ బరిహరింతు
సవితృఁ డుదయింప నాల్గాళ్ల జలక మాడి
చూడ వెవ్వారిఁ బెనిమిటిఁ జూతు కాని. 72

మ. పసపుంగుంకుమకజ్జలంబునునుగూర్పాసంబు తాంబూలముం
గుసుమంబుల్ కబభరీకంబు చెవియాకుల్ మంగళాలంకృతుల్

విసువొక్కింతయు లేక తాల్పవలయుఁ బీనిఁ సదాకాలము
న్నసిఁ జక్కంగఁ బ్రియుండు వర్ధిలుటకై నాళీకపత్త్రాక్షికిన్.

తే. రజకితోడ సువక్త్రతో శ్రమణతోడ
విధవతో నాథుతో రాయువెలఁదితోడఁ
జెడిపెతోడఁ బోరాములు సేయ వలదు
ప్రాణసంకటములను బుణ్యాంగనలకు. 74

సీ. పతి పిల్వఁబంచినఁ బని యేమి యని వచ్చి
చెప్పినయుడిగంబు సేయవలయు
భర్తయానతి లేక ప్రకృతిబంధునికైన
నేపదార్థంబును నీగి సెట్ట
జీవిత్వేరుఁడు డించినయోగిరంబును
గుత్స సేయక భుక్తి గొనఁగఁదగవు
సుఖసుప్తుఁ డగునిజేశునిఁ బ్రబోధ మొనర్పఁ
గా దనుష్ఠానభంగముల దప్ప

తే. నొంటి నెచ్చోటి కరుగుట యుక్తి గాదు
తడుపు గట్టక నీరాడఁ దగవుగాదు
కడపమీఁదను మఱి సన్నెకంటిమీఁదఁ
జక్కిమీఁదను గూర్చుండ జాడ గాదు. 75

క. నాగరికత్వము వాచా
ప్రాగల్భ్యము జూపఁ దగదు పతిమఱుందట సం
భోగక్రీడావిభవో
ద్యోగంబులఁ దక్క సతికి నుత్పలనయనా! 76

క. ఇది ధర్మం బిది యీలువు
ఇది వ్రత మిది సద్వివేక మిది యాచారం

బిది దేవపూజ యిది పతి
యుదితం బాలంబు సేయ కుండుట సతికిన్. 77

క. కాంతుఁడు సంతోషించిన
సంతోషింపంగ వలయు సతి కతఁ డాత్మన్
సంతాపించినపట్టున
సంతాపింపంగ వలయు జలజేక్షణకున్. 78

వ. కొందఱు కులటలు పతి దురవస్థఁ బొందినఁ దెవులుపడిన శృంఖలాబద్ధుం డైనను బరిత్యజింతురు. కొందఱు దుష్టమతులగుసతులు లేమిం గొతుకువడినభర్తనధికకార్పణ్యంబు పచరించి సర్పిర్లవణతైలతండులాదులకై సిబ్బితి వఱుతురు. కొంద ఱిచ్ఛాచరతులు ప్రియుండు దమకు నేమి యిచ్చిన మెచ్చుట పోచ్చు కుందాడుదురు. కొందఱు పరాకులేకేకాకినులై మగని మొఱఁగి యొక్కడికేనియుం జనుదురు. కొందఱు దుశ్శీల లశ్లీలవాక్యంబుల నందందఁ బ్రియుఁముందట మం దెమేలంబునం ద్రేలుదురు. ఇందఱు నాథునిం గులంబు వారిని నరకంబునం ద్రోచి తారును నంద కూలుదురు. 79

సీ. చీఁకటితప్పు చేసిన సరోరుహనేత్ర
గూబ యై చరియించుఁ గోటరమున
వింతవానిఁ గటాక్షవీక్షణంబునఁ జూచు
కిసలయోష్ఠి వహించు గిల్లకన్ను
మగఁడు దన్నోర్తిన మార్గోత్తునలివేణి
వ్యాఘ్రియై చరియించు వనములోనఁ
జిఱుదిండి తనవారి మొఱఁగి యాహరించు
నతివ సూకరజాతియందుఁ బుట్టు

తే. నధిపుఁ గోపించి హుంకార మాచరించు
పడఁతి మూఁగౌను సవతిసౌభాగ్యలక్ష్మిఁ
జూడఁ జాలక మదిలో నసూయ సేయు
భామ దుర్భగ యగు ననన్యభవములందు. 80

ఉ. దూరమువోయి యెండఁబడి దూపలివచ్చిన ప్రాణనాథునిన్
ద్వారకవాటదేహళులదాఁక నెదుర్కొని తీర్థ మార్చి యా
హారము పెట్టి వీడ్యము సమర్పణచేసి విహారశయ్యపై
నూరువు లొత్తి చిత్తమునకు బ్బొనరించుట ధర్మమింతికిన్.

తే. తగవు పాటించి యల్పంబు దండ్రి యిచ్చు
నల్ప మల్పంబ భ్రాతయు నాత్మజుండు
ప్రార్థితం బై నధన మెంతయైన నిచ్చు
ప్రాణనాథుని సరియె యేబంధువులును? 82

సీ. ఓర్పుమై నుప్పిండి నుపవాస ముండనీ
మగనాలిసరిఁ బోల్పఁ దగదు విధవ
తిరిగి నానాపుణ్యతీర్థంబు లాడనీ
మగనాలిసరిఁ బోల్పఁ దగదు విధవ
సమధికంబగు నిష్ఠ జపములుసేసిన
మగనాలిసరిఁ బోల్పఁ దగదు విధవ
సద్భక్తి దేవతార్చనము సేయంగనీ
మగనాలిసరిఁ బోల్పఁ దగదు విధవ

తే. నిద్ర మేల్కాంచి రేపాడి నియమపరత
నహిమభానుని వీక్షింపనియటకమున్న
తగదు (వీక్షింప) నరునకుఁ జూడంగఁ దల్లి వదినె
నత్తగారిని దప్పించి యన్యవిధవ.

ఉ. జీవముతోడఁ బాసి యశుచిత్వముఁ బొందిన మేనుగంధతో
యావభృథాభిషేకము సహస్రఘటంబుల నాచరించినన్
బావన మానె? యట్లు పతిఁ బాసి వితంతుత నొందినట్టి రా
జీవదళాయతాక్షి యశుచిత్వము వాయదు వేయుభంగులన్.
తే. ప్రియము గలిగిన నంగీకరింపవలదు
ముండదీవన రేపాడి మోముఁ జూచి
పైసిమాలిన పరమనిర్భాగ్యురాలు
విధవ దాని యాశీస్సును విషసమంబు. 85
సీ. పెండిలినాఁడు భూబృందారకులు కన్య
నప్పగించిరొ లేదొ యధిపుఁ గూర్చి
సహచారిణివి గమ్ము సకలకాలమునందు
నిండుఁజందురునిఁ జంద్రికయుఁ బోలెఁ
దొలుకరి మొగులు విద్యుల్లేఖయును బోలె
ననుగమింపఁగఁ బాడి యతివ మగనిఁ
బితృవనంబునదాఁకఁ బతివిమానము వెంటఁ
గైసేసి కొలనాడఁ గదలుభంగిఁ
తే. బిడెఁకికండ యొకింత లే కటమి వేడ్కఁ
జిచ్చుఱికఁ బోవునికచరాజీవనేత్ర
కశ్వమేధంబుఫలము తథ్యంబు గలుగుఁ
బద పదమ్మున కిదె వేదభాషితంబు. 86
తే. పుట్టలోపలిపాము నభ్యుద్ధరించు
వశ్యమంత్రుండు పాములవాఁడపోలె
భర్త నభ్యుద్ధరించుఁ బాపంబువలన
నగ్ని నుఱికినయట్టి పద్మాయతాక్షి. 87

గీ. పెక్కుమాటల నిటు జాలిపెట్ట నేల
సాధ్వి గర్హింప నొకఁ డెట్టు చాలఁ గలఁడు?
గంధవాహంబు వెఱచు నక్కలువకంటి
పసుపుపయ్యెద పాలిండ్లఁ బాయఁ దట్ట. 88

తే. ఔర్వశిఖకంటె జముకంటె నర్కుకంటెఁ
బిడుగుకంటెను దీవ్రమై బిఱుసు చూపు
నాత్మఁ దప్పఁగఁ దలఁచుదురాత్మకులకు
నహహా! పతిదేవతపతివ్రతాతిశయము. 89

చ. తొలఁగుదు రంత నంత యమదూతకిరాతులు భీతచిత్తులై
కలుషసమన్వితుం డయినకాంతునిదారుణలోహపాశశృం
ఖలికలు విచ్చి పుచ్చుకొని కాంతచితాగ్నిశిఖాముఖంబునన్
వెలువడియాత్మభర్తవెను వెంటహుటాహుటిఁ గూడివచ్చినన్.

తే. ఎన్నికకు రోమకూపంబు లెన్ని గలవు
దివ్యవర్షంబు లన్ని మోదించు సాధ్వి
నాకభువనంబునం దాత్మనాథుఁ గూడి
వెఱ పొకింతయు లేక చిచ్చుఱికె నేని. 91

తే. తండ్రివంశంబునం బేడుతరములకును
దల్లివంశంబునం దేడుతరములకును
ధవునివంశంబునం దేడుతరములకును
శాశ్వతస్వర్గసౌఖ్య మీఁ జాలు సాధ్వి. 92

వ. అని పలికి బృహస్పతి లోపాముద్రం గనుంగొని దేవీ!
నీప్రసంగవశంబునం గొన్ని యోషిద్ధర్మంబులు చెప్పితి. నీవు
మహాపతివ్రతవు. నీబోఁటిపుణ్యవతులు కొందరు గలుగంబట్టి
గదా వసుంధర తిరంబై యున్నయది. ఇదె నీకు నమస్కారంబు.

క. మావచ్చినకార్యమునకు
నీ వసుకూలత భజించి నిర్మలకరుణా
శ్రీ వెలయఁగఁ బ్రార్థింపుము
నీవల్లభు భువనకుశలనిర్వాహకునిన్. 94

వ. అని యగస్త్యమహామునిం జూచి వెండియుం బ్రణమిల్లి
యాఖండలగురుం డిట్లనియె. 95

బృహస్పతి యగస్త్యునితోఁ దమవచ్చినకార్యంబు నెఱింగించుట

సీ. ప్రణవంబు నీవు నిర్మలగుణాలంకార!
యామ్నాయవిద్య యీయలరుఁబోఁడి
తప మీవు శశికళోత్తంసభక్తినిధాన!
శాంతి యీసంపూర్ణచంద్రవదన
ఫల మీవు వాతాపిఖలదర్పభంజన!
సత్క్రియ యీగంధసారగంధి
మిహిరుండ వీవు విశ్వహితప్రవర్తక!
చైతన్యలక్ష్మి! యీచపలనయన

తే! బ్రహ్మతేజంబు నీయందుఁ బ్రజ్వరిల్లుఁ
బ్రజ్వరిల్లుఁ బతివ్రతాపమ తేజ
మీలతాతన్వియందె మా కిందఱకును
నుభయతేజంబులును మహాభ్యుదయ మొసఁగు. 96

తే. శక్రుఁడీతండు శిఖి వీఁడు జముఁడు వీఁడు
రాక్షసుఁడు వీఁడు పాథోధిరాజు వీఁడు
పవనుఁడును వీఁడు కిన్నరపతి యితండు
వృషభవాహనుఁ డీతండు విశ్వవంద్య! 97

వ. వీరె మునులు. వీరె సిద్ధసాధ్యమరుత్కిన్నరకింపురుషగంధర్వ
విద్యాధరు లగుదేవయోనులు. మావచ్చినకార్యం బవధ
రింపుము. వింధ్యం బనుమహీధరంబు విబుధశైలంబుతోఁ బ్ర
తిస్పర్ధించి యూర్ధ్వాండకర్పరంబు నిజశిరశ్శృంగశృంగాట
కంబుల నుద్ఘాటించుచు ననూరుసారథిరథం బవరోధించి నక్ష
త్రగ్రహతారకాచక్రంబుఁ జిక్కుపఱచి సప్తసమీరణస్కంధం
బులనుం బ్రతిబంధించి శింశుమారాకారంబునం దారకా
వీథిఁ బవ్వడించిన పాంచజన్యధరు నొరసి యాత్తానపాది
నుత్తరించి గగనగంగనాలింగనంబుచేసి యురులింగాకారుఁ
డైనధూర్జటిం ద్రివిక్రమాకారంబున విరాడ్రూపుం డగు వి
ష్వక్సేను ననుకరించియున్నయది. త్రుటినిమేషకాష్ఠాకళా
ముహూర్తాహోరాత్రపక్షమాసర్త్వయన సంవత్సరయుగసం
ధ్యాసంధ్యాంశమన్వంతరకల్పమహాకల్పాదిభేదభిన్నం బై ప
దార్థంబులం బరిచ్ఛేదించుకాలంబు నిరస్తసమస్తోపాధికస్వప్ర
తిష్ఠాఖండసచ్చిదానందైకరసాద్వితీయ రూపుండైన విరూపా
క్షుండు దప్పించి యన్యులనుం బరిచ్ఛేదించు. అట్టికాలంబున
కుం దపనపరిస్పందంబు మూలంబు. మార్తాండుండు కొండ
ప్రక్కం జిక్కి కదలిమొగయక్కలిందగులువడిచిక్కిన జోగునుం
బోలె నెదురు నడవ మరలం బఱవ లేక చీకాకుపడియున్న
వాఁడు. ప్రాహ్ణాపరాహ్ణమధ్యాహ్నసమయంబులు గత్తరఁ
గలయుటం జేసి నిత్యనైమిత్తికాదిక్రియాకలాపంబు లుప
సంహృతంబు లయ్యె. ప్రాచ్యోదీచ్యదేశంబు లంధకారా
తపహిమానిలంబులచేతం జేతనావైకల్యంబు వహించె.
భువనంబుల కకాండప్రళయం బావిర్భవించె. కల్పాంతకా

లంబునందును గసుగందకుండుం గావున నవ్వేసవిఁ గాశీ
క్షేత్రంబునందునుపరతి చూపదు. ఏమును నిమ్మహోపద్రవం
బునకుం బ్రశాంతిఁ గోరి యబ్రహ్మణ్యంబు సేయుచు బ్రహ్మ
శరణు సొచ్చితిమి. అవ్విరించి కరుణాకటాక్షంబున నీక్షించి
యీయాపద యుపనయింప వాతాపిహారి తాపసుండు దక్కం
దక్కినవాఁడు సమర్థుండుగాఁడు. అతనిం బ్రార్థింపుఁడు, పొం
డని తాన నీకందున చెప్పిన నీయానందవనంబున కరుదెంచి
తిమి. ఇఁకమీఁదఁ గోపాటోపావకుంఠకంఠకఠినహుంకార
ధారావష్టంభంబునం ద్రివిష్టపరాజ్యలక్ష్మీమదాంధుం డైన
నహుషుని నిమిషమాత్రంబున ధాత్రీమండలంబునం బడఁ
ద్రోచిన మహానుభావుండవు. నీవ ప్రమాణంబు. 98

క. ఎవ్వఁడు నిసర్గకలితుం
డెవ్వఁడు సన్మార్గబోధి యీర్ష్యాపరుఁ డై
యెవ్వఁడు దన కధికునితోఁ
జివ్వకుఁ జేసాఁడు వానిసిరు లధ్రువముల్. 99

వ. అనిన వాచస్పతిపలుకు లాకర్ణించి యమ్మునిపుంగవుం డిట్లనియె.

తే. యత్న మొనరింతు నీకార్య మనువుపడఁగఁ
జనుఁడు మీమీనివాసదేశముల కర్థి
నున్నవాఁడు గదా! వీఁడె యుమయుఁ దాను
గాశికాభర్త మనపాలికల్పతరువు. 101

వ. అనిన వారును మహాప్రసాదం బని సముచితప్రకారంబునం
గుంభసంభవుని వీడ్కొని నిజనివాసంబులకుం జనిరి. అనం
తరంబ యగస్త్యుండు లోపాముద్రం జూచి యిట్లనియె.

ఆగస్త్యుండు కాశీవియోగంబునకుఁ బరితపించుట

తే. కమలలోచన! మనుజుఁ డొక్కటిఁ దలంప
దైవ మొక్కటిఁ దలఁచు నెంతయు నిజంబు
కాశిఁ బెడఁబాయ నని యేను గదలకుండఁ
గాశిఁ బెడఁబాపె దైవంబు కరుణలేక. 103

తే. అప్పటికి నియ్యకొంటిఁ గా కంబుజాక్షి!
[1]ఋషులప్రాశంబులే యింతలేసి పసులు?
కొసల కాఁబోతు నాఁబోతు గ్రుమ్ములాడ
నడిమి లేఁబెయ్యగతి వచ్చె నాకు నిపుడు. 104

సీ. వివరించి చూడంగ విసుమానములుగాక
గోత్రారి వెఱచునే కుధరములకు?
యుగవిరామమున నుత్పాత లూఁపఁగఁజాలు
గాలి కొండ దమింపఁ జాల దెట్లు?
సర్వభూతంబుల శాసింప జాలెడు
జములావు గిరియందుఁ జడతపడునె?
దహనునిదాహకత్వంబు మహీధ్రసం
స్తంభంబునకు శక్తి చాల దొక్కొ?

తే. రుద్రు లాదిత్యతుషితమరుద్గణములు
దక్కఁగల దేవతలు జగత్త్రయము మ్రింగి
యుమియఁ జాలుదు రట్టివా రోపలేరె?
వింధ్యగిరిగర్వసంరంభవిభవ మడఁప. 105

తే. కామధేనువుఁ దనయింటఁ గట్టినాఁడు
కలవు తనతోఁటలోపలఁ గల్పతరులు

---

1. ఋషులపాలిటి వేయింతలేసిపసులు, కొతుక కాఁబోతు...నడిమి యాఁ బెయ్యదెస వచ్చె.

అట్టియింద్రుండు ప్రార్థించె నట్టి నన్ను
నింతపని కియ్యకొనకుండ నెట్లు నేర్తు? 106

సీ. మాటనిల్కడఁ గాదె? మధుకైటభులు ద్రొల్లి
హరిచేతఁ జచ్చి రేకార్ణవమున
గరుడుండు మోమోటఁ గాదె? వాహన మయి
వనజాక్షు నెక్కించుకొనియె వీఁపు
స్వాగతంబునఁ గాదె? చక్రాయుధుఁ డడంపఁ
బాతాళబిలములో బలి యడంగె
విశ్వాసమునఁ గాదె వృత్రాసురేంద్రుండు
సమసె నంబుధివాక శక్రుచేత

తే. మెఱసి యుపకార మొనరింప మేలు వచ్చుఁ
గీడు వచ్చు మనంబులో నోడ వలదు
వాఁడు చేసినధర్మంబు వానిఁ గాంచుఁ
గీర్తి యొక్కటి సాలదే కేవలంబ? 107

చ. ప్రతిదివసంబు విఁదుము పురాణముఖంబునఁ గాశియందు సం
తతముగ నంతరాయములు డాఁకుచునుండు ననంగ నిప్పు డా
శ్రుతి నిజమయ్యె నే నిదె యశోకమనస్కత నుండఁగా నత
ర్కితగతివచ్చెఁ జూడుమి దెకిన్నరకంఠి! మహాంతరాయముల్.

తే. విముఖుఁ డయ్యెఁ జుమీ! నాకు విశ్వభర్త
గాక యూరక యేభంగిఁ గలుగ నేర్చు
సకలకైవల్యకల్యాణజన్మనిలయ
కాశికాక్షేత్రవిప్రయోగవ్యథార్తి. 109

తే. పాణియాహారకబళంబుఁ బాఱవైచి
కూర్పరము నాకు పిసవెట్టెకూళ వోలె

భోగమోక్షములకు జన్మభూమి యైన
కాశి విడిచి నరుం డన్యదేశ మరుగు. 110

చ. తటుకున నియ్యకొంటి మతి దప్పి మరుద్గురునంతవానితో
నటమటమింకఁబోకయుడియాసల నుండుటఁ బాపు దైవమా!
యిటు ననుఁ జిక్కు వెట్టుదె యనేకవిధంబుల నెట్లు చెప్పినన్
గటకట! యెట్లు వాయనగుఁ గాశిక మోక్షపదప్రకాశికన్.

సీ. పాయంగ వచ్చునే ప్రాలేయగిరికూట
సమవతీర్ణ జలౌఘ జహ్నుకన్య?
మఱువంగ వచ్చునే మందారమధురసా
స్వాదఘూర్ణితనేత్రు వటుకనాథు?
విడువంగ వచ్చునే విఘ్నాంధకారార్క
డుంఠివిఘ్నేశు వందారుజఠరు?
మానంగ వచ్చునే మధ్యాహ్నకాలంబు
శ్రీవిశాలాక్షి కెంజేతిభిక్ష?

తే. సురలు ప్రార్థింపఁగాఁ బ్రతిశ్రుతము చేసి
యెట్టు వోకుండ నేర్తు నే నింతవాఁడ?
నెట్టు వో నేర్తుఁ గాశిఁ బుణ్యైకరాశిఁ
బ్రకటగుణరత్నదుగ్ధాంబురాశిఁ బాసి. 112

క. కాశీక్షేత్రము పంచ
క్రోశము కైవల్యలక్ష్మికులగృహ మని యా
క్రోశించు శ్రుతులు వినియును
దేశాంతర మరుగ సమ్మతింతు రభాగ్యుల్. 113

తే. కాశిఁ బాయుదుఁ గా కేమి కలుగఁగంటి!
యంతరవిముక్తతీర్థంబు నాశ్రయింతు

నంతరవిముక్తతీర్థ మెయ్యదియొ యనిన
వరణయును నసియును నైనవారణాసి. 114

వ. భ్రూఘ్రాణంబులసంధి యవిముక్తస్థానం బది యభ్యంతర
తీర్థంబు తీర్థంబులు బాహ్యాభ్యంతరభేదంబున ద్వివిధంబులై
యుండు. 115

తే. ఎల్లవియు బాహ్యతీర్థంబు లిందువదన!
యరయ బాహ్యంబు లయ్యు నాభ్యంతరములు
కాశికాతీర్థ మాదిగాఁ గలవు కొన్ని
వాని వినిపింతుఁ బరిపాటి వనిత! వినుము. 116

సీ. శీర్షంబునందలి శ్రీశైలతీర్థంబు
మల్లికార్జునదేవుమనికిపట్టు
ఫాలభాగమునందుఁ బ్రాలేయమయ మైన
విమల కేదారతీర్థము వసించుఁ
గుచచూచుకములందుఁ గురుజాంగలమ్ముల
తీర్థరాజము సంప్రతిష్ఠ నొందు
భ్రూవల్లరీయుగ్మమునకు మధ్యంబున
నానందవనతీర్థ మధివసించు

తే. నంతరంగమునఁ బ్రయోగ మాశ్రయించు
నిమ్మహాతీర్థములు పార్వతీశ్వరునకు
విహరణస్థానములు వేదవిశ్రుతములు
వెలుపలను లోపలను నుండుఁ దలిరుఁబోడి! 117

వ. బాహ్యాభ్యంతరంబులయందును నవిముక్తతీర్థం బుత్తమో
త్తమంబు. అట్టితీర్థంబుననుండి యఖండంబు సచ్చిదానందైక

రసంబు నద్వితీయంబు నగునిష్కళంకస్వరూపంబును నర్ధ
నారీశ్వరాదిరూపం బైనసకలస్వరూపంబును నగువిశ్వనాథు
నుపాసింప నొడఁగూడ దయ్యెం గావున నింక నేను భావ
తీర్థంబున యాంభర్తు నుపాసించెద. సంసారసాగరంబుఁ దరి
యింపసాధనం బగుటఁ దీర్థం బయ్యె. అభ్యంతరంబైనయ
విముక్తతీర్థంబు బ్రహ్మవిష్ణుమహేశ్వరులకుపలబ్ధస్థానంబగుటం
ద్రిమూర్తులకు సాధారణం బయ్యునుమహేశ్వరునకుం
బ్రధానస్థానం బైయుండు. 118

సీ. ఏవిధంబున నాత్మ నెఱుఁగుదు నే నంచు
యాజ్ఞవల్క్యుని నత్రి యడిగెఁ దొల్లి
యవిముక్తమునయం దుపాస్యుఁ డాత్మఁ డటంచు
యాజ్ఞవల్క్యుం డత్రి కానతిచ్చె
నాయవిముక్తమెం దాశ్రయించినది యం
చడిగెఁ గ్రమ్మఱ నత్రి యాజ్ఞవల్క్యు
నినుపారి వరణయందును నసియందును
నది యుండు నని యత్రి కానతిచ్చె

తే. యాజ్ఞవల్క్యుండు భ్రూమధ్య మాస్థలంబు
వరణ సంసారదోషనివారణంబు
నాశి యింద్రియదోషవినాశనంబుఁ
జేయుచుండుట యిట నిర్వచింపఁబడియె. 119

వ. అభ్యంతరావిముక్తక్షేత్రదర్శనంబు బ్రహ్మనాడీ పవమాన
జయంబునం గాని సిద్ధింపదు. 120

సీ. ప్రకృతిరూపిణి యైనపాఁపపూఁబోడికి
మహదాదివికృతులు మలక లేదు

మొగము విచ్చి సుషుమ్న మూలరంధ్రముఁ గప్పి
వంశాస్థిసంబంధవలనలీల
నది మీఁదఁ బ్రాఁకి మధ్యమనాడితోఁ గూడి
ద్రుహిణరంధ్రముఁ గప్పఁ దోఁకచివరఁ
జక్కఁజాయఁ జరింప సమకూరకుండుట
నిడఁ బింగళను గాలి యెక్కుడిగ్గఁ

తే. గెలనివాఁకిళ్ళు రెండు వేగిరము మూసి
నడిమివాఁకిలిఁ దెఱవ నెన్నండు నేర్చు
సాధకుఁడు నాఁడుగాని వశ్యంబు గాదు.
పవనవిజయంబు వానికిఁ బద్మనయన! 121

క. ఇడ వామనాడి పింగళ
కుడినాడి సుషుమ్న మధ్యగోచర యగు నీ
కుడియెడమ మధ్యనాడుల
కుడురాజానన! త్రిమూర్తు లొగి దైవతముల్. 122

క. హరి యిడకు నలువ పింగళ
కరవిందదళాయతాక్షి! యమృతాంశుకళా
ధరుఁడు సుషుమ్నానాడికిఁ
బరిపాటి నధీశు లనుచుఁ బలుకుదు రార్యుల్. 123

వ. పవనంబునకు సుషుమ్నాప్రవేశలక్షణం బైన యోగంబు వివరించెద. బ్రహ్మలోకప్రాప్తిద్వారం బగుట సుషుమ్న బ్రహ్మనాడి యనం బరఁగు. షణ్ణవత్యంగుళప్రమాణం బైన దేహంబునట్టనడుమఁ ద్రికోణాకారం బై కుక్కుటాండంబు చందంబున నుండునది కందస్థానంబు. 124

తే. నాభికందంబు క్రిందట నలినగంధి!
కుండలీశక్తిదేవత యుండు నెలవు
కుండలీశక్తి నాఁగ జకోరనేత్ర!
పాముచందాన నుండెడు ప్రథమధమని. 125

వ. అది మూలప్రకృతి. మహదాదిప్రకృతివికారంబులేదును దానిమేనిమలకలు. అప్పాఁపచేడియయు సుషుమ్నానాడి తోడం బెనంగొనియుండు. 126

క, గిటగిట నెనిమిదిమలకలఁ
గుటిలీభావము భజించి కుండలి ప్రాక్ర
నిటలాంతముదాఁకను గ్రిం
దటిమొగ మైవ్రేలు నండ్రు దద్జ్ఞులు దానిన్. 127

తే. దానిచుట్టును నుండు లేఁదలిరుఁబోఁడి!
డెబ్బదియు రెండువేలు నాడికలు మేన
ముఖ్యనాడులు వానిలో ముద్దరాల!
పదియునాలుగు ననుచుఁ జెప్పుదురు బుధులు. 123

వ. ఇడానాడియందుఁ జంద్రుం డధివసించియుండుం గావున నందుఁ బవనం బుద్గమించుకాలంబు రాత్రి. ప్రవేశించుకాలంబుపగలు. పింగళానాడియందు సూర్యుండధివసించియుండుఁగావున నందుఁ బవనం బుద్గమించుకాలంబు దివంబు. ప్రవేశించుకాలంబు రాత్రి. ప్రాఙ్ముఖస్థితుఁ డగుపురుషునకుఁ బింగళానాడి దక్షిణదిక్కున నిడానాడి యుత్తరదిక్కున నుండుఁగావున మకరాయనసమయంబునదక్షిణదిగవస్థితుండగు సూర్యుండు గర్కటకాయన పర్యంతంబునుత్తరంబు నడచుటంజేసి యుత్తరాయణం బయ్యె. ఈచందంబునం బింగళా

స్థితుం డగుపవనుండు యావత్కాలంబు నిడయందు సంక్ర
మించు నంతకాలం బుత్తరాయణం బీప్రకారంబున దక్షి
ణాయనంబు నెఱుంగునది. 129

చ. సమగతి నేక కాలమున సంగతి యామవతీకళత్రుఁడుర్గ
గమలహితుంపుప్రాణమనుగాడ్పులుదారటుకూడిపింగళా
ధమనిని డాసి తీవ్రగతిఁ దార్కొని క్రుంకుదుర స్తమింతురే
సమయమునందుఁదాల్చునది చంద్రనిభాస్య! యమాభిధాన

తే. పాము కుండలి చంద్రుండు ప్రాణపవన [మున్.
మాసిరావల్లి యెప్పు డయ్యనిలుఁ గ్రోలు
నది యశేషాంగకగ్రాస మైనయట్టి
గ్రహణకాలంబు సుమ్ము సారంగనయన! 131

వ. ప్రాణంబ యాదిత్యుండు. ఆదిత్యుండ చంద్రుండు. ఆప్రాణా
నిలంబు మూలాధారప్రవేశానంతరంబుదయించు మూర్ధ
ప్రవేశానంతరం బస్తమించు. దేవతలకు మొదలివిషువం
బైనమేషాయణంబున సూర్యుం డుదయించు. విషువాం
తరం బైన తులాయనంబున నస్తమించు. ప్రాణోదయాస్త
మయసమయంబులు విషువద్ద్వయంబు. 132

చ. మొదలసుషుమ్నఁజొచ్చు నిడముట్టినగాడ్పులకొంత సేపునం
బిదప సుషుమ్నఁబుట్టినసమీరము చొచ్చునిడాఖ్యనాడికన్
మొదలనుబిమ్మటంబవనముల్ దిరుగంబడి చొచ్చుఁ గానన
య్యదనులుసంక్రమంబులనియాడుదురాగమతత్త్వకోవిదుల్.

వ. అని యవిముక్తక్షేత్రవియోగదుఃఖంబున మానసాంతర
విముక్తక్షేత్రమాహాత్మ్యం బుపన్యసించి యనంతరంబ

కాశికావిరహవేదనాభరంబు దుస్సహం బగుట నౌర్వశే
యుండు కాశిని లక్ష్యంబు చేసి యిట్లనియె. 134

క. ఆమచ్చిక యాయను వా
ప్రేమాతిశయంబు విస్తరింపఁగ వశమే?
భూమండలతిలకమ వర
భూమికి నిన్నెట్లు వాసి బోవుదుఁ గాశీ! 135

మ. నిజ మేఁ బల్కెదబాహులెత్తి శ్రుతివాణీజాహ్నవీగోపతి
ధ్వజదుంఠిశగణేశ్వరల్ గులిగ నోవారాణసీదేవి! యో
గజచర్మాంబరుకూర్మిపట్టణమ! యోకల్యాణి! నిన్ బోలనం
బుజగర్భాండమునందు లేవు నగరంబుల్ తీర్థరాజంబులున్.

తే. లేవు లింగంబు లవిముక్తలింగమునకు
సాటిసేయంగ భూర్భువస్స్వస్త్రయమున
రావు దక్కటిపుణ్యతీర్థములు నీకు
సాటిసేయంగ భూర్భువస్స్వస్త్రయమున. 137

వ. అని యెట్టకేలకుం గదలి విరాళింగొన్నచందంబున మరులు
గుడిచినపోల్కి నపస్మారం బెత్తినపగిది నస్నుకొన్నవిధంబున
దూపటిల్లినతెఱంగునఁ దూలపోయినరీతి విషం బెక్కిన
లీల మ్రాఁగన్ను వెట్టినలాగున లాహిరి పట్టినభాతి మదం
బెక్కినమాడ్కి నుంగిడిగొన్నభంగి నూసరిల్లుచు నుస్సు
రనుచు నుమ్మలించుచు నుదిలగొనుచు నుపతాపం బందుచు
నూటాడుచు నూర్వశీనందనుం డూర్ధ్వబాహుండై యు
చ్చైస్స్వనంబున. 138

సీ. పరమకల్యాణి! యోభాగీరథీ! గంగ!
వార్ధిభామిని! పోయివత్తు నమ్మ!

యమరేంద్రులార! లోలార్క కేశవులార!
వనజసంభవ! పోయివత్తు నయ్య!
శ్రీవిశాలాక్షి! దాక్షిణ్యపుణ్యకటాక్ష!
వాసవార్చిత! పోయివత్తు నమ్మ!
శ్రీపూర్ణభద్రపారిషదనాయకులార!
నటుకభైరవ! పోయివత్తు నయ్య!
తే. తీర్థసంవాసులార! కృతార్థులార!
పాశుపతులార! భాగ్యసంపన్నులార!
మందిరోద్యానవాటికామరములార!
పోయివచ్చెద మీకాశిపురము వెడలి? 139
సీ. కలహంసి! రారాదె కదలి నాతోఁ గూడి
నీ వేల వత్తమ్మ నెమ్మి నుండి
కదళికాకాంతార! కదలి రా ననుఁ గూడి
నీవేల వత్తమ్మ నెమ్మి నుండి
శ్రీవిశాలాక్షి! విచ్చేయు నాతోఁ గూడి
నీవేల వత్తమ్మ నెమ్మి నుండి
నాతోడఁగూడి యింతగ్రహ! యేటెమ్ము
నీవేల వత్తమ్మ నెమ్మినుండి
తే. రండు ననుఁ గూడి యోపరివ్రాట్టులార!
వత్సలత గల్గి మీరేల వత్తు రయ్య!
పరమనిర్భాగ్యుఁడైననాపజ్జఁ బట్టి
కటకటా! సౌఖ్యజలరాశిఁగాశిఁ బాసి. 140
వ. అని యెట్టకేలకుఁ గాశీనగరంబు వెడలి కొంతదవ్వు నడచి
కాశీవిప్రయోగతీవ్రవేదనాదూయమానమానసుం డై వద

నంబు వఱువట్లు పట్టం బొసంగులు గుఱివడ నుహ్వాసుచు నొక వటవిటపినీడ నజ్జటాధరుండు చదికిలంబడిలోపాము ప్రక్లినియె.

తే. భూమిపతిపుత్త్రి ! చెప్పుమా బుద్ధిగలిగి
కాశి వెడలంగ వలసె నేకారణమున
కారణము లేక యొరులకు కలుగు నెట్లు
సుఖము దుఃఖము నరునకు సులభశీల ? 142

వ. కార్యంబులయందుఁ గుంకుమం బగునది దేశాపేక్ష; దివంబు నందు కమలవికాసంబు, రాత్రియందు గుముదోత్పలవికాసంబు నగునది కాలాపేక్ష; పుణ్యవంతునకు సుఖంబు, పాపిష్ఠునకు దుఃఖంబు నగునది యదృష్టాపేక్ష; సర్వంబును నీశ్వరేచ్ఛాయత్తం బగునది యీశ్వరాపేక్ష; విశ్వంబును గ్రహావశం బగునది గ్రహాపేక్ష; మాకుఁ జూడ నీశ్వరప్రేరణంబునం గర్మంబు సుఖదుఃఖంబుల నాపాదించు; ఈశ్వరుం డెవ్వని రక్షింపవలసె వానిచేఁ బుణ్యకర్మంబులు చేయించు నెవ్వనిం జెఱుపవలసె వానిచేఁ బాపకర్మంబులు చేయించు అవిద్యాస్మితరాగద్వేషాదిలక్షణక్లేశపంచక మూలంబున గదా కర్మాతిశయంబు? అక్కర్మఫలం బిహలోకపరలోకంబులం బ్రాణు లనుభవింతురు. కర్మంబునకుమూలభూతం బైన క్లేశపంచకం బెంతకాలం బనువర్తించునంతకాలంబునకుఁ ద్రివిధంబు పరిపాకంబు నానావిధయోనిజన్మప్రాప్తియునాయువు సుఖదుఃఖఫలోపభోగంబును జన్మంబునజన్మహేతుకర్మంబు చరితార్థం బయ్యెనేనియు నవశిష్టంబు లై యాయుర్హేతువులు భోగహేతువులు నైన కర్మంబులకు ఫలానురూపం బైనభోగంబులు బరమేశ్వరుండు గల్పించుచుండు. 143

తే. ఏమి చెప్పఁగ నున్నది? యేవిధమునఁ
గాశి వెడలించుచున్నాఁడు కాలగళుఁడు
మనము లోఁగితి మేని లోఁగునె శివాజ్ఞ?
యుడుము నడికిన నడుకునే బడియ పెట్టు? 144

వ. అని వెండియు. 145

సీ. వక్షస్స్థలంబున వైచు మంత్రము చెప్పి
జమిలిపాములరాజుజన్నిదంబు
జడ లల్లి చొల్లియం బిడి యొక్కసకెముగా
బాలేందుశకలంబుఁ బదిలపఱచుఁ
గంఠమూలమునందుఁ గస్తూరిమాఱుగాఁ
గాలకూటవిషంబుఁ గీలుకొలుపుఁ
గటిభాగమునయందుఁ గట్టు రింగులువాఱ
మెఱుఁగారు మువ్వన్నె మెకముతోలు
తే. గట్టువాలుపడంతి చక్కఁడముఁ దోఁపఁ
దఱచు గైసేయుచుండు నాతల్లి కాశి
యయిదుక్రోసులపొలములో నంత నంతఁ
జావు కుండంగఁ జచ్చినజంతువులకు. 146

చ. అని యెదురుండి మ్రొక్కి నయనాంబురుహంబుల బాష్ప
బిందువుల్ చినుకఁగ, వెక్కివెక్కి కలశీసుతుఁడోయన నేడ్పు
నీరెలుం, గున నొకకొంత కొంత మఱి గ్రుమ్మరు మిన్నున
మ్రోవ నుద్ధుర, ధ్వనిఁ బఠియింపఁ జొచ్చెఁ బ్రణవంబునఁ
గూర్చినమంత్రరాజమున్. 147

వ. అచ్చోటు గదలి కతిపయప్రయాణంబుల వింధ్యాచలంబు
డాయం జనుదెంచి విషమదృషత్ ఖండవిలసనస్థలంబును

జపతత్పరకోటీరజటాలులగు నజగరగళ గుహానివిష్టాన్యతనిష్ఠుర
పవనసాధుసిద్ధమానవమహాసిద్ధులాంఛనంబులు సుగ్రీవరశ్మి భ
చటులచపేటపాతమోహితగోహితంబులు సముద్ధత సుబద్ధము
కంఠకకోకిలఘుఘుధ్వానముయుమయుమా యు మారుతిస్ఫురజ్జ
క్రోడంబులు శ్రీడచ్చిక్రోడశశాదాశాఖశాఖాశిఖావిశిష్ట
మాణిక్యశేఫాలికాకుసుమకేసరజగ త్రసర ధూమ్రవాసర
కరకవ్రాతంబులు బహుపతసపనవిలసితశాఖేశ్వరధఫల
భక్షణాపుల్లగల్లఫల్లూకవ్రాతంబులు నగు గుహాగహన
మధ్యంబున. 148

సీ. యక్షరాజు బెంచి యక్షిణీకాంతల
వశ్యాపూరము నిచ్చు వర్తి మిగిలి
పలుమారు నట దండపాణి సౌహార్దంబు
భావించి భాసించి పలకరించు
సంభ్రమోద్భ్రమముల విశ్వాసపాత్రంబు
సౌవిసల్లుల వద్ది సంస్మరించు
విఘ్నజాఘోరసిద్ధివినాయకకపర్ది
చింతామణీగణేశులు బొగడు

తే. జ్యేష్ఠసౌభాగ్యసుందరిచిత్రకంఠ
వికటదుర్గామహాదేవి విశ్వబాహ
శాటకాదేవతల నిజస్వాంతవీథిఁ
గాంచి గబ్రాల్పు సర్వాంగకములఁ దపసి. 149

క. త్రిణయనుని రాణివాసము
వణిమాద్యైశ్వర్యవితరణామరతరువుఁ

మణికర్ణిక ముక్తివధూ
మణికర్ణికఁ దలఁచుఁ దపసి మానసవీథిన్. 150

సీ. కరవల్లిఁ బఱియించుఁ గరము సంశోధించుఁ
బ్రాణోపనిషదభిప్రాయ మరయుఁ
బరిపాటి ముండకోపనిషత్తుఁ దాపనీ
యోపనిషత్తు నభ్యుపగమించు
రక్షించు నథర్వవేదశిరఃప్రపంచంబు
లాంగణ్యకము త్రోవ లరసి చూచుఁ
ప్రశ్నోపనిషద్ధపరిమళంబు గ్రహించు
శ్రీభగవద్గీతఁ జిత్తగించుఁ

తే. దలవకారంబు శ్వేతాశ్వతరము ననెడు
సుపనిషత్తులు దలపోయు నొయ్య నొయ్యఁ
గాశికాక్షేత్రవిప్రయోగప్రభూత
హృదయసంతాపశాంతికై యిల్వలారి. 151

వ. అప్పుడు. 152

మ. క్షితిపాలోత్తమవంశభూషణము, లక్ష్మీభారతీపార్వతీ,
ప్రతిబింబంబు సమగ్రకాంతిమతి లోపాముద్ర వీక్షించి య
ద్భుతముం బొందుచు వింధ్యనామకమహాభూమీధరారణ్యదే
వత లందంద నమస్కరింతురు మనోవాత్సల్య మొప్పారఁగన్.

మ. నలి వింధ్యాచలకాననాంతరమున న్వారాణసీత్యాగవి
హ్వలభావంబున నిల్చి నిల్చి హర! నీహారాంశుమూర్ధన్య! ని
ర్మల! కాశీశ్వర! నీలకంఠ! యనుచున్ మ్రాన్పన్ను వాటిల్లఁ ద
త్కలశీసూనుఁడు మూర్ఛఁ గైకొనుసమగ్రంబైన తద్వేదనన్.

వ. వెండియుఁ గుంభసంభవుండు. 155

చ. దురితము లెన్ని చేసితినొ తొల్లిటిజన్మమునందుఁ గాశికా
పురమున సర్వజంతువులు భూరివిముక్తులు గొల్లలాడఁగా
హరహర! నెత్తిఁజేతు విడి యశ్రులు గన్నుల నొల్కనిప్డు నే
గరినిభయానతో నిదె పోకాలెదమిన్నులు వడ్డచోటికిన్.

తే. ఏల మ్రింగితి వాతాపి నిల్వలుఁ? నిల
నేల త్రోచితి దివినుండి యోలి నహుషు?
నా ప్రభావంబు గాదె న న్నదిరిపాటు
కాశి వెడలంగఁ ద్రోచె నిష్కారణంబ. 157

సీ. ఎన్నఁడు చూతునో యింకొక్కమాఱేను
బ్రకటకైవల్యాంబురాశిఁ గాశి?
నెన్నఁడు చూతునో యింకొక్కమాఱేను
జగదేకపావని జహ్నుకన్య?
నెన్నఁడు చూతునో యింకొక్కమాఱేను
మహిమాస్పదము ముక్తిమంటపంబు?
నెన్నఁడు చూతునో యింకొక్కమాఱేను
విశ్వలోకారాధ్యు విశ్వనాథు?

తే. నింక నెన్నఁడు చూతునో యేను డుంఠి?
నింక నెన్నఁడు చూతునో యేను దుర్గ?
నింక నెన్నఁడు చూతునో యేను వటుకు?
నింక నెన్నఁడు చూతునో యేను గుహుని? 158

అగస్త్యుండు లోపాముద్రతోఁ గాశిఁ బెడఁబాయుట
వింధ్యగర్వాపహరణము

వ. అనుచు నల్ల నల్లన వచ్చుకుంభసంభవు దవ్వుదవ్వులం గాంచి
కాంచనశిరశ్శృంగశృంగాటకంబులం గమలభవాండకటా

హంబు లుద్ఘాటించుతనమేటిపాదవు నేలసపాటంబుగా వంచి వింధ్యాచలంబమ్మహానుభావు నెదుర్కొనియె. అప్పు డర్కునిరథంబుచక్కఁ జాయ నడచె. పవనస్కంధంబులు నిర్బంధంబు లుడిగె. ఇందుండు చిందిలిపడసాగె. మంగళబుధ బృహస్పతిశుక్రశనైశ్చరరాహుకేతువులు దమతమతాన కంబులు దప్పకచరింపం దొడఁగిరి. విశ్వప్రపంచంబుసర్వంబును గ్రామంబున యథాపూర్వంబునం బ్రవర్తిల్లె. కాలంబు లేర్ప డియె. అనంతరంబ పురుషాకారంబు దాల్చి యజ్జగతీధరంబు గొన్ని యంజలం బ్రత్యుద్గమించి. 159

సీ. ప్రణవపంచాక్షరోపనిషత్ప్రపంచంబుఁ
గడదాఁక నెఱిఁగినకఱతలాని
వాతాపిదైత్యు నిల్వలునితోఁ గూడంగ
జఠరాగ్ని వేల్చినసవనకర్త
గోపించి నహుషునిఁ గుంభీనసంబుగా
హుంకార మిచ్చినయుగ్రతేజు
వానకాలమునాఁడు వండుపట్టినసీటి
కాలుష్య ముడిపెడుకతకఫలముఁ

తే. బాండుభసితత్రిపుండ్రాంకఫాలభాగు
భద్రరుద్రాక్షమాలికాభరితవక్షు
భార్యయును దాను నేతెంచుపరమశైవుఁ
గాంచె వింధ్యాచలేంద్రంబు కలశభవుని. 160

క. కాశీనగరీవిరహ
క్లేశభవక్రోధవహ్నికీలల నాశా

కాశిధరిత్రీవలయము
లాశుగతిం గాల్పఁ గడఁగుఁ బ్రళయవహ్ని. 161

వ. కాంచి యక్కుంభినీధరంబు కుంభసంభవు నతిథిసత్కార సంభావనావిశేషంబులం బరితోషంబు నొందించి కరాంభోరుహంబులు మోడ్చి 'మహానుభావా! నీయాజ్ఞాప్రసాదభావంబున నను గృతార్థుం జేయు' మని పలికిన. 162

సీ. వింధ్యాచలేంద్ర! పృథ్వీభృత్కులశ్రేష్ఠ!
దక్షిణాపథము తీర్థంబు లాడఁ
బోవుచున్నాఁడ నీ వుబ్బఁబోకుము నేను
బెద్దకాలమునాఁటి పెరిచ గాన
లావు చాలదు జరాక్లైబ్యంబుకతమునఁ
బోడ వెక్కునపుడు డిగ్గునపుడును
నభ్రంకషము లైనయా నీశిరశ్శృంగ
శృంగాటకము లిట్లు చిఱుతపఱచి
తే. యనఘ! నేఁ గ్రమ్మఱఁగ వచ్చునంతదాఁక
నుండవలయు ధరిత్రిలో నొదిఁగి నీవు
చేయు నాయాజ్ఞ లెస్స యాఁ జేయకున్న
నెఱిఁగెదవు గాక రజ్జాడ నేల యిప్పుడు? 163

వ. అనిన వింధ్యంబు మహాత్మా! చరాచరంబైనజగంబునందు నీయాజ్ఞఁ జేయనివారునుం గలరె? నీవు మరలి విచ్చేయు నంతదాఁకను నిట్ల యుండెద ననినఁ గుంభసంభవుం డతని దీవించి నిజపాదాంభోరుహవిన్యాసంబుల విశ్వవిశ్వంభరాభాగంబు భాగ్యవంతంబు గావించుచు దక్షిణదిశాభిముఖు

డయి చనియె నని చెప్పిన నైమిశారణ్యవాసు లటమీఁది
వృత్తాంతం బెయ్యది యనుటయు. 164

ఆశ్వాసాంతము

ఉ. ఒలవద్భాసురహాగొంతిపుస్త్రధరణీపాలావరోధాంగనా
విలసన్మంగళసూత్రరక్షణకళావిఖ్యాతకారుణ్య! యు
త్కలకర్ణాటతురుష్కరాట్పరమమిత్రా! కుండలిస్వామికుం
డలపూజాపరతంత్రధీవిభవ! పంటక్ష్మాపచూడామణీ! 165

క. భూపాలమథన! జంబూ
ద్వీపేశ్వర! విమతరాయవేశ్యావిటధా
టీపటహడాన్నినాదా
టోపప్రక్షుభితదిక్కుడుంగక్రోడా! 166

ఉత్సాహ—
బంధులోకపారిజాత! పంటవంశపావనా!
సంధివిగ్రహప్రధానషడ్గుణా! విశారదా!
గంధవాహభుక్కలాపకంఠకోణనాభిని
ర్గ్రంధసక్రియామహాప్రగల్భకీర్తివైభవా! 167

గద్య. ఇది శ్రీమత్కమలనాభపౌత్ర మారయామాత్యపుత్ర సుకవిజనవిధేయ కవిసార్వభౌమ శ్రీనాథనామధేయప్రణీతంబైన కాశీఖండం బనుమహాకావ్యంబునందు ద్వితీయాశ్వాసము.

తృతీయాశ్వాసము

శ్రీమద్దేసటివంశ
గ్రామణి! మూర్ధాభిషిక్తకంఠీరవ! సు
త్రామనిభవైభవోన్నత!
భామాపాంచాల! వీరభద్రనృపాలా! 1

వ. అక్కథకుండు శౌనకాదిమహామునుల కిట్లనియె. 2

ఉ. ఆపృథివీధరంబు హృదయంబున సంతస మందె నెంత
యుం, గోపనుఁ డెల్లకాలమును గుంభభవుం డతఁ డిప్పుడు
గ్రుద్ధుఁడై, శాపవిషప్రయోగమునఁ జంపఁ దలంచిన నడ్డ
మెవ్వ ర, ష్టాపదశైల మిప్పటికి శంక వహింపకయుండుఁ
గావుతన్. 3

వ. అని కుంభసంభవుని ప్రత్యాగమనంబుఁ గోరుచు వింధ్యా
చలంబు వంధ్యోదయం బై వసుంధరాగర్భంబున నడంగి
యుండె. 4

తే. ముని జటాధారి శివభక్తుఁ డనఘమూర్తి
యెవ్వఁ డేతెంచు నప్పు డత్తెత్తిచూచుఁ
గుంభసంభవుఁ డనుకోర్కి కొనలుసాఁగ
వసుమతీధర మతఁ డేల వచ్చు మరలి? 5

తే. మొదలఁగల పెన్కువయుఁ(న్ను)బోయి ముడిఁగె నద్రి
కలశజునినేత్రములఁ గెంపు గాన నైన
నొరుని నైశ్వర్య మీక్షించి యుపతపించు
నట్టిఖలునకు నిది పెద్ద యానె? తలఁప. 6

క. సిద్ధింప వీప్సితంబులు
సిద్ధించెన యేనిఁ బిదపఁ జెడు నన్యునిసం
వృద్ధిఁ గనుంగొని యెవ్వని
బుద్ధి నసూయాగ్రహంబుఁ బొందు నతనికిన్. 7

తే. అప్రయోజన మభివృద్ధి నతిశయిల్లు
నప్రయోజన మడఁగుఁ గాలాంతరమున
నకట! యీర్ష్యాగ్రహగ్రస్తుఁ డైనయట్టి
ఖలునిసంపద విధవచన్నులును బోలె. 8

వ. ఆసమయంబునం బాకశాసనపావకపరేతరాజపలలాశిపాశి
పవనపౌలస్త్యపశుపతులు పరమహర్షోత్కర్షంబున నగస్త్య
మహర్షిం బ్రస్తుతించిరి. పతంగుండు బసిండికొండనెత్తంబు
చక్కటివియత్తలంబున నడవం దొడంగె. 9

సీ. స్ఫటికభూములయందుఁ బ్రతిబింబములు చూచి
యితరాశ్వబుద్ధి హేషిత మొనర్చుఁ
బద్మరాగోపలప్రస్థభాగములందుఁ
జరమసంధ్యాశంక జాడ్య మందు
మరకతమణిశిలామధ్యంబునందు దృ
శ్యాదృశ్యమూర్తులై యలరుచుండు
వైడూర్యమాణిక్యవప్రాంతరములందు
సలిలాభిలాష నౌదలలు వాంచుఁ

తే. గిన్నరస్త్రీలఁ జూచి లంఘింపఁ బాఱుఁ
గావరం బెత్తి యుద్దామకామవృత్తి
వాయుజవములు రవితేరివారువములు
వేల్పుగుబ్బలిప్రస్థానవీథియందు. 10

సీ. తమతనుచ్ఛాయ మేఘములు పచ్చనివన్నె
నుభయపక్షములు నై యూఁగియాడఁ
గళ్లెలఁ దెగినసృక్వముల క్రొన్నెత్తురు
లాననంబులకుఁ గెంపావహింప
నుడుపథంబునయందు నుండినగతి ధార
గమనవేగంబునఁ గానఁ బడఁగ
శుకముఖద్విజకోటి సులభకౌతూహల
వ్యతిషంగమునఁ జేరి యనుసరింపఁ

తే. జిలుకలును బోలె హేమాద్రిశిఖరశృంగ
కల్పవృక్షాటవీవాటికలఁ జరించె
మహిధరముసేయునంకిలి మానుటయును
వనజవనబాంధవుని తేరివారువములు. 11

సీ. ఆకాశవాహినిసైకతంబుల ఖురాం
చలటంకములు గ్రుంగ జటులువడిన
శాంతకుంభాచలస్థపుట స్థలంబులఁ
జక్రాభిహతివడి చాలకున్న
బహులదూర్వాశంకఁ బ్రణతదేవకిరీట
మరకతద్యుతులకై మరులుగొన్న
నిందుబింబముఁ జూచి చెందుప్పుగలుసావి
యలు లెత్తి నాకంగ నాసపడినఁ

తే. బసిఁడిగిలుకలచెర్కోలఁ బరిఢవించి
కఠినహుంకార మొనరించి కనకరథము
వారువంబులఁ బఱపె దుర్వారలీల
బిరుసు తహాతహా వినువీథిఁ బిచ్చుకుంటు. 12

అగస్త్యుండు దక్షిణకాశికిం బోవుట

వ. ఇవ్విధంబునం భువనోపద్రవంబుఁ బ్రశాంతిం బొందించి దక్షిణకాశీసందర్శనంబునంగాని కాశీవియోగవేదనాభారంబు డిందుపడ దని డెందంబున నిశ్చయించి మందమంద ప్రయాణంబులఁ గెంపలిరాకుఁ బోఁడియాకులతం బొందికసు గందకుండ ముందఱఁ బిఱిందె నడపించుచు నెడనెడఁ బుణ్యవాహినీతీర్థంబులఁ గ్రుంకులువెట్టి యష్టమూర్తి నభ్యర్చించుచుం గొన్ని వాసరంబులకుఁ గుంభసంభవుండు గోదావరి నొరసి కొనుచు నాంధ్రదేశంబున నరుగునప్పుడు. 13

మ. ఆహారారంభములందుఁ బ్రస్రవణశైలాధిత్యకాకందరా
కుహరక్రోడకటాహగద్గదరద్గోదావరీసింధువా
ర్లహరీశీకరమాలికాశిశిరము ల్పంపాసనల్ వండకా
గహనగ్రాహులు వాయువుల్ దపసికిం గావించెనాహ్లాదమున్.

తే ఋషికిఁ బంపాసరోవీచిస్పృశితశిశిర
గంధవాహప్రవాహసంబంధములును
గాశికాక్షేత్రవిప్రయోగప్రభూత
తాపశాంతి యొనర్పంగ నోప వయ్యె. 15

సీ. పట్టుగా శ్రీవీరభద్రేశు సేవించి
యిలసోమనాథునంఘ్రులకు నెరఁగి
పురశాసను ననంతభోగీశ్వరస్వామి

హిమశైలకన్యకాధీశుఁ గొల్చి
పద్మాద్రిపై రుద్రపాదంబు లర్చించి
చేరి మార్కండేయశివు భజించి
కోటిపల్లీతీర్థకుండలాముఖముల
నర్ధేందుధరు విరూపాక్షుఁ దలఁచి
తే. పల్వొలస్థానమున భూతభర్త నిలిపి
కాంతమున వృద్ధగంగలోఁ గ్రుంకువెట్టి
దక్షవాటిక సప్తగోదావరమున
మునిఁగి భీమేశ్వరునిఁ గాంచె మునివరుండు. 16

శా. ప్రాతఃకాలము తీవ్రభానుఁ డుదయింపన్ సప్తగోదావరీ
స్రోతఃపూరమున న్మునింగియభవున్ సోమార్ధచూడామణిన్
జ్యోతిర్లింగమయస్వరూపుఁ గొలిచెన్ శుద్ధాంతరంగంబునన్
బాతివ్రత్యమహాప్రభావనిధి లోపాముద్ర భీమేశ్వరున్. 17

మ. మునిచూడామణియెల్లసత్కళలకున్ మూర్ధాభిషిక్తుండుగా
వునఁ జారీకరణాంగహారముల తావుల్ మించి కీర్తించుచున్
శనివారోత్సవవేళఁ గన్గొనియె నాస్థానంబునన్ రాజనం
దనయుం దానును దేశిమార్గమునగంధర్వాప్సరోనృత్తముల్.

వ. అంత. 19

తే. కుంభజుఁడు దక్షిణాభిముఖుం డగుటయు
నదను వీక్షించి వచ్చెనో యనఁగ వచ్చె
శంబరారిప్రతాపాగ్నిసామిధేని
నవశరద్వేళ శ్రీభీమనాథుఁ గొలువ. 20

తే. జిగురుకొన్నరజస్స్ఫూర్తిఁ జెఱఁగుమాసి
జలజకుండోదకంబుల జలకమాడి

మలయజాచ్ఛపయోధరమండలు లగు
దిగ్వధువులందు రుచిఁ బ్రవర్తించె నినుఁడు. 21

సీ. అభినవోన్మేషజం బైనట్టితొలుచూపు
కౌస్తుభాలోకరేఖలకు నలుఁగ
సాగభంగం బైనయావులింతకు వేల్పు
లంగుటిస్ఫోటనం బాచరింప
సౌఖశాయనికు లై సంవర్తభృగ్వాది
మునులు హస్తాంభోజములు మొగుడ్ప
ధృతచేతనంబు లై దివ్యాయుధంబులు
జయజయధ్వనులతో సంస్తుతింప

తే. నలువతేనులు బేలెపెంజిలువతేని
యరవిరుబుసంపుఁబొరలు మై నంటియుండ
నిదుర మేల్కాంచి కూర్చుండె నుదధినడుమ
విష్ణుఁ డఖిలేశ్వరుఁడు శరద్వేళయందు. 22

వ. వెండియుఁ బాకదశావిశీర్ణదిశాశాల్మలీగుల్మతూలరాశిదేశీయం
బులు వియదురగనిర్మోకశకలవిభ్రమంబులు నభ్రముపతిశరీర
శుభ్రంబులు నగుసితాభ్రంబు లభ్రమంబునం బరిభ్రమించి
ఖండఖండంబు లై యాఖండలకోదండదండంబుల గగనమండ
లంబున నలంకరించె కొదమ మొగుళ్ళు దెరలును దండంబడఁ
బడు వలుఁదవడగండ్లు పుష్పాంజలులును నుఱుముచప్పుళ్లు
మర్దళ ధ్వనులుగా గగనరంగస్థలంబునం గ్రొమ్మెఱుంగు
మెఱుంగుఁబోఁడి గొండ్లి పరిఢవించె. మత్తవనమయూరమత్త
కాశిని (స) కలహంస మాధు (ర) కంఠ కేకాగీతికావసానంబునం
గళాపించె. కుంభద్రోణంబు లంభోధరంబులు గురిసి వెలిసిన

యనంతరంబ యంతంత నుట్టిపడు నట్టిసలిలబిందువులన రజనీ
శుక్తిముక్తాఫలంబులు నక్షత్రంబు లంతరిక్షంబున సంప్రేక్షణీ
యంబులయ్యె. దాక్షారామకటకాప్సరస్తాటంకినీవదనారవింద
లావణ్యబిందునిష్యందంబు చందురుండు కందర్పదిగ్విజయకీర్తి
స్ఫూర్తియుంబోని యచ్చవెన్నెల విచ్చలవిడిం గాయం
దొడంగె. కుముదంబులు ముసిఁబందె. లాంగలి చెంగలించె.
తెల్లులసిల్లె. కాసర గాంచె. వాస దోరగిలంబారె. పయ్యెద
విసరె. వాడిమంచటిలియె. కరి మదంబుఁ గురిసె. నందిపోతు
పోతరించి ఖణిల్లున ఱంకె వైచె. అసలదుగువడియె. నెఱిని
నిసుక వెస దీపి చూపె. నీడ సవియయ్యె. ఏకాకులపొన్న
క్రొన్నన పెరిఁగె. వరిగ విరిగె. గసగస యొసక మెసఁగె. పెస
రుసురుకొనియె, తవిద పొదలె. తెక్కప్రాసంగు వొండముక్క
వడియె. మదకలకలహంససంపద సల్లాపకోలాహలవ్యాజృంభ
కరంభితకకుబంతంబు లై (న) విహారవేశంతంబులు కాంతా
కుచద్వయ ద్వయసవాఃపూరవంతంబు లయ్యె నయ్యవసరంబున.

తే. కార్తికపువేళ భీమశంకరునినగర
విరథ్యసంస్తంభయిత దూరె విమలబుద్ధిఁ
దొయ్యలియుఁ దాను జిచ్చుఱతోరణంబు
కలుషసంహతిసంహారకారణంబు. 24

క. దక్షిణవారాణసి యగు
దాక్షారామంబు సొచ్చి తరుణేందుధరుఁ
వీక్షించినకోలెను గా
శీక్షే త్రాలోకసుఖము చేకుఱె మునికిన్. 25

క. క్లేశంబును సౌఖ్యంబును
నాశువునను గుంభజన్ముఁ డభిమర్శించెం
గాశీవిరహము దక్షిణ
కాశీసంగమము వరుసఁ గలిగినకతనన్. 26

వ. పరోపకారపరుండయినవానికిఁ బుంఖానుపుంఖంబు సంపదలు సంభవించు. తీర్థస్నానదానజపహోమదేవతార్చనాదులు పరోపకారంబునుంబోల నేరవు. పరాపకారంబునకంటె నధర్మంబు లేదు. లోకోపకారపరాయణుం డైనవాతాపిదమను కింతవింత లేసి ప్రయోజనంబులు సమకూఱకుండునె? ఇవ్విధంబున భోగమోక్షనివాసంబైన దాక్షారామంబునం గొన్ని దివసంబు లుండి కొల్లాపురంబునకు శ్రీమహాలక్ష్మి దర్శింపం (బోఁ) దలంచి యమ్మైత్రావరుణుండు. 27

అగస్త్యుండు కొల్లాపురంబున కేఁగుచు మార్గమున వీరభద్రేశ్వరు దర్శించుట

సీ. అంతరగప్రవాహమై యావిర్భవించె నే
ధరణీధరముపొంతఁ దల్యభాగ శే
పాతె నేశైలంబుపాదమూలంబునఁ
గల్లేటితో స్పర్ధఁగంగ వాసి
యుదయించె నేకొండయుత్తరాశారసా
తలకుక్షిఁ సప్తగోదావరంబు
జనియించె నేశిలోచ్చయము దక్షిణమున(ఁ)
గణ్వవాహిని యుప్పుఁగడలికొమ్మ
తే. భర్మగిరితోడఁబుట్టు వేషవ్రతంబు
బలసియుండు నేయద్రికిఁ బంచలింగ

మట్టిశ్రీవీరభద్ర మహాచలమున
కరుగుదెంచెను వింధ్యదర్పాపహారి. 28

వ. ఇట్లరుగుదెంచి లోపాముద్ర కిట్లనియె. 29

తే. దక్షిణానందవిపినమధ్యంబునందు
క్రతువిధిధ్వంసవేళ దేవతల నురిపె (సె) (పి)
వీరభద్రేశుఁ డీయద్రి వెన్నుఁ దన్ని
గౌతమీవారిఁ దనవాలు గడిగినాఁడు. 30

తే. పంకజక్ష్మాధరము వీరభద్రగిరియు
నంధ్రభూమికి వక్షోరుహద్వయంబు
భువనచక్షుఃకరండ మంభోరుహాక్షి !
గౌతమీగంగ ముత్యాలకంఠమాల. 31

సీ. ఎవ్వాఁడు డాచేతి క్రొవ్వాఁడినఖములఁ
జిదిమె భాషాదేవిచిగురుముక్కుఁ
గనకమేఖలఁ గ్రుచ్చి కట్టె నెవ్వాఁడు లీలఁ
జెఱఁగుపైఁ బూషాస్యు మెఱుఁగుపండ్లు
కొసర కెవ్వఁడు పదాంగుష్ఠభాగంబున
నుడురాజుపొట్టగోంజులుకనూఁదెఁ
దఱిగె నెవ్వఁడు ఖడ్గధారాంచలంబున
నగ్నినాలుక లేదు నంటఁదఱిమి

తే. మోదెఁ నెవ్వాఁడు ముప్పదిమూఁడుకోట్ల
వేలుపులఁ బారఁ బార వెన్వెంటఁ దఱిమి
యట్టిశ్రీవీరభద్రుఁ డీయద్రిమీఁద
భద్రకాళియుఁ దా నుండుఁ బద్మనయన! 3

తే. బ్రహ్మసంవేద్య మాదిగాఁ బట్టి సొంత
మతిస ! గోదావరీనదీహారమునకు
నడుమ నాయకరత్న మై నలువు మిగులుఁ
బంచలింగాశ్రయము వీరభద్రశిఖరి. 33

వ. అని చెప్పి యచ్చోట గదలి ప్రతిదినప్రయాణంబుల. 34

క. క్షీరారామంబునఁ బ్రా
చ్యారామంబునను నాదిమారామమునం
దారాధిపచూడామణి
నారాధించెను మునీంద్రుఁ డతివయుఁ దానున్. 35

వ. అనంతరంబయ్యమునిసింహంబు సహ్యగిరికన్యకాప్రవాహంబునఁ గృతావగాహుం డయి కదలి పశ్చిమాంభోధితీరంబున సౌరాష్ట్రసోమనాథేశ్వరశరచ్చంద్రచంద్రికాధౌతకలధౌతసౌధవీధికాసముల్లిఖితగగనమండలం బయి పదునెనిమిదియోగపీఠంబులందును సుప్రసిద్ధం బైనకొల్లాపురంబునకుం జని యందు. 36

ఉ. శ్వేతవరాహకల్పమున వెన్నుఁడు సూకరవేషధారి యై
యాతతదంష్ట్రికాంకురమునందు ధరిత్రి వహించియుండఁగా
నాతనిమీఁద లేఁతపాలయల్కు వహించి తొలంగి వచ్చెనో
యీతరలాక్షి? యండ్రు బుధులెప్పుడు నాజగదేకమాతృకన్.

తే. భద్రకాళికయై ఘోరపరశుధారఁ
గ్రూరదైత్యునిఁ బొరిగొన్న ఘోరమూర్తి
శౌరివక్షస్థలీనభశ్చంద్రరేఖ
శ్రీమహాలక్ష్మి భక్తి వీక్షించె దపసి. 38

క. కొల్లాపురిలక్ష్మికిఁ బ్రణ
మిల్లిరి పులకాంకురములు మేనులఁ బొడమన్
హ్రీల్లేఖామంత్రోపని
షల్లతికాకుసుమమునకు సతియుం బతియున్. 39

వ. అనంతరంబ కుంభసంభవుం డాత్మగతంబున. 40

అగస్త్యుండు లక్ష్మిని స్తోత్రముచేయుట

సీ. క్షీరోదకన్యకు శ్రీమహాలక్ష్మికిఁ
గమలాయతాక్షికిఁ గంబుకంఠి
కఖిలలోకేశ్వరి కామ్నాయవినుతకుఁ
గనకకైతకపుష్పగర్భగౌరి
కరుణాధరోష్ఠికి నమరకోటికిరీట
కోటివిటంకసంఘాటఘటిత
రత్నాంకురప్రభారాజినీరాజిత
శ్రీపాదపద్మపీఠోపకంఠ

తే. కంబురుహనాథుదేవికి నాదిశక్తి
కిందిరకు లోకమాతకు సిగురుఁబోఁడి
కలరువిల్కానితల్లికి నాశ్రితార్థ
కల్పవల్లికి మ్రొక్కఁగఁ గంటి మంటి. 41

వ. అని అనంతరంబ. 42

తే. చంద్రమునియందు జ్యోత్స్నవు చంద్రవదన!
ప్రభవు వాసరకరునందుఁ బద్మనయన!
దాహశక్తివి పూఁబోఁడి! దహనునందు
మ్రొక్కెదను నీకుఁ గల్యాణమూర్తి! లక్ష్మి! 43

తే. బ్రహ్మ పుట్టించు మనుచు నారాయణుండు
హరుఁడు హరియించు భువనంబు లవసరమున
నెంచ సమకూఱు వీరికి నీప్రభావ
మీఱ గలుగంగఁ బట్టె కా కిందువదన! 43

ఉ. పండితుఁ డాతఁ డాతఁడు ప్రభావసమగ్రుఁ డతండు శూరుఁ డా
తండు వివేకి యాతఁడు వదాన్యుఁ డతండు మహాకులీనుఁ డా
తండు కళావిదుం డతఁడు ధన్యుఁ డతండు మనోజ్ఞమూర్తి యె
వ్వండు భవత్కృపాకలనవైభవలక్ష్మికిఁ బాత్రుఁ డిందిరా! 45

వ. పురుషుని యందు భాగ్యమును బోల్తుక యందు విలాసరేఖయుం
గరిహయములందుఁ బక్షిభుజగంబులయందు మహీరుహావళీ
హరితతృణంబులందుఁ బసులందును బెయ్యలయందుఁ గుక్క
లం, దనుదగు బెంపునొప్పు భవదంశముగా దెలంపనిందిరా!

ఉ. *ఎవ్వని నేని నీవు దయ నించుకఁ జూచిన వానిఁ జూతు ర
ప్పువిల్తుకానిఁగా సతులు భూపతిఁగా ప్రజ కల్పకంబుగా
నవ్విబుధార్తప్రతతి యంబుధిఁగాఁ గులగోత్రగోత్రముల్
కవ్వడిఁ గాఁ బరద్విషులు కర్ణునిఁగాఁ గవు లెల్ల శ్రీసతీ!

ఆ. కమలనయన! నీవు కలచోటు సరసంబు
నీవు లేనిచోటు నీరసంబు
కంబుకంఠి! నీవు కలవాఁడు కలవాఁడు
లేనివాఁడు నీవు లేనివాఁడు. 47

సీ. పరిపూర్ణహేమకుంభములు హస్తంబుల
ధరియించి యిరువంకఁ గరులు గొలువఁ

---

* ఈపద్యము మద్రాసు ఓరియంటలు లైబ్రరీలో నుండు నొకతాళపత్ర ప్రతిలోమాత్ర మున్నది. ఇతరము లగు పెక్కు ప్రతులయందుఁ గన్పట్టదు.

బహుళమై వరశంఖపద్మమహాపద్మ
మకరాదినిధులు నేమమునఁ గొలువఁ
వింజామరలు దాల్చి వెనుకదిక్కున దేవ
గంధర్వగుహ్యకాంగనలు గొలువ
నెలవంక బలువంక నింద్రాదిదివిజులు
సేవాంజలులు మౌళిఁ జేర్చి కొలువ

తే. భర్మపంకజకర్ణికాభద్రపీఠి
కాగ్రమున నిండుకొలువుండి యఖిలలోక
రక్షణము సేయు నిన్నేను బ్రస్తుతింతు
నసమసౌభాగ్యగుణధన్య! యద్రికన్య! 48

వ. పరమార్థవస్తువిభాగంబు సేయవచ్చిన శక్తిమంతుం డైన యీశ్వరునకు శక్తి యగునీకు భేదంబు లేదు, గావున శక్తుం డగు నీశ్వరునకుం గలసృష్టిస్థితిసంహృతి స్వభావస్వరూపంబు లైనకృత్యంబు లైదును నీయవి. దహనునకు దాహశక్తియు, నుష్ణాంశునకు దీధితియుఁ, జంద్రునకుఁ జంద్రికయుంబోలె నీశ్వరునకు నీవు సహజవు ధ్రువవు నై యుండుదు. ఇహజన్మజన్మాంతరంబుల విహితంబు లైనవ్రతదానాదులచేతసంచితంబు లైనదుర్రితంబులు నిరసింపఁబడుటం జేసి యేస్తరజస్తము లైనంతయు త్తమ్ములు విశుద్ధసత్త్వులయి నీతత్త్వంబుఁ జింతింతురు. భోగాపవర్గలక్షణం బైనఫలంబు పరమేశ్వరుండు పశుగణంబున కిచ్చునపుడు నిన్ను మున్నిడికొనికాని యీఁజాలఁడు. శబ్దబ్రహ్మంబు కారణబింద్వాత్మకంబై బిందునిష్యందత్వంబున (కుం)బురుషచ్ఛాయాప్రయత్నంబున మూలాధారావస్థితపవన సంధుక్షణంబునం జేసి

యభివ్యక్తంబై పరావాక్కనంబడు. ఆబ్రహ్మాం బీ[2]న్నాభిపర్యంతం బావాయువుచేత నభివ్యజ్యమానంబై విమర్శరూపంబైన మనంబుతోడం గూడి సామాన్యస్పందప్రకాశరూపిణియుం [3]గార్యబిందుతత్త్వాత్మికయు నీశ్వరాధిదేవతయు నై పశ్యంతీవాక్కనంబడు. ఆబ్రహ్మాం బావాయువుచేతన హృదయపర్యంతం బభివ్యజ్యమానంబై నిశ్చయాత్మకబుద్ధియుక్తంబై విశేషస్పందస్వరూపయునాదబిందుమయయుహిరణ్యగర్భాధిదేవతయునై మధ్యమవాక్కనంబడు. ఆబ్రహ్మాం బాస్యపర్యంతం బావాయువుచేతన కంఠాదిస్థానంబులయం దభివ్యజ్యమానంబై యకారాదిక్షకారాంతవర్ణమాలారూపంబై (నిశ్చయాత్మయై) శ్రోత్రగ్రహణయోగ్యంబై వైఖరీవాక్కనంబడు. ఈచతుర్విధసూక్ష్మస్థూలమాతృకాస్వరూప విట్టి (దేవీ!) నీకు నమస్కారంబు. 49

తే. అని నుతించినఁ బ్రియ మంది యబ్ధికన్య
కలశజునిఁ జూచి యి ట్లను గారవమున
ననఘ! నీస్తోత్రమునకు నాయాత్మ మెచ్చె
నీవు గోరినవర మిత్తు నెమ్మిఁ గొనుము. 50

వ. ఇంకఁ రాఁగలయిరువైతొమ్మిదవద్వాపరంబున నీవు వ్యాసుండవై వారణాశీపురంబున వేదపురాణసంహితాధర్మశాస్త్రంబులు వక్కాణింపంగలవాఁడవు ఇప్పు డొక్కహితంబు సెప్పెదఁ దుంగభద్రాతీరంబునఁ గిష్కింధాచలోపాంతంబున స్వామిమల యనుకాననంబునం గుమారస్వామి యధివసించియున్నవాఁడు. నీ వాచక్కటి కరిగి యతనివలన వారణాశీస్నానమాహాత్మ్యంబువినుమని పలికి లోపాముద్రంగనుం

గొని యక్కాంతకు ముద్రికాకటకహారకేయూరాదు లగు
దివ్యాభరణంబులఁ బ్రసాదించె. ఇవ్విధంబునఁ గొల్లాపురమహా
లక్ష్మిచేతఁ బ్రసాదంబు వడసి దంపతులు చరితార్థులయి సము
చితప్రకారంబున నమ్మహాదేవి వీడ్కొని స్వామిమలయుం జను
వార(ద్రై)రై కొన్ని పయనంబు లరిగి ముందటఁ గఠోరమదపరిణతి
దశావష్టంభసంష్టంభసముజ్జృంభమాన హేరంబపరిశనకులిశ
కఠోరకోటిభిద్యమానహాటకకటకటంకారఘుష్టి (త) తారాం
గణంబై చతుర్ద్వారంబులను జతురంతరచతుష్పథద్వారం
బుల షోడశగవాక్షంబుల ద్వాత్రింశత్సకలతోరణంబులఁ జతుష్ష
ష్టినాట్యకూటంబులను బంచాశదుత్తరసహస్రదీర్ఘికలను శత
సహస్రకోటిలింగంబులను దశసహస్రకోటిశక్తులనుం గోటి
తీర్థంబులనుం గలిగి వరాహకుండమల్లికాకుండక్షీరకుండాది
కుండంబులచేతనుఁ గదళీవనబదరీవనగౌరివనబిల్వవనాదిముఖ్య
వనంబులచేతను హాటకేశ్వరగుప్తమాహేశ్వర నందిమండల
నివృత్త్యాదు లయినదివ్యస్థానంబులచేతను రససిద్ధరసాయన
సిద్ధిమూలికాసిద్ధిపాదుకాసిద్ధ్యాదు లగుసిద్ధక్షేత్రంబులచేత
ను శోభితంబై దివ్యామృతనిర్మలశ్రీస్వయంభూజ్యోతిర్లింగ
మూర్తియగుమల్లికార్జున శ్రీమన్మహాదేవునకు నిజనివాసం
బై యభిరామంబై దివ్యంబునగు శ్రీశైలంబుఁ జేరవచ్చె
నయ్యవసరంబున. 51

అగస్త్యుండు శ్రీశైలంబున కేతెంచుట

మ. పరిరంభం బొనరించె గుంభభవునిం బాతాళగంగాంబునిర్ఝ
ర్ఝరకల్లోలఘటాపృషద్వ్యాళీకరప్రాలేయమ్ముల్ హాటకే

శ్వరజూటీకృతమాల్యకేసరరజస్సౌరభ్యసంపన్నముల్
కరివక్త్రాభరణాహిపీతపరిముక్తంబు ల్వనీవాయువుల్

శా. ఆమిత్రావరుణాంశసంభవుని వింధ్యాటోపవిధ్వంసి లో
పాముద్రాసహితుంగనుంగొని రియుత్పన్నప్రమోదంబునన్
వ్యాసుగ్రాహ్యపయోధరల్ కుటిలనీలాగ్రాలకల్ తథ్యమి
థ్యామధ్యస్థితమధ్యలాట్టవికసేవాధీశసీమంతినుల్ 53

సీ. వాతాపిదమనుండు పాతాళగంగయం
దఘమర్షణస్నాన మాచరించె
హాటకేశ్వరదేవు నారగ్వధంబుల
నర్చించె వింధ్యధర్పాపహారి
గగనర్షి వృషభుండు కంఠీరవానను
వైకుంఠబిలమధ్యవాసుఁ గొలిచె
నేకాంతరామేశు నిందుశేఖరుని ద
ర్శించె నీవారముష్టింపచుండు

తే. గూర్మి రంభోరువును దానుఁ గుంభభవుఁడు
కుంభినీధరదుహితృవక్షోజశాత
కుంభకుంభికాపరిరంభణోంభితాత్ము
శంభు శ్రీమల్లికార్జును సంభజించె. 54

మహాస్రగ్ధర. యమీ హృల్లేఖాదిమంత్రాభ్యసననిరతుఁడై
యాగమోక్తప్రకార, క్రమయుక్తిం గంధపుష్పాక్షతదళ
ములశ్రీకంఠు నర్ధాంగలక్ష్మిన్, భ్రమరాంబాదేవి నంతర్భ్రమి
మరఫలరసప్రహ్వామాతద్రుపుణ్యా, శ్రమవాటీహేమ
సింహాసనవిలసదధిష్ఠాన నర్చించె నిష్ఠన్. 55

తే. చెలువయును దాను నాశీతబిలసహస్ర
మార్గశాఖోపశాఖల మహానివరుఁడు
విధుకిరీటులఁ బూజించెఁ వెదకి వెదకి
యమృతమయలింగమూర్తుల నధికభక్తి. 56

వ. వెండియు నయ్యిల్వలమథనుండు యథావిధి మండూకకుండంబునం గ్రుంకె. పంచాక్షరీమంత్రసిద్ధుండు పంచధారాపల్లధారలను నిర్ఝరప్రవాహంబులం గృతావగాహుండయ్యెఁ బాటల జటాకిరీటుండు హాటకకూటశిరఃశృంగ శృంగాటకఘట్టంబునఁ గోటిలింగంబులం భజించె. లోపాముద్రాధిపతి యద్రికటకభద్రాసనంబున సమున్నిద్రప్రతాపముద్రావిద్రుతాక్షుద్రోపద్రవుండగుచు ద్యానవీరభద్రు శ్రీద్రవహారిద్రాక్షతంబుల భద్రదారుద్రుపారిభద్రద్రుమకోరకంబుల నారాధించె. బ్రహ్మర్షి బ్రహ్మపాదారవింద ద్వంద్వంబు హరిచందనచర్చామచర్చికల నర్చించె. సిద్ధతాపసమూర్ధాభిషిక్తుండు ఘంటాసిద్ధేశ్వరునివలన మంత్రసిద్ధి వడసె. మహాభాగుండు భోగవతీతీరంబున భోగేశ్వరు భోగాపవర్గప్రదు భుజంగభూషణు భజించె. నీవారముష్టింపచుం డిష్టకామేశ్వరునకుం బటిష్ఠనిష్ఠావిశేషంబులం దుష్టిఁ గావించె. భువనగోప్తసప్తమాతృకలఁ దలంచె. సహ్యాషదక్షునుండుముషితసకల కలుషం బగుకదళీవనవిషమభువి నిగమభోషకక్షపరిషదనుగతవృషభగమనుంగపటశబరభటు నటు (?) దుహితృపరివృఢు నశఠమతిం గొలిచె. అనంతరంబ యొక్కవివిక్తప్రదేశంబున సుఖాసీనుం డై. 57

తే. అర్థిఁ గుంభోద్భవుం డిట్టు లనియె సతికిఁ
భద్రలోచన! చూడు శ్రీపర్వతంబు
పాయ కిం దుండుఁ బార్వతీప్రాణవిభుఁడు
మల్లికార్జునదేవుండు మదనవైరి. 58

తే. ధవళలోచన! శ్రీపర్వతంబుమహిమఁ
బ్రస్తుతింపంగఁ శక్యమే బ్రహ్మకైన
గండశిల లెల్ల శంభులింగంబు లిందు
సిద్ధమును లిందుఁ వసియించు చెంచు లెల్ల. 59

క. చాకున్న నీదు ముక్తుల
శ్రీకాశీక్షేత్ర మెవ్వరికి నిది నిక్కం
బీకుధర మిచ్చు శిఖరా
లోకనమాత్రమున ముక్తులు కురంగాక్షీ. 60

వ. అనియె నప్పుడు లోపాముద్ర ముద్రికామణిమయూఖ
రేఖలు నఖర శిఖరంబులం జిగురొత్త విద్రుమప్రవాళంబుల
యుల్లాసంబు నుల్లసంబాడెడుపాణిపల్లవంబులు మోడ్చిఫాల
భాగంబునం గదించిన వినమ్రవినమితోత్తమాంగయై యున్నం
గనుంగొని సస్నేహంబును సబహుమానంబును సానురా
గంబును సాభిప్రాయంబును సమర్మంబును సవిభ్రమంబును
సోపాలంభంబునుం గాఁ గుంభసంభవుండు మహాదేవి
కి ట్లనియె. 61

సీ. హృదయంబులో సంశయించి నిగూఢార్థ
మిద మిత్థ మని నిశ్చయింపలేక
యది తేఁట తెలివిఁగా నడుగంగఁ దలఁచి ల
జ్జాసాధ్వసంబులు సందడింప

నవనమ్రముఖపద్మ వైయున్న దానవు
ప్రాగల్భ్యసరణి యేర్పడునో యంచు
మాటాడనేరనిమాటిరంగవు నీవు
సకలకాలంబు నోసరసిజాక్షి!
తే. కాంత! యేకాంతవేళలఁ గాంతునెదుర
నగుచుఁ దెగడుచు నుండుట తగవుసూవె
వలసిసిగ్గున వెఱపునఁ గలసి బెరసి
యుండకుండుట మాబోఁటు లోర్వఁ గలరె? 62
వ. అనిన విని లోపాముద్ర మానముద్ర దిగద్రావి మునీంద్రున
కి ట్లనియె. 63
సీ. చతురశీత్యాయామసంపన్న మై యోజ
నోత్సేధవైభవాభ్యుద్గతమయి
ముప్పదియోజనములంవెడల్పును గల్గి
సార్ధత్రికోటితీర్థాన్వితమయి
సమధికాష్టాశీతిసాహస్రసంయమి
జనసమాకుల మయి సప్తకోటి
మంత్రాశ్రయం బయి మహనీయమహిమ మై
తనరారునీపర్వతంబునందు
తే. శిఖర మీక్షించునంతన చేరు నట్టి
ముక్తి జంతువులకు (మఱి) జీవములు దొరంగ
వచ్చినప్పుడు గాని మోక్షంబు లేదు
కాశి కరుగంగ నేఁటికిఁ గాళ్లజాలి. 64
వ. మఱికొందఱు కేవలవిజ్ఞానంబుఁ బ్రశంసింతురు. కొందఱు
విజ్ఞానంబువలన సముచ్చితం బైనకర్మంబుఁ బరిశీలింతురు.

కొందఱు దానంబులు గొనియాడుదురు. కొందఱు వ్రతం
బులు సెప్పుదురు. కొందఱు యజ్ఞంబులు మెత్తురు. కొందఱు
తపంబులు గోరుదురు. కొందఱు బ్రహ్మచర్యం బభినందింతురు.
కొందఱు గార్హస్థ్యంబుఁ బ్రశంసింతురు. కొందఱు వానప్రస్థా
శ్రమంబు మన్నింతురు. కొందఱు సన్న్యాసంబుఁ బ్రసంగిం
తురు. కొందఱు తీర్థసేవ యావిష్కరింతురు. కొందఱు స్వా
ధ్యాయంబు నధికరింతురు. కొందఱు కాశీశ్రీపర్వతాదిశివ
స్థానంబు లభ్యర్థింతురు. ఇన్నియు ముక్తిస్థానంబులై యుండు
నందులోపల సులభంబగుముక్తిస్థానం బెయ్యది? వినవలతు
నానతిమ్ము. సంశయబీజభూతంబు లైనయావిప్రతిపత్తివచన
సహస్రంబులు వినంగ నాడెందంబు డోలాందోళనం బందు
చుండు. 65

క. అని యడిగినఁ గలశసుతుం
డనుమోదరసార్ద్రహృదయుఁ డై దేవికి ని
ట్లను నడుగవలయునర్థమ
వనజానన! యడిగి తుక్తివైభవ మలరన్. 66

{ అగస్త్యుండు లోపాముద్రకు బాహ్యాభ్యంతర తీర్థమాహాత్మ్యంబుఁ జెప్పుట }

శా. శ్రీశైలాదులు ముక్తికారణములై చెప్పంబడుం దీర్థముల్
ప్రాశస్త్యంబును నన్నితీర్థముల కప్రత్యూహమై వర్తిలుఁ
గాశీప్రాప్త(ప్తి)కరంబు లైనకతనం గైవల్యలక్ష్మీసహల్
గాశీక్షేత్రము గైకొనుందరుణి! సాక్షాన్ముక్తిహేతుత్వమున్.

వ. ప్రయాగ నైమిశంబు కురుక్షేత్రంబు గంగాద్వారంబు
నవంతిక యయోధ్య మధుర ద్వారక సరస్వతి సహ్యంబు

గంగాసాగరసంగమంబు కాంచి త్ర్యంబకంబు సప్తగోదా
వరంబు కాలంజరంబు ప్రభాసంబు బదరికాశ్రమంబు
మహాలయం బోంకారంబు పురుషోత్తమంబు గోకర్ణంబు
భృగుతీర్థం బంబుపుష్కరంబు శ్రీపర్వతంబు నా నివి మోక్ష
కారణంబు లైనమహాతీర్థంబులు. 68

సీ. శంభుప్రసాదంబు సమకూఱకుండినఁ
దీర్థయాత్రకు సమ్మతింప దాత్మ
దీర్థంబు లాడంగఁ దివురుట లేకుండినఁ
బ్రతిబంధదురితంబు వాసిపోదు
ప్రతిబంధదురితంబు వాసిపోకుండినఁ
గాశి కేఁగెడునట్టికడఁక లేదు
కాశీపురక్షేత్రవాసమ్ము లేకయే
విజ్ఞాన దీపంబు విస్తరిలదు

తే. జ్ఞానమునఁ గాని మోక్షంబు సంభవింప
దతివ! జ్ఞానం బనంగ వేదాంతవాక్య
సంభవం బైన దదియు పోజ్ఞాన మంద్రు
తరుణి విజ్ఞాన మీసూక్ష్మ మెఱిఁగి కొనుము. 69

క. ధారాతీర్థం బనఁగాఁ
దారాధిపవదన! ఖడ్గధారాంచల మ
ద్ధారాంచలమునఁ ద్రెవ్విన
వీరాగ్రేసరుఁడు ముక్తివిభవముఁ గాంచున్. 70

తే. తీర్థములు మానసములు ముక్తిప్రదములు
తరుణి! యివి మేలు బాహ్యతీర్థములకంటె

మానవుం డివి యేమిటి మధురవాణి!
బాహ్యతీర్థంబు లాడ నిష్ఫలము సూవె. 71

సీ. తీర్థంబు సత్య మింద్రియనిగ్రహము తీర్థ
మనసూయ తీర్థంబు వనరుహాక్షి!
తీర్థంబు దానంబు తీర్థంబు సంతోష
మనుకంప తీర్థంబు కనకగౌరి!
బ్రహ్మచర్యంబు తీర్థంబు తీర్థము ధృతి
యమము తీర్థము విద్రుమాధరోష్ఠి!
సమత తీర్థంబు విజ్ఞానంబు తీర్థంబు
పుణ్యంబు తీర్థంబు పువ్వుఁబోఁడి

తే. తీర్థములు మానసంబులు ధీవిశుద్ధి
యతిశయిల్లంగ నివి యాడ కాడినట్టి
పంచజనులకుఁ గలహంసపక్షిగమన!
బాహ్యతీర్థావలులు తీర్థఫలము నీవు.

చ. బిసరుహపత్రలోచన! కృపీటములందు మునింగియాడవే
మొసళులుమీలుకర్కటకముల్ గమఠంబులు వానికబ్బునే!
యసదృశమైనతీర్థఫల మట్టివిధంబు సుమీ? తలంప మా
నస మగుతీర్థమాడనిజనంబులకుం బహుబాహ్యతీర్థముల్.

తే. సుదతి! యేటికి నంతర్విశుద్ధి లేని
బాహ్యసంశుద్ధి? బహుతీర్థపరిచయమున
వేయుఁగడవలజలమున వెలిఁ గడిగిన
గలుగునే శుద్ధి వారుణీకలశమునకు? 74

తే. రాగదోషమలాపహారక్షమంబు
మానసం బైనతీర్థంబు మందగమన!

యవనిఁ బంకరజోవ్యపాయత్వమంబు
బాహ్యతీర్థంబు మేచకోత్పలదళాక్షి! 75

సీ. దర్శించినపుడ చిత్తము నిర్నిబంధనం
బగుఁ బ్రసాదగుణంబు నందు నేనిఁ
గలుషంబు గాని దుర్గంధంబుఁ బొరయని
సలిలంబు నెరముగాఁ గలుగు నేనిఁ
బావనక్షేత్రపుణ్యావనీధరతపో
వనసన్నికర్షంబు దనరు నేని
శంసితవ్రతులైనసంయమిశ్రేష్ఠుల
యధికపరిగ్రహం బబ్బ నేనిఁ

తే. దీర్థములు పెక్కులాడిన తీర్థ మగునె?
ధవళలోచన! సలిలమాత్రమునఁ జేసి
ముదిత! దేహమునం దంగములకుఁ బోలెఁ
దారతమ్యంబు గలదు తీర్థముల కతివ. 76

వ. సారంగనయన! తీర్థాంగంబు లప్రతిగ్రహం బనహంకారం బకోపనత్వం బనాలస్యంబు సూనృతంబు సమాధానంబు శ్రద్ధధానత్వంబు హేమనిష్ఠక్షేత్రోపవాసంబు పితృతర్ప ణంబు బ్రాహ్మణభోజనంబు పితృశ్రాద్ధంబు పిండప్రదానంబు శిరోముండనంబు మొదలుగాఁ గలయవి సాంగోపాంగంబు లయిఫలంబు నీఁజాలు. మఱియు తీర్థతారతమ్యంబు వివ రించెద. 77

సీ. చెలువ! శ్రీగిరియందు శిఖరేశ్వరం బను
శిఖరంబు జూచినఁ జేరు ముక్తి

కాంత! శ్రీశైలంబుకంటె వేగంబునఁ
గేదార మీఁదఁ జాలుఁ గేవలత్వ
మంతకంటెను వేగ మరవిందలోచన!
యమృత మిానోఘ ప్రయాగతీర్థ
మా ప్రయాగముకంటె నతి వేగమునఁ జేయు
నపవర్గ మింతి! మహాశ్మశాన

తే. మతివ! యానందకాననప్రాప్తికరము
లఖిలతీర్థంబులును సందియంబు లేదు
కాశికాతీర్థ మాడక కదియరాదు
లక్షుతీర్థంబు లాడిన మోక్షలక్ష్మి. 78

శివశర్మోపాఖ్యానము

వ. ఈయర్థంబు దేటపడ నొక్కయితిహాసంబు చెప్పెద వినుము. మథుర యనుపట్టణంబున శివశర్మ యనువిప్రోత్తముండు గలఁడు. అతఁడు వేదంబులుచదివి, తదర్థంబు లెఱింగి, ధర్మశాస్త్రంబులు పఠించి, పురాణంబు లధిగమించి, యంగంబు లభ్యసించి, తర్కంబు లాలోడించి, మిామాంసాద్వయం బాలోచించి ధనుర్వేదం బవగాహించి యాయుర్వేదంబు విచారించి, నాట్యవేదంబు గ్రహించి, యర్థశాస్త్రంబు(లు) ప్రాపించి, మంత్రశాస్త్రంబు(లు) దెలిసి, భాషలు గఱచి, లిపులు నేర్చి, యర్థంబు (లు)పార్జించి, ధర్మంబులు చేపట్టి, భోగ్యంబు లనుభవించి, పుత్త్రుల నుత్పాదించి, వారి కర్థంబు విభజించి యిచ్చి, యౌవనంబు పోకకు ముదిమిరాకకు శోకించి వ్యాకులుం డయి నిజాంతర్గతంబున. 79

శా. నానాశాస్త్రము లభ్యసింపను ననంతద్రవ్య మార్జింప సం
తానంబుం బడయంగఁ బుత్త్రులకు నర్థంబు ల్విభాగించి యీఁ
బౌనఃపున్యమునన్ సుఖం బనుభవింపం బోయెఁ గాలంబు గౌ
రీనాథున్ భజియింప నేర నయితిన్ శ్రీకాశికావల్లభున్. 80

సీ. కొలువంగ లేనైతి గోపాలకృష్ణుని
నర్చింప లేనైతి హస్తివదను
మ్రొక్కంగ లేనైతి మునిజనశ్రేణికి
సేవింప లేనైతిఁ జిత్రభాను
యజియింప లేనైతి నమరసంఘాతంబు
బూజింప లేనైతిఁ భూదివిదులఁ
గట్టింప లేనైతిఁ గమలకాసారంబు
నిలుపంగ లేనైతిఁ దులసివనము

తే. పేరటాండ్రను నర్చింప నేర నైతి
సలిలసత్త్రంబు సాగింపఁ జాల నైతి
నాజ్యతిలహోమవిధులు మంత్రాన్వితముగ
హుతవహునియందుఁ జేయంగ నోప నైతి. 81

తే. పురుషసూక్తము శ్రీసూక్తమును జపింపఁ
బావమాని పఠింపఁ దత్పరత మీఱి
నర్థి శతరుద్రియంబు పంచాక్షరంబు
ప్రణవమంత్రంబు జపియింపఁ బ్రతిదినంబు. 82

క. ఈహార్మ్యము లీతురగము
లీహేమము లీభుజిష్య లీధాన్యము లీ
దేహము నాతో వచ్చునె?
యూహింపఁగఁ బుణ్యకర్మ మొక్కటి దక్కన్. 83

సీ. పొడివగ్గు కంఠంబుఁ బొరివుచ్చకయమున్న
తల ప్రకంపంబుఁ బొందకయమున్న
బొమలు కన్నులమీఁదఁ బొదివి వ్రాలకమున్న
పర నేత్రముల కడ్డు పడకమున్న
శ్రుతిపుటంబుల శక్తి సురిఁగి పోవకమున్న
వళు లాననమునఁ బర్వకయమున్న
హృదయంబులో జాగ పదను దప్పకమున్న
గాత్రంబు శిథిలంబు గాకమున్న

తే. పండ్లు వేర్వాసి కదలుచూపకయమున్న
కాళికడకంటి చూపు పై రాకమున్న
కాలుసేయాడుకాలంబె కదలవలయుఁ
దీర్థసేవకు దేహ మస్థిరము గాన. 84

వ. అని తీర్థయాత్రాపరాయణుం డై యిల్లు వెడలి రెండు మూఁడుపయనంబులకొలఁది తెరువున నొకవటవృక్షంబు క్రింద బరిశ్రమాపనోదార్థంబు విశ్రమించి యంతరంగంబున నిట్లని వితర్కించె. 85

మ. కరికర్ణాంతవిలోల మాయువు శరత్కాదంబినీచంచలా, త
రళంబాత్మ పయస్తరంగచలముల్ తారుణ్యముల్ తీర్థముల్, ప
రిపాటిం జతురంతధాత్రిఁ జరియింపన్వచ్చునే యైననేఁ, బుర
ముల్ నాలుగుమూఁడుముక్తిజనకంబుల్ మున్ను వీక్షించెదన్.

సప్తపురీప్రశంస

తే. ఉజ్జయిని కాశి మాయ యయోధ్య కాంచి
మథుర ద్వారక యనెడినామములు గలిగి

పట్టణము లేదుఁ గీర్తిసంపద వహించు
మహితకైవల్యలక్ష్మికి మందిరములు. 87

వ. అని నిశ్చయించి. 88

సీ. సాకేతమున కేగి సరయూతరంగిణి
నభిషేక మొనరించె నధికభక్తి
నల్పుఁ దెల్పును నైన నదులకూటము ప్రయా
గాఖ్యంబునందు దేహంబు దోఁచె
గంగలో మణికర్ణికాతీర్థమునయందు
సంకల్పపూర్వంబు గ్రుంకువెట్టె
కైవల్యకల్యాణఘంటాపథంబైన
యానందవిపినంబు నాశ్రయించె
తే. తీర్థదైవతకోటిఁ బ్రార్థించి పలిక
యఖిలమును నాచరించి తీర్థాంగకములఁ
దీర్థములయందు శ్రీమహాదేవుఁ గొలిచెఁ
బావనాచారనిరతుండు బ్రాహ్మణుండు. 89

సీ. బ్రహ్మలోకోన్నతప్రాసాదనిశ్శ్రేణి
యాజవంజవభీతి కభయపాణి
కలుషకంఠచ్ఛేదకాలాయసకృపాణి
కైవల్యనవమౌక్తికమున కాణి
[1]వీరావనీస ముద్విష్టకంతర్వాణి
చతురుత్సవగంధసారశోణి
చేతగప్రసాదలక్ష్మీవిహారక్షోణి
కల్పాంతకాలంబు గలపురాణి

1. ఇందిరావణ సమాహితనిజాంతర్వేణి.

తే. పరమకల్యాణి యాపగాంభస్త్రివేణి
రాజరేఖావతంసుగా రాపురాణి
సమధికప్రీతిఁ దేలి యాసత్యవాణి
కేవలత్వశుభశ్రేణి గ్రుంకువెట్టె. 90

తే. అఖిలతీర్థంబులును నాడి యవనిసురుఁడుఁ
గోర్కె మేఁ బుణ్యలక్ష్ములఁ గొల్లవెట్టె
నటువిశేషించి గంగాప్రయాగతీర్థ
మధికతాత్పర్యనిష్ఠతో నాడఁ దొడఁగె. 91

సీ. వైకుంఠమునఁ నుండి వచ్చి వైకుంఠుండు
దేవీసహాయుఁడై తీర్థమాడు
గోలోకమున నుండి గోమాతృకలు వచ్చి
తీర్థ మాడుదు రతిస్థిరమనీషఁ
గాశికాపురినుండి కాలకంఠుఁడు వచ్చి
దివసంబు దివసంబు తీర్థ మాడు
వరుస దిక్కులనుండి వచ్చి దిక్పాలురు
త్రిదశేశ్వరాదు లాడుదురు తీర్థ

తే. మమరగంధర్వసిద్ధవిద్యాధరర్షి
గరుడకిన్నరయక్షరాక్షసపిశాచ
భూతములు దీర్థమాడు వేఁబోకచివరఁ
బూష మకరస్థుఁ డైన యప్పుడు ప్రయాగ. 92

వ. అది ప్రజాపతిక్షేత్రంబు యాగంబులకంటెను బ్రకృష్టం
బగుటం జేసి దానికిఁ బ్రయాగసమాహ్వయం బన్వర్థనామంబై
యుండు. మార్తాండుండు మకరరాశిస్థుం డై యుండ మాఘ
మాసంబున మఘవమణిశిలాశకలవిసరవిస్ఫురితకిరణసందోహ

సందేహదానదీక్షాధురంధరంబులగు కాళిందీసింధుకబంధం
బులతో సంబంధించి కర్పూరగంధసారతారహారనిర్ఝరా
హారనీహారక్షీరధారాశ్రేణి పాణింధమంబై (న) సారసైంధవ
ధవళవాఃప్రవాహంబు ప్రవహింప సితాసితచ్ఛాయాచ్ఛటా
గుళుచ్ఛవ్యతికరంబునం జేసి మోక్షలక్ష్మీకటాక్షవీక్షణంబునుం
బోని యమ్మహాతీర్థరాజంబునం గ్రుంకి బ్రాహ్మణుండు
కృతార్థుం డయ్యె వెండియు. 93

గీ. కాశి కేతెంచు మఱిఁ బ్రయాగమున కేగుఁ
గాశి కేతెంచు మఱిఁ బ్రయాగమున కేగు
మునుఁగు మణికర్ణికాతీర్థమునను మఱియు
మునుఁగు మణికర్ణికాతీర్థమునను మఱియు. 94

శా. కేంకుర్వాణపురందరాదికమహాగీర్వాణకోటీకిరీ
టాంకస్థాపితనూత్నరత్నరుచిధారాశ్లేషకిమ్మీరప
త్పంకేజుండుహరుండు జంతువులకుం బ్రాణాంతకాలంబునం
దోంకారాక్షరమంత్రరాజముఁ జెవిన్ యోజించుఁ గాశీస్థలిన్.

గీ. కర్ణికాంతము సేరి యేకతమ శివుఁడు
మునుకు మోక్షచింతామణి జనున కెపుడుఁ
గాన మణికర్ణికాసమాఖ్యత వహించె
నమ్మహాతీర్థ మమరుగంగాంతరమున. 96

క. ఉద్భిజ్జములు జరాయు
ప్రోద్భూతము లండజాతములు స్వేదజముల్
తద్భామఁడలిఁ జచ్చి మ
హోద్భుతముగఁ బుట్టు హాలహాలకంధరులై. 97

గీ. ఎడమప్రక్కయి కాశిలో నీల్గునట్టి
మశకశిశువున కోంకారమంత్రరాజ
మభవుఁ డుపదేశ మొనరింప నమరకోటి
సిగ్గువడుచుండుఁ దమపృథాజీవములకు. 98

చ. కటకట! కాశికాపురి నొకానొకనిద్దురఁ గన్నుమోడ్చియ
ప్పటఁ గనువిచ్చిచూచికుడిభాగముఁగన్గొనిచోద్యమందుదా
పటి దెసఁజూచి యచ్చెరువుపాటు వహించు మనస్సరోజసం
పుటమున నాఁడులాగు మగపోడిమియుంగల జంతుసంతతుల్.

మ. గృహమేధిప్రవరుండు విప్రుఁ డమృతక్షేత్రంబువారాణసిన్
ద్రుహిణక్షేత్రము వాసిపోవఁదలఁచెన్ దూరంబుగా వెండియు
స్పృహఁ గైవల్యపుఁదీర్థముల్ గలిమి సంభావించి శాస్త్రజ్ఞతన్
బహుధావిప్రతిపత్తిధీవిషయముల్ పాదైనశాస్త్రార్థముల్.

సీ. ఆనందవిపినపుణ్యానుభావాధిక్య
మెఱుఁగఁడా తా నేమి యెల్లయదియు?
దెలియఁడా తా నేమి దేవలోకారోహ
నిశ్శ్రేణి యగుగంగనిత్యమహిమ?
మణికర్ణికాతీర్థమాహాత్మ్యవిభవంబుఁ
జూడఁడా తా నేమి సూక్ష్మదృష్టి?
నరయఁడా తా నేమి యామ్నాయములఁ బురా
ణేతిహాసముల విశ్వేశుగరిమ ?

గీ. నకట! పుణ్యప్రమాణాంతరానువృత్తి
నుదక మున్నతభూమియందుండలేక
పల్లమున కొడ్డగిల్లినపగిది నతఁడు
కదలెఁ దీర్ఘాంతరమునకుఁ గాశినుండి. 101

వ. కదలి కతిపయప్రయాణంబుల. 102

సీ. ఏవీటిశృంగార మెలదోఁటలోనుండుఁ
గదల కెప్పుడు కాలకంధరుండు
ప్రతిదినంబునను నేపట్టణంబునకు ని
వ్యాభిధానంబు పెంపమర నెగడు
జేనెంటఁ జేనెంట శివలింగములు కోటి
సంఖ్య లేపురమునఁ జాల నొప్పుఁ
గల్పాంతవేళ నేకటకంబు మునుఁగదు
నింగితోఁ రాయుమున్నీటివెల్లి

గీ. నట్టిమహిమలయుజ్జని కరుగుదెంచి
కాళి దర్శించె శ్రీమహాకాళుఁ గొలిచె
నుండె శివశర్మ యటరాజయోగపరత
నిఖిలముక్తుల కచ్చోటు నెలవుగాన. 103

ఆ. హాటకేశ్వరుఁడు మహాకాళనాథుఁడు
దారకేశ్వరుండు తలిరుఁబోఁడి?
యుబ్బి లింగము లయియున్నారు పాతాళ
మర్త్యనాకభువనమండలముల. 104

ఉ. కందవు గాజుపాఱవు వికారము నొందవు పూతిగంధముం
జెందవు వాడ వప్పురముసీమల నల్లడ వామకర్ణముల్
క్రిందుగ దీర్ఘనిద్రలు ధరించి శయించినజంతుదేహముల్
సుందరి! యిట్టిచోద్యములు చూడము తక్కినతీర్థభూములన్.

క. లీల మహాకాల! మహా
కాల! మహాకాల! యనుచుఁ గడుభక్తిమహా

కాలస్థానాధీశ్వరుఁ
గాలగళుఁ సంస్మరింపఁ గాంతురు ముక్తుల్. 106

గీ. భవు మహాకాళు సేవించి బ్రాహ్మణుండు
గదలెఁ గాంచికి సక్కాంచికాపూర్వమునఁ
గలికి వేడుకకత్తె శ్రీకామకోటి
గవయు నేకామ్రనాథునిఁ గరిమ గిరిశు. 107

ఉ. కాంచికిఁబోయిబ్రాహ్మణుఁడు గాంచెనుదావళభూమిభృచ్ఛిరః
కాంచనకంధరాసిలయుఁ గైటభమర్దనుఁ గామకోటి ద
ర్శించి భజించె బాలశశిశేఖరు నేకరసాలనాయకు
న్బంచె ననేకపూర్వజననంబులఁ బుట్టినపాతకౌఘముల్. 108

సీ. ముడువంగ నేర్తురు ముడువ దాపటికి రాఁ
జికురబంధము లీఁగ జీరువాఱఁ
బొన్నపువ్వులఁ బోలు పొక్కిళ్లు బయలుగాఁ
గట్టనేర్తురు చీర కటిభరమునఁ
దొడువంగ నేర్తురు నిడువ్రేలుఁజెవులయం
దవతంసకంబుగా నల్లిపువ్వు
పచరింప నేర్తురు పదియాఱువన్నియ
పసిఁడి పాశములోరపట్టుచెంగు

గీ. పయ్యెదనుసుఁగు బొలిండ్లఁ బ్రాఁకనీరు
తఱచు పూయుదు రోల (లి) గంధంబుఁ బసుపు
బందికత్తెలు సురతప్రసంగవేళఁ
గంచివ్రేతలుకుసుమాస్త్రఖడ్గలతలు. 109

గీ. కాంతియందురు గొంద ఱక్కాంచిపేరు
కమ్రకురువిందరత్నసత్కాంతిదంతి

నప్పురంబున నేడునా ళ్లధివసించి
బ్రాహ్మణుఁడు సర్వదేవతాప్రతతిఁ గొలిచె. 110

వ. అందుండి ప్రభాసక్షేత్రంబుమీఁదుగాఁ జని. 111

క. ద్వారవతీనగరంబునఁ
గోరిక శివశర్మ యుండి కొన్నిదినంబుల్
నారాయణపుణ్యకథా
పారాయణు లైనపరమభాగవతులతోన్. 112

గీ. ధవళలోచన! యొక్కచోద్యంబు వినుము
ద్వారవతియందుఁ జచ్చినవారియొడలి
యస్థిశకలంబులం దంతరాంతరములఁ
దనరు శ్రీపాంచజన్యసుదర్శనములు. 113

ఉ. కాంచనకేతకీకుసుమగర్భదళోదరసోదరప్రభా
భ్యంచితమై పటీరఘుసృణాగురుసౌరభలక్ష్మితోఁ బిసా
ళించుచుఁ గమ్మనై పరిమళించుసముజ్జ్వలగోపిచందనం
బించినవేడ్కతోడ ధరియింతురు భాగవతోత్తముల్పురిన్.

గీ. రమణి! ధరియింతు రూర్ధ్వపుండ్రములు మెఱయ
ఫాలతలమున నవ్వీట భాగవతులు
కఠినపాపపరంపరాకంఠనాళ
ఖండనప్రక్రియాక్రూరఖడ్గలతలు. 115

సీ. కమనీయగోపికాగంధసారంబున
నూర్ధ్వపుండ్రములు బాగొప్పఁ దీర్చి
వక్షస్స్థలంబుల వనజాక్షమాలికా
చారునైపథ్యంబు సంతరించి

దక్షిణశ్రవణరంధ్రములఁ గోమలకృష్ణ
తులసీప్రవాళంబు లలవరించి
నలినలోచనదివ్యనామసంకీర్తనా
భంగికి జిహ్వలఁ బాలువెట్టి

గీ. ద్వారవతియందు ముక్తికాంతావిహార
మంటపములందు నుంద్రు నిర్మలవివేక
నిరభిసంధికృపాగుణనిర్జిక్రోధ
పరమభాగ్యాన్వితులు మహాభాగవతులు. 116

గీ. ప్రతియుగంబును ద్వారకాపట్టణంబు
ముంచి రత్నంబులెల్లను ప్రుచ్చిలించి
కొంచుఁబోయెడుకతమునఁ గువలయాక్షి!
యబ్ధి కొడఁగూడె రత్నాకరాహ్వయంబు. 117

సీ. కట్టు రింగులువారఁ గటిభాగమునయందుఁ
బసిఁడికమ్ములపచ్చపట్టుచేల
వక్షస్స్థలంబున వనమాల ధరియించుఁ
గౌస్తుభగ్రైవేయకమునఁ గూర్చి
సేసకొప్పునఁ జుట్టు శిఖిపింఛరింఛోళి
మక్కళించిన జిల్గుమడుఁగుపాగ
గొజ్జంగిపూనీరు కులికి మేదించిన
కమ్మకస్తురి మేనఁ గలయ నలఁదు

గీ. ద్వారకాపట్టణముపొలిమేరసీమఁ
గాలవశమున నీల్గిన క్షణమునందుఁ
గైటభారాతిసారూప్యగరిమఁ గన్న
కీటపక్షిసరీసృపక్రిమికులంబు. 118

ఉ. ఆపృథివీసుపర్వుఁడు ప్రియంబున ద్వారకయందుఁ దీర్థసే
వాపరతంత్రుఁడై యయిదువాసరములు వసియించి పోయె మా
యాపురి కమ్మహానగర మంబుజపత్రవిశాలనేత్ర! దు
ష్ప్రాపము పూర్వజన్మమునఁ బాపము సేసిన మర్త్యకోటికిన్.

వ. అన్నగరంబును గొందఱు హరిద్వారం బండ్రు, కొందఱు మోక్షద్వారం బండ్రు (కొందఱు గంగాద్వారం బండ్రు.) అవ్వలనన నిర్గమించికదా భాగీరథి భువనపావనిభవజటాజూటాటవీవాటికాకుటజకోరకంబు మున్నీటం బెక్కుముఖంబులం గలసె. అట్టిమాయాపురంబునందు. 120

సీ. తీర్థోపవాసంబుఁ దీర్చి జాగర ముండి
తెల్లవాఱఁగ గంగఁ దీర్థమాడి
పితృతర్పణముఁ జేసి పిండప్రదానంబు
యవసక్తుచరువున నాచరించి
యగ్నికార్యముఁ దీర్చి హరుని నభ్యర్చించి
ముల్లుమోదుగాకులఁ బులియఁ గుట్టి
రాగిలో [illegible] నన్బ్రాలేయు కుండంగ
వండి డించినయట్టి వంటకంబు

గీ. కుడువఁగూర్చుండి వడ్డించుకొనఁ దలంచు
నంతలోన శిరస్తాప మావహిల్లె
మేను గరుదాల్చెఁ జలి బెట్టి మెడలునొచ్చె
వేఁకి దలచూపె దాహ మావిర్భవించె. 121

వ. అప్పుడు శివశర్మ నిజాంతర్గతంబున. 122

గీ. బ్రతుకుమీఁదియాస పాయఁగఁ బెట్టితిఁ
జిచ్చువంటివేఁకి వచ్చినపుడ

జలధినట్టనడుమ సాంయాత్రికుఁడు కలం
బవిసినపుడు ధనమునాసవోలె. 123

సీ. ప్రతివాసరము గృహారామసస్యక్షేత్ర
పశువీక్షణము సేయఁ బ్రాప్తుఁ డెవ్వఁ?
డిటమీఁద నేభంగి నిందుబింబానన
విధవసంసారంబు వెడలఁబోయుఁ?
దనయు లిం కేభంగి ధనవిభాగములకై
పోరితంబులు లేక పొసఁగియుందు?
రఖిలపురాణేతిహాసశాస్త్రాగమ
గ్రంథసంపత్తు యెక్కడిది యింక?

గీ. నకట! మిన్నులువడ్డచో నవవ వోలె
దిక్కుమాలినప్రేత నై తిరుగవలసె
శిరసుపై మృత్యు వాడెడుశీఘ్రమునను
చావునిక్కంబు బ్రతుకుట సంశయంబు. 124

శా. సంతాపంబునఁ బొంద నేమిటికి నీసంసారయాత్రావ్యథా
చింతాభారము పూని జూర్తిదహనార్చిర్దాహముల్సాలవే
చింతింతు న్మది విశ్వనాయకు శివున్ శ్రీకాశికాధీశ్వరుం
జింతింతున్ సరసీరుహాక్షుని హరిన్ శ్రీద్వారకావల్లభున్.

గీ. ఏల చింతింప నిహామునం దెల్లసుఖము
లనుభవించితి మధురామహాపురమునఁ
బరమునందును ముక్తింపదయుఁ గలిగె
నేడుపురములఁ దీర్థంబు లాడఁ గనుట. 126

వ. అని వితర్కించుచుండ. 127

శా. పాటిల్లెం ధరణీసురోత్తమున కప్పాటన్ విదాహజ్వరో
ష్మాటోపంబున నత్యుపద్రవము మైనాపాదమస్తంబుగాఁ
గోటీవృశ్చికకీటపుచ్ఛలతికాకోటీశిఖాకంటక
త్రోటీకుట్టనసంప్రభూతవిషధూర్దుర్వారదాహోద్ధతిన్. 123

క. తన్నెఱుఁగ కెపిరి నెఱుఁగక
కన్నులు దెఱవంగ నెఱుఁగక వసుంధరపైఁ
గొన్ని దినంబులు బ్రాహ్మణుఁ
డున్నట్లున యుండె నోట్రి యూరుపుతోడన్.(నొంటి) 129

క. ఇటు బహువిధములఁ గడుసం
కటపడి మాయాపురోపకంఠమున మరు
త్తటినీతటనికటమునం
దటుకున శివశర్మ కాలధర్మము నొందెన్. 130

వ. అంత. 131

మ. అసితాంభోధరనీలవర్ణు లురుభద్రాకారు లాజానుదీ
ర్ఘసముత్తుంగభుజాచతుష్టయు లలంకారాన్వితు ల్పుణ్యశీ
లసుశీలాఖ్యులు విష్ణుకింకరులు లీలం బక్షిరాట్కేతనో
ల్లసితం బైన రథంబుఁ దెచ్చిరి ప్రభల్నద్దిక్కులంబర్వఁగన్.

సీ. వెలిదామరలఁ బోలు వెడఁదకన్నులతోడఁ
గౌస్తుభగ్రైవేయకంబుతోడఁ
బసిఁడికమ్ములపచ్చపట్టుఁబుట్టంబుతో
మెఱుఁగారుఁజామన (చాయ) మేనితోడఁ
తలుకొత్తుపసిఁడిగేదంగిరేకులతోఁడ
గస్తూరికాంగరాగంబుతోడ

నటవీమయూరపింఛావతంసంబుతోఁ
జిగురొత్తుమొలకలేనగవుతోడ
తే. నపుడ సాక్షాత్కరించినహరియుఁ బోలె
నెక్కె శివశర్మ గాంభీర్య మెసక మెసఁగఁ
గింకిణీజాలమాలికాలంకృతంబు
గరుడకేతనసహితంబు కనకరథము. 133

వ. ఇట్లు దివ్యవిమానారోహణం బొనర్చి శివశర్మ విష్ణుకింకరులఁ
జూచి యి ట్లనియె. 134

గీ. విష్ణుభక్తులఁ జెప్పంగ విందు నెపుడు
నేఁ బురాణేతిహాససంహితలయందుఁ
బుణ్యశీలసుశీలు లీపుణ్యపురుషు
లచ్యుతునిసమ్ముఖమున నుం డ్రధికు లనుచు. 135

గీ. వారు కారుకదా మీరు వనజనేత్రు
లంబుధరనీలవర్ణులు కంబుగళులు
భద్రదివ్యాకృతులు చతుర్బాహుదండు
లసితతులసీపలాశమాల్యాభరణులు. 136

వ. అనిన వారు మహాత్మా! నీయట్టిమహానుభావు లెఱుంగనియ
ర్థంబులు గలవె? ఏము నీవు పెద్దలవలనం బురాణేతిహాససం
హితాముఖంబుల విన్నపుణ్యశీలసుశీలుర మగుదుము. అనేక
లోకంబులు గడచికాని వైకుంఠపురంబునకుం బోవరాదు.
అయ్యయిలోకంబులవిశేషంబులు నీకుం జెప్పెదము. సావ
ధానమతివై యవధరింపుము. ఈవును నడుగవలసినయర్థంబు
లడుగు మనిన నట్లకాక యనుచుం జనువాఁడు ముందట.

విష్ణుదూతలు శివశర్మకు సంయమనీస్వరూపంబుఁ దెల్పుట

సీ. కఱకులై వ్రేలినకుఱుచజూంజూలు వెండ్రు
కలును గండెనచాయకాయములును
గలివోసి నాన్చిన గ్రచ్చకాయలభంగిఁ
గాఱమాలినట్టిదృగ్గోళకములు
తొట్టివాతెఱలపై దూరంబు సాగిన
గొగ్గిపండులతోడి కుముఖములును
గూనివీఁపులమీఁద గోడియై బోడెత్తి
తఱివడ్డకంకాళదండములును
గీ. రాసభక్రూరకంఠనిర్హ్రాదకఠిన
ఘుర్ఘురవ్యక్తభాషితోద్గారములును
గలిగి యిదె కొంద ఱున్నారు గగనవీథి
నోరిమోఁ నోడఁగూడుకొని యెవ్వరొక్కొ వీరు? 138
వ. అనిన నద్దివ్యపురుషు లతని కిట్లనిరి. 139
ఆ. ఇది పిశాచలోక మీ ధూమ్రవర్ణులు
విను పిశాచరాజు లనఘ! వీరు
చంద్రశేఖరుని ప్రసంగవశంబునఁ
గొలిచినారు భక్తిఁ గొంచియంబు. 140
వ. అనియిట్లు క్రమంబునఁ బ్రశ్నోత్తరరూపంబునఁ గర్మానురూపంబు లగుఫలంబు లనుభవించుచు [1]నుందూరనిన నమర భావంబుల నుత్తరోత్తరాభ్యున్నతంబు లగు నాయాయిలోకంబుల వసియించియున్న పుణ్యపురుషులం గనుంగొనుచు శివశర్మ గుహ్యకలోకంబును గంధర్వలోకంబును విద్యా

1. (తమతమ తరతమ).

ధరలోకంబును నతిక్రమించి యప్సరోలోకంబునకుం బోవు
నవసరంబున. 141

చ. ఎదురుగవచ్చి హేమరథ మెక్కి కృతాంతుడు సౌమ్యమూర్తి
యై, పదురునిజాప్తకింకరులుపార్శ్వయుగంబునభక్తిఁగొల్చిరా
ముదిరనినాదముం జఱచి ముందటిచక్కటిదివ్యదుందుభుల్,
మృదులగభీరనాదములుమిన్నులుముట్టఁ జెలంగుచుండఁగన్.

గీ. ఎదురుగా వచ్చి దక్షిణం బేలురాజు
ధర్మరాజు గరంబు సంతస మెలర్ప
సాధు! సాధు! మహాబుద్ధిబోధమహిత!
మేలుమే! లని శివశర్మ మెచ్చి పొగడె. 143

సీ. అభ్యసించితి వేద మాఱంగములతోడఁ
బరిచర్య చేసితి గురుజనులకు
నాదిపురాణేతిహాసంబులును ధర్మ
శాస్త్రంబు సదివితి సారధిషణ
సమబుద్ధివై మహేశ్వరుఁ బుండరీకాక్షు
సేవించి తేకాంతశీలమునను
నైవల్యకల్యాణ ఘంటాపథము లైన
తీర్థంబు లాడితి తిరిగియేడు

గీ. ననఘ! నీభాగ్యమునకు నియతియుఁ గలదె?
చూడుమా! యెంతటిపెరయొ నీసుకృతగరిమ?
భూసురోత్తమ? మాయంతలేసివారి
చే నమస్కారములు గొనఁ జెల్లె నీకు. 144

వ. అని ధర్ముండు శివశర్మ నభినందించి నిజనివాసంబునకుం
బోయెం దదనంతరంబ. 145

సీ. విప్రకులముఖ్యుఁ డంతటవినయపరత
నిటుల ననియె హృషీకేశుహితులఁ జూచి
యనఘులార! యతిక్రూరుఁ డండ్రు జముఁడు
సౌమ్యుఁడై యున్నవాఁ డేమిచంద మొకొ్క? 146

గీ. యమునిరూపంబు వర్ణింతు రఖిలమునులు
గుండె ఝల్లనునట్లుగా ఘోరలీల
జమునిఁ జూడఁగఁ గన్నులు చల్లనయ్యె
నిప్పు డారౌద్రరసరేఖ లెందుఁ బోయె? 147

గీ. ఇదియ రూపంబొ? యీతని కింక నొక్క
రూప మున్నదియో? మహాక్రోధమునకు
నెఱుఁగ నానతియిండు నా కీ రహస్య
మనఘమతులార! సందేహ మావహిల్లె. 148

వ. అనిన [1]వారలిట్లనిరి. 149

క. నినుబోటిపుణ్యవంతుల
కనఘా! శమనుండు సౌమ్య మగు నాకారం
బున నుండు దుర్జనుల కీ
యన రౌద్రాకారుఁడై యుదగ్రత చూపున్. 150

వ. ఈదండధరుండు దంష్ట్రాకరాళవదనుండును, క్రోధరక్తాంత
లోచనుండును, నూర్ధ్వకేశుండును, గృష్ణాంగుండును, బ్రళ
యాంబుదనిస్వనుండును, బరిభ్రమద్భ్రుకుటీకుటిలనిటలతట

1. శివశర్మకు పుణ్యశీల సుశీలు రిట్లనిరి.

విటంకుండును, విశదవికటాకారుండును నై దుర్వృత్తుల నీరీతి శాసించు. 151

సీ. పాదంబు లిరుకేలఁ బట్టి గుంజుండు జ
ర్జరితంబుగా వీనిఁ జట్టుబాత
మెడ మెట్టి గోర్గాంచి మెఱికి పుచ్చుండు వీని
గ్రుడ్లు రక్తములు (నెత్తురులు) చెక్కుల స్రవింపఁ
గఱికండలుగ వీనికంఠంబు వ్రేయుండు
గరసానఁ బట్టినఖడ్గధార
బలుత్రాళ్ల బంధించి తలక్రిందుగా వ్రేలఁ
గట్టుఁడు వీని వృక్షంబుకొమ్మ

గీ. అంపమున వీనికంఠంబుఁ ద్రెంపి విడుఁడు
మదమహాపుల వీనిమర్మముల నొంపుఁ
డెట్టిఁగా నగ్నిఁ గ్రాఁచినయినుపయిసుకఁ
గులికి పోయుఁడు వీనిముక్కునను జెవుల. 152

గీ. పరకళత్రంబుకుచకుంభపాళియందు
నఖముఁ దివిచినపాపాత్మునఖమునందు
నెట్టఁగా నగ్ని గ్రాఁగినయినుపసూది
లుగ్రదృష్టిని జొన్పుఁ డత్యాగ్రహమున. 153

వ. పరదారముఖాఘ్రాణంబు చేసినపాపిష్ఠువదనంబున నిష్ఠుర నిష్ఠీవనం బొనర్పుఁడు. పరదారభవనగమనం బొనర్చు కర్మ చండాలునిపాదంబులు ప్రచండతఖడ్గంబున ఖండంబులుగా ఖండింపుఁడు. పరదారాధరోష్ఠబింబంబు చుంబించునయ్యసంబంధుమూర్ధం బుద్ధతచపేటంబునం దాటింపుఁడు. పరాపవాద పరునివకుంబు లక్ష్యంబు సేసి తీక్ష్ణముఖనిశితక్షురప్రంబున

నేఁగుండు. పరసంతాపకారి కటుకవచనుం డగు కుటిల
బుద్ధిని నింగలంబుల గ్రాఁగిన సంగలంబునఁ బ్రేల్చుదురు.
పతినియందు మిథ్యాదోషం బారోపించునిర్దయ బ్రవర్ధ
నపూయశోణితకర్దమంబున ముంపుదురు. గురునిందాకర్త
యగుధూర్తునోర సంద ప్తతప్తలోహంబు పోయుదురు. పరకళ
త్రనాశకుం డగు నంకుసుకు చెవుల నిశ్శంకకలాయసశంకువులు
గూర్పుదురు. దని దండధరుండు ప్రచండకోపాటోపంబునఁ గింక
రులం జూచి పలుకు వెండియు. 154

గీ. రౌరవం బనఁగను మహారౌరవ మనఁ
గాలసూత్రంబు కుంభిపాకం బనంగ
నంధతామిస్ర మనఁగ సంహార మనఁగ
నారకంబులు మఱియు నెన్నంగఁ గలవు. 155

వ. ఈనరకంబులయందు దేవస్వభోక్తల బ్రహ్మస్వభుజుల శిశు
హంతలఁ గృతఘ్నుల గురుతల్పగుల గోఘ్నస్త్రీఘ్నమి
త్రఘ్నులఁ బరక్షేత్రసరాలయాపహర్తలఁ గూటసాక్షుల
గర్భఘ్నులఁ బ్రజాపీడాకరుల సురాపులఁ గూటశాల్మలిం
బ్రాకించియుఁ బట్టుగాల్గం బట్టించియుఁ దలక్రిందుగా(వ్రేలఁ)
గట్టించియు నిత్తుయంత్రములఁ బీడించియు నంధకూపం
బునం ద్రోపించియు నిసుపముక్కులకాకులం గఱపించియు
యమకింకరులు పెక్కువిధంబుల బాధలు వెట్టుదురు. 156

క. హరినామకీర్తనంబును
హరినామజపంబు నెవ్వఁ డాత్మఁ బఠించున్
నరకమహావేదన య
న్నరునకుఁ బ్రాపింప కుండు నయతత్త్వనిధీ!

వ. ఈయర్థంబు నీకుఁ దేటదెల్లంబు గావించెద మాకర్ణింపు మా
దికాలంబునం గృతాంతుండు నిజకింకరులతో నిట్లనియె. 153

సీ. గోవింద! భూతేశ! గోప! గంగాధర!
చాణూరమర్దన! చండికేశ!
కంసప్రణాశన! కర్పూరగౌర! గో
పీపతి! శంకర! పీతవసన!
గిరిశ! గోవర్ధనోద్ధరణ! బాలమృగాంక
ధర! మాధవ! భవ! వాసుదేవ!
విషమేక్షణ! మురారి! వృషభధ్వజ! హృషీక
పతి! భూతపతి! శౌరి! ఫాలనేత్ర!

గీ. కృష్ణ! హర! గరుడధ్వజ! కృత్తివసన!
కల్మషారి! గౌరీపతి! కమఠ! శూలి!
యనుచుఁ బఠియింతు రెవ్వ రాఘనులు మీకు
వందనీయులు చెనకంగ వలదు వారి. 150

సీ. హరి! రజనీశకళావతంస! రమేశ్వ
ర! పినాకపాణి! శ్రీరామ! భర్గ!
యనిరుద్ధ! శూలపాణి! నృసింహ! త్రిపథగా
ర్ద్రజటాకలాప! మురహర! యీశ!
రాఘవ! యురగాభరణ! పద్మనాభ! యు
గ్ర! మధుసూదన! పినాకపతి! యాంవ్య!
ప్రమథాధినాథ! నారాయణ! మృత్యుంజ
య! పురుషోత్తమ! త్రిదశైకనాథ!

గీ. యచ్యుతా! కామశత్రుప! యబ్జపాణి!
దిగ్వసన! చక్రపాణి! భూతేశ! యనుచుఁ

వలఁతు రెవ్వారు వార లుత్తములు భువన
పావనాత్మకు లందఱు ప్రభులు మీకు. 160

సీ. బ్రహ్మణ్యదేవ! శర్వ! ముకుంద! విశ్వేశ్వ
ర! సనాతన! త్రిణేత్ర రావణారి!
శ్రీకంఠ! ధర్మధురీణ! శంభున! కమ
లాధీశ! యీశాన! యుమపతి! మృడ!
ధరణీధ[1]ర! హర! యంధకహర! శార్ఙ్గపా
ణి! పురారి! విష్ణువ! నీలకంఠ!
వైకుంఠ! దేవదేవ! మధురిపుఁడ! త్రిలో
చన! కైటభరిపుండ! చంద్రచూడ!

గీ. కేశినాశ! గిరిశ! లక్ష్మీపతి! త్రిపు
రారి! వసుదేవసూనుఁడ! త్ర్యక్ష! యనుచు
జపము సేయుదు రెవ్వ రవ్విపులపుణ్య
ఘనులఁ గదిసినప్పుడ మీఱుఁ గల్గవచ్చు. 161

వ. మఱియు వినుండు. శ్రీకాంత! శివ! యసురనిబర్హణ! మన్మథ
రిపుఁడ! జనార్దన! ఖండపరశుఁడ! శంఖపాణి! శశిశేఖర! దా
మోదర! రిపుసూదన! యంబుధరనీల! స్థాణువ! యానంద
కంద! సర్వేశ్వర! యనునీదివ్యనామంబులు భావించుకృతా
ర్థులు మీకు మాననీయులు సుండి యని యివ్విధంబున
నంతకుండు గింకరవర్గంబు ననుశాసించె. ఈహరిహరనా
మంబులయష్టోత్తరశతంబు విన్నను బఠించిన జనులకు నా
రోగ్యైశ్వర్యంబులు సంభవించు. 162

1 రాయంధకరిపు జనార్దన, చటులఖండ పరశుశార్ఙ్గపాణి, త్రిపురారి విష్ణుదేవేశహరిత్రిలో.

చ. శమనుని రాజధాని యగుసంయమనీనగరంబునం గరం
బమరుదుధర్మసేనదృఢధన్వజయద్రథు లాదిగా నృపో
త్తములు నిశాంతనిర్మలినధర్మధురందరు లుండ్రు నిర్వ్యపా
యమున నుదర్ఘ్యరత్నమయహారిహిరణ్మయహర్మ్యవీథులన్.
వ. అని యువ్విధంబున. 164

స్వర్లోకవృత్తాంతము

తే. శమనలోకాభివర్ణనశ్రవణపరత
నరుగుచుఁబోవఁగ శివశర్మ యొయ్యఁ జేరె
నస్వర్లోక మది ప్రసూనాశుగునకు
లోకవిజయైకపట్టాభిషేకభూమి. 165
వ. అప్పుడు శివశర్మ విష్ణుశీలసుశీలుర కిట్లనియె.
తే. ఎవ్వరోకో? వీరు విమలపూర్ణేందుముఖులు
దివ్యభూషామహారత్నదీప్తిజాల
పరిధిచక్రావరణమధ్యభావ్యమాన
భువనమోహనమూర్తు లిప్పురమునందు. 167
వ. అనిన వార లిట్లనిరి. 168
సీ. ఏయిందుబింబాస్య లిక్షుకోదండుని
త్రైలోక్యరాజ్యాధిదైవతంబు
లేయింతులకుఁ బుట్టినిల్లు దుగ్ధాంభోధి
మధుకైటభారాతిమదుఁగుఁబాన్పు
ఏచకోరాక్షుల కింద్రచంద్రజయంత
నలకూబరాదులు ననుపుమిండ
లేపువ్వుఁబోడులయిరియింతచూపుల
ఋషులవంటిమనంబు లిగురువెట్టు

తే. మహితభక్తి నేఁభామేఁమునుమరాండ్ర
దక్షిణానందవనమహాస్థానసీమఁ
భీమనాథేశ్వరునకు సుత్రాముఁ డిచ్చె
ననఘ! వీరు సుమ్మయ్య! యప్సరసలు. 169

వ. ఊర్వశీ, మేనక, రంభ, ఘృతాచి, చంద్రరేఖ, తిలోత్తమ, వపుష్మతి, కాంతిమతి, లీలావతి, యుత్పలావతి, యలంబుస, గుణవతి, స్థూలకేశి, (కళావతి), కలానిధి, (గుణనిధి), కర్పూరతిలక, యుర్వర, యనంగతిలక, మదనమోహిని, చకోరాక్షి, చంద్రకళ, మునిమనోహరి, చారునాద, సువర్ణిక, దారుసంజీవని, క్రతుశుల్క, శుభానన, తపశ్శుల్క, తీర్థశుల్క, దానశుల్క, హేమావతి, పంచాశ్వమేధిక, రాజసూయార్థిని వీరు మొదలుగా నలువదివేలు దివ్యాప్సరస్త్రీలోకంబునం దధివసింతురు.

సీ. బ్రహ్మచర్యం బొక్కరాత్రి దైవికమున
మఱచి తప్పినయట్టిమాస (చ)కమ్మ
కలకాల మెల్లను గామితవ్రతములు
సలిపినట్టిచకోరశాబనయన
బలిమి నొక్కనికి లోఁబడి వాని నవ్వేళఁ
బతిఁ గాఁ దలంచినపద్మగంధి
పురుషుఁడు లేనియప్పుడు ప్రమాదంబున
మోసపోయినయట్టిముగ్ధరాలు

తే. భోగదానవ్రతంబులఁ బూని యెపుడు
మకరకేతను నర్చించుమాఁటివంద
కన్నెవయసునఁ గన్నెఱికంబుఁ దప్పి

పిదపఁ బలిభక్త యగునాతి త్రిదశవేశ్య. 171

తే. మాంత్రికుం డైన యొకసిద్ధమౌని నొండె
నొక్కవేలుపు నొండెఁ బ్రియుండు వనుప
పుత్త్రసంతానలబ్ధికై పొందెనట్టి
లోలలోచన కప్సరోలోక మబ్బు. 172

సూర్యలోకవర్ణనము

వ. అని చెప్ప నప్సరోలోకంబుఁ గనుంగొనుచు భాస్కర
లోకంబు చేరం జని యేకచక్రంబును సప్తసప్తియు ననూరు
సారథికంబును నప్సరోమునిగంధర్వామరోగసమన్వితంబును
నగు రథంబుమీఁదఁ గరధృతారవిందద్వయుం డయి నభో
మార్గంబునం జను కమలబాంధవునిం జూపి విష్ణుకింకరు
లి ట్లనిరి. 173

సీ. సిద్ధాంతసంసిద్ధి సిద్ధసంఘంబును
విధ్యుక్తపరిపాటి విబుధకోటి
చాటుధారాప్రౌఢిఁ జారణవ్యూహంబు
కిన్నరవ్రాతంబు గీతసరణి
ఖచరసంఘము విశృంఖలమణి వైచిత్రి
యాతుధానశ్రేణి యధికభక్తి
గరుడలోకము నమస్కారవాక్యంబున
నేకాగ్రమతి దందశూకసమితి

తే. ప్రతిదినంబును బ్రాతరారంభవేళ
నిర్ణిబంధననిరుపాధినిరవగాధ
నిర్విరోధనిరాఘాటనిరుపమాన
భక్తి సంభజియింతు రీపద్మబంధు. 174

సీ. సంచారలోలుండ వౌ జగదుపక్రియకు నై
సమధికస్థైర్యంబు జరుపుఁ గాని
జనులదృష్టికి వెక్కసం బై విభాసిల్లు
లోనఁ జైతన్యంబు నీనుఁ గాని
సంతాపహేతు వౌ సంయమిశ్రేణికి
నిర్వాణలీల యీ నేర్చుఁ గాని
ఖరరుచిత్వముఁ బూనుఁ గాలక్రమంబున
శీతలామృతము వర్షించుఁ గాని

తే. ప్రాగవస్థాభ్యధికతరోపస్యవస్థ
నతిశయిల్లుచు భువనంబు లఖిలములును
వార కత్యంతచాతుర్యవైభవమున
ననఘ! రక్షించుచుండు నీయబ్జహితుఁడు. 175

వ. అని రప్పుడు శివశర్మ దా నొనర్చునమస్కారంబు లంగీక
రించుచు నిమేషార్ధమాత్రంబున రెండువేలు నిన్నూట
రెండుయోజనంబు లతిక్రమించినం జూచి యాశ్చర్యం
బంది గోవిందకింకరుల కి ట్లనియె. 176

తే. అనఘులార! ఖరాంశుబింబాంతరమునఁ
బురుషు నొక్కని నుండఁ జెప్పుదురు బుధులు
పరమతాత్పర్యగరిమ నప్పురుషు నెట్లు
సేవసేయుదు రొక్కొ సంసిద్ధిపరులు? 177

వ. అనిన వార లి ట్లనిరి. 178

సీ. ఆకాశమధ్యస్థ మగుభానుబింబంబు
వినులక్షయోజనవిస్తృతంబు

తన్మధ్యమందున ధవళాంశుశేఖరు
సుద్గీతవిద్యాప్రయోగసరణి
హైమరూపుఁడు హిరణ్యశ్మశ్రుకేశుండు
నానాప్రముఖహిరణ్యనయపుఁడు
గాఁగ భాగించి యాకమలలోచనుఁ డుండు
నతఁడ యే నని సదాధ్యానపరత
తే. విమలమానసుఁ డగుచు భావింపవలయు
బ్రహ్మవిద్యాంసుఁ డగువాఁడు ప్రాహ్ణవేళ
నర్కునర్ధోదయమున గాయత్రిఁ గూర్చి
యర్ఘ్య మెత్తినయాచమనాంతరంబు. 179

వ. కాలలోపంబు సేయవలదు. కాలంబు ప్రతీక్షించునట్టిది. కాలంబునం గదా యోషధులు ఫలించు. కాలంబునం గాక పాదపంబులు పూచునే? కాలంబుననే మేఘంబులు వర్షించు. మందేహదేహనాశార్థం బుదయాస్తమయంబుల బ్రాహ్మణోత్సృష్టంబగు గాయత్రీమంత్రతోయాంజలిత్రయంబు చిత్రభానుం డపేక్షించుచుండు. కాలంబు దప్పకుండ సదుపాస్యమానుం డయి భానుం డాయురారోగ్యైశ్వర్యంబులు ప్రసాదించు. 180

సీ. మేలైనరెండుతొమ్మిదులు విద్యలలోన
మననీయ మగుచు మీమాంస వెలయు
మీమాంసకంటెను మిగులు ప్రాభవమునఁ
దర్కశాస్త్రము శుభోదర్కగరిమ
తర్కశాస్త్రముకంటెఁ దా నభ్యధికంబు
వివరించి చూడంగ వేదరాశి

యామ్నాయములకంటె నభ్యర్హితంబులు
చర్చింప నుపనిషత్సముదయములు
తే. నుపనిషత్తులకంటెను నూర్ధ్వపదవి
మంత్రరాజంబు గాయత్రి మహిమఁ గాంచుఁ
బ్రణవ మనుసుక్రేపుతోఁ గూడి పాఁడిఁ బిదుకు
నవనిసురులకు గాయత్రి యనెడిసురభి. 181
తే. మంత్రములలోన గాయత్రిమహిమఁ గాంచు
నగరములలోనఁ గాశి యున్నతి వహించు
దైవతంబులలో సుధాధామమౌళి
విశ్వనాథుండు ప్రాధాన్యవిభవ మొందు. 182
స్రగ్ధర. గాతారం త్రాయతే నాఁగలిగిన తెలివిన్
గల్గె గాయత్రి కర్థా
న్వితం బై నామధేయం బితరమనువులం
దీప్రభావంబు లేదీ
ప్రాతస్సంధ్యాహ్నసాయోపగమములఁ బర
బ్రహ్మవిద్వాంసు లార్యుల్
జ్యోతిర్మూర్తిన్ భజింతు ర్సురగణవినుతున్
సూర్యునిన్ సిద్ధవిద్యన్. 183
క. గాయత్రి పరబ్రహ్మము
గాయత్రి కధీశ్వరుండు కమలాప్తుఁడు శ్రీ
గాయత్రీమంత్రమునకు
నేయవియును సాటి వచ్చునే మంత్రమ్ముల్? 184
వ. ఈవేదమూర్తి హంసుండు, భానుండు, సహస్రాంశుండు, తప
నుండు, తాపనుండు, రవి, వికర్తనుండు, వివస్వంతుండు,

విశ్వకర్మ, విభావసుండు. విశ్వరూపుండు, విశ్వకర్త, మార్తాండు(ండు, మిహిరుం), డంశుమాలి, యాదిత్యుం, డుష్ణగుండు, సూర్యుం, డర్యముండు, బధ్నుండు, దివాకరుండు, ద్వాదశాత్ముండు, సప్తహయుండు, భాస్కరుం, డహస్కరుండు, ఖగుండు, సూరుండు. ప్రభాకరుండు, శ్రీమంతుండు, లోకచక్షువు, గ్రహేశ్వరుండు, త్రిలోకేశ్వరుండు, లోకసాక్షి, తమోరి, శాశ్వతుండు, శుచి, గభస్తిహస్తుండు, తీవ్రాంశుండు, తరణి, మహారణి, ద్యుమణి, హరిదశ్వుం, డర్కుండు, భానుమంతుండు, భయార్ధకుండు, ఛందోశ్వుండు, వేదవేద్యుండు, భాస్వంతుండు, పూష, వృషాకపి, యేకచక్రరథుండుఁ మిత్రుండు, మందేహారి తమిస్రహుండు, దైత్యహుండు, పాపహర్త, ధర్ముఁడు, ధర్మాధర్మార్థహేళి, చిత్రభానుండు, (కళిందుండు) తార్క్ష్యవాహనుండు, దిక్పతి, పద్మినీనాయకుండు, కుశేశయకరుండు, హరి, ఘర్మరశ్మి, దుర్నిరీక్షుండు, అరుణుండు, కశ్యపాత్మజుం డనునీడెబ్బదినామంబులు గలిగియుండు. 185

సీ. మోకాళ్లు భూమిపై మోపి హస్తాంబుజ
ద్వయమునఁ దామ్రపాత్రము ధరించి
యర్ఘ్యోదకంబులయందు దూర్వాంకురా
క్షతలును నవరక్తచందనంబు
కరవీరముఖ్యరక్తప్రసూనంబులు
వైచియొక్కొక్క పేర్వరుసతో న
మోంతంబుగాఁ జతుర్థ్యంతంబుగాఁ బ్రణ
వాదిగాఁ బఠియించు చర్ఘ్యపాత్ర

తే. మౌళిపర్యంత మెత్తుచు మాటిమాటి
కర్ఘ్య మిచ్చినఁ బ్రీతుఁ డై యర్కుఁ డొసఁగు
సేవకుల కాయురారోగ్యధీవివేక
భాగ్యసౌభాగ్యవైభవప్రాభవములు. 186

సీ. అది గుహ్య మై యకారాదిక్షకారాంత
పంచాశదక్షరప్రకృతి యైన
మాతృక యై మహామంత్రరాజంబు నై
దవయవంబులఁ బుట్టె నం దకార
మునకును నోంకారమునకు మకారంబు
నకు బిందువునకును నాదమునకుఁ
బ్రత్యేకము పదేసిపదియేసివర్ణంబు
లనఘ! జన్యంబు లై యతిశయిల్లు

తే. నట్టిప్రణవంబు హేమసింహాసనమున
భాస్కరుం డనుమాణిక్యపదకభూష
యఱుత ధరియించి దేవి గాయత్రి యొప్పుఁ
గడుపుచల్లంగ వేదాళిఁ గన్నతల్లి. 187

క. సంశితవిజ్ఞానచతు
ర్వింశతితత్త్వంబులకును వేడుకతో నీ
యంశుమదధిపతిమంత్రము
సంతోషముగ నెపుడు మన కొసఁగు నభిమతముల్. 188

సీ. మూఁడువేదంబులు మూఁడుపాదంబులు
నాభి యాదిమపురాణవ్రజంబు
క్రిందు మీఁదును జతుర్దిశలు నాల్గక్షులు
భువనంబు దేహంబు దివి యుదరము

ధర్మశాస్త్రంబు హృత్సరసీజముకుళంబు
ఛందోవితతి కుచస్తబకయుగము
సాంఖ్యశాస్త్రంబులు శ్రవణపాశంబులు
జాతవేదుఁడు వక్త్రచంద్రబింబ
తే. మైదతలలును శిక్షాదులంగకములు
చేష్ట యాథర్వణశ్రుతి శిఖ శివుండు
బ్రహ్మ మూర్ధంబు హరి యాత్మ భావలక్ష
ణములు మీమాంస సావిత్రి కమలచరిత! 189

క. వ్యాహృతులతోడఁ బ్రణవో
ద్గ్రాహముతో శిరముతోడఁ గనులాప్తమనఁగ
ప్రాహుణికం బై యీమను
వాహుతిఁ గొనుఁ బాతకముల నగ్నియుఁ బోలెన్. 190

మ. క్షితిదేవోత్తమ! బ్రాహ్మణుండు వెలిగా జిహ్మాభిచారక్రియా
క్రతుతంత్రంబున శాత్రవుఁ గుఱిచి యీగాయత్రి వర్ణావళిన్
బ్రతిలోమంబున నుచ్చరించి విడువన్ బ్రహ్మాస్త్రమై తాఁకి యా
ప్రతిపక్షుం దెగటార్చు నంగుళిశిఖాప్రస్ఫోటమాత్రంబునన్.

సీ. గాయత్రి విష్ణుండు గాయత్రి శంభుండు
గాయత్రి పరమేష్ఠి కర్మనిష్ఠ
గాయత్రి విధివిష్ణుకమలసంభవమూర్తి
యైనమార్తాండుండు మౌనివర్య!
గాయత్రి జపియించి గాయత్రిఁ గొనియాడి
కాంచు విప్రుఁడు ముక్తి కలితపుణ్య!
గాయత్రి సేవించు కాలంబు గాలంబు
మంత్రతంత్రములు నిర్మలవివేక!

తే. యనఘ! సావిత్రి యనఁగ గాయత్రి యనఁగ
విశ్వజననయిత్రి యనఁ జతుర్వేదమాత
యనఁ బరాపరబ్రహ్మాద్వయం బనంగ
నమ్మహాదేవికి సమాహ్వయాంతరములు. 192

వ. అని పుణ్యశీలసుశీలురు సూర్యలోకమాహాత్మ్యం బభివర్ణింప నాకర్ణించుచు శివశర్మ మున్పట నయనానందసందోహాసంధాయి యగునొక్కపట్టణంబుఁ గనుంగొని యవ్విష్ణుకింకరుల కిట్లనియె. 193

తే. పుండరీకాక్షులార! యీపురవరంబు
నెఱయ సుత్సవ మొనరించె నేత్రమునకు
నెఱుఁగఁ జెప్పుఁడు నా కది యేభువనమొ
శోభితం బైనకారుణ్యవైభవమున? 194

స్వర్గలోకవర్ణనము

తే. అనిన వా రిది నముచిమర్దనునివీడు
కనకగోపురకనకకాట్టకనకసౌధ
కనకకుట్టిమవేదికాకనకభిత్తి
కనకరాజీవసరసీప్రకాశితంబు. 195

సీ. చికిలించుకొనియుండు జిలుఁగుతెప్పలలోనఁ
గుసుమసాయకవైరినొసలికన్ను
పద్మనాభునికౌస్తుభముకాంతి వెలిపోయెఁ
బద్మచన్నులమీఁదిపసుపు దాఁకి
ధళధళుక్కన నింగిఁ దాటించి చనుఁ గాని
నిలువనేరదు హ్రాదినీప్రకాశ

మస్తినాస్తిప్రకాశానుసారంబున
మినుమిన్కుమను చుండు ననలుదీప్తి
తే. పగలు పగ లయ్యె శశివిభాప్రసరమునకు
దాన పొడక్కు దీప్తిసంతానమునకు
నసఁగ గసఁగసఁ గనకవర్ణాభుఁ డైన
భానుఁ డేతత్పురీసమీపమున నడచు. 196

చ. అమవసలందు నా సరసిజాప్తునిగర్భము దూఱఁ బోవునా
సమయమునన్ స్వకీయమగుచంద్రిక నిల్లడవెట్టెనో సుమీ
యమృతమయూఖుఁ డీనెలవునందను సంశయమావహించె ను
త్తమకుల! చూడు మిప్పురిసుధాధవళోన్నతసౌధవీధికల్.

శా. పౌనఃపున్యము సంఘటింపఁ దొడఁగెన్ బ్రహ్మాన్వయోత్తంస!
గో, క్షీనాగ్రంబున లేఁగ పెయ్య యిది కంటే కామధేనూద్భ
వం, బానందంబున డెందముబ్బఁగ జనన్యాపీనవాపీసుధా,పా
నోత్పుచ్ఛమనూనమౌచటులరుఘుంపాతాండవాటోపమున్.

శా. కంటే స్వర్గకరికంఠపీఠవిలుఠద్గ్రైవేయలోహార్గళా
ఘంటాటాంకృతి నాదసౌధవలభీగర్భంబులందార్కొనం
ఘంటావీథి: జరించుచున్నది పురాగారంబు వీక్షించి వె
న్వెంటన్ దివ్యకరేణువభ్ర ముపధావింపంగ దర్పోద్ధతిన్.

క. నందనవన మిదె ధరణీ
బృందారక! యల్ల పెద్ద పృథివీరుహముల్
మందారకల్పతరుహరి
చందనసంతానపారిజాతాహ్వయముల్. 200

మ. దివిజాధీశుసుధర్మ యన్ సభ సముద్వీక్షింప భూదేవ! రెం
డవకైలాసముపోలె నున్నయది బ్రహ్మాండంబుతో రాయు

చున్, ధవళాభీలసుధాట్టహాసవిమల ద్రాఘిష్ఠశృంగాగ్ర మై
యవదాతధ్వజశాటికాంచలచపేటాధూతజీమూతమై. 201

సీ. చెలువు లేటికి రేలు శిశిరాంశుకరములఁ
గరఁగుచంద్రోపలగిరులు గలుగఁ?
గల్పవృక్షంబులు గలుగంగ నేటికి
వలువలకై తంతువాయసమితి?
గణకు లేమిటికి సంకల్పార్థచింతకుఁ
జింతామణిశిలాశ్రేణి గలుగఁ?
గామధేనువులు గల్గఁగ నేమిటికి మఱి
యోదనంబునకు నై యౌదనికులు?

తే. నాఁగ సర్వపదార్థజనస్థలంబు
భూరికల్యాణవైభవకారణంబు
విశ్వభువనైకవినుతంబు విబుధరాజ
పట్టణం బిది పంకజప్రభవవంశ్య! 202

శా. క్షీరాంభోనిధి సంభవించినఘృతాచీమేనకామంజుఘో
షారంభాహరిణీతిలోత్తమలు విశ్వాచీచకోరాక్షులున్
స్వారాజప్రియవారభామినులు నానాభూషణాలంకృతల్
గారా మూరఁగఁ జూతు రున్నలనీకంజాక్షులం జూడుమీ!

వ. ఈయింద్రలోకంబునందుఁ దరురత్నంబు పారిజాతంబు, గాం
తారత్నం బూర్వశి, వనరత్నంబు నందనంబు, తురగరత్నం
బుచ్చైశ్శ్రవంబు, గజరత్నం బైరావతంబు, రత్నరత్నంబు
చింతామణి, సప్తార్చిఃప్రభృతు లగుసప్తలోకపాలురు, నార
దాదిమునులు, దనుజమనుజదైత్యులు, గంధర్వయక్షకిన్నర
కింపురుషులు, నగరనలనహుషమాంధాతృదుందుమారాదివ

సుంధరాధిపతులు, జ్యోతిష్టోమాదియాగంబులు చేసినసోమ
యాజులుం, దులాపూరుషాదిమహాదానంబులొనర్చినదాతలు,
సంగ్రామంబులనపరాఙ్ముఖులై యక్లీబవాదులై యీల్గినవీరులు
వసియింతు రని యనంతరంబ యగ్నిలోకంబున నర్చిష్మతీపు
రంబు చేరం గొనిపోయి శివశర్మకుఁ బుణ్యశీలసుశీలు రిట్లనిరి.

సీ. అమరావతీపురం బమరవల్లభుఁ డేలు
నర్చిష్మతీపురం బగ్ని యేలు
శ్రాద్ధదేవుం డేలు సంయమనీపురం
బసురనాయకుఁడు పుణ్యవతి నేలు
నమలవతీపురం బంబునాయకుఁ డేలు
వాయు వేలును గంధవతిపురంబు
నలకాపురంబు యక్షాధీశ్వరుం డేలు
నైశాని యేలు చన్ద్రార్ధమౌళి

తే. యనిరి దిక్పాలపురములఁ దవనిసురుఁడు
రెండవపురంబు నీక్షించి ప్రీతి నుండె
నపుడు వర్ణింపఁ దొడఁగి రయ్యగ్నిలోక
మహిమసంపద గోవిందమాన్యహితులు. 205

సీ. శిఖ కర్మఠులకు నిశ్రేయసశ్రీదాత
ధరణీసురులకుఁ దీర్థంబు వహ్ని
యాశుశుక్షణి గురుం డవనినిర్జరులకు
నగ్రవర్ణుల కగ్ని యాశ్రమంబు
దహనుఁ డేడ్గడయు నుత్తమవర్ణభవులకుఁ
బావకుం డీశుండు బ్రాహ్మణులకుఁ
బ్రత్యయంబు తనూనపాత్తు బాడబులకుఁ

బాలుల కనలుండు పారిజాత

తే. మాశ్రయాశుండు ప్రాణుల కంతరాత్మ
చంద్రశేఖరమూర్తి యుపర్బుధుండు
సకలజగదుద్భవస్థితిసంహృతులకుఁ
గేవలము హేతుభూతుండు కృష్ణవర్త్మ. 206

మ. వివిధాజ్యాహుతిధూపదీపములునై వేద్యంబు నీయగ్నిమూ
ర్తిని గోఁ బిమ్మట భుక్తిముక్తుల నవశ్యప్రీతిగా నెప్పుడూ
ర్జని గోం ద్రంబుజసంభవాచ్యుతమహేశానాదిబృందారక
ప్రవరు ల్సర్వహృషీకతర్పణముగా బ్రహ్మాదపాంగతా! 207

వ. అనిన విని శివశర్మ వైశ్వానరుం డనంగ నెవ్వం? డెవ్వనిత
నూజుం? డేప్రకారంబున నాగ్నేయం బైనతేజం బతనికి
సంభవించె? మహాత్ములారా! యెఱింగింపుం డనిన వారు వై
శ్వానరమాహాత్మ్యంబు వివరింపఁ దొడఁగి యిట్లనిరి. 208

వైశ్వానరమాహాత్మ్యము

సీ. విశ్వానరుండు నానీశ్వరభక్తుండు
శాండిల్యగోత్రసంజాతుఁ డనఘుఁ
డభినుతబ్రహ్మచర్యాశ్రమనిష్ఠుఁ డై
బ్రహ్మయజ్ఞములు తప్పక యొనర్చు
నిరతుఁ డై విజ్ఞాతనిఖిలశాస్త్రార్థుఁ డై
లోకతత్త్వజ్ఞుఁ డై యేకతమున
నొకనాఁడు చింతించుచుండె నేయాశ్రమం
బొక్కొ నాల్గింటిలో నుత్తమంబు!

తే. భక్తి నేయాశ్రమంబు చేపట్టినప్పు
డైహికాముష్మికఫలంబు లందవచ్చు?

నిదియ మే లన్నయ ట్లుండు నిదియ లెస్స
యున్నయ ట్లుండు నొక్కొక్కయాశ్రమంబు. 209

వ. అది యెట్లనిన వర్ణాశ్రమాచారంబు శివప్రసాదద్వారంబున
జ్ఞానసాధనంబు అందు వర్ణధర్మంబులు బ్రాహ్మణుండు బృహ
స్పతిసవనంబునను, రాజు రాజసూయంబునను, వైశ్యుండు
వైశ్యస్తో (స్తో) మంబునను యజియింతురనునివియాదిగాఁగల
యవి. మఱి యాశ్రమధర్మంబుఁ లధ్యయనాదులు బ్రహ్మచారి
ధర్మంబులు, గృహస్థధర్మంబు లగ్న్యాధానాదులు, వానప్రస్థ
ధర్మంబు లరణ్యవాసాదులు, యతిధర్మంబులు శ్రద్ధాదులు,
బ్రహ్మచారిగృహస్థవానప్రస్థభిక్షు(కు)లయాశ్రమంబులు త్తరో
త్తరంబు లుత్కృష్టంబు, లీచతురాశ్రమంబులవారును నిజ
కర్మానుష్ఠానంబులు దప్పక యీశ్వరపూజాతత్పరులై సంసిద్ధి
వడయుదురు. నాకుం జూడ నన్నియాశ్రమంబులకు నాధార
భూతం బై (న)గృహస్థధర్మంబు ముక్తిసాధనం బై తోఁచు
చున్నయది. సర్వాశ్రమంబులకుస్వరూపలాభంబుగృహస్థాశ్ర
మ నిబంధనంబ. కొందఱు 'వర్ణాశ్రమాచారనిష్ఠునకు బ్రహ్మ
నిష్ఠ సిద్ధింపదు. బ్రహ్మనిష్ఠ యన సర్వవ్యాపారపరిత్యాగం
బున ననన్యచిత్తంబునం జేసి బ్రహ్మంబు నెఱుంగుట, యది
కర్మానుష్ఠానకర్మత్యాగంబులకు స్వరూపంబుఁ బరస్పరవిరో
ధంబుఁ గావునఁ గర్మశీలునియందు సంభవింప' దండ్రు. వర్ణా
శ్రమకర్మానుష్ఠానవంతునకు యథావశంబున బ్రహ్మనిష్ఠా
తాత్పర్యంబు సుకరంబు గావునఁ గర్మపరుండు బ్రహ్మంబు
నెఱుంగండను నిషేధోక్తి(కి)ంబని లేదు. పరదారపరిత్యాగం
బునను నాత్మదారపరితోషంబునను ఋతుకాలాభిగమనంబునను

బ్రహ్మచారియుఁ రాగద్వేషకామక్రోధవర్జనంబున వానప్రస్థుం
డును' నయాచితోపస్థితదేహయాత్రామాత్రంబున భిక్షు
కుండును నై గృహస్థుం డఖిలాశ్రమంబులు తాన కైకొను.
దేవయజ్ఞంబు, పితృయజ్ఞంబు, భూతయజ్ఞంబు, మనుష్య
యజ్ఞంబు, బ్రహ్మయజ్ఞం బనుపంచమహాయజ్ఞంబులం జేసి వివి
ధహోముఖంబున గృహస్థుండు ముక్తుం డగు. కావునఁ
గార్హస్థ్యం బగుధర్మంబునం గైవల్యంబు వడసెద. 210

మ. అని యత్యుత్తమవంశసంభవ వివాహం బయ్యె శాస్త్రోక్తవి
ధ్యనురూపంబున భాగ్యలక్ష్మిగ(వ)తికల్యాణిం గుణాన్వితశో
భనపుణ్యాకృతి విప్రకన్యక మహాభాగుండు విశ్వానరుం
డనురూపస్థిరపుణ్యలగ్నమున వంశానందసంధాయియై. 211

ఉ. చేడియనామధేయము శుచిష్మతి యాచిగురాకుఁబోఁడికిన్
వ్రీడయుఁ గేళిభావమును వృత్తపయోధరము ల్నితంబముల్
బాడబునెమ్మనంబు రతిభావముతోడన నాఁడు నాఁటికిన్ [న్.
వీడఁగఁ జొచ్చె బాల్యమును వీడఁదొడంగె దదీయచింతతో

సీ. అనుదినంబును బ్రాతరారంభవేళల
నోలగందంబుతో నుదకమాడి
యంచువన్నియతోడ నంద మైనమడుంగు
నిద్దంపుఁ బుట్టంబు నెఱికి గట్టి
నెఱియంగఁ గూడని నెఱికూఁకటులు పాఁచి
పొంకంబుగాఁ గమ్మపూలు దుఱిమి
కాశ్మీరతిలకరేఖామధ్యమునయందుఁ
బుణ్యంపుఁజిఱుబొట్టు పొందుపఱిచి

తే. విసువు లేక యగ్నిహోత్రంబు వేల్వఁ బెట్టు
దీపధూపంబు లొడఁగూర్చు దేవపూజ
కోగిలంబులు గావించు నొప్పుగాఁగ
బాల ప్రాణేశహృత్ప్రియయయి కల్పింప. 213

వ. అనంతరంబ యౌవనారంభమున నారంభోరువు వినయవతియు, వివేకవతియు, విలాసవతియు, విభ్రమవతియు, శాంతిమతియు, సౌజన్యవతియు, సౌహార్ద్దవతియు నై శుశ్రూషాతాత్పర్యంబునం బతిడెందంబున కానందంబు సంపాదించుచుండం బెద్దకాలం బరిగిన. 214

తే. కానరాదయ్యెఁ బుత్త్రసంతానలబ్ధి
యెన్ని నోములు నోఁచిన నిందుముఖికి
నంత నొకనాఁడు తరుణి యేకాంతవేళ
విభునిపాదంబులకు మ్రొక్కి విన్నవించె. 215

ఉ. కట్టితిఁ బట్టుఁబుట్టములు కాంచనభూషణముల్ ధరించితిం
బెట్టితి బంధుకోటికి నభీప్సితవస్తుచయంబు గీర్తి చే
పట్టితి మీపదాబ్జములు పాయక నిచ్చలు సేవసేయఁ గాఁ
బట్టి వసుంధరం గలరె భామలు నాసరి భాగ్యసంపదన్? 216

క. సకలైశ్వర్యసమృద్ధులు
నొకతల సంతానలాభ మొకతల యిది యే
టికిఁ దడసె? నిందురేఖా
మకుటునికృప యేల లేదు మన కిప్పాటన్? 217

క. చింతించి చూడవచ్చిన
సంతానము వంశమునకు సకలంబునకున్

సంతానము సురధేనువు
చింతామణి సిద్ధరసము! చిరతపపుణ్యా! .218

వ. సంతానంబు గలుగునట్టియుపాయంబు చింతింపు మని
ప్రార్థించిన. 219

ఉ. ఇంతవిచార మేమిటికి నిందునిభానన! నెమ్మనంబులో
సంతతిలబ్ధికై విడువు శంక శశాంకకళాకిరీటుఁ గా
లాంతకుఁ గాశికానగరహాటకనిర్మలహర్మ్యమాలికా
భ్యంతరవర్తి విశ్వపతి నాశ్రితవత్సలు నాశ్రయించెదన్. 120

వ. అనిన విని శుచిష్మతి దేవి యర్చిష్మత్ప్రభావుం డగుభర్తకు
వెండియుం బ్రణమిల్లి పాణిపల్లవంబులు మొగిడ్చి వినయ
వినమితోత్తమాంగ యై యార్య (పుత్రా!) పుత్రసంతానలా
భంబు నాయందుం బడయ నభిమతంబ యేని నేనుం
బ్రసాదభాజనంబ నగుదు నేని నిందుశేఖరసదృశుం డైన
నందనుం బ్రసాదింపు మనుటయు. 221

తే. ధర్మగేహినిపైఁ గలకూర్మి పేర్మి
శంసితవ్రతుఁ డైనవిశ్వానరుండు
వనరుహాయతనేత్ర కోరినవరంబు
మునికులశ్రేష్ఠుఁ డిచ్చితి ననుచుఁ బలికె. 222

సీ. ఇంతి మనోరథంబెట్లు నీయఁగ వచ్చు?
నేయింతి పతి వేఁడె నిట్టివరము?
వరము వేఁడిన వేఁడవచ్చుఁ గా కిబ్భంగి
నీ నేరవచ్చునే యీప్సితార్థ?
మాగమంబులు సమానాధికరహితుఁ గా
శీతాంశుశేఖరుఁ జెప్పుచుండు

నారుద్రు లీలావతార మీచపలాక్షిఁ
దనకుఁ గారణముఁ గాఁ దలఁచె నొక్క-

తే. కానినాఁ డిట్టితలఁ పెట్లు గలుగనేర్చుఁ
దరుణి? కంచు వితర్కించి తరతరంబ
యొకముహూర్తంబుతడవు నైష్ఠికతఁ బూని
శంభుభక్తిపరుండు విశ్వానరుండు. 223

వ. అనంతరంబ యమ్మునీశ్వరుండు తపఃప్రభావంబున భవుని ఫాలలోచను భర్గు భాగీరథీతీరభవను భక్తనిధి భక్తిభావను భావనాసులభస్వభావు భజింతుం గాక యని భవభయోదన్వదుత్తారయానపాత్రం బైన కాశీక్షేత్రంబునకుం జని. 224

సీ. మందాకినీవారి మణికర్ణికాంబువు
వాపికాకూపపల్వలజలంబు
కుండికాసలిలంబు కుల్యాప్రవాహంబు
సెలయేటిపాథస్సు చెలమనీరు
ధారాకృపీటంబు తమ్మిబావిపయస్సు
కాసారనీరంబు గ్రయ్యతోయ
మూటకాండము బుగ్గయుదకంబు జలపుష్క-
రము నదహ్రదశంబరంబు లివియుఁ

తే. మొదలుగా సర్వసర్వతోముఖము కాశి
తీర్థరాజంబులుగ సమర్థించు శ్రుతులు
గాన యిన్నింటియందు విశ్వానరుండు
దేవసంకాశుఁ డతిభక్తిఁ దీర్థ మాడె. 225

తే. అవని దివిజుండు మణికర్ణికాదిపుణ్య
తీర్థములయందు దేహంబుఁ దేల్చి తేల్చి

శాంతిఁ బొందించెఁ బ్రాగ్జన్మశతసహస్ర
పరిచితం బైనబహులతాపత్రయంబు. 226

సీ. భద్రేభముఖులకు భద్రకాళికలకుఁ
గాలభైరవులకు గణపతులకు
నాదికేశవముఖ్యు లైనకేశవులకు
లోలార్కముఖు లైన హేళులకును
బ్రణమిల్లి సురనదీమణికర్ణికాదితీ
ర్థములఁ బిండప్రదానములు చేసి
పాయసాపూపాదిబహువిధాన్నంబుల
జగతీమరుత్సహస్రంబుఁ దనిపి

తే. కానవచ్చినయట్టిలింగంబులకును
కానరానినిగూఢలింగంబులకును
బుణ్యవాసరముల మహాపూజ చేసి
యాతఁ డిట్లు వితర్కించె నాత్మలోన. 227

వ. ఓంకారేశ్వరుండు, కృత్తివాసేశ్వరుండు, కాళేశ్వరుండు, వృద్ధకాళేశ్వరుండు, గళేశ్వరుండు, కేదారేశ్వరుండు, కామేశ్వరుండు, చంద్రేశ్వరుండు, త్రిలోచనేశ్వరుండు, జ్యేష్ఠేశ్వరుండు, జంబుకేశ్వరుండు, జైగిషవ్యేశ్వరుండు, దశాశ్వమేధేశ్వరుండు, ద్రుమిచండేశ్వరుండు, (దృక్కేశ్వరుండు,) గరుడేశ్వరుండు, గోకర్ణేశ్వరుండు, గణేశ్వరుండు, డిండీరేశ్వరుండు, గజసిద్ధేశ్వరుండు, ధర్మేశ్వరుండు, తారకేశ్వరుండు, చండికేశ్వరుండు, మోక్షేశ్వరుండు, గంగేశ్వరుం, డత్రీశ్వరుండు, ప్రీహికేశ్వరుండు, (త్రిపురేశ్వరుండు, మార్కండేయేశ్వరుండు,) మణికర్ణికేశ్వరుండు, యమునేశ్వ

రుండు, లాంగలీశ్వరుండు, శ్రీవిశ్వేశ్వరుండు, అవిముక్తేశ్వరుండు, విశాలాక్షీశ్వరుండు, వ్యాఘ్రేశ్వరుండు, వారాహేశ్వరుండు, వ్యాసేశ్వరుండు వృషభధ్వజేశ్వరుండు, వరుణేశ్వరుండు, విధీశ్వరుండు, పరమేశ్వరుండు సోమేశ్వరుం, డింద్రేశ్వరుండు, సంగమేశ్వరుండు, హరిశ్చంద్రేశ్వరుండు, (త్రిసంధ్యేశ్వరుండు,) భవానీశంకరుండు, కపర్దీశ్వరుండు, కందుకేశ్వరుండు, (మఖేశ్వరుండు, మిత్రావరుణేశ్వరుండు) ననసిద్ధామృతజ్యోతిర్లింగాకారు లగుమహేశ్వరులు శతసహస్ర సంఖ్యలం గలరు. ఈమహేశ్వరులసిద్ధస్థానంబుల యందేను దివ్యస్థానంబునం దపం బాచరించి శీఘ్రసంతానలాభంబు నొందుదు. 228

తే. అహాహా! తెలిసితి విస్మయం బైనయర్థ
మేల సందేహ మందంగ హృదయవీథి?
సిద్ధసంసేవితము సర్వసిద్ధికరము
దర్శనస్పర్శనములం దీర్థముల రాజు. 229

సీ. ఉద్ఘాటితంబు లైయుండును రేలుంబగళ్లు
గవనితెల్పులు నాకకటకమునకు
సర్వజంతువులకు సంసిద్ధిసంపద
గరతలామలకమై కానవచ్చు
వికటామహాదేవి విశ్వనాథునిభామ
పర్వతాధిపుపుత్రి పాయ కెపుడు
సిద్ధివినాయకక్షేత్రపాలకు లుండ్రు
పరిరక్షణైకతత్పరత బూని
తే. భూమి తిలమాత్రమును నుడివోవ కుండ

నమృతలింగంబు లర్బుదన్యర్బుదములు
గలవు తీర్థరాజంబులు గాశియందు
మహిమ కావాస మవిముక్తమండలంబు. 230

క. ఎందుండును విశ్వేశ్వరుఁ
డిందుకళాధరుఁడు గిరిదుహితృసహితుం డై
యందుండు భుక్తిముక్తులు
సందేహము లేదు తప మచట నొనరింతున్. 231

సీ. అప్సరోంగన లెల్ల నాటపాటలవెంటఁ
బ్రాపించిరి మనోరథార్థసిద్ధి
గంధర్వుఁ డొక్కఁడు గానవిద్యాప్రౌఢి
శీఘ్రింబునంద సంసిద్ధిఁ గాంచె
యక్షపుంగవుఁడు విద్యాధరశ్రేష్ఠుండు
కోకిలాలాప యన్ కోమలియును
శతరుద్ర్యమంత్రైకజపపరాయణుఁ డైన
వేదశీలుం డనువిప్రవరుఁడు

తే. చంద్రమౌళి భరద్వాజసంయములును
హంసవతి యనునొకకిన్నరాంగనయును
నాప్రవాళోష్ఠిమగఁడు వేణుప్రియుండు
సిద్ధిఁ బొందిరి యవిముక్తసీమయందు. 232

క. సిద్ధమరుత్సాధ్యాదులు
సిద్ధిం బ్రాపింతు రం దచిరకాలమునన్
సిద్ధమతి యగుట శంభుం
డద్ధరణిని సిద్ధలింగ మనఁగా వెలయున్. 233

వీరేశ్వరప్రభావవర్ణనము

వ. ఆమ్మహాజ్యోతిర్లింగమూర్తి విశ్వేశ్వరుఁడనం బ్రసిద్ధివహించె. అమ్మహేశ్వరుండు జయద్రథునకు, విదూరసునకు, మగధాధిపతికి, వసుదత్తునకు, మనోరథార్థంబులచిరకాలంబునందప్రసాదించె. నేనును విశ్వేశ్వరమహాదేవు నారాధించి యభిమతార్థంబు(లు) వడసెదం గాక యని చంద్రకూపజలంబున నభిషేకం బొనరించి సంకల్పపూర్వకంబుగా నియమంబు వహించి యొక్కమాసం బేకాహారుండును, నొక్కమాసంబు నక్తాశనుండును, నొక్కమాసం బయాచితాశనుండును, నొక్కమాసంబు నిరశనుండును, నొక్కమాసంబు పయోవ్రతుండును, నొక్కమాసంబు శాకఫలాశనుండును, నొక్కమాసం బష్టతిలాహారుండును, నొక్కమాసంబు పానీయుండును, నొక్కమాసంబు పంచగవ్యాశనుండును, నొక్కమాసంబు చాంద్రాయణవ్రతుండును, నొక్కమాసంబు కుశాగ్రజలపాయియు, నొక్కమాసంబు వాయుభక్షుండును నైసంవత్సరంబు గడపి త్రయోదశమాసంబునం బ్రథమదివసంబున. 234

సీ. హరు లేదు నేఁడుకయ్యాంతరంబులు గాఁగ
నియమంబునా నాజ్ఞ నిలుపువాఁడు
వెండికట్టులతోడి వేత్రంబుమాఱుగా
బంగారుముని(లు)కోల పట్టువాఁడు
ఝంకించి వెరపుతజ్జనకోటిచందానఁ
గలుకుచీఁకటివెన్ను సలుచువాఁడు
వసుమతీభృచ్ఛ్రేణి వరుసతో గుఱి చూపి

యొండొండఁ గాన్పించుచుండువాఁడు

తే. త్రిభువనస్థానపతి యైనదివసకరుని
ప్రాక్ప్రతీహారపాలుండు ప్రాచినొసలి
ఘుసృణలీలాలలామంబు బిసరుహాప్త
కుంటుసారథి తీండ్రించెఁ గొమరు మిగుల. 235

సీ. ప్రథమసంధ్యాకాలబలిశంఖనినదంబు
ప్రభవించె శ్రీవిశ్వవిభునినగరఁ
గదిసె నంగుళియుగ్మకం బంతరముగాఁగ
గగనగంగారథాంగద్వయంబు
నెఱయంగఁ గైసేసి నిలువుటద్దము చూచె
నవిముక్తమున విశాలాక్షి గౌరి
కొక్కొరొకో యని కుక్కుటంబులు మ్రోసెఁ
గడఁగి చతుష్కూట కంబునడుమఁ

తే. బ్రహరిఁ దిరుగుట చాలించి భైరవుండు
గవని మొగసాలయరుఁగుపైఁ గన్ను మొగిచె
డుంఠివిఘ్నేశుఁ డొనర గండూష సేసి
యుమిసె వినువీథిఁ జంద్రకుండోదకములు. 236

సీ. ముక్తిప్రయోజనంబునఁ గుటీరకకోటి
సావిత్రితత్త్వంబు సంగ్రహించెఁ
బరమహంసలు పరబ్రహ్మమీమాంస
శోధించి రుపనిషద్వీథులందు
నిగమాంతవాసనానిర్వృతస్వాంతులై
హంస లుండిరి దృఢైకాంతపరతఁ
ప్రత్యగ్రగోపాలరజ్జుసంబంధంబు

దండత్రయము బహూదకుఁడు దాల్చె

గీ. భసితముద్ధూళనము చేసి పాశుపతుఁడు
దీర్ఘ పాటలజటల బంధించె మౌళిఁ
గలుమఠంబులమీఁద శృంగములనడుమ:
గొక్కొరోకో యనుచుఁ గోడికూయుటయును. 237

వ. అంత సూర్యోదయంబున. 238

సీ. ధరణీధరములందు ధాతుపాషాణంబు
పాదపంబులయందుఁ బల్లవంబు
పాథోనిధులయందుఁ బవడంపు లేఁదీఁగ
కాలాభ్రములయందుఁ గోలమెఱుపు
హరిదంతనాగంబులందు సిందూరంబు
భూమిమండలియందు హేమభూష
యాకాశవీథియం దబ్జవందనమాల
నబ్జజాండగృహంబునందు దివియ

గీ. యగుచు బాలాతపము జగం బాక్రమింప
నంధకారము దిక్కుల నస్తమింప
భానుబింబంబు దోఁచెఁ బ్రభాతలక్ష్మి
కబరిభారంబుమీఁద చెంగలువకచ్చు. 239

వ. అయ్యవసరంబున విశ్వానరుండు సకలకలికలుషవిషభంగ జాంగలికం బగుగగనగంగాప్రవాహంబున నఘమర్షణ స్నానం బాచరించి, విరజానలసంభవం బైనభస్మంబున సర్వాంగోద్ధూళనం బొనర్చి, తిర్యక్పుండ్రంబు లురశ్శిరోబాహుమూలంబుల ధరియించి, రుద్రాక్షమాలికాధరుండయి సరస్వతీస్కందవిఘ్నేశ్వరులకు నాదిత్యానిలాగ్నులకు మ్రొ

క్కి, పుండరీకచర్మాసనంబునం బ్రాఙ్ముఖుండై దక్షిణజానూరు
మధ్యంబున వామపాదంబును వామజానూరుమధ్యం
బునదక్షిణపాదతలంబును విన్యసించి, సమగ్రీవామూర్ధకా
యుండును, సంభృతాస్యుండును, నిశ్చలుండును నై నాసా
గ్రంబున సుధాధారాబిందునిష్యందంబునందు నిందుబింబం
బు(న) వీక్షించుచుం బ్రాణాయామంబుసేసి, ప్రాణాయామం
బువలనఁ జిత్తశుద్ధి వడసి, చిత్తశుద్ధివలన వేదాంతజ్ఞానంబు
విశదీకరించి, విశుద్ధవేదాంతజ్ఞానవాసనావశంబున శ్రోతవ్యుం
డును, మంతవ్యుండును, నిదిధ్యాసితవ్యుండును, నిరస్త
సమస్తోపాధిక స్వప్రతిష్ఠాఖండసచ్చిదానందైకరసాద్వితీయ
స్వరూపుండును, పరమశివపరమజ్యోతిర్లింగమూర్తియు
నైన యవిముక్తవిశ్వేశ్వరశ్రీమన్మహాదేవు నందు భావించి
భావించి చూచుచుండం బ్రాచీనంబు పచేళిమంబై భవ్యం
బైనభాగ్యాతిశయంబున. 240

సీ. శ్రీపాదములఁ బైఁడిచిగురుగజ్జెలతోడ
రవళించుగండపెండార మమర
వెలిదామరలఁ బోలువెడఁదక్రాల్గన్నులు
మద్దికాయలతోడ నుద్దివడయ
మొలకకూఁకటిఁ గ్రాలు[1]ముక్తాలలామంబు
భసితంపుబొట్టుతోఁ బాదరింపఁ
బాలబుగ్గలదీప్తిపల్లవంబులతోడఁ
జిన్నిలేనగవుతోఁ జెలిమి సేయ

గీ. లజ్జ యెఱుఁగనికటిమండలంబుమీఁద
వలుదవజ్రాల కమరుగర్వంబు సూప

1. ముత్యాల రావ్రేక భసితంపు.

దివ్యబాలకుఁ డొకరుండు దేజరిల్లెఁ
గాశివిశ్వేశశంభులింగంబునడుమ. 241

చ. ప్రవిశదభంగిదివ్యశిశురత్నముసప్రణవాక్షరంబుగా, శ్రవణ
మనోహరంబుగఁ బ్రసన్నముగాఁ బఠియింపఁజొచ్చె మూఁ
డవసవనంబునన్ శ్రుతిసమభ్యధికంబుగఁ దత్ప్రతిస్వనం
బపరతలీల గర్భభవనాంతరభూముల నుద్భవింపఁగాన్. 242

వ. అప్పుడు విశ్వానరుఁ డానందాశ్రుపూర్ణలోచనుండును, రోమాంచకంచుకితాఖిలావయవుండును, గద్గదికానిరుద్ధకంఠధ్వనియు నయి యంజలీపుటంబు లలాటతటంబున ఘటియించి యేకతంబుగా బ్రహ్మం బద్వితీయంబు నిత్యంబు సత్యం బొక్కరుండ రుద్రుం డొక్కరుండ కర్త యెవ్వం డట్టినీకునమస్కారంబు. రజ్జువందుసర్పంబును, శుక్తియందు రౌప్యంబును, మరుమరీచికయందు సలిలంబును బోలె నెవ్వానియందుఁ బ్రపంచంబు గానంబడు నట్టినీకు నమస్కారంబు. తోయంబునందె శైత్యంబును, వహ్నియందు దాహకత్వంబును, దపనునందుఁ దాపంబును, జంద్రునందుఁ బ్రసాదంబును, బుష్పంబునందు సుగంధంబును, దుగ్ధంబునందుఘృతంబునుంబోలె సర్వంబునం దెవ్వం డంతరాత్ముఁడై యుండు నట్టినీకు నమస్కారంబు. శబ్దంబు గ్రహించు నశ్రవణుండు, గంధం బాఘ్రాణించు నఘ్రాణుండు, దూరంబు నడచు ననంఘ్రి, చూచు నలోచనుండు,రసంబుఁ గొనునరసజ్ఞుం డెవ్వం డట్టినీకు నమస్కారంబు. నిజభక్తుండు దక్క విష్ణువిరించిపురందరాదిబృందారకు లెవ్వానికందువ యెఱుంగ రట్టినీకు నమస్కారంబు. గోత్రంబు, జన్మంబు, నామంబు, రూపంబు, శీలంబుఁ దెలియ

రాకుండనుండియు నిజభక్తులకు నభీప్సితంబులొసంగు నెవ్వాం డట్టినీకు నమస్కారంబు. ఎవ్వనివలన సర్వంబును నెవ్వాండు సర్వంబును గనుంగొను, నెవ్వాఁడు సంపన్నుం, డెవ్వాఁడు దరిద్రుఁ, డెవ్వాండువృద్ధుం, డెవ్వాండు యువ, యెవ్వాండు బాలుం డట్టి నీకు నమస్కారంబు. అని సంస్తుతించి సాష్టాంగదండప్రణామంబుచేసిన నతనిం గరుణాతరంగితం బగునపాంగవీక్షణంబునం గనుంగొనివృద్ధవృద్ధుండగునబ్బాలుండు ముగ్ధస్మితజ్యోత్స్న చిన్ని బుగ్గలంజిగురొత్తనిట్లనియానతిచ్చె.

మ. క్షితిదేవోత్తమ! నీమనోరథము సంసిద్ధిన్ వహింపన్ బతి
వ్రతకున్ శోభనపుణ్యలక్షణకు విశ్వస్తుత్యచారిత్రక
ప్రతిమప్రాభవభాగ్యవైభవకళాపారీణకున్ మీశుచి
ష్మతికిం బుట్టెదఁ గాశికాపురతపశ్చర్యాఫలం బల్పమే? 244

గీ. అచిరకాలమునందె యే నవతరింతుఁ
బరమపావని యైన నీభార్యయందుఁ
జను నిజాశ్రయమునకు సంశయము మాని
విమలపుణ్య! విశ్వానర విప్రముఖ్య! 245

వ. అని చూడం జూడ నయ్యిందుచూడుం డానందక్రీడావాటికాక్రోడక్రీడావిహారహేలాచిక్రోడంబుపదంబులోని నీడయుంబోలెఁ బొడచూపి యవిముక్తక్షేత్రవిడంబనంబగువిశ్వేశ్వరలింగంబునందుఁ గుడుంగంబునందునుంబోలె లోనడాఁగియుండె. విశ్వానరుండును విశ్వాసభక్తితాత్పర్యంబులు మనంబునం బెనఁగొన నయ్యనంగమథనుం దలంచి తలంచి శుచిష్మతియుం దానుఁ దమయంజలిపుటంబులు లలాటతటంబులం ఘటియించి ప్రస్తుతించుచుం బ్రమోదించుచు నిజనివా

సంబునకుం జని రనిన విని నైమిశారణ్యవాసు లీశ్వరుం
డెబ్భంగి శుచిష్మతికిం జన్మించె నని యడిగిన. 246

ఆశ్వాసాంతము

శా. కర్ణాటోత్కలపారసీకనృపసంఖ్యా! ప్రాభవశ్రీనిధీ!
యర్ణోరాశిపరీతభూభువనమధ్యాంధ్రక్షమాధీశ్వరా!
కర్ణాభ్యర్ణవిశాలనేత్ర! జగదేకప్రాజ్యసామ్రాజ్య! దృ
క్కర్ణాధీశ్వరహారభక్తినిరతక్ష్మాపాలచూడామణీ! 247

క. పంచారామగధూర్జటి
పాంచాల! త్రిలింగరాజపరమేశ్వర! య
త్యంచితనయమార్గధురంధర!
చెంచూమలచూరకార! చిరపుణ్యనిధీ! 248

భుజంగప్రయాతము.

త్రిలోకీనికాయప్రదీపప్రతాపా!
కలాభోజ! యాదార్యకల్పావనీజా
నలేయోర్వకుపట్యంతనాభాగలీలా
కలా! రెడ్డిభూపాల! కల్పాంతకాలా! 249

గద్యము. ఇది శ్రీమత్కమలనాభపౌత్త్ర మారయామాత్య పుత్త్ర సుకవిజనవిధేయ కవిసార్వభౌమ శ్రీనాథనామధేయ ప్రణీతంబైన కాశీఖండం బనుమహాప్రబంధంబునందుఁ దృతీయాశ్వాసము.

శ్రీరస్తు

చతుర్థాశ్వాసము

శ్రీకంఠచరణసేవా
వైకుంఠ! యకుంఠశౌర్యవైభవ! లోకా
లోకగిరిప్రాచీన
క్ష్మాకల్పయశఃప్రసార! యల్లయవీరా! 1

వ. అక్కథకుండు శౌనకాదిమహామునుల కిట్లనియె. అంతఁ
గొంతకాలంబునకు. 2

వైఖానసరజననము

క. నెల మసలె నిందువదనకు
జలజాక్షికి నల్ల నయ్యెఁ జన్నులముక్కుల్
తలిరుంబోఁడికి నలినీ
దళపాండువు లయ్యె గండదర్పణతలముల్. 3

గీ. గర్భగోళస్థితుం డైనకాలకంఠు
కంఠహాలహలచ్ఛాయకాళిమంబు
నాభిబిలమున వెడలి కన్పట్టినట్లు
కమలపత్త్రేక్షణకు నారు గారుకొనియె. 4

సీ. సరసిజానన యహర్వ్యతి సంధ్యాకాల
మానందతాండవమాడఁ దలఁచె

జంతుకోటికి ముముక్షా వేళఁ గాశిలో
నోంకార మానతీ యవిద గోరెఁ
బలిఁడిక్కములతోడి పచ్చి యేనికతోలు
పచ్చడంబు ధరింప భామ తివిరె
నతని యుష్ణీష్ణారె నాకకూటపిశంగ
మకుటాగ్రమునఁ జందమామఁ దుఱుమ
గీ. ముదిత కాంక్షించె నేనికమోముకొడుకు
సంకేతమునందుంచి యాదరింప
నహరహంబును గర్భంబునందుఁ బెరుగు
కాలకంఠునియనుభావగౌరవమున. 5

వ. వెండియు. 6

శా. ఆచంద్రానన యధ్వరంబులఁ బురోడాశంబుతో మంత్రస
ద్ధీచీనంబుగ యాయజూకులు సమర్పింపంగ నాజ్యాహుతుల్
ప్రాచుర్యస్థితి నారగింపఁ దలఁచున్ బ్రాగ్వంశమధ్యంబునన్
శోచిష్కేశుఁడు గర్భగోళమునఁ దోలుప్పలున్నతిం బొందఁగాన్.
వ. అనంతరంబ యాపాంసగమనకుఁ బుంసవనసీమంతంబులు
గృహ్యోక్తప్రకారంబున నిర్వర్తించిన. 8
మ. నవమాసంబులు నిండఁగాఁ గురుఁడు కేంద్రస్థాయియైయుండఁగా
శివలగ్నంబున నుద్భవించె సుతుఁ డర్చిష్మంతునంశంబునన్
ధవళాంభోరుహపత్రనేత్రకవిముక్తస్థానవిశ్వేశ శం
భ్వవతారాంతర మప్రధృష్యతరదివ్యాకార తేజంబునన్. 9
వ. అప్పుడు గంధవాహంబులు దివ్యగంధంబులు వహించె.
ఘనాఘనంబులు పుష్పవర్షంబులు గురిసె. దేవదుందుభులు
మొరసె. దిఙ్ముఖంబులు ప్రసన్నంబు లయ్యె. వాహినులు

విమలసలిలప్రవాహంబులగెన్యే. సకలభూతంబులమనంబులు తెలివొందె. విద్యాధరయక్షగంధర్వులు వసిష్ఠవాలఖిల్యాది మునులు బ్రహ్మ విష్ణు మహేశ్వరులుఁ గుమారావలోకన కౌతూహలాయత్తచిత్తు లయి యేఁగుదెంచి రాసమయంబున.

క. ద్రుహిణుండు కైటభారియు
సహిరకటకుఁడు గూడి యిచ్చి రొక్కొండుకుఁ గుఱ
గృహపతి యనియెడునామము
మహనీయకృపావిధేయమానసు లగుచున్. 11

వ. పదునొకండవదినంబున నామకరణంబు గల్పించి వేల్పులు చన్నపిమ్మట గురుజనంబులు క్రమంబున. 12

సీ. గృహనిష్క్రమంబు సాగించిరి నాల్గవ
మాసంబునందుఁ గుమారునకును
వత్సరార్థమునందు వాలాయముగఁ జేసి
రన్నసంప్రాశనం బర్భకునకు
నంతఁ జూడాకర్మ మాచరించిరి బిడ్డ
నికి గృహ్యాసంప్రోక్తనియమపరతఁ
దఱితోడఁ గర్ణవేధంబు గల్పించిరి
శ్రవణర్క్షమున నాత్మసంభవునకు

గీ. బ్రహ్మతేజోభివృద్ధికై పంచమాబ్ద
వేళ సల్పి రుపాకర్మవిధి సుతునకుఁ
జదువఁ బెట్టిరి వేదంబు పదముఁ గ్రమము
సాంగముగ బాలకుని నుపాధ్యాయునొద్ద. 13

వ. అంతనొక్కనాఁడు నారదుండు యదృచ్ఛాగతుండై యతిథి

సత్కారంబు వడసి తనకు నమస్కరించిన గృహపతిం గనుం
గొని దంపతుల కిట్లనియె. 14

గీ. ఓయి! విశ్వానరుండ! విశ్వోపకారి!
యోగశుచిష్మతీ! పరమపుణ్యోజ్జ్వలాత్మ!
బాలుఁ డీతండు మీయెడ ఘన భక్తి గలఁడె?
యమునా వీఁడు సులభుఁడై చెప్పినట్లు? 15

గీ. తల్లిదండ్రులయాజ్ఞ యథగకరింప
కుండుటయ చూవె! ధర్మ మత్యుత్తమంబు
దైవ మనఁగ గురుండు నా ధర్మ మనఁగ
నర్థ మనఁ దలిదండ్రులె యాత్మజునకు. 16

క. జననీజనకులఁ గొలుచుట
తనయునకును ముఖ్యమైనధర్మము జననీ
జనకులఁ గొల్చుటకంటెను
దనయున కభ్యధికమైనధర్మము గలదే? 17

సీ. నవపరించుట యెట్లు జఠరగోళమునందు
నవమమాసావసానంబు దాఁక?
ప్రేఁక మైన ప్రసూతివేళాసముద్భూత
సంకటం బోర్వంగఁ జాలు టెట్లు?
కుత్సింపకుం డెట్టు లుత్సర్గవిణ్మూత్ర
లాలాద్రవశ్లేష్మజాలమునకు?
నందంద వక్షోరుహాంబులింపులువోవఁ
దోఁడుక నిచ్చుట యెట్టు దుగ్ధరసము?

గీ. పంచకరపాట్లు వడి తన్నుఁ బెంచి పిశికి
యాపదలఁ బాప రక్షించినట్టితల్లి

దేవతాబుద్ధి వాటించి తెలియవలయుఁ
గొడుకు వంశాభిసంవృద్ధి కొనలు సాగ. 18

క. రేపాడిఁ గొడుకు జననీ
శ్రీపాదములకు నమస్కరింపఁగఁ దగుఁ ద
చ్ఛ్రీపాదక్షాళనసలి
లాపోశనమునను సుతున కాయుష్య మగున్. 19

గీ. సర్వతీర్థాంబువులకంటె సమధికంబు
పావనం బైనజనయిత్రి పాదజలము
వరతనూజున కఖిలదేవతలకంటె
జనని యెక్కుడు సన్నుతాచారనిరత! 20

వ. అని నారదుండు గృహపతిం జూచి యన్న! వైశ్వానర? ఇటు రమ్మని చేరం బిలిచి తొడలమీఁదఁ గూర్చుండ నిడు కొని దక్షిణహస్తంబు చూచి లక్షణంబులుపరీక్షించి యంతం బోవక. 21

సీ. ఆపాదమస్తకం బంగకములు నుపాం
గకములుఁ బ్రత్యంగకములు వరుసఁ
దను వైనకార్పాసతంతుసూత్రంబునఁ
గుంకుమాక్తంబునఁ గొలిచి కొలిచి
తప్ప కయ్యయి చోట్లు దర్శించి దర్శించి
యంగుళీముఖముల నంటి యంటి
నడపించి నిలిచియుండఁగఁ బెట్టి కూర్చుండ
నియమించి పరికించి నిశ్చయించె

గీ. లక్షణములు శుభాశుభాలంబనంబు
లంబురుహసూతిసుతుఁడు సంయమివరుండు

సకలసాముద్రికాగమజ్ఞానశాలి
నారదుఁడు సర్వవిద్యావిశారదుండు. 22

వ. ఇట్లు నిశ్చయించి. 23

గీ. తిర్యగూర్ధ్వంబు గొలువంగ దేహయష్టి
యెవ్వనికి వ్రేళ్లు నూఱును నెనిమిదియును
మానమున వాఁడు ధరణిసామ్రాజ్యపట్ట
బద్ధయోగ్యుఁడు భాగ్యవైభవముకలిమి. 24

గీ. ముక్కు భుజములు లోచనంబులును జాను
హనువులును నైదుదీర్ఘంబు లగుట మేలు
మెడయు జంఘాయుగంబును మేహనంబు
హ్రస్వములు గాఁగ వలయు భాగ్యాన్వితునకు. 25

గీ. నాభిరంధ్రంబు సత్త్వకంఠస్వరములు
మూఁడు నత్యంతగంభీరముగను వలయు
నంగులీదేశజత్రుత్వగంఘ్రిగుల్ఫ
పంచకము సూక్ష్మమై యుండు భాగ్యనిధికి. 26

గీ. కరములును గుక్షియును గటిస్కంధములును
ఫాలమును మోము నున్నతి వడయవలయు
హస్తరేఖాదృగంత జిహ్వాధరోష్ఠ
తాలునఖములు గెంపైన తథ్యచరిత. 27

గీ. కటియు వక్షఃస్థలంబును నిటలతటము
విస్తృతము లెవ్వనికి వాఁడు విభుతఁ గాంచుఁ
బదము గోమల మయ్యును బాణి కఠిన
మయ్యు నైశ్వర్య మొసఁగు మహానుభావ! 28

గీ. తాల్చు నెవ్వఁడు భ్రూలతాంతరమునందు
వర్తులం బైనదక్షిణావర్తరేఖ
యాతఁ డేకాతపత్త్ర మహాస్థలిగాఁగ
ధరణిరాజ్యంబుఁ బాలించు ధన్యచరిత! 29

క. కమలోదరారుణము లై
సమగుల్ఫము లై మృదుత్వసంయుక్తము లై
విమలాంగుళనఖరము లై
చెమరింపనియడుగు లొసఁగు సిరి మనుజునకున్. 30

సీ. లింగంబు కృశ మైన లెస్స మూత్రము దక్షి
ణావర్తవిస్సృతం బైన మేలు
మధుగంధ మైనను మత్స్యగంధం బైన
నింద్రియంబు శుభంబు నీఁగఁ జాలుఁ
గంఠనినాదంబు క్రౌంచదుందుభిఘోష
గంభీర మగుట సౌఖ్యప్రదంబు
చక్షుఃకనీనిక సరఘామధుచ్ఛాయఁ
బింగళం బై యిచ్చు మంగళంబు

గీ. నైదు రేఖలనొసలివాఁ డాయురితుఁడు
భాగ్యనిధి ముప్పదియు రెండుపండ్లవాఁడు
కంబునిభ మైనమెడవాఁ డఖండకీర్తి
నూర్ధ్వరేఖలపదమువాఁ డుత్తముండు. 31

గీ. హస్త మిఱియించి పట్టినయప్పుడు కదిసి
యంగుళులు రంధ్రహీనంబు లయ్యె నేని
నతనిఁ గల్యాణలక్షణాన్వితునిఁ గాఁగఁ
జెప్పు సాముద్రికజ్ఞానసిద్ధబుద్ధి. 32

వ. ఏను జెప్పినయీ భాగ్యలక్షణంబు లెన్ని గల వన్నియు నిక్కు-మారునియందు సంపన్నంబు లై యున్నయవి. 33

గీ. ఇన్నిగుణములు గలిగినయేని నరున
కిన్నిగుణములు నో బాల! యనయమంబు
టకట! యత్యంతసిద్ధయుం డగువిధాత
యచ్చలమునఁ బరాఙ్ముఖుం డయ్యె నేని. 34

గీ. చెప్ప నోరాడ దే మని చెప్పవాఁడ?
నెఱిఁగినర్థంబు చెప్పక యెట్లు దాఁతుఁ
బదియు రెండవయేఁట నీబాలకునకు
గండ మొక్కటి దంభోళికారణమున. 35

వ. అని చెప్పి నారదుం డరిగిన శుచిష్మతియు విశ్వానరుండు నశనిపాతాదారుణం బైనయమ్మునిభాషితంబునకు భయం బంది హాహాకారం బొనర్చి మూర్ఛాంధకారంబున మునింగి యెట్టకేలకుఁ దెలిసి బహుప్రకారంబుల విలపించుచుండి రాసమయంబున నల్లిదంపతులకు వైశ్వానరుం డి ట్లనియె. 36

సీ. ఓయమ్మ! యేలమ్మ యుపతాప మందెద!
వోతండ్రి! యేలయ్య! భీతిఁ బొందె?
దస్మన్నిమిత్త మె యకట! మీశ్రీచర
ణాంభోజధూళి నా కహరహంబు
సర్వాంగరక్షగా సంధిల్లు చుండంగ
మృత్యు వెబ్భంగి నా మీఁదఁ గవయుఁ
గవిసె నేనిఁ గఠోరకంఠహుంకారంబు
పొనరించి మీయాన యొడుచువాఁడ

గీ. నానయమును ద్రోచి వచ్చిన నాగ్రహమున

దీర్ఘనిర్ఘాతసంపాతనిర్ఘృణోగ్ర
కఠినతరవామపదపార్ష్ణిఘట్టనమున
దానిపండులు రాలంగఁ దన్ను వాఁడ. 37

మ. వినుఁడీనాఁడు ప్రతిజ్ఞ మీఱుఁ హ్రాసయోద్వేగంబు వర్జించి యో
జనయిత్రీ జనకుల్! గురుల్! భవదనుజ్ఞాముద్ర చేపట్టి యేఁ
జని కాశీపతి విశ్వనాయకు శివుం జంద్రార్ధచూడావతం, సుని మృ
త్యుంజయు నాశ్రయించి విగతాసుఁ జేసెదఁ మృత్యువున్.

వ. అనిన విని దంపతు లపయోధరంబైనవర్షంబును, నదుగ్ధాబ్ధి
యైన సుధోదయంబును, ననిందుబింబంబైనచంద్రికాలోకం
బును నైనయామాటకుఁ బరితోషంబు నొంది యెట్టెట్టా
యని క్రమ్మఱ నడుగుచు సుతున కిట్లనిరి. 39

సీ. కావఁడే యాభీలకాలపాశనిబద్ధు
శ్వేతకేతునిఁ బ్రాణవిగమభీతు?
రక్షింపఁడే కాళరాత్రిపా ల్పడకుండ
నెనిమిదేఁడులశిలాదునితనూజుఁ?
బాలింపఁడే విష్టపంబు లీరేడును
గాలకూటాగ్నిఁ జేఁ గాలకుండ?
మనుపఁడే యాయుగప్రమాణంబు నిండినఁ
గారుణ్యబుద్ధి మృకండుతనయు?

గీ. నంధకాసురవ్యాఘ్రుజలంధరేభ
దక్షమఘపుష్పశరపురధ్వంసనునకు
విశ్వభర్తకుఁ గాశికాధీశ్వరునకు
నిందుమౌళికి నినుఁ గాఁచు టెంతభరము. 40

వ. అని శుచిష్మతియు విశ్వానరుండును గొడుకు నాశీర్వదించి
యనిచిన నతండును గాశి కరిగి మణికర్ణికాతీర్థమాడి విశ్వ
నాథు దర్శించి తద్దిగ్భాగోద్యతల్లింగంబుఁ గనుఁగొని పరమా
నందకందం బనియును, బిండభూతం బైన త్రైలోక్యసారసర్వ
స్వం బనియును, దుగ్ధాబ్ధిసముద్భవం బగుసుధాపిండం బని
యును, స్వాత్మావబోధపాదపంబునకుఁ బ్రథమాంకురం
బనియును, బ్రహ్మరసాయనం బనియును, లింగకైతవంబున
నాకారంబు భజించిన యనాకార(త)త్త్వం బనియును,
నానారత్న(ప్ర)పూరితం బైన బ్రహ్మాండభాండం బనియును,
మోక్షవృక్షఫలం బనియును, బుష్పగర్భం బైననిర్వాణ
లక్ష్మీకేశపాశంబనియును, కైవల్యమల్లీ వల్లీమతల్లీ స్తబకం బని
యును, (నిశ్శ్రేయసశ్రీకరక్రీడాకందుకం బనియును,) నప
వర్గోదయాద్రిసుధాకరబింబం బనియును, సంసారమోహ
వ్యూహగాఢాంధకారవిధ్వంసనబ్రధ్నమండలం బనియును,
(నమృతకళ్యాణశ్రేణి రమణీశృంగారలీలాదర్పణంబనియును)
భావించి భావించి వితర్కించి వితర్కించి నమస్కరించి
యొక్కపుణ్యాశ్రమంబు చేసికొని శుభవాసరంబున లింగ
సంస్థాపనంబుచేసి తత్సమీపంబున వత్సరద్వయంబు ఘోరం
బైనతపం బొనర్చె నంత నొక్కనాఁడు. 41

శా. ఆవిర్భావము నొందె నిర్జరవిభుం డైరావణారూఢుఁ డై
యావైశ్వానరుచక్కఁ గట్టెదుర బాహాస్తంభదంభోళి
యుక్, గ్రీవాలంకృతతారహారలతికారింఛోళికేళీసఖ
గ్రైవేయాభరణాభిశోభియును నై కాశీప్రదేశంబునన్. 42

గీ. జంభదైత్యవిరోధి సాక్షాత్కరించి
వరము వేఁడుము నీతపోవైభవమున
కనఘ! మెచ్చితి నముచిసూదనుఁడ నేను
నావుడును నాశుచిష్మతీనందనుండు. 43

క. ఏవరము వేఁడ నిన్నును
దేవేంద్రా! నీకు నా కధీశ్వరుఁ డగుకా
శీవిశ్వనాయకమహా
దేవుని వర్ధింతు వర మధికతరభక్తిన్. 44

వ. అనుటయు. 45

గీ. శ్రీమహాదేవుఁ డనఁగఁ గాశీపతి యన
విశ్వనాయకుఁ డన నొకవేల్పు గలఁడె!
యేను పాలింతు త్రైలోక్య మేను నిఖిల
దేవతాచక్రవర్తి సందియము లేదు. 46

క. నాకంటె నధికుఁ డెవ్వఁడు
లోకత్రయమునను? మనములో విశ్వాస
స్వీకార మేల వదలెవ?
వాకాంక్షింపంగ రాదె యభిమతవరముల్? 47

అనుటయు. 48

క. ఏలా యీమాటలపని?
పౌలోమీరమణ! నీప్రభావము కంటే
కాలుని ప్రభావమును నీ
త్రైలోక్యం బెఱుఁగు వలదు తగవఱిపలుకుల్. 49

మ. అడుగన్నిన్ను వరంబు వేఁడఁగ నహల్యాజార! విచ్చేయునా
కుడు రాజార్ధవిభూషణుండువర మీనున్నాఁడుయుష్మాదృశు

ల్బడుగుల్వాంఛితమీసమర్థులె? వృథాలాపప్రబంధోక్తులన్
జడిపెట్టం బనిలేదు మిన్నక తపశ్చర్యావిరోధంబు గాన్. 50

వ. అని యుల్లసం బాడినం గటకటం బడి బిడౌజుం డుద్విగ్నసురా
యుధుండును విద్యుద్రోధితధూమ్రైధన్వదీక్షాదానదేశికం
బునను, నిర్ధూమధూమకేతుజ్వాలాజాలజటిలంబును నగు
వజ్రంబు గేలం బూని వైశ్వానరుముందఱ ఝళిపించిన. 51

శా. దంభోళిజ్వలనాభిఘుష్టసమునన్ ధైర్యంబు వోనాడియున్
గంభీరస్థిరభక్తివైభవమునం గాశీపురాధీశ్వరున్
శంభున్ శంకరు నీలలోహితు నుమానాథున్ విరూపాక్షు విభున్.
స్రంభం బొప్పఁ దలంచుచుం బ్రాజుఁడు మూర్ఛం బొందె దేవప్రశ్య

వ. ఆసమయంబున. 53

సీ. వికటపాటలజటామకుటకోటిపినద్ధ
ముగ్ధచంద్రుండు జగన్మోహనుండు
గరళమూలకనీలకాలకూటకళంక
కజ్జలుం డర్ధాద్రికల్పతరువు
కుటిలకుండలిరాజకుండలాలంకార
మండితుం డానతాఖండలుండు
భసితధూళిచ్ఛటాపాళిసముద్ధూళి
తాఖిలాంగుండు విశ్వాధికుండు

గీ. విశ్వనాథుండు గాశికాధీశ్వరుండు
లీలఁ బ్రత్యక్షమై వచ్చి లెమ్ము వత్స!
యనఁగ జైతన్య మంది దిగ్గనఁగ లేచె
శంభుభక్తిపరుండు వైశ్వానరుండు. 54

వ. ఈశ్వరుండును వైశ్వానరు నాదరించి విశ్వోత్తరం బైన

యూయగ్నిలోకంబున కధీశ్వరునిఁజేసి యంతర్హితుండయ్యె. గృహపతి పరమేశ్వరానుగ్రహంబున దీర్ఘాయుష్మంతుండును దిక్పతియు నై చరితార్థత్వంబు నొంది నిజవాసంబునకు వచ్చె. ఇది వైశ్వానరువృత్తాంతంబు. 55

నిర్ఋతిలోకవృత్తాంతము

గీ. అనినఁ బ్రియమంది శివశర్మ యంబుజాక్షు
కింకరుల కిట్టు లనియె నతిగుణభక్తి
నిరృతిలోకంబు మొదలైననిఖిలలోక
ములును జూపుఁ డనుక్రమంబునను నాకు. 56

వ. వైవస్వతలోకంబు మున్న యెఱింగితి. అటమీఁదిలోకంబు లెఱుంగవలతుం జెప్పరే యనిన వారు మహాత్మా! సంయమనీ పురంబున కవ్వల జాతిమాత్రంబున రాక్షసులై యను జ్ఞాత లయ్యు ననుగతశ్రుతిమార్గులు నపరద్రోహులు దీర్ఘస్నానపరులు దేవపూజాపరాయణులు దానదయాక్షాంతిదాంత్యాస్తేయ సత్యాహింసానిరతులు సర్వభోగసములు నై పుణ్యజనులకు నివాసం బై నిరృతిలోకం బొప్పుచుండు. 57

గీ. తీర్థములయందు విధి మీఱి తెగినపుణ్యు
లనఘ! యీలోకమున నుందు రాత్మహనన
మొక్క కాశీపురంబునఁ దక్క నొండు
తీర్థములయందుఁ బాపంబు దెచ్చు సంద్రు. 58

వ. ఈలోకంబున కధీశ్వరుం డైనదిక్పతిచరిత్రంబు చెప్పెదము సావధానమతి వై యాకర్ణింపుము. 59

సీ. వింధ్యాద్రినడుమ నిర్వింధ్యాతటంబునఁ
గానలో నొక్క పక్కణము గలదు

పింగాక్షుఁ డనియెడు పేరివాఁ డావెంటఁ
బల్లె యేలెడు భిల్లపరివృఢుండు
క్రూరకర్మపరాఙ్ముఖుం డక్కిరాతుండు
వ్యాఘ్రాదిదుష్టసత్త్వములఁ దక్క
దండింపఁ డితరసత్త్వముల నేణాదుల
నాఖేటమార్గంబునందఁ బ్రతుకు

గీ. విశ్వసించిన నీరు ద్రావినను నిద్ర
పోయినను జాలుకొన్నను బొర్లుచున్న
దెవులువడ్డను గుందిన ధృతిసెడినను
జంపఁ డనుకంప నెట్టిహింస్రంబు నైన. 60

సీ. ఫలమూలముల శాకపక్వాశనంబుల
దధిపయఃక్షౌద్రాజ్యతక్రములను
శిశిరాంబువులఁ దృప్తి సేయ సంబడ మిచ్చుఁ
బాదరక్షలు నాతపత్త్రములును
దాళవృంతములు వస్త్రములు గొప్పడుములు
నొసఁగు రోగార్తుల నుపచరించుఁ
దస్కరబాధ నొందక యుండ నెడ వన
యటవీస్థలంబున ననుపుఁ బెట్టుఁ

గీ. దీర్థములు పోవువారికి దివసదివస
మటు విశేషించి కాశికి నరుగునట్టి
పుణ్యులకుఁ జేయు సత్కారములు నెరవుగఁ
బింగళాక్షుండు శబరరాట్పుంగవుండు. 61

గీ. సంతతంబును నాశీర్వదింతురతనిఁ
దీర్థముల కేగువారు సంతృప్తిఁ బొంది

యగ్నిహోత్రాంతములను జపాంతములను
భోజనానంతములను దృష్టిపూర్వకముగ. 62

క. దక్షత నిర్విఘ్నమునఁ బిం
గాక్షుఁడు సతతంబు తీర్థయాత్రాపరులన్
రక్షింప నటవి నగరస
దృక్షం బై యుండెఁ గొన్నిదినములు పేర్మిన్. 63

వ. అంత నొక్కనాఁ డతనిపితృవ్యుండు దానకుం డనులుబ్ధకుండు తెరువు గట్టి తీర్థయాత్రాపరు లైనకార్పటికుల దోఁచికొనియె. అప్పు డప్పురుషవాగు కలంగంబాఱి మొఱయునుం గూఁతయునుం బెట్టిరి. నెట్టఁబడిబెట్టి (నిట్టపిడింబెట్టి) గల్పారంభసమయసముజ్జృంభమాణ కపటకిటికైటభారాతికంఠనాళకఠోరఘుర్ఘురధ్వాన ఘుర్ఘురంబైనయానిర్ఘోషంబాకర్ణించి యటమున్న దైవయోగంబునం దోరంపువేఁటకు వెడలి నికట ప్రదేశంబున నున్నపింగాక్షుం డుచ్చైస్స్వనంబున నోహో! వెఱవకుండుఁడు. ఏను గలుగంగ మీకు భయం బేల! యని పేరువాడి క్రీడి కురుబలంబులపైఁ గవిసినచందంబునం గవిసి పుంఖానుపుంఖంబుగాఁ దీవ్రమార్గణంబులునిగుడించిలుంఠ (బ్ధ)కులం దోలి యోటు వడకుండ సార్థవాహులం గడపిపుచ్చి విమతశబర(వర) సు భ ట కఠినతరభుజపరిఘువలయవలయితప్రఘులధనురుదితనిశితశరశతఖచితసకలశరీరుండై ఏదు పెరిగిన చందంబున వీరశయనంబున శయనించి విగతప్రాణుండై పరోపకారపుణ్యానురూపఫలంబున దిగీశ్వరత్వంబు నొంది నిరృతి యయ్యె. అది నిరృతిలోకవృత్తాంతంబు. ఈనిరృతిలోకంబున కనంతరంబున. 64

వరుణలోకవృత్తాంతము

గీ. వరుణదేవునిలోకంబు ధరణిదేవ !
ఇందు నుండెడుపుణ్యాత్ము లెవ్వ రనిన
వాపికాకూపకాసారవారిపాన
వాటికోద్యానకల్పనావ్యాప్తిపరులు. 65

సీ. తరుణేందుమౌళిపై ధారాంబుకుంభంబు
నియమవ్రతంబుగా నిలిపినారు
తనియఁ దియ్యనిపంచదారపానకములు
భూసురోత్తములకుఁ బోసినారు
చల్లఁగా నెడయుచోఁ జలివెందరలు పెట్టి
యధ్వనీనులదప్పి యార్చినారు
దీర్ఘయాత్రాపరాధీనమానసులకు
నుదకుంభపాదుక లొసఁగినారు

గీ. వెల్లిలో నేయుపాయంబు వెంట నైన
మునుఁగ కుండంగఁ బ్రాణుల మనిచినారు
గారవంబున వరుణలోకంబునందు
నిందు వేడుక సుఖియించు చుండువారు. 66

గీ. పుణ్యతటినుల కవతారభూములందు
శిలల సోపానపంక్తులు చేసినారు
పసులసంకెళ్లు విడిపించి పనిచినారు
వరుణలోకంబునం దుండువార లనఘ. 67

వరుణోత్పత్తి

వ. ఈలోకం బేలువాఁడు వరుణుండు. జలా (శయా) ధిపతి, యాదగపతి, సర్వకర్మసాక్షి. ఇతనియుత్పత్తియాకర్ణింపుము.

కర్దమప్రజాపతినందనుండు శుచిష్మంతుం డనువాఁడు ధైర్య
మాధుర్యవైశారద్యాదిశోభనగుణసంపన్నుండు. అతఁడు
చిఱుతవయసున సంగడీలయినబాలకులతోడం గూడియచ్ఛో
దం బనుకొలన సలిలక్రీడలుసలుపుచు నొక్కశింశుమారంబు
చేతం బట్టుపడినం దోడిబాలకులు భయభ్రాంతస్వాంతులై
యేతెంచి దేవార్చనా సమయంబున సమాధినిష్ఠుం డైన
యాతనితండ్రి కర్తెఱుంగ విన్నవించిరి. విజ్ఞాతసుతవిపత్తి
యయ్యును జిత్తంబు చలింపనీక యత్తపోధనసత్తముండభి
ధ్యానమార్గమున బ్రహ్మాండంబుల, భువనంబుల, భూతంబులఁ,
జంద్రసూర్యర్క్షతారకంబులఁ, బర్వతంబుల, వనంబుల, నదుల
సముద్రంబుల, నంతర్ద్వీపంబుల, నానాదేవయోనులఁ, దదీయ
స్థానంబుల, వాపీకూపతటాకకుల్యాపుష్కరిణులంజూచియుం
దొక్క కెందమ్మికొలన మునికుమారులతోడం గూడి నిమజ్జ
నోన్మజ్జనంబుల రంజిలం గరయంత్రనిర్ముక్తసలిలధారాభిషేచ
నంబుల సముడ్డమరుకాండమడ్డుడిండిమఢిమఢిమధ్వానంబుల
దారకుండు విహారంబు సలుపుటయు, సప్పూర్ణేందుబింబ
వదను నిందుబింబంబుఁ బట్టం బఱతెంచు రాహువుంబోలె
నొక్కమహాగ్రాహంబు సమగ్రాగ్రహంబునం బఱతెంచి ప
ట్టుటయు, నమ్మొసలి సరసబిసరుహకిసలయ కుసుమసుకుమార
దేహుండగు నక్కుమారున(ను)క్కుఁదండసంబులువోని తన
రెండుకోఱలం బిట్టూఁదికఱవక మెయిమెయింగబళించికనుగం
దకుండ జలాధిదేవతాసమీపంబునకుం దెచ్చుటయు,నచ్చిగు
రాకుఁబోఁడి యతని సరిత్పతిసమ్ముఖంబునం బెట్టుటయు, నంత
లో సక్రోధరక్తాంతలోచనుండును ద్రిశూలపాణియు నగు

నొక్క దివ్యపురుషుండు పరుషదృష్టి వీక్షించి సలిలాధ్యక్షు
నధిక్షేపించి, యోయివరుణాలయ! కరుణారహితుండవై
సర్వప్రజాపతితనయు శివభక్తు శిశువు నక్రంబుం బంచి దం
ష్ట్రాక్రకచంబులం గఱపించి తెప్పించితి! మేలు గా కేమి?
నీలలోహితుని ప్రభావంబు నీ కెఱుంగవచ్చునే? యని జం
కించి పలుకుటయు, నాతంకంబు నొంది యుదన్వంతుం డా
డింభు నలంకరించి శంభుకింకరున కిచ్చి పాశనిబద్ధం బగునమ్మ
కరంబు నతని కొప్పనంబుచేసి తత్సమేతుండై పరమేశ్వరుని
సన్నిధికిం జని బహుప్రకారంబుల స్తుతియించి యపరా
ధంబువలన విముక్తుం డగుటయు, నద్దేవుండు పనుపం బ్రమ
థుండు జలగ్రాహంబులతోడం గూడం గుమారుని దన
యొద్దకుం గొనివచ్చుటయుం గాంచె. అదియ ప్రణిధానావసా
నంబయ్యె నేత్రోన్మీలనం బాచరించి యప్పరమమాహేశ్వ
రుండు. 68

సీ. గ్రాహదంష్ట్రాటంకికాశిఖాగ్రము సోఁకి
కందినజంత్రుభాగంబుతోడ
నుదకబిందుకలాప ముట్టి యుట్టిపడంగఁ
గర మొప్పు ముద్దుగూఁకట్లతోడ
నరుణాంచలంబులై యరవిందగర్భప
త్త్రములఁ బోలువిలోచనములతోడ
బహులయాతాయాతపరిపాటి వెల్లున
గలువంపునిట్టూర్పు గాడ్పుతోడ
గీ. సంభ్రమంబున నచ్ఛోదసరసి వెడలి
మేటినక్రంబు బట్టెడ త్రాటఁ బట్టి

వచ్చి తనకట్టెదుర నున్నవానిఁ బుత్త్రుఁ
గాంచె దుర్దమతేజుండు కర్దముండు. 69

వ. అట్లు గాంచి. 70

క. చరణాంభోరుహయుగళీ
పరిసరమునఁ జక్క సాఁగి ప్రణతియొనర్పన్
గురుఁడు ప్రమోదం బారఁగఁ
బరిరంభము చేసెఁ జచ్చి బ్రతికినకొడుకున్. 71

గీ. అనఘ! శివశర్మ! యిట్టిచోద్యంబు గలదె?
యభవు నర్చించువేళ సమాధి నుండి
కొమరుదెస నైనయన్ని పోకలును జూడఁ
గడచె నూఱును నైదేండ్లు కర్దమునకు. 72

వ. కర్దముండును నతిక్రాంతం బైనయద్దీర్ఘకాలంబు మహాకాళధ్యానతాత్పర్యనిష్ఠాతిశయంబున ముహూర్తమాత్రంబునుంబోలెఁ గడపినయనంతరంబ శుచిష్మంతుండును సముచితప్రకారంబునఁ దండ్రియనుజ్ఞ వడసి వారణాసీపురంబున కరిగి లింగస్థాపనంబు సేసి పంచవర్ష సహస్రంబు దపం బొనరించి ప్రత్యక్షం బైనపరమేశ్వరునివలన వరుణపదంబు వరంబుగాఁ బడసి రత్నాకరంబులకు రత్నంబులకు సరిత్సరగపల్వలంబులకు వాపికాకూపతటాకంబులకుఁ బడమటిదిక్కునకు నధీశ్వరుం డయ్యె. కాశియందుఁ గార్దమప్రతిష్ఠితం బైనమణికర్ణేశ్వరలింగంబునకు నిరృతిభాగంబున వరుణేశ్వరాహ్వయం బైనశంభులింగంబు సుప్రతిష్ఠితం బై యుండు. ఆలింగంబు సేవించినవారికి సంతాపభయంబును నపాయమరణ

భయంబులును జలోదరాదిభయంబును మొదలైనభయం
బులు పుట్టక యుండు. ఇది వరుణలోకవృత్తాంతంబు. 73

గంధవతీవృత్తాంతము

సీ. అదె గంధవతిఁ జూడు మవనీసురోత్తమ!
వరుణునివీటి కుత్తరమునందు
నిమ్మహాపట్టణం బేలు గంధవహుండు
భవకృప నీతఁ డీపదముఁ గాంచె
నాదిఁ గశ్యపునిదాయాదుండు పూతాత్ముఁ
డను పేరిబ్రాహ్మణుం డనఘ! యితఁడు
తరుణేందుధరురాజధాని వారాణసి
నయుతాబ్దములు తపం బాచరించి
గీ. లింగసంస్థాపనంబు గల్పించి లింగ
మధ్యమునయందుఁ గందర్పమథ(దము)నుఁ గాంచి
జ్యోతిరభ్యంతరస్థు నావ్యోమకేశు
సంస్తుతించె నతం డు విస్పష్టఫణితి. 74

వ. దేవదేవ! మహాదేవ! దేవా! (య) భయప్రద! నారాయణేం
ద్రాదిసర్వదేవవరప్రద! సంస్తుత్యుండవు, స్తోతవు, స్తుతివి,
సగుణుండవు, నిర్గుణుండవు, నామరూపవివర్జితుండవు, ఇచ్ఛా
జ్ఞానక్రియాశక్తులు నీయవి. ఒక్కరుండవయ్యును శివశక్తి
భేదంబునను ద్వైతంబు భజియింతువు. నీదక్షిణాంగంబు
బ్రహ్మ. నీవామాంగం బచ్యుతుండు. చంద్రసూర్యాగ్నులు
నీనేత్రంబులు. నీనిశ్శ్వాసంబు శ్రుతులు. నీప్రస్వేదాంబు
వులు నదులు. నీశ్రోత్రంబులు సమీరణంబులు. నీభుజంబులు
దిక్కులు. నీముఖంబులుబ్రాహ్మణులు. నీబాహువులురాజన్య

లు. నీయూరువులు వైశ్యులు. నీపదంబులు శూద్రులు. నీకే
శంబు లంబుధరంబులు. నీవు ప్రకృతిపురుషరూపంబున
బ్రహ్మాండంబు సృజియింతు. నీయంద సర్వభూతంబులుద్భ
విల్లు.నీవ సర్వభూతమయుండ వని యనేక ప్రకారంబులం బూ
తాత్ముండు సంస్తుతింపం బ్రసన్నుండై పరమేశ్వరుం డతని
కోరినదిక్పాలపదం బిచ్చి తనమూర్తులయందు నంశంబు
ప్రసాదించి సర్వగత్వంబును, సర్వావబోధకత్వంబుఁ, బ్రాణా
పానాదిపంచమూర్తిత్వంబు నొసంగె. అతఁడు కాశీక్షేత్రం
బున జ్యేష్ఠేశ్వరుని పశ్చిమభాగంబున వాయుకుండంబు సుత్త
రంబునఁ బ్రతిష్ఠించిన యప్పరమేశ్వరునకు నవ్యాకృతిపథంబున
భోగమోక్షప్రదత్వంబు సంపాదించి యంతర్హితుం డయ్యె.
ఇది గంధవతివృత్తాంతంబు. 75

కుబేరవృత్తాంతము

క. నిగమజ్ఞ! గంధవాహుని
నగరమునకుఁ దూర్పుదిక్కున గుణోదారం
బగుపట్టణ మదె యలకా
నగరం బని యేలు యక్షనాథుఁడు గరిమన్. 76

వ. అక్కుబేరునిచరితంబు చెప్పెద నాకర్ణింపుము. 77

తే. భూసురోత్తమ! కాంపిల్యపురమునందు
యజ్ఞదత్తాఖ్యుఁ డొక్కబ్రాహ్మణుఁడు గలఁడు
వేగవేదాంగవేదార్థవిత్తముండు
యజ్ఞవిద్యావిశారదుం డాద్విజుండు. 78

తే. అతనిపుత్త్రుండు గుణనిధి యనెడివాఁడు
దర్పకునితోడిజోడు సౌందర్యరేఖ

నెయ్య మలరంగ గురు లుపనీతుఁ జేసి
చదువఁ బెట్టిరి వాని నాచార్యునొద్ద. 79

క. ద్యూతక్రీడారతుఁడై
యాతఁడు కితవులును దాను నాసాయం బా
ప్రాతస్సమయము దిరుగ న
పేతనిజాచారుఁ డగుచు నెల్లెడ వీటన్. 80

సీ. బ్రాహ్మణాచారంబు పరిహాసకము సేయు
నగ్నిహోత్రవిధాన మన్న నలుగు
సంధ్యాభివందనశ్రద్ధ యుజ్జన సేయు
గీతవాద్యవినోదకేళిఁ దగులుఁ
బాషండభండదుర్భాష లావర్తించు
ద్యూతకాములతోడి యుద్ధి వడయు
ధాతువాదులమీఁదఁ దాత్పర్య మొనరించుఁ
జెలిమి వాటించు నాస్తికులతోడ

తే. నటుల మన్నించు హర్షించు విటులఁ జూచి
పేరమర్థుల కొనరించుఁ బెద్దఱికము
కౌలకేయులఁ బాటించు గారవించుఁ
శిష్టకుల దీక్షితునిపట్టి సిగ్గు విడిచి. 81

వ. సజీవనిర్జీవద్యూతంబుల నోడినధనంబులు గితవులకుం దల్లి
మేనిరవణంబుల నమ్మి పెట్టుచుండు. 82

తే. తల్లి బోధించుఁ దత్పరత్వంబు గలిగి
యన్న! మీయన్న చెప్పినయట్ల చేయు
ధూర్తసంగతి విడువు సాధువులతోడఁ
బరిచయము సేయు మని పుత్త్రుఁ బ్రతిదినంబు. 83

వ. దీక్షితుండును గృహకార్యభృత్యంతరవ్యగ్రుండై కొడుకు
వర్తనంబుఁ బరామర్శింపక యుండు. 84

తే. ఎడపఁ దడపఁ దనూభవుం డెచట నుండు
గానరాఁ డంచు గృహభర్త కాంత నడుగ
నింతదడవును నాయొద్ద నిచట నుండి
యరిగెఁ జదువంగ నని భర్తకతివ మొఱఁగు. 85

తే. స్నాన మాడెనె? వార్చెనే సంధ్య? యగ్ని
హోత్ర మొనరించెనే? యింతి? పుత్త్రుఁ డనిన
స్నాన మాడెను వార్చెను సంధ్య యగ్ని
హోత్ర మొనరించె ననుచును నువిద మొఱఁగు. 86

ఆ. గొడ్డువీఁగి కన్నబిడ్డండు కావున
నొక్కఁడుండ కాన నుత్పలాక్షి
ధూర్తుఁ డైనవాని దుశ్చేష్టితము లెల్ల
నధిపుఁ నెఱుఁగనీక యడఁచుచుండు. 87

వ. చూడాకర్మానంతరంబున షోడశవర్షంబున గృహ్యోక్తప్రకా
రంబున నతనికి వివాహంబు చేసి ప్రత్యహంబును. 88

క. స్నేహార్ద్రహృదయ యై యతి
సాహసకృత్యములు మాన సమకొల్పుట కై
యూహాపోహవిచారస
మాహితగతిఁ దల్లి సుతుని మఱి బోధించున్. 89

తే. అన్న! మీతండ్రి కోపగాఁ డౌనొ కాఁడొ?
యీవు వొనరించుదుర్వృత్త మెఱిఁగె నేనిఁ
గల్లతనమున పలుమాఱు గప్పి పుచ్చు
నట్టినామీఁద జంపంగ గలుగ కున్నె? 90

సీ. సచ్ఛ్రోత్రియులు ననూచానులు సోమపీ
థులు నైనకులముపెద్దలఁ దలంచి
రాజమాన్యుఁడు సత్యవ్రతుఁడు వినిర్మలా
చారవంతుఁడు నైనజనకుఁ దలఁచి
భాగ్యసంపదఁ బుణ్యపతిదేవతలలోన
నెన్నంగఁ దగఁగాను నన్నుఁ దలఁచి
వేదశాస్త్రపురాణవిద్యాగరిష్ఠులై
వాసికెక్కినతోడివారిఁ దలఁచి
తే. పెద్దయింటిపెద్దార మై శివునికరుణ
నివ్వటిలునిచ్చ వేనేండ్లనిన్నుఁ దలఁచి
పదియునారవ్వత్సరంబులభార్యఁ దలఁచి
గోరతనములు మానరా! కొడుకుఁ గుణ్ణి! ?1
తే. అఖిలకల్యాణగుణగణాయత్త యత్త
మామ యాచార్యతేజగిమామహితుఁడు
మాతులుండు యశోమహిమాతులుండు
తనయ! యేలయ్యె నైకోవు వినయబుద్ధి? 92
చ. విడువక నీవు పట్టణమువీథులవీథుల వెళ్ళివాఁడవై
చెడుగులఁగూడి ధౌర్త్యములు సేయనుహీంరమణాండెటెంగనే
విడుచును సోమయాజి మనువృత్తులు చేకొను నెల్లభంగులన్
జెడుదుము నీకతంబునను జీరయుఁ గూడును లేక పుత్త్రకా!
తే. పట్టణములోన నీవు దప్పమునఁ జేయు
కొయ్యతనములు వీక్షించి కూర్మితనయ!
నవ్వుదురు నిన్ను మొదల నానావిధముల
నవ్వుదురు దీక్షితుని ననంతరమ జనులు. 94

వ. అని యంత నిలువక. 95

తే. తల్లిబడి కొల్లిచ(చె) ట్టించు నుల్లసంబు
లాడుదురు నన్నుఁ గూర్చి ని న్నహరహంబు
దుర్ణయం బుల్ల నామీఁదఁ ద్రోచి జనులు
డబ్బఱలు పల్కువారి కడ్డంబు గలదె? 96

క. అవినయనిధాన మగునీ
నవయౌవనశైశవముల నడిమివయసునం
గవిసెదు వ్యసనోద్రేకం
బవగాఢము దీని మానవయ్య తనూజా! 97

వ. అని యనేకప్రకారంబుల బోధించినతల్లిమాటలు చెవులు
సోఁకనీక యిట్టట్టనక యూరకుండె. మృగయామద్యపైశున్య
వేశ్యాచౌర్యదురోదరపరదారాభిలాషంబు లనుదోషంబులు
నవయౌవనారంభంబున సంభవించెనేని వానిం బరా
వర్జింప నెవ్వరు నేర్తురు? గురువచనం బతినిర్మలంబయ్యు
సలిలంబునుంబోలె శ్రవణస్థితం బైయభవ్యునికి శూల పుట్టించు
నయథార్థనామధేయుం డగునగ్గుణనిధి యథాపూర్వంబు
దువ్వర్తనంబులఁ దిరుగుచుండ నొక్కనాఁడు. 98

సీ. దర్శనం బిచ్చె నెద్దానిఁ గోమటి క్రొత్త
పొడచూప నేతెంచి భూభుజునకుఁ
దన కిచ్చె నెద్దాని ధారాంబుపూర్వంబు
పుణ్యకాలమునాఁడు భూమిభర్త
దా నిచ్చె నెద్దాని ధర్మగేహిని యైన
సోమిదమ్మకు మనఃప్రేమ మలరఁ

దఱి జూచి యిచ్చె నెద్దానిఁ బట్టికిఁ దల్లి
జూడ మోడినపైఁడి సుట్టికొనిన
తే. న(య)ట్టినవరత్నమయ మైనయంగుళీయ
కంబు యజ్ఞావభృథపుణ్యకర్మసాక్షి
వీఁటిలో నొక్క జూదరి వ్రేల నుండ
జూచెఁ గనుఱెప్ప వెట్టక సోమయాజి. 99

వ. చూచి తనసొమ్మౌట యెఱింగి దీక్షితుం డక్క్రీడాజీవనుం
గదిసి యెలుంగెత్తి యీయంగుళీయకంబు నీకెట్లు గలిగె?
ఉన్నరూపు చెప్పు. తప్పఁ జెప్పితేని భూపాలుసన్నిధిం
బెట్టి నిజంబు దెలిపి దండింతు ననిన జూదరి నీతనయుండు
గుణనిధి నెత్తంబున నొడ్డినవిత్తంబునకై యీయంగుళీయ
కంబు నా కిచ్చె. మఱి బంగారుభృంగారుకర్కరికలాచికలు,
తలియలు, పళ్లెరంబులు, తామ్రపాత్రంబు, లాపకూటఘ
టంబు లన్నియుం దాకట్టువెట్టియు దురోదరక్రీడాపరాయ
ణుం డై పట్టణంబులోనం జరియించుచున్నవాఁడు. 100

తే. అక్షధూర్తులలోన నీయనుఁగుఁగొడుకు
దొరయునంతటి యక్షధూర్తుండు లేఁడు
క్షితితలంబున యాగదీక్షితులలోనఁ
గీర్తి నీయట్టియాగదీక్షితుఁడు లేఁడు. 101

వ. అనిన విని లజ్జాక్రోధంబులు మనంబున ముప్పిరిగొన యజ్ఞ
దత్తుం డర్ధముండితం బైనమూర్ధంబున నీర్కావిదోవతి నఱి
ముఱిఁ జుట్టుకొని యింటికేతెంచి మొగంబు గంటువెట్టు
కొని సోమిదమ్మ! ఏమిచేయుచున్నదాన! విటు రమ్ము! నీకొడు
కెక్కడం బోయెఁ? బోవుఁ గాకేమి! విను మని యిట్లనియె.

శా. అంగోద్వర్తనవేళ నీవు వరహాసాంకూరము ల్లోచనా
పాంగప్రాంతములం దిగుర్ప నొకసయ్యాటంబుఁ గల్పించి నా
యంగుళ్యాభరణంబుపుచ్చుకొనవా? యాయుంగరంబిప్పుడే
శృంగారింపనిచేతఁ బావకునకుఀ జేయఀ హావిర్దానమున్.

వ. అనిన నద్దీక్షితాయని దీక్షితున కిట్లనియె. 104

సీ. మధ్యాహ్నసంధ్యాసమాగమం బిది తీర్థ
మవధరింపుము నిత్యమాచరింపు
మగ్నికార్యముఁ దీర్పు మభవుఁ బూజింపుము
పంచమహాయజ్ఞపరుఁడ వగుము
మొగసాల నున్నారు జగతీసుపర్వులు
గ్రాసార్థు లగుచుఁ బెక్కండ్రతిథులు
పక్వాన్నములు శాకపాకాదికంబులు
చల్ల నాఱినయేనిఁ జవులు దప్పుఁ

తే. బవిలముగ మందసమునందు బరిణలోన
నునిచి దాఁచినదాన మీయుంగరంబు
దీర దిప్పుడు పెట్టె శోధించి చూడ
నారగించినపిదప నే నధిప! తెత్తు. 105

తే. అనిన విని సోమయాజి కోపాగ్రహమునఁ
దత్తరించుచు వడి సోమిదమ్మఁ బలికె
నౌనె సత్పుత్రజనయిత్రి! యౌనె సాధ్వి!
యౌనె సూనృతభాషిణి! యౌనె దేవి! 106

సీ. స్వాధ్యాయ మెన్నండుఁ జదువఁగఁ బోకుండఁ
బోలునే చదువంగఁ బోయె ననుట?

తెల్లవాఱఁగ నీటఁ దీర్థమాడక యుండ
 నసురూపమే తీర్థమాడె ననుట?
సమయానుకూలత సంధ్యవార్వక యుండ
 వైదగ్ధియే సంధ్యవార్చె ననుట?
తఱితోడ నగ్నిహోత్రము వేల్వ కుండఁగ
 విజ్ఞానసరణియే వేల్చె ననుట?
తే. కల్లలాడంగ ఫల మేమి గలిగె నీకు?
మాటి మాటికి నేను నీమాట నమ్మి
యరసి రక్షింప నేరక యనుఁగుఁగొడుకు
భ్రష్టుఁ జేసితి నేమి చెప్పంగఁ గలదు? 107
సీ. ఏడఁ బోయెనో కదా మేడలో మంజిష్ఠి!
 పెనుబండువునఁ నైన బెట్టఁ జాలఁ
డాకట్టు వడవె యింతకు వైశ్యగృహమున
 కనకకర్బురిలభృంగారుకంబు?
పట్టుసూత్రమయంబు పసిఁడియొడ్డాణ మే
 యిగురుఁబోఁడికటీర మెక్కె నొక్కొ!
శశికాంతపీఠికా స్తంభలీలారత్న
 సాలభంజిక యెందు సాఁగె నొక్కొ!
తే. ఎచట నున్నదియొకో రత్నఖచిత మైన
హంసతూలిక డోలావిహారతల్ప
మూఁచముట్టుగ నీవు నీయొంటికొడుకుఁ
బాడుచేసితి గృహము నిర్భాగ్యురాల! 108
తే. చాలు నింక నాపాలికిఁ జచ్చినాఁడు
కొడుకు గుణనిధి యనువాఁడు కులవిషంబు

తిలలు దర్భయు నుదకంబుఁ దెత్తుగాఁక
యే నివాపాంజలుల వాని కిత్తు నిపుడు! 109

వ. కుపుత్రత్వంబుకంటె నపుత్రత్వకంబు మేలు. కులపాంసనుం
డైనవాని నొక్కనిం ద్యజించి కులంబు రక్షించుట నీతియ
కదా! యని పలికి కోపావేశంబునఁ బెదవు లదరఁ గటగటం
బులు చిటుల భ్రూకుటి నిటలంబున నటింపఁ గటాక్షం
బులు గెంపు గదురం గటకటం బడుచు నాహ్నికం బైన
క్రియాకలాపంబు నిర్వర్తించి యాగ్రహంబునఁ గృతార్థత్వం
బునొందఁ గొన్ని దివసంబులకు నొక్కశ్రోత్రియునిపుత్రిం
బెండ్లియాడి యజ్ఞదత్తుండు గృహస్థధర్మంబు నిర్వర్తించు
చుండె. అంతకమున్న గుణనిధి తండ్రికోపం బెఱింగి యిం
టికిం బోవక యెందేనియుం జనువాఁడ నని మనంబున
నిట్లని వితర్కించె. 110

తే. ఏమిసేయుదు? నెక్కడి కేగువాఁడ?
ధనము నిష్పచ్చరంబు విద్యయు హుళిక్కి
పెట్ట సాఁగెడునాచేయి భిక్ష సేయ
నెట్లు నేరుచు? దైవంబ యెఱుఁగు నింక. 111

తే. ఏభయంబుల నెచ్చోట నెనయ లేదు
నరున కెప్పాట విద్యాధనంబ ధనము
చోరబాధాదికముచేతఁ జూఱవోవు
ధనము ధన మౌనె యెన్నిచందములఁ దలఁప? 112

గీ. అక్కటకట! దురోదరవ్యసన మెట్లు?
యాయజూకవిశిష్టాన్వవాయ మెట్లు?
ఎట్లు చేసినఁ జేసెఁ గా కే మనంగ

1. కములచేఁజూఱు.

నేర్చువారము? విధి దయానిస్వహృదయు. 113

చ. అరుణగభస్తిబింబ ముదయాద్రిపయిం బొడతేర గిన్నెలోఁ
బెరుఁగును వంటకంబు వడపింపియలుం గుడువంగఁ బెట్టుని
ర్భరకరుణాధురీణ యగుప్రాణముప్రాణము తల్లి యున్నదే?
హరహర! యెవ్వరింకఁ గడుపారఁగఁబెట్టెద రిప్సితాన్నముల్.

వ. అనుచు నెందేనియుం జనియె నంత. 115

మాలిని.—

ఘుసృణకుసుమమాలాకోటిపాటల్యలీలఁ
గిసలయములచాయం గిరచంచూపుటశ్రీ
విసృమరసృమరోర్ణావిభ్రమప్రౌఢి మింటఁ
బిసరుహహితదీప్తుల్ పింగళత్వంబు నొందెన్. 116

తే. పాటలాంశుజటాభారభాసురుండు
భార్గవుఁడు వోలె నోలాడె భాస్కరుండు
రాగరక్తచ్ఛటానిర్ఝరప్రపూర్ణ
చరమసంధ్యాశమంతపంచకనదముల. 117

వ. వెండియు ఘోతారకూటపాటలకోమలాతపంబై వాసరంబు
పలుచం బాఱె. అస్తాద్రికిరీటకూటంబున దరవికచనిచులకుసు
మమంజరీపుంజంబునుం బోలె మిహిరబింబంబు చూపట్టె.
చరమధరాధరధాతుధారాప్రవాహంబునుం బోలె సంధ్యా
రాగంబు గగనమండలంబు నాక్రమించె. చైత్యద్రుమం
బులు నిద్రా(వ)ణద్రోణకాక కాకాకారకాకుకోలాహలంబు
కులకులాయమానంబు లయ్యె. అంధకరిపుకంధరామూల
కాలకూటచ్ఛాయాశ్రేణిపాణింధమం బై యంధకారంబు
బ్రహ్మాండమండలంబు నాచ్ఛాదించె. రజనీశుక్తిముక్తాఫలం

బులు చుక్కలు వొడిచె. భవిష్యద్వ్యాపరకరకరప్రరోహ బీజాంకురంబులుంబోలెఁ బ్రదీపంబులు భవనాంతరంబులఁ వెలింగె. అప్పుడు గుణనిధి పేరాఁకలిపేర్చు కార్చిచ్చునుం బోలెఁ బెచ్చుపెరిఁగి యందంద కడుపు మండింప వంటకం బెక్కడఁ గలుగునో యని చింతాక్రాంతుం డై యున్నయవస రంబున నద్దినంబు రాత్రి శివరాత్రి యగుటం జేసి శైవుం డొక్కరుండు నగరబాహ్యప్రదేశంబున నొకశివలింగస్థానం బున జాగరణంబుఁ జేసి నాలుగుజాములు నుపహారంబులు సమర్పించువాఁడై నియమవ్రతంబుఁ బూని భక్తివిశ్వాస తాత్పర్యాతిశయంబున. 118

సీ. మరిచిధూళీసాళిపరిచితంబులు మాణి
బంధాస్మలవణపాణింధమములు
బహుళసిద్ధార్థజంబాలసారంబులు
పటురామఠామోదభావితములు
తింత్రిణీకరసోపదేహధూసురములు
జంబీరనీరాభిచుంబితములు
హైయ్యగవీనధారాభిషిక్తంబులు
లలితకుస్తుంబరులాలంఘితములు
తే. శాకపాకరసావళిసౌష్ఠవములు
భక్ష్యభోజ్యలేహ్యంబులు పానకములు
మున్నుగాఁ గల యోగిరంబులు సమృద్ధి
వెలయఁ గొనివచ్చె నొండొండ వివిధములను. 119

వ. అప్పుడు భూసురప్రవరుండు నాసికాపుటకుటీకుటుంబి యగు పక్వాన్నగంధంబు గాలివెరవున నాఘ్రాణించి యాయ

న్నంబు నాకు నెబ్భంగిఁ గుఱువ సమకూఱునొకో యని
యప్పరిమళంబునఁ బట్టుకొని పోయి శంభుభవనద్వారం
బునం గూర్చుండి నృత్తగీతవాద్యంబులు ప్రవర్తిల్ల నరిప్రొద్దు
వోవునం దాఁక వీక్షించుచు జాగరంబు చేసి యంతంత సాగి
ప్రజలు చొక్కు మడంగి యుండఁ దా నయ్యవసరంబున. 120

సీ. కట్టాయితంబుగాఁ గటిమండలంబునఁ
దీర్చి చట్టీచేల దిండు గట్టి
తలుపు గిఱ్ఱున కుండఁ దరిమి కొంచెం బైన
యోరవాకిట దేహ మొయ్యఁ జొనిపి
మునివ్రేళ్ల లొయ్యొయ్య మోపి చప్పుడు గాని
పరిపాటి బవనంబుఁ బట్టి నడచి
దీపాంకురచ్ఛాయఁ దెలివి చాలనియట్టి
కోనచీఁకటి లోని కొనరఁ జొచ్చి

తే. పళ్లెరములం దపూపసూపములతోడ
ననఁటిపండులతోడ నాజ్యంబుతోడ
దధిపయశ్శర్కర బహుపదార్థములతోడ
ధవళకలమాన్న మీక్షించె ధరణిసురుఁడు. 121

తే. గర్భమంటపదీపకాకలిక యపుడు
దశ చెడఁగ గాలి నిర్వాణదశ వహింప
దీప్తిసంధుక్షముగఁ జేసి తెలివి పడఁగ
నన్న మీక్షింపఁ దలఁచె బ్రాహ్మణకులుండు. 122

శా. గ్రుక్కిళ్లింగుచు నొక్క యోదనమహాకుంభంబు నీక్షించువాఁ
డక్కోణంబున మందరశ్మియగు దీపాంకూరముల్ మీఁదికై

యొక్కండ్రోచిఘృతంబు నించి నిజవస్త్రైకాంశముంజించిచే
నొక్కవత్తిగ నేఁతఁదోఁచెనుశిఖన్యోజించె వైశ్వానరున్.

సీ. పక్వాన్నపాత్రంబు పాణిఁ గైకొని బహి
ర్ద్వారభూమి భుజించువాంఛ నపుడు
వెల్వడి వచ్చుచో విధివశంబున వాని
కాలిప్రే లోకనియంగంబు దాఁకెఁ
దాఁకిన వాఁడు తత్తఱపాటుతో మేలు
కని ముచ్చు ముచ్చని కళవళించెఁ
గళవళింప గతానుగతికమార్గంబున
వాక్రోశ మొనరించి రఖిలజనులు

తే. నన్నపాత్రంబు విడువక యవనిసురుఁడు
పాఱె భయవిహ్వాలుం డయి బయలువట్టి
వెంటఁ దగిలి తలవరులు వెణఁగుపడఁగ
బాణముల నేసి చంపి రాబ్రహ్మకులుని. 124

తే. అతనిఁ గొనిపోవఁ బనిఁ బూని యమునిభటులు
వరుణపాశోగ్రహస్తులై వచ్చి రపుడు
వానిఁ గొనిపోవఁ బనిఁబూని వచ్చి రపుడు
త్ర్యంబకునికింకరులు విమానంబు గొనుచు. 125

వ. అనంతరంబపట్టిసత్రిశూలఖట్వాంగ ప్రముఖబహువిధ ప్రహ
రణపాణు లగుపినాకపాటిభటులం జూచి భీతులై కృతాంత
కింకరులు కరపంకజంబులు మొగిచి వారి కిట్లనిరి. 126

తే. అభవుకింకరులార ! మహాత్ములార !
తగవు ధర్మంబు పాడి పంతంబు దెలియు
మీకు నడ్డంబు గలరె ముల్లోకములను?

నెంతవారము మేము మీయెదుర నిలువ? 127

వ. వీఁడు కులాచారహీనుండు, పితృవాక్యపరాఙ్ముఖుండు, సత్య
శౌచపరిభ్రష్టుండు, సంధ్యాస్నానవర్జితుండు, శివనిర్మాల్యా
పహర్త. వీనియందొక్కధర్మంబు లేశంబు గలిగిన నానతిందు
వినియెదము. వీనిపుణ్యాపుణ్యవివేకంబునకు మీర ప్ర
మాణం బనినఁ గృతాంతకింకరులవాక్యము లాకర్ణించి శివ
కింకరులు వారి కి ట్లనిరి. 128

క. శివధర్మం బతిసూక్ష్మము
శివధర్మము లేశమైన సిద్ధించినచో
వివిధమహాపాపోప
ద్రవములు చేరంగ రావు ధన్యుని నతనిన్. 129

తే. స్థూలదృష్టి వీక్షించినఁ దోఁపకుండు
సూక్ష్మదృష్టి వీక్షించినఁ జూడ్కి కందుఁ
గాన శివభక్తిధర్మం బగాధమహిమ
కానవచ్చినయ ట్లుండ గానరాదు. 130

క. ఆచారం బిది యనఁగ న
నాచారం బిది యనంగ నజునకు నైనన్
గోచరము గాదు శివధ
ర్మాచారము సూక్ష్మరూప మై వర్తిల్లున్. 131

వ. ఇతఁడు చేసినపుణ్యకర్మంబు వినుండు. 132

సీ. అశన మబ్బక యున్న నైనను శివరాత్రి
యొకంతప్రొద్దును నుపవసించె
నోగిరంబు హరింప నూన వెట్టుకొని యైన
వేగునంతకుఁ జేసె జాగరంబు

పాత్రావలోకనోపాయంబునకు నైన
వెల యించెదీపంబు వెలుఁగఁ బాఱఁ
జూడ నొల్లక యైనఁ జూచె నీశ్వరుమౌళిఁ
బరులు చేసినయట్టిప్రసవపూజఁ
తే. జచ్చె విధి మూడి యైనను జంద్రధరుని
నగరిమోసాలఁ బెంద్రోవనట్టనడుమ
సూక్ష్మదృష్టి విచారించి చూచినప్పు
డింతకంటెను ధర్మంబు లెవ్వి గలవు? 133

వ. అని పారిషదులు యమదూతల వీడ్కొలిపి యతనిదివ్య విమానారూఢుం జేసి శివలోకంబునకుం గొనిపోయి శివుని సన్నిధిం బెట్టిరి. శివుండును బ్రదీపతేజస్స్పంధులక్షణాదిక పుణ్యానురూపం బైనఫలంబునం గళింగదేశాధిపతి యైన యరిందమునకుఁ దనయుండై దముం డనుపేర నాదేశంబునకు రాజుగా ననుగ్రహించి పుత్తెంచె. ఈశ్వరానుగ్రహంబునం బట్టాభిషిక్తుండై. 134

క. చాటించెఁ గళింగేంద్రుఁడు
వీటను దేశమున శంభువేశ్మంబులలోఁ
బాటించి దీపకళికా
కోటు లసంఖ్యములు మెండుకొని యుండుటకుఁ. 135

క. ఇలువరుసఁ జంద్రశేఖరు
నిలయంబున దీపకళిక నిలుపనివారిన్
దలఁ ద్రెవ్వఁగ వ్రేయుం డని
తలవరులం బంచె రాజు తనదేశములన్. 136

వ. దీపికాదానపుణ్యప్రభావంబున నక్కళింగాధిపతి జన్మాంతరంబు

నంగుబేరుండై యీశ్వరునకు సఖుం డయ్యె. ఆవృత్తాంతంబు వివరించెదము, సావధానమతి వై యాకర్ణింపుము.

సీ. పద్మకల్పమునందు బ్రహ్మమానససరో
జమునఁ బులస్త్యుండు సంభవించె
నాపులస్త్యునకు మహామునిప్రవరుఁ డా
విర్భవమునఁ బొందె విశ్రవస్సు
విశ్రవస్సునకుఁ దపశ్శ్రీసనాథుండు
వైశ్రవణుఁడు సముద్భవము నొందె
వైశ్రవణుండు సర్వజ్ఞు నెచ్చెలికాఁడు
పాలించె లంక యను పట్టణంబు
తే. ఘనయశుఁడు మేఘవాహనకల్పవేళ
యాజ్ఞదత్తి ధనేశ్వరుం డయ్యెఁ బిదపఁ
జిత్రికాశికిఁ గాశికిఁ జేర వచ్చి
శివుఁ బ్రతిష్ఠించె నవిముక్తసీమయందు. 138

మ. అవిముక్తంబున యాజ్ఞదత్తి శివు నీహారాద్రిరాట్కన్యకా
ధవు నిందప్పకచూచుచుండె నయుతాబ్దంబుల్ నిమేషక్రియా
వ్యవహారస్పృహ లేని నేత్రములఁ జర్మాస్థిసిరావల్లరీ
నివహంబుల్ పరిశుష్కముల్గ నభివర్ణింపంగఁ ద్రైలోక్యమున్.

సీ. గజదైత్యదమనుండు కార్పాసఫలతూల
వర్తిప్రరోహభావము భజింప
వడఁకుగుబ్బలిరాచవారికూరిమికన్య
యాలంబనస్తంభయష్టి గాఁగఁ
బరమవిశ్వాసతాత్పర్యనిర్భరభక్తి
సంపద్విశేషంబు చమురు గాఁగఁ

ప్రవితతధ్యానధారాసముచ్ఛ్రాయంబు
సమధికోజ్జ్వలతరజ్వాల గాఁగ

తే. గామమును క్రోధమును నాదిగాఁగఁ గలుగు
శాత్రవులు పాతకము లైనశలభములుగ
విమలసుజ్ఞానదీపంబు వెలుఁగఁ జేసె
నప్రతిమశైత్యసంపత్తి యాజ్ఞదత్తి. 140

తే. విమలవిజ్ఞానదీపంబు వెలుఁగుచుండ
శాంతిధారాజలంబుల జలక మార్చి
భవునిఁ బూజించె భావపుష్పముల భక్తి
నతివిశుద్ధమనోవృత్తి యాజ్ఞదత్తి. 141

వ. అవ్విధంబున యాజ్ఞదత్తివిజాతీయప్రత్యయాన్యరహితసజాతీయప్రత్యయసంతానానువృత్తిరూపం బైననిదిధ్యాస(న)ంబున నివాతనిష్కంపదీపంబునుం బోలెఁ బెద్దగాలంబు కాలకంఠు మంగళ జ్యోతిర్లింగమూర్తి నంతరంగంబున జన(న)ంబు సేయుచుండిన నాఖండేందుమౌళి ప్రసన్నుండై వత్స! వరంబు వేఁడు మనిన నగనిమీలితంబు లైన లోచనంబు దెఱచి కనుంగొనునప్పుడు శతసహస్రకోటిసూర్యప్రభాభాసురం బైనతేజోమండలంబునడుమ ఫణికుండలుండును, దహ్రాకూటపాటలజటాజూటకోటిపినద్ధముగ్ధేందునడును, దుగ్ధధారాధవళస్నిగ్ధసితదిగ్ధశుద్ధదేహుండు నయిం యద్దేవతామూర్ధాభిషిక్తుం డర్ధాంగలక్ష్మి యైనభవానితోడం గూడి పొడ చూపినవిధూమధూమకేతనజ్వాలాజాలంబుతో మేలంబాడునమ్మృడునొడలిదీప్తిమిఱుమిట్లుగొనుచు వెఱచఱవ నఱిముఱిం జఱిచినం దూరఁదారుపోయి యతనికన్నుల

శక్తి గడతేర నంధుం డై యంధకారాతి నందంద తలవ
కారఛాందోగ్యముండకైతరేయబృహదారణ్యకశ్వేతాశ్వత
రాద్యుపనిషత్తులనుబంచబ్రహ్మపంచాక్షర ప్రణవాదిమంత్రం
బుల నారాధించి యంజలిపుటంబు లలాటతటంబున ఘటి
యించి నిర్ణిరోధనిరవగాఢకరుణాసుధాపూరపూరితాంతః
కరణా! శరణు ; దేవతాకోటికోటీరకోటీఘటితమణిమయూఖ
రేఖాపుంజకింజల్కితంబులు, త్రయ్యంతవిద్యాసీమంతినీసీ
మంతసీమాసిందూరపరాగపాటలంబులు, కుటిలకృతాంత
దంతతాడనక్రీడానిష్కృపంబు లగు మీశ్రీపాదపద్మం
బులు దర్శించునట్టిసామర్థ్యంబుఁ గృపసేయవే! యిదియ
నాకు వరం బనినఁ ద్ర్యంబకుండు బింబఫలారుణాధరంబునం
జిఱునవ్వు చిగురుకొనం దపస్వికి దివ్యదృష్టి యొసంగినం
గృతార్థుండై యతండు. 142

చ. చులుకన మేలుకన్నతొలుచూపునఁ జూచెఁ బినాకపాణిదా
పలి దెస షోడశబ్దముల ప్రాయముమత్తచకోరనేత్ర ను
త్పలదళకోమలామలవిభారమణీయమనోజ్ఞగాత్రిఁ గుం
డలకనకాంగుళీయకకనద్బహురత్నవిభూషణోజ్జ్వలన్. 143

వ. అయ్యవసరంబున. 144

చ. వకుళఫలానుకారు లయి వట్రువలై మెఱుఁగారుక్రొత్తమౌ
క్తికములపే రొకింత తళుకింపఁగ వీనులహేమరత్నక
ర్ణికలు చలింప నందియలక్రేంకృతిఁ గంకణమేఖలాధ్వనిం
బ్రకటము సేయు మందగతి భాస్వరనవ్యవిలాసమేర్పడన్.

తే. అసమబాణపునర్జీవనౌషధంబు
రాగజలధివిధూదయారంభవేళ

సకలజగ దేకసౌభాగ్యజన్మభూమి
శంభుఁ డాయంగ వచ్చె నాశైలకన్య. 146

వ. ఇవ్విధంబున డాయవచ్చి కాలోన్మీలితశిరీషకుసుమకేసర మాలాసుకుమారంబు కస్తూరికాస్థాసకముద్రాభిముద్రితం బును నైనభుజంబు భుజగాభరణభూషితం బైనఫాలలో చనుభుజం బొరయునట్లుగా నిలిచినం జూచి యాజ్ఞనత్తి చిత్తంబునందు. 147

సీ. ఎవ్వతె యొకో యీయిందుబింబానన?
జగదేకసౌభాగ్యజన్మభూమి!
కమలాయతాక్షి నాకంటె పెగ్గలముగా
నెటు చేసె నోకో తా నీతపంబు?
పరమేశుఁ డీబింబఫలపాటలాధర
నను మీఱ మన్నించినాఁడు మేలె?
భాగ్యంబు గా కేమి బాలేందుశేఖరు
కృపఁ గాంచె నీరాజకీరవాణి!
తే. యనుచుఁ గ్రేగంట నీరసం బావహింపఁ
గినుకకిలికించితము నాత్మఁ గీలుకొనఁగ
సవతి వీక్షించుప్రౌఢయోషయును బోలె
బ్రాహ్మణుఁడు చూచెఁ బర్వతరాజతనయ. 148

వ. అప్పుడు. 149

సీ. కృత్యపంచకము సాగింపలేఁ డేయింతి
ప్రాపు లేక కృతాంతభంజనుండు
నిండుఁజందురుని జంద్రిక వోలె నేభామ
పంచబాణవిరోధిఁ బాయకుండు

నేలేమ శశిమౌళి కిచ్ఛాక్రియాజ్ఞాన
        శక్తి నై కల్పించు సకలజగము
నేగంధగజయాన హృదయ మువ్విళ్లూర్చి
        భవునిపై చక్కఁ సాంబాలుఁ గొనియె
తే. మహితహృల్లేఖికామహామంత్రమునకు
నేనరాగోహ ముఖ్యాన్యదైవతంబు
సకలజగదధిష్ఠాత్రి యాశైలపుత్రి
విభున కిట్లని మధురోక్తి విన్నవించె. 150

ఉ. త్ర్యంబక! యీతఁడెక్కఁడిదురాత్మకుఁ? డీయవలక్షణం బపాం
గంబుల మాటిమాటికిని గన్గొనుచున్ బహుభంగులన్వికా
రంబులు చూపెడుం దరతరంబ యబద్ధము లాడెడున్ రహ
స్యంబున వీని కిట్టిచన నబ్బుట నీకృపపెంపునం జుమీ! 151

క. నారూపమునకు మదిలో
నీరసపడుచున్నవాఁడు హృదయేశ్వర! ని
ష్కారణముగ నీచందం
బారసి గొబ్బునఁ గంగవలయు నని పలుకుటయున్. 152

వ. మందస్మితసుందరవదనారవిందుం డై యిందుధరుండు ధరా
ధరపుత్రి కిట్లనియె

చ. మనమునయందు నెగ్గులును మానుము పర్వతపుత్రి! వీఁడునీ
తనయుఁడు నందనుల్బహువిధంబుల ధౌర్త్యములాచరించినం
గినియునె తల్లి భావమునఁ? గీల్పరికించిన దేవతావలం
బనపరభావమై పరఁగుభావవిలాసము లీప్రకారముల్. 154

క. ఈకాశీక్షేత్రమున న
నేకాబ్దము లాచరించె నీతఁడు తప మ

స్తోకగుణా! యీపుణ్య
శ్లోకుని గరుణార్ద్రదృష్టిఁ జూడఁగ వలయున్. 155

క. ఏ వర మిచ్చెద వీనికి
నీవును వర మిమ్ము నాకు నీకును భేదం
బావిష్కరింపవచ్చునె?
యేవారికి నైనఁ బర్వతేశ్వరతనయా! 156

వ. అనిపలికి పరమేశ్వరుండాయాజ్ఞదత్తికి యక్షకిన్నరగుహ్యక
లోకాధిపత్యంబును తన సఖ్యంబును నిచ్చె భవానియు. 157

సీ. ఎడమలోచనము గ్రుడ్డెగసి గవ్వయుఁ బోలె
నుబ్బూఁత లూఁగంగ నుండుఁ గాక
కుడికన్ను తారకాగోళంబు పల్లయై
యొండులోచనముతో నొరయుఁ గాక
యీశుండు కృప చేసి యిచ్చినట్టివరంబు
లట్ల యౌఁ గాకయం చానతిచ్చె
నాయొప్పిదమున కసూయ సేసితి గాన
నభిధఁ గుబేరుండ వగుదు గాక

తే. కాశియం దీవు నిలిపిన కాలకంఠ
దివ్యలింగంబు సర్వసిద్ధిప్రదంబు
నఖిలలోకాభివర్ణనీయంబు నిఖిల
పాపహారమును నగుఁ గాక భవ్యచరిత! 158

వ. అని పార్వతీదేవి యతని గారవించె నిది యాజ్ఞదత్తి పుణ్య
చరితంబు. 159

మ. ధనవంతుండగు బుద్ధిమంతుఁడగువిద్యావంతుఁడౌసాధునం
దనవంతుండగుబుత్త్రవంతుఁడగుఁగాంతావంతుఁడౌనిత్యశో

ధనవంతుండగుఁగీర్తిమంతుఁడగుసత్పుత్రధాన్యవంతుండగుఁ
ధనదాధీశ్వరు మానవోత్తముఁడు సందర్శించి కాశీస్థలిన్.

వ. విశ్వేశ్వరశ్రీమన్మహాదేవు దక్షిణభాగంబునఁ గుబేరేశ్వరస్థా
నంబునందుఁ గుబేరేశ్వరు సేవించినవారికి నణిమాద్యష్టైశ్వ
ర్యంబులు సిద్ధించు నని యిట్లు యాజ్ఞదత్తికి నభిమతంబులం
బ్రసాదించి దేవుండు దేవీసహితుం డై యనతిదూరం బైన
పదంబు ప్రవేశించె. ఈ ప్రకారంబున శంభుతోఁ జెలికా
రంబు వడసి ధనదుఁడు. 161

సీ. ఏపట్టణమునకు నెలదోఁట నందనా
రామంబుతోఁ జైత్రరథవనంబు
క్రీడావిహారదీర్ఘిక యేపురమునకు
మధురామృతాంబువు మానసంబు
మాణిక్యముకురబింబంబు కైలాస మే
నగరివారవధూజనప్రతతికి
నేవీటిపాలిమేర యింత యంతనరాని
దవ్వుల నున్న యుత్తరపుదిక్కు

తే. యట్టియలకాపురము నిధానాధివరము
రాజధానిగఁ దారకారాజమౌళి
రాజితం బైనకృపపెంపు ప్రాపు గాఁగ
రాజరాజేలె నెరవైనరాజసమున. 162

వ. ఆరాజరాజు రాజీవభవహరిపురందరాదిబృందారకమకుట
సందానితవికచమందార కుసుమమాలా మకరందబిందుధా
రాధౌతచరణారవిందుమందరాచల మంథాన మథ్యమాన
దుగ్ధజలనిధిగర్భావిర్భూత కాలకూటకృపీటభవపిండగండూ

పాకళంకితకంఠమూలోపకంఠకంఠోక్తభువన రక్షాదాక్షిణ్య
దాక్షాయణీకుచకలశపాళికేళి కస్తూరికామకరికా ముద్రాభి
ముద్రితవక్షఃకవాటుఁ బశ్యల్లలాటుఁ గుటిలసుధామయూఖ
శకలవిచికిలకలికాకల్పితావతంసుఁ బాంసుక్రీడాపరిచయపేశలం
బగుశైశవ స్నేహానుబంధంబునంబోలె నిరభిసంధిస్నేహ
బాంధవంబున భజియించు. ఇది యక్షాధిపలోకస్వరూపంబు.
ఈయాఖ్యానంబు సర్వపాపహరంబు. ఇంకనీశానలోక
స్వరూపంబు వివరించెద నాకర్ణింపుము. 163

ఈశానలోకవృత్తాంతము

తే. అలకయాల మహోదయ మన్పురంబు
బ్రాహ్మణోత్తమ! యీశానురాజధాని
యందు నుందు రజైకపాదాదు లైన
పదురు నొక్కండు రుద్రులు పారిషదులు. 164

సీ. ఫాలభాగముల నంబకము లందలికిని
నవతంసశశిరేఖ లందఱికిని
డమరుఖట్వాంగఖేటకము లందఱికిని
హస్తిచర్మపటంబు లందఱికిని
శ్యామకంఠప్రదేశమ్ము లందఱికిని
నౌపవాహ్యవృషంబు లందఱికిని
బవమానభుక్కలాపంబు లందఱికిని
నాపాండుదేహంబు లందఱికిని

తే. నందఱికి నగ్నితాపతప్తారకూట
పాటలచ్ఛాయఘనజటాబంధనములు

దేరికొనఁ జూడు మీశానుదిక్కునందు
బ్రాహ్మణోత్తమ ! రుద్రుల పారిషదుల. 165

వ. ఇందఱు నానందకాననంబుననందు నీశానదేవుదివ్యలింగంబుఁ
బ్రతిష్ఠించి యారాధించి తత్ప్రసాదంబున నీశానదిక్కు-
నందు శాశ్వతసుఖైశ్వర్యంబులనొందినారు. 166

తే. కాశి నీశానదేవు శ్రీకంఠుఁ గొలిచి
కాంచు మనుజుఁడు హృదయసంకల్పసిద్ధి
కాశికాక్షేత్ర మష్టదిక్పాలకులకుఁ
గామనావాప్తిసంకల్పకల్పతరువు. 167

వ. అనిన విని (యనంతరంబ) కొంతద వ్వరిగి శివశర్మ వారల
కిట్లనియె. 168

సీ. ఆవేశఘూర్ణంబు లఖిలేంద్రియములకు
శృంగారరససముజ్జీవనములు
శంబరాంతకభుజాజయకీర్తిమహిమలు
కోకదంపతులదృక్కూలశిఖలు
బ్రహ్మాండపురవీథిరత్నతోరణములు
యామినీకర్పూరహారలతలు
నీరదాధ్వాంభోధినిబిడాంకురంబులు
కుముదకాననములకూర్మిచెలులు

తే. గరళికంఠాట్టహాసంబుగర్వరేఖ
కైటభారాతినవనాభికమలశోభ
చంద్రికలు గాయుచున్నవి సాంద్రలీల
భువన మిది యెద్ది? మిగులనద్భుతమొనర్చె. 169

వ. అనినఁ బుణ్యశీలసుశీలు రతని కిట్లనిరి. 170

చంద్రలోకవృత్తాంతము

మ. మధురాపట్టణవిప్రముఖ్య! శివశర్మా! వేదశాస్త్రాగమాం, బుధి
చంద్రోదయ! చంద్రలోక మిది యీ ప్రోలేలుచుండుం గళా
నిధి యాత్మీయమయూఖకందళశిఖానిష్ఠ్యూతధారాసుధా
విధులన్ భానుగభస్తితప్త మగునీవిశ్వంబు రక్షించుచున్.

వ. సర్గాదియందు శతానందుండు నేత్రంబులను మరీచి, హృద
యంబున భృగువు, శిరంబున నంగిరసు, నుదానంబునఁ
బులస్త్యు, వ్యానంబునఁ బులహు, నపానంబునఁ గ్రతువు,
బ్రాణంబున దక్షు, శ్రోత్రంబున నత్రి, సమానంబున వసిష్ఠు,
సంకల్పంబున ధర్ము సృజియించె. అందు నత్రి యనుము
నీశ్వరుఁడు. 172

క. త్రిసహస్రదివ్యవర్షము
లసదృశధృతి నాచరించె నాతఁడు దపముల్
విసమాన మతనితేజో
రసపూరం బెగసె బ్రహ్మరంధ్రము దాఁకన్. 173

సీ. బ్రహ్మరంధ్రము మోవఁ బాఱి యయ్యింద్రియ
ద్రవ మోడిగిల్లె నేత్రములలోన
నేత్రగోళంబులు నిండంగఁ బర్వి యా
వీర్యంబు కలధౌతవిమలకాంతిఁ
బదిధార లై పాఱెఁ బదిదిక్కులందును
నమరాపగానిర్ఝరమునుబోలె
స్రవియించు చున్న యాచరమధాతురసంబు
ధరియించి చూ లయ్యె దశదిశలును

తే. నెలలు తొమ్మిది మోచి కాష్ఠలు గఠోర
గర్భ లై సూతిమాసంబు గదియుటయును
సత్త్వభాసంబు భరియింప శక్తి లేక
వ్రాలె భూమండలంబుపై వడఁకి వడఁకి. 174

వ. ఆదిగ్దేవతలగర్భంబున నుద్భవించిన తేజం బేకీభవించి చందు రుండై యఖిలజగద్ధితార్థం బయ్యరవిందభవునాజ్ఞ నతనిదివ్య స్యందనం బెక్కి యష్టాదశద్వీపంబులం జరియించి తనకుం దాన వృద్ధిఁ బొందె. అతనితేజోనిస్సరణంబున సకలజగదు పకారం బగునదీనివహం బుద్భవించె. అట్లు వర్తించి యాసు ధాకరుం డవిముక్తస్థానంబున నమృతలింగమూర్తిఁ జంద్రేశ్వ రాహ్వాయు నీశ్వరుం జంద్రమౌళిఁ దనపేరం బ్రతిష్ఠించి యమృతోదర(క)ం బనుకుండంబు నిర్మించి తత్సమీపంబున బహుదివ్యవర్షంబులు దపంబుచేసి యాదేవదేవుని ప్రసాదం బుననోషధీతోయంబులకున గ్రజన్ములకు రా జయ్యె. అమ్మహా దేవునను గ్రహంబున వెండియు నాజైవాతృకుండు. 175

ఉ. ఏటికిఁ దానకం బయినయిక్షుశరాసనవైరిజూటికా
కోటికి మల్లికాకుసుమగుచ్ఛము తేవ వహించి కై కొనుఁ
బాటలిమంబు మేనపరిపాటివినోదనవేళఁ బార్వతీ
పాటలగంధిచారుపదపద్మనఖంబుల క్రొత్తలత్తుకన్. 176

తే. రాజరా జయి పాలించె రాజసమున
వసుధ యెల్ల నేకాతపవారణముగఁ
గాశికాక్షేత్రమునఁ బెద్దగాల మేనిఁ
దపము చేసిన బహుళలఖేదంబు వాయు. 177

వ. అంతనక్కాశియందు హిరణ్యగర్భాత్రిభృగువులు బుత్విజు

లుగా హరి సదస్యుండుగా సినీకుహూద్యుతిపుష్టిప్రభావ
సుకీర్తిధృతిలక్ష్ములనం దొమ్మండ్రుధర్మపత్నులతోడం గూడి
యుమామహేశ్వరప్రీత్యర్థంబు రాజసూయాధ్వరంబు
నొనర్పి యవార్యం బైనయౌదార్యంబున. 178

ఉ. దక్షిణ యిచ్చె ముజ్జగము దానగుణప్రవరుండు లీల ఫా
లాక్షునిసన్నిధిన్ మఖసమాపనకాలమునందుఁ దారకా
ధ్యక్షుఁడు కాశికాపురమునందు సదస్యులకున్ బ్రసాదసం
రక్షితసర్వవిష్టపుఁడు రాజు ప్రతాపవిరాజమానుఁ డై. 179

తే. ఇంద్రుకుండంబు కెలనఁ జంద్రేశునొద్దఁ
గాశిలోనవిముక్తోపకంఠభూమిఁ
దపము చేసినచోటన ధవళకిరణుఁ
డాహరించెను రాజసూయాధ్వరంబు. 180

వ. ఇట్లు రాజసూయాధ్వరంబు చేసినసుధాకరునవభృథస్నా
నానంతరమున. 181

సీ. సకలలోకాహ్లాదసంధానహేతు వై
వెలయ నీకౌముదీవిభ్రమంబు
వర్తింతు వీవు నామూర్తిభేదంబులం
దొకమూర్తి వై సమగ్రోదయమున
శ్రీకాశిలోఁ బ్రతిష్ఠించినాఁడవు నన్నుఁ
జంద్రేశ్వరుం డనుసంజ్ఞఁ గూర్చి
బ్రహ్మదత్తం బైనరథ మెక్కి యవలీలఁ
దిరిగి తష్టాదశద్వీపములను

తే. నాహరించితి రాజసూయాధ్వరంబుఁ
దత్పరత మీఱఁ దై త్రైలోక్యదక్షిణముగఁ

జంద్ర! నీయట్టి ధన్యుండు జగతిఁ గలఁడె?
యనుచు వర్ణించె రాజు ఖట్వాంగపాణి. 182

వ. ప్రతిమాసంబునఁ బూర్ణిమాదివసంబున జపహోమార్చన
ధ్యానదానబ్రాహ్మణభోజనంబులు చంద్రేశ్వరస్థానమునఁ
జేసిన ననంతఫలము నొసంగు. ఎవ్వండేని మత్కు[illegible]ంబునఁ
గుహాయోగంబునఁ జంద్రోద(య)వారి నభిషిక్తుం డై
చంద్రేశ్వరుని సందర్శించి వసురుద్రాత్యతర్పణం బొనర్చు
నన్నరుండు పితృప్రసాదంబు వడయు. నతని పితృపితా
మహు లానందంబున నర్థించి వర్తింతు రని వెండియు. 183

సీ. ప్రత్యష్టమీతిథిఁ బ్రతిచతుర్దశి సిద్ధ
యోగీశ్వరీదేవి యోగపీఠి
కాధిరూఢభవాని సకళోరశశిమాళి
హాటకతాటంకహారకటక
కేయూరమేఖలాకింకిణీకంకణా
ద్యఖిలదివ్యాభరణాభిరామఁ
బింగళాహ్వయ సమద్బృందారకశ్రేణి
నాదిభైరవశక్తి నఖిలజననిఁ

తే. గాళిఁ జంద్రేశదేవోపకంఠనిలయఁ
జంద్రకుండోదకంబున జలక మార్చి
గంధపుష్పోపహారాదికల్పనముల
సేవ చేసిన విఘ్నంబు చేర కుండు. 184

వ. ఇది చంద్రలోకమాహాత్మ్యంబు. ఈయుపాఖ్యానంబు విన్నను
బఠియించినను జనున కాయురారోగ్యైశ్వర్యంబులు సమ

గ్రంబు లై సంభవించు ననిన విని శివశర్మ పుణ్యశీల
సుశీలుర కిట్లనియె. 185

తే భాగవతులార ! భాగ్యసంపన్నులార !
యింత యొప్పునె యుడులోకి మెట్టునెదుర
గగనలక్ష్మీలతాతన్వికబరిమీఁద
సంతరించిన ముత్యాలజల్లివోలె ? 186

వ. ఈలోకవృత్తాంతంబు వినవలతుం జెప్పుం డనిన నతనికి
వార లిట్లనిరి. 187

నక్షత్రలోక వృత్తాంతము

సీ. స్వర్గాదిఁ బరమేష్ఠి చరణంబు పెనువ్రేల
దక్షుండు పుట్టె నాతనికిఁ బుట్టి
రఱువండ్రు కన్యక లాకన్నియలు రూప
లావణ్యలీలావిలాసవతులు
రోహిణీప్రముఖ లారుక్మగౌరాంగులు
శివుఁ గూర్చి యాచరించిరి తపంబుఁ
గాశిలో దివ్యలింగంబు నక్షత్రేశ
సంజ్ఞంబు నొకప్రదేశమున నిలిపి

తే. వరణదరినుండు సంగమేశ్వరునియొద్ద
దివ్యవర్ష సహస్రంబు త్రిపురవైరి
మెచ్చి పొడచూపి యడుగుఁడు మీరు వరము
లనిన వార లిట్లనిరి కాలాంతకునకు. 188

క. నీయట్టివాఁడు పురుషుం
డాయెడు మా కభవ ! యనిన నట్టేడ మీకుఁ

నాయకుఁ డయ్యెడు నని దా
క్షాయణులకు వరము నీలకంఠుం డొసఁగెన్. 189

వ. వెండియు సమస్తజ్యోతిశ్చక్రంబునందు మగ్రగణ్యులయ్యెదరు.
మేషాదిరాసులకుం గారణంబులయ్యెద రాదోషాధీశ్వరుండు
బ్రాహ్మణాధిపతి యైనతారకాపతికిం బత్నులయ్యెదరు. మీ
చేతం బ్రతిష్ఠితం బైననక్షత్రేశలింగంబు భజించువారలకు
భోగమోక్షప్రదం బయ్యెడు. మృగాంకలోకంబునకు మీ
లోకం బూర్ధ్వలోకంబు గాఁగలయది. సర్వతారకామధ్యం
బున మీరు మాన్య లయ్యెద రని యానతిచ్చి శివుం డం
తర్హితుం డయ్యె. ఇది తారకాలోకవృత్తాంతం బనిన విని
యనంతరంబ ముందట బుధలోకంబుఁ గనుంగొని. 190

బుధలోకవృత్తాంతము

సీ. ప్రతిబింబమో కాని రజనివల్లభున క
ర్ధ్యాహారమో కాని యమృతరుచికి
వినిమయంబో కాని విధున కన్వాదేశ
మో కాని యత్రినేత్రోద్భవునకు
వీప్సయో కాని పూవిలుకానిసఖునకు
నామ్రేడితమొ కాని యబ్ధిజునకు
నభిధాంతరమొ కాని యరవిందవైరికి
సారూప్యమో కాని చందురునకు
తే. గ్రుమికి నూడ్చినవాఁడు భర్గునికిరీట
కోటి కాభరణం బైన కువలయాప్తు
మిగులఁ జక్కనికొడుకండు మింటినడుమ
గ్రహములం దీతఁ డెవ్వండు ? గణములార ! 191

వ. ఈతఁ డీలోకంబు సంభ్రమమయంబు విలాసమయంబు రాగ
మయంబు శృంగారమయంబును గావించుచుఁ జక్షురాకర్షణ
సిద్ధాంజనం బన మనోవశీకరణమంత్రం బన నింద్రియావేశ
చూర్ణం బనఁ గౌతుకంబునకు సంతోషంబును, సౌభాగ్యం
బునకు సిద్ధయోగంబును, మన్మథునకుజన్మాంతరంబును, యౌ
వనంబునకు సామ్రాజ్యంబును గల్పించుచున్నవాఁడు.
షోడశవర్ష దేశీయుం డీగ్రహగ్రామణి యెవ్వం డనినఁ బుణ్యా!
శీలసుశీలురు శివశర్మ కి ట్లనిరి. 191

చ. విను మధురామహానగరవిప్రకులోత్తమ! బ్రహ్మవంశవ, ర్ధన
శివవర్మ! పుణ్యకథ ధర్మకథల్ పరిపాటిఁ జెప్పఁగా, విన నతి
మాత్రదూర మగు విష్ణుపదంబున కేగుచున్నచో, మనకుఁ
బథప్రయాసములు మానెడు, విఘ్నములుం దొలంగెడున్.

వ. ఇది బుధలోకంబు. 194

సీ. రాజసూయమహాధ్వరం బెవ్వఁ డొనరించెఁ
త్రైలోక్యహంతకారంబుగాఁగ
నెవ్వాని ప్రియభామ లిరువదేడ్వురు నల
ధవళాయతాక్షులు దక్షసుతలు
మన్మథాంతకుజటామకుటకోటికి నెవ్వఁ
డవతంసకుసుమమాల్యత వహించె
నెవ్వఁడు నలువతే రెక్కి యష్టాదశ
ద్వీపియం దసివాలు దిరిగె లీలఁ

తే. జంద్రికాపాండుకౌశేయశాటి యైన
యతనుజగజంపుగోడు గెవ్వఁ డవ్విధుండు

పెద్దకాలంబు ముత్యాలగద్దె యెక్కి
వసుధఁ బాలించె నేకోష్ణవారణముగ. 195

తే. శైశవంబున శాస్త్రంబుఁ జదువఁ వచ్చి
గురుని ప్రియభామ యని చేయుఁ బరమభక్తి
యెవ్వతెను నట్టితార పూర్ణేందువదన
నాఁటనుండియుఁ గామించె నలినవైరి. 196

మ. జడసుళ్లింబును బట్టువట్టియును రత్నహాటకాలంకృతు,ల్మై
డహారంబులు చుట్టివన్నియరుచుల్ లీలావిలాసంబు పెం,పడ
రంజేయఁగ యామినీధవుఁడు విద్యాభ్యాసకాలంబున, న్నిడు
వాల్గన్నులకుం బ్రమోద మొసఁగున్నిత్యంబు నుందారకున్.

సీ. ఆచార్యప్రియభామ యని కొన్ని దివసంబు
లిచ్ఛగింపఁడు తెప్ప లెత్తి చూడ
నుల్ల మువ్విళ్లూర నొకకొన్ని దినములు
వీక్షించుఁ జూడనివేళయందు
నొకకొన్ని తిథులు గర్భోక్తిచాతుర్యంబు
మెఱయు నేకాంతంబ మేలమాడు
నొకకొన్ని ఘస్రంబు లొకొక్కనెపమున
నంగాంగసంస్పర్శ మాచరిందు

తే. వలచి పైఁబడు నొకకొన్ని వాసరములు
హృదయ మనురాగసంపద నిగురుకొలిపి
కవయఁ దొడఁగినయది యాదిగాఁగ నునిచెఁ
జందురుఁడు తార శుద్ధాంతసదనభూమి.

తే. చదివె గురునొద్ద ధర్మశాస్త్రంబు తొలుతఁ
బరమవిశ్వాసతాత్పర్యభక్తిగరిమఁ

జనివెఁ జంద్రుండు కామశాస్త్రంబు పినపఁ
దలిమఁబాప్పిన నసూక్తిఁ దా మొద్ద. 199

తే. ఆదిగర్భేశ్వరుం డౌట యనుచితంబు
మిగులఁ జక్కనివాఁ డౌట మేలు గాదు
పాప మభినవయౌవనోద్భాసి యగుట
యనయ మంచిగుణంబుల యవగుణములు. 200

వ. అవినయనిదానం బైన స్వాతంత్ర్యంబునకు గుతూహల బహుళం బైన స్వభావంబునకు ధైర్యప్రతికూలం బైన యౌవనారంభంబునకు నెవ్వనికే మనోవికారంబు పుట్టకుండునే ? అదియునుం గాక. 201

సీ. ఘనతరాహంకారకాలకూటవిషాప
లాభీలములు గటాపాంచలములు
దుర్వారతరతీవ్రగర్వగళగ్రాహ
కలితగాఢస్వఘుఘ్ఘుము మాట
యస్మితాసంప్రభూతిస్మయాపస్మార
విస్తృతధైర్యంబు వినయగరిమ
యుద్దామదర్పభారోష్ణదాహజ్వరా
రంభసంభృతవికారంబు మనసు

తే. చరణచంక్రమ వభిమానసన్నిపాత
జాతసర్వాంగకమ్ములు జనపతులకు
భూభుజులతప్పె యది వారిఁ బొందియున్న
ధరణిసామ్రాజ్యభారంబుతప్పు గాక ? 202

సీ. భువనైకధన్విచేఁ బుష్పాయుధునిచేతఁ
బ్రసవాస్త్రమున నేటు పడనివాఁడు

నతిగాఢ మైన క్రోధాంధకారంబునఁ
గన్నుల నంధుండు గానివాఁడు
నిర్ణిబంధనలోభనిద్రాభరంబునఁ
బారవశ్యంబుచేఁ బడనివాఁడు
లక్ష్మీకరాకలీలాసీధుమదమున
మనములోపల మున్నుఁ గొననివాఁడు

తే. లేఁడు భూపతిఁ గలిగెనా వాఁడు నృపుఁడె
విశ్వధాత్రీజనులపాలివేల్పుగాక ?
బాహ్యశత్రుల బరిహరింపంగ వచ్చు
నంతరారుల నిర్జింప నలవిగాదు. 203

వ. అది యట్లుండెఁ బదియవృత్తాంతంబు విను మని యిట్లనియె.

తే. తాల్చె గర్భంబు తార సుధాకరునకుఁ
గువలయేక్షణ రాగంబు గొనలు సాఁగ
జంభరిపుదిక్కు ప్రత్యూషసమయమునను
దామరసబంధుగర్భంబు దాల్చినట్లు. 205

తే. గర్భసంస్థితుఁ డగు గ్రహాగ్రణి విశుద్ధ
సితయశస్స్ఫూర్తి వెలిఁ బ్రకాశించినట్లు
దారమైదీఁగ వికచలోధ్రప్రసూన
పాండురచ్ఛాయ నొయ్యొయ్యఁ బలుకఁ బాఱె. 206

తే. గర్భసంస్థితసద్గుణగౌరవమునఁ
బోలె గాత్రంబు భరియింపఁ జాల దయ్యె
నమృతధారారసాస్వాదసముపజాత
తృప్తియును బోలె నాహారతృష్ణ వదలె. 207

శా. ప్రత్యుత్థానము సేయుఁ బెద్దలకు నాప్రౌఢేందుబింబాస్య య
ప్రత్యూహస్థిరభక్తిభావమునఁ దోరం బైనగర్భంబుచే
నత్యంతాలస యయ్యు నగ్గురుజనం బందంద వారింపఁగాఁ
బ్రత్యాసన్నసఖీసమర్పితకరాబ్జాతావలంబంబునన్. 208

క. అంగన యొక్కొకమఱి యు
త్తుంగ మణిస్తంభ యష్టితో నొత్తిగిలున్
మంగళభవనాంతరమున
బంగారుమెఱుంగుసాలభంజిక పోలెన్. 209

ఉ. బింబఫలాధరోష్ఠి మణిభిత్తిపుటంబులయందు నాత్మబిం
బంబు కరావలంబనసమర్థముగా మదిఁ గోరుఁ గేలిసౌ
ధంబుపయిన్ సమున్నతనితంబపయోధరభారగర్భభా
రంబునఁ గోమలాంగకము త్రాడ్పడఁ గేలివిహారవేళలన్.

తే. భవనశృంగారవనలతాపాదపముల
నబలకై దండ పట్టుట యద్భుతంబె?
విహ్యాతసౌధమణిస్తంభవిస్రమరాంశు
కందళుల నూఁత గొనఁ బోవు గర్భగరిమ. 211

తే. పనులుఁ బంపంగఁ జాలదు ప్రాణసఖుల
భవనకార్యప్రవృత్తికై పద్మనయన
తాను గర్భభరాలసత్వంబుకతనఁ
జేయఁ జాలదు మఱి వేఱ చెప్ప నేల? 212

మ. అట మున్నెక్కుడు కేలిశైలమున నధ్యారోహణంబాచరిం
చుటకై నెచ్చెలికత్తియన్ నగుచు సంసూచించినన్ గాంతయొ
క్కటసంత్రాసమునొందుఁ జన్నుఁగవ యాకంపింపఁగా నిండు వే
కటిభారంబునఁ జేసి ధీరహృదయల్ గారాదిగర్భేశ్వరల్.

వ. అంత నట బృహస్పతి పత్నీవియోగవేదనాదూయమాన
మానసుం డై చంద్రుండు చేసినయపరాధంబు హరిహర
హిరణ్యగర్భులకు నింద్రాదిసురులకు నెఱింగించిన. 214

సీ. తగవు గా దనియె మంతన ముండి వృత్రారి
యనుచితం బనియె హుతాశనుండు
పాతకం బని చెప్పి పలికె దండధరుండు
దౌరాత్మ్య మనియెను దానవుండు
దుష్కృత్య మని చెప్పెఁ దోయాధినాయకుఁ
డపకీర్తి యని తూలనాడె గాలి
యన్యాయ మనియె గుహ్యకసార్వభౌముండు
కాదు కా దనియె శాక్వరగముండు
తే. హేతుదృష్టాంతములు చూపి యెల్లసురలు
నన్వయవ్యతిరేకమార్గానువృత్తి
బుద్ధిఁ జెప్పిరి యివ్విధమున శశాంకుఁ
డమరగురునకు మగుడ నీఁ డయ్యెఁ దార. 215

వ. అంత. 216

చ. ప్రమథులతోడఁ గూడ నతిభైరవఘోరతరాట్టహాసుఁ డై
శమనవిరోధి దాఁకుటయుఁ జంద్రుఁడు వేల్పులతో నెదిర్చిన
న్సమరము తారకామయమనంగ నభోంగణభూమిఁ దారకా
సముదయభీతిహేతు వయి సాఁగెఁ బురారికి నబ్జవైరికిన్.
తే. ఈశ్వరునితోడ నని సేయ నెట్లు వచ్చు
నన్యులకు నెంతవారికి నాగ్రహమున?
నీశ్వరునిమూర్తి గావున నెదిరి నిల్చి
యుద్ధ మొనరించెఁ గాక యనుష్ణకరుఁడు. 218

వ. అప్పుడు. 219

శా. చండీశుం బొదివె న్నిశాకరుఁ డసంస్తంభంబు జృంభింప బ్ర
హ్మాండక్రోడము శింజినీధ్వనులచే నాఘూర్ణితంబొంద ను
చ్చండాటోపభుజావలేపకలనాసంరంభవక్రీభవ
ద్గాండీవప్రవిముక్తభీషణమహాకాండప్రకాండంబులన్. 220

వ. ఇవ్విధంబునఁ బ్రతిఘటించి గెంటింపరాని మగంటిమిం బెచ్చు పెరిఁగి కలువలనెచ్చెలి చిచ్చులుమియు శిలీముఖంబు లొడలఁ గ్రుచ్చి యార్చి శంఖంబు పూరించి సింహనాదంబుచేసి గాండీవజ్యారావంబు గోపసీకుహరంబు నిండవిధుండు చండ మహాకాళనికుంభకుంభోదరవీరభద్రాదిప్రమథవర్గంబుతోడం గూడఁ దన్ను నొప్పించినం గోపించి కించిదారజ్యమాన లోచనాంచలుండై లలాటలోచనుండు పురనిశాటనాటంకినీ కపోలకస్తూరికా(కరి)మకరికాముద్రాద్రోహియు, జలంధర హృదయగర్వసర్వంకషంబును, సింధురాసురశిరఃకూటపాక శంబును, దక్షాధ్వరమృగధ్వంసక్రీడానృశంసంబును, దుషా రగిరికన్యకా భ్రూవల్లీవిలాసరేఖాలలితశృంగంబును నగు నజగవంబున బ్రహ్మశిరోనామకంబైన దివ్యాస్త్రంబు సంధించిన.

శా. ఆకంపించె జగత్త్రయంబు దెస లల్లాడెన్ సముద్రంబు లు
ద్రేకించెన్ భయమందె భూతలము ఖేదిల్లెన్ గులక్ష్మాధ్రముల్
శ్రీకంఠుం డవికుంఠవిక్రమమునన్ దివ్యాస్త్రముం గూర్చి వి
ల్లాకర్ణాంతముగా వెసం దివిచి శీతాంశున్నిరీక్షించినన్.

తే. అప్పు డడ్డంబు సొచ్చి పద్మాసనుండు
ప్రమథనాథునిరోషసంభ్రమము మాన్పి
చంద్రునికి బుద్ధిఁ జెప్పి మాత్సర్య ముడిపి

యాలి నిప్పించె నయ్యుపాధ్యాయునకును. 223

చ. అమృతమయుండుగావున సుధాంశునితోడిసమాగమంబునన్
రమణి కశుద్ధి లే దనుచు బ్రహ్మాదికులు సంఘటింపఁగా
నమరగురుండు నైకొనియె నంబుజలోచనఁ దారఁ దారకా
రమణముఖిం ద్యజించె సురరాజుఁ భామిని నెట్టకేలకున్.

వ. అనంతరంబ గర్భం బాలోకించి గురుండు దాని కిట్లనియె.

తే. అతివ! యీగర్భ మెవ్వరి కైనఁ జెప్పుమ
చంద్రునకొ? నాకొ? యని సహాస్యముగ నడిగె
సిగ్గుపడి యెంత యడిగినఁ జెప్పదయ్యె
నాంగిరసునకుఁ దార తారాధిపాస్య. 226

తే. చెప్ప కున్నను గోపించి యిషిక యెత్తి
చూలు గరఁగంగ నైవంగఁ జూచె గురుఁడు
వేల్పు లా యిందుముఖిఁ జీరి వెఱక చెప్పు
నిజము చెప్పిన నీకు నేనెగులు లేదు. 227

ఉ. నావుడు తార యొక్క వచనంబును బల్కక యూరకుండె ల
జ్జావనతాస్య యై సరసిజాసనుఁ డప్పుడు నేగ వచ్చి యో
దేవి! నిజంబు చెప్పు హిమదీధితిసంగతి నైన గర్భమో?
జీవుఁడు నొంటికాలమునఁ జేసినగర్భమొ? యంచుఁ బల్కినన్.

తే. తోయజదళాయతాక్షి కేల్దోయి మోడ్చి
పలికె నెత్తమ్మిచూలితోఁ బ్రస్ఫుటముగ
వనజసంభవ, తారకావల్లభుండు
చూలు చేసినవాఁ డంచు సూక్ష్మఫణితి. 229

వ. గురుండును దారకు జన్మించినట్టికుమారునిం జంద్రుని కిచ్చె.
చంద్రుండు నిజనందనునకు బుధుం డనుపేరు వెట్టె. బుధుం

డను దంద్రియనుమతి వడసి కాశి కరిగి బుధేశ్వరుం డను
శివలింగంబుఁ బ్రతిష్ఠించి పెద్దకాలంబు తపంబు చేసి యాబు
ధేశ్వరలింగంబునందు సాక్షాత్కరించినవిరూపాక్షుం బ్రస్తు
తించి యమ్మహేశ్వరువలన నక్షత్రలోకంబునకు నూర్ధ్వం
బున నున్నలోకంబున కధీశ్వరుం డయ్యె. 230

తే. చంద్రకుండచంద్రేశ్వరస్థానమునకుఁ
బ్రాగ్దిశాభాగమునయందు భక్తి నరుఁడు
కాశికాక్షేత్రసీమ బుధేశుఁ గొలిచి
పరమబోధంబు దప్పఁడు ప్రాణవిరతి. 231

తే. అనుచు గోవిందకింకరు లనఘమతులు
బుధునికథ చెప్పుచుండ నభోంతరమున
బోయె దివ్యవిమానంబు పుణ్యకర్త
కరులనెల వైన శుక్రలోకంబు డాయ. 232

శుక్రలోకవర్ణనము

వ. అప్పు డయ్యిద్దఱు శివశర్మ కి ట్లనిరి. నిశితశతక్రతుప్రయోగ
ప్రక్రియాక్రమసమర్థశుక్రలోకం బిది. ఇందు దానవగురుండు
గావ్యుం డధివసియించు. ఆభార్గవుండు భర్గువలన వర్ష
సహస్రంబు కణధూమంబాహారంబుగా దుస్సహం బైన తపం
బాచరించి మృతసంజీవనీవిద్యారహస్యంబును సకీలకంబుగా
నెఱింగినాఁడు. 233

తే. ఎఱుఁగ రీవిద్య యెవ్వార లీజగమున
బ్రహ్మవంశాగ్రగణ్య! వాక్పతి మొదలుగ
గుహుఁడు దక్కంగఁ గరటివక్త్రుండు దక్క
బార్వతీదేవి దక్కంగ భవుఁడు దక్క. 234

తే. హరునితోడ విరోధించి యంధకుండు
యుద్ధ మొనరించి చొక్కునాఁ డోహటించె
నజగవోన్ముక్తఘననిశాతార్ధచంద్ర
బాణనిర్భిన్నవక్షగప్రపాతుఁ డగుచు. 235

వ. కాలకంధరునకు నంధకాసురునకు నైన యమ్మహాయుద్ధంబున నీల్గినరాక్షసులను మృతసంజీవనీ విద్యాప్రభావంబున భార్గవుండు బ్రతికించుచుండ దండనికుంభకుంభోదర ప్రముఖు లగు పారిషదులు పరమేశ్వరున కిట్లనిరి. 236

సీ. దేవ! మహాదేవ! త్రిపురదైత్యధ్వంస!
యభవ! మావిన్నప మవధరింపు
మీచేత బడసిన మృతజీవనీవిద్య
బ్రతికించుచున్నాఁడు భార్గవుండు
దైత్యవర్గము నెవ్విధంబున మా కెట్లు
జయము సిద్ధించు? నాఁ జంద్రమౌళి
నందికేశ్వరుఁ బంచి బందిగ్రహణాలీలఁ
గావ్యుఁ దెప్పించి శ్రీకంధరుండు

తే. గరతలమునఁ బరిపాండుకాంతి నతనిఁ
దాల్చి దధితోడిచలిదిముద్దయును బోలె
విషము మ్రింగినపెన్నుద్ది వేల్పుతేఁడు
మనసిజారాతి మ్రింగి గట్టువఁగఁద్రేఁపె. 237

వ. అంధకాసురుండును భార్గవుండు లేనిపిమ్మటంగొంతకాలంబు నకుఁగృతాంతమర్దను చేత హతుండయ్యె. బహుకాలంబు కాలకంఠుజఠరగోళంబునం దుండి కావ్యుండును. 823

మ. ప్రవియించెఁ దుహినాంశుశేఖరుని మేఢ్రద్వారమార్గంబు

నర, గవిశుక్లంబయితత్తణంబున నిజాకారంబుఁదాల్చెన్నో,
భవవిద్వేషి నిజాత్మసంభవునిఁ గా భావించి వీడ్కొల్పె భా
ర్గవు నాతండును సహంబు సేయు నరిగెఁ గాశీపురిసీమకున్. 239

వ. అరిగి యానందకాననంబున లింగప్రతిష్ఠ చేసి యాలింగంబు
నందు విశ్వేశ్వరశ్రీమన్మహాదేవు భావించుచుఁ జంపక
దత్తూర కరవీర కుశేశయ మాలతీ కర్ణికార కదంబ వకుళో
త్పల మల్లికా శతపత్త్ర సింధువార కింశుక కాశోకపున్నాగ
నాగకేసర క్షుద్ర మాధవీ పాటలా బిల్వ మందార ద్రోణ
గ్రంధిపర్ణి దమన చూతపల్లవ దర్భ తులసీ నంద్యావర్త
దేవదారు కాంచన దూర్వాంకురాదులశంకరు ననేకకాలం
బారాధించి శుక్రుండీలోకంబున కధీశ్వరుండయ్యె. 240

క. వారాణసి శుక్రేశ్వరు
నారాధించినవరుండు ప్రాపించు సమ
గ్రారోగ్యయుగపుత్త్ర
శ్రీరాజ్యైశ్వర్యశౌర్యచిరసౌఖ్యంబుల్. 241

అంగారకలోకవృత్తాంతము

వ. అట నూర్ధ్వంబున నున్నయదిలోహితాంగలోకంబు. 242

సీ. తొల్లి దాక్షాయణితోఁ బాసి శంభుండు
విరహసంతాపాగ్ని వేఁగుచుండె
నావేళ నొక్కనాఁ డభవుఫాలంబునఁ
బ్రస్వేదబిందు వుత్పన్న మయ్యెఁ
బరిపక్వకూశ్మాండఫలసన్నిభం బైన
యాఘర్మజలకణం బవని వ్రాలె

వ్రాలి తత్క్షణమ యవ్వసుమతీస్థలమునఁ
బద్మరాగోపల ప్రతిమకాంతి
తే. నొక్క వ్యక్తమూర్తుఁడై యుండె నెదుర
నతని నందనుఁ గాఁ శంభుఁ డాదరించె
ధాత్రియును వాని భావించెఁ దనయుఁ గాఁగ
నతఁడు ధృతిమీఱి దపము సేయంగఁ గోరి. 243

సీ. భాగీరథీగంగ ప్రవహించు నేవీటి
పరిసరంబున నుదగ్భాగమునను
వరణాతరంగిణీవారినిర్ఝరములతో
నసి(ళి) వేణి యేవీటియవధిఁ గూడెఁ
దస్తంబు హాతమును దత్తంబు నేవీటి
గొమదుక్రోసుల నిచ్చు నమృతలక్ష్మి
వలచు నేవీటి కవ్యాజరాగస్ఫూర్తి
శైలకన్యకకంటెఁ జంద్రమౌళి
తే. యట్టికాశికి గురునాజ్ఞ నరుగుదెంచి
పరమనైష్ఠికుఁ డగుచుఁ దపం బొనర్చెఁ
గలుషసంతాన కాననాంగారకుండు
ధారకుఁడు భూతధాత్రి కంగారకుండు. 244

తే. పాంచముద్ర మహాస్థానపదమునందుఁ
గాశి శాశ్వతదేశోపకంఠభూమి
నిష్ఠసంగారకేశుఁ బ్రతిష్ఠ సేసి
కాంచె నీలోక మేల నంగారకుండు. 245

వ. ఇది యంగారకలోకవృత్తాంతంబు. 246

బృహస్పతిలోకవృత్తాంతము

క. అదె వీక్షింపు బృహస్పతి
పదము ధరామరవరేణ్య! బహువిధశుభసం
పదలకు నాస్పద మీతఁడు
చదివినవాఁ డర్థశబ్దశాస్త్రములెల్లన్. 247

వ. అయ్యాంగిరసుండు కాశీక్షేత్రమున కరిగి యందుఁ దనపేర శంభులింగంబుఁ బ్రతిష్ఠించి తత్సమీపంబున బహుదివ్య వర్షంబులు దపంబు నేసి తనకుం బ్రత్యక్షం బైన విరూపాక్షు నిట్లని సంస్తుతించె. 248

తోటకము. జయశంకర! శాశ్వత! చంద్రధరా!
భయనాశ! గిరీశ్వర! భక్తపరా!
నయనత్రయభాస్వర! నాగహరా!
యయవర్ధన! శాంత! దయామధురా! 249

తోటకము. భువనావన! పావన! భూతపతీ!
భవ! పన్నగభూషణ! భద్రకృతీ!
శివ! దేవ! మహేశ! విశిష్టమతీ!
భవభంగ! ఫలప్రద! పాపహృతీ! 250

తోటకము. శ్రితపాపవిభంజన! సిద్ధనతా!
క్షితిజార్ధవపుర్ధర! చిద్విదితా!
మృతిజన్మవిధూత! హరిప్రణుతా!
సతతప్రణ ధ్వనిసాధరతా! 251

క. చాటుకవితాకళాపరి
పాటిం బాటించి యారభటిభక్త్యావే

శాటోపంబున గీష్పతి
తోటకవృత్తములఁ బొగడెఁ దుహినాంశుధరున్. 252

శా. ఆటోపారభటి స్మునీశ్వరుఁడు దన్నుంపంచ వర్ణింపఁ ద
చ్చాటుప్రౌఢికిఁ జేసె ధూర్జటి మహశ్లాఘాశిరఃకంపమున్
జూటీకూటవిటంకకోటివిలుఠత్స్రోతస్వినీవీచికా
కోటీఘాటిరటత్కరోటికుహరక్రోడావగాశ(హ)ంబుగాన్. 253

వ. ఇట్లు ప్రీతుం డై. 254

సీ. బృహదుగ్రతపము సంభృతనిష్ఠఁ జేసిన
సామర్థ్యమున బృహస్పతివి కమ్ము
ప్రాణంబు ప్రాణ మై భక్తిఁ జేసితి గాన
జీవాహ్వయము నీకుఁ జెల్లుఁ గాక
వాగ్డంబరమునఁ గై వారంబు నేసితి
తగుదు వాచస్పతిత్వమున కీవు
పఠియించువారికిఁ బ్రాభవస్ఫురణంబు
దొరకించు నీచాటుతోటకములు

తే. లోహితాంగుఁడు పాలించులోకమునకు
నూర్ధ్వ మైన పదంబున నుండు వత్స
యనుచు వరములు కృపచేసి యసితగళుఁడు
బ్రహ్మఁ దలఁచెను దేవతాప్రతతితోడ. 255

వ. సంస్మరణమాత్రంబున నేగుదెంచిన బ్రహ్మాదిదేవతలచేత నవ్వా
చస్పతికి దేవతాచార్యపదవీసామ్రాజ్యంబునకుం బట్టాభిషే
కంబు చేయించి యప్పంచాననుండు చంద్రేశ్వరునికి దక్షిణ
(భాగ)ంబున విశ్వేశ్వరునికి నిరృతిభాగంబున ధిషణుండు
ప్రతిష్ఠించిన ధిషణేశ్వరునియందు సంక్రమించె. గురుండును

నీలోకంబున కధీశ్వరుం డయ్యె. ఇది బృహస్పతిలోక
వృత్తాంతంబు. 256

తే. దివిజగురునిపదంబు నతిక్రమించి
సౌరిభువనంబు గాంచి యాశ్చర్య మంది
పుణ్యశీలుండు శివశర్మ పుణ్యశీలు
నకు సుశీలున కిట్లనుఁ బ్రకటఫణితి. 257

ఉ. పాండురపద్మలోచనునిపార్శ్వగులార! మహాత్ములార! మా
ర్తాండసమానతేజ మిదె ప్రాంతమునందు సముజ్జ్వలప్రభా
మండలమధ్యవర్తియు సమగ్రవిలాససమన్వితంబు నై
రెండవనాకిలోక మన దృష్టికి నిం పొనరించె నెంతయున్.

శనైశ్చరలోకవర్ణనము

వ. ఇది యెవ్వరిలోకం బనిన వార లి ట్లనిరి. 259

తే. శంసితవ్రత! యిది శనైశ్చరునిలోక
మితఁడు గ్రహములలో నెల్ల నతివిశిష్టుఁ
డిమ్మహాత్ముని శుభచరిత్రమ్ము వినుము
విశదముగఁ జెప్పెదము నీకు విస్తరించి. 260

సీ. నారాయణునినాభినలినమధ్యంబున
జనియించె బ్రహ్మ యావనజజునకు
సంభవించె మరీచి సంయమిగ్రామణి
గలిగె నమ్మౌనికిఁ గశ్యపుండు
ప్రభవించె నాకశ్యపప్రజాపతికి మా
ర్తాండుఁ డబ్జాప్తుండు త్వష్టకూఁతు
సంజ్ఞాభిధాన రాజనిభాస్య వరియించెఁ
దరణికి నది యపత్యత్రయంబుఁ

తే. గాంచె మను వన యముఁ డనఁగాఁ దనయుల
యమున యనుకన్య నక్కాల మప్పురంధ్రి
యోర్వ లే దయ్యె మగనియత్యుష్ణ మైన
తేజమున కతికోమలదేహ యగుట. 261

వ. అంత. 262

తే. ఛాయ యనుదాని సృజియించె సంజ్ఞ యొక్క
మానినీమణి నాత్మసమానమూర్తి
నగ్రమునయందుఁ బ్రాంజలి యగుచు నుండె
నతిప్రతిచ్ఛాయ లలితమాయాస్వరూప. 263

వ. సంజ్ఞాదేవి సవర్ణ యగు నాఛాయ కిట్లనుః కల్యాణి! యేఁ బుట్టినింటికిం బోయి వచ్చెద. నామూర్తి నీవు మదీయాజ్ఞ సూర్యునికిం బరిచర్య సేయుము; మనువును, యముండును, యమునయు ననునీయపత్యత్రయంబు త్వదీయంబుగాఁ దలంపుము. ఈరహస్యంబు కచగ్రహణశాపపర్యంతం బెవ్వరికిం జెప్పకు మని యప్పగించి పితృగృహంబునకుం బోయె; నిట సవర్ణయు. 264

తే. అష్టముం డగు సావర్ణి యనెడుమనువు
మఱి శనైశ్చరు భద్రాసమాఖ్యఁ గన్యఁ
గాంచె నుష్ణాంశువలన నక్కాలువకంటి
తరణియును దాని సంజ్ఞఁగాఁ దలఁచి యుండె. 265

వ. ఆసవర్ణయు సర్వస్త్రీస్వభావం బగు సాపత్న్యగుణంబున సంజ్ఞాసంతానమునకంటెం దనసంతతియందు నత్యంతవాత్సల్యంబు వాటించి భోజనాలంకారలాలనంబులపట్టున వైషమ్యంబు గలిగియుండ నొక్కనాఁడు భవితవ్యతావిలాసంబు

ననో! బాల్యచాపలంబుననో! మమతాస్వాతంత్ర్యంబున
నో! జముండు సంజ్ఞాస్వరూపిణియైన పినతల్లి ఛాయాదేవిం
గోపించి తన్నుం దలంచి పాదం బెత్తిన. 266

సీ. తనకు సంజ్ఞాదేవి మనములోఁ గడు నమ్మి
యిల్లడ వెట్టుట యెట్లు మఱచెఁ?
బసిబిడ్డ నేరమి పట్టి పాలార్పంగఁ
దగవు గా దని యేల తలఁప దయ్యెఁ?
దా నేమి బిడ్డలఁ గానదా? సవతాలి
కొడుకు త ప్పొకటి లోఁ గొన్న నేమి?
యల్పదోషంబున కననురూపం బైన
ప్రబలదండన మొనర్పంగఁ దగవె?

తే. జముఁడు దనమీఁదఁ బాదంబు చాఁచినపుడు
కనికరం బింత లేక యక్కలుషకంటి
కంటికొనఁ గెంపు గదురంగఁ గనలి చూచి
పదము దెగి పడ శపియించె బాలు నతని. 267

వ. అవ్విధం బెఱింగి భానుండు ఛాయాదేవిం జూచి యిట్లనియె.

తే. ఎట్టియపరాధ మొనరించెనేనిఁ దల్లి
కొడుకు శపియింప దిబ్బంగిఁ గ్రూరబుద్ధి
నతివ! సత్యంబు చెప్పు మెవ్వతవు నీవు?
నావుడును శాపభీతి నన్నలిననేత్ర. 269

వ. తనవృత్తాంతంబు సెప్పె; చెప్పిన దానియం దపరాధంబు పొడ
గానక యమునిం జూచి మాతృశాపంబు నివర్తింప శక్యంబు
గాదు. నీచరణంబునం గలమాంసంబు క్రిమికీటంబులు
తొలిచి భక్షింప భూమిపయిఁ బడియెడు నని పలికి కొడుకు

నూఱడించి త్వష్టృప్రజాపతిభవనంబునకుం బోయి యతని వలన నిజభార్య దపంబు సేయం జనుటయు, నున్నగుఱు తును నెఱింగి యరిగి యగ్రభాగంబున. 270

సీ. కఠినఖురపుటీఘట్టనంబుల భూమి
  పటహనిస్వానంబు ప్రస్తరింప
ధవళలాంగూలపల్లవచాలనంబులు
  కౌముదీచ్ఛాయలఁ గ్రాపి యుమియ
నెలిహానుగలఁబోలు వెడఁదకన్నులయందుఁ
  దారంబు నళినచందము వహింపఁ
ఘ్రోణసంపుటపరిస్ఫురణావసరముల
  నంతకోపకకాంతి దళుకు సూపఁ

తే. గోపమగోడిగ నై కురుక్షోణియందు
విపినవీథుల నేకాంతవృత్తిఁ దిరుగు
పరమపుణ్యాంగనాజన ప్రథమగణ్య
సంజ్ఞఁ బొడగాంచె దవ్వులఁ జండకరుఁడు. 271

ఉ. ఘోటిక నై చరించు తనకూరిమిభామినిఁ జూచి క్రమ్మరన్
ఘోటకరూపుఁడై యతఁడు క్రొవ్వెసలారెడుకావరంబుపై
పాటున డాయవచ్చి నిరుపాధికసౌహృదవిభ్రమంబునన్
జీటికి మాటికిం దిశలు చిల్లులువోవఁగఁ జేసె హేషలన్.

తే. అశ్వరూపుఁ డైన యరవిందబాంధవుఁ
డశ్వ యైన సంజ్ఞ నల్లఁ జేరి
కావరంబుతోడికందర్పవిక్రియ
మోర మోర మోపి మూరుకొనియె. 273

వ. ఇవ్విధంబున సాక్షాత్కరించిన తపోలక్ష్మియుం బోలె నబ్బ

డబ బడబానలజ్వాలాజాలలీలాప్రీడావహామహాగపటలపాట
లిమపల్లవితదశదిశాభోగ భోగింపం దలంచి పూషవిషమ
బాణుచిటకంబున నకరోరదూర్వాంకురచర్వణక్రియాసమ
భిహారహారితఫేనచ్ఛటాచ్ఛేదపిచ్ఛిలంబును, దారుణ్యదర్ప
భరకవోష్ణనిశ్వాసధారాధురంధరంబును, జలాచలప్రోథ దళ
సంపుటంబును నగు నాఘోటీవదనంబు చుంబించె. సంజ్ఞయు
నిజాంతఃకరణప్రవృత్తియ ప్రమాణంబుగా నతిప్రమాణ
మూర్తిస్ఫూర్తి యగునత్తురంగంబుఁ బతంగుండ కాఁదలంచి
యిచ్చగించె. అత్తళువైనయమ్మత్తకాశిని కించిదున్నిద్ర
పారిభద్రకలికాచ్ఛాయాముద్ర నుద్ది యగు ముద్ర విరి
యించుచు మొగుచుచుం గదలకుండిన మోర మోరతో
మోపియుఁ, గండంబు గఱచియు, డాసియుఁ, బాసియు,
అవలిచేసియుఁ, గొంతదడవు వినోదంబునొంది యక్కుహనా
హాయంబగ్గోడిగ డగ్గఱి క్రీడించి యుండె. అప్పు డమ్మావునకు
ముకుగ్రోళ్ల నెక్కి చరమధాతుద్రవంబు కదంబకుసుమకేసర
పరాగగంధపాణింధమంబై స్రవించె. అయ్యింద్రియంబున
జంద్రబింబాననలిద్దఱు గవలవారు నాసత్యులనం
బ్రభవించిరి. అక్కుమారద్వయంబు. 274

తే. విబుధవైద్యద్వయం బయ్యె విమలచరిత!
యంత నిజమూర్తి ధరియించె నబ్జహితుఁడు
సంజ్ఞయును దాల్చె నిజమూర్తి సంతసించి
*దంపతులు చని రాత్మీయసదనమునకు. 275

* యతిభ్రంశము. కాననిట్లు పాఠముండి యుండును. చనిరి దంపతు లాత్మీయ సదనమునకు. (ఉ. వేం. రం)

వ. అంత నక్కడ శనైశ్చరుండు వారాణసికిం జని లింగస్థాపనంబు చేసె. ఆశనైశ్చరేశ్వరుండు విశ్వేశ్వరదేవునకు దక్షిణభాగంబున శుక్రేశ్వరున కుత్తరంబున సంప్రతిష్ఠితుండై భజియించువారికి భోగమోక్షంబులు ప్రసాదించు. శనైశ్చరునకుఁ దత్ప్రసాదలబ్ధం బీలోకంబు. ఇది శనైశ్చరలోకవృత్తాంతంబు. 276

సప్తర్షిలోకవృత్తాంతము

క. సప్తమహామునిలోకము
సప్తార్చిఃప్రతిమతేజ! సకలైశ్వర్యా
వాప్తికరం బిది చూడుము
ప్రాప్తాఖిలవిద్య! భూసురప్రవరేణ్యా! 277

వ. మరీచి యత్రి పులస్త్యుండు పులహుండు క్రతు వంగిరసుండు వసిష్ఠుండు వీరు బ్రహ్మమానసపుత్త్రులు, సప్తబ్రహ్మలు. వీరికి ధర్మపత్నులు క్రమంబున సంభూతి యనసూయ క్షమ ప్రీతి సన్నతి స్మృతి † యూర్జ. వీరివలన నా ప్రజాపతులు నానారూపప్రజలసృజియించి బ్రహ్మాదేశంబున నయ్యవిముక్తక్షేత్రంబునఁ దపంబుచేసి మరీచ్యత్రీశ్వరాదిలింగంబులం బ్రతిష్ఠించిరి. సంభూత్యనసూయాదు లగు పతివ్రతలును దమపేర శివలింగంబులం బ్రతిష్ఠచేసిరి. తత్ప్రసాదలబ్ధం బైన యీలోకంబున సప్తమహామునులును బరమసుఖం బనుభ

---

† 'యక్ష' యని పెక్కుప్రతులం గనఁబడుచున్నది. ఇది 'సంభూతి రనసూయాచ క్షమా ప్రీతి శ్చసన్నతిః, స్మృతిరూర్జా క్రమాదేషాం పత్న్యో వై లోకస్య మాతరః' అను మూలమునకు విరుద్ధము అరుంధతి యని వేఱొక పా.

వించు చున్నవారు. ఇది సప్తమహామునిలోకవృత్తాంతంబు.
ఈలోకంబున కూర్ధ్వంబున. 278

ధ్రువపదవర్ణనము

సీ. త్రైలోక్యమంటపస్తంభసంభారంబు
గగనలక్ష్మీకంఠకనకభూష
బ్రహ్మాండకేతకీపాదపప్రసవంబు
గంగాతరంగిణీక్రౌంచఖగము
బలిదైత్యమథనాంఘ్రిపంకేజనఖరంబు
దారకావళితులాదండయష్టి
ధాతృలోకద్వారదంతకవాటంబు
గ్రహమండలీపశుగ్రామవేది
తే. తారకాశింశుమారాకారుఁడైన
యాదినారాయణునితోడఁ గయలఁ జివ(వు)ర
తప్ప కీర్తింపు ధరణిబృందారకేంద్ర!
వివిధకల్పపరంపరాధ్రువుని ధ్రువుని. 279
వ. ఈతనిలోకవృత్తాంతంబు వినుము. 280
క. స్వాయంభువమనుధాత్రీ
నాయకుఁ డుత్తానపాదుఁ డనఁ గాంచె సుతుల్
దోయజనేత్రలు గేహిను
లాయయ్యకు నిరువు రంబుజాసనవంశ్యా! 281
తే. కాంత యొక్కత సురుచి యొక్కత సునీతి
సురుచి కుత్తముఁ డనుపేరిసుతుఁడు పుట్టె
ధ్రువుఁడు పుట్టె సునీతి కాధ్రువునికంటె
నుత్తమాహ్వయు మన్నించుచుండుఁ దండ్రి. 282

తే. ఒక్కనాఁడోలగంబున నున్నవేళ
గురుసితొడమీఁదఁ గూర్చుండె సురుచికొడుకు
ధ్రువుఁడు నేతెంచి వాఁ డున్నతొడయె యెక్క
సురుచి వారించె భూపతి చూచుచుండె. 283

వ. అప్పుడు మఱలి వాఁ డంతఃపురంబున కరిగి యావృత్తాంతం
బంతయుఁ దల్లి కెఱింగించి పిన్నయయ్యును నుత్తమక్షత్త్రియ
తేజోవిశేషంబునం బరిభవంబు సహింపఁ జాలక తల్లియనుజ్ఞ
వడసి తపంబు సేయం జనువాఁడై యదృచ్ఛాగతు లగు సప్త
ఋషులఁ గాంచి సముచితప్రకారంబునం దనవృత్తాంతంబు
వారి కెఱింగించి వారివలన ద్వాదశాక్షరమంత్రంబుపదేశంబు
గొని పరమభక్తిపరాయణుం డైన నారాయణు మధువన
ప్రాంతంబున యమునాతటంబునఁ బెద్దకాలంబు పెక్కు
విఘ్నంబులకు మనంబు చలింపనీక యారాధించి సాక్షాత్క
రించిన యప్పుండరీకాక్షువలన విశ్వోత్తరం బైన యిప్పదం
బుఁ గాంచె. 284

తే. ధ్రువుని కిచ్చినవరమును ధ్రువము గాఁగ
నతఁడు దాను వారాణసి కరిగె శౌరి
వానిఁ దనవెన్కఁ దక్కన వైనతేయు
మీఁద నెక్కించుకొని చిట్టుమిసుచు నంత. 285

మ. శివుఁ గాశీపతి విశ్వనాయకుని సంసేవించి యప్పార్వతీ
ధవునాజ్ఞన్ గ్రహచక్రవాళమున నూర్ధ్వం బైనలోకంబునన్
ధ్రువ! వర్తింపు మనేకకాలమనుచున్ బోధించి యేగెన్ మనో
జవనుం డైనఖగేంద్రు నెక్కికొని విష్వక్సేనుఁ డెం దేనియున్.

వ. ధ్రువుండును. 287

సీ. మణికర్ణికావారి మజ్జనం బొనరించి
యవిముక్తమునయందు శివుని నిల్పి
యాశివలింగంబు ననిశంబు సేవించి
యందు విశ్వేశ్వరు నావహించి
పంచాక్షరీమంత్రపారాయణంబును
బ్రణవమంత్రంబును బరిచరించి
విశ్వనాయకుకృపావిభవంబు పెంపునఁ
బరమోన్నతం బైన పదము గాంచెఁ
తే. గాశిలోన ధ్రువేశ్వరుఁ గాలగంధు
భక్తి సేవింప ధ్రువ మైనపదము గలుగుఁ
బంచజనులకు నిది సిద్ధభాషితంబు
సమధి కస్వార్థశుభకర్మ! శంబుశర్మ. 288

వ. అని చెప్పి గంత నివ్విమానంబు ధ్రువలోకంబు గడచి క్రమం బున మహాలోకజనోలోకతపోలోకంబు లతిక్రమించి సత్య లోకంబు గదిసె. అప్పు డవ్విష్ణుకింకరులు శివశర్మ కి ట్లనిరి.

శివశర్మ బ్రహ్మవిష్ణుమహేశ్వరలోకంబుల కేగుదెంచుట

క. ముందటిది సత్యలోకము
సందర్శింపుము త్రినేత్రశర్మ! ధరిత్రీ
బృందారక! యిది పరమా
నందస్థానంబు ద్రుహిణునకు నెల వగుటన్. 290

వ. అనుచు నతనిం బద్మగర్భసన్నిధికిం గొనిపోయి రప్పు డవ్విభుండును వారలం బ్రసాదబహుమానంబులం దనిపి ప్రసంగవశంబున నమ్మహాశ్మశానంబున మృతుండు గానివానికి ముక్తి సిద్ధింప దని సముచితప్రకారంబుగా వీడుకొలిపె.

శివశర్మయు నమ్మాటకు సంశయాకులుండగుచుఁ దదూర్ధ్వం
బుగాఁ జని చని పుణ్యశీలసుశీలురం జూచి మన కింక నెంత
ద వ్వరుగవలయు నెఱింగింపుఁడు. ఇప్పుడు పితామహుండు
కాశియందు శరీరంబు విడువనివారికి మోక్షంబు లే దనియె.
నాకు నిశ్శ్రేయసంప్రాప్తి యెట్లుగల్గు? అవ్విధంబును వివరింపుఁ
డనిన వార లి ట్లనిరి. 291

తే. ఉర్వి కెనిమిదికోటుల యోజనముల
పొడవునం దుండు నా బ్రహ్మభువన మనఘ!
యీ ప్రమాణంబునం దుండు నిందుమీఁద
విష్ణులోకంబు సతతవర్ధిష్ణు వగుచు. 292

వ. అవ్వైకుంఠంబునకు మీఁదఁ బదాఱుకోట్లయోజనంబుల
పొడవున శివలోకంబు కైలాసాహ్వయం బనం దనర్చు
దానికిం బరమం బగు లోకంబు లేదు. 293

తే. సంశితాచారపర! దాని సం స్తుతింప
నాక కా దచ్యుతునకైన నలినభవున
కైన శంభున కైనను నహివిభునకు
నైన గీష్పతికైనను నలవి గాదు. 294

వ. అప్పరమస్థానంబునందు నిందుధరుండు గిరినందనాసహాయుం
డై దణాధిస్కందనందికేశ్వరాదులుగొలువ నుదార విహా
రంబులం బ్రవర్తిల్లుచుండు. అవ్విశ్వేశ్వరుండువిశ్వరక్షణార్థం
బుగాఁ జతుర్భుజుఁ జతుర్దశభువనాధిపత్యంబునకుం బట్టాభి
షిక్తుం జేసి యనంతరంబ. 295

విష్ణుపట్టాభిషేకవర్ణనము

సీ. మండు వేసవినాఁటిమార్తాండబింబంబు
గోడగించుఁబసిండిగుబ్బతోడఁ
దోలుకారుక్రొమ్మెఱుంగులధాళధళ్యంబు
రవణించురత్నదండంబుతోడ
నచ్చువెన్నెలచాయ హెచ్చుగుం దాడెడు
వెలిపట్టుజగజంపువలువతోడఁ
గడలియం దేకోదకము వేళఁ బుట్టిన
పసడంపుఁదీఁగలపంజుతోడ
తే. వేనవేల్యోజనంబులవిరివి నొప్పు
లక్షకోటిశలాకికాలంకృతంబు
తారకాస్థూలమౌక్తికస్థాపితంబు
విష్ణునకుఁ బట్టె వెనకయ్య వెల్ల గొడుగు. 296
తే. పార్వతీదేవి కై సేసె బహువిధములఁ
బలుకుఁదొయ్యలి రత్నదర్పణము చూపె
శచి నివాళించె మణిదీపసంచయమున
శేషశయనునిపట్టాభిషేకవేళ. 297
సీ. చాముండి యొనరించు జంపెతాళమునకు
భృంగీశ్వరుం డాడె ప్రేంకణంబు
వెనుకదిక్కున నుండి కనకభూషలు మ్రోయ
సూర్యుండు శశియు వీచోపు లిడిరి
వెండికట్టులతోడ వేత్రదండము పూని
సందడి నెడఁ గల్గ జడిసె జముఁడు
గాలోచితంబుగాఁ గైవార మొనరించెఁ
బలుకుఁదొయ్యలి గద్యపద్యసరణి

తే. నఖిలలోకములకును బ్రహ్మాండములకు
నాధిపత్యంబు పూని సింహాసనమున
మునులచే వేలుపులచేత మ్రొక్కు గొనుచు
నచ్యుతుం డోలగంబున్న యవసరమున. 298

లయగ్రాహి. మ్రొక్కిరి గణేశ్వరులు మ్రొక్కె జలజాసనుఁడు
మ్రొక్కె మునిమండలము మ్రొక్కిరి దిగీశుల్
మ్రొక్కెను మరుద్గణము మ్రొక్కె గరుడవ్రజము
మ్రొక్కెదనుజావళియు మ్రొక్కి రురగేంద్రుల్
మ్రొక్కె నిగమప్రతతి మ్రొక్కె మనుయూథములు
మ్రొక్కె నితిహాసములు మ్రొక్కె నచలంబుల్
మ్రొక్కెఁ దటినీకులము మ్రొక్కెఁ జతురంబుధులు
నక్కమలనేత్రునకు నక్కజపుభక్తిన్. 299

వ. ఇవ్విధంబునఁ జతుర్భుజుఁ డిర్భరస్నేహంబున భూర్భువస్స్వ ర్భువనంబులసామ్రాజ్యభారభరణంబునకుం బట్టాభిషేకంబు సేసి ఫాలలోచనుండు ప్రావృషేణ్యపయోధరధ్వానగంభీరం బగునెలుంగున స్వయంభూజంభారిప్రముఖులగు బర్హిర్ముఖు లాకర్ణింప, విష్ణుండ యే ననియును, నేన విష్ణుం డనియును, నాకు విష్ణునకు భేదంబు లే దనియును, హరి మంగళాయ తనం బనియును, విష్వక్సేనుండు మాననీయుం డనియును, నారాయణుండు జగద్రక్షాపరాయణుం డనియును, నచ్యు తుం డనాదినిధనుం డనియును, నరవిందలోచనుం డాది పురుషుం డనియును, హరి సర్వపాపహరుం డనియును, నానతిచ్చి తనయిచ్చ నెచ్చోటి కేనియు విచ్చేసె. ఈయా ఖ్యానంబును చతుర్భుజాభిషేకం బండ్రు. దీనింబఠియించినను,

వినినను, వ్రాసినను నరుల కాయురారోగ్యైశ్వర్యాభివృద్ధులు సంభవించు. శివశర్మ! నీ వీరహస్యధర్మమర్మం బెఱింగి హరిహరత్వంబులయందు భేదంబుసేయ కుండుమని చెప్పిరి. అంత నవ్విమానంబు విష్ణులోకంబు గదియుటయు నాతనిం జూచి, యిది వైకుంఠలోకంబు. ఇందు లక్ష్మీసహాయుండై వైకుంఠుం డుండు. నీ విందుఁ బరమానందంబున శతానంద పరివత్సరపర్యంతంబు వసియింపుము. ఇటమీఁద వృత్తాంతంబు చెప్పెదము. పుణ్యతీర్థోపాంతమరణంబుననైన ఫలంబునను, భూతసుకృతశేషంబునను, భూమండలంబునకు డిగ్గి నందివర్ధన నగరంబున వృద్ధకాలుం డనుపేరిరాజ వై పెద్దకాలంబు రాజ్యంబు సేయంగలవు. నీరాజ్యంబునందు. 300

క. కురియు నెలమూఁడువానలు
సురభులు చన్నవిసి పితుకు సుకృతము జరుగుఁ
ధరఁ గొండ్ర వేలు పండును
బరఁగుం బురుషాయుషంబు ప్రజలకు నెల్లన్. 30

వ. ఇవ్విధంబునఁ బెద్దకాలంబు రాజ్యంబు నేసి సుతవిన్యస్తరాజ్యభారుండ వై కాశి కరిగి యయోధ్యావంతీమధురామాయాద్వారావతీకాంచ్యుజ్జయినీతీర్థసేవాఫలంబున విశ్వనాథుప్రసాదంబున నపవర్గంబుఁ గాంచెద వని పలికి విష్ణుకింకరులతని దివ్యవిమానంబువలన డించి నారాయణదేవు సమ్ముఖంబునం బెట్టిరి. అప్పుణ్యశ్లోకుండును విష్ణులోకంబునం బెద్దకాలంబు సుఖం బనుభవించి పుణ్యశీలసుశీలురు చెప్పిన ప్రకారంబున మోక్షంబు నడసె నని లోపాముద్రకుఁ గుంభసంభవుండు శ్రీశైలకటకంబునందు సకలతీర్థంబులుం

గాశీప్రాపణద్వారంబున నానాసదుపకారంబులై మోక్షంబు సిద్ధించు, కాశి యవ్యవధానంబున ముక్తినిచ్చు ననునర్థంబుఁ దేటపఱిచె. ఇది శివశక్తినిర్వాణం బను నుపాఖ్యానంబు. దీని విన్నను బఠియించినను వ్రాసినను నరుల కాయు రారోగ్యైశ్వర్యములు సంభవించు నని చెప్పి. 302

ఉ. చేసెఁ బ్రదక్షిణంబు కలశీసుతుఁ డద్రికి మల్లికార్జునా
వాసశిఖాంతరంబునకు వామవిలోచనతోడఁ గూడ విశ్వా
సముభక్తియుక్హితముశాంతియుదాంతియునొప్పనంతరా
ధ్యాసితశంభులింగసముదాయము వారక సంభజించుచున్.

వ. చేసి కతిపయప్రయాణంబుల. 304

అగస్త్యుండు కుమారస్వామిని దర్శించుట

లయగ్రాహి. సామిమలకుం జని మహాముని ఘటోద్భవుఁడు
భామయును దాను గడునేమమునఁ బుణ్యా
రామతరువాటి మణిధామమున నున్న యభి
రామసుకుమారతరహేమనిభగాత్రుక్
సామజముఖానుజు సుధామధురమందహాసి
తామలకపోలవదనామృతమయూఖుక్
హైమవతిపట్టి నఖిలామరశరణ్యు నత
కామితకరుక్ గొమరసామి భజియించెన్. 305

వ. అనిన విని నైమిశారణ్యవాసులు కుమారస్వామి దర్శించిన యటమీఁది వృత్తాంతం బెయ్యది? యని యడిగిన. 306

ఆ శ్వా సాం త ము

శా. వేమక్షోణివరానుసంభవ! దిశావేదండగండస్థలీ
సీమాపిచ్ఛిలదానగంధలహరీశ్లేషానుభూతిక్రియా

సాముగ్రీపటుకీర్తివైభవ! శుభ్రచ్ఛార్దూల! సౌభాగ్యరే
ఖామత్స్యధ్వజ! మత్స్యవంశనృపరత్నాకేలిపద్మేక్షణా! 307

క. అరిరాడ్గజకంఠీరవ
బిరుదాలంకారపృథులభీషణబాహా
కరవాలనిశితధారా
పరిఖండితదుర్మదాంధపరిపంథినృపా! 308

ఉత్సాహ. అసమబాణనిభవిలాస! యాజిగాండివాయుధా
బసవశంకరా! విశుద్ధపంటవంశవర్ధనా!
కసిమికోట మేకరాయి కప్పకొండ కిల్లెడా!
వ్యసుహృద్వనిపాంతరంగహాలహలవిషానలా! 309

గద్య. ఇది శ్రీమత్కమలనాభపౌత్త్ర మారయామాత్యపుత్త్ర సుకవిజనవిధేయ కవిసార్వభౌమ శ్రీనాథనామధేయ ప్రణీతంబైన కాశీఖండం బను మహాప్రబంధంబునందుఁ జతుర్థాశ్వాసము.

శ్రీ ర స్తు

పంచమాశ్వాసము

శ్రీమార్కండేయయశః
స్వామికృపాలబ్ధధరణిసామ్రాజ్యరమా
హేమాద్రిదానదీక్షిత !
వేమాంబాప్రియకుమార ! వీరనృపాలా !

కుమారాగస్త్యసంవాదము

వ. అక్కథకుండు శౌనకాదిమహామునుల కిట్లనియె. కుమార
స్వామి పత్నీసహితుండైన మహాముని నగస్త్యు నాదరించి
కుశలం బడిగి కూర్చుండ నియమించి వచ్చిన ప్రయోజ
నంబుఁ దెలిసి వారాణసీమాహాత్మ్యంబు వినిపించువాఁడై
యక్కుంభసంభవుని కి ట్లనియె. 2

తే. ఆఱుముఖములు గలవాఁడ నౌదుఁ గాని
నిగమశాస్త్రార్థములు గాన నేర్తుఁ గాని
యధికవైదగ్ధ్యవంతుండ నగుదుఁ గాని
కడఁగి వర్ణింప నోప శ్రీకాశిమహిమ. 3

వ. అయినను విను. నానేర్చుభంగిఁ గాశికామాహాత్మ్యంబు వినిపిం
చెద. అడుగవలసినయర్థంబు లడుగుము. కొల్లాపురము మహా
లక్ష్మి పుత్త్రేర నేతదర్థంబు నీవు వచ్చుట యెఱుంగుదు నని

పలికినఁ గుంభసంభవుండు కుమారస్వామిపాదాంభోరుహంబుల కెరఁగి యిట్లనియె. మహాత్మా! యవిముక్తంబు మోక్షస్థానం బనియును, మణికర్ణికాతీర్థంబు తీర్థరాజం బనియును, అప్పుణ్యక్షేత్రం బవిముక్తం బానందకాననంబు మహాశ్మశానంబు రుద్రావాసంబు వారణాసి కాశి యను నామధేయంబులు ధరియించు ననియునుం జెప్పుదురు. అన్నియుం బరిపాటి విన వలతుం దేటపడ నానతిమ్ము. 4

తే. అనినఁ బర్వతరాజకన్యాసుతుండు
కలశసూతికి ని ట్లను గారవమున
నిల్వలారి! భవత్సముదీరిత మగు
ప్రశ్నభావంబు విస్తరింపంగ భరము. 5

వ. ఈయర్థంబు మాతల్లి పార్వతీదేవి మజ్జనకు హరు నడిగె. ఆసర్వజ్ఞుండు నాజగన్మాతకు నానతిచ్చిన ప్రకారంబు నీకుం జెప్పెద; సావధానమతి వై యాకర్ణింపుము. 6

వారాణస్యాదినామనిర్వచనము

సీ. అంబుజాసనునాయురవసానములయందు
గ్రస్తసమస్తలోక ప్రపంచ
మై మాయ నిర్వికల్పాకారమునఁ దను
నాశ్రయింపఁగఁ బరమాత్మ యుండె
నిస్తరంగసముద్రనిభ మై నిరస్తస
మస్తావధిక మయి ప్రాణికర్మ
పరిపాకకాలంబు ప్రాప్త మయ్యెడునంత
దాఁక నవ్వేళ విధాతృసృష్టి

తే. గగన మొక్కండ చిక్కంగఁ గ్రాఁగిపోవ
నంధకారంబు నీరంధ్ర మగుచుఁ బ్రబలె
సత్తును నసత్తు సదసత్తు రిత్త యయ్యె
నెఱుక పడదయ్యె నేమియు నేమి సెప్ప? 7

వ. అనర్కచంద్రగ్రహతారకానక్షత్రం బనహోరాత్రం బనగ్ని భూసలిలమారుతం బప్రధానంబ శబ్దస్పర్శం బగంధంబ రూపం బదిఙ్ముఖం బై భువనప్రపంచం బంధకారావశేషం బై యుండ బ్రహ్మాండంబు నిష్ప్రపంచకం బై కేవలత్వంబు భజియింప, ననామరూపవర్ణంబు నస్థూలంబు నకృశంబు నహ్రస్వంబు నదీర్ఘంబు నలఘువు నగురువు ననపచయంబు ననుపచయంబు నవాఙ్మానసగోచరంబు సత్యజ్ఞానానందరూపంబు నప్రమేయంబు ననాధారంబు నిర్వికారంబు నిర్గుణంబు నిర్వికల్పంబు నిరాలంబంబు నిర్మాయంబు నిరుపద్రవంబు నై పరబ్రహ్మంబు నిరుద్యోగియై తూష్ణీంభావంబు గైకొని నిష్కళంకం బై విహరించుచు లీలాకైవల్యంబున లోకమర్యాద యాచరించి నిజశరీరంబున నొక్కశక్తిం గల్పించె. ఆశక్తి ప్రకృతిరూపంబ యగు నీ వాపరబ్రహ్మంబ. పురుషరూపుం డైన యేను కల్యాణి! నాటికాలంబునందు. 8

తే. ఉండఁ బ్రోవెచ్చుటను లేక యుత్పలాక్షి!
మనము చేరితి మవిముక్తమండలంబు
నాఁడు మొదలుగ నిపుడు గన్నార మందుఁ
గాశికాపురశుభసంజ్ఞకంబునందు. 9

సీ. అనిశంబు మనచేత నవిముక్త మై యున్కి
ముగ్ధాక్షి! యిది యవిముక్త మయ్యె

మనకు నానందంబు నొనరించుఁ గావున
నానందవిపినాభిధాన మయ్యె
సంవసింతు మహాశ్మశానభూములఁ గాన
నే నుంటను మహాశ్మశాన మయ్యె
నోరంత ప్రొద్దును నుందు రుద్రుండ నే
నటుగాన రుద్రగేహాఖ్య మయ్యె
తే. నసియు వరణయుఁ గూడుటనక్షరముల
సరవితో వారణాసి యన్ సంజ్ఞ యయ్యెఁ
గాశ్యదీప్తా' వనంగ విఖ్యాత మైన
ధాతువునఁ గాశి యయ్యె భూతలమునందు. 10
శా. నక్షత్రగ్రహతారకంబులు నరణ్యంబుల్ నదు లాబ్ధి వి
శ్వక్షోణీధ్రములున్ దిశల్ వసుమతీచక్రంబు కాలంబుచేఁ
బ్రక్షీణత్వముఁబొందియున్న యెడవిభ్రాంతిన్ సుఖంబుండఁగా
శీక్షేత్రం బిది యంబుజాక్షి! మనకున్ సిద్ధించె నెక్కాలమున్.
తే. †[ఈరహస్యంబు చెప్పకు మెవ్వరికిని
శంభుభక్తున కత్యంతశాంతిమతికి
శ్రద్ధధానున కధికవిశ్వాసమతికి
ననఘమానసునకు ముముక్షునకుఁ దక్క.] 12
వ. అని భవుండు భవాని కానతిచ్చె. మణికర్ణికామాహా
త్మ్యంబు వినుము. 13

మణికర్ణికామాహాత్మ్యము

ఉ. నిండుమనంబుతోడ ధరణీధరకన్యయుఁ దాను గాశిఁ గాఁ

†[] కుండలీకృతభాగ మొకమాతృకలో మాత్రము లేదు. పెక్కుమాతృకలం దున్నను నధికపాఠముగా గ్రహింపఁబడియున్నది.

వుండి కుటుంబభారము మహోన్నతిఁబొందుటఁ జూచివిశ్వనా
థుం డొకనాఁడు శైలసుతతోడ విచారము చేసె దక్షుఁ డొ
క్కండుహితుండు భారకుఁడు గావలదామనయింతయింటికిఁ]

తే. అని విచారంబు చేసి కాలాంతకుండు
చూచె నరకంట గిరిరాజసుతముఖంబు
ప్రభవమందె నాచూపునఁ బ్రావృషేణ్య
ముదిరనీలాంగుఁ డగునొక్క ముద్దుకొడుకు. 15

వ. అబ్బాలునిం జూచి బాలేందుధరుండు. 16

సీ. పుండరీకేక్షణా! పురుషోత్తమాహ్వాయ!
శిఖిపింఛసంఛన్నచికురభార!
యాజానుదీర్ఘబాహార్గళద్వయయుగ్మ!
హరినీలసింహసంహననకాంతి!
గంభీరనతనాభికాసారభవపద్మ!
శ్యామపిశంగవాసగకిరీట!
శంఖచక్రగదాసిశార్ఙ్గదివ్యాయుధ!
కందర్పకోటిరేఖావిలాస!

తే. కాశికాపట్టణమునైదుక్రోశములును
పటుతరక్షేత్ర మిది రాజ్యపదవి నాకుఁ
బరమపుణ్యాత్మ! యీకుటుంబము భరింపు
తత్పరత మీఱ భారకత్వంబుఁ బూని. 17

వ. అని పల్కి మహేశ్వరుండు బుద్ధితత్త్వస్వరూపి యగు
విష్వక్సేనుం గాశికాపురిసామ్రాజ్యభారంబు భరియింప
నియోగించె నజ్జనార్దనుండును. 18

తే. చక్రమునఁ ద్రవ్వి యొక్కపుష్కరిణి సేసి
ఖననవేళాప్రయాససంజనిత మైన
ఘర్మజలమునఁ బూరించెఁ గైటభారి
యమ్మహాపల్వలంబుఁ గాశ్యంతరమున. 19

క. వేయును నెనిమిదియేడులు
తోయజలోచనుఁడు చేసె దుస్సహతప మ
త్తోయాధారముదరిఁ గా
త్యాయన్యధిపతి గుఱించి యతులితభక్తిన్. 20

వ. అనంతరంబ. 21

శా. ఇందూత్తంసుఁడు కాశికాధిపతి విశ్వేశుండు ప్రత్యక్షమై
కందర్పారి ముకుందనిర్మితమహాకాసారముం జూచి యా
నందంబొందివృషధ్వజుండుబహుమానశ్లాఘఁగావించెఁ దా
మందాందోళితమౌళియై వడి శిరోమాల్యావలుల్ మ్రోయఁ
[గాఁ.

క. ఫణిభూషణుండు వాపీ
ప్రణుతిశ్లాఘాపరంపరల నొనరింపన్
ద్రిణయా[illegible]శ్రుతి
మణికర్ణిక మిట్టి సరసిమధ్యమునఁ బడెన్. 23

వ. పరమేశ్వరశ్రవణమణికర్ణికాప్రపతనస్థలం బగుటం జేసి య
చ్చక్రపుష్కరిమణికర్ణికాహ్వయం బై యుండు. 24

తే. చక్రపుష్కరిణీతీర్థసవిధభూమి
శంఖచక్రగదాపాణి శంభు నడిగెఁ
గాశికాతీర్థమాహాత్మ్యగౌరవంబు
శివుఁడు నాకతి యిచ్చె నక్షీణకరుణ. 25

కాశీతీర్థమాహాత్మ్యకథనము

వ. అది వివరించెద నాకర్ణింపుము. మణికర్ణికాతీర్థంబునందు సంధ్యాస్నానజపహోమవేదాధ్యయనంబులు వ్రతోత్సర్గంబులు వృషోత్సర్గంబులు లింగస్థాపనంబులును నక్షయమోక్షఫలంబు నొసంగు. భూతభావిభవత్తీర్థంబు లీతీర్థరాజంబుతో సరిగావు. సాంఖ్యయోగం బాత్మావలోకనంబు వ్రతతపోదానంబులు భవత్తీర్థస్నానంబునకు సమానంబులుగావు. శశమశకకీటపతంగోరగాదులు పంచక్రోశియందుఁ బంచత్వంబు నొంది నిర్వాణలక్ష్మిం గైకొను. కాశీక్షేత్రంబునం దెప్పుడుఁ గృతయుగంబు. ఎప్పుడు నుత్తరాయణంబు. ఎప్పుడు మహోదయంబు. చతుర్వేదాధ్యయనపుణ్యంబు కాశిం బంచాహోరాత్రంబులు వసియించినవారికిం గలుగు. అశ్వమేధరాజసూయాధ్వరంబుల నుపార్జితము లైనఫలంబు(లు) కాశిం ద్విరాత్రశయనంబున సమకూఱు. తులాపురుషదానఫలంబు కాశిందర్శించినమాత్రంబునం గలుగు. రాజస్థానంబుననాయాజ్ఞ దక్క నితరులయాజ్ఞ చెల్లదు. యోజనశతదూరస్థుం డైన నరుండు కాశీస్మరణంబువలన దోషంబువలనం బాయు. పంచక్రోశప్రవేశసమయంబునం బంచజనునిపాపప్రపంచంబు బహిరంచలంబునన వసియించు. కాశిం బెద్దకాలంబుండి దైవయోగంబునం బరస్థలంబున కరిగి మృతుం డైన మనుజునకుఁ గాశీమరణఫలంబు సంభవించు. అవిముక్తక్షేత్రోపనాసంబు కర్మనిర్మూలనక్షమంబు. మణికర్ణికం గృతాభిషిక్తుం డై తిలవ్రీహియవంబుల బిత్రాదితర్పణం బొనర్చిననరుండు సర్వయజ్ఞంఫలంబునం బ్రాపించు. మణికర్ణికాస్నానానంతరంబున

మానంబున జితేంద్రియుండై విశ్వేశ్వరశ్రీమన్మహాదేవుని దర్శించు నెవ్వండేని వాఁడు సర్వవ్రతఫలంబులం జేకొను. స్నానదేవతార్చనాజపాదుల మూత్రమలవిసర్జనంబులసమయంబుల దంతధావనహోమకాలంబుల వాచంయముం డై విశ్వేశ్వరు నర్చించిననరుం డేకవాసరంబునన యావజ్జీవశివార్చనాఫలము నొందు. విశ్వేశ్వరప్రీణనార్థంబు కాశియందు నిధనంబు నొందుమానవుండు కైవల్యధనలాభంబు లంగీకరించు. నిష్పృహత్యాగం బైనయాగంబున యోగంబున నానాజన్మోపార్జితం బైనఫలంబు కాశియందుఁ దనుత్యాగంబు చేసినజనునకు సిద్ధించు. కాయంబు సాపాయం బనియును' బ్రసూతిమరణక్లేశంబులు దుస్సహంబు లనియును, వితర్కించు నరుఁడాయురవసానపర్యంతంబుఁ గాశిన యుండునది. 26

శా. అర్ణోరాశిపరీతభూభువనమర్త్యస్వర్గంఖండంబు సం
పూర్ణైశ్వర్యసమృద్ధి కాశిఁ గృతపాపుం డైనఁదత్పట్టణా,భ్య
ర్ణక్షోణులనై దుక్రోశములఁ బ్రాణాంతంబుఁగామ స్త్యుఁడా, క
ర్ణింపండు కృతాంతవాహమహిషగ్రైవేయఘుంటాధ్వనుల్.

వ. అని శంభుండు విశ్వంభరు నిరీక్షించి యింకొక్కవిశేషం బాకర్ణింపుము. భగీరథుం డనురాజన్యుండు కపిలముని ప్రదీప్తకోపానలదగ్ధు లగుసాగరుల నిరయంబువలన నుద్ధరించుటకై తపోవిశేషంబున మందాకినిం గొనితేర నమ్మహానది యిమ్మణికర్ణికమీఁదం బ్రవహింప నదిమొదలుగాన తీర్థంబు సురాసురులకు వర్ణింప నశక్యం బై విలసిల్లుచుండు. 28

సీ. భాగీరథీస్నానపరతఁ బోలంగ లే
దామ్నాయశాస్త్రాగమాధ్యయనము

వాఁగాయమును మనోవాక్కాయదురితాళి
విదళించు గంగాభివీక్షణంబు
శ్రీకంఠుకృప లేక సిద్ధింపనేరదు
త్రిదశగంగానదీతీరవసతి
బ్రహ్మవిజ్ఞానసంపత్ప్రాప్తిహేతువు
జహ్నుకన్యాసింధుసలిలసేవ

తే. కలియుగంబునఁ గలుషచిత్తులకు శఠుల
కన్యవిత్తాపహర్తల కనియతులకు
నాత్మ ఘుందుఁ బ్రాయశ్చిత్తమాచరింపఁ
గాంక్ష గలయప్డు నరునకు గంగ దిక్కు. 29

తే. ఆదియుగమునఁ దీర్థంబు లఖిలములును
ద్రేత ద్వాపరమునయందుఁ దివ్యమునకుఁ
బుష్కరంబుఁ గురుక్షేత్రము సుపర్వ
నిమ్నగయుఁ దీర్థములు బ్రహ్మనిర్మితములు. 30

తే. కృతయుగంబున ధ్యానంబు కేవలంబు
తపము త్రేతాయుగంబున ద్వాపరమున
నధ్వరంబులు గలివేళయందు గంగ
జనుల కిష్టార్థసంసిద్ధిసాధనములు. 31

శా. స్వారాజావరజాత! సార మగు ప్రాగ్జన్మాంతరాభ్యాససం
స్కారంబున్ మదనుగ్రహంబు వెలిగా స్నానంబు సిద్ధించునే?
వారాణస్యుపకంఠదేశవిలుఠద్వార్వేణివీచీఘటా
ధీరధ్యానపరంపరాకలకలోద్విగ్నాఘభాగీరథిన్. 32

క. ఆకంఠకరటిదుంఠి
శ్రీకంఠజగండమదమషీచంద్రకితా

నేక ప్రవాహజాహ్నవి
వై కుంఠా! యద్ది యెట్టివారికిఁ గలదే! 33

క. గంగానది గంగానది
గంగానది యనుచు తేపకడ మేల్కనుచో
గంగఁ గొనియాడు నెవ్వఁడు
భంగించు నతండు ఘోరపాతకచయముల్. 34

ఉ. పాయునలక్ష్మివాయునశుభంబులువాయునుదుర్నిమిత్తముల్
వాయునకీర్తివాయుఁ బ్రతిబంధము వాయుమహాఘసంఘము
ల్డాయుశుభంబు డాయుఁ గుశలంబులుడాయు మనోరథార్థ
ముల్, పాయక కాశికట్టెదురఁ బాలువియన్నదిఁ దీర్థమా [డినన్.

క. ఏలా యుపవాసవ్రత?
మేలా యష్టాంగయోగ? మేలా యజ్ఞం?
బేలా తపంబు గంగా
కూలంకషఁ దీర్థ మాడఁ గూడెనె యేనిన్. 36

క. శ్రద్ధాపురస్సరంబుగ
సిద్ధస్రోతోవహాంబుశీర్ణాప్లవసం
బద్ధహృదయు లగువారికి
సిద్ధించును మోక్షలక్ష్మి చేరువన హరి! 37

ఉ. వానికులంబునుం గులమె? వానితపంబులునుం దపంబులే?
వానికృతంబునుంగృతమె? వానిశ్రుతంబుశ్రుతంబె?కృష్ణ!యె
వ్వానిమనంబు పక్వమయి వ్రాలకయుండును విశ్వనాయకా
స్థానమహాశ్మశానదివిషత్తటినీముఖతీర్థసేవకున్. 38

క. విస్మయ మేల? వియన్నది
యస్మత్తేజోగ్నిగర్భ, యటు గాకున్నన్

భస్మము సేయునె కైటభ
ఘస్మర! నిమిషమున సకలకలికలుషములన్? 39

చ. నడచుచుఁ గూర్చుండుచును నవ్వుచునిల్చుచుఁ బారియాడు
చున్, గుడుచుచుఁ బవ్వళించుచును గూర్కుచు మేల్కనుచున్
రమించుచున్, బడుచును లేచుచున్నరుఁడు భావమునందవి
ముక్తసీమసం,గడఁ బ్రవహించు శ్రీగగనగంగఁదలంచి త్యజిం
చుఁ బాపముల్. 40

క. జిహ్మగవిరోధివాహన!
జిహ్మమతుల్ దెలియువారె? చిరకాలమునన్
బ్రహ్మాండమునడుమఁ బర
బ్రహ్మమయపయఃప్రపూరభరసురతటినిన్. 41

క. అంగీకరించు మనుజుఁడు
సాంగోపాంగాధ్వరక్రియాఫలము వియ
ద్గంగాపులినంబున శివ
లింగార్చన మాచరించి లెస్సగ శౌరి. 42

ఉ. రోదన మాచరించు పగఁ గ్రోధమనోభవరాగరోగమో
హాదులఁ గూడి తీరములయం దఘముల్ దలఁబట్టు పట్టనే
డాదిగ దీనఁ బాయఁబడెనా! మన కంచును గాశికాసమ
ర్యాదమునస్వియత్తటినినాడఁగమర్త్యుఁడుగట్టుడిగ్గుచోన్.

తే. గంగ కరుగంగఁ మిగుల విఘ్నములు సేయుఁ
బ్రేతరక్షఃపిశాచికాభూతతతులు
గంగ డాసినపిదప విఘ్నములు సేయ
వాసవుఁడు లేఁడు నరునకు వానితరమె? 44

మ. అనుషంగంబున నొందె నొందెను విహారాపేక్ష నొందేనిఘ,

ర్మనిరాసంబున నొందెఁ దీవ్రభయసంత్రాసార్థ మొందేనిన,
న్యనియోగంబున నెవ్వఁడే మునుఁగు గంగాంభగప్రవా
హంబుల్, జనుఁ డాతండును బుండరీకనయనా! శాసించుఁ
బాపౌఘముల్. 45

తే. ఇచ్ఛ లేకుండినను నగ్ని యెట్లు గాల్చుఁ
దన్ను నంటినవారి నిదాహశక్తి
నిచ్ఛ లేక క్రుంకినను దహించు నట్ల
తైర్థికునిఁ బొందియున్న పాతకము గంగ. 46

క. కంసాంతక! నరుఁ డంతకు
సంసారక్లేశముల విషాదము నొందుల్
సంసేవించుం గాశ్యవ
తంసాభరణంబు గంగఁదా నెపు డేనిన్. 47

చ. తెరలక కాశికానగరి దేవతరంగిణిఁ దీర్థమాటకై
యరుగుచు నెవ్వఁ డేని మృతుఁడౌ భవితవ్యథకారణంబుగాఁ
దెరువున నామనుష్యుఁడును దీర్థఫలంబఖిలంబుఁగాంచియుం
బురుహదళాక్ష! పాపములఁ బోకడవెట్టుఁబురార్జితంబులన్.

సీ. అరుణాంశుమండలం బంధకారముఁ బోలె
దంభోళి వసుమతీధ్రములఁ బోలె
ఖగసార్వభౌముండు కాద్రవేయులఁ బోలెఁ
గంఠీరవము భద్రకరులఁ బోలె
దివ్యౌషధంబు వ్యాధినికాయములఁ బోలె
మండువేసవి యెండమడువుఁ బోలె
జంఝూసమీరంబు జలధరంబులఁ బోలె
మానదంభంబు ధర్మంబుఁ బోలె

తే. భక్తి సేవించువారిపాపము లడంచు
దురితతరుషండశతఖండపరశుధార
మదనవైరిజటాటవీమల్లికళిక
యభ్రరోధిపయోభంగ యమరగంగ. 49

క. యావజ్జీవము గంగా
ప్లావం బొనరించునరుఁడు పంకజనయనా!
జీవన్ముక్తుఁడు త్రిజగ
త్పావనుఁ డని చెప్పుదురు తపస్విప్రవరుల్. 50

తే. వలదు తిథివారనక్షత్రవర్గణంబు
తీరసంవాసజనులకు వారిజాక్ష!
సంచితము లైననిఖిలదోషములు వాయు
నాకవాహిని నేకాభిషేకమునను. 51

సీ. వలుదచన్నులమీఁదియులుపచ్చిగందంబు
కమ్మతావులు దిఙ్ముఖములఁ బొగవ
శశికాంతమణిశిలాశకలపాండుర మైన
మెయిచాయ చంద్రికామృతముఁ గురియ
జలదేవతాహస్తచామరానిలములు
కుటిలాలకములకు గొండ్లిఁ బరవ
ధవళాతపత్త్రముక్తాదామకంబులు
గురుసువర్ణకిరీటకోటి నొరయఁ

తే. బూర్ణకుంభంబుతో సితాంబుజముతోడ
దరముతోడ నభీతితోఁ గరము లలర
నదనదీపల్వలంబులు గదిసి కొల్వఁ
గాశిఁ బేరోలగం బుండు గగనగంగ. 52

క. మండూకమకరకచ్ఛప
గండూపదఘులికుళీరకలహంసికకా
రండవబకముల వెండిఁ బ
సిండిని గావించి గంగఁ జిరుముదురు వ్రతుల్. 53

వ. అని యిందుధరుండు ముకుందున కానతి యిచ్చె. గంగయు పూర్వోక్తప్రకారంబునన యపుగుదెంచి కాశీస్థానంబున కపూర్వాలంకరణం బయ్యె. ఇంకఁ గుంభినీధరపుత్త్రికి నద్దేవు డాన తిచ్చినప్రకారంబునం గాశీమాహాత్మ్యంబుఁ జెప్పెద. కుంభసంభవ! అవధానపరుండవై యాకర్ణింపుము. 54

తే. పరిహరించును వేదాంతభాగ మన్న
నుపనిషత్తన్న వీనుల నోకలించుఁ
గంటగించును సాంఖ్యయోగంబు లన్నఁ
గాశి నున్నజనుండు మోక్షమునఁ దనిసి. 55

క. దేహత్యాగము దానము
దేహనిపాతంబు దపము ధృతిఁ బరికింపఁగ
దేహవియోగమ యోగం
బాహా! కాశీపురీకృతావాసులకున్. 56

తే. విశ్వనాథుండుఁ దేహాళి విఘ్నరాజు
గవని మొగసాల నధికారి గా నొనర్చి
గాశిఁ జొరనీఁడు తనముద్ర గానియొరుని
ముక్తినిధి నెవ్వఁ డొడుచునో మోస మనుచు. 57

క. వరణ నసి రెండుదిక్కులఁ
దరుణేందుధరుండు నిలిపెఁ దలవరులం గాఁ

బరు నెవ్వనిఁ దా నెఱుఁగక
చోరసీకం డనుచు ముక్తిచోరవిశంకన్. 58

వ. ఈశ్వరాదేశంబునంగాని కాశీనగరం బెవ్వరికిం జొరరాదు. ఈయర్థంబు దేటపడ నొక్కయితిహాసంబు గల దాకర్ణింపుము. దక్షిణాబ్ధితటంబున సేతుబంధసమీపంబున నొక్కగ్రామంబున ధనంజయుండనునొక్కవైశ్యోత్తముండుగలండు. అతండు మాతృభక్తుండు. తల్లి జరాభారంబునం బెద్దకాలంబునకుఁ గాలధర్మంబు నొందిన. 59

తే. గాసిపడి గంగ నస్థులు గలపకున్నఁ
దల్లిబుణ మెట్లు వాయుఁ బుత్రకున కనుచుఁ
గదలెఁ గోమటి యానందకాననమున
కంబదేహాస్థిశకలసంహతులు పూని. 60

సీ. పంచగవ్యముల నాప్లవనంబు గావించి
పంచామృతముల నభ్యంగ మార్చి
యక్షకర్దమమున ననులేప మొనరించి
పుష్పమాల్యంబులఁ బూజ నేసి
పట్టువస్త్రంబునఁ బరివేష్ట మొనరించి
యామూటఁ దిత్తిలో నదిమి తుఱిమి
పుటవిగాఁ గంబళంబున ధృవంబుగఁ గట్టి
ముద్దగా మన్నద్ది ముద్ర వెట్టి

తే. జతనముగ రాగిపెట్టెలో సంగ్రహించి
యరవఁ దాలంబు నీని చిక్కులపరించి
యంబయస్థుల కుపచార మాచరించె
నొడయనికిఁ బోలె గురుభక్తుఁ డూరుభవుఁడు. 61

వ. ఆయస్థిపేటికయు లోహిండియుఁ దండులంబులుఁ గంబళం
బులుం దగినసంబడంబును వహించి యొక్కరుండునుం దెరు
వుతోడునం బెక్కుదేశంబులు గడచి హవిష్యాశనుండును,
స్థండిలశయనుండును నైషధపరిశ్రాంతి నభిఘాతజ్వరంబుసోఁకిన
లెక్కసేయక తఱిమి నడచి మార్గమధ్యంబున నొక్కవేఁట
పల్లె నొక్కయాటవికునికిఁ భృతి యిచ్చి మూఁటమోపించు
కొని యెట్టకేలకుం గాశీపట్టణంబు చేరి. 62

క. ఆనందవనమునం దొక
వానెవణిజునింట నుండి వైశ్యుండు పదా
ర్థానయనార్థము వోయెం
దా నొక్కఁడు హట్టమునకుఁ దదవసరమునన్. 63

వ. మూటలోఁ దామ్రసంపుటకంబున ధనం బున్నయది యని
చెంచు వంచనాపరుం డై బొక్కసం బెత్తుకొని తప్పుతెరు
వునందన(గాఁ) పల్లెకుం బోయె. ఇటఁ గోమటియును. 64

ఉ. అంగడినుండి బియ్యము పదార్థములుం గొని వచ్చి దప్పిమై
నంగము దూల నుస్సూసుచు నల్లన కోమటిసెట్టి మందిర
ప్రాంగణసీమవేదిపయిఁ బందిరినీడను విశ్రమించి పి
ల్చెంగటముం బ్రసేవమును జెచ్చెరఁ దెమ్మనెబంటుల్మెచ్చునిన్.

క. విలిచి ప్రతివచన మొదవమిఁ
గళవళమున నిల్లు సొచ్చి కాననచరు న
న్నెలవునఁ గానక వైశ్యుఁడు
నలుమూలలు వెదకి నెమ్మనము దలఁ కొందన్. 66

తే. అస్థిగర్భితతామ్ర పేట్యన్వితమగు
బొక్కసము నెత్తికొని పోయె బోయ యనుచు

జననిఁ దలఁచి ప్రయాసంబు సంస్మరించి
మోసఁ దర్కించి యవైశ్వర్యముఖ్యుఁ డుండ. 67

సీ. మధ్యాహ్నకాలంబు మందాకినీవారి
నభిషేక మొనరింప నబ్బ దయ్యె
శివుని విశ్వేశ్వర శ్రీమన్మహాదేవు
మదనారి వీక్షింప నోదవ దయ్యె
దండపాణిని ఢుంఠి దక్షిణామూర్తిని
గాలభైరవుఁ గొల్వఁ గలుగ దయ్యె
శ్రీవిశాలాక్షికిఁ జేదోయి మొగిడించి
శిరసుపైఁ జేర్పంగ దొరక దయ్యెఁ

తే. గోమటికిఁ దల్లియస్థులకోకమూట
పాపకర్ముండు చెం చస్థభార మనుచు
వంచనాపాటవంబునఁ గొంచుఁ బోయి
యారివేసంబు చేసినకారణమున. 68

శా. జాలింబొందియు డప్పిఁజెందియు బుభుక్షావేదనంగుందియుఙ్
వ్యాళాభీలకరాళతీవ్రతరమధ్యాహ్నార్కరోచిశ్ఛటఙ్
జాలం గుందియునుం గిరాటుఁ డరిగెఙ్ సంరంభశుంభద్గతిఙ్
వైలక్ష్యంబునఁ జెంచువెంట జననీవాత్సల్యనిఘ్నాత్మతన్.

వ. అంతక మున్న (యొక్క) కాంతారంబున నమ్మూట విడిచి యాయాటవికుండు పెట్టెఁ దెఱచి యస్థిశకలంబులు చూచి తనవృథావస్థకుఁ జిన్నఁబోయి యవి యవ్వోచ్చటన పారఁ జల్లి తన పల్లెకుం బోయి మఱుఁగుపడి యుండె. ధనంజయుం డును నప్పక్కణంబునకే తెంచి. 70

తే. చెంచునింటికిఁ బోయి చెంచెతకుఁ బ్రియము
చెప్పి నమ్మించి తలమీఁదఁ జెయ్యి వెట్టి
వెఱకు మని తన్ముఖంబున నెఱుకుతేనిఁ
గాంచి యాతనితోడ సఖ్యంబు చేసి. 71

వ. అతఁడును దానునుం గూడి యయ్యస్థిశకలంబులు పారం
జల్లిన కాంతారప్రదేశంబున కేతెంచి నప్పుడు. 72

తే. ఎమ్ముకలు చల్లినట్టిచో టెఱుఁగఁ డయ్యె
దైవవశమున నాభిల్లతస్కరుండు
దిగ్భ్రమం బెత్తి యందంద తిరుగుచుండెఁ
గానలోపల నెచ్చోటుఁ గానలేక. 73

క. వచ్చినయడవిక వచ్చుం
జొచ్చినకాననము చొచ్చుఁ జోరపులిందుం
డెచ్చో నస్థులు గానక
యచ్చెరుపడె దైవమతము లవి యల్పములే ? 74

వ. అయ్యస్థులు చల్లినచోటు దప్ప నడచుకొని కిరాతుండు
బహుళ క్షుత్పిపాసాపరవశుం డయి హాహాకారంబు సేయు
చుం గ్రమ్మఱం గాశీపురంబున కరిగి తన మందభాగ్యత్వంబు
ప్రకటించుచు మందాకినీస్నానంబు చేసి మఱలి నిజస్థానంబు
నకుం బోయెం గావున. 75

తే. అనఘచారిత్ర! విశ్వేశ్వరాజ్ఞఁ గాని
రాదు వారాణసీనగరంబుఁ జొరఁగ
బలిమిఁ జొచ్చిన యేని నప్పంచజనుఁడు
పడనిపాటులఁ బడు విఘ్నపంక్తిచేత. 76

జనియె. నిటవైశ్యుండును అస్థియుం గిరాతునింగానక అగ్గిదాఁక.

వ. అనుటయు నాకుమారస్వామికిఁ గుంభసంభవుం డిట్లనియె. 77

తే. కార్తికేయ! కృపాలబ్ధి గలుగ నేని
శ్రవణయోగ్యుండ నేను నవుదు నేని
నాన తీఁ దగు నానంద కాననమునఁ
బ్రతివసించిన క్రోధభైరవునిమహిమ. 78

వ. అనినం గుమారుండు మైత్రావరుణి కి ట్లనియె. 79

కాలభైరవచరిత్రము

క. వారాణసీకథాశ్రుతి
పారాయణుఁ డైనపుణ్యపరునకు నీకున్
నేరిచినభంగిఁ జెప్పెద
భైరవచరితంబు వినుము పరమమునీంద్రా! 80

తే. హస్తములు రెంట నందంద యదిమి పట్టి
తాటిపం డారగించెడు తమకమునను
నవ్యయంబైన బ్రహ్మాండ మాస్వదించు
భైరవుం డిచ్చుఁ గాత శోభనము మనకు. 81

మ. క్షయకాలంబున సీధుసాగరరసాస్వాదాతిరేకంబునన్
నయనాబ్జంబులు ఘూర్ణితంబులుగ సంధ్యాకాలరాత్రీకర
ద్వయతాళానుగతిప్రకారమున మత్తల్లీ[౪]మహానృత్తముం [గ్
బ్రియమెుప్పారఁగ నాడుభైరవుఁడుగల్పించున స్మైశ్వర్యము

వ. అని తత్కథాకథనప్రవణహృదయంబున ని ట్లనియె. 83

క. హాటకవసుంధరాభృ
త్కూటస్థలియందుఁ దొల్లిఁ గొలువుండె నిరా
ఘాటవిభవాభిజృంభిత
హాటకగర్భుండు జగము లన్నియుఁ గొలువన్. 84

వ. అయ్యవసరంబునఁ దత్సభాసదు లగుమునీంద్రు లప్పరమేష్ఠికిం
బ్రణమిల్లి యి ట్లనిరి. 85

తే. వరద ? వాగ్వధూవల్లభ ! వనజగర్భ !
యడుగఁ గల దొక్కసంశయితార్థ మిప్పు
డవ్యయం బగుతత్త్వ మెయ్యదియొ తెలియ
నంతవట్టును బ్రీతి మా కానతిమ్ము. 86

వ. అనిన విని భారతీవల్లభుండు శ్రీమహాదేవమాయామోహ
వశంబునం [1] బరమాత్మవివేకంబు లేక వారలం జూచి జగద్యో
ని యగునే నొక్కరుండన యీశ్వరుండ. నాకధికుండు (నీశ్వ
రుండు) లేఁడు. మీ రివ్విధంబు దెలిసి యవ్యయతత్త్వంబు
నన్నకా భావింపుఁ డనియె. అయ్యహంకారంబు సహింపక
తత్సమీపంబున నున్న విశ్వంభరాంశసంభవుం డగుక్రతు
పురుషుండు నిటలభ్రూకుటిదుర్నిరీక్షుండుం గ్రోధతామ్రా
క్షుండు నగుచు నతని కి ట్లనియె. 87

క. పరతత్త్వ మెఱుఁగ కూరక
పరమర్షులతోడ నేన పరముఁడ ననుచుం
సుర లెల్లఁ గాకు చేయఁగ
దురహంకృతిఁ సేయఁ దగునె? తోయజగర్భా ! 88

వ. విను మేను సాక్షాన్నారాయణుండను, యజ్ఞపురుషుండ, జగ
త్ప్రభుండ, నవ్యయుండ. నవ్యయ(తత్త్వ)శబ్దవాచ్యత్వంబు
నాయంద సంప్రతిష్ఠితంబు. నీ విట వలవని పెద్దఱికంబున
నడిచి పడకుండు మనియె. ఇ ట్లిద్దఱుఁ బరస్పరజయార్థు

1 పరాత్మపరామర్శ; పరామర్శవివేకంబు.

లగుచు వాదడిచి యడిచి తమతారతమ్యం బామ్నాయం
బుల నడిగి రప్పుడు ఋగ్వేదం బిట్లనియె. 89

సీ. సవరించు నెవ్వఁడు జఠరగోళంబున
బొడ వడంగక యుండ భూతగణము
నెరయించు నెవ్వఁడు నిజసనాతనమాయ
సకల ప్రపంచంబు సంతతముగ
విహరించు నెవ్వండు వివిధోపనిషదర్థ
హర్మ్యాగ్రములయందు నహరహంబు
చరియించు నెవ్వఁడు శాశ్వతమంగళ
ప్రోద్దామరాజ్యకటి నొక్కరుండు

తే. సహహ! యయ్యాదిదేవుఁ డనామయుండు
రుద్రుఁ డవిచింత్యుఁ డాద్యుఁ డరూపుఁ డుండ
నవ్యయం బగుతత్త్వమే నన వశంబె
యన్యులకు నెట్టివానికి? సనఘులార! 90

వ. అనవుడు యజుర్వేదం బిట్లనియె. 91

సీ. సకలాధ్వరక్రియాసంచయంబులఁ జేసి
యిజ్యమానుం డగు నెవ్వఁ డలరు
నధ్యాత్మవిద్యారహస్యమార్గంబునఁ
దక్క నెవ్వఁడు గానఁ దరము గాఁడు
మాయఁందుఁ గరము ప్రామాణ్యవిశేషంబు
లెడపకుండఁగఁ జేయు నెవ్వఁ డెపుడు
ప్రకటకూటస్థస్వభావత నఖిలంబుఁ
గదల కెవ్వఁడు సమీక్షణ మొనర్చు

తే. నట్టిశివుఁ డొక్కరుండు గా కర్హుఁ డగునె
యవ్యయపుఁదత్త్వ మనుసమాహ్వయము దాల్ప ?
నితరుఁ డెంతటివాఁ డగు ? నేతదర్థ
మాత్మ సంశయింపకుఁడు ధన్యాత్ములార!. 92

వ. అనిన సామవేదం బి ట్లనియె. 93

సీ. విశ్వంబు నెవ్వనివిపులక్రియాశక్తిఁ
పెరుగుచున్నది తీఁగ పెంపు గాఁగ
జింతింతు రెవ్వనిఁ జిత్ప్రకాశాత్మకుఁ
బరమార్థవిదులు తాత్పర్య మొదవ
రవిసుధాకరశిఖిగ్రహముఖ్యముల కెల్ల
భాసకం బెవ్వనిభవ్యతేజ
మితరదుర్ధర మగునీశ్వరశబ్దంబు
వలచి యెవ్వనిఁ బాయ దలఘులీల

తే. నతఁడు మరణోద్భవవ్యవహారదూరుఁ
డజుఁడు ఫాలాక్షుఁ డిందురేఖావతంసుఁ
డవ్యయపుఁదత్త్వ మాఁగాక యల్పు లొరుల
కమ్మహత్త్వంబు గలుగునే? యనఘులార!. 94

వ. అనిన నథర్వవేదం బి ట్లనియె. 95

సీ. ఎవ్వాఁడు రవణిల్లు నెల్లజీవులయందు
బూసలలో నుండుబొందువోలె
నెవ్వనిఁ బొడగంద్రు హృత్పద్మవీథుల
భక్త్యనుగ్రహులగు భవ్యజనము
లెవ్వాఁడు వికసిల్లు నింతయుఁ దా నయ్యు
నేమియుఁ దాఁ గాక యేకహేలి

నెవ్వనిసద్భావ 'మిదమిత్థ' మని చెప్పఁ
జాలవు నేడును శాస్త్రఫణితు
తే. లతులకై వల్యమంగళాయతను డభవుఁ
డప్రతర్క్యుండు శంకరుఁ డప్రమేయుఁ
డతఁడ యవ్యయం బగుతత్త్వ మనఁ దనర్చు
మఱువుఁ డొండుతలంపు ధీమహితులార! 96

వ. అని యిట్లు చతుశ్శ్రుతు లుపన్యసించిన విని విరించిముఖ పురుషు లహహా! పరేతనిలయంబునఁ గాంతాపరవశుం డై యుండు ప్రమథనాథుం డెక్కడ? అవ్యయతత్త్వం బెక్కడ? పరబ్రహ్మభావం బతని కెట్లు సమకూఱు నింక మీమాటలు పొసంగ వనునవసరంబునఁ బ్రణవంబు మూర్తిమంతం బై వారి కి ట్లనియె. 97

క. శితికంఠుఁ డలఘులీలా
ధృతవిగ్రహుఁ డట్లు గానఁ దెల్లం బాత్మా
వ్యతిరిక్త యగుపరోజా
యతలోచనతోడఁ గూడఁ: డతఁ డెన్నండున్. 98

తే. అర్ధశశిభూషణుండు స్వయంప్రబుద్ధుఁ
డున్నతుండు నిత్యోన్నతజ్యోతి యతని
సంతతానందశక్తి యాపరసిజాక్షి
విశ్వజనయిత్రి వారికి వేఱు లేదు. 99

వ. అనియివ్విధంబున నెంత చెప్పిన విధాతృముఖమూర్తులం జుట్టుకొన్న యజ్ఞానతిమిరంబు దొలంగ దయ్యె. అప్పుడు దశదిశావకాశపరిపూర్ణం బగు నొక్కయఖండదివ్యతేజంబు వారలనడుమ నుద్భవించె. అనంతరంబ తన్మధ్యంబునందు.

సీ. కటిభాగమున గంధకరటి రాట్చర్మంబు
కపటంపుఁ జిమ్మచీఁకట్లు నీన
వక్షస్స్థలంబునఁ జక్షుశ్శ్రవణభర్తృ
తారహారము లేవఁ దళుకుసూపఁ
గేలుదామరయందు శూల ముద్భటనట
జ్వలనకీలముల వసంత మాడ
జూటకూటమునందుఁ సొబగులేఁజందురుఁ
డకఠోరసాంద్రచంద్రికలు గాయఁ
తే. గుటిలఘుర్ఘురనిర్ఘాతఘోరఘోష
సరణి డమరుకనాదంబు పరిఢవిల్లఁ
బురనిశాటవిపాటనస్ఫుటవిహార
దుర్ధరుం డగుహరుఁడు ప్రాదుర్భవించె. 101
వ. ఇట్లావిర్భవించిన యవ్విరూపాక్షు నిరీక్షించియవ్విరించి దుర
హంకారంబు విడువనేరక పంచమవదనంబున నిట్లనియె. 102
తే. డమరుధర! నీవు నాలలాటస్థలమునఁ
దొల్లి జనియించితివి లేటతెల్లముగను
రోదనము హేతువుగ నీకు రుద్రనామ
మపుడు ఘటియించినాఁడ నే నలఘుమహిమ. 103
వ. అట్లు గావున నీవు నాకుఁ బుత్త్రుండవు, నన్ను శరణంబుచొచ్చి
నావలనం బరిరక్షఁగాంచి బ్రదుకు మనుచు దురాలాపంబులు
పలికె. భర్గుండును సఖర్వం బగుతదీయగర్వంబు సహింపక
నితాంతరోషసంరంభంబున విజృంభించిన. 104
సీ. ఢమఢమార్భటిడమడ్డమరుఢక్కాధ్వని
పదిదిక్కులందును బ్రమసి పార

గళమూలనిర్గళత్కాలకూటచ్ఛవి
యర్కబింబంబు మాయంబు సేయ
ఫాలదృగ్భవసముద్భటశిఖాజాలంబు
లుదధుల నన్నింటి నుడుకఁ బెట్టఁ
గుటిలపాటలజటాంకురకుట్టనంబులు
జగదండసీమ బెజ్జములు పుచ్చ
తే. సంభవము నొందె హరునవష్టంభరభస
శుంభదవగాఢరోషవిస్ఫురణవలన
విశ్వసంహారసన్నాహవిషమసుషమ
పరుషదుర్భైరవుం డగు భైరవుండు. 105

వ. ఇట్లుద్భవించి యుద్భటప్రతాపదుర్నిరీక్ష్యుం డగుచు నాక్ష
ణంబ విరూపాక్షునాజ్ఞావచనంబునం బద్మగర్భునిం గదిసి.

ఆ. గంధకరటి నూత్నకమలంబుఁ బోలె న
[1]ప్పురుషుఁ డలఘులీలఁ బొటకరింపఁ
ద్రుంచె నవ్విరించి పంచమవదనంబుఁ
బ్రఖరదీర్ఘహస్తనఖరధార. 107

తే. ద్రోహి యేయంగ మట్టిద రూ పడంపఁ
దగవు గావున దూషకత్వంబుఁ దెలిసి
తునిమెఁ బరమేష్ఠిపంచమాననమ యేర్చి
భైరవుం డింత యొప్పై ఎనపాడి గలదె? 108

వ. అట్టియెడ నారాయణాంశజుం డైనక్రతుమూర్తి శైవంబు
లైనస్తోత్రంబులు పఠియించె. హిరణ్యగర్భుండును నహం
కారముడిగిభీతిపరవశంబున శతరుద్రీయంబు జపియించె. అంత

---

1 పురుషుఁ డలసలీల

శరణాగతవత్సలుం డగునయ్యీశ్వరుండు వారి నిర్గతిం
గరుణావిలోకనంబుల మన్నించి నిజరూపాంతరం బైరభైరవ
దేవుం జూచి యీయధ్వర(పురుష)విధాతలు నీకు మాననీ
యులు. వీరలయెడ నింకఁ గోపాటోపంబులు చాలు. నీవు
వైధసం బైనకపాలంబు దాల్చి లోకాచారప్రకటనార్థంబు
భిక్షాశనంబు గొనుచుఁ గాపాలికవ్రతంబుతోడ లోకంబులం
జరియింపు మని చెప్పి యనంతరంబ. 109

సీ. మోకాళ్లు దిగకుండ ముడిచి కట్టినధాతు
శాటంబు గలకటిస్థలముతోడ
దట్టంబు గాఁగఁ జందనపంక ములఁదిన
యరుణంపువికటదేహంబుతోడఁ
బిల్లికన్నులఁ బోలు పింగళాక్షములందుఁ
గ్రూరంబు లగుమిడిగ్రుడ్లతోడఁ
బోడకట్టువడుజపాపుష్పంబుచెరివిన
చికిచికిపల్లవెంద్రుకలతోడఁ

తే. గఠినదంష్ట్రికాభీలవక్త్రంబుతోడ
జిహ్వానటనత్వరోల్లలజ్జిహ్వాతోడఁ
గత్తితోఁ *బద్దెతో మహోగ్రత్వ మొంద
ఫాలనేత్రుఁడు సృజియించె బ్రహ్మహత్య. 110

వ. ఇట్లు సృజియించి దానిం జూచి కాశికానగరంబుదక్క నితర
స్థలంబు లెవ్వియు నీకు దుష్ప్రవేశంబులుగావున నీ వితనిపజ్జ
వర్తిల్లు మని పలుకు బుండరీకభవశిరఃఖండనుం డైనభైరవుం

---

* అన్నిమాతృకలందు 'పట్టె' యనియే యున్నది. 'కర్త్రీకర్పరహస్తా
గ్రాం' అని సంస్కృతమూలము, పట్టెశబ్దము కర్పరవాచక మగుట విచార్యము.

జూపి యక్కాలాంతకుం డంతర్ధానంబు సేసె. అతండును
నీశ్వరోక్తప్రకారంబున సకలజగమ్ములు గ్రుమ్మరుచు నొక్క
నాఁడు వైకుంఠపురంబు చొచ్చి వైకుంఠనికేతనంబున కేగిన.

సీ. పదపల్లవంబునఁ బ్రకటిల్లుచదలేఱు
కడ లెత్తి ధాత్రి వెల్లువిడిచి పాఱఁ
గటియందు రంజిల్లు కనకశాటి మెఱుంగు
గెళవుల రేయెండతళుకు లీనఁ
బొక్కిటి తమ్మిపూవున జాలముసరెడు
నలులు ఝుమ్మనుచు సంకులతఁ దిరుగఁ
దులసీపలాశమంజులదామకంబులు
కౌస్తుభపదకంబుఁ గ్రిందుపఱుప

తే. సంభ్రమము విస్మయంబులు సమ్మదంబు
భక్తియును భావవీధిలోఁ బరిఢవిల్ల
నిందిరయుఁ దానుఁ బద్మాక్షుఁ డెదురు వచ్చె
భర్గమూర్తికి నయ్యాదిభైరవునకు. 112

వ. ఇట్లు వచ్చి యాలక్ష్మీశ్వరుం డగ్రభాగంబున. 113

మ. కనియెం గుండలిరాజకుండలు మహాకాళఘ్ను లలాటస్థలీ
జనితానల్పకృపీటసంభవపటుజ్వాలాకరాళాక్షుఁ బా
వనునిఁ బ్రహ్మకపాలహస్తుని జటావ్యాఢౌకనప్రౌఢవి
వ్యనదీవార్లహరీపరస్ఫురహతివ్యగ్రాంగుఁ భైరవున్. 114

వ. కని జయజయశబ్దముఖరుం డగుచుం గదిసి ప్రణమిల్లి యంజ
లిపుటంబు నిటలతటంబునం గదియించి తత్ప్రభావవర్ణనా
కుతూహలంబున నిందిరాదేవి కి ట్లనియె. 115

సీ. జలజాక్షి! యితఁడు వో సకలయోగీంద్రులు
భావవీథులఁ గాంచుపరమతత్త్వ

మలివేణి! యితఁడు వో యఖిలభూతములకు
నాధార మగుచు నింపారు వేల్పు
కలకంఠి! యితఁడు వో కలకాలములయందు
నుడివోని శుభమూర్తి నుండు పెద్ద
లలితాంగి! యితఁడు వో యలఘుతేజంబున
విశ్వంబు వెలిఁగించు విశ్వనాథుఁ

తే. డబ్ధిసంభవ! యితఁడు వో హాలహాలపు
విషము పుక్కిటఁ దాల్చినవెగ్గలీఁడు
పాటలీగంధి! యితఁడు వో భక్తతతికి
శాశ్వతానందకరుఁ డగునీశ్వరుండు. 116

క. మన మెట్టిభాగ్య మొనరిం
చినవార మొ నేఁడు పూర్ణశీతాంశునిభా
నన! యట్లు గాక శంభుఁడు
విన నచ్చెరు విచటి కిట్లు విజయము సేసెన్. 117

వ. అని పలికి యప్పరమేశ్వరుండు వెండియు ననేకప్రకారం
బులం బ్రస్తుతించి యతనివలనఁ దద్భిక్షాటనవృత్తాంతం
బంతయు నెఱింగి నాశ్చర్యహృదయుం డగుచుఁ బద్మమంది
రకు సంజ్ఞసేసిన నాజగన్మాతయు నంతిపురంబునకుం జని
యనంతరంబ. 118

సీ. అడుగుఁదమ్ములయందు నడరునున్న నిడాలు
కపటసంధ్యార్భటిఁ గ్రమ్మఱింపఁ
గాంచీమతల్లి కాకలకలారవములు
ఝషకేతునట్టహాసముల నవ్వఁ

కుచకుంభయుగళిమ్రోఁగునఁ దోట్రుపడి పేద
    కౌఁదీగ జవజవఁ గంప మొందఁ
గ్రుయి వెక్కి జాఱిన క్రొమ్ముడిలోపలి
    విరులు తుమ్మెదలకు విందు వెట్ట
తే. సహజసంభ్రమతాత్పర్యసమ్మదములుఁ
దళుకు చూపంగ నవరత్నదర్వి గొనుచు
నిందిరాదేవి యేతెంచి యిందుధరుని
హస్తపాత్రిక నమృతదివ్యాన్న మిడియె. 119

వ. ఇట్లు మహాలక్ష్మీదేవిచేత మనోరథవతి యనుపేరం బ్రసిద్ధి యగుభిక్షఁ గొని పద్మాక్షునందలి భయభక్తివిశ్వాసంబులకు మెచ్చి యతనికోరినవరంబు లొసంగి యెప్పటియట్ల బ్రహ్మహత్య తోడన యరుగుదేర జగంబులఁ జరియించుచు నొక్క నాఁడు. 120

సీ. జనని యేతీర్థంబు సకలదుఃఖావళి
    హారణప్రభావవిస్ఫురణమునకు
గృహిణి యేతీర్థంబు మహితహాలాహల
    గరళచ్ఛవిచ్ఛన్నకంధరునకు
నావాల మేతీర్థ మభిమతప్రదకళా
    కరవిశాలాక్ష్యాఖ్యకల్పలతకు
నావాస మేతీర్థ మఖిలతీర్థాలభ్య
    ముఖ్యసౌభాగ్యవహమోక్షమునకు
తే. నట్టితీర్థంబునకు నెమ్మి నరుగుదెంచెఁ
గాశినగరికి సకలభాగప్రకీర్ణ

గగనగంగాతరంగిణీకనకకమల
పరిమళోద్గారిణికి మహాభైరవుండు. 121

వ. ఇట్లు దేవుండు విశ్వేశ్వరనివాసంబు సొచ్చినంతన బహిర్భా
గంబుననుండి హాహాకారంబున మొఱవెట్టుచు నా బ్రహ్మ
హత్య పాతాళంబునం బడియె. అతనిహస్తంబున నున్న
ధాతృకపాలంబును నూడి ధాత్రీతలంబునం బడియె. అది
మొదలుగా నవ్వాటుకనాథుం డానందంబున నయ్యానంద
వనంబునం దధివసియించె. కపాలమోచనతీర్థంబు తన్నుం భజి
యించువారికిం బాపభంజనంబు సేయుచుం బుణ్యప్రదా
యకం బయ్యె. ఇయ్యాఖ్యానంబుం బఠించినను విన్నను
వారలకు మహాపాతకంబు దొలంగు నని చెప్పి కుమార
స్వామి వెండియు నగస్త్యున కిట్లనియె. 122

సీ. అజుఁడు దా నధికుండ ననుచు గర్వించినఁ
గరనఖాగ్రమునఁ దచ్ఛిరముఁ ద్రుంచె
సాకార యగు బ్రహ్మహత్యతోఁ జనుదేర
సకలలోకంబులు సంచరించె
వైకుంఠమున రమావైకుంఠు లర్పింప
నమృతభిక్షాశనం బారగించెఁ
గాశికానగరోపకంఠదేశంబునఁ
బగుల వైచెఁ గరంబు బ్రహ్మపునుక

తే. యాధిపత్యంబు వడసెఁ గామారిచేతఁ
బరియ వైచినచోన కాఁపురము సేసెఁ
గాశికాస్థానమున కేడుగడయుఁ జూవె!
క్రోధభైరవదేవుండు కుంభజన్మ! 123

వ. దురితభక్షణంబునం బాపభక్షకుండును, గలుషమర్దనంబున నామర్దకుండును, గాలకలనంబువలనఁ గాలనాభుండును, వృజినభైరవుం డగుభైరవుండును నై యద్దేవుండు భజించు వారికి షణ్మాససిద్ధికరుండు. 124

తే. కలశయోని! యప్పీఁటికి బలుతులారి
పాపహృద్భైరవుం డగు భైరవుండు
కాశికాపట్టణం బైదు క్రోశములును
నవహితుం డై యత(ం)డు చేటచ్చికాదు. 125

వ. అనిన విని కుంభసంభవుండు హరికేతుం డనుయక్షుండు దేవదేవునకుం బ్రేమపాత్రం బైన వారాణసీపట్టణంబునం బ్రమథపరివారంబునకు దండనాయకుం డై యుండు నని విందు. అతని చరిత్రంబు వినవలతు నానతిమ్మనినం గుమారస్వామి యతని కిట్లనియె. 126

హరికేశచరిత్రము

సీ. యక్షుండు రత్నభద్రాభిధానుఁడు గంధ
మాదనంబునయందు మహితకీర్తి
పూర్ణభద్రుండు తత్పుత్త్రుఁ డాతనిభార్య
కనకమండన గంధకరటియాన
యాలేమతనయుండు హరికేశుఁ డతఁడు శ్రీ
యానందకాననాభ్యంతరమునఁ
దప మాచరింప నాతనిశరీరము మించి
పుట్టె వల్మీకంబు పొదలు వొదలె

తే. నభవుఁ డుమతోడఁ గూడి లీలార్థ మచటి
కరుగుదెంచి ప్రసన్నుఁ డై వరము నొసఁగ

దండనాయకపదవి యాతండు కాశి
చక్రరక్షకుఁ డై యుండుఁ జనువు గలిగి. 127

సీ. భరియించు నాతండు పాణిపల్లవమున
వెండికట్టులతోడి దండయష్టి
వసియించు నాతండు వారాణసీపుర
ప్రాకారగోపుర ప్రాంతభూమి
ధరియించు నాతండు దప్తారకూటరు
క్పరిపాటలచ్ఛాయఁ బల్లజడలు
సవరించు నాతండు సతతంబు రుద్రాక్ష
భూషావిభూతి త్రిపుండ్రకములు

తే. సౌమ్యరూపంబు వహియించు సజ్జనులకుఁ
బాపమతులకు వికృతరూపంబుఁ దాల్చుఁ
బింగళాక్షుండు దీర్ఘగంభీరమూర్తి
చండికాపతి ప్రియభృత్యుండు దండపాణి. 128

వ. అనిన విని యగస్త్యుండు మహాత్మా! జ్ఞానవాపికాతీర్థమాహా
త్మ్యంబు వినవలతుం జెప్పవే యనిన గార్తికేయుండు. 129

జ్ఞానవాపికాతీర్థమాహాత్మ్యము

సీ. పాదాభిహతి సప్తపాతాళములతోడ
నుర్వీకటాహ ముట్టూఁత లూఁగ
నిర్భరతరజటానికురుంబకంబులు
చెదరి బ్రహ్మాండంబు చెంపబెట్ట
బాహార్గళాస్తంభపరివర్తనంబుల
దిక్చక్రవాళంబు త్రెవ్వి పడఁగ

వితతనిశ్శ్వాసమారుతవర్తనంబునఁ
బృథ్వీధరంబులు పెల్లగిల్ల

తే. డమరుధ్వానాదముల సముద్రములు గలఁగ
నారభటివృత్తిఁ దాండవం బవధరించెఁ
బ్రళయవేళ మహాకాళభైరవుండు
కాళరాత్రి కుచంబులు గగుఱుపొడువ. 130

తే. అభవుఁ డిబ్భంగిఁ దాండవం బాడి డస్సి
డప్పి గొని యారగింపఁ గాండంబు వెరికి
కానఁ డయ్యెను సప్తలోకంబులందుఁ
దియ్యనివి జివ్వ కింపైన తేటనీరు. 131

తే. ప్రళయకాలంబునను నెందు బసిమి చెడక
నిలిచినది కాశిపురము కా నిశ్చయించి
యరిగె నీశానుఁ డనుసమాహ్వాయముఁ దాల్చి
ఘనపిపాసార్తి నంధకదనుజవైరి. 132

తే. కన్నవా రెవ్వరును లేరు కన్న మెఱుఁగు
గర్జితం బనువచనంబు కడల నిలిచె
శశవిషాణప్రరోహంబు జలదవార్త
యంబు వెబ్భంగిఁ గలుగు నయ్యవసరమున. 133

వ. అప్పు డీశానుండు. 134

సీ. సంసారసస్యబీజముల కూషరభూమి
నిర్వాణలక్ష్మికి నిలువడ నీడ
యల్ల నేరెడుదీవి కవతంసకుసుమంబు
కామధేనువు ముక్తికాములకును

విహారణస్థానంబు విశ్వనాయకునకుఁ
కల్యాణముల కాదికారణంబు
కట్టుఁగంబము డుంఠిగంధద్విపమునకుఁ
బ్రణవాంకురము పరబ్రహ్మమునకు
తే. నెద్ది యక్కాశికాపురి కేగుదెంచెఁ
బసిఁడిలాతాపుఁగోలయుఁ బల్లజడలు
నసితగళమూలమును ద్రిశూలాయుధంబుఁ
జాల నొప్పఁగ దపసివేషమున హరుఁడు. 135

వ. ఇట్లు కాశికానగరంబుఁ బ్రవేశించి యీశానుండు విశ్వేశ్వరశ్రీమన్మహాదేవు నిర్మలజ్యోతిర్మయలింగాకారు సహస్రకలశాభిషేకంబు సేయను, దత్పాదతీర్థప్రసాదోదకంబు లాస్వాదింపను దలంచి. 136

శా. చేతో జాతవిరోధి కాశినగరీక్షేత్రోపకంఠంబునన్
శాతాగ్రం బగుశూల మూఁది ధరణీచక్రంబు భేదించుచున్
బాతాళంబులు గ్రుచ్చుచున్నిగిడెనాభవ్యాయుధంబావృతి
స్రోతోభారము సోఁకునట్లుగ దృఢస్ఫూర్తిప్రభావంబునన్.

తే. దృఢముగా నూఁది శూలంబు దివిచె హరుఁడు
దివిచినప్పుడ తన్మహావివరసరణి
నేడుపాతాళములు దాఁటి యిలయుఁ దూరి
యంబరము దాఁకె నావరణాంబుధార. 138

వ. భూప్రమాణంబునకు శతగుణప్రమాణం బై శుద్ధస్ఫటిక నిర్మలంబును. శరజ్జ్యోత్స్నాస్వచ్ఛంబును, శశిఖండసంకాశంబును, సుధాధారామధురంబును, పాటలీకుసుమ సౌరభంబు నైనయవ్వారిపూరంబు వెండితీఁగెయుంబోలె నెగ

సిన నీశానుండు హస్రధారాకలశంబున సహస్రవారం
బులు పంచాక్షరీ పంచబ్రహ్మశతరుద్రీయప్రణవాఘోరపాశు
పతాదిమంత్రంబు లుచ్చరించుచు విశ్వేశ్వరశ్రీమన్మహాదేవు
దివ్యలింగంబు నభిషేకించి. 139

క. భువనావరణోదకమున
భవు నభిషేకంబు సేయఁ బొసెను లయతాం
డవకేలిసమయసము
ద్భవ మగునీర్వట్టు కపట పాశుపతునకున్. 140

వ. అప్పుడు విశ్వేశ్వరదేవుడు ప్రసన్నుం డై యీశానుండు
కోరిన ప్రకారంబున. 141

సీ. జ్ఞానోద మన శివజ్ఞానంబు నా శివ
తీర్థంబు నా జ్ఞానతీర్థ మనఁగ
జ్ఞానవాపిక నాఁగ సంజ్ఞాంతరంబులు
గలిగి పానాభిషేకక్రియలను
సంస్పర్శనామాభిసంకీర్తనధ్యాన
సందర్శనంబుల సప్తతంతు
ఫలము నీఁజాలు ప్రభావంబు కైవల్య
సంపత్ప్రదానైక సరసతయును
తే. సన్నిహత్యాదిఫల్గ్వాదిసకలతీర్థ
సమధికత్వంబు బ్రహ్మరాక్షసపిశాచ
శాకినీగ్రహకూశ్మాండశాంతివిధియు
నిచ్చె నీశానకుండిక కీశ్వరుండు. 142

కళావత్యుపాఖ్యానము

వ. అని యానతిచ్చి శంభుం డంతర్హితుండయ్యె. ఈశానవాపి

కాసమీపంబున నీశానుండు కృతావాసుం డయ్యె. కలశో
ద్భవా! విచిత్రార్థం బగునితిహాసంబు శివతీర్థమాహాత్మ్యప్రకా
రంబు సెప్పెద నాకర్ణింపుము. హరిస్వామి యనఁగ నొక
విప్రుండు కాశీనగరంబున నుండు. అతనికూఁతురు సుశీల
యనునది రూపరేఖావిలాసంబులం ద్రిభువనంబులయందునుం
బొగడఁదగియుండు; నబ్బాలారత్నంబు. 143

చ. బలబల వేగ తేపకడఁ బంకజదీర్ఘికఁ దాన మాడి నె
చ్చెలులును దాను నిందుముఖి శేషవిభూషణుఁ బూజసేయుని
చ్చలుఁ దెలికన్నులు న్మొలకచన్నులు బొమ్మలమీఁద వ్రాలుఁ గుం
తలములుఁ జూచి పౌరులు మనంబున నువ్విళులూరుచుండఁ [గాన్

తే. లలన సాక్షాత్కరించినలక్ష్మివోలెఁ
గంకణమ్ములతో సూడిగములు రాయ
విశ్వనాథుని కళ్యాణవేదియందు
మ్రుగ్గుపెట్టంగ మోహించు ముజ్జగంబు. 145

తే. బహుళసౌభాగ్యలక్ష్మికిఁ బద్మముఖికి
ముజ్జగంబుల సరి లేరు ముదిత లనుచు
బ్రహ్మ సంకేతరేఖలు వ్రాసె ననఁగఁ
గాంతగళమున నొప్పె రేఖాత్రయంబు. 146

తే. కడుపులో మూఁడు శంభులింగంబు లుండుఁ
దొయ్యలికి జ్ఞానవాపికాతోయసేవఁ
గలశసంభవ! కేదారసలిలములును
గాశి శివతీర్థజలము లింగత్వ మొందు. 147

వ. ఒక్కనాఁ డొక్కవిద్యాధరుండు రూపలావణ్య మోహితుం
డై యర్థరాత్రం బమ్మచ్చెకంటిముంగిటం బిండిచల్లినవిధంబున

నిండువెన్నెలలు గాయఁ జంద్రకాపాండుతల్పంబున నిద్రించి
యుండ నిద్రాభంగంబు గాకుండ మెత్తమెత్తన నెత్తమ్మి
రేకులకంటెను సుకుమారంబు లైనతనహస్తపల్లవంబుల
నెత్తి గగనమార్గంబున మలయాద్రికిం గొనిపోయె నయ్య
వసరంబున. 148

†మ. "గక్కసుఁ డొక్కఁడప్పురిసరస్థలిఁ గ్రుమ్మరి కేళి సల్పువాఁ
డక్కమలాక్షిచక్కఁదన మద్భుత మందుచుఁ జూచి రాగము
న్నెక్కొనఁ దత్తరం బుడుపనేరక మారవికారచేష్టలం [బై.
గ్రక్కున దానిఁబట్టుకొనఁగాఁ గవిసెన్ వడి దుర్మదాంధుఁ

వ. ఇట్లు కవిసిన విద్యాధరుండును వాని నదల్చుచు రోషవేష
భీషణాకారుఁడై సమరావష్టంభవిజృంభణంబున నిల్చె నయ్యి
రువురు నయ్యవసరంబున."

‡శా. విద్యున్మాలి యనంగ నొక్కదివిషద్విద్వేషి యక్కన్యకన్
విద్యుత్సన్నిభగాత్రిఁ జూచి మదనావేశంబునం బట్టికో
నుద్యోగించిన నాలతాంగినొకచో యోజించి విద్యాధరుం
డుద్యద్బాహుపరాక్రమస్ఫురణ దైత్యుం దాఁకెనయ్యిద్ద [ఱున్.

క. ఆహవము చేసి రంగజ
మోహాంధులు గడిమి మెఱసి *ముష్టాముష్టిన్
బాహాబాహిఁ గచాకచి
సాహసము జలంబు దివిజసంఘము పొగడన్. 150

వ. అప్పుడు. 151

† ఈరెండును మద్రాస్ ఓరియంటలు లైబ్రరీ ప్రతిలోఁ గనుపట్టుచున్నవి.

‡ అన్నిమాతృకలలో 'ముష్టాముష్టిన్' యని యున్నను 'ముష్టీముష్టి' సరిరూపము.

తే. అప్సరస్త్రీ తిలోత్తమ యసురవరులు
తనకు నై పోరఁ జూచుచందంబు దోఁపఁ
జూచె విద్యాధరుఁడు రాక్షసుండు గడిమిఁ
దనకు నై పోరుచుండఁగఁ దలిరుఁబోఁడి. 152

వ. అవ్విధంబున యుద్ధంబు సేసి యన్యోన్యముష్టి ప్రహారంబుల నిద్దఱు సమరస్థలంబున నిధనం బొంది రందు. 153

తే. ప్రాణనిర్యాణవేళ విద్యాధరుండు
గ్రుడ్డు దిరుగంగఁ బడి విప్రకులజఁ జూచి
కటకటా! నిన్ను ననుచు గద్గదిక దనర
మాట నాల్కన యుండంగ మరణ మయ్యె. 154

వ. అంత నక్కాంత నిజాంతర్గతంబున. 155

క. ఆలింగనమ్ము సేసెం
బాలిండ్లను మొట్టె వదనపద్మము తావుల్
గ్రోలె మగఁ డనఁగ నెవ్వం
డా లనఁగా నెద్ది? భర్త యతఁ డే నాలిన్. 156

వ. అని విద్యాధరుతోడ ననుగమనంబు సేయం దలంచి (యరమి) యమ్మెఱుంగుఁబోఁడి మలయాచలోపాంతంబున. 157

ఉ. వెగ్గల మైనమూర్ఛ నరవిందదళాయతనేత్ర కొండకా
రగ్గి పటీర కాష్ఠములయందు రవుల్కొనఁ జేసి కమ్మపూ
మొగ్గలదండఁ దాల్చి మది మున్కడఁ గాశిని విశ్వనాయకు
న్దగ్గన సంస్మరించి జననిఁ జనకుం దలచెం గ్రమంబునన్.

వ. మఱియు నాత్మగతంబున. 159

క. ఏమిటఁ దప్పితి నొకో? నా
స్వామికి విశ్వేశ్వరునకు వారాణసిలో

సేమమున నెల్లరును దమ
ధామంబుల నుండ నిట్టిదశ నాకొదవెన్. 160

సీ. జ్ఞానవాహీంపయస్స్నానక్రియావేళఁ
జెలికత్తియలు నన్నుఁ దలఁతు రొక్కొ!
మదిలోన నేభంగి మఱుఁగుచుండుదు రొక్కొ
తల్లిదండ్రులు సంతతంబు నాకు!
హరితాంకురంబు లే నందీక మేయని
హరిణశాబము నెవ్వ రరయువారు
సేవ సేయించుకోఁ జిత్తగింపఁడు సుమీ
నాచేత శ్రీవిశ్వనాయకుండు!

తే. కాశి(!)లోలార్క కేశవ! కాళనాథ!
దండనాయక! డుంఠి వేదండవదన!
సంభ్రమోద్భ్రిములార! యోజహ్నుకన్య!
కానవచ్చెద మిమ్ము నెక్కట భవమున. 161

తే. విధవ నై జన్మ మెల్లను వేగఁ జాల
నొకనిచేపడి యోప నింకొకని వెదుక
నితనితోడిద లోకమ్మై యేగుదాన
ననలముఖమున నిమిషవేదనకు నోర్చి. 162

ఉ. ఇంకొకఁడెవ్వఁడేని నను నెక్కటి యుండఁగఁజూచి పట్టునో?
కింక మహాటవిం గరటికేసరిదంష్ట్రితరక్షుయూథముల్
సంకటపెట్టునో! యతినృశంసత నింతలు సేసినట్టి యా
పంకజసూతిపై నెరయఁ బ్రైయిడి వేగమయగ్గి సొచ్చెదన్.

క. పాపపుదైవ మొనర్చిన
యీపరిభవవహ్నికంటె నెక్కటపడుసం

తాపమునం జిలికాష్ఠో
ద్దీపిత మగువహ్ని? యేల ధృతిఁ బొఱఁగంగన్. 164

ఉ. భూధరరాజసన్నిభుఁడు పుష్పశరాసనుతోడిజోడు వి
ద్యాధరచక్రవర్తి నను నర్మిలిఁ దెచ్చినవాఁడు నాకుఁ గా
శీధర నాదుకట్టెదుర నీదశ నుండఁగ విశ్వనాథ! కా
శీధవ! యంబికారమణ! జీవిత మేను ధరించుదాననే? 165

వ. అని దుఃఖావేశంబున. 166

చ. కొసరి వసంతకాలమునఁ గోయిల క్రోశ్చునభంగి నేడ్చె న
బ్బిసరుహనేత్ర కొండచఱిఁ బెద్దయెలుంగున వెక్కివెక్కి వె
క్కస మగుమన్యువేగమునఁ గాటుకకన్నులనీరు సోన లై
యుసిరికకాయలంతలు పయోధరముల్ దిగజాఱునట్లుగన్.

మ. మలయం బెక్కడఁ గాశి యెక్కడ? యసన్మార్గంబు వాటించి తె
క్కలి దైవం బిటు నాకు నీయహితముం గావించునే? యంచు వే
తలయూఁచెం గలకంఠి మచ్చెరువునం దాటంకరత్నప్రభల్
పలకంబాఱిన చెక్కుటద్దములపైఁ బైపై విలంఘింపఁగాన్.

వ. వెండియు నక్కన్యకకర్పూరకదళికాద్రుమనిర్యన్నిర్యాసధా
రాద్రవవాసనానుగంధంబులగుగంధసారగిరినితంబనిర్ఝరాం
భఃప్రవాహంబున ముఖప్రక్షాళనం బాచరించి విద్యాధ
రోపరివిరచిత(చితా)గంధసా[1]రకాష్ఠంబులరవుల్కొనిగంధకరటి
కర్ణతాళతాళవృత్తాంతతాండవప్రస్థానవిస్తారితంబు లగుమా
రుతంబులవలనం బెచ్చుపెరిఁగివిచ్చలవిడిఁ మండుచిచ్చునకుం
బ్రదక్షిణంబు వచ్చి నిసర్గకాతరంబు లగుకటాక్షవీక్షణంబులు
పుష్పాంజలివిక్షేపంబులభంగి నంగీకరింపఁ జంపుడుగట్ట యగు

1 రేంధనకాండప్రకాండఖండం.

శిలాఘట్టంబు మెట్టి నిలిచి సంతతస్వాధ్యాయాధ్యయనధ్వని
ముఖరంబును, నగ్నిహోత్రధేనుఖరఖురవలయార్ధచంద్రచం
ద్రకితాజీవంబును, త్రికాలశంభుపూజాసమారంభ విజృంభ
మాణశంఖకాహళ బహుళకోలాహలాకులంబునునగునయ్యా
నందకాననంబునందు బ్రహ్మపురివాడకుం జూడారత్నం బైన
నాపుట్టినిల్లభివృద్ధిం బొంది యుండుంగావుత! కౌశికాకటక
విప్రకుటుంబినీశ్లాఘనీయచరిత్రయగు నాజనయిత్రి ప్రియంవద
ముత్తైదువ యగుంగాత! అష్టాదశమహావిద్యాస్థానసామ్రా
జ్యభద్రాసనాసీనుం డగురుద్రావాసవిద్వత్సింహంబు నా
తండ్రి హరిస్వామి సమానులయం దుత్తమశోకుం డగుం
గాక! మహాశ్మశానంబునం దనూచారం బగు నాబంధు
వర్గంబు బంధువర్గంపుఁదీఁగయుంబోలెఁ గొనసాఁగి బ్రతుకుం
గాక యని యాశీర్వదించి. 169

సీ. ఏఁ బ్రభాతంబుల నీశానవాపిక
నిశంబుఁ దీర్థ మాడినఫలంబు
వివిధభంగుల నేను విశ్వేశ్వరస్వామి
ముక్తిమంటపి నిద్దమ్రుగ్గుఫలము
ప్రతిచతుర్థిని డుంఠిభద్రేభవక్త్రు నే
నారాధనము సేసినట్టిఫలము
నానందకాననాభ్యంతరక్షేత్రంబు
నందు జన్మించినయట్టిఫలము

తే. సర్వమును,గూడి మీఁదటిజన్మ వేళ
నితనికే భార్యఁగా నన్ను నిచ్చు గాతఁ

యనుచు హరిణాంకమూర్తి తీవ్రాంశుఁ బోలెఁ
గొసర కగ్నిఁ బ్రవేశించెఁ గువలయాక్షి. 170

క. లింగత్రయగర్భిణి యగు
నంగనసాన్నిధ్యమున నిశాటుండును ద
త్సంగతి విద్యాధరరా
జుం గాంచిరి త్రిదివపదము సుకృతస్ఫురణన్. 171

వ. అంతఁ గొంతకాలంబునం బ్రియాస్మరణంబు సేసెం గావున విద్యాధరకుమారుండు మలయకేతుం డనునామంబునను నగ్నిప్రవేశసమయంబున నవ్విద్యాధరకుమారుండు తనకుం బతి కావలయు నని కోరెం గావున సుశీల కళావతి యను పేర భూమండలంబున జన్మించి వధూవరులైరి. ఆదంపతుల యందుఁ గళావతీదేవి పూర్వజన్మవాసనావశంబున. 172

మ. అలినీలాలక దాల్చుఁ జన్నుఁగవ రుద్రాక్షావళీదామకం
బులు ముక్తామణిభూష లొల్ల దసితాంభోజాతపత్రాక్షిమై
నలఁదుఁ భస్మ మలంద నొల్ల దొకనాఁ డైనం బటీరద్రవం
బులుపన్నీరుకురంగనాభియును గర్పూరంబు కాశ్మీరమున్.

తే. కడుపు నిండంగఁ గాంచె నక్కలువకంటి
మలయకేతుమహీపాలమన్మథునకు
భాగ్యసౌభాగ్యవైభవప్రాభ వాది
శుభగుణశ్రీసమృద్ధుల సుతుల ముగుర. 174

వ. అంత నొక్కనాఁడు చిత్రకరుండొకరుండు వారణాసీస్థాన వృత్తాంతంబు చిత్రపటంబున లిఖయించి తెచ్చి కళావతీసహితుండైన మలయకేతుసన్నిధిం బెట్టిన నవ్విలాసవతి పటంబు చూచి ప్రాగ్జన్మవాసనావశంబునఁ దన్ను మఱచి సమాధి

స్థయుం బోలె లోచనంబులు మొగిచి ముహూర్తమాత్రం
బూరకుండి కన్ను(లు) దెఱచి యాచిత్రపటంబునం గల య
శేషవిశేషంబులు క్రమంబునం బూసగూర్చినతెఱంగునం గర
తర్జనిం జూపుచు ప్రియునికిం జెప్పం దొడంగె. ఆప్రకారంబు
కుంభసంభవా! నీకుం జెప్పెద నాకర్ణింపుము. 175

తే. కాశినగరి ధనుర్వల్లి గంగ నారి
కోటియుగ్మంబు లోలార్కకుధరధరులు
వృషము బాణంబు లక్ష్యంబు వృజినరాశి
విశ్వనాథుండు ధన్వి యుర్వీకళత్ర! 176

సీ. అదె వియద్వాహిని యదె మణికర్ణిక
యదె కాశి నిఖిలకల్యాణరాశి
యదె విధాతృకపాల మవని వ్రాలినచోటు
వాఁడె శ్రీమత్కాలవటుకరాజు
పంచతీర్థం బదె ప్రణవమంత్రాకృతి
మత్స్యోదరినామమండల మదె
కామేశ్వరుఁడు వాఁడె స్కందేశ్వరుఁడు వాఁడె
వాఁడె వినాయకేశ్వరుఁడు హరుఁడు

తే. శశికిరీటుండు పార్వతీశ్వరుఁడు వాఁడె
వాఁడె భృంగీశుఁ డధ్వరేశ్వరుఁడు వాఁడె
వాఁడె యష్టాదశాంగుళేశ్వరుఁడు హరుండు
ధర్మశాస్త్రేశ్వరుఁడు వాఁడె ధరణినాథ! 177

తే. ఇతఁడు సారస్వతేశ్వరుం డిందుమౌళి
యితఁడు రత్నజాతీశ్వరుఁ డిభవిరోధి

యతఁడు శైలేశ్వరుఁడు భుజంగాభరణుఁడు
సప్తజలధీశ్వరుఁడు వాఁడె శంకరుండు. 178

సీ. సప్తకోటిమహామంత్రసన్మంత్రములకు న
ధీశ్వరుం డితఁడు మంత్రేశ్వరుండు
త్రిపురేశ్వరుఁడు వీఁడె త్రిపురదానవులకు
సాన్నిధ్యమై పూజఁగొన్న పెద్ద
బాణేశ్వరుఁడు వీఁడె బాణాసురునకు వే
భుజము లిచ్చినచంద్రభూషణుండు
వైరోచనేశుండు వాఁడె ప్రహ్లాదాది
నారదేశ్వరు లల్లవాఁడు చూడు

తే. ధరణినాయక! యాదిగదాధరేశ
భీష్మకేశభృంగీశగోపీముకుంద
నారసింహేశ్వరాత్రేయనాథశేష
విఘ్నరాజేశ్వరులఁ జూడు వేలువేలు. 179

తే. బింధు(దు)మాధవదేవుఁ డానందవిపిన
వీథికాకేళికలకంఠవిష్కిరంబు
పంచనదతీర్థరాజంబు పార్థివేంద్ర!
కాశికాఫాలకస్తూరికాతిలకము. 180

క. ఇదె మంగళకాత్యాయని
యిదె మార్కండేయనాయకేశ్వరలింగం
బిదె ధాతపాతకేశ్వర
పద మిది కిరణేశుమనికిపట్టు మహేశా! 181

తే. వేయు నేటికి? నానందవిపినభూమి
నడుమ శశిఖండకోటీరనాగకటక

నిటలలోచనగిరిశధూర్జటులు హరులు
నారుపోసినచందాన నాటియుండ్రు. 182

వ. అని చెప్పి కళావతి జ్ఞానవాపికాతీర్థంబుఁ జూపి. 183

సీ. స్తంభరోమాంచాదిసాత్త్వికభావంబు
లందందఁ దోఁపంగ నవ్వధూటి
మూర్ఛిల్లె నద్భుతంబును బొంది భూపతి
శిశిరోపచారంబు సేయుచుండె
బుద్ధిశరీరిణి పుష్పప్రగల్భ యా
ధవళాక్షిఁబొంది నివాస మెఱిఁగి
చిత్రపటంబు మైఁ జేర్చి కర్ణముఁ జేర్చి
జ్ఞానోద మనియును జ్ఞానవాపి

తే. యనియు శివతీర్థ మనియు దృఢాక్షరముగఁ
బలికె ముమ్మారు చేతనాప్రాప్తి నొందె
సరసిజాతాయతాక్షి తచ్ఛబ్దమాత్ర
వాడఁబారినసస్యంబు వానఁ బోలె. 184

వ. మలయకేతుండును గళావతీప్రేరణంబునం బుత్త్రసంక్రాంత రాజ్యభారుం డై వారాణసీపురంబున కరిగి జ్ఞానవాపికా తీరంబునం దపం బాచరించి ముక్తుం డయ్యె. ఇది శివతీర్థ మాహాత్మ్యంబు. కుంభసంభవా! ఇంక నేమి యడుగఁ దలఁ చెద వడుగు మనుటయు. 185

తే. అనఘ! నాకు సదాచారమానతిమ్ము
ధరణిసురుఁడు సదాచారపరతఁ గాని
యాత్మసంశుద్ధి వడయ లేఁ డాత్మశుద్ధిఁ
గాని సిద్ధింపనేరదు కాశివసతి. 186

సదాచారనిరూపణము

వ. అనినఁ గుమారస్వామి యతనిం జూచి మన్వత్రిభృగుభరద్వాజయాజ్ఞవల్క్యౌశనోంగిరసోర్యమాపస్తంబసంవర్తకాత్యాయనబృహస్పతిశాతాతపశంఖలిఖితపరాశరాదుల మార్గంబుల సదాచారంబు ప్రసంగానుప్రసంగంబున వివరింప వచ్చిన నపారం బైయుండుఁ గావునఁ గుంభసంభవ! నీకు దిఙ్మాత్రంబు వివరించెద. సావధానమతివై యాకర్ణింపుము.

తే. చాతురాశ్రమ్యమును జతుష్కంధ మయ్యె
మొదటిస్కంధత్రయము ధర్మములు వహించు
నగ్రిమస్కంధ మెల్ల వింధ్యాద్రిదమన!
జ్ఞానసంపద్విభూతికిఁ దానకంబు. 188

శా. ఓరాత్రిం గనుతెప్ప వెట్టక మహోద్యోగంబునన్ ధీరతా
ధౌరంధర్యము పూని మానవునకుం దాత్పర్యవృత్తిన్ సదా
చారం బెట్లొనరింపవచ్చుఁ గలశీసంజాత! కాశీశ్వరున్
గౌరీవల్లభు సంస్మరించి బ్రతుకుం గా కాతఁ డప్రచ్యుతిన్.

తే. ద్విజుఁడు వేఁబోక మేల్కాంచి దినముదినము
ప్రత్యవాయపరీహారపరతఁ జేసి
సంస్మరింపంగఁ దగు భక్తిసౌష్ఠవమున
మంగళాస్పద మగువస్తుమండలంబు. 190

వ. బ్రాహ్మముహూర్తంబున మేల్కాంచి కృతాచమనుండయి వివిక్తప్రదేశంబున భస్మోద్ధూళనంబును, భసితత్రిపుండ్రధారణంబునుం బొనర్చి రుద్రాక్షమాలికలు ధరియించి, పద్మాసనాసీనుండయి, మనంబున హేరంబు, నంబికాసహాయుం ద్ర్యంబకు, లక్ష్మీసమేతుఁ బుండరీకాక్షు, భారతీసహితుం

బరమేష్ఠిం, బాకశాసనపావకపరేత రాజపలలాశిపాశిపవనపౌ
లస్త్యపశుపతులను, వసిష్ఠాదిమునుల, గంగాదిపుణ్యవాహి
నులఁ బ్రయాగాదితీర్థంబుల, మేరుశ్రీశైలాదిపుణ్యపర్వతంబు
లను, దుగ్ధోదన్వదాదిసముద్రంబుల, మానసాదిసరోవరంబుల,
జ్ఞానవాప్యాదిదీర్ఘికల, నందనాదివనంబులఁ, బుష్కరాది
ద్వీపంబుల, నార్యావర్తాదిజనపదంబులఁ, గామధుగ్ధేన్వాది
ధేనువులం, గల్పవృక్షాదివృక్షంబులం, గాంచనాదిధాతు
వుల, లక్ష్మ్యాది పుణ్యాంగనల, గరుడాదిపతంగంబుల, శేషాది
మహానాగంబుల, నైరావణాదివారణంబుల, నుచ్చైశ్శ్రవా
(ది)తురంగంబులఁ, గౌస్తుభాదిమణుల, నరుంధత్యాదిపతి
వ్రతల, రంభాద్యప్సరసల, నైమిశారణ్యాది పుణ్యారణ్యం
బుల, వారణాస్యాదిపట్టణంబుల, విశ్వేశ్వరాదిలింగంబులఁ,
బాంచజన్యాదిశంఖంబుల, సుదర్శనాది దివ్యాయుధంబుల,
వేదాదివిద్యలఁ, బద్మాదిపురాణంబుల, మన్వాదిస్మృతుల,
గాయత్ర్యాదిమంత్రంబుల, సనకాదియోగింద్రుల, నోంకా
రాదిబీజాక్షరంబుల, వ్రీహ్యాదిధాన్యంబుల, నారదాది
వైష్ణవుల, బాణాదిశివభక్తుల, బ్రహ్మాదిభాగవతుల, మహా
కాళాది ప్రమథులఁ, బద్మాదినిధుల, దధీచ్యాదివదాన్యుల,
హరిశ్చంద్రాది భూపతుల, జననీజనకులఁ, బితరుల, గురులను
సంస్మరించి యీయందఱు నాకు నాయురారోగ్యైశ్వర్యం
బులు ప్రసాదింతురుగాక యనుచుం బ్రార్థించి ప్రణమిల్లి
నిలిచి నిత్యనైమిత్తి కాద్యనుష్ఠానంబుల నిష్ఠాపరుం డయి
ద్విజుం డొనర్చునది. 191

సీ. వెడలి యూరికి నూఱువిండ్లదవ్వున నైఋత్య
దెస బహిష్కార్యంబు దీర్పవలయు
నన్నూఱువిండ్లమాన మగుదూరమ్మున
బయలి కేఁగుట పాడి పట్టనమునఁ
దల ముసుంగిడి తృణంబులు గప్పినధరిత్రి
విణ్మూత్రజలముల విడువవలయుఁ
జెవి బ్రహ్మసూత్రంబుఁ దవిలింపవలయును
విష్టాప్రవోత్సర్గవేళలందు
తే. దివసముఖసంధ్య లందుదగ్దిఙ్ముఖుండు
యామినులయందు శమనదిగాననుండు
నగుచు మౌనవ్రతంబున నవనిసురుఁడు
మలవిమోక్షంబుఁ గావించుఁ గలశజన్మ! 192

సీ. నిలుచుండి కాఁగాదు జలమధ్యమునఁ గాదు
కాదు దున్నిననేలఁ గాదు మందఁ
గాదు గోసన్నిధిఁ గా దగ్ని కెదురుగా
కా దగ్రజన్ములకట్టెదురను
గాదు సస్యంబులఁ గాదు రథ్యాభూమిఁ
గాదు కట్టెదురను గాదు గాలిఁ
గాదు తారాదినక్షత్రగ్రహంబులఁ
గనుఁగొంచు మలవిమోక్షం బొనర్ప
తే. శిశ్న మొకచేతఁ గబళించి చెదలు చీమ
లేక శర్కరి గాక వల్మీకజంబు
నెలుకకలుగును గాక మన్నెదుగఁబట్టి
యరుగునది శౌచ మొనరింప నవనిసురుఁడు. 193

తే. మునుకుఁ గడియఁగఁ దిగిచి నెమ్మొగము వాంచి
యంగుళీయుగకమున ముక్కుఁ గమిపట్టి
మలవిమోక్షణ మొనరించి తలఁగునపుడు
కనుఁగొనఁగఁ గా దమేధ్యంబు కలశజన్మ! 194

సీ. అయిదువారము లపానాభ్యంతరంబున
నొకమాఱు శిశ్నమస్తకమునందుఁ
బదిమాఱు లట సవ్యపాణిపల్లవమున
నిరుగేలులందును నేడుమాఱు
లంఘ్రిద్వయంబునయం దొక్కమాఱు త్రి
వారిఁ గ్రమ్మఱ హస్తవనరుహముల
నంతరాంతరములయందు నిశ్శబ్దంబు
గాఁ బ్రస్ఫుత్యంబు సంక్షాళనంబు

తే. గలుగునట్లుగ నామలకప్రమాణ
మృదులమృత్పిండఖండంబు ద్రేవి ద్రేవి
గంధలేశక్షయావధి గా నొనర్ప
వలయు శౌచంబు మది కెక్కఁ గలశజన్మ! 195

వ. ఇది గృహస్థశౌచంబు. దీనికి ద్విగుణంబు త్రిగుణంబు చతుర్గు
ణంబును బ్రహ్మచారివానప్రస్థయతులకు నియతంబై యుండు.

తే. పగటిశౌచంబులోన సాఁబాలు రేయి
రాత్రిశౌచంబులోన నర్ధము రుగార్తిఁ
జోరబాధాదిదుష్టకాంతారమార్గ
మునఁ దదర్ధంబు శౌచంబు మునివరేణ్య! 197

క. పురుషులశౌచములోనం
దరుణుల కర్ధంబు శౌచతంత్రంబు మునీ

శ్వర! నిష్కారణ మింతికిఁ
బురుషునకుం దగదు శౌచముం దడవంగన్. 198

తే. ధరణిధరమంతపాడవుమృద్రాశి నైన
నంబునిధియంతజల మైన ననఘచరిత
భావశౌచంబుఁ బోలదు బాహ్యశౌచ
మనిరి శౌచక్రియావేదు లయినమునులు. 199

తే. అగ్నిహోత్రాహుతులకుఁ జాంద్రాయణాన్న
పిండమునకును శౌచమృత్పిండములకుఁ
గలశసంభవ! యుసిరికకాయలంత
మాన మని చెప్పుదురు కర్మమర్మవిదులు. 200

వ. అనుష్ణంబులు నఫేనంబులు నబుద్బుదంబులు నక్షారంబులు నలవణంబులు నకలుషంబులు నదుర్గంధరసంబులు నయిన యుదకంబులు, నగక, నిలుచుండక, మాటలాడక, వెలిఁజూడక, నంగక, (తెలుఁకుండక,) వేగిరపడక, యజ్ఞోపవీతంబు విడువక, ప్రసారితపాదుండుగాక, బహిర్జానుండుగాక, చప్పుడుగాకుండ ముమ్మాఱు బ్రహ్మతీర్థంబున హృదయపర్యంతంబు డిగ్గ శుద్ధిబుద్ధ్యర్థంబు ప్రాశించునది. అనంతరంబ యంగుష్ఠమూలదేశంబున నినుమాఱు *గండస్థలంబున నిరియించిన యోష్ఠాధరంబులు ముమ్మాఱు స్పృశించి యనంతరంబ కుడిచేతం బుడిసిలించిన యుదకంబు వామహస్తసంపుటంబున నిలిచి దక్షిణవామపాదములయందు మూర్ధంబునందును బ్రోక్షించునది.*మఱియు ముమ్మాటికి వామహస్తోదకంబు స్పృశించుచు

---

* ఇది మూలాతిరిక్తవిరుద్ధముగా నున్నది. 'త్రిఃపీత్వాంబువిశుద్ధ్యర్థం తతఃఖాని విశోధయేత్, అంగుష్ఠమూలదేశేన ద్విర్ద్విరోష్ఠాధరౌ స్పృశేత్.' అని మూలము.

నంగుళీత్రయంబున న్యాసంబును, దర్జన్యంగుష్ఠంబుల నాసికారంధ్రంబులు, నంగుష్ఠానామికాగ్రంబులఁ జక్షుశ్శ్రోత్రంబులును, గనిష్ఠాంగుష్ఠయోగంబున నాభిరంధ్రంబును, హస్తతలంబున హృదయంబును, నంగుళ్యగ్రంబుల మస్తకోభయస్కంధంబుల ముట్టునది. కొంద ఱనుష్ఠానపరు లీచతుర్వింశత్యాచమనక్రియలందుఁ గేశవాదిచతుర్వింశతినామంబు లుచ్చరింతురు. అవి క్రమంబున నంభఃప్రాశనత్రయంబునఁ గేశవ నారాయణ మాధవనామంబులుఁ, గపోలమార్జనద్వయంబున గోవిందవిష్ణునామంబులు, నంతరాధరోష్ఠమార్జనత్రయంబున మధుసూదనత్రివిక్రమవామననామంబులు, వామహస్తోదకధారణంబున శ్రీధరనామంబును, దక్షిణవామపాదోదకప్రోక్షణంబున హృషీకేశపద్మనాభనామంబులును, శిరః ప్రోక్షణంబున దామోదరనామంబును, నంగుళీత్రయాస్యస్పర్శనంబున సంకర్షణనామంబును, దర్జన్యంగుష్ఠనాసారంధ్రద్వయస్పర్శనంబున వాసుదేవప్రద్యుమ్ననామంబులు, ననామికాంగుష్ఠచక్షుశ్శ్రోత్రస్పర్శచతుష్టయంబున ననిరుద్ధపురుషోత్తమాధోక్షజనారసింహనామంబులుఁ, గనిష్ఠాంగుష్ఠనాభీరంధ్రస్పర్శనంబుల నచ్యుతనామంబును, హస్తతలహృదయస్పర్శనంబున జనార్దననామంబును, గరాగ్రశిరస్స్పర్శనంబున నుపేంద్రనామంబును, నంగుళ్యగ్రస్కంధస్పర్శద్వయంబున హరికృష్ణనామంబు లుచ్చరింతురు. ఇది యాచమనప్రకారంబు. 201

తే. శుద్ధుఁ డగుహృద్గతముల భూసురుఁడు నీళ్ల
గళగముల భూమిపతి తాలుగముల వైశ్యుఁ

డాస్యగంబుల శూద్రుఁడు నోఁటఁదియును
నాచమనవేళయందు వింధ్యాద్రిదమన! 202

తే. ముక్తకేశుండు సంవృతమూర్ధగళుఁడు
గాక సంక్షాళితాంఘ్రి యై క్ష్మాసురుండు
విమలజలముల నాచాంతవిధి యొనర్ప
నర్హమగు వింధ్యశైలదర్పాపహారి! 203

ఉ. తుమ్మినయప్పుడుం బురముత్రోవఁ జరియించినయప్పు వారిపా
న మ్మొనరించినప్పు డశనంబు భుజియించినయప్పు నవ్యవ
స్త్రమ్ము ధరియించినప్పు దురితంబులు చూచినయప్పు పుణ్యకా
ర్యమ్ములయప్పు హేయములనంటినయప్పుడు వార్వఁగాఁదగున్.

సీ. చిటికెనవ్రేలియంతటి పరిణాహంబు
పదివేళ్ళనిడుపును బదను కలిగి
తోల్లి తోఁట లేక తోమంగ నను వైన
తరుకాష్ఠమున దంతధావనంబు
వదనసంశుద్ధికై వలయుఁ గావింపంగఁ
బ్రతిపద్దినంబును బర్వతిథియు
షష్ఠియు నవమియు సవితృవాసరమును
బరిహార్యములు కాష్ఠభక్షణమున

తే. కర్హదివసంబు లేక యనర్హవేళఁ
బండ్లు దోమంగ వలసెనేఁ బదియు రెండు
సలిలగండూషములు సేయ సంవిశుద్ధి
గలుగు వక్త్రంబునకు బ్రహ్మకర్మనిరత! 205

తేఁ దంతధావనపూర్వంబు తాన మాడి
ప్రాతరారంభవేళల బ్రాహ్మణుండు

సంధ్యవార్వంగ వలయు నిచ్చలును నిష్ఠ
నర్ఘ్యశ్రీ మీఁదగు నర్కోదయంబునపుడ. 206

సీ. సౌభాగ్యమేధాప్రసాదసంపన్మహో
త్సాహోదయములకు జన్మభూమి
నవరంధ్రములయందు స్రవియించురోఁతచే
శుచి గాని మేనికి శుద్ధికరము
తేజంబు గల్పింప దీర్ఘాయు వొనరింపఁ
జాలు వాసరముఖస్నాన మనఘ!
యరుణోదయమున మూర్ధాభిషేక మొనర్చి
తగును జేయఁగ మంత్రతంత్రవిధులు

తే. స్నానమున కంగకములు మృత్సంచయంబు
నక్షతంబులు దిలలు దర్భాంకురములు
గోమయంబును బావమానీముఖంబు
లైనబుజ్మంత్రములును వింధ్యాద్రిదమన! 207

వ. విశుద్ధం బైన మృత్పిండంబుశుచిప్రదేశంబునం బెట్టి యుదఙ్ముఖుండును బద్ధబ్రహ్మశిఖుండును నై యద్దేవతాకంబు లైన మంత్రంబు లుచ్చరించుచు సలిలావగాహనంబు చేసి. 208

క. నేమం బొప్పఁగఁ బ్రాణా
యామం బొనరించునది జలాంతరమున లో
పాముద్రాధిప! ప్రాణా
యామంబు శ్రుతిప్రసూతయజనం బనఘా. 209

తే. మొదలి తుదియోంకృతులతోడ మూర్ధ మగుచు
వ్యాహృతులు మూఁటి నాల్గింటి నధిగమించి

మంత్రరాజంబు గాయత్రి మహిమ నొప్పఁ
గడుపు చల్లంగ శ్రుతివిద్యఁ గన్నతల్లి. 210

వ. గాయత్రి త్రివారజపంబు ప్రాణాయామంబు, గాయత్రి దశవారజపంబు తపంబు. జలాంతరమున గాయత్రీ త్రివారజపం బొండె [1]విష్ణుసంస్మరణం బొండెఁ జేయునది. స్నానానంతరంబ కారుణ్యపితృప్రీతికరంబు వస్త్రనిష్పీడనం బొనర్చునది. ఇది స్నానవిధానంబు. 211

క. ధౌతపరిధానపరుఁడై
ప్రాతస్సంధ్యను భజించి బ్రాహ్మణుఁడు కుశా
న్వీతకరాంగుళియై ఖ
ద్యోతనునకు నర్ఘ్య మిచ్చు నుదయింపంగన్. 212

వ. అనంతరంబ గాయత్రీజపం బాచరించునది. 213

తే. పగలు నిలుచుండి జపియించు నిగమమాత
మాపు గూర్చుండి జపియించు మహితభక్తి
బ్రాహ్మణుఁడు సంధ్యవార్వనిబ్రాహ్మణుండు
గసతక్కువశూద్రుండు కేవలంబు. 214

వ. ఈప్రకారంబునన మధ్యాహ్నకాలంబునను బ్రహ్మవిష్ణుమహేశ్వరుల నింద్రాది దిక్పాలకుల మరీచ్యాదిమహర్షుల మన్వాదిమనువుల సలిలతర్పణంబులం దృప్తిం బొందించునది. చందనాగరుకర్పూరగంధోన్మిశ్రితం బులగుజలంబులు తర్పణార్హంబులు. దైవం బార్షంబు బ్రాహ్మంబు పైతృకం బనుతీర్థకంబుల దేవాదితర్పణంబులు నాచరించునది. 215

---

[1] ప్రణవత్రివారజపంబొండె.

సీ. ఛందంబు త్రిష్టుపు చంద్రికాచ్ఛచ్ఛాయ
యభిరామ మభినవయౌవనంబు
రుద్రుండు దేవత భద్ర మాకారంబు
కశ్యపుండు మహర్షి గన్ను నాసలు
నాపాదమస్తకం బఖిలాంగకంబులు
నధ్వర్యుశాఖాక్షు రాత్మకంబు
లాంబోతు వాహనం బవతంసకుసుమంబు
తరుణనిర్మలసుధాధామ రేఖ
తే. తరణిబింబంబు గగనసౌధంబుమీఁదఁ
బసిఁడికుంభంబుచందంబు పరిఢవింపఁ
గానవచ్చినమధ్యాహ్న కాలసంధ్య
యందు సావిత్రి కఖిల విద్యాసనాథ. 216
తే. పచనపావకుఁ బ్రజ్వలింపంగఁ జేసి
వైశ్వదేవం బొనర్పంగ వలయు నిష్ఠ
జణక కోద్రవమాషనిష్పావకములు
తైలలవణంబులును గావు తద్విధులకు. 217
తే. అగ్నికార్యం బొనర్చి యనంతరంబ
హంతకారంబు నిష్ఠఁ జేయంగ వలయు
హంతకారం బొనర్ప బ్రహ్మాదు లైన
త్రిదశముఖ్యులు తృప్తి బొందుదురు సూవె! 218
తే. హంతకారం బనంగఁ బదాఱుగళ్లు
కలశభవ! నాల్గుగళ్లు పుష్కల మనంగ
గ్రాసమాత్రంబు భిక్ష యక్షయ్య మండ్రు
ధాత్రిబృందారక! తదన్నదానఫలము. 219

క. బలిహరణము సేయఁగఁ దగుఁ
గలశీసుత! వైశ్వదేవకర్మాంతమునన్
నిలయబహిర్భాగంబున
జలధారాసంయుతముగ శ్రద్ధాపరతన్. 220

సీ. కైసేసి యంబువైక్లబ్యంబు నొందక
యుచితపీఠిక సంప్రుష్యు లుర్వి మోపి
యొండేని ప్రాఙ్ముఖం బొండె నుదఙ్ముఖం
బగుచుఁ గూర్చుండి సాజ్యాభిఘార
మభ్యుక్షణమగు విశుద్ధాన్న మాపోశన
పూర్వంబుగాఁ బ్రాణమును నపాన
మును నాది యగుధాతువుల కైదిటికిఁ దృప్తి
యావహిల్లంగ స్వాహాంతములను

తే. బంచవాయునామంబులఁ బరమనిష్ఠ
వేల్చు విప్రుఁడు దర్భలు వ్రేలఁ బూని
యశనకబళాహుతులు జఠరాగ్నియందు
గుణము నగుణంబు నెన్నఁడు గుడుచునపుడు. 221

తే. కడుపులోఁ గాలి కొకకొంత యెడము విడిచి
యన్నపానీయములఁ దృప్తి యావహిల్ల
నవని నిర్జరుఁ డనుపాన మాచరించుఁ
దక్ర మైనను శీతలోదకము నైనఁ. 222

తే. ధరణి నిర్జరుఁ డమృతాభిధానశబ్ద
పూర్వమంత్రంబు సముచితంబుగఁ బఠించి
సగము ప్రాశించి యుదకంబు సగము భూమి
విడువవలయును హస్తంబు గడిగికొనక. 223

వ. అప్రక్షాళితదక్షిణహస్తాంగుష్ఠమూలంబున నిష్ఠ్యూతం బైన యాసలిలం బపుణ్యనిలయం బైనరౌరవంబునం బద్ధార్బుద నివాసు లైన పితరులకుం దృప్తినావహించు. చేతులకు వార్చి యాచమనంబు సేసి శుచి యై కర్కరీసలిలంబు వలకాలిపెను వ్రేలి మోపి ధార లెత్తునది. అద్ధార యయ్యంగుష్ఠంబు నాశ్రయించిన యంగుష్ఠమాత్రుం డగు పురుషుం బరితోషింపం జేయు. అనంతరంబు బొడ్డు నివురుకొనుచుం బ్రాణాపానసమానోదానవ్యానంబులు సంతుష్టిం బొంది నాకు నానందం బొసంగుం గాత మని యాశీర్వదించుకొనునది. తాంబూలచర్వణంబులం బుణ్యకథాశ్రవణంబులం బ్రొద్దు పుచ్చునది. 224

తే. వర్ణములలోన బ్రాహ్మణవర్ణ మెక్కు
డాశ్రమంబులలోన గార్హస్థ్య మధిక
మనఘ! లక్షణవతి యైన యాలు సూవె!
తగినయవలంబనంబు తద్ధర్మమునకు. 225

స్త్రీలక్షణనిరూపణము

వ. పాదతలంబులు రేఖ లంగుష్ఠాంగుళినఖంబులు మీఁగాళ్ళు గుల్భంబులు పిక్కలు జంఘలు రోమంబులు జాను లూరులు కటి నితంబంబు జఘనంబు భగంబు వస్తి నాభి కుక్షి పార్శ్వంబు మధ్యంబు వళులు రోమావళి హృదయంబు వక్షోజద్వయంబు చూచుకంబులు జత్రుస్కంధకక్షమణిబంధద్వయంబు మీఁజేతు లరచేతులు కృకాటిక కంఠంబు చిబుకంబు హనువులు కపాలంబులు వక్త్రం బుత్తరోష్ఠాధరోష్ఠంబులు జిహ్వ తాలువులు హసితంబు నాసిక కన్నులు

పక్ష్మంబు భ్రూశ్రీకర్ణ లలాటశిరోరుహంబు లను నఱువదియాఱుం
గంబులు లక్షణాన్వితంబులు గావలయు. అట్టిలక్షణవతియైన
భార్య గృహలక్ష్మి అట్టి గృహిణీకలితంబునం గదా గృహస్థుం
డిహపరసౌఖ్యంబులకు భాజనం బగు నని చెప్పి కుమార
స్వామి కుంభసంభవున కిట్లనియె. 226

తే. ఇన్ని పాటులఁ బడఁగ లే దిల్వలారి!
వర్ణాశ్రమస్థుల కలఘుమతుల
కూర్ధ్వలోకంబు ముక్కున నూర్పుగాలి
యుడిగినప్పుడె కాశియం దొదవు ముక్తి. 227

వ. అని సదాచారవర్ణనం బొనర్చి కుమారుం డింక నేమి యడి
గెద (వ)దుగు మనినఁ గుంభసంభవుండు జ్ఞానకారణంబు
లెయ్యవి? యని యడిగినం గుమారుండు. 228

యోగనిరూపణము

తే. అఖిలవేదానువచనంబు యజ్ఞపరత
బ్రహ్మచర్యైకనిష్ఠ తపంబు దమము
శ్రద్ధ యుపవాస మపరతంత్రత శమంబు
కలశసంభవ! విజ్ఞానకారణములు. 229

తే. ధర్మనిర్మలహృదయ! శ్రోతవ్య మాత్మ
తారక బ్రహ్మనిష్ఠ! మంతవ్య మాత్మ
సర్వశాస్త్రప్రవీణ! ద్రష్టవ్య మాత్మ
దంభరహిత! నిదిధ్యాసితవ్య మాత్మ. 230

వ. ఆత్మావలోకంబునకు యోగాభ్యాసంబు పరమసాధనంబు.

సీ. కుంభినీధరగుహాక్రోడాటవీనికుంజ
గర్భవాసము గాదు కారణంబు

గ్రంథతాత్పర్యపర్యాలోచనక్రియా
కర్మతంత్రము గాదు కారణంబు
దానంబు వ్రతము నధ్వరము లోనుగఁ గల్గు
కర్మకాండముగాదు కారణంబు
నాసాగ్రసంవీక్షణంబు నాసాబంధ
కల్పనంబును గాదు కారణంబు

తే. మౌనమును శౌచమును యంత్రమంత్రములును
గావు కారణములు యోగకలనమునకు
నిశ్చయంబును నభియోగనిశ్చలతయుఁ
గడఁకయును నప్పవము గాని కలశజన్మ! 232

తే. ఆత్మఁ దర్పించి యెఱుఁగఁ డన్యంబు నెవ్వఁ
డాత్మసంతుష్టుఁ డెవ్వఁ డహర్నిశంబు
నాత్మ నాత్మనె కను నెవ్వఁ డాత్మమిథునుఁ
డెవ్వఁ డాతండు యోగలక్ష్మీశ్వరుండు. 233

వ. కొంద ఱాత్మమనస్సమాయోగంబ యోగం బండ్రు. కొంద
ఱు ప్రాణాపానసమాయోగంబ యోగంబండ్రు. కొందఱు
విషయేంద్రియసమాయోగంబ యోగం బండ్రు. కొందఱు
పరమాత్మక్షేత్రజ్ఞసమాయోగంబ యోగం బండ్రు. యమ
నియ మాసనప్రాణాయామప్రత్యాహారధ్యానధారణాసమా
ధులుం గొంద ఱెనిమిదియోగాంగంబు లండ్రు. నామతం
బాసనప్రాణాయామప్రత్యాహారధ్యాన ధారణాసమాధులా
ఱంగంబులు. అందుఁ బ్రథమాంగం బైనయాసనంబు స్వస్తి
కాసనంబు, గోముఖాసనంబు, పద్మాసనంబు, వీరాసనంబు,
సింహాసనంబు, భద్రాసనంబు, ముక్తాసనంబు, మయూరాస

నంబు, సుఖాసనం బన బహుభేదంబులం గలిగియుండు. ఇం దొక్కయాసనంబున నాసీనుండై యోగి యోగం బభ్యసించునది. దంశమశకాకీర్ణంబు గాక, కేశభస్మాంగారకీకసాది ప్రదూషితంబు గాక, జనసంకులంబు గాక, సర్వబాధావిరహితంబై సర్వేంద్రియ సుఖావహంబై మనఃప్రసాదజననంబై కుసుమస్రగ్వాసనాధూపధూమమేదురంబైన ప్రదేశంబున నతితృప్తుండును, నతిక్షుధార్తుండును, విణ్మూత్రబాధితుండును, జింతాకులుండును గాక, నిమీలితాక్షుండై దంతంబులు దంతంబులం గూర్పక యింద్రియగ్రామంబు నియమించి ప్రాణాయామాఃసంబున కుపక్రమించునది. 234

తే. యోగి యొయ్యొయ్యయ్య మరగించి యునుపవలయుఁ
గుటిగోళంబులో గాలి కుంభకమున
బలిమి నిలిపిన రోమకూపముల వెడలి
యది ప్రకల్పించుఁ గుష్ఠాదు లైనరుజల. 235

ఉ. ఎంతయు ఘోరమైన విపినేభము మెల్లన మస్తరించి మా
వంతుఁడు కంఠపీఠి గుఱి వైచి సుఖంబున నెక్కినట్టు ల
శ్రాంతము యోగసాధకుఁడు ప్రాణసమీరణముల్ నిసర్గదు
ర్దాంతము మ(కు)స్తరించి యవధానము మైధరియింపఁగాఁదగున్.

తే. కడఁగి సవ్యాపసవ్యమార్గముల వెలికి
యాన మొనరించుఁ గావునఁ బ్రాణ మొయ్యఁ
జంద్రనాడికిఁ బూరించి సాధకుండు
భానునాడిక విడుచుఁ బ్రాణానిలంబు. 237

సీ. నలినాదినానాసనంబులయందును
గ్రమము మై దేహదార్ఢ్యము వహించుఁ

ప్రాణానిలాయామపరిపాటివిదళించు
నందంద కలుషసంహతుల నెల్లఁ
బ్రత్యాహృతిక్రియాపాటవంబునఁ జేసి
పావనత్వంబు చేపట్టు మేన
ధారణావిధిధురంధరతాబలంబునఁ
జర మైనచిత్తంబు దిరము సేయు
తే. ధ్యానమున నీశుఁ జూచి సమాధియుక్తి
గర్వనిర్మూలనక్రియాకర్మ శూర
మైన మోక్షంబుఁ గాంచు వింధ్యాద్రిదమన!
[1]సాధకుని కిది యోగాంగషట్క ఫలము. 238
తే. దహని యన భ్రామణి యనంగ స్తంభని యన
శమని యనఁ బ్లావని యనంగ సంయమీంద్ర!
ప్రాణపవమానధారణ లైదు గలుగఁ
జెప్పుదురు యోగసిద్ధాంతసిద్ధమతులు. 239
ఆ. ఉడ్డియానముద్రయును మహాముద్రయు
మూలబంధగగనముద్రికలును
సారతరవివేక! జాలంధరంబును
ననఁగ యోగముద్ర లైదు సుమ్ము. 240
వ. నాడీశోధనంబునకుం జంద్రసూర్యసంఘటనంబునకు రసపోష
ణంబునకు మహాముద్రక పాలకుహరంబున జిహ్వాప్రవే
శంబు సేసి బ్రహ్మరంధ్రధ్రువేందుమండలసుధాధారానిష్యంద
(న)ంబాస్వాదించుటకు నభోముద్ర; అదియ ఖేచరీముద్రయు.
ఉడ్డీనం బగుమహాఃఖగంబు నహోరాత్రంబు నిలుపుటకు నుడ్డీ

1 కాదు సాధకుఁ డష్టాంగ కర్మఫలము.

యానముద్ర నాడీజాలంబుధరించుటకు జాలంధరంబు. అపానమూలంబు బంధించుటకు మూలబంధంబు. ఈమూఁడుముద్రాబంధంబులు సమాధినిష్ఠాకారణంబులు; [1]బిందుస్థిరీకరణకారణంబులు, గంధవహాధారణాధురంధరంబులు. 241

తే. ఊర్ధ్వమున నున్న ప్రాణంబు నొడిచి తివుచుఁ
గ్రింద నున్నయపానంబు గిట్టి పట్టి
యూర్ధ్వమున నున్న ప్రాణంబు నొడిచి తివుచుఁ
గ్రింద నున్నయపానంబు గిట్టి పట్టి. 242

క. మానక జీవుఁడు ప్రాణా
పానంబులచేతఁ దివియఁబడు వెలుపలికిన్
లోనికి నెక్కుచు డిగ్గుచుఁ
జౌనగపున్యమునఁ బడనిపాటులఁ బడుచున్. 243

వ. హంకారంబున బహిర్గమనంబును సకారంబున నంతర్గమనంబును జేయుచు హంసహంస యనుప్రణవాక్షరమూలభూతంబగునజపామంత్రంబున దివారాత్రంబు లిరువదియొక్కవేయునార్నూఱువారంబు లుచ్ఛ్వాసనిశ్శ్వాసరూపంబున జీవుండు జపించు. అమ్మహామంత్రంబు సంకల్పమాత్రంబున.

సీ. విను దూరవార్తలు వీక్షించు దవ్వుగా
నడుచును శతయోజనములు గదియ
సశ్రుతం బగుశాస్త్రమైన వక్కాణించు
గౌరవం బొందు లాఘవముఁ జెందుఁ
బరకాయములఁ జొచ్చుఁ బక్షికీటమృగాది
బహుజీవజాతులభాష లెఱుఁగు

---

1. కుష్ఠక్షయాపస్మారాదిరోగోపద్రవవిద్రావణంబులు.

దివ్యగంధంబును దివ్యతేజము దివ్య
  కర్మంబులును దివ్యకళయుఁ దాల్చు
తే. మోక్షనగరిమహాద్వారముఖకవాట
విఘటనాలోహకుంచికావిభ్రమమున
నుల్లసిలుచుండును షడంగయోగవిద్య
నభ్యసించినసాధకుం డద్రిదమన! 245

వ. ఇది యాభ్యంతరం బైనముద్రాసహితషడంగయోగంబు. ఇంక బాహ్యం బైనషడంగయోగంబు వివరించెద. 246

తే. విశ్వభర్త విశాలాక్షి విబుధగంగ
దండపాణి చమూనాయకుండు డుంఠి
కాలభైరవదేవుండు కలశజన్మ!
కాశినగరి షడంగయోగమున నెఱుఁగు. 247

తే. విశ్వనాయక దేవ త్రివిష్టపేశ
వీరకేదారనాయకోంకారకృత్తి
వాసు లిల్వలదైత్యవిధ్వంస! మఱియుఁ
గాశినగరి షడంగయోగముగ నెఱుఁగు. 248

సీ. వారాణసీపురవాటిసంచారంబు
  ఖేచరీముద్ర యక్లిష్టచరిత!
వేగమై యానందవిపినంబునకు రాక
  భద్ర! యుడ్డీయానబంధముద్ర
కాశికానికటగంగావాహినీవారిఁ
  దల ధరించుట జలంధరము ఘటజ!
శివరాజధానిఁ జేసినసద్వ్రతంబులు
  మూలబంధంబు సన్మునివరేణ్య!

తే. నహుషదమన! మహాశ్మశానంబుమీఁద
భక్తిముద్ర మహాముద్ర పరమయోగ
విద్యను షడంగముద్రికాన్వితము గాఁగ
నీకుఁ జెప్పితి దృఢముగా నిలుపు మాత్మ. 249

వ. అనిన నగస్త్యుండు. 250

క. ఆయురవసానకాలం
బేయనువునఁ దెలియవచ్చు నెఱిఁగింపుము గాం
గేయ! యరిష్టాగమనము
లేయవశకునములు చూచి యెఱుఁగంగఁ దగున్. 251

వ. అనిన గుమారుం డతని కిట్లనియె. 252

కాలజ్ఞానకథనము

తే. వామనాసాపుటమున నెవ్వానికి నొగి
గాలి యుచ్ఛ్వాసనిశ్శ్వాసగతిఁ జరించుఁ
బింగళానాడి నడువదు పెద్దయేని
వాఁడు మూఁడబ్దములకు నిర్వాణ మొందు. 253

తే. ఒండె మూఁడహోరాత్రంబు లొండె నేని
రెండహోరాత్రములు సంచరించు హేళి
నరుని కెవ్వని కొక్కవత్సరముగాని
బ్రతుకఁ డండ్రు సుధర్మిణీప్రాణనాథ! 254

క. నాసాపుటయుగమున ని
శ్శ్వాసోచ్ఛ్వాసానిలములు సరిగ్గై నడుచుఁగ
వాసరము లెవ్వనికిఁ బది
మాసత్రితయమున వాఁడు మరణముఁ బొందున్. 255

క. ప్రాణానిల మెవ్వనికిని
ఘ్రాణపుటీయుగ్మకమునఁ బ్రవహింపక సం
క్షీణంబై నోర వెడలుఁ
బ్రాణ మతఁడు దొలఁగు వాసరత్రితయమునన్. 256

తే. అదరిపా టెవ్వఁ డీక్షించు నాకసమున
హారికపుఁ గృష్ణపింగళుం డైనపురుషు
నాతనికి వత్సరద్వయం బవధి సూవె!
ప్రాణధారణమున కిల్వలాసురారి! [మూ

ఉ. తుమ్మును సింద్రియంబు నిజతోయమలంబులునొండెనొండె
త్రమ్ము మలమ్ముఁ దుమ్ము బలదార్ఢ్యము చాలక యెవ్వఁడేనినొ
క్కుమ్మడినుత్సృజించునతఁడుండఁడుప్రాణముతోడఁగూడియే
కమ్మగువత్సరమ్ము గడ గాంచిన పిమ్మట వాసరార్ధమున్. 258

ఉ. కానఁ డరుంధతిన్ ధ్రువునిఁ గానఁడు విష్ణుపదత్రయంబునుం
గానఁడు మాతృమండలముఁ గానఁడు కన్నులుగల్గియుండనే
మానవుఁ డమ్మనుష్యునకుమాసములాఱువిరామ మొందఁగాఁ
గానఁగ వచ్చుఁ గుంభభవ! కాలునిబంధురసౌధవీథికల్. 259

తే. దృఢవివేక! యరుంధతీదేవి జిహ్వ
నాసికాగ్రంబు ధ్రువుఁ డిల్వలాసురారి!
విష్ణుపద మది భ్రూమధ్యవీథి యనఘ!
మాతృమండల మక్షిపక్ష్మము మునీంద్ర! 260

సీ. అసితాదివర్ణంబు నామ్లాదిరసమును
నన్యథాభావంబు నందెనేని

---

1 ంబునధికమ్మట మీఁదట.

దంతోష్ఠకంధరాతాలుజిహ్వాగ్రంబు
లారొక్తవర్ణంబు నందెనేనిఁ
గరజేంద్రియంబులు కనుదోయికొలుకులు
ధూమధూమ్రత్వంబు దొరసె నేని
నాఖండలీయకం బగుధనుఃఖండంబు
సభమున న్నెరయఁ గన్పట్టె నేని
తే. నాలుమాసములకు మర్త్యుఁ డస్తమించు
వేగ యేతెంచి యూసరవెల్లి తొండ
పాదములనుండి తలదాఁకఁ బ్రాఁకె నేని
యతఁడు షణ్మాసములఁ జూచు యమునిపురము. 261
తే. జలక మాడినపిమ్మటఁ జరణములను
హృదయమున నీళ్లు వేగంబ యివురువారు
దర్పణమునీడ తోఁచు నాత్మ కాంతి
నెవ్వనికి వాఁడు నార్నెల్ల కేగు దివికి. 262
వ. మఱి ఛాయాప్రకంపంబు, మతిభ్రంశంబు, చంద్రద్వయ సూర్యద్వయదర్శనంబు, పగలు తారకావీక్షణంబు, రాత్రి తారకానభివీక్షణంబు, గంధర్వనగరావలోకనంబు, పిశాచ నృత్తవీక్షణంబును, శ్రవణధ్వనిహాని, స్వప్నంబునందుఁ బిశాచఖరవాయసభూతప్రేతశునక గృధ్రగోమాయుబాధ, పాంసురాశియూపదండవల్మీకాధిరోహంబుఁ, దైలాభ్యంజన ముండనంబులు మరణసూచకంబులు. 263
క. ఈదుర్నిమిత్తములతో
నేదైనను నొకటి గాంచి యెదలోనఁ గడుఁ

1. ఘ్రాణ, లాఅొక్త.

నిది కాశికాఖండ మిమ్మహాఖండంబు
శ్రీమహాస్కాందవార్ధికి నమృతము
పఠియించినను దీనిఁ బ్రతిలిఖించిన విన్న
దానంబు చేసిన దారులోహ
పాషాణపీఠికోపరిభాగమున నిల్పి
గంధపుష్పముల నక్షతలఁ బూజ
తే. సేసినను గాశికాభర్త శివుఁడు విశ్వ
నాయకుఁడు లక్ష్మి యిచ్చు దీర్ఘాయు వొసఁగుఁ
బ్రాభవంబుఁ బ్రసాదించు భక్తతతికి
శ్రీవిశాలాక్షి కృప సేయుఁ జింతితములు. 264

ఆశ్వాసాంతము

శా. కర్ణాటక్షితిపాలమౌక్తికసభాగారాంతరాకల్పిత
స్వర్ణస్నానగతిప్రసిద్ధకవిరాట్సంస్తుత్యచారిత్ర! దు
గ్ధార్ణోరాశిగభీర! ప్రాఙ్ముఖమధ్యాహ్నపరాహ్ణార్చితా
పర్ణావల్లభ! రాజశేఖరమణీ! పంటాన్వయగ్రామణీ! 265
క. హేమాద్రిధీర! ద్రాక్షా
రామశ్రీభీమశంకరకృపాలక్ష్మీ
సామగ్రీపరివర్ధిత
భూమాసామ్రాజ్య విభవ! పుణ్యశ్లోకా! 266
మాలిని. వికచకములనేత్రా! నేమమాంబాసుపుత్రా!
సకలనృపశరణ్యా! సంభృతాశేషపుణ్యా!
మకరనిధిగభీరా! మానినీచిత్తచోరా!
ప్రకటగుణతరంగా! రాయవేశ్యాభుజంగా! 267

గద్యము. ఇది శ్రీమత్కమలనాభపౌత్త్ర మారయామాత్య పుత్త్ర సుకవిజనవిధేయ కవిసార్వభౌమ శ్రీనాథనామధేయ ప్రణీతంబైన కాశీఖండంబునందు సప్తమాశ్వాసము సర్వము సంపూర్ణము.

చ. వరకవిసత్ప్రబంధములు బాలిశసంస్కృతి దుర్విదగ్ధతం
బొరసిపొకాలసంస్కరణముంబొనరించుటదుష్కరంబ; య
చ్చరిత మెఱింగియుం బరమసాహసరీతిఁ బొనర్చితిం బరి
ష్కరణము నెద్దియే నెరసుగల్గిన సూరులు దెల్పుఁడీ దయన్.

క. నలపుష్యకృష్ణదశమిఁ
లలిఁ గాశీఖండకృతి సలక్షణముగ ను
త్పల వేంకటనరసింహా
ర్యులు సంస్కరణంబొనర్చి రుద్దీప్తము గాన్.

'శ్రీరామాప్రెస్సున' ముద్రితము.—1958.

ఖేదము నొందక నరుఁడు ప్ర
మోదమ్మునఁ గాశికాపురమున కేగఁ దగున్. 264

వ. అని చెప్పిన మహాత్మా! యీ ప్రపంచంబు నిర్వికల్పంబు నిరా
కారంబు నిరస్తసమస్తోపాధికంబు. నిత్యంబు నగుపరబ్రహ్మం
బె క్షేత్రంబును నాశ్రయించియుండు, నే క్షేత్రంబునంద
లలాటనేత్రుండు తారకబ్రహ్మవిద్యావర్ణకర్ణేజపుండై కీట
పతంగక్రిమిసరీసృపాదు లగునానావిధజంతువులకుం బ్రా
ణాంతకాలంబున నభయం బొసంగు, నే క్షేత్రంబునకు
నుత్తరవాహిని యనవియత్తటిని యుపకంఠంబునం గంఠ
ముక్తాకలాపంబునుం బోలెఁ బ్రవహించు, నే క్షేత్రంబున
కభ్యర్ణంబున మణికర్ణికాతీర్థంబు తీర్థరాజంబు రజనీకరకిరణ
సందోహదానదీక్షాధురంధరవినిర్మలకబంధకల్లోల మాలికా
స్ఫాలితమహాదేవదివ్యలింగశతసహస్రలక్షకోట్యర్బుదన్యర్బు
దంబై మహోత్కర్షంబుఁ గాంచె, నట్టియవిముక్తక్షేత్రంబు
మహిమ యింకను వినవలతు నానతి మ్మని ప్రార్థించినం
గరుణాపరతంత్రుండై శిఖివాహనుం డతని కిట్లనియె. 265

దివోదాసవర్ణనము

తే. బ్రాహ్మణోత్తమ! బ్రహ్మకల్పంబునందు
మనువు స్వాయంభువునికాలమున ధరిత్రి
యఱువదేండ్లనావృష్టి యైనకతనఁ
దారి నందూరి కడునుపద్రవమునొందె. 266

సీ. అంభోధితీరంబు లద్రికాననములు
నాశ్రయించిరి వేద లగుచు మనుజు

లంగళ్లయందు మిట్టాడ మానిసి లేక
గుడియుఁ బాడును జిక్కఁ జెడియె నూళ్లు
లుద్యానములు వాపికోదకంబులు లేక
వృక్షవాటంబులు వెరలు వోయె
వ్యాఘ్రాదు లైన క్రవ్యాదహింస్రమృగంబు
లెచ్చోటఁ జూచిన నేఁపు మిగిలె

తే. సంతతము దాను సృజియించు జంతుకోటి
కఱవుపా ల్పడి మోమును కాళ్లు వాఁచి
వండఁగాఁ దిన్న బూరెలవరుస నడఁగ
భ్రమసి దిట దప్పి నివ్వెఱపడియె ధాత. 267

తే. రాజు లేనికతంబున రాష్ట్రములకు
నన్నిటికి బాధగా ధరిత్ర్యంతరమున
వ్రాలె నలువదియేఁడు లవగ్రహంబు
కాచె వెలిపుచ్చ నొకభంగి గాక యుండ. 268

వ. అప్పుడు చింతాక్రాంతుం డై జగద్యోని ప్రజాక్షయంబున యజ్ఞాదిక్రియ లుచ్చాటనం బయ్యె, సవనాదిక్రియానాశనంబును నధ్వరభుజులు భూప్రజలఁ బోలె హవిర్భాగాద్యభావంబున బుభుక్షాక్షోభంబు వహించిరి. ఇంక నేమి సేయుదు? ఒక్కనిం బట్టంబుగట్టనినాఁడు సర్వసర్వంసహామండలంబును నాఖండలుండు వర్షింపకుండుటం జేసి యెండి బెండువడిపోవుచున్నయది. నిఖిలక్షోణీచక్రరక్షణైకదీక్షాధురంధరుం డైన యంతటివాఁ డెక్కడఁ గల్గునొకో? యని యన్వేషించి మనుజవంశంబున రిపుంజయుం డనువాని

నౌదార్యశౌర్యధైర్యాదిగుణగరిష్ఠుం గాంచి సబహుమానం
బుగా నతని కిట్లనియె. 269

సీ. మనువంశమకుటమండన! యోరిపుంజయ!
ధర యేలు లవణాబ్ధి గరుసు గాఁగ
మత్ప్రసాదమున సామర్థ్యం బతీంద్రంబు
కలకాలమును నీకుఁ గలుగఁ గలదు
బ్రహ్మర్షిముఖస్నేహపరివృత్తితో దివో
దాసాఖ్యవిఖ్యాతిఁ దాల్తు వీవు
వాసుకితనయ విలాసినీరత్న మ
నంగ మోహిని భార్య యగును నీకు
తే. ననిన నంజలి చేసి మహాప్రసాద
మనుచుఁ బరమేష్ఠియానతి నాదరించి
యిట్టు లని విన్నవించె ధాత్రీశ్వరుండు
పద్మభవునకు గంభీరభాషణముల. 270

ఉ. నెట్టన నన్ను సత్కరుణ నీరధివేష్టిత యైనధాత్రి కిం
బట్టము గట్టెదేని నొకబాస పితామహా! యాత్మ నెగ్గుగాఁ
బట్టక విష్ణు భోగులు సుపర్వులు క్రిందట మీఁద నుండఁగాఁ
నొట్టువుసత్యమా ధరణి నొక్కరుఁ డున్ననుఁ జేయ రాజ్యమున్.

వ. అనిన నట్ల యగుం గాక యని బ్రహ్మ కాశీనగరంబునకేగి విశ్వ
నాథునకుఁ దెఱం గెఱింగించి తదనుమతివడసి దివోదాసునకుం
బట్టాభిషేకంబు సేసి సత్యలోకంబునకుం జనియె నయ్యవసరం
బున. 272

శా. చాటించెన్ మనువంశవర్ధనుఁడు విశ్వక్షోణి నందంద ఘుం
టాటంకారము దుందుభిధ్వనియుఁ గూడ న్వేగమై దేవతా

కోటుల్ మేదిని నున్నఁ దప్పఁగుఁ జూఁడో కోపంబు పాపం బుపా
త్తాటోపంబు మెయిం గుటుంబసహితంబై చేరుఁడో నాకమున్.

క. పాతాళమునకుఁ జనరో
వాతాశను లెచటికేని వలసినయెడకున్
భూతము లేగరో! యని య
త్యాతతగతి జాటి రవని నధిపతిదూతల్. 274

ఈశ్వరుండు నిఖిలదేవతలం గూడి మందరాద్రి కేగుట

వ. ఇవ్విధంబున దివోదాసదాసులు కాశీశ్రీశైలకుంభకోణ
శోణాద్రిపుండరీకపురపాండురంగమహాకాళకాళహస్తి కాంచీ
వేంకట శ్రీరంగవల్మీకరామేశ్వరాదిదివ్యస్థానంబుల ఘంటా
పథంబుల ఘంటాడిండిమధ్వానులతోడం గూడం జాటిన బ్రహ్మ
దత్తవరానుభావంబునం గుటుంబసహితంబు త్ర్యంబకపీతాం
బరహేరంబభైరవదుర్గావీరభద్రప్రథానులగు నిర్జరులు తమ
తమచిందంబులతో దుందుభి వేణువీణామృదంగకాంస్య
కాహళఢక్కాహుడుక్కానకంబుల మ్రోతం దిక్తటంబుల
దీటుకొనం గిరీటకోటీరరమణీయఘటితమణిమయూఖరేఖా
పుంజంబు గలసి యరసంజపాడవు వేడబంబు విడంబింప వెల్ల
జగజంపుగొడుగుల వెల్లువు, డెక్కియంబుల వెక్కువయు,
నాలవట్టంబుల డాలును, సీవిరుల తేవయుఁ, దాలవృంతంబుల
డంబును, దాంబూలకరండంబుల పొంకంబును, గర్కూరి
కళాచికాపీఠగండోపధానమణిముకురశయ్యా కటా
హంబుల కల్మియు, మహైశ్వర్యంబుం బ్రకటింప నిలింప
మార్గంబున సవాహనులు, సాయుధులు, సపరివారులు,
సశక్తులు, సాలంకారులునై కాశీపట్టణంబున కేతెంచి

విశ్వేశ్వరాదేశంబున నెచ్చోటికైనను జనువారై గంగా
తీరంబున విడిసిరి కాశీశ్వరు[illegible]దు నేకక్రియా ఫలద్వ
యంబు నీఁజాలునట్టి ప్రకారంబు విచారించి యటకుమున్న
పెద్దకాలంబునం బట్టి యవిముక్తక్షేత్రంబునందునుం
బోలె నిజశిఖరదేశంబునం దా నధివసించుట ఫలంబుగాఁ
గోరి తన్ను నుద్దేశించి ఘోరవీరతపంబు చేసినమందరా
చలంబు కృతార్థం బగునట్లు నగ్గిరీంద్రంబునం దుండి దివో
దాసుప్రతిజ్ఞ చెల్లించువాఁడై తత్కాలసన్నిహితం బైన
నానాదిగ్దేశదేవతాసమూహంబుఁ గనుంగొని యిట్లనియె.

ఉ. ఓసురముఖ్యులార! కమలోద్భవుఁ డాదర మొప్పఁగా దివో
దాసున కిచ్చినాఁడు వసుధాతలమెల్ల జగద్ధితార్థమై
రాసుతుఁ డాతఁ డీభువనరాజ్యభరంబు వహించునప్పు దే
వాసురసిద్ధసాధ్యగరుడాదుల వేల్పులఁ బన్నగేంద్రులన్.

తే. ఆజ్ఞ వెట్టినఁ గాని రాజ్యంబు సేయ
బహుముఖం బైన రాజ్యంబు పదిలపడదు
ఫణులు పాతాళమున నుండఁ బాడివారు
నిర్జరులు నాకమందున నిల్చువారు. 277

వ. అని వరంబు వేఁడినఁ బితామహుండును నాయనుమతి నతని
కభీప్సితార్థంబు నొసంగె నని యానతిచ్చి. 278

సీ. మహనీయరుద్రాక్షమాలికాభరణులు
భస్మత్రిపుండ్రకోద్భాసితులును
వికటపాటలజటామకుటవర్ధనులును
సముదీర్ణశార్దూలచర్మధరులు

దంతనిర్మితయోగదండమండితులును
నసిలభుగ్భ్రీష్మసూత్రాన్వితులును
నాసాశిఖాగ్రవిన్యస్తలోచనులును
బంచాక్షరీమంత్రపఠనపరులు

తే. నైనప్రమథులు గొలిచి రా నగజతోడ
నందికేశ్వరు నెక్కి యానందలీల
సకలజగదీశ్వరుండు పజ్జన్యలీల
సుందరాద్రికిఁ గదలె సమగ్రమహిమ. 279

వ. మఱియు సారస్వతేశ్వరుండు, రత్నజాతీశ్వరుండు, సప్తనాగ
రేశ్వరుండు, శైలేశ్వరుండు, త్రిపురేశ్వరుండు, బాణేశ్వ
రుండు, ప్రహ్లాదేశ్వరుండు, భృంగీశ్వరుండు మొదలైన పర
మేశ్వరులు, దివ్యజ్యోతిర్లింగమూర్తులు, శతసహస్రలక్ష
కోట్యర్బుదన్యర్బుదసంఖ్యాకులు విశ్వేశ్వర శ్రీమన్మహా
దేవు ననుగమించిరి. లోలార్కకేశవులును, విశాలాక్షియు,
ఢుంఠివిఘ్నేశ్వరుండును, దండపాణియుం గదలిరి. అందఱు
వేల్పు లిరుపక్కియలనుం బిఱుందనుం గూడి రాఁ గాశీ
శ్వరుండు. 280

సీ. లవణపాథోధివేలావేష్టితంబైన
యల్లో నేరెడుదీవి యధికరించి
యిక్షురసాబ్ధిపరీతాంచలంబైన
ప్లక్షాంఘ్రిపద్వీపపరిధి గడచి
హాలాకసోదన్వదభిమంత్రితంబైన
శాల్మలద్వీపభూస్థలము దాఁటి

ఘృతపయోరాశిసంక్లప్తావధిక మైన
చంచత్కుశద్వీపజగతిఁ జేరి
తే. యమ్మహాద్వీపమునకు రత్నాఢ్యమైన
మకుటమును బోలె నొప్పారుమందరమునఁ
గనకకలధౌతమాణిక్యకందరమున
గాఁపురము సేసె శివుఁ డంబికయును దాను. 281
వ. ఇట్లు కృతనివాసుండై యిందుధరుం డమ్మందరాచలంబునందు
మణికందరమందిరంబున విహరించుచుం బర్వత(రాజ)నంద
నం జూచి యి ట్లనియె. 282
సీ. నలినాక్షి! నైరావణంబుకుంభములతో
సరివచ్చు నీగుబ్బచన్నుదోయి
తన్వంగి! పారిజాతప్రవాళములతోఁ
బ్రతివచ్చు నీహస్తపల్లవములు
కాంత! కౌస్తుభమణిగ్రావకందళముతో
నెనవచ్చు నీలేఁతయిగురుమోవి
యలినీలకుంతల! యమృతపూరంబుతో
దొరవచ్చు నీముగ్ధసరసఫణితి
తే. యువిద! యీయుపమానవస్తువులు గలిగె
నంబునిధియందు నీమనోజ్ఞాంగములకు
నిమ్మహామందరాద్రి కవ్వంబు గాఁగ
సురలు నసురులు సంప్రీతిఁ దరువఁ బట్టి. 283
చ. చఱఁబడి తీవ్రఘూర్ణవశంబున నొక్కట తీఁగసుట్టు నె
త్తులులయియున్న పాఁపతరిత్రాటిమలంకల నిర్ఘరాంబువుల్
గిఱికొని మీఁదనుండి దిగఁ గిన్నరకంఠి పయోధిఁద్రచ్చున

త్తతి ఫణిరాజు చుట్టినవిధంబున నున్నది చూడు మిగ్గిరిన్.

వ. అనియె నంత. 285

సీ. సోమార్కమయమహాసోపానముల డిగ్గి
పుష్కరాంబువు లోగిఁ బుక్కిలించి
గ్రహతారనక్షత్రగణము నాస్వాదించి
విధుకిరీటునిమాళి వెల్లిగొల్పి
వడఁకుగుబ్బలిరాచవారిమూర్ధం బెక్కి
కనఖలక్షేత్రంబుఁ గౌఁగిలించి
కాశికానగరోపకంఠదేశము డాసి
యేడ్వాలుముఖముల నేగె జలధి

తే. కిమ్మహానది యిద్యోటి యిరుగెలఁకుల
విడిసియున్న నల్దిక్కుల వేల్పుగములు
నంబుధరమార్గమున నేగి రథవుఁ గూడ
మందరమునకు సంభృతానందలీల. 286

తే. అపుడు జంబూతరుద్వీపవిపులయందు
వాసి కెక్కినయద్దివోదాసునాజ్ఞ
గొంది సంకని నొకకుంటి కుదిపి వేద
యనదబూతంబు నుండనీరైరి భటులు. 287

క. కోయిలఁ దిరుమఁలఁ బెరుమా
కోయిలఁ దిరుపతులఁ గుంభకోణాదికపు
ణ్యాయతనంబుల మాయం
బై యెక్కడఁ బోయెనొకో మురాంతకుప్రతిమల్ ? 288

తే. మోసపోక ముసానమ్మ ముద్దరాలు
తారెసరిసప్డులేక పాతాళమునకుఁ

దాను గొడుకులు నొకకొంత తడసె నేని
గుతిలపఱుపరె నృపుబంట్లు గుదెలవాడు. 289

వ. అప్పుడు చతురంతమహీమండలంబు సర్వదేవతాశూన్యం
బగుటంజేసి విఘ్నేశ్వరావాసంబుల స్తవరాజస్తోత్రపాఠం
బును, గాళికాకటంబుల హృల్లేఖాదిమంత్రజపంబును, శివ
స్థానంబులం బంచాక్షరి పంచబ్రహ్మపాశుపతా(ద్య)ఘోర
[1]శరభాది విద్యానుసంధానంబును, విష్వక్సేనావాసంబులం
బురుషసూక్త ద్వాదశాక్షరాష్టాక్షరప్రధాననామానుస్మర
ణంబును లేక తక్కెం దక్కిన వేలుపుల గుళ్లయందును
సంధ్యాకాల బహుళ పటహశంఖకాహళకోలాహలం
బుడిగె. నేనును గర్ణాటదేశహాటక మణికిరీటంబును,
గిష్కింధాచల హేమకూటమతంగగిరిప్రాంతంబును, దుంగ
భద్రాతటినీసైకతికంబును, భాస్కరక్షేత్రప్రాతివేశికంబును,
బంపావిరూపాక్షదేవ దివ్యవికటపాటలజటాజూటకోటీపినద్ధ
ముగ్ధేందు లేఖామయూఖకందళగళదమృతధారానిష్యందా
నేక సంవర్ధితసుకుమారసరళసహకార జంబుజంబీర నారికేళ
కేసరకురవకాశోకశాకోటకుటజ పారిభద్రద్రాక్షారుద్రాక్ష
సర్జ ఖర్జూరభూర్జ బిల్వ చిరిబిల్వాదితరులతాకుంజఖంజన్మి
హిరకిరణపుంజంబు నగుసామిమల విడిచి, మందరాచలంబున
కరిగితి. ఇవ్విధంబున దేవసంఘంబులు దివికిం గాద్రవేయ
కులంబు బలిసద్మంబునకుం బోక విని నిర్ద్వంద్వంబు, నిరవ
గ్రహంబు, నిస్సపత్నంబునుం గాం గాశీనగరంబు తనకు
మొదలిరాజధానిం గావించికొని దివోదాసుం డేకవాసర

1. శాతరుద్రా.

ప్రాయంబుగా వత్సరాయుతాష్టకంబు రాజ్యంబు సేసిన నక్కాలంబు నందు. 290

ఉ. దేవత లెల్లఁ దక్కఁ గలదీవులకుం దివి కేఁగునట్టిచోఁ
బోవఁగ లేక కుంటికుడుపుల్ జిలువేల్పులు దేవదానవుల్
సేవకులై మహీవిభునిచే నధికారనియోగవృత్తికై
జీవిత మంది నిల్చిరి త్యజింపఁగ వచ్చునె జన్మదేశముల్. 291

తే. తత్పరతమీఱఁ గొలిచి రాధరణివిభుని
దైత్యదానవు లవధూతదానవారి
పతితపాత మాబాలగోపాల మైన
సుద్ది పగవారిపగవారు చుట్ట లగుట. 292

తే. విశ్వదేవగణంబుతో వేలువేల
వచ్చి పితృదేవతలు మహీశ్వరుఁ గొలిచిరి
చులుకఁగా ల్వట్టి యీడ్చినఁ జూరు వట్టి
వేలుపురు గాక తమవారి విడుతు రెట్లు. 293

సీ. సిద్ధు లారాజుఁ గొల్చి ప్రసిద్ధిఁ గాంచిరి
గ్రహముల కతఁ డనుగ్రహముఁ జూపె
విద్యాగురుం డయ్యె విద్యాధరుల కతఁ
డతఁడు రుద్రులకు సౌహార్దుఁ డయ్యె
రక్షించె నాతఁడు రక్షస్సమూహంబు
నతఁడు తార్క్ష్యులకు నాధ్యక్ష మిచ్చె
మన్నించె నాతఁడు కిన్నరవ్రాతంబుఁ
దుషితుల నతఁడు సంతోషపఱిచె

తే. నతని భూతపిశాచకూశ్మాండగణము
ఢాకినీప్రేతరంకులు శాకినులును
గర్కరీపాదుకావీటికాకరండ
పేటికలు దాల్చి కొల్చిరి భృత్యు లగుచు. 294

వ. అవ్విధంబున రిపుంజయుండు ప్రజాపాలనంబు పరమధర్మం బుగా శక్తిత్రయచతురుపాయషాడ్గుణ్యంబులు కాలం బెఱింగి నడుపుచుఁ బెద్దకాలంబు రాజ్యంబు సేసె. చాతుర్వర్ణ్యం బును జతురాశ్రమంబులుఁ దమతమధర్మంబులు దప్పక వర్తించె. అపుడు వేల్పులు ధరావియోగవేదనాదూయ మానమానసు లై మరుద్గురుం బురస్కరించుకొని మంత నం బుండి దివోదాసునకు రాజ్యపదభ్రంశనం బెవ్విధం బునం గావింతు మొకో యని విచారంబునకుం దొడంగిరి. అప్పుడు కార్యంబు నిర్వర్తించి బృహస్పతి యింద్రాదిదేవతల కి ట్లనియె. 295

క. ప్రాణాపానవ్యానో
దానసమానములు తృప్తి దలకొనఁ జేయం
గా నోపెడు నది యన్నము
ప్రాణం బన నన్న మనఁగఁ బర్యాయంబుల్. 296

తే. అగ్ని మనలోన నొక్కరుఁ డౌనొ కాఁడొ ?
చేయఁడే మారుతము మనచెప్పినట్లు ?
వరుణుఁ డెవ్వరివాఁడు ? మువ్వురును లేక
యోజితం బగునెబ్భంగి నోగిరంబు ? 297

వ. వరుణానిలాగ్నులు తమతమశక్తు లుపసంహరించిరేనిఁ బిఠర పాకంబు సాగదు. పిఠరపాకంబు సాగక యోదనంబు పరి

పక్వంబు గానేరదు. పరిపక్వాన్నంబులేక వైశ్వదేవబలిహరణాదిక్రియాకలాపంబులు కుంఠితంబు లగు. హవ్యకవ్యక్రియాశూన్యులైన బ్రాహ్మణులు రాజులయందు విరక్తు లగుదురు. బ్రాహ్మణులు విరక్తులైనప్పుడ తక్కినవర్ణంబుల ప్రజలు వైరాగ్యంబు వహింతురు. ప్రజా(ను)రంజనంబునంగదా రాజు రాజౌట. ప్రజావిరక్తిఁ గోశదుర్గబలాదిసప్తాంగంబులు పరిక్షీణంబు లగు. సప్తాంగపరిక్షయంబునఁ ద్రివర్గనాశనం బగు. త్రివర్గనాశనంబున నుభయలోకమార్గంబును ఖిలీభవించుం గావున. 298

తే. మొదల వైశ్వానరుని నిజమూర్తిశక్తి
సంహరింపంగఁ దగుఁ గాశి జనపదమున
నగ్ని లేకున్న నోగిరం బనువుపడక
రాజు ప్రజలును నెబ్భంగి బ్రదుకువారు. 299

ఉ. చండకరాన్వయాంబునిధిచంద్రుఁడు భూపమణుం డతండుతా
గుండియవాఁడు వేలుపులకోటు లసంఖ్యలు భూతధాత్రిపై
నుండఁగ నీక కాశిపురి నొక్కఁడు రాజ్యము సేయు టెట్లు? లీ
దండికి మెచ్చి నారట ప్రతాపవిహీనుఁడు భూమిపాలుఁడే?

తే. అనిన నాచార్యుపలుకుల నాదరించి
యింద్రుఁ డనుపఁగ ధాత్రికి నేగె నగ్ని
మొదలఁ గాశీపురమునకు ముట్టముణఁగ
సకలగృహములఁ దనమూర్తి సంగ్రహించె. 301

మ. కర మాశ్చర్యముగాఁ బ్రతిక్షయమునంగాష్ఠంబులందగ్ని దే
వర నిష్పచ్చరమై యడంగుటయు సర్వస్త్రీలు పాకక్రియా

పరతల్ దక్కిరి యాయజూకభవనప్రాగ్వంశమధ్యంబులన్
*వరుసం జేయరయా రెవీడు నస్వధాస్వాహావషట్కారముల్.

ఉ. యంత్రితభక్తిభావమున నగ్నిసమింధని సామిధేని ఋ
ఙ్మంత్రము లుచ్చరించుచు సమగ్రతరారణిమంథనక్రియా
తంత్రము నాచరించి వసుధామరముఖ్యులు వీతిహోత్రునా
మంత్రణ సేయ లేరయిరి మచ్చరికించియుఁ గాశికాపురిన్.

వ. ఆసమయంబున. 304

ఉ. భూపతిసమ్ముఖంబునకుఁ బోయి కరాంబుజము ల్మొగిడ్చి వి
జ్ఞాపన సేసె నారసికసంఘము మెల్లన గొంకి గొంకి యి
ట్టాపకరోక్తిఁ జెప్పెడు నెడం †గడునల్గుట నీతి యౌ ననం
బాపలు మేదినీశ్వరులమానసముల్ దిరిసెంపుఁబూవులున్.

తే. అవధరింపుము నీప్రతాపాతిశయము
గరిమమున నోహటించియో కాని వహ్ని
కాశికాపట్టణము నైదుక్రోశములును
బదిల మై యుండ నోపక పాఱిపోయె. 306

ఉ. అంబుజబాంధవాన్వయనృపాగ్రణి! బోనము నేఁడు సూర్యపా
కంబున నాయితం బయినఖజ్యము భోజనశాలలోనఁ బ
ళ్యం బిడినారు పంకజదళాక్షులు రెండవజాముగంట వే(మ్రో)
యంబడె నారగింప సమయం బని యిమ్మెయి విన్నవించినన్.

---

* 'వరిబియ్యం బెడ యొల్కి వీడును; వరు జయ్యం బెద యొల్కి' అనియుఁ గొన్నిప్రతులలోఁ గనఁబడుచున్నవి. ఈపాఠములు చింత్యములు.

† 'గడునజ్ఞులనీతి యౌ వనం, బ్రాపలు' అని ముద్రితపుస్తకపాఠము. ఈ రెండుపాఠములుం జింత్యములు.

తే. వేల్పు లౌనరించినట్టి దుర్వృత్తి యగుట
నెఱిఁగి యింతియ కాకయొం డేమి? యనుచు
నారగించె దివోదాసుఁ డర్కకిరణ
తాపపక్వంబు లగుపదార్థంబు లెలమి. 308

వ. భోజనానంతరంబున నాస్థానమధ్యంబునం గొలువుండి దివోదాసుండు వాసవాదులు సేసిన యపకారంబునకుఁ బ్రతీకారంబుసింతించునవసరంబునఁ బౌరజానపదులగు జను లయ్యగ్ని తిరోధానంబునకు భయంపడి యమ్మహోత్పాతంబు విన్నవింప నేతెంచిన. 309

ఉ. అందఱు నాదరించి మిహిరాన్వయముఖ్యుఁడు వారియాత్మలా
నందముఁ బొంద ని ట్లనియె నాకనివాసులు సేసినట్టికీ
డొందునె నన్ను? మీరు వెఱకుండుఁడు భూప్రజలార! నేడ
యానందవనంబునందు దహనంబు ఘటించెద యోగసంపదన్.

మ. అనుమానింపక యాసురాధములు మాయాకల్పనావంచనం
బున వైశ్వానరునిన్ హరించిరి యవుంబో! యింతమాత్రంబు
లో, నన నాయోగమహానుభావమునకున్ భంగంబు వాటి
ల్లునే? సనెక ల్దాఁచినఁ బెండ్లిమానునొకో! దుశ్చారిత్రము
ల్గంటిరే! 311

సీ. దహన స్వరూపంబుఁ దాల్చియేఁ గైకొందు
హవ్యకవ్యాహుతు లధ్వరములఁ
బర్జన్యమూర్తిఁ జేపట్టియే వర్షింతు
సలిలధారలు సస్యములు ఫలింప
శశిదివాకరులవేషంబులుఁ దాల్చియే
ఖండింతు గాఢాంధకారపటలిఁ

బవసునాకారంబు భరియించి యేను బ్రా
హ్మణ్యాంతర్బహిర్వ్యాప్తి నాచరింతు

తే. వేల్పులందఱు నేన నై వివిధగతుల
విశ్వలోకంబు రక్షింతు వేయు నేల?
యింక నొందాని నిట నేన యేలువాఁడ
నాగలోకంబు నాకంబు యోగశక్తి. 312

వ. అని యోగవిద్యాబలంబున సర్వదేవతామయుండై దివోదాసుండు రాజ్యంబు సేయుచుండె. అంత నటఁ బరమేశ్వరుండు మందరాచలంబునం దధివసించి కాశీనగరవియోగవేదనాదూయమానమానసుండై తత్సమాగమోపాయంబుఁ జింతించుచుండె నప్పుడు. 313

తే. అభవుఁ డిందుకళాధరుఁ డయ్యు నమర
వాహినీధరుఁ డయ్యు దుర్వార మైన
కాశికావిప్రయోగాభిఘాతజనిత
తాప భారంబు సైరింప నోపఁ డయ్యె. 314

ఈశ్వరుండు యోగినులం గాశి కంపుట

వ. అంత నొక్కనాఁ డద్దేవుండు గజానన, సింహాముఖి, గృధ్రాస్య, కాకతుండిక, ఉష్ట్రగ్రీవ, హయగ్రీవ, వారాహి, శరభానన, యవికేశి, శివారావ, మయూరి, వికటానన, అష్టవక్త్ర, కోటరాక్షి, కుబ్జ, వికటలోచన, శుష్కోదరి, లలజ్జిహ్వా, దంష్ట్రోగ్ర, వానరానన, ముక్తాక్షి, కేకరాక్షి, బృహత్తుండ, సురాప్రియ, కపాలహస్త, రక్తాక్షి, శుకి, శ్యేని, కపోతిక, పాశహస్త, దండహస్త, ప్రచండ, చండవిక్రమ, శిశుఘ్ని, పాపహంత్రి, కాళి, రుధిరపాయిని, వసాధయ, గర్భభక్ష,

శవహస్త, అంత్రమాలిని, స్థూలకేశి, బృహత్కుక్షి, సర్పాస్య, ప్రేతవాహన, దందశూకకర, క్రౌంచి, మృగశీర్ష, వృషానన, యాంత్రశ్యామ, ధూమనిశ్వాస, వ్యోమైకచరణ, ఊర్ధ్వదృశ, తాపని, శోషణి, వృకోదరి, స్థూలనాసిక, విద్యుత్ప్రభ, బలాకాస్య, మార్జారి, కటపూతన, అరిష్టాహాస, కామాక్షి యను నీచతుష్షష్టియోగినుల రావించి మీరు నానాప్రకారమాయావేషచేష్టావిధానంబులం గాశికానగరంబునం బుణ్యస్త్రీలపాతివ్రత్యంబులు, పురుషుల యాచారంబులు చెఱుచునది. వర్ణాశ్రమంబులు నిజధర్మంబున వర్తింపకున్న దివోదాసుండు రాజ్యపదభ్రంశంబు నొందెడు. అప్పుడు గాని మాకుఁ గాశీసమాగమంబు సిద్ధింపదు. అనిన వారును మహాప్రసాదం బని. 315

సీ. పుష్పలావిక యొకర్తు బూమెకత్తియ యొకర్తు
గంధవాహిని యొకర్తొకర్తు లంజె
హస్తాంఘ్రిరేఖాసమాలోకనక్రియా
సాముద్రికజ్ఞానచతుర యొకర్తు
సలిలాగ్నివాగ్వాయుస్తంభవిద్యాకళా
ప్రావీణ్య యొకర్తు సైరంధ్రి యొకర్తు
మాచకమ్మ యొకర్తు మంత్రవాదిని యొకర్తు
రంగవల్లికచిత్రరచననిపుణ

తే. చదువఁ బాడంగ నాడంగ సరస మాడఁ
గథలు సెప్పంగ (నటియింప) నర్తింపఁ గన్ను లార్ప
వీణ వాయింపఁ బొగడంగ విరులు గట్ట
నేర్చునట్టిది యొకర్తు సన్నియత యొకర్తు. 316

వ. ఇవ్విధంబుల నానారూపవిధంబులు గైకొని వారణాసికిం
జని రనంతరంబ. 317

ఈశ్వరుండు సూర్యునిం గాశి కంపుట

తే. మనసిజారాతి సిద్ధయోగినులఁ బంపి
యూరడిలి యుండఁ జాలక యుష్ణకరుని
నంచెఁ గాశికానగరివృత్తాంత మరయఁ
గౌతుకము కాలయాపనాక్షమము గాదు. 318

సీ. పురివైరి రవిఁ గాశిపురి కన్పునప్పు డే
కాంతంబు సేసి య ట్లనుచుఁ బలికె
వాసరాధిప! దివోదాసు ధర్మాత్ముని
నేయుపాయంబున నేని ధర్మ
విముఖుఁ గావింపుము విడియంగ నాడకు
ధర్మమార్గైకతత్పరత నతని
మన మాదరింపకుండిన ధర్మ మెబ్భంగి
నభివృద్ధిఁ బొందుఁ? గా నగునయంబు
తే. *దప్పకుండంగ నేదేని తప్పుటొఱపు
మత్సరాహంకృతులను గామమునఁ గ్రోధ
మోహములఁ బ్రత్యవాయంబు మోవఁదలఁచి
తప్పు లేకయ శిక్షింపఁ దగవు గాదు. 319

*ఇచట 'తప్పకుండదు నెడనొక్క ప్పువెఱపు' అని యచ్చుప్రతిలోను, 'తప్పకుండ కొందే నొక తప్పువెఱపు' అని యొకవ్రాతప్రతిలోను, 'తప్పకుండంగ నేదేని తప్పుటొఱపు' అని కొన్నివ్రాతప్రతులలోను పాఠభేదములు గనఁబడుచున్నవి. ప్రథమపాఠము కేవల మపభ్రంశముగ నున్నది. తక్కిన పాఠములఁ గ్లిష్టార్థకల్పన చేయఁదగియున్నది. దోషజ్ఞులు ప్రమాణము.

తే. కదలకుండును మది నెంత కాలమేని
ధర్మమతిసుకరం బయి కర్మసాక్షి !
యంతగాలము నరునకు నావహిల్ల
దేయపాయంబు నీసూక్ష్మ మెఱఁగికొనుము. 320

వ. అని చెప్పినం బ్రసాదం బని శివాజ్ఞ శిరంబున వహించి రవి కాశీపురంబున కరిగి యొక్కొక్కమాటుయాచకుం,డొక్కొక్కమాటు దూత, యొక్కొక్కమాటువదాన్యుం, డొక్కొక్కమాటు దీనుం, డొక్కొక్కమాటుగార్తాంతికుం, డొక్కొక్కమాటు దృష్టప్రత్యయవాది, యొక్కొక్కమాటుజటిలుం, డొక్కొక్కమాటుదిగంబరుం, డొక్కొక్కమాటు జాంగలికుం, డొక్కొక్కమాటు పాషండుం, డొక్కొక్కమాటు బ్రహ్మచారి,యొక్కొక్కమాటుగృహి, యొక్కొక్కమాటు వానప్రస్థుం, డొక్కొక్కమాటు యతి యై నానాప్రకార వేషభాషాచేష్టా యంత్ర మంత్ర తంత్ర మాయాప్రయోగ బలంబున. 321

తే. ఇన్ని విధముల జనియించిన యినుఁడు గాశి
ప్రణము గానంగ లేఁ డయ్యె రాజునందు
నవకరంబు మహీపాలునంద యేల?
కనఁగ లేఁ డయ్యె నొకపృథగ్జనునియందు. 322

వ. ఇట్లు విఫలప్రయత్నుం డయి యినుండు నిజాంతర్గతంబున.

సీ. కార్యంబు నిష్పత్తిగతికి రాకుండంగ
మందరంబున కెట్లు మఱలి పోదు?
అదె వచ్చె నిదె వచ్చె నని నా కెదురుచూచు
నీశు నీక్షింతు నే నేమొగమునఁ?

బలియాజ్ఞ నిర్వహింపక కాని దేవతా
ప్రమథులం దే నెట్లు ప్రభుతఁ గాంతు?
నోచ్చెంబు ధరియించి యొదిగి యుండక యెట్లు
నిటలలోచనుమ్రోల నిలుచువాఁడఁ
తే. గనలియున్నాఁడు నేఁ డెల్లి కాశివిరహ
వేదనాభారమున వేఁగి వేఁగి భర్గుఁ
డడ్డపడువారె యొరు లతఁ డలిగినపుడు?
గాన నిచటన కాలంబు గడపువాఁడు. 324

వ. హరిశ్చంద్రశిబిదధీచిప్రముఖు లగుపెద్దలుం గాశీసంసేవనంబున సంసారదుఃఖంబులు ద్యజించి రని ప్రభావజ్ఞుం డగు భాస్కరుండు లోలార్కుం డన, నుత్తరార్కుం డన, సాంబాదిత్యుం డన, గరుడాదిత్యుం డన, మయూరాదిత్యుం డన, [1]ఖఖోల్కాదిత్యుం డన, వరుణాదిత్యుం డన, వృద్ధాదిత్యుం డన, కేశవాదిత్యుం డన, విమలాదిత్యుం డన, గంగాదిత్యుం డన, యామాదిత్యుం డనఁ బండ్రెండు మూర్తులు వహించి కాశీపురంబునం దధివసించె. కాశీవాసనిమిత్తంబుగా మనంబు లోలంబగుట లోలార్కుం డయ్యె. క్రమంబున నీ యాదిత్యుల ప్రభావం బభివర్ణించెద నాకర్ణింపుము.

ఉత్తరార్క ప్రభావవర్ణన

సీ. కాశీపురికి నుత్తరాశాప్రదేశంబు
నందు నుండుట నుత్తరార్కుఁ డయ్యె
నితిహాస మొకటి యయ్యినునిమాహాత్మ్యంబు
సంప్రకాశ మొనర్పఁజాలెడునది

---

1. ఖషోల్క, ఖట్వా.

వినిపింతు విను కాశి విప్రుఁడొక్కఁడు సదా
చారసంపన్నుఁడు శాంతిశాలి
యతిథిప్రియుఁడు ప్రియవ్రతుఁ డనుపేరివాఁ
డతనిభార్య శుభవ్రతాభిధాన
తే. దంపతులు వారి కుదయించెఁ దనయ యొక్క
మూలనక్షత్రమునయందు మొదటికాలఁ
గేంద్రమున నాంగిరసుఁ డుండఁ జంద్రవదన
బాల వర్ధిల్లె రూపసంపదయుఁ దాను. 326

తే. దానిపేరు సులక్షణ మానివర్య!
సర్వలక్షణసౌభాగ్య జన్మభూమి
బాల యంతంత వర్ధిల్లెఁ బ్రతిదినంబుఁ
జింత తండ్రికి వర్ధిల్లె నంత కంత. 327

తే. తగినవరుఁ డెవ్వఁ డొక్కొ యీతలిరుఁబోఁడి
కనుగుణుం డెవ్వఁ డొకో విశుద్ధాభిజాత్య
పరమసౌభాగ్యభాగ్యసంపదల కనుచు
నిత్యమును దండ్రి యాత్మఁ జింతించుచుండు. 328

తే. మూలనక్షత్రమునయందు మొదలికాలఁ
గన్య గండానఁ బుట్టినకారణమునఁ
గర్మవశమున విప్రుఁ డానందకాననమునఁ
జచ్చెఁ జింతాజ్వరముపైన జ్వరము దాఁకి. 329

వ. శుభవ్రతయునుం బతి ననుగమించె నంత సులక్షణదుఃఖావేశ యయ్యును ధీరోదాత్త గావునఁ దాత్పర్యంబునం దలిదండ్రుల కౌర్ధ్వదైహికవిధులు నిర్వర్తించి నిజాంతర్గతంబున.

సీ. ప్రాణంబుప్రాణంబు లగుతల్లిదండ్రుల
హృదయంబులోన నే నెట్లు మఱతుఁ?
పితృమాతృహీన నై యతిశోచ్యవృత్తి మై
నెబ్భంగి నీఁదుదు నీభవాబ్ధి?
నేల కల్పించె నాకీరూపలావణ్య
సౌభాగ్యసంపద జలజభవుఁడు?
కులశీలరూపాదిగుణములు వీక్షించి
యెవ్వారి కీ నేర్తు నేన నన్ను?
తే. ననుచు నిర్వేదమునఁ బొందె నలరుఁబోఁడి
పురుషు నెవ్వనిఁ జిత్తంబు చొరఁగ నీక
బ్రహ్మచర్యవ్రతస్థితి బదిలపఱచి
యుత్తరార్కునికడఁ జేసె నుగ్రతపము. 331

ఉ. నిత్యము నిష్ఠతోడ ధరణీసురకన్యక కాశి నుత్తరా
దిత్యునిపార్శ్వభాగమునఁ దీవ్రతపం బొనరింప వచ్చి సాం
గత్యము చేసెఁ గూర్మి చెలికత్తియ కైవడి నొక్క మేఁక సం
ప్రీత్యనులబ్ధినంగనయుఁ బ్రేమ మొనర్చుచు నుండె దానిపైన్.
తే. రాత్రి దూర్వాప్రవాళచర్వణ మొనర్చి
యుత్తరాదిత్యకుండిక నుదక మాని
పగలు నాల్జాలు సేవించుఁ బద్మనయన
వత్సలత మీఱ *నలవోక వయసుమేఁక. 333

331-వ పద్యమునకుఁ దరువాతఁ గొన్నిప్రతులలో 'వ. ఇవ్విధంబున దపంబు సేయుచు నక్కన్యకారత్నంబు' అని యొకవచనము గనఁబడు చున్నది. *'సెలవ్రోఁక' అని ముద్రితప్రతి.

వ. అంతఁ బెద్దకాలంబున నీలలోహితుండు ప్రత్యక్షం బై వరంబు వేఁడు మనిన సులక్షణ యవ్విరూపాక్షునకుఁ బ్రణమిల్లి వినయంబున నిట్లనియె. 334

తే. మీనకేతనదమన! యీ మేఁకపల్ల
ప్రాణసఖివోలె నాయొద్దఁ బాయకుండు
శర్వ! యీనోరుమాలినజంతువునకు
మొదలు వర మిమ్ము [illegible] మ్ము [illegible] నాకు. 335

వ. అనిన విని శంకరుండు కరుణాతరంగితాంగీకారం బైన కటాక్షవీక్షణాంకురంబునం గురంగాక్షిం గనుంగొని గౌరీహృదయానురోధంబున బర్కరి యన్యజన్మంబునం గాశీరాజుపట్టపుదేవికిం గూఁతురై పుట్టునట్లుగా వరం బొసంగె. బర్కరిపేర నయ్యుత్తరాదిత్యకుండంబు బర్కరీకుండం బనం బరఁగె. గుణానురాగిణియైనగౌరి సులక్షణఁ దనకుం జెలికత్తియంగాఁ గైకొని జయ, విజయ, జయంతిక, శుభానంద, సునంద, కౌముది, యూర్మిళ, చంపకమాల, మలయవాసిని, కర్పూరతిలక, గంధధార, శుభ, అశోక, విశోక, కమలగంధి, చందననిశ్వాస, మృగమదోత్తమ, కోకిలాలాప, మధురభాషిణి, గద్యపద్యనిధి, యనుకన్యక మొదలయిన చెలికత్తియలనుం బోలె నబ్బాల బ్రహ్మచారిణి యైన యయ్యలివేణి నాదరించె. ఇది యుత్తరార్కమాహాత్మ్యం బనుటయు నైమిశారణ్యనివాసులు మహాత్మా! యింకనుం గాశికానగరపంచక్రోశపుణ్యక్షేత్రంబునం గలదేవతాస్థానం

1 ఇవ్విధంబున నుండ నంతఁగొంతకాలంబునకు. 2 దక్షకన్యకామణి సన్నిధికిం.

బులు, పుణ్యతీర్థంబులు వివరించి మమ్ముం గృతార్థులం జేయు మనుటయు.

ఆశ్వాసాంతము

శా. ధారాపట్టణసార్వభౌమ! [1]ధ్వాన్ద్రార్పాపహారక్రియా
ధౌరంధర్యపటిష్ఠనిష్ఠురభుజాదంభోళిసంరంభ! దా
క్షారామప్రమదాకటాక్షలహరీవ్యాపారనీరాజితా
కారా! శ్రీజితమత్స్యకేతన! సమిద్ధాండీవబాణాసనా! 337

క. వేంగివిషయాధీశ్వర!
సంగరగంగాతనూజ! సాహిత్యకళా
సంగీతలక్ష్యలక్షణ
భంగీసర్వజ్ఞ! విమలపాండిత్యనిధీ! 338

మాలిని. చతురుదధిచతుర్దిక్సౌధవీథీవిటంకా
ప్రతినవబహుముక్తారంగవల్లీమతల్లీ
ప్రతిమవిమలకీర్తీ! పంచనారాచమూర్తీ!
వితరణసురభూజా! వేమమాంబాతనూజా! 339

గద్యము. ఇది శ్రీమత్కమలనాభపౌత్త్ర మారయామాత్యపుత్త్ర సుకవిజనవిధేయ కవిసార్వభౌమ శ్రీనాథనామధేయ ప్రణీతం బైన కాశీఖండం బను మహాకావ్యంబునందుఁ బంచమాశ్వాసము.

---

1 సురరాడ్దర్పా.

షష్ఠాశ్వాసము

శ్రీకటాక్షవీక్షణ
విశ్రాణన! విభవవిజితవిద్యాధర! వ
ర్ణాశ్రమరక్షాతత్పర!
యాశ్రితమందార! రెడ్డియల్లయవీరా! 1

వ. అక్కథకుండు శౌనకాదిమహామునుల కిట్లనియె. 2

సాంబాదిత్యమాహాత్మ్యము

సీ. యదువంశమునయందు నవనిభారాపనో
దార్థంబు దుష్టదైత్యావశేష
హరణార్థముగఁ బుట్టె నంభోజనాభుండు
దేవకికిని వసుదేవునకును
ద్వారవతీపురాధ్యక్షుండు దైత్యారి
యవరోధకాంతాసహస్రములను
గాంచె నందనుల లక్షయునేనుబది వేల
మాన్యలైనప్రధానమహిషులందు
తే. జాంబవతి యనుదేవియు సాంబుఁ గనియె
నక్కుమారుండు లేఁతప్రాయంబునందు
వీథి నొకనాఁడు సఖులతో విహృతి సలుప
నెచట నుండియొ నారదుం డేగుదెంచె. 3

క. ఆటతమకమున నమ్మధు
కైటభరిపుసుతుఁడు మిగుల గౌరవబుద్ధిన్
బాటింప నెఱుఁగ డయ్యెను
హాటకగర్భునితనూజు నభ్యాగతునిన్. 4

ఉ. తోడికుమారులున్ సఖులు దూరమునందకరారవిందముల్
మోడిచి ఫాలభాగముల మోపినమస్కృతు లాచరింపఁగా
నాడుచు నుండెఁగాని ముని కంజలిసేయఁగ నేరఁడయ్యె న
వ్వేడుకకాఁడు పుట్ట దొకవేళ వివేకము నెట్టివారికిన్. 5

చ. త్రిదశమునీశ్వరుండునుమదింగలుషంబొకమూలనుండఁగా
యదుకులసార్వభౌముఁగని యర్చనగైకొని యిష్టగోష్ఠితో
ముదితల నమ్మియేమఱుట మోసముసూ! యనిబుద్ధిచెప్పు చ
చ్చదురుఁడుసన్న సేయఁదగ జాంబవతీసుతునెన్నె ధూర్తుఁగాన్.

తే. ఎన్ని యాతోయమున మిన్న కేగి దివికి
నారదుఁడు శౌరిచేత సత్కార మంది
నెరసు పొడఁగానలేఁ డయ్యె నెమకి నెమకి
సాంబుపైఁ బాంచజన్యరథాంగపాణి. 7

వ. అంతం గొన్నిదినంబులకు. 8

తే. సాంబు నడచినదాఁక వ్రతంబు పట్టి
జలజసంభవతనయుండు చలపకారి
ద్వారవతి కేగుదెంచి యంతగపురమున
బుండరీకవిలోచనుం డుండు టెఱిఁగి. 9

తే. వెదకి సాంబునిఁ బొడగాంచి విబుధమౌని
హరికిఁ దనరాక నెఱిఁగింపు మనుచుఁ బలికెఁ

బోవు టనుచిత మొప్పదు పోవ కునికి
యేమి సేయుదు పని యానతీఁ డిచ్చుఁ దలఁకి. 10

వ. ఎట్టకేలకు శుద్ధాంతగతుం డై యున్న తండ్రిసమీపంబున కరిగి యవ్వేళాగమనాపరాధంబు గారణంబుగా శౌరిచేతం గుష్ఠవ్యాధిబాధితుండు గా శపింపంబడె సాంబుండు. 11

తే. తండ్రికిని నారదునికి వందనము సేసి
జాంబవతిపట్టి శాపావసాన మెఱిఁగి
కాశికకు నేగి యత్యంతగాఢభక్తి
భాను సేవింప నీవ్యాధి మాను ననిన. 12

వ. ఇట్లు నారదానుమతిం గృష్ణుచేత శాపమోక్షప్రకారం బెఱింగి సాంబుండు కాశి కరిగి తదుపదిష్టమార్గంబున భాను సేవించి కుష్ఠవ్యాధిబాధావిముక్తుం డయ్యె. ఇది సాంబాదిత్యమాహాత్మ్యంబు. 13

గరుడాదిత్య మయూఖాదిత్య ఖఖోల్కాదిత్యారుణాదిత్యమాహాత్మ్యము.

సీ. పరమసంయమి కశ్యపప్రజాపతికిని
వినత కాత్మజుఁ డైనవిహగభర్త
విషధికుక్షినిషాదవితతి భక్షించుచో
ద్విజుఁ గ్రాసి యుమిసినవిమలబుద్ధి
యిభకచ్ఛపముల రోహిణిశాఖతోఁ దాల్చి
దివిమీఁదఁ బాఱినపవనవేగి
యహికోటి గెల్చి చిచ్చార్చి చక్రము దూరి
యమృతంబుఁ గొన్నట్టియమితబలుఁడు
తే. జిష్ణుపవి కొక్కయీఁక యిచ్చినప్రదాత
యచ్యుతునివాహనము తార్క్ష్యుఁ డగ్రజులును

దానఁ దల్లియుఁ గౌశికాస్థలమునందుఁ
గొలిచి రక్కల నలువురఁ గుంభజన్మ! 14

వ. అని చెప్పిన విని యగస్త్యుండు హస్తంబులు మొగిడ్చి పార్వతీ
హృదయానందవర్ధన! కుమార! యొక్కసందేహంబు నడి
గెదం దెలియ నానతిమ్ము. దక్షప్రజాపతిపుత్త్రి కశ్యపప్రజా
పతిపరిగ్రహంబు గరుత్మంతునిజనయిత్రి వినత యేమికారణ
మున దాస్యంబు వహించె నని యడుగుటయు బాహులే
యుండు కుంభసంభవున కిట్లనియె. 15

తే. సవతి కద్రువ శేషతక్షకులు మొదలు
గాఁగ వేవురు భుజగపుంగవులఁ గాంచె
నండముల మూఁటఁ గలధౌతగండశైల
సన్నిభంబులఁ గనెఁ బుణ్యసాధ్వి వినత. 16

ఉ. ఆదిమమైనయండమునయం దుదయించెను గూబపుల్గు సూ
ర్యోదయవేళ ముజ్జగము నుబ్బరపోవఁగ నయ్యులూక మ
ష్టాదశసంఖ్యదీవులను సర్వవిహంగమకోటికిన్ మహా
హ్లాదము గా వహించెను లలాటమునం దధిరాజపట్టమున్.

తే. ఖగములకు నాదిజం బైనకారణమున
సమ్మతించె విహంగమజాతి మొదలఁ
గౌశికము రాజ్యయోగ్యంబు గా దటంచు
నగియెఁ బిమ్మట దుర్లక్షణములు చూచి. 18

సీ. భంగించిన ట్లుండుఁ బడఁత మాటికి మాటి
కూర్ధ్వకంపంబు సేయుటకతాన
జంకించిన ట్లుండు శ్రవణనిష్ఠురముగాఁ
జెలఁగి ఘూత్కారంబు సేసె సేసి

బెదరించిన ట్లుండుఁ బ్రభువర్తులములైన
దృగ్గోళకంబులు దిరుగఁబడిన
గర్వించిన ట్లుండు ఘుస్రంబు నాల్గాలు
నెదిరిఁ దన్నునుఁ గాంచు నెఱుక లేమిఁ

తే. బుట్టుపుణ్యంబుమాలిన జట్టిపులుగు
గూబ యెక్కడఁ కలహంసకోకకీర
నీలకంఠాదిబహుపక్షినివహరాజ్య
భార మెక్కడ? యిది యసంబద్ధ మనుచు. 19

వ. కులము పెద్దలు పరాభవించిన. 20

ఉ. గద్దియ డిగ్గి †కాశ్యపుని గాదిలిసూనుఁడు కొండ వట్టినన్
ముద్దియ దక్షమాఁతురు వినుగ్గత రెండవపుత్త్రునైన నుం
దద్దయు వేడ్కఁ జూతు నని తాలిమి లేక నఖాంకురంబునం
బిద్దముచేసె మై సగము నిండనిగర్భముతోడియండమున్. 21

వ. దానవపరార్ధకాయహీనుండును బూర్వార్ధమానతనూసహి
తుండును నైనపుత్త్రుం డనూరుం డన నుద్భవించి యప
కారంబు సేసినతల్లిం గినిసి సవతికి దాసివి క మ్మని శపి
యించిన. 22

సీ. ఏలరాయన్న! నాయేకాపరాధంబు
సైరింప వైతి యీ శాపమునకు
మోక్ష మెన్నఁడు గల్గు నక్షీణకారుణ్య!
గరిమఁ జెప్పర యాత్మ గలఁగె నాకు

† 'కశ్యపుని గాదిలిఃసూనుఁడు' అని వ్రాతప్రతిపాఠము. 'కాశీశ్వేర
శథావృత్తే' అని సంస్కృతమూలము.

ననవు డాపిచ్చుకుం టమ్మతో ని ట్లను
నేనూఱువర్షంబు లేగునంత
మూఁడవయిగాయండమున నుద్భవించిన
తనయుండు తల్లి! నీదాస్య ముడుపు
తే. నేమఱక దీని రక్షింపు మీవు నియతి
ననుచు బుద్ధులు చెప్పి యయ్యరుణుఁ డరిగె
జననియనుమతిఁ గాశికాస్థానమునకుఁ
దారక బ్రహ్మవిద్యానిధానమునకు. 23

వ. ఆశాపంబు కారణంబుగా నొక్కనాఁడు కద్రూవినతలు సముద్రతీరంబున వినోదార్థంబు విహరించువారు వేలానువన(ధి)వనప్రాంతంబున మరుత్వంతునితురంగం బుచ్చైశ్శ్రవంబు మేయుచున్నం గనుంగొని వినత 'యోహో! యీహయోత్తమం బెంత యొప్పునే? మహాపురుషునికీర్తిపూరంబునుం బోలెఁ గార్తికచంద్రచంద్రికాధవళం బయియున్నయది' యనినఁ గద్రువ యేకన్నులఁ గనుఁగొంటివి? ఈ తురంగంబునందు నిందుబింబంబునందుఁ గందునుం బోలె వాలవీధియందు వాలంబు లొకకొన్ని నీలంబు లయియున్నయవి యని పలికె. ఉన్నయవియనియును లేవనియునుం గొంతతడవిద్దఱు వాదంబు సేసి దాస్యంబు పణంబుగాఁ బన్నిదంబు చఱచిరి. అప్పొద్దునకుం బ్రొద్దు చాలమి నిజనివాసంబుల కరిగిరి. మఱునాఁడు ప్రాతఃకాలంబునఁ గద్రువ కొడుకులం బిలిచి పనిచినం గొంద ఱకార్యంబునకు సమ్మతింపక కినుకం బడిరి. కొందఱు వాలమాత్రసూక్ష్మాకారులై వహించి వాలంబునందు వ్రేలిరి. అంతఁ దత్పరీక్షణంబునం వినత యోటువడి

కద్రువకు దాస్యంబు సేయుచుండె. మఱి యేనూఱువత్సరం
బులకుఁ దృతీయాండంబునం దుదయించినగరుత్మంతునివలన
నమృతహరణంబు నిష్క్రియంబుగా దాస్యంబువలన
విముక్తిం బొందె. కుంభసంభవ! నీయడిగినప్రశ్నంబునకు
నిది ప్రత్యుత్తరంబు. 24

సీ. పక్షిసామ్రాజ్యసంపత్పదభ్రంశంబుఁ
బొందినపెనుగూబపులుఁగుతేఁడు
కటిభాగమున కథగికాయంబు శేషంబు
పేలవం బగుపుట్టు పిచ్చుకుంటు
సవతి కేనూఱువత్సరములదాఁక దా
స్యంబుసేసి కృశాంగి యైనవినత
యనిలాశనులను వీఁపునఁ బెద్దకాలంబు
భరియించి తిరిగినపక్షిరాజు

తే. తర్లి నలువురుఁ గాశికాస్థానసీమ
హరుని ప్రతినిధు లైనభాస్కరులఁ గొలిచి
యచిరకాలంబునన యభీష్టార్థసిద్ధిఁ
గనిరి ప్రతిబంధములు వాసి కలశజన్మ! 25

వ. గరుడునిపేర గరుడాదిత్యుండును, నులూకంబుపేర మయూ-
ఖాదిత్యుండును, వినతపేర వర్షాదిత్యుండును, నరుణునిపేర
నరుణాదిత్యుండును ననం బరఁగిరి. ఇంక వృద్ధాదిత్య కేశ
వాదిత్య విమలాదిత్య గంగాదిత్య యమాదిత్యుల మాహా
త్మ్యంబులు సెప్పెద నాకర్ణింపుము. 26

సీ. వృద్ధహారీతుండు వృద్ధత్వమునఁ బాసి
తరుణుఁ డై రవిఁ గొల్చి వరము వడసె

¹ఆదికేశవదేవుఁ డభ్యాసమున నుంచి
రవి శంభుఁ గనిపించె రత్నమూర్తి
విమలాహ్వయుఁడు రాజు కమలబంధు భజించి
ప్రబలకుష్ఠవ్యాధిబాధఁ బాసెఁ
దొల్లిగంగ భగీరథుఁడు తెచ్చునప్పు డ
న్నదిఁ జూచి వినుతించినాఁడు తరణి
తే. యముఁడు యమతీర్థమునఁ దండ్రి నర్కుఁ గొలిచి
తపము గావించి వడసెఁ దత్కరుణ గాన
*నిన్నిచిహ్నలఁ గాశిలో నినులపేళ్లు
వాట మైయుండు ధర వాని వానివలన. 27

శివుండు బ్రహ్మం గాశి కనుపుట.

వ. వెండియుం గాశీవియోగవేదనాక్రాంతస్వాంతుం డై యంధకారాతి తద్వృత్తాంత శ్రవణకౌతూహలంబున విధాత మహాపరేతనిలయంబునకుం బంచువాఁ డై యవ్విరించి రావించి యి ట్లనియె. 28

ఉ. పోయెను యోగినీబలము పోయినపోక నెపోయెఁ బిమ్మటం
దోయజబాంధవుం డతఁడునుం దడసెం గడుఁ ²జెర్వుఁ జూడఁ
గాఁ, బోయినతూఁడుతీఁగె క్రియఁబోయినయట్లనె కాశిఁ జిక్కెరీ

---

1. ఇది ప్రాఁతవ్రాఁతప్రతులపాఠము. సంస్కృతమూలమునకుఁ గొంత వఱకు సరిపడుచున్నది. పూర్వముద్రితగ్రంథమున 'ఆదికేశవదేవుఁ డభ్యాసమున నుబ్బి, యనిశంబు గొల్చిన యర్కమూర్తి' యనియున్నది. ఈపాఠము చింత్యము. *'నిన్నిచిన్నెలఁ గాశిలో నినులపేళ్లు' అని వ్రాఁతప్రతులపాఠము.

2. 'నీరుచూడఁగాఁ, బోయినయట్టి తామరలపోలికి నందఱు కాశిఁ' అని పాఠాంతరము.

తోయము నీవుపో ద్రుహిణ! తొల్లిటివారలయట్ల కాకుమీ!

వ. అనినం బ్రసాదం బని పనిపూని బ్రహ్మ వృద్ధబ్రాహ్మణవేషం
బునఁ గాశిం బ్రవేశించి పేరోలగం బున్న దివోదాసు నాశీ
ర్వదించి యి ట్లనియె. 30

తే. అధిప! యానందకాననాభ్యంతరమున
యజ్ఞములు సేయువాఁడ నీయభ్యనుజ్ఞ
ననుమతింపుము సాహాయ్య మాచరింపు
రాజు నడపింప కెట్లు ధర్మంబు నడచు? 31

తే. అకట! విశ్వేశ్వరుఁడు లేమి ననదవోలె
నున్నయది కాశికాపురి యోనృపాల!
యున్న వేల్పులు రాకుండ నున్నఁగాని
వామదేవుని రప్పింపవలెఁ జు మయ్య! 32

వ. అని [1]మైవాకగా నాడి యర్ధాంగీకారంబు వడసి ధాత దశా
శ్వమేధయాగంబులు సుప్రయోగంబులుగా నాహరించి
బ్రహ్మేశ్వరదేవుఁ బ్రతిష్ఠించె. భాగీరథీపశ్చిమతీరంబున నంత
ర్గేహంబు దక్షిణద్వారంబున దశాశ్వమేధంబు సర్వతీర్థో
త్తమంబు. 33

తే. ధాత గాశీపురంబునఁ దడయుటయును
నుల్లమునయందుఁ గోపింపకుండె శివుఁడు
రాజమౌళికి మూర్త్యంతరంబు గాదె
గణనసేయంగ నానందకాననంబు?

ఈశ్వరుండు ప్రమథులం గాశి కంపుట

వ. అపుడు గౌరీకాంతుండు నిజాంతర్గతంబున 'యోగినీబృం

---

1. 'మైపోక గా నాడి' అని పా.

నంబు మసలె, వినస్వాంతుండు వెనుక మఱచె, నంభోజసం
భవుండును గదలనికంబం బయ్యె, నిఁకిం బరమవిశ్వాసనిధు
లగు ప్రమథులం బంచెదంగాక!' యని బహుమానపురస్సరం
బుగా నొక్కతోయంబున శంకుకర్ణమహాకర్ణులను, నొక్కవగ
ఘంటాకర్ణమహాకాళులను, నొక్కకెడ సోమనందినందిషేణ
కాళపింగళకుక్కుటులను, నొక్కవర్గంబునఁ గుండోదర
మయూరబాణగోకర్ణులను, నొక్క మొత్తంబునం దిల
కర్ణసూలకర్ణద్రుమ చండప్రభామయసుకేశచ్ఛాగ కపర్దిపింగ
లాక్ష వీరభద్ర కిరాత చతుర్ముఖ నికుంభ పంచాక్ష భారభూ
తత్ర్యక్ష క్షేమకవిరాధసుముఖాదిపాషండులనుం బంచిన. 35

తే. భక్తపని పూని నిజముగాఁ బ్రతిన వట్టి
పోదు రానందకాననంబునకుఁ బోయి
[1] మోహమాహాత్మ్య మెట్టిదో మునివరేణ్య?
ప్రమథు లప్పుడ మఱతురు భవునియాజ్ఞ. 36

శా. నేమం బొప్పఁగఁ గాశికానగరికి న్విశ్వేశ్వరాజ్ఞామహా
సామర్థ్యంబు జటాకిరీటములపై సంధించి ము న్నొప్పి యి త
త్సీమాంతంబున నంతయున్మఱచి యాసిద్ధుల్ శివార్చారతిఁ
స్వామిద్రోహము వాపికొం డ్రచట మెచ్చన్వచ్చుఁదద్జ్ఞానమున్.

వ. అందుఁ గపర్ది యను ప్రమథుఁడు ప్రతిష్ఠించినపర్దీశ్వరలిం
గంబు ప్రభావం బుపన్యసించెద నాకర్ణింపుము. 38

కపర్దీశ్వరప్రభావకథనము

సీ. కాశి కుత్తరదిక్ప్రదేశంబునం దుండు
విమలోదకం బనుకమలసరసి

---

1 'నరవరేణ్యుని మోహమాహాత్మ్యమును' అని వ్రాతప్రతి.

యాభావితేటనీ రాస్వాదించిన నందుఁ
దీర్థమాడినఁ బితృదేవతాళి
కలిభక్తిఁ దర్పణం బాచరించిన మర్త్యుఁ
డఘకోటిఁ దున్మి తూటాడఁ జాలు
నీయర్థమున కొక్కయితిహాస మే నీకుఁ
జెప్పెద దృఢభక్తిఁ జిత్తగింపు

తే. మాదిఁ ద్రేతాయుగంబునయం దొకండు
హరునిభక్తుఁడు వాల్మీకి యనఁగఁ గలఁడు
వాఁడు హేమంతఋతుకాలవాసరములఁ
దివిరి యక్కుండమునయందుఁ దీర్థ మాడు. 39

వ. ఒక్కనాఁడు మధ్యాహ్నవేళ నవ్వాల్మీకి విమలోదకుండం
బునం గ్రుంకువెట్టి యనంతరంబ యాపాదమస్తకంబుగా
భస్మోద్ధూళనంబు సేసి రుద్రాక్షమాలికలు ధరించి కపర్ది
శ్వరమహాదేవుసమ్ముఖంబునం బంచాక్షరీ పంచబ్రహ్మశత
రుద్రాద్యాదిమంత్రంబుల ధ్రువమఠ ప్రతిమఠలంబకరాసకాదుల
నేలాకర రేంకి(తేంక)వర్తన్యాదులును సూతశుద్ధసూళ భేదం
బులు నెడనెడఝంఝం టంటం ప్రధాననానాస్తోభాక్షరంబులు
సరిగమాదిస్వరంబులు దివ్యస్తుతిపదంబులు త్రిపురవిజయ
దక్షాధ్వరధ్వంసాదిబిరుదంబులు శంఖమురజాది వాద్యంబులు
ధేవంబులు సంఘటించి విస్ఫురితాందోళితంబులు ద్రిభిన్నాది
గమనభేదంబులతోడ నయ్యయిప్రయోగంబుల నాహత
ప్రత్యాహతంబులు పుట్టించుచుఁ, జంచత్పుటచారపుట
షట్పితాపుట(త్ర)సరద్వేష్ట కోద్ఘట్టితాదితాళంబుల ఘంటీ
రవశంకరాభరణాది (గ్రామంబులను) రాగరాగాంగభాషాంగ

క్రియాంగోపాంగాది దేశిరాగంబులను సంఘటించి దత్తిలకో
హాళభరతమతంగ నందికేశ్వరాదిమతానుసారంబున వివిధ
ప్రబంధముల నిర్మించి వానికి బహువిధస్థానకమండలచారి
(కా)చరణాంగహారరేచకధవళకనతనాదిశిరో భావచతుర్భావ
చాలనంబులు మెఱయ దేశీమార్గలాస్యతాండవంబులుపరిఢ
వించుచు, నిట్లు తాన తూర్యత్రయంబు ననుసంధించుచుఁ
గొంత దవ్వవ్విరూపాక్షునిఁ జాక్షుషం బైన యోగంబున
యజించుచుండె. అయ్యవసరంబున. 40

సీ. ఘ్రాణంబు నీచమై కన్నులు పల్లనై
యుదరంబు వీఁపుతో నొత్తగిల్లఁ
జేదోయి గుఱుచ యై చెవులు విల్వంక లై
పూసకొమ్ముకములు బోటుకట్ట
వక్షంబు గుంత యై వర్త(ర్ణ)ంబు పరుస నై
తెఱనోరఁ గ్రేవుఁడు తీఁగె సాఁగ
శీర్షంబు వలుద యై చెక్కిళ్లు లోఁతు లై
ముష్కద్వయీశిశ్నములు గృశించి

తే. యస్థిచర్మావశేషావయమ్ములమర
జుజురుకొన్న తనూరుహస్తోమములను
బొలుసుకంపున భీభత్స వాదమఁ జేయఁ
గట్టెదుర వచ్చి నిలిచె రాక్షసుఁ డొకండు. 41

వ. ఇట్లు బహిరంగంబున రాక్షసుం జూచి వాల్మీకి పంచాక్షరా
ఘోరపాశుపత మంత్రాభ్యాసనావశంబునం బుట్టినదిట్ట
తనంబునం దెరలకనిలిచి, యోరీయెవ్వఁడ? వెటనుండి వచ్చితి?
వెచ్చోటి కేగెదవు? దృష్టిపథంబున నిలిచిన పిశాచభూత

బేతాళకూశ్మాండప్రేతనికరం(రంకం)బులలో నొక్కరుండవు
గావలయు, నేము తపస్వులము, శివనామజాపకులము,
మంత్రస్థులము, భస్మోద్ధూళనవస్త్రధారులము, దుద్రాక్ష
మాలికాకరతూవజ్రపంజరమధ్యస్థితులము, మముఁబోంట్ల నీకు
వెఱపింపంబనిలేదు; చేర రాకు మల్లంతనయుండు మనినం
గృతాంజలి యై యాభూతం బమ్మహీసురున కిట్లనియె. 42

తే. ధాత్రి గోదావరీసింధుతటమునందుఁ
ప్రథిత మైనప్రతిష్ఠానపట్టణమున
నగ్రజన్ముండ దుష్టప్రతిగ్రహముల
కారణంబుగ బ్రహ్మరాక్షసుఁడ నైతి. 43

తే. ఎండ నెండితి మంచున నివము కొంటి
వానఁ దడిసితి మంచున వడఁకు చుంటి
గాలిఁ దూలితి నశనంబు గాన నైతి
డప్పిఁ గుందితి డస్సి దట్టంబ నైతి. 44

వ. ఇవ్విధంబునఁ బెద్దకాలంబు కుతిలపడి యాచారవిరహితుం
డైన యొక్కపురుషునాశ్రయించువాఁడనై నిరాధారంబునఁ
జరించుచు నొక్కనాఁడు. 45

సీ. మాటలాడుచు మూత్రమలము లుత్సారించు
మిహిరోదయమ్మున మేలుకొనఁడు
సంధ్య వార్వఁడు మంత్రజపసంయుతంబుగ
విడికచ్ఛతో నుండు విడువ కెపుడు
బ్రహ్మసూత్రము ధరింపఁగ సిగ్గు వహియించుఁ
జల్దియోగిరము నిచ్చలు భుజించు

ఋతువేళలఁ బరిగ్రహింపఁడు నిజభార్య
నన్యకళత్రంబు నభిలషించు
తే. నెవ్వఁ డవ్విప్రదాయాదుఁ డేగుదెంచె
మార్గవశమున భాగ్యసామగ్రికలిమి
నాశ్రయించితి నతని మధ్యాహ్నవేళఁ
బ్రాంతదేశంబునం దొక్కరావి నుండి. 46

వ. అతం డిప్పు డర్థార్జనంబునకు నిక్కాశికాపురికిం జనుదెంచె. పుణ్యక్షేత్రప్రభావంబునం బరాభూతుండనై బహిర్భాగం బునన యున్నవాఁడ. ఇంక నేమిసేయుదు ? ఆధార భూతం బైన యతనిం గోలుపోయితి. ఎచ్చోటనుండియేనియు నేతెంచి కాశికాపురిరక్షకులు నన్ను బాధపెట్టుదురోయని భీతి యయ్యెడు. నిన్ను శరణంబు వేఁడెద. మహాత్మా! రక్షిం పవే! యనినం గృపావశంవదుండై యవ్వాల్మీకి కక్షపాలం బులోని విభూతి హస్తంబున ధరియించి డగ్గరం జని పంచా క్షరీ మంత్రంబున నభిమంత్రించి లలాటంబున రక్షాతిలకంబు లిఖించి 'కాశికానగరంబు ప్రవేశింపుము, మద్విభూతిధారణ మహిమంబున నిన్ను భైరవాదులు భర్జింపనోడుదురు. కప ర్దీశ్వరదేవు దర్శింపుము. అద్దేవుండు నీకు నరిష్టనిరసనంబును, నిష్టావాప్తియుం జేయు' ననిన మహాప్రసాదం బని యతం డట్లు చేసి ముక్తుం డయ్యె. ఇది కపర్దీశ్వరమాహాత్మ్యంబు.

క. అందఱు పారిషదులు నీ
చందంబున శంభులింగసంస్థాపన మా
నందవనీనగరంబున
యం దొనరించిరి యతిప్రయత్నంబులతోన్. 48

తే. కలశసంభవ! విశ్వేశకులగృహంబు
కటకసాధారణంబె? శ్రీకాశినగర
మిందురేఖావతంసు మోహింపఁ జేయఁ
జాలు నఁట! దానిమహిమ గోచరమె పొగడ? 49

ఉ. కీటపతంగసర్ప పశుకీశమృగాది సమస్తజంతుసం
ఘాట మఖండనిద్రకయి కాశికఁ గన్నులు మోడ్చ నంతలో
కైటభజిద్విరించిబలసూదనముఖ్యసమస్తదేవతా
కోటికిరీటకూటములఁ గూర్చు నమస్కరణాప్తహస్తాంజలుల్. 50

క. ఏనాఁటనుండి వచ్చియు
మానవు లేర్కొంద్రు ముక్తి మైత్రావరుణీ!
యానందకాననంబున
నానాకైవల్యశోభనము లనుఫలముల్. 51

తే. మరణ మానందవనములో మంగళంబు
భూతి కాశీపురంబులో భూషణంబు
గోఁచి యవిముక్తమునయందుఁ గుంభజన్మ!
పరమనిర్వాణజనులకుఁ బట్టుచేల. 52

వ. కుంభసంభవా! దశాశ్వమేధతీర్థంబున దశహరాఖ్యతటినీ దశాశ్వమేధేశ్వరుల దర్శించి మానవుండు దశజన్మార్జితంబులైనపాపంబుల దహించు శంకుకర్ణేశ్వరు శశాంకకళాలంకారు, మహాకర్ణేశ్వరు దృక్కర్ణకుండలు, ఘంటాకర్ణేశ్వరు ముక్కంటి, మహాకాళేశ్వరుఁ గాలగళు, హిమనందీశ్వరు నందివాహను, నందిషేణేశ్వరుం గందర్పదమనుఁ, గాలపింగళేశ్వరు గంగామౌళిఁ, గుక్కుటేశ్వరు లలాటాక్షుఁ, గుండోదరేశ్వరుఁ బాండురాంగు, మయూరేశ్వరు నారాయణ

ప్రియుఁ, బాణేశ్వరుఁ బినాకపాణిఁ, జలకర్ణేశ్వరుఁ జతుర్ని
గమమౌళిరత్నంబు, శృగాలకర్ణేశ్వరుఁ గరుణాపూర్ణహృద
యు, ద్రుమిచండేశ్వరు సంధ్యాతాండవప్రియుఁ, బ్రభామ
యేశ్వరుఁ ద్రిభువనాధిపతి, సుకేశేశ్వరు నాకాశకేశుం గొలిచి
మర్త్యుండు కార్తార్థ్యంబు నొందు. కపర్దికోదగ్భాగంబునఁ
బింగళాక్షీశ్వరు, నవిముక్తేశ్వరునకుఁ బశ్చాద్భాగంబున వీర
భద్రేశ్వరుఁ, గేదారేశ్వరు దక్షిణభాగంబునం గిరాతేశ్వరు,
వృద్ధకాలేశ్వరుసన్నిధిం జతుర్ముఖేశ్వరు, విశ్వేశ్వర శ్రీమన్మ
హాదేవుదక్షిణంబునం బంచాక్షేశ్వరు, నంతర్గృహోత్తర
భాగంబున భారభూతేశ్వరుం, ద్రిలోచనేశ్వరుపురోభాగం
బునఁ ద్ర్యక్షేశ్వరు, విశ్వేశ్వరోత్తరభాగంబున లాంగలే
శ్వరు, భజింపఁబంచజనుండు పంచమహాపాతకంబుల భం
జించు. ఇవ్విధంబునం బ్రమథులు లింగప్రతిష్ఠ లాచరించి, లిం
గార్చనాపరులయి వారాణసీపురంబునం బ్రతివసించుటయు.

క. చింతించె విశ్వనాథుం
డంతఃకరణమున నేయుపాయంబున నేఁ
గాంతునొకో కాశీపు
ర్యంతం బని మందరాచలాగ్రస్థితుఁడై. 54

సీ. ఏమి సేయునో యోగినీమండలం బిష్ట
కాశికాకటకశృంగాటకముల ?
నానందకాననాభ్యంతరంబునయందు
బిసరుహాప్తుండేల మసలె నొకో ?
వారాణసీపురావాససౌఖ్యంబుల
మఱగి వాక్పతి మమ్ము మఱచె నొకో ?

గణనాయకులు శంకుకర్ణాదు లవిముక్త
మండలిఁ గాఁపురం బుండి రొక్క ?
తే. యొక్కమతమున వీరందు నునికి మేలు
భేదమున నన్యరాజ్యలక్ష్మికిఁ బెనంగు
నాకు నాయంతవారి నన్వంగఁ గలిగెఁ
దడసి కార్యంబుఁ గొనుట హితంబు కాదె ?. 55

తే. ఊరకుండంగ నేటికి ? వారణాస్యఁ
గాశి కనిచెద వృత్తాంతగతులు దెలియ
బుద్ధిమంతుండు పోకలఁ బోవ నేర్పు
కూర్పు విప్పంగ నోపు నాకొడుకుఁగుఱ్ఱ. 56

వినాయకుండు గాశి కేగుట

వ. అని వినాయకు రావించి బుద్ధు లానతిచ్చి పంచినం బని
పూని కాశికానగరంబున కరిగి. 57

సీ. గంధర్వనగరరేఖలు మేఘపథమునఁ
జేకొండుదులు వేశ్మసీమలందు
నమరకోదండఖండము నట్టనడు రేయి
ధూమకేతువు జలస్వామికాష్ఠఁ
గర మరిష్టము లైన కలలు నిద్రలయందుఁ
గాఁపున్న యిండ్ల శృంగములపులుఁగు
గంధర్వసమితితోఁ గల నగ్నికణములు
పురవీథికామధ్యమున వఱల్లు
తే. బాష్పసలిలంబు దేవతాప్రతిమలందుఁ
గలుగఁజేయుచుఁ బ్రజల కాకస్మికంబు

వెఱపు పుట్టించు నందంద విఘ్నరాజు
ప్రతిదినంబును గాశికాపట్టణమున. 58

తే. తాన యుత్పాతములు మూఁడ్పుఁ బరతరంబ
తాన విధియించుచుండు నుత్పాతశాంతి
తాన హిత మాచరించు మిత్రంబ పోలెఁ
దాన వెఱపించుచుండు దుర్దశలు చెప్పి. 59

సీ. కలలోనఁ బుట్టినకథ లెన్ని యన్నియుఁ
బూసగ్రుచ్చినయట్టు పొసఁగఁ జెప్పు
హస్తరేఖలు చూచి యాయుష్యమును భవి
ష్యము తేట తెలివిగా నానతిచ్చుఁ
గూతుఁ బిడ్డలు నీకుఁ గొడుకు బిడ్డలు నీకు
నని మోము సూచి సత్యంబు నుడువుఁ
దాతగా రనువానిఁ దనవారితన మొప్పు
గురుసు మోపకనొండు సరసమాడు

తే. వ్రతము నోమించు దివసవారములు నొడువు
ననుగలం బైన భామినీజనులయెడను
గుండబొజ్జయు శిఖయును గుఱుచ పొడవు
ప్రేలిదర్భాంకురము లొప్ప విఘ్నరాజు. 60

ఉ. ఏనిక మోముబూమియవహించి చరించుచునుండు కామధు
గ్ధేనువు డుంఠి కాశి నిది తెల్లము వేలుపుగిడ్డి గానినాఁ
డీనునె మోక్షతర్ణకము? నిచ్చునె కాంక్షిత దుగ్ధధార దూ
ర్వానవపల్లవావలులు వైచినమాత్రన భక్తకోటికిన్? 61

వ. ఇవ్విధంబున దివ్యాంతరిక్షభౌమోత్పాతంబులు పుట్టించి
నానాప్రకారంబులఁ జరించుచుం గాశీపట్టణంబున కచిర

కాలంబునం దరిష్టంబు ప్రాపింపంగల దనువార్త మ్రోయించి
హితుండునుం బోలె లోలోన బోధించి పౌరజనంబులం
గొంచఱం గుటుంబసహితంబుగా వెళార్చి, యంతం బోవక
యంతఃపురంబులు మాయాబలంబునం బ్రవేశించి, రాజ
శుద్ధాంత కాంతలకు విస్రంభభాజనంబై జితేంద్రియుం డను
ష్ఠానపరుండు శమదమాదిగుణగరిష్ఠుండు సత్యసంధుండు
నిస్పృహుండని తన్ను సర్వజనులు సంస్తుతించునట్లుగా ఢుంఠి
భట్టారకుం డను నామంబున మెలంగి, లీలావతి యను పట్టపు
దేవిముఖంబున దివోదాసుం గాంచి యతండడిగిన ప్రశ్నంబు
లకు సదుత్తరంబు లిచ్చి మెచ్చువడసి, యతని పురోహితు
లలో నొక్కరుండయి వర్తించుచుండె నంత నొక్కనాఁడు.

ఉ. వారక కాశియందు నలువంకలఁ బుట్టెడు దుర్నిమిత్తముల్
పౌరులు విన్నవింప నరపాలుఁడు విస్మయమంది తత్ప్రతీ
కారము నాచరించుటకుఁ గా హితచింతకు నాప్తు ఢుంఠిభ
ట్టారకుఁ బిల్వఁబంచి నికటంబుననుండి ప్రియంబెలర్పఁగాన్. 63

తే. చెప్పుమా ఢుంఠిభట్ట! కాశీపురమునఁ
బుట్టుచున్నవి యుత్పాతములు దఱుచుగఁ
గారణం బెద్ది దీనికిఁ? గలుష మెట్లు
వాటిలెనో? ధర్మ మేవంకఁ బల్లటిలెనో? 64

వ. అని యడిగిన నతం డిట్లనియె. 65

తే పార్థివోత్తమ! యిమ్మహోత్పాతములకు
శాంతిఁ గావింతు మంత్రరక్షాబలమున
నాకుఁ జూడంగఁ గాశికానగరి విడిచి
యుండఁ దగుఁ గొన్నినాళ్లు నీ వొక్కవంక. 66

శా. ఆత్మార్థంబు ధనంబు ధాన్యమును నాత్మార్థంబు పశ్వాదికం
బాత్మార్థంబుహితా ప్తబంధుజనమాత్మార్థంబుగేహోచ్ఛ్రియం
బాత్మార్థంబు పరిత్యజింపఁ దగు రాజ్యంబైన నస్పంద మై
'యాత్మార్థంపృథివీంత్యజే' త్తనెడువాక్యం బశ్రుతంబే నృపా?

వ. అని చెప్పి యింకనుం బెగ్గలతోడ విచారించునది. ఏను దిక్కాలజ్ఞుండ. నేఁటికిఁ బదునేనిమిదియగుదినంబునకు నుత్తర దేశంబునుండి యొక్క బ్రాహ్మణుండు రాఁగలం డతండు నీకు హితోపదేశంబు సేయంగలండు. తద్వాక్యంబులు ప్రమాణీకరించునది యని డుంఠిభట్టారకుండు నిజనివాసంబున కరిగె నంత నక్కడ. 68

శివుండు విష్ణుని గాశి కనుచుట

క. అరవిందాక్షునిఁ గనుఁగొని
హరుఁడును గాశీప్రవృత్తి యారయఁ బంచెన్
గరివదనుండును నీవును
బరికింపఁగ నేకకార్యపరు లై యనుచున్. 69

క. పనిపూని కాశికిం జని
వనరుహాలోచనుఁడు వెడఁదవాలికకన్నుల్
తనకుఁ గలఫలముఁ గాంచెన్
బనివడి తద్విభవలక్ష్మిఁ బరికించునెడన్. 70

వ. గంగావరణాసంగమంబునం బాణిచరణతలంబులు ప్రక్షాళించి యవగాహనంబు చేసె. అదికారణంబుగా నత్తీర్థంబు పాదోదకతీర్థంబు నాఁ బరఁగె. కృతకాలోచితక్రియాకలాపుం డై పుండరీకాక్షుండు. 71

తే. త్రిపురకాంతలశీలంబు లపహరింప
బుద్ధివేషంబు గైకొన్న పోకులాఁడు
జలజనాభుండు సుగతవేషము ధరించెఁ
గాశికాప్రజలకుధర్మగతి హరింప. 72

వ. పుణ్యకీర్తినామంబు వహించి తనమూలభృత్యుం డైనగరుత్మంతునకు వినయకీర్తి యనుపేరువెట్టి యతని శిష్యుంగాఁ బరిగ్రహించి, లక్ష్మిం బరివ్రాజికం గావించి యమ్మహాదేవికి విజ్ఞానకౌముది యనునామధేయంబు గల్పించి, తానుశిష్యుండును నొక్కముఖంబున బురుషులం బ్రమోహింపను గమలయొక్కతియు నొక్కముఖంబున బురంధ్రీజనంబులం బ్రలోభింపను సంకేతంబుగాఁ జేసి వేఱువేఱుమార్గంబులం గాశికాపురంబుఁ బ్రవేశించి. 73

విష్ణువు మాయావేషంబున గాశియందు బౌద్ధధర్మంబు స్థాపించుట

తే. పటమునందు నాగరలిపి ప్రస్ఫుటముగ
వరమషీతూలికాలేఖ వ్రాసినట్టి
యర్హతాగమగ్రంథ మత్యాదరమున
*జట్టు పఠియింప బోధించు సద్గురుండు. 74

---

* ఇచట 'పరసఁ బఠియింప' అని పూర్వపూర్వతర ముద్రితపుస్తకముల పాఠము. ఆంధ్రసాహిత్యపరిషత్తులో లభించిన తాళపత్రపుస్తకమునందును మఱికొన్ని వ్రాతపుస్తకములందును 'జట్టు' అనియే కనఁబడుచున్నది. ఈపదమె యిచటఁ బొంకముగఁ గుదిరి యున్నది. ఈపదము తప్పను నభిప్రాయమునం గాఁబోలు 'పరస' అని దిద్దిరి. శబ్దరత్నాకరములో 'జట్టు=జనసమూహము. (ఇది విచార్యము)' అని వ్రాసియున్నారు. ముద్రితపుస్తకమున నీపదము మార్పఁబడినందునఁ బ్రయోగము లభింపక యట్లు వ్రాసియుందురని తోఁచుచున్నది.

తే. తత్త్వదృష్టి ననాదిసిద్ధంబు భవము
భవముఁ బుట్టింప నడఁగింపఁ బ్రభుఁడు లేఁడు
దనకుఁ దా నుద్భవం బొందుఁ దనకుఁ దాన
విలయముల బొందు భవ మిది వినయకీర్తి! 75

తే. బ్రహ్మవిష్ణురుద్రాదుల బ్రదుకు లెల్లఁ
బట్టిచూడంగ మనబోంట్ల బ్రతుకులట్ల
యనఘ! వారిదేహంబులు నస్మదాది
దేహములఁ బోలెఁ గాలంబు తినును గాన. 76

క. భద్రగుణా! యాహారము
నిద్రాభయమైథునములు నిఖిల మగుతనూ
భృద్రాజికి సాధారణ
ముద్రలు మఱి తారతమ్యములపను లేలా? 77

సీ. హంసతూలికపాన్పునందు రానేలను
శయనించువారికి సరియె నిద్ర
మెఱుఁగుదీఁగలఁ బోలుమెలఁత లెందఱు గల్గి
నప్పుడు నొక్కతొయ్యలియ రతికి
దప్పికి నీరు వంటక మాఁకలి కశేష
జంతుసంతతి కాత్మశక్తికొలది
యాకీట మాకైటభాసురాంతక మెల్ల
ప్రాణికోటికిఁ బ్రాణభయము సమము

తే. గానఁ దమయట్ల యెదిరినికాన్పుగాన్పు
జీవులకుఁ దారతమ్యంబు సెప్ప వలదు
సర్వభూతములందును సమత మేలు
కరుణ చేపట్టవలయుఁ గాఁ గాదు హింస. 78

తే. చెదలు నీర్పేను మశకంబు చీమ నల్లి
యల్ప మనుబుద్ధి హింస సేయంగ వలదు
వానిహృదయంబులం దున్న వాఁడు జీవుఁ
డాతఁ డల్పుండె యితరజీవాత్మకంబె? 79

వ. సుఖంబ స్వర్గంబు. దుఃఖంబ నరకంబు. శరీరత్యాగంబు మోక్షంబు. [యం

మ. అహాహా! వేదము దానచెప్పను 'నహింస్యాత్సర్వభూతాని' చహాహా? తానకదా క్రతుక్రియలఁ బశ్వాలంభముల్ మేదినీ రుహవిచ్ఛేదముఁ జేయఁజెప్పు! నదియుం ద్రోహంబు కాదో కదా! బహుభాషల్దిరుగంగ నాడుటలునుం బ్రామాణికత్వంబు లే?

వ. అహింస పరమధర్మంబు. హింస నరకభీరువులైననరులు పరిత్యజించునది. హింసకుండు నరకంబునకు నహింసకుండు స్వర్గంబునకుం జను. దానంబు లనేకంబులు గలుగ నవియు నభిమతదానంబును బోలనేరవు. పరమపురుషులును నానా శాస్త్రసిద్ధాంతంబు లాలోకించి భీతున కభయదానంబును, వ్యాధితునకౌషధదానంబును, శుశ్రూషకునకు విద్యాదానంబును, నాఁకొన్నవారి కన్నదానంబును దానంబులలో నెల్లం బ్రశస్తదానంబు లని చెప్పుదురు. మణిమంత్రౌషధప్రభావంబు లచింత్యంబులు. ప్రయత్నంబునం దద్విద్యాభ్యాసం బాచరించునది. పరిపూజ్యంబులు ద్వాదశాయతనంబులు. అవి యెయ్యవియం టేని, కర్మేంద్రియజ్ఞానేంద్రియపంచకంబులును మనోబుద్ధులును. అవి హేతుదృష్టాంతంబులం బ్రమాణ ప్రమేయాదిషోడశపదార్థవాదు లగు నైయాయికులను, ద్రవ్యగుణాదిషట్పదార్థవాదు లగు వైశేషికులను, నవ్యక్త

మహదహంకృతి చతుర్వింశతి తత్త్వవాదు లగుసాంఖ్యులను,
శివశక్తిసదాశివేశ్వర విద్యాతత్త్వప్రభృతి షట్త్రింశత్తత్త్వ
వాదు లగుశైవుల నవలంబించుచుఁ బ్రత్యక్షానుమానోప
మానార్థాపత్తి జ్ఞానంబులయందు నింద్రియార్థసన్నికర్షోత్ప
న్నంబై యవ్యభిచారియు వ్యవసాయాత్మకంబు నగుజ్ఞానంబు
ప్రత్యక్షంబని ప్రత్యక్షజ్ఞానంబు సర్వజనులకుం దేటతెల్లంబు
గావునఁ బ్రత్యక్షం బవలంబించి యుండునది యని యెల్ల
వారికిఁ దమతమధర్మంబులు విడిచి సుగతధర్మంబు చేపట్టు
నట్లుగాఁ బుణ్యకీర్తినామధేయుం డగుమధుసూదనుండు
వినయకీర్తినామధేయుం డగుశిష్యు గరుత్మంతు బోధించు
చుండె; నంత వేఱొక్కయెడ విజ్ఞానకౌముది యనుపేరు
వహించి పరివ్రాజికావేషధారిణి యగు విషధికన్య యుప
న్యాసచాతుర్యం బొప్ప మాధుర్య గుణాధుర్యం బుల మధు
సమయ మంథర గంధసార గిరిగంధవాహ ప్రవాహలహరికా
స్ఫాలనానందకందళితమాకందవిఘుప్రణకిసలయరసాస్వాద (న)
కషాయకంఠకలకంఠకామినీకోమలకుహూయమాన కోలా
హలపంచమంబు ననుకరించు తిన్ననియెలుంగున, 82

సీ. బ్రహ్మ మానందరూపం బంట తథ్యంబు
నానాత్మపరికల్పనంబు మిథ్య
ముదిమి నింద్రియశక్తి మొఱవపో కుండంగ
మైథునక్రీడ యేమఱమి యుఱవు
సౌఖ్యార్థి యైన యాచకుని కిచ్చుట పాడి
పంచభూతాత్మక ప్రకృతి తనువు

యౌవనంబులు పోయెనా రావు క్రమ్మఱ
సపరిక్షయమ్ములు సంచయములు

తే. గడచినప్పుడు క్రిము లొండెఁ గాకు లొండెఁ
గుక్క లొండేనియును భుక్తిఁ గొనెడు దేహ
మొకఁడు ప్రార్థించి నప్పుడ యొసఁగవలదె!
తన్ను నిచ్చుటయది గదా దానగుణము. 83

వ. వారి వర్ణంబు విచారింప వలదు. వృద్ధాచారంబు విచారించి చూచిన బ్రహ్మపుత్రులు గదా దక్షుండును మరీచియు. మరీచినందనుండైన కశ్యపుండు ధర్మమార్గంబునం దక్షుని కన్యకలఁ బదుమువ్వుర నెట్లు వివాహంబయ్యె? ఇదానీంతనులు మర్త్యు లల్పబుదు లల్పపరాక్రములు గావున నిది గమ్య యిది యగమ్య యని విచారంబు సేయుచున్నవారు. పరమపురుషునిముఖబాహూరుపాదంబులం జాతుర్వర్ణ్యంబు జన్మించె. ఒక్కతనువునందుఁ బుట్టిన నలువు రేకోదరు లౌదురో కారో? అట్టివారికి భిన్నవర్ణత్వం బెట్లు సిద్ధించుచున్నయది? కావున వర్ణావర్ణవివేకంబు విడిచి వలసినట్లు పురంధ్రీపురుషులు విహరించునది యని పెక్కు ప్రకారంబులవిజ్ఞానకౌముదిసౌగతశాస్త్రంబు వక్కాణింప విని పురాంగనలు భర్తృశుశ్రూషాదిధర్మంబు లుజ్జగించి రయ్యవసరంబున. 84

చ. వననిధికన్యయుఁ హరియు వాడలవాడల బౌద్ధధర్మముల్
జినమతముల్ నిరంతరముఁ జెప్పఁగఁ జెప్పఁగఁ గాశికాపురిఁ
దనతనధర్మముల్ విడిచి తామరసాయతలోచనాజనం
బును పురుషప్రతానము ను బూనెను బుద్ధజినవ్రతంబులన్.

తే. వర్ణములు నాశ్రమంబులు వరుసఁ దప్పె
వేదవేదాంగశాస్త్రముల్ విన్నఁబోయె
*నా(సారజ)ంబులు కృష్ణపక్షములుఁ జెడియె
వృద్ధిఁ బొందె నధర్మంబు విశ్వమునను. 86

—దివోదాసనిర్యాణము—

వ. అప్పుడు దివోదాసుండు ఢుంఢిభట్టారకుండు సెప్పిన విప్రుం డెప్పుడు వచ్చునోయని దివసంబులు లెక్కవెట్టుకొనుచుండం బదునెనిమిదవదివసంబున మధ్యాహ్నకాలంబునందు సుగతవేషధారి యగుమధుసూదనుండు బ్రాహ్మణవేషంబు దాల్చి యేతెంచి సముచితప్రకారంబున దివోదాసుం గాంచి యాశీర్వదించి యతం డనుప సమున్నతకనకాసనంబునఁ గూర్చుండె. ఆవేళ విఘ్నేశ్వరుండు రాజహృదయంబునందు నావేశరూపంబున నధివసించె. వినాయకాధిష్ఠితుండై భూపతి వైరాగ్యంబు వహించి కపటబ్రాహ్మణున కిట్లనియె. 87

ఆ. బడలుపడితి రాజ్యభారంబు భరియించి
పొడమె మది విరక్తి భూసురవర!
ఏమి సేయువాఁడ! నెక్కడ కేగుదు?
నేమి దిక్కు? నాకు నెఱుఁగఁ జెప్పు. 88

వ. తపస్సామర్థ్యంబునం బర్జన్యాగ్న్యనిలాత్మకుండ నైతి. ప్రజ లౌరసులైనపుత్త్రులుం బోలెఁ బరిపాలింపంబడిరి. దేవతలం దృణీకరించిన యొక్కయపరాధంబునుం దక్క నాయందు గానవచ్చినయపకారం బొండు లేదు. నాభాగ్యంబున నీవు హితోపదేశంబు సేయ నాచార్యుండునుం బోలె నేగుదెంచితి. ఇంతకాలంబు నారాజ్యంబున నకాలమరణంబును

---

* శైవపక్షంబు కృష్ణపక్షంబు చెడియె.

జరావ్యాధిదారిద్ర్యంబులు లేవు. ఇప్పు డేమికారణంబుననో యవియును దివ్యాంతరిక్షభౌమోత్పాతంబులు పుట్టుచున్న యవి. నాకుం జూడ వేల్పులవేడబంబ కావలయు. మృత్యుంజయుండు త్రిపురవిజయంబును, నారాయణుండు బలిధ్వంసనంబును బురందరుండు వృత్రాసురవధంబును మాయాబలంబున నొనర్చిరి. బలవద్విరోధంబు దుస్తరంబగుట యిప్పు డెఱుంగంబడియె. ఇన్నియు నట్లుండనిమ్ము. ఏనును బదివేలేండ్లు రాజ్యంబు సేసితి. జరాభరాక్రాంతుండనైతి. ఇంద్రియంబు లుపరతింబొందుచున్నయవి. ఇంక సకలకర్మనిర్మూలనక్రమం బైనమోక్షం బపేక్షింపవలసియుండు. అమ్మహాపదార్థంబు నా కేయుపాయంబున సిద్ధించు నాయుపాయం బానతిమ్మనిన విని బ్రాహ్మణవేషధారి యగుహృషీకేశుం డమ్మహీవరున కిట్లనియె. 89

తే. కాశికాపట్టణమున లింగప్రతిష్ఠ
యాచరింపుము కల్పింపు హర్మ్యరేఖ
బొందితోడన కైలాసమున కరిగెద
వనఘ! నామాట వేదతుల్యంబు సూవె! 90

తే. పుత్రుఁ బట్టంబు గట్టుము బుద్ధి చెప్పు
మాతనికి దేవతాభక్తి యతిశయముగఁ
దనయసంక్రాంతసామ్రాజ్యతంత్రుఁ డగుచు
వనమునకు నేగఁ దగు రాజు వార్ధకమున. 91

వ. అని బుద్ధిచెప్పి బ్రాహ్మణుం డెక్కడికేనియుం బోయె. దివోదాసుండును సమాత్యుల, మండలేశ్వరుల, సధ్యక్షులం, బురోహితులం, బ్రతిహారుల, ఋత్విజుల, గణకుల, నంతగపుర

జనంబుల రావించి కుమారు సమసంజయు నందజికి నప్ప
గించి యతనికిం బట్టాభిషేకంబు సేసి కాశికానగరంబునందు
ధనసర్వశ్రీసమృద్ధియు వెచ్చించి మహాప్రాసాదంబు నిర్మించి
యందు శివలింగంబుఁ బ్రతిష్ఠించి కింకిణీజాలమండితం బైన
దివ్యవిమానం బెక్కి శరీరంబుతోడన శివలోకంబునకుం
జనియె. ఆప్రాసాదంబు సర్వశ్రీసమృద్ధివినియోగనిర్మితంబు
గావున భూపాలశ్రీ యనం బ్రసిద్ధిఁ గాంచె. దివోదాసేశ్వర
లింగంబు భాగీరథీతీరంబున భజించువారికి భుక్తిముక్తి
ప్రదాయకం బయి ప్రకాశించె. ఇది దివోదాసవృత్తాం
తంబు. ఈయుపాఖ్యానంబు విన్నను బఠించిన లిఖించిన
జనుల కాయురారోగ్యైశ్వర్యాభివృద్ధి యగు నని చెప్పి
కుమారుండు వెండియు కుంభసంభవున కి ట్లనియె. 92

చ. కరివదనుండు నిండిరయుఁ గైటభవైరియుఁ బెక్కుమాయల
న్వరణిపుఁ గాశికాపురమునం బెడఁబాపి పినాకపాణికిం
బరిమసముద్యమస్ఫురణఁ బంపిరి లేఖలు సర్వకార్యముల్
గరగరనయ్యె నమ్ము శశిఖండశిఖామణి! యంచు భక్తితోన్.

సీ. సంతోషమునఁ జతుష్షష్టిశక్తిగణంబు
నామోదనృత్తంబు నభినయించె
సవిలోలార్కకేశవ ఘటోల్కాదులు
పన్నిద్దఱు ప్రమోదభాజు లైరి
వనజాసనుఁడు నాల్గువదనంబుల నుతించె
వేదార్థముల భక్తి విశ్వనాథు
గణనాయకులు శంకుకర్ణ ఘంటాకర్ణ
నందిషేణాదు లానంద మొంది

తే. రఖిలమాయాప్రయోగవై యాత్మగరిమ
ఢుంఢివిఘ్నేశ్వరుండు వైకుంఠపతియుఁ
గమలవాసినియును నేకకార్యపరత
నాదివోదాసు వెడలంగ నడచుటయును. ౯౪

శివుండు సపరివారుండై కాశి కేతెంచుట

వ. అనంతరంబు విదితదివోదాసవృత్తాంతుండై యంతకదమనుం
డంబికయును మహాకాళవిశాఖనైగమేశులు రుద్రులు
ప్రమథులు దేవర్షులును దిక్పాలురుం గొలిచి చనఁ దేవఁ గిన్నర
కింపురుషగరుడగంధర్వసిద్ధవిద్యాధరులు జయజయధ్వనుల
తోడం గైవారంబులుసేయ నందివాహనారూఢుండై మంద
రనగంబునుండి యానందకాననంబునకు విజయంబుచేసి యవి
ముక్తమంటపంబునం బేరోలగంబుండి తత్కాలసన్నిహితు
లైనయోగినీభానుపద్మభవప్రమథలక్ష్మీనారాయణుల యథా
ప్రధానంబుగా సంభావించి ఢుంఢివిఘ్నేశ్వరు గంఠా
(గాఢా) లింగనంబుచేసి గండస్థలంబున నఖాంకుర వ్యాపారం
బునం బుజ్జగించుచు నిట్లనియె. ౯౫

సీ. నీకతంబునఁ గాదె లోకభీకరులైన
త్రిపురదానవుల మర్దింపఁ గలిగె!
నీకతంబునఁ గాదె కాకోలవిషవహ్ని
యలవోకయును బోలె నార్పఁ గలిగె!
నీకతంబునఁ గాదె నిరవగ్రహస్ఫూర్తి
నంధకాదులగర్వ మడఁపఁ గలిగె!
నీకతంబునఁ గాదె నేఁడు వారాణసీ
సంగమోత్సవకేళిసలుపఁ గలిగె!

తే. నాత్మజుఁడ వన్న మిత్రుండ వన్న భటుఁడ
వన్న సచివుండ వన్న నా కన్న నీవు
నిన్ను నెబ్భంగి వర్ణింప నేర వచ్చుఁ?
గంఠపీఠాగ్ర కరిరాజ! ఢుంఠిరాజ! 96

ఈశ్వరకృతఢుంఠిస్తవము

గ. జయజయ విఘ్నేశ్వర! భక్తనిర్విఘ్న కారక! అవిఘ్న
కర! సర్వగణాధీశ! సర్వగణాగ్రగణ్య! గణప్రణతపాదాబ్జ!
గణనాతీత! సగుణ! నిర్గుణ! సర్వజ్ఞ! సర్వేశ! సర్వభూత
విధాన! సర్వమాయాప్రపంచజ్ఞ! సర్వకర్తాగ్రపూజిత! సర్వ
మంగళ! యమంగళోపశమన! సిద్ధవంద్యపద! సిద్ధనాయక!
సర్వసిద్ధినిలయ! సర్వబలాధార! సర్వబలాశ్రయ! సర్వఫల
ప్రద! బలాకోజ్జ్వలదంతాగ్ర! యనంతమహిమాధార!
ధరాధరవిదారణ! దంతాగ్రప్రోద్ధదిఙ్నాగ! నాగవిభూషణ!
భువనంబుల కభ్యుదయంబు గావింపుము. 97

గీ. ఆవరణరూపమునఁ గాశి యహరహంబు
గావఁ దగు నీకు బహువిధాకారకలన
ననుచు నానతి యిచ్చెఁ జంద్రార్ధమౌళి
భవ్యుఁడు భువనాద్భుతక్రియాప్రౌఢి మెఱయ. 98

వ. అట్లద్దేవుం డవధరించుటయు గంగాసంభేదనంబున గర్కరి
వినాయకుండు, కాశీక్షేత్రదక్షిణంబున దుర్గావినాయ
కుండు, భీమచండిసమీపంబున నిరృతిభాగంబున భీమచండి
వినాయకుండు, పశ్చిమదిగ్భాగంబున దేహళీవినాయకుండు,
వాయవ్యదిగ్భాగంబున నుద్దండవినాయకుం,డుత్తరదిగ్భాగం
బునం బాశపాణివినాయకుండు, గంగావరణాసంగమంబున

ఖర్వవినాయకుండు యమతీర్థంబునకుఁ బశ్చిమదిగ్భాగంబున సిద్ధవినాయకుండు; వీరు బాహ్యావరణదేవతలు. గంగాపశ్చిమతీరంబున నుత్తరాపథసమీపంబున లంబోదరవినాయకుం, డాపశ్చిమంబునఁ గూటదంతవినాయకుండు, భీమచండునకుం గించిదీశానదిగ్భాగంబునఁ గాలకంఠవినాయకుండు, [1]ప్రాగ్దిగ్భాగంబునఁ గూశ్మాండవినాయకుండు, నుద్దండవిఘ్నేశ్వరునకు నాగ్నేయదిగ్భాగంబున ముండవినాయకుండు, పాశపాణివిఘ్నేశ్వరునకు దక్షిణంబున వికటదంతవినాయకుండు, ఖర్వవిఘ్నేశ్వరునకు నిరృతిభాగంబున రాజపుత్రవినాయకుండు, గంగాపశ్చిమతీరంబున రాజపుత్రవినాయకునకు వాయువ్యభాగంబునఁ బ్రణవవినాయకుండు వీరు ద్వితీయావరణదేవతలు. ఉత్తరవాహిని యగువియద్గంగాతీరంబున లంబోదరున కుదగ్భాగంబున వక్రతుండవినాయకుండు, కూటదంతున కుదగ్భాగంబున నేకదంతవినాయకుండు, కాలకంఠున కీశానదిగ్భాగంబునఁ గపిసింహద్విపత్రిముఖవినాయకుండు, కూశ్మాండునకుం బూర్వదిగ్భాగంబునం బంచాస్యవినాయకుండు, ముండవిఘ్నేశ్వరున కాగ్నేయదిగ్భాగంబున హేరంబవినాయకుండు, వికటదంతునకు యామ్యంబున నాశావినాయకుండు, రాజపుత్త్రవిఘ్నేశ్వరునకు నిరృతిభాగంబున వరదవినాయకుండు, ప్రణవవిఘ్నేశ్వరునకు పశ్చిమభాగంబునఁ బిశంగిలాతీర్థంబున దేవనదీతటంబున మోదకప్రియవినాయకుండు, వీరు తృతీయావరణదేవతలు. వక్రతుండునకు వాయువ్యభాగంబున గంగాతీరం

1 దేహళీవిఘ్నేశ్వరునకు.

బున సభయువినాయకుం, డేకదంతునకుం గౌబేరదిగ్భాగంబున సింహతుండవినాయకుండు, త్రితుండున కీశానదిగ్భాగంబునఁ గూణితాక్షవినాయకుండు, పంచాస్యునకుం బ్రాగ్దిశాభాగంబున క్షిప్రప్రసాదవినాయకుండు, హేరంబునకు వహ్నిదిగ్భాగంబునఁ జింతామణివినాయకుండు, విఘ్నరాజునకవాగ్భాగంబున దంతహస్తవినాయకుండు, వరదునకు యాతుధానదిగ్భాగంబునం బిచండిలవినాయకుండు, మోదకప్రియునకు దక్షిణంబున దండముండివినాయకుండు; వీరు చతుర్థావరణదేవతలు. అభయప్రదున కుత్తరంబున గంగాతీరంబున స్థూలదంతవినాయకుండు, సింహతుండవినాయకునకుదగ్దిగ్భాగంబునఁ గరిప్రియవినాయకుండు, కూణితాక్షున కీశానదిగ్భాగంబునం జతుర్దంతవినాయకుండు, క్షిప్రప్రసాదునకుం బూర్వదిగ్భాగంబున ద్వితుండవినాయకుండు, చింతామణికి వహ్నిదిగ్భాగంబున జ్యేష్ఠవినాయకుండు, దంతహస్తునకు దక్షిణదిగ్భాగంబున దక్షవినాయకుండు, పిచండిలునకు నాసురదిగ్భాగంబునఁ గాలవినాయకుండు, నుద్దండముండునకు దక్షిణదిగ్భాగంబున నాగవినాయకుండు; వీరు పంచమావరణదేవతలు. వారాణసి కింద్రాగ్నియమనిర్ఋతివరుణవాయుకుబేరేశానదిగ్భాగంబుల మణికర్ణి ప్రత్యేకవినాయక సృష్టివినాయక యక్షవినాయక గజకర్ణవినాయక చిత్రఘంటవినాయక స్థూలజంఘవినాయక మంగళవినాయకులు. యమతీర్థంబున కుత్తరంబున మిత్రవినాయకుండు; వీరు షష్ఠావరణదేవతలు. మోదాదిపంచవినాయకులును, జ్ఞానవినాయకుండును, ద్వారదశవినాయ

కుండును, అవిముక్తవినాయకుండును వీర లవిముక్తక్షేత్ర సప్తమావరణదేవతలు. ఈ యేఁబదియాఱ్గురువినాయకులుఁ గాశీక్షేత్రంబుం రక్షింతురు. 99

తే. ఏఁబదియు నాలుమూర్తుల నెసక మెసఁగి
యావరణసప్తకంబున నధివసించి
కాశికాపురి రక్షించుఁ గదల కెపుడుఁ
గుధరకన్యక తొలుచూలుకొడుకు డుంఠి. 100

వ. ఇట్లు గణేశ్వరపరిపాలితం బైన కాశీపురంబునం బుష్కరంబునందు. 101

చ. శుభదివసంబునన్ విమలశోభనలగ్నమునందు మేరుస
న్నిభమగుహేమపీఠమున నిల్పి రమాదులు సేస చల్లఁగాఁ
ద్రిభువనరాజ్యలక్ష్మికి నతిస్థిరభక్తిరతిన్ సరోరుహ
ప్రభువుఁడు గైటభాంతకుఁడుఁ బట్టముగట్టిరి ఫాలలోచనున్.

తే. హరియు వినతాసుతుండు దుగ్ధాబ్ధిసుతయు
సౌగతాదివికారవేషంబు లుడిగి
యాత్మవేషంబులు వహించి రనఘ! వికృత
వేషములఁ గాశియందు వేర్వేఱ నిలిచె. 103

వ. తత్ప్రసంగంబునం దీర్థంబులు గలిగె నవి యెయ్యవి యనినఁ బాదోదకతీర్థంబు, క్షీరాబ్ధితీర్థంబు, గదాతీర్థంబు, లక్ష్మీతీర్థంబు, తార్క్ష్యతీర్థంబు, నారదతీర్థంబు, ప్రహ్లాదతీర్థంబు, అంబరీషతీర్థంబు, దత్తాత్రేయతీర్థంబు, భృగుతీర్థంబు, వామనతీర్థంబు, నరనారాయణతీర్థంబు, విదారణనారసింహతీర్థంబు, గోపీగోవిందతీర్థంబు, శేషతీర్థంబు, శంఖమాధవతీర్థంబు, హయగ్రీవతీర్థంబు. ఇవి వైష్ణవతీర్థంబులు. 104

మ. అలఘుశ్రీనిధిఁ గాశికాపురిఁ బ్రసంగానుప్రసంగంబులం
దెలియం జెప్పితిఁ గొన్నిలింగములనుం దీర్థంబుల న్నిక్కమే
తిలమాత్రంబును నందుఁ దద్విరహితోద్దేశంబు లేకున్కి కిం
గలశీసంభవ! వన్నిదంబు గెలువంగా వచ్చుఁ బద్మోద్భవున్.

పంచనదతీర్థమాహాత్మ్యము

వ. అనిన విని యగస్త్యుండు మహాత్మా! పంచనదతీర్థమాహా
త్మ్యం బెఱిఁగింపవే యనినం గుమారుం డి ట్లనియె. 106

సీ. వేదశిరుండు నా విప్రర్షి భృగువంశ
సంభవుండు దపంబు సలుపుచుండఁ
బైత్రోవ శుచి యనుపాకశాసనుకొల్వు
మానిని యొక్కెడికేని పోవ
నయ్యచ్చరను జూచి యమ్మునీంద్రుండు ప్ర
స్ఖలితేంద్రియుం డయ్యెఁ గదల వెఱచి
కమలలోచన నమస్కారంబు సేయుచుఁ
బ్రత్యవాయమునకు భయముఁ బొంద

తే. వెఱకు మని పల్కి తపసి యవ్వీర్యరసము
మెలఁతకుడిచేతిలోఁ బోసి మ్రింగు మనియెఁ
ద్రావి యది గర్భమై యప్డు తనయఁ గాంచి
సంయమీంద్రున కిచ్చియుఁ జనియె దివికి. 107

తే. బాల యెనిమిదియేండ్లప్రాయంబ గుదు
నెవ్వనికి నిత్తు ని న్నంచు ఋషి యడిగిన
నయ్య! విశ్వాధికుం డైనయతని కిమ్ము
నన్ను నని పల్కె మునితోడ నలినవదన. 108

వ. అనుటయు నమ్మునీంద్రుండు తపోబలంబునం గాని యెట్టి పతి
సిద్ధింపదు. కాశీక్షేత్రంబునఁ దపంబు సేయుము. బాల్యం
బునం దపంబుఁజేయు నీకు ధర్మము సిద్ధించెఁ గావున ధూత
పాప యనునామంబు వహింపు మని, మహాప్రసాదం బని
యానందకాననంబునందు ఘోరం బైనతపం బాచరించిన.

తే. బ్రహ్మప్రత్యక్షమై వచ్చి పద్మనయన!
యడుగు వర మన్నఁ బ్రాంజలి యగుచు నింతి
పరమపావనిఁగాఁ జేయు బ్రహ్మ నన్ను
ధరణిఁ బావనవస్తుసంతతులలోన. 110

వ. అనినం గమలాసనుండు. 111

తే. ధరణిలో మూఁడుకోట్లసార్ధంబు లెక్క
గలుగుపుణ్యతీర్థంబులు కమలనయన!
ప్రతివసించును రోమకూపంబులందు
నెప్పుడు నీదేహమున నీకు నిది వరంబు. 112

వ. అని విధాత యంతర్హితుం డయ్యె నంత నొక్కనాఁడు
ధర్ముండు తన్నభిలషించి వైఁ బడం దలంచిన నాధూత
పాప చేయీక తలంగిన. 113

తే. జముఁడు శపియించె దానిఁ బ్రస్తరము గాఁగఁ
దరుణి శపియించి జము జడత్వంబుఁ బొందఁ
జంద్రకాంతశిలాంబునిర్ఝరిణి సతియు
జడమహానిర్ఝరంబు తా జముఁడు నయ్యె. 114

వ. చంద్రకాంతశిలారూపంబుఁ గైకొని చంద్రోదయంబున
స్రవియించుచు ధూతపాప పుణ్యనది యయ్యె. ధర్ముండును
ధర్మనదం బనుపేరఁ బుణ్యనదం బయ్యె. వేదశిరుండును నదీ

స్వరూప యైనకూఁతుఁ ధూతపాప నదస్వరూపుఁడైన
ధర్మునకు వివాహంబు సేసె. గభస్తిమాలి గభస్తీశ్వరసన్నిధి
(మంగళా) గౌరీదేవి నుద్దేశించి మయూఖాదిత్యతీర్థంబున
నుగ్రతపం బాచరించిన నతనికిరణంబులవలనం బ్రస్వేదం
బుద్భవించి కిరణానది యనం బాఱె. ధర్మనదంబును ధూత
పాప నదియుం గిరణాతరంగిణియు గంగాయమునలుఁ
గూడ నైదునదులు పంచనదం బనుపేర పుణ్యతీర్థంబై త్రై
లోక్య ప్రసిద్ధిఁ గైకొనియె. ఇది పంచనదతీర్థంబు. ఈతీర్థం
బున నాప్లుతుండైనమానవుండు పాంచభౌతికంబైనశరీరంబుఁ
బావనంబు సేసి పంచమహాపాతకంబులం బాయు. దివో
దాసు నుచ్చాటనంబు సేసి కైటభారాతిపంచనదంబునందు
విశ్రమించి యగ్నిబిందుం డనుమహామునీంద్రుం డొనర్చు
నానావిధస్తోత్రంబులకుఁ బరితుష్టిఁ బొంది యిష్టవరంబు గృప
సేసి వెండియు. 115

బిందుమాధవసంభవము

తే. అగ్నిబిందునిపేరు నిజాహ్వయంబుఁ
గూర్చి మధుకైటభారాతి కూర్మి మిగుల
బిందుమాధవుఁ డనుపేరఁ బేర్మి వడసె
నచ్యుతుఁడు భక్తపరతంత్రుఁ డౌనొ కాఁడొ? 116

వ. బిందుతీర్థంబునం దుండి యగ్నిబిందునకు గోవిందుం డానంద
కాననంబునందుఁ దీర్థమాహాత్మ్యకథనప్రసంగంబున దానధర్మ
వ్రతంబు లనేకంబు లుపదేశించి కరుణావశంవదుండై
యతనిం గనుంగొని యింక నేమి యడిగెద వడుగు
మనుటయు. 117

తే. అధికసద్భక్తిసంపద నగ్నిబిందుఁ
డచ్యుతునకు నమస్కార మాచరించి
పద్మలోచన కాశికాపట్టణమునఁ
బ్రతివసించిన నీదురూపంబు లెన్ని? 118

వ. మఱియు భవిష్యద్రూపంబు లెన్ని? యానతిమ్మనిన మధు
సూదనుం డతని కిట్లనియె. 119

వైష్ణవతీర్థమాహాత్మ్యము

సీ. పాదోదకం బను ప్రథమతీర్థంబున
నాదికేశవుఁ డన నధివసింతుఁ
దద్దక్షిణమున శ్వేతద్వీప మందేను
జ్ఞానకేశవసంజ్ఞ సంశ్రయింతుఁ
దార్క్ష్యతీర్థమునందు దార్క్ష్యకేశవుఁడ నై
యోజనంబుల చేతఁ బూజఁ గొందు
నందు నారదతీర్థ మాతీర్థమునఁ గేశ
వాభిధానుండ నై యతిశయింతుఁ

తే. గ్రమముతోడ నేనాల్గుతీర్థములయందు
నమృతతాజ్ఞానతార్క్ష్యమహత్త్వములను
బ్రహ్మవిద్యోపనిషదర్థపరిచయంబు
పంచజనులకుఁ గలుగు నాప్లవనపరత. 120

క. ప్రహ్లాదకేశవుని ననుఁ
నాహ్లాదముతోడ నెవ్వఁ డభ్యర్థించుం
బ్రహ్లాదతీర్థమున నేఁ
బ్రహ్లాదత నతని కిత్తు భవ్యశుభంబుల్. 121

తే. అంబరీషతీర్థంబున నధివసింతుఁ
గేవలం బన నాదిత్యకేశవుఁ డనఁ
బాతకధ్వాంతవిధ్వంసపాటవమునఁ
జేయుదు శుభంబు తత్తీర్థసేవకులకు. 122

వ. దత్తాత్రేయ భృగు వామన నరనారాయణ విదారణ నరసింహ గోపీగోవింద లక్ష్మీనృసింహ శేషమాధవ శంఖమాధవ హయగ్రీవకేశవ భీష్మకేశవ నిర్వాణకేశవ త్రిభువనకేశవ జ్ఞానమాధవ శ్వేతమాధవ ప్రయాగమాధవు లను దివ్యమూర్తులు ధరియించి బహుప్రదేశంబుల నుండుదు. ఈతీర్థంబులు మదీయనామవ్యప్రదేశంబులం బ్రసిద్ధంబు లై యుండు. ఇవి మదీయతీర్థంబులు. 123

చ. అనఘ! రహస్య మొక్కటి ప్రయత్నమున న్వినుపింతు నీకుస
జ్జనునకుఁ గాని చెప్పకు మసాధుచరిత్రున కీవు నెన్నఁడుం
బెనుమనమునం గలవు పెక్కులు తీర్థము లన్నితీర్థముల్
ఘనమహిమం బ్రసిద్ధ మణికర్ణికఁ బోలవు నిక్కమెంతయున్.

మణికర్ణికాప్రభావవర్ణనము

రగడ. శ్రీమత్కాశీపుటభేదన ల
క్ష్మీశ్రుతిమణికర్ణిక మణికర్ణిక;
యామవతీవరచూడామణికిని
హారకమలదీర్ఘిక మణికర్ణిక;
పాదోదకపంచనదాదిమహా
పావనతీర్థోత్తమ మణికర్ణిక;
వేదపురాణాగమవిద్యాపణ
వీథీమాణిక్యము మణికర్ణిక!

పంచమహాపాతకతిమిరౌఘవి
పాటన రవిమండలి మణికర్ణిక;
కాంచనగర్భహిరణ్యకమండలు
గండూషితజలధర మణికర్ణిక;
సంచారించిన కైవల్యశుభ
ప్రచయంబులకును ఖని మణికర్ణిక;
పంచక్రోశవిముక్తిక్షేత్రా
బ్జమధూళీపూరము మణికర్ణిక;
బిందుమాధవుం డును నాకెంతయుఁ
బ్రేమకళాపాత్రము మణికర్ణిక;
మందాకిన్యంభోవేణీభర
మధ్యనాభిచక్రము మణికర్ణిక;
నరనారాయణమూర్తిధారి యగు
నాకు విహృతిదేశము మణికర్ణిక;
గరుడఖచరవిద్యాధరకిన్నర
గంధర్వనిషేవిత మణికర్ణిక;
డుంఠివినాయకమదజలమిళనక
టుప్రవాహపుష్కర మణికర్ణిక;
కంఠేకాలకిరీటవిటంక
గ్లౌరుచి చుళుకితజల మణికర్ణిక;
మాణికర్ణికం బగుతీర్థంబున
మజ్జనమాడిన మానవోత్తముఁడు;
భ్రూణహత్య మొదలైనయఘౌఘము
వోడ వడఁగించును నిమిషమాత్రమునఁ

గాశితీర్థము లెన్నియన్నియును
గదలి వచ్చి మధ్యాహ్నకాలమున;
రాశి గూడి శ్రీమణికర్ణికతీ
ర్థంబు నాశ్రయించుం బ్రతిదినమును;
మధ్యాహ్నసమాగమమున నేనును
మదనధ్వంసియునుం బరమేష్ఠియు;
సాధ్యసిద్ధగంధర్వాదులతో
సంసేవింతుము శ్రీమణికర్ణిక;
వత్తురు మధ్యాహ్నస్నానమునకు
వాసుకిశేషాదులు భుజగేశ్వరు;
లుత్తరవాహిని యగుగంగానది
కుత్తమభూషణ మగుమణికర్ణిక;
నిచ్చలుఁ బ్రాతఃకాలము మణిక
ర్ణిక మణికర్ణిక మణికర్ణిక యని
యుచ్చరించుమానవులహస్తముల
కుసిరికకాయలు మోక్షవైభవము;
లొక్కదానమును గోటిదాన మై
యొసఁగు ఫలము నరునకు మణికర్ణిక;
గొక్కయాగమును గోటియాగ మై
యొసఁగు ఫలము నరునకు మణికర్ణిక;
యొక్కపూర్తమును గోటిపూర్త మై
యొసఁగు ఫలము నరునకు మణికర్ణిక;
యొక్కధర్మమును గోటిధర్మ మై;
యొసఁగు ఫలము నరునకు మణికర్ణిక;

యుదయవేళ నెవ్వఁడు మణికర్ణిక
యుదకంబునఁ గ్రుంకును మాఘంబునఁ;
ద్రిదశులు నమ్మానవునకు సంవే
దింతురు సేవాంజలులు మకుటముల;
మణికర్ణిక హరిచంద్ర తీర్థమున
మానవుఁ డెవ్వఁడు పితృతర్పణములు;
ప్రణిధానంబునఁ జేయునాతనికి
భద్రపరంపర లిత్తురు పితరులు;
మణికర్ణికప్రాదతీర్థరాజతట
మధ్యమున హరిశ్చంద్రేశ్వరుఁ డను;
గణనాథుని భజియించువారలకుఁ
గామధేను వై యభిమత మొసఁగును;
మణికర్ణ్యంతరమున గాయత్రీ
మంత్రం బొకమా టుచ్చరించినను;
గణన నదిపదివేల్మాఱును శ్రీ
గాయత్రి జపించినఫల మొసఁగును;
నొకవంకను గంగాకేశవులను
నొకవంక హరిశ్చంద్రమంటపిని;
నకలుషమానస; మణికర్ణికతీ
ర్థావధిసీమంబులు గా నెఱుఁగుము;
యావజ్జీవం బగ్నిహోత్రవిధి
యాచరించినట్టిఫలంబు గలుగుఁ;
బావకునందు మహామణికర్ణిక
భవ్యాహుతి వోసినమాత్రంబున;

నుపమకర్ణిక నాజ్యతిలాహుతి
హోమవిధానము మానవోత్తమున;
కపరిమితం బై నిరతిశయం బై
యక్షయ్యంబగు ఫలము ఘటించును;
జక్రపుష్కరిణి యనునామమునఁ బ్ర
శస్తి వహించినయది మణికర్ణిక!
చక్రనేమిచంక్రమమునఁ దిరిగెడు
సంసృతికిని విరుగడ మణికర్ణిక;
శివుఁ గాశీపతి విశ్వనాయకుని
సేవింపఁగఁ దలఁ పెత్తినయప్పుడు;
ద్రవరూపంబు పరిత్యజించి వని
తారూపముఁ దాల్చును మణికర్ణిక;
ప్రత్యక్షం బై పుణ్యపురంధ్రీ
భావంబు భజించినసమయంబున;
నత్యంతమనోహారిహావభా
వాభిరామ యగు శ్రీమణికర్ణిక;
నాలుగుభుజములు వాలికకన్నులు
నయనాన్విత మగుఫాలభాగమును;
బాలేందుకళామధ్యంబున సిత
భసితంబు ధరించును మణికర్ణిక;
కటకహార కేయూర మేఖలా
కంకణాదిభూషణభూషిత యై;
కుటిలాలకములమీఁదఁ జిన్నిపువుఁ
గుత్తరించు నచ్చుగ మణికర్ణిక;

బహుకల్పాంతంబులు సరిగడచిన
పండ్రెండేండులచిన్ని ప్రాయమున;
జహాజహాద్విరదం బగుచేత
సంపుటము వహించును మణికర్ణిక;
యొకచే నిందీవరమాలికయును
నొకచే మాదీఫలముఫలంబును;
ప్రకటితమగు దోర్ద్వయమున నంజలి
బంధంబు వహించును మణికర్ణిక;
పద్మసమానం బగునాననబిం
బముచే నొప్పెడునది మణికర్ణిక;
పద్మరాగమాణిక్యంబుల నగు
పలువరుసలు గలయది మణికర్ణిక;
పడమరముఖ మై నాసాశిఖరము
పై నిష్కంపం బగుచూపునిలుప,
నుడురాజకళాభరణునుల్లమున
నుద్వీక్షించును శ్రీమణికర్ణిక;
కన్నియగేదఁగిపూరేకుఁ గబరి
కాభరమునఁ దురుమును మణికర్ణిక;
చిన్నిపూఁపచన్నుల వలిపెపుకం
చెల ధరియించును శ్రీమణికర్ణిక;
మణికర్ణిక చింతామాణిక్యము
మణికర్ణిక బృందారకధేనువు;
మణికర్ణిక కల్పద్రుమవాటిక
మణికర్ణిక సిద్ధరసస్యందము;

శ్రీమణికర్ణిక యనశివమూర్తి మహా
సిద్ధికారణము సేవకకోటికి;
శ్రీమణికర్ణిక నగ్నిబిందుముని!
సేవింపుము పుణ్యాత్ముఁడ వయ్యెదు. 125

వ. మణికర్ణికాతీర్థంబునక వాగ్భాగంబునం బాశుపతతీర్థం; బందు బశుపతీశ్వరుండు లింగరూపధరుండై భవపాశమోక్షంబు సేయు. పాశుపతతీర్థంబునకుఁ బురోభాగంబున రుద్రావాస తీర్థం బాతీర్థంబునకు రుద్రేశ్వరుం డధిదేవత. రుద్రావాస తీర్థంబునకు యామ్యదిగ్భాగంబున విశ్వతీర్థం, బందు తారకేశ్వరుండు విశ్వాభిధాన యగుగౌరితోఁగూడి విశ్వపూజ్యుండై యుండు. విశ్వతీర్థంబునకు సంగడి మోక్షతీర్థంబు. మోక్షేశ్వరునకు సమీపంబున నవిముక్తేశ్వరంబు. అందులకు సమీపంబునఁ దారకతీర్థంబు గలదు. అందుఁ దారకేశ్వరుండు సంసారతారకుం డధివసించు. తారకతీర్థంబునకు సమీపంబున స్కందతీర్థంబు. స్కందతీర్థంబునకు నవ్వల దుంఠితీర్థంబు. దుంఠితీర్థంబునకు సమీపంబున భవానీశంకర తీర్థంబు. 126

సీ. మణికర్ణికాతీర్థమధ్యంబునకు సాగి
శ్రీపాశుపతతీర్థసీమ నడచి
శ్రీరుద్రతీర్థపశ్చిమభాగమున నేగి
విశ్వతీర్థంబు వెన్వెంటఁ దగిలి
మోక్షేశ్వరస్థానమూర్ధవవర్త్మము దాఁటి
తారకబ్రహ్మతీర్థంబు గడచి

బాహుళేయక్షేత్రపదము నుల్లంఘించి
ఢుంఠిరాడ్ద్వారోపకంఠ మొదసి

గీ. భవతి భిక్షాం ప్రదేహి! యన్నలుకు పలికి
పటువనాంచిత కాశికాపథమునందు
నాఁకొనినవారి కిడు సుధాహారభిక్ష
గౌరికరకంకణంబు గల్గల్లు మనఁగ. 127

మ. నియమం బొప్పఁగఁ గాశికాపురి భవానీశంకరుల్ విష్టప
త్రయముం గాతురు తల్లిదండ్రు లగుచున్దాక్షిణ్య మొప్పంగఁ బ్ర
త్యయమేతద్విషయంబునం *దెలుఁగదా యెల్లప్డు మధ్యాహ్న
మక్షయభిక్షాన్నము వెట్టుచుందురు బుభుక్షాక్షీణమర్త్యాళికిన్.

గీ. గృహము వారాణసీసీమ గృహిణి గౌరి
విశ్వనాథుండు గృహమేధి శాశ్వతుండు
పరమకారుణ్యనిధులు దంపతులు దాను
మునికి నప్పుడు సిద్ధించు మోక్షభిక్ష. 129

వ. భవానీతీర్థంబునకు సమీపంబున జ్ఞానతీర్థంబు. జ్ఞానవాపీ సమీపంబున జ్ఞానేశ్వరు సేవించినరుండు జ్ఞానవంతుండగు. జ్ఞానతీర్థసమీపంబున శైలతీర్థంబు. శైలతీర్థసమీపంబున నందితీర్థంబు. నందితీర్థంబున కవాగ్భాగంబున విష్ణుతీర్థంబు. అం దేను సన్నిహితుండ నై యుండుదు. ఆ తీర్థంబున కవాగ్భాగంబునఁ బితామహతీర్థంబు. పితామహతీర్థసమీపంబున నాభితీర్థంబు. నాభితీర్థసమీపంబున బ్రహ్మ(నాల)తీర్థంబు. స్వర్గద్వారసన్నిధి భాగీరథీతీర్థంబు. తద్దక్షిణంబున ఖురకర్తరీతీర్థంబు. ఆతీర్థదక్షిణంబున మార్కండేయతీర్థంబు.

---

*'దెలుఁగరాదా' యని పా.

బాహ్లేయక్షేత్రపదము నుల్లంఘించి
డుంఠిరాట్తీర్థోపకంఠ మొరసి

గీ. భవతి భిక్షాం ప్రదేహి! యన్పలుకు వలికి
పటువనాంచిత కాశికాపథమునందు
నాఁకొనినవారి కిడు సుధాహారభిక్ష
గౌరికరకంకణంబు గల్గల్లు మనఁగ. 127

మ. నియమం బొప్పఁగఁ గాశికాపురి భవానీశంకరుల్ విష్టప
త్రయముం గాతురుతల్లిదండ్రు లగుచున్నాక్షీణ్య మొప్పంగఁ బ్ర
త్యయ మేతద్విషయంబునం *దెఱుఁగ దాయెల్లప్డు మధ్యాహ్న
మక్షయభిక్షాన్నము వెట్టుచుందురుబుభుక్షాక్షీణమర్త్యాళికిన్

గీ. గృహము వారాణసీసీమ గృహిణి గౌరి
విశ్వనాథుండు గృహమేధి శాశ్వతుండు
పరమ కారుణ్యనిధులు దంపతులు దారు
మునికి నప్పుడు సిద్ధించు మోక్షభిక్ష. 129

వ. భవానీతీర్థంబునకు సమీపంబున జ్ఞానతీర్థంబు. జ్ఞానవాపీ సమీపంబున జ్ఞానేశ్వరు సేవించినరుండు జ్ఞానవంతుండగు. జ్ఞానతీర్థసమీపంబున శైలతీర్థంబు. శైలతీర్థసమీపంబున నందితీర్థంబు. నందితీర్థంబున కవాగ్భాగంబున విష్ణుతీర్థంబు. అందేను సన్నిహితుండ నై యుండుదు. ఆ తీర్థంబున కవాగ్భాగంబునఁ బితామహతీర్థంబు. పితామహతీర్థసమీపంబుననాభితీర్థంబు. నాభితీర్థసమీపంబున బ్రహ్మ(నాల)తీర్థంబు. స్వర్గద్వారసన్నిధి భాగీరథీతీర్థంబు. తద్దక్షిణంబున ఖురకర్తరీతీర్థంబు. ఆతీర్థదక్షిణంబున మార్కండేయతీర్థంబు.

---

*'దెఱుఁగరాదా' యని పా.

గీ. పరశురాములు ముప్పండ్రు భానుకులులు
రాఘవేశ్వరు లేకోత్తర మగుశతము
విష్ణురూపుఁడ నొకఁడ నే విను మునీంద్ర!
కాశికాపట్టణము నైదుక్రోశములను. 131

గీ. శంఖచక్రగదాఖడ్గసంయుతుండు
ననఘ! మధుసూదనాహ్వయుం డగుదు నేను
గమలమును శంఖమును జక్రగదలు దాల్చి
నట్టినన్ను సంకర్షణుం డండ్రు బుధులు. 132

గీ. శంఖకౌమోదకీచక్రజలజపాణి
నైననన్ను దామోదరుం డండ్రు బుధులు
శంకచక్రాంబురుహగదాసహితు నన్ను
వామనుం డంగు రాగమవ్యాప్తమతులు. 133

గీ. పాంచజన్యంబు గదయును బంకజంబు
చక్రమును దాల్చి ప్రద్యుమ్నసంజ్ఞఁ దాల్తు
శంఖచక్రగదాంభోజసహితు నన్ను
విష్ణుఁ డందురు విజ్ఞానవిమలహృదయ! 134

గీ. శంఖచక్రగదాపద్మసహితు నన్ను
మాధవుం డండ్రు మేధాసమగ్రమతులు
శంఖగదలును జక్రాంబుజములు దాల్చు
నన్నుఁ బురుషోత్తముం డండ్రు సన్నుచరిత. 135

గీ. శంఖకౌమోదకీపద్మచక్రధరుని
నను జనార్దనుఁ డనుచుఁ జెప్పును బుధాలి
శంఖచక్రగదాంభోజసహితు నన్ను
విశ్వసన్నుతచరిత! గోవిందుఁ డండ్రు. 136

గీ. శంఖపద్మగదాచక్రసహితుఁడైన
యట్టివిష్ణుఁ ద్రివిక్రముఁ డండ్రు బుధులు
శంఖమును నంబుజంబును జక్రగదలు
దాల్చునను జెప్పు జగము శ్రీధరునిఁ గాఁగ. 137

వ. శంఖచక్రగదాపద్మంబుల హృషీకేశుండును, శంఖచక్రపద్మగదల నృసింహుండును, శంఖగదాపద్మరథాంగంబుల నచ్యుతుండును, శంఖారిగదాపద్మంబుల వాసుదేవుండును, శంఖపద్మగదాచక్రంబులనారాయణుండును, శంఖపద్మచక్రగదలం బద్మనాభుండును, శంఖగదారికమలంబుల నుపేంద్రుండును, శంఖచక్రపద్మగదల హరియును, శంఖపద్మగదాచక్రంబులఁ గృష్ణుండును బ్రకాశింతురు. ఇవి మదీయదివ్యమూర్తిభేదంబు లని యానతిచ్చి కార్యాంతరవ్యాసంగంబున మాధవదేవుం డంతర్ధానంబు సేసె. అగ్నిబిందుండును జరితార్థుండై [1]బిందుమాధవదేవునియందు నేకీభవించె. ఇది బిందుమాధవాగ్నిబిందుసంవాదం బనునితిహాసంబు. దీని వినినను బఠించినను వ్రాసినను మానవులకు భోగమోక్షములు సిద్ధించు ననినం గుమారున కభివాదనంబుసేసి కుంభసంభవుండు వెండియు ని ట్లనియె. 138

వృషభధ్వజావిర్భావము

సీ. పార్వతీనందన! పాంచజన్యధరుండు
విఘ్నరాజును శ్రీయు వేఱు వేఱ
వివిధమాయోపాయ వేషభాషాదుల
భ్రమియించి కాశికాపట్టణమున

1 బిందుమాధవ సేవాతాత్పర్యంబున.

నుఱక దివోదాసు నుచ్చాటనము చేసి
యామేలివార్త మంథాద్రి నున్న
హరునకుఁ జెప్పి పంపిరి హరుఁడును వచ్చెఁ
గాశికానగరికిఁ గరము వేడ్క

తే. వచ్చి పేరోలగం బుండి వరుసతోడ
యోగినుల భాను విధిఁ బ్రమథోత్కరంబు
హరిని లక్ష్మి వినాయకు నాదరించి
భువనసామ్రాజ్యపట్టంబు పూనె నంత. 139

వ. సామాన్యంబున సంక్షేపరూపంబుగా వినుటం జేసి దద్వృ
త్తాంతశ్రవణంబునందు నాకుం దృప్తి చాలకున్నయది. సవిశే
షంబుగా విస్తరించి యానతిమ్ము. కాశీమాహాత్మ్యంబునకుం
దక్కినవృత్తాంతంబు లానుషంగికంబులు. ఈవృత్తాంతం బాధి
కారికంబు గదా యనుటయు, నత్యంతసంతుష్టాంతరంగుఁడై
గాంగేయుండు కుంభసంభవున కిట్లనియె. 140

ఉ. కైటభదైత్యవైరి యధికం బగునేర్పున మున్ను తేని కు
చ్చాటనమాచరించి తనచట్టుఖగేంద్రునిఁ బంచెఁ గ్రమ్మఱం
హాటకరేఖ దానును గజాస్యుఁడు లక్ష్మియుఁ జేసినట్టి కై
లాటమునం ఘటిల్లె సకలార్థము దేవరయాజ్ఞ పెంపునన్. 141

వ. అనుచు సంతోషసందేశపద్ధతి లిఖించి గరుత్మంతునిచేతి కిచ్చి
పంచిన నతిత్వరితగతి లవణేక్షుసురాసముద్రంబులు దాఁటి
కుశద్వీపంబు డాసి. 142

శా. తద్ధ్యానాస్పదమానమానసుని మంథక్ష్మాధరాధిత్యకా
మధ్యధ్యాసితు శంభు డగ్గఱి గరుత్మంతుండు కార్యార్థసం

సిద్ధిత్వంబును దీర్ఘపక్షయుగవిక్షేపప్రభేదంబుచే
నథ్యాహార్యముగా నిరంకుశమహాహంకారధీరోద్ధతిన్. 143

వ. డాసి యంతంత సాష్టాంగదండప్రణామంబు లాచరించుచుఁ
జేరవచ్చి నందికేశ్వరునిచేతికి సందేశపత్రికయిచ్చి తత్సమీ
పంబున బద్ధాంజలియై యుండె. విదితదివోదాసవృత్తాంతుం
డై మృత్యుంజయుండు కాశీపట్టణంబునకుం బయనం బగు
టయు. 144

ఉ. ఎత్తిరి టెక్కియంబులును నెల్లులు నంబరవీథి దీటుకో
నొత్తిరి శంఖకాహళము లూఁదిరి శృంగకవంశకాండముల్
మొత్తిరి దుందుభుల్ ప్రమథముఖ్యులు హర్షితచిత్తవృత్తులై
యత్తఱిఁ గాశికానగరయానమహోత్సవజృంభణంబునన్.

వ. అప్పుడు నందికేశ్వరుండు. 146

సీ. ఏనుఁగు లెనిమిది వృషభంబు లెనిమిది
తురంగంబు లెనిమిది హరు లెనిమిది
గంగాతరంగిణీకాళిందు లిపలు
సాయంబు రేపును జక్రయుగము
ధవళాతపత్రంబు తారకావర్తంబు
రజితంపుమోలలు తారాగణంబు
ప్రణవంబు మునుకోల పాదపీఠంబు గా
యత్రి వేదంబు సర్వాంగరక్ష

తే. ద్వారసంరక్షకులు దీవ్రథామవిధులు
మార్గదర్శక మామ్నాయమండలంబు
గా సమున్నత మగురథాంగంబు పన్ని
ప్రాంగణంబున నిల్పె శిలాదసుతుఁడు. 147

వ. విశ్వేశ్వరుండును గైసేసి భవానీసహితుండై యద్దివ్యస్యం
దనం బెక్కి ముప్పదిమూఁడుకోట్లదేవతలును, గోట్యయుత
ద్వయప్రమథగణంబులును, నవకోటిదుర్గలును, కోటిభైరవు
లును, గోటికుమారు, లేఁడుకోట్లవినాయకులును, షడశీతి
సహస్రమునులు, నంకఅగృహమేధులును, మూఁడుకోట్లు
పాతాళతలభుజంగంబులును, రెండుకోట్లుదైత్యదానవులు,
నష్టాయుతగంధర్వులును, గోట్యర్ధలక్షరాక్షసులును, బదివే
వురు విద్యాధరులును, నఱువది వేలప్సరసలు, నెనిమిదిలక్షలు
గోమాతలును, షణ్ణవత్యయుతసుపర్వులును, సప్తసాగరంబు
లును, నెనిమిదివేలు గిన్నరులును, మున్నూఱు వైవస్వతు
లును గొలిచి వాయువేగంబున ముహూర్తమాత్రంబున
నభోమార్గంబున జని కాశిం బ్రవేశించె. అప్పుడు గోమాతలు
దుగ్ధవర్షంబులు కురిసిరి. జైగీషవ్యుం డను మహామునీశ్వ
రుండు వేదార్థసారంబు లగు కైవారంబులఁ బరమేశ్వరుం
బ్రస్తుతించె. అప్పరమేశ్వరుండు జ్యేష్ఠమాసంబున శుక్లపక్షం
బునఁ జతుర్దశినాఁడు ప్రవేశించె. అదికారణంబుగా జ్యేష్ఠ
స్థానంబనుతీర్థంబును, జైగిషవ్యస్తోత్రంబు కారణంబుగా జైగి
షవ్యతీర్థంబును, గోమాతృదుగ్ధవర్షంబు కారణంబుగా
క్షీరోదతీర్థంబునుం గలిగె. ఇట్లు కాశీపట్టణంబు ప్రవేశించి.

తే. బ్రహ్మవిష్ణువిహితపట్టాభిషిక్తుఁ డై
జగము లెల్లఁ గొల్వఁ జంద్రమౌళి
గౌరితోడఁ గూడఁ బేరోలగం బున్న
వేళ వచ్చెఁ గాశివిప్రగణము. 149

వ. అందు. 150

సీ. సంస్తుతించిరి బహ్వృచప్రపంచంబుల
నొకకొంద అసితకంఠోపకంఠు
నుచ్చై స్స్వనంబున నొకకొందఱు నుతించి
రార్యకళత్రు నధ్వర్యశాఖ
శివునిఁ బ్రశంస సేసిరి యొకకొందఱు
సద్భక్తిమై సప్తసామములను
సర్వజ్ఞుఁ బొగడి రథర్వవేదంబున
నొకకొంద ఱొగి ప్రసంగోచితముగఁ

తే. గాశికాతీర్థవాసులఁ గర్మవరుల
భూతిరుద్రాక్షధారులఁ బుణ్యనిధులఁ
నందఱినిఁ జూచి కరుణాసమగ్రబుద్ధి
నిట్టు లని యానతిచ్చె విశ్వేశ్వరుండు. 151

తే. సేమమే విప్రులార ! యనామయంబె?
పరమమాహేశ్వరాచారనిరతులార !
కుశలమే? కాశికాతీర్థకోటిదివ్య
లింగపూజైకతానాంతరంగులార! 152

వ. అనిన విని మందాకినీతీర్థంబు హయతీర్థంబు మత్స్యోదరి తీర్థంబు కపాలమోచనతీర్థంబు నాదిగాఁ గల తీర్థంబులనుండి యేతెంచినబ్రాహ్మణోత్తములు మృత్యుంజయునకు నమస్కరించి యిట్లని విన్నవించిరి. 153

తే. అసియు వరణయుఁ గూడినయంతనుండి
సంగమేశ్వరతీర్థంబు సందుదాఁక
గగనగంగాతటంబునఁ గదలకుండు
తీర్థవాసుల మమృతదీధితికిరీటి! 154

తే. పదియు నెనుబదివేలును బంచశతియు
నేఁబదియు నైదుసంఖ్యలయిండ్లవార
మాశ్రితులు కాశికాపురి కష్టదీయు
లీక! పల్లేరు దుడిచి పా లెక్కినారు.

వ. అని యనంతరంబ యాశీర్వదించి యార్ద్రాక్షత(ంబు)లు సల్లి మంగళసూక్తంబుల సంస్తుతించి బ్రాహ్మణులు ప్రబద్ధకరసంపుటులై దేవా! భవదీయకటాక్షవీక్షానిక్షేపసంభూతప్రభూతానుకంపాసంపత్తి గలుగ మాకు సేమం బనామయంబు గుశలం బేమి బ్రాంతి? అదియునుంగాక. 156

క. వృషగమన! భవాశీవిష
విషపృషతనిషేకజనితవిషమదశాదు
ర్విషహోష్మదోషసర్వం
కషములు కాశీసమీపగంగామృతముల్. 157

వ. అనిన విని పినాకి దానునుం గాశీనామాక్షరద్వయంబు కర్ణామృతంబనియును గాశీక్షేత్రధూళిత్రసరేణువులు సర్వాంగరక్ష లనియు గమనాసనస్వప్నజాగరణంబులం గాశీనామస్మరణంబు పాపంబులఁ బాపఁ జాలు ననియును బ్రహ్మాండకోశంబున గలతీర్థజాలంబు లెల్లనుగాశీక్షేత్రంబునఁ బంచక్రోశంబున వసియించి యుండు ననియును గాశి నిర్వాణమాణిక్యఖని యనియును గాశిమోక్షలక్ష్మీనివాసకుశేశయం బనియును గాశి సంసారబీజాంకురమరుభూమి యనియునుం గొనియాడి తాను నమ్మహీసురులుఁ గొంతతడ వభీష్టగోష్ఠీవినోదంబులం బ్రొద్దుపుచ్చి వారుచూడంజూడ నంతర్హితుం

డై [1]వృషభనాథస్యంతరస్థం బైనజ్యోతిర్లింగంబునం దంతర
వించె. నంత బ్రాహ్మణులు నిజనివాసంబులకుం జనిరి. ఇది
వృషధ్వజావిర్భావం బను నుపాఖ్యానంబు భోగమోక్ష
ప్రదాయకంబు. 158

ఉ. పంచసహస్రలింగములు భాసురమూర్తులు జ్యేష్ఠనాథతీ
ర్థాంచలభూమియందుఁ బ్రణతాఖిలనిర్జరముఖ్యమండలీ
కాంచనమౌళిరత్నకలికారుచిజాలపిశంగితాంఘ్రుల
భ్యంచితభోగమోక్షవిభవాకరముల్ కలశీతనూభవా!

వ. అవి యెయ్యవి యనిన నాదిత్యలింగంబు పరాశరేశ్వరలిం
గంబు మాండవ్యేశ్వరలింగంబు మంకణేశ్వరలింగంబు జాను
కేశ్వరలింగంబు సుమంతేశ్వరలింగంబు భారద్వాజేశ్వరలిం
గంబు వాజపేయేశ్వరలింగం బగ్నివర్ణేశ్వరలింగంబు ధుత్రివే
శ్వరలింగింబు వత్సేశ్వరలింగంబుకుక్కుటేశ్వరలింగంబు పర్ణా
దేశ్వరలింగంబు సక్తుప్రస్థేశ్వరలింగంబు మాండూకేశ్వరలిం
గంబు బాభ్రవేయేశ్వరలింగంబు చ్యవనేశ్వరలింగంబు కలిం
దమేశ్వరలింగం బక్రోధనేశ్వరలింగంబు కంకేశ్వరలింగంబు
కుంతలేశ్వరలింగంబు కఠేశ్వరలింగంబు తుంబురునారదేశ్వర
లింగంబు మతంగేశ్వరలింగంబు మాగధేశ్వరలింగంబు జతు
కర్ణేశ్వరలింగంబు జంబుకేశ్వరలింగంబు జారుధీశ్వర జలేశ్వర
కాళేశ్వర గాలవేశ్వర మహాలింగంబు లాదిగాఁ గల మహా
లింగంబులు వెండియు. 160

కందుకేశ్వర వ్యాఘ్రేశ్వరసంభవము

సీ. ఒక్కనాఁడు భవాని యుబుసుపోవక పైఁడి

---

1 దంతరించె.

జలపోసనముకసీసంపుఁబట్టు
బంతిఁ గుట్టిమభూమిఁ బాణిపల్లవమున
నాస్ఫాలనము సేసి యాడుచుండ
నప్పు డంబరవీథి నసుర లిద్దఱు గూడి
కందుకం బెగవైచు గౌరి బుచ్చి
ప్రమథవేషముఁ దాల్చి పట్టంగ వచ్చిరి
గనుసన్న చేసి శంకరుఁడు పనుపఁ
తే. బర్వతాత్మజ యక్కూటపారిషదులఁ
జంపె నచ్చెండునన యురస్స్థలుల వైచి
కపటదైత్యులఁ బరిమార్చెఁ గందుకంబు
కందుకేశ్వరుఁ డనఁ గాశిఁ గాంచె మహిమ. 161

వ. ఇది కందుకేశ్వర మాహాత్మ్యంబును తత్సంభవంబును. 162

సీ. దండఖాతాఖ్యతీర్థమునందు దుందుభి
నిర్హ్రాదుఁ డనుయామినీచరుండు
ప్రహ్లాదుమామ యప్పాపి దేవతలకు
నహితంబుగా నధ్వరాంశదాత
లైనవిప్రులఁ జంపఁ బూని కాశికి వచ్చి
శివరాత్రి యందుఁ దత్క్షేత్రవాసి
యొక్కవిప్రుఁడు శశాంకోత్తంసుఁ బూజింపఁ
బులివేషము ధరించి పొంచి కఱవ
తే. నతఁడు పూజించువృషభాంకుఁ డది యెఱింగి
చంపె నాదైత్యు నొఱలంగఁ జంక నిఱికి
పుండరీకంబు జంపి యాఖండపరశుఁ
డుండెఁ గాశిని వ్యాఘ్రేశ్వరుం డనంగ. 163

వ. ఇది వ్యాఘ్రేశ్వరు సంభవప్రకారంబు. వెండియు జ్యేష్ఠే
శ్వరు సమీపంబునఁ గుక్కుటేశ్వర పితామహేశ్వర గదా
ధరేశ్వర వాసుకీశ్వర కపాలభైరవ మహాతుండ సాగరేశ్వర
వృషభేశ్వర గంధరేశ్వర దుందుమారేశ్వర కర్కోటకేశ్వర
సుప్రతీకేశ్వర తుండకేశ్వర ముండకేశ్వర దివ్యలింగంబులు
భజించువారికి భోగమోక్షప్రదాయకంబులు. 164

శైలేశ్వర రత్నేశ్వర ప్రాదుర్భావము

సీ. ఒకనాఁడు మేనక యుర్వీధరేంద్రుని
యొద్దఁ గూర్మి తనూజ సుమఁ దలంచి
పేదజీవన మయ్యె బిడ్డకు ఆఁగుండె
యతఁడవ్వు గావున నరయ నెపుడు
కాశి నెట్లున్నదో కమలాయతేక్షణ
దర్శించి వచ్చుట తగవు గాదె?
యెలనాఁగ పుట్టినయింటివారలు తన్ను
నరయ కుపేక్షించినపుడు బెగడు

తే. ననిన బహుసంపదలతోడ నరిగి యతఁడు
హరిపురందర పురలక్ష్మి నతిశయించు
తత్పురముఁ జూచి శివుఁ జూచి తనయఁ జూచి
తెలిసి యవ్వీట లింగప్రతిష్ఠ చేసె. 165

వ. శైలాధిప ప్రతిష్ఠితం బైనయాలింగంబు శైలేశ్వరలింగంబు.

ఉ. అంబికకంచుఁ దెచ్చినమహామణిసంఘము ప్రోఁగు పోసి య
య్యంబురుహాక్షియానతిన యద్రికులాగ్రణి నిల్పె రత్నలిం
గంబు మహాప్రమాణముగఁ గాశికయం దది నేఁడునింద్రచా
పంబుల నీనుచు న్వెలుఁగుఁ బ్రాహ్ణాములందపరాహ్ణవేళలన్.

తే. చిత్తగింపు మనాది సంసిద్ధమైన
యొక్కపుణ్యేతిహాస మనూనచరిత!
శిశిరగిరిరాజసంప్రతిష్ఠితవిశుద్ధ
రత్నలింగేశుమహిమ విభ్రాజితముగ. 168

సీ. కాశికానగరంబు వేశవాటికలోనఁ
గర్పూరతిలక నా గణిక యొకతె
యసమసాయకునియాఱవపుష్పబాణంబు
రత్నేశు నాస్థానరంగభూమిఁ
కుండలీనృత్తంబు గోహలాద్యాచార్య
మతభేదముల దేశిమార్గసరణిఁ
జారికాకరణాంగహారరేచకముల
భ్రమరికావలన వర్తనగతులను

తే. నాడి మెప్పించు నెట్టి చోద్యంబొ, తరుణి
మీనకేతనహరుఁ డెట్లు మెచ్చు టెట్లు?
తాను దాండవవిద్యాప్రధానగురుఁడు
లలన పార్వతి సుకుమారలాస్యజనని. 169

వ. ఇట్లు పరమేశ్వరు నారాధించి యనంతరంబ యక్కాంత యొక్కనాఁడు కార్యాంతరవ్యాసంగంబున నన్యదేశంబునకుం బోయి విధివశంబునఁ గాలధర్మంబు నొందె. ప్రాగ్భవీయంబైన యీశ్వరారాధనసుకృతంబునం జేసి గంధమాదనంబున వసుభూతి యనుగంధర్వరాజునకుం బ్రభవించి రత్నావతి యనుపేర రూపలావణ్యవిభ్రమవిలాసంబులకు నావాసంబై పూర్వజన్మవాసనావశంబునఁ గాశికానగరం

బున రత్నేశ్వరుం బ్రతిదినంబునుం గొలిచి నిజావాసంబు
నకుం బోవుచుండు. 170

తే. ఇద్ధకరుణాన్వితుండు రత్నేశ్వరుండు
తన్ను ననిశంబుఁ గొలుచుగంధర్వసుతకుఁ
దనకు సేవకుఁ డైనపాతాళరాజు
శేషకుల రత్నభూషణుఁ జేసెఁ బెండ్లి. 171

తే. దంపశోకంబుకలలోనఁ దరుణిఁ గూర్చుఁ
గాంత కలలోన దందశూకంబు నిలుపు
నెట్టి వేడుకకాఁడో రత్నేశ్వరుండు?
జంపతులఁ జేయునందాఁకఁ జలముకొనియె. 172

క. లీలాకైవల్యవినో
దాలంబం బగుచు లోకయాత్రావిధులం
బాలించు నుబుసుపోకకు
హాలాహలగళుఁడు కాలయాపనబుద్ధిన్. 173

తే. రత్నలింగేశమందిరప్రాంతభూమి
రత్నచూడాఖ్యుఁ డను భోగిరాజు పేర
రత్నచూడాహ్వయంబు తీర్థంబు గలిగెఁ
గాశికాస్థానమునయందుఁ గలశజన్మ! 174

కృత్తివాసతీర్థమాహాత్మ్యము

వ. ఇఁకం గృత్తివాసతీర్థమాహాత్మ్యంబు వినుము. ఒక్కనాఁడు కాశీప్రవేశవిష్కంభంబున గంభీరకంఠగర్జిత ఘోషంబునం జదలం జాతకవ్రాతంబులను భువి శిఖండిమండలంబును నొండొండ యుల్లసిల్లం జేయుచు సముల్లసత్కదంబకుసుమ కేసరవాసనాసంపాది మధుసుధాసారసౌరభ(భ్య)ంబున దశ

దిశాభోగంబులు బుగులుకొన మూర్ధోద్ధూననంబున బ్రహ్మాండభాండంబు దళనకులిశకోటినుత్పాటించుభంగి నంగీకరించుచు, సముద్దండశుండాకాండగండూషితోజ్ఝితం బగు విబుధ నిర్ఝరిణీపాథఃపూరంబునఁ బయోధరవిధిచక్రంబు నీర్కాలుపుచుఁ, జరణఘట్టనంబునం బుడమిం గదిసిల్లినం గపట కిటిజరఠకమఠభుజగపరివృఢులు గూనిగిలం బడఁ గఠోర ఘూ(ఘూ)త్కారపవనవారాభిఘాతంబున జీమూతవ్రాతంబుః చెదరి పఱవఁ గర్జ్ఞతాళదుందుభిధ్వానంబున ధరణీకుధర గుహాక్రోడంబులం బ్రతిధ్వనులు పుట్టింప నుచ్చకుంభ క్రూరాట్టాలకం బగుట గర్వంబునకు నివాసదుర్గంబును, శీకరాసారశిశిరం బగుటఁ గ్రోధంబునకు విహారధారాగృహంబును దానప్రవాహంబులకుఁ బ్రావృటాలంబును, దర్పాంధకారంబునకుఁ గాళరాత్రిసమయంబును నై [1]యానంద కాననంబున నవష్టంభసంరభంవిజృంభణంబున. 175

స్రగ్ధర. చిందెం జెండాడె మట్టెం జిరిమె విఱిచెఁ గ్రొ
చ్చెన్ విఘట్టించె దంచెన్
ద్రుంచెం జక్కాడె మోదెం దోడసెఁ గెడపె న
త్యుద్ధతిం గాశిసీమన్
బంచక్రోశీధరిత్రీపరిధిఁ గరిసుర
ప్రత్యనీకుండు హేలా
సంచారోదగ్రభంగిన్ బలముకొని వనీ
సౌధవప్రాట్టవీథుల్. 176

వ. మఱియు. 177

---

1. నయూకారంబున గజాసురుండ.

సీ. భారభూతేశ్వర ప్రాకారగోపుర
ప్రఘణభూముల మదద్రవము గురియు
ఘర్షించు గండభాగము ఘటోల్కాదిత్య
భవనోపకంఠాంఘ్రిపంబు శాఖ
ఘూత్కార మొనరించు ద్రుమిచండపతిమేను
తుండంబుతుంపరఁ దొప్పదోఁగ
సలుపు నప్రక్రీడ శంకుకర్ణేశ్వర
స్థానమాణిక్యపాషాణవేదిఁ
తే. బాఱఁబాఱఁగ వేటాడుఁ బ్రమథకోటి
జిబిజిగఁ జేయు భూతముల్ కళవళింప
మలయుఁ గాశీపురంబులో మాఱు లేక
యపీతజయభాసురుఁడు సింధురాసురుండు. 178

క. గజదైత్యుఁ డివ్విధంబున
గజిబిజి సేయంగఁ గాశికానగరమునం
బ్రజనితభయకంపమునం
బ్రజ తామరపాకునీటిపగిదిఁ దలంకెన్. 179

ఉ. క్రొవ్వునఁగన్నుఁగానకిటు కుంజరదైత్యుఁడు విక్రమోద్ధతిం
జివ్వకుఁ జేయి సాచి తనుఁ జేరఁగ వచ్చిన లోచనంబులన్
నవ్వుచుఁ గాశికానగరనాథుఁడు విశ్వవిభుండు వైచె దా
నెవ్వఁడి యాతుధానరథినీలయకాలమునుం ద్రిశూలమున్.

తే. ఆ త్రిశూలాయుధంబు తీవ్రాంశుకోటి
భాశ్ఛటాభాసురము కుంభపదము నాటి
రక్తధారలతోన యారాక్షసేంద్రు
కలుషములు గూల్చి యేతెంచెఁ గ్రమ్మఱంగ. 181

వ. అప్పుడు నిర్మలాంతరంగుండై యారాక్షసేంద్రుండు విరూ
పాక్షు ననేకప్రకారంబులం బ్రస్తుతించినం బ్రసన్నుండై
యావిశ్వేశ్వరుండు గజాసురా! వరంబు వేఁడు మనిన నా
దైత్యుండు మృత్యుంజయున కిట్లనియె. 182

ఉ. పుట్టినవారికి న్నియతము ల్మరణంబులు విశ్వనాథ! నా
యట్టికృతార్థుఁ డెవ్వఁడు? చరాచరవిశ్వవిధాతృసృష్టికిం
బట్టముఁరాజు నానతసుపర్వకిరీటతటీవిటంకసం
ఘట్టితపాదపీఠు నినుఁ గంటిఁ దుదిం గరుణాపయోనిధిన్.

తే. అమరవంద్య! త్రిశూలాయుధమునఁ జీరి
యొడలు తిత్తొల్చి తోలు పచ్చడము చేసి
యుత్తరాసంగముగఁ దాల్చి యుండవలయు
నోడిగిలి రక్తబిందువు లుట్టిపడఁగ. 184

ఉ. అంధకవైరి! నాపయి దయాగుణసంపద గల్గెనేని నీ
స్కంధమునందు నాయొడలిచర్మము పాయకయుండుఁగాతదు
ర్గంధము లేక కర్కశము గాక చినుంగక వెండికొండపైఁ
గంధరకాశి ముస్నయొసకంబున నీవరమే వరించెదన్. 185

వ. అనిన సింధురాసురు కోరినవరం బిచ్చి యంధకవైరి కృత్తి
వాసుం డయ్యె. అది కారణంబుగా నత్తీర్థంబు గృత్తివాస
తీర్థం బన విషమభవభయకలుషవిష (నిషేక) భంగజాంగలికం
బైన గగనగంగాతీరంబునం బరమఖ్యాతి వహించె ననంతర
తీర్థంబు లాకర్ణింపుము. 186

కలహంసతీర్థాదిమాహాత్మ్యము

మ. కలశీసంభవ! యద్భుతంబొకటి యాకాశంబునన్ రెండు కా
కులు కాకా కృతిఁ గాకలీ కళ కళక్రూరప్రకారోద్ధతిన్

గలహం బాడి కొలంకులోనఁ బడి లోకంబెల్ల వీక్షింపఁగాఁ
గలహంసత్వమునొందె నిట్టివిసుమీ కాశీప్రభావోన్నతుల్.

వ. అది కలహంసతీర్థంబు. 188

తే. హంసతీర్థంబు డగ్గరి యన్నిదిశలఁ
బడియు వేలును మున్నూఱు భవ్యచరిత!
శంభుభవ్యలింగంబులు సన్మునీంద్ర
సంప్రతిష్ఠాపితము లభీష్టప్రదములు. 189

వ. లోమశేశ్వరలింగంబు మాలతీశ్వరలింగంబు నుత్తరలింగంబు జనకేశ్వరలింగం బసితాంగభైరవతీర్థంబు శుష్కోదరి తీర్థం బగ్నిజిహ్వామణికుండ మహాబలలింగ శశిభూషణలింగ మహాకాళ యోగదేవేశ్వర మహానాదతీర్థంబులును విమలేశ్వరలింగంబు మహాదేవలింగంబు పితామహేశ్వరలింగంబు రుద్రస్థలీతీర్థంబు చండీశ్వర నీలకంఠేశ్వర విజయేశ్వర శ్రీకంఠేశ్వర కపర్దీశ్వర యక్షేశ్వర జయంతేశ్వర త్రిపురాంతక కుక్కుటేశ్వర త్ర్యంబక హరిశ్చంద్రేశ్వర చతుర్వేదేశ్వర సహస్రాక్షేశ్వ రేశానేశ్వర సంహారభైరవస్థానోగ్రభవేశ్వర డుంఠీశ్వర భద్రకర్ణేశ్వర కాలకలశేశ్వర కామేశ్వరలింగంబులును గపాలలోచనతీర్థంబును దీప్తేశ్వ రామరేశ్వరస్వయంభూమహాలక్ష్మీశ్వరధరణీవరాహేశ్వరలింగంబులును గణపతిక్షేత్రంబును మత్స్యోదరీతీర్థంబును భూర్భువస్స్వర్లింగంబును హాటకేశ్వర కిరాతేశ్వర భారభూతేశ్వర నాకులేశ్వర నైరృతేశ్వర జలప్రియ జ్యేష్ఠేశ్వరదేవేశ్వరోంకారేశ్వర ప్రాసాదపర్వతలింగంబు లివి యష్టషష్ఠ్యాయతనంబులు. 190

సీ. శ్రీవిశాలాక్షిచే శిశిరభానుకిరీటు
నర్ధాంగలక్ష్మిచే నగజచేత
లలితచేఁ దరుణపల్లవపాటలాంగిచే
జవరాలిచే లోకజననిచేతఁ
బూఁబోఁడిచే విశ్వభుజచేత హ్రీంకార
వనజవాటివిహారవరటచేత
శివదూతచేతఁ బశ్చిమనాడికావీథిఁ
బరమయోగులు గాంచుఫలముచేతఁ

తే. చిత్రకంఠికచే నీలచికురచేత
భద్రకాళికచే దైత్యభయదచేత
నిగళభంజనచేఁ గృపానిఘ్నచేతఁ
గరిమ నైకొనె శ్రీకాశికాపురంబు. 191

తే. గుజ్జుమోకమావి కుబ్జామహాదేవి
భక్తలోకకీరపతగములకుఁ
గమల కమలనాభు గారాబుదేవేరి
గ్రామదైవతములు కాశినగర. 192

సీ. ఐరావణము నెక్కి యశని చే ధరియించి
యైంద్రి ఘంటావీథియందు మెలఁగు
విహరించు శృంగారవిపినవీథులయందుఁ
గౌమారి శిఖిశాబకంబు నెక్కి
చంద్రశేఖరునాదిశక్తి మాహేశ్వరి
యాఁబోతు నెక్కి వాహ్యాళి వెడలుఁ
జదలేటి సైకతస్థలులఁ వినోదించు
నలవాక బ్రాహ్మి రాయంచ నెక్కి

తే. విహగపతి నెక్కి వైష్ణవి ప్రహరి దిరుగుఁ
బంచమియును జాముండియు సంచరింతు
రాత్మవాహనముల నెక్కి యహరహంబు
ననఘ ! శ్రీకాశికాపురాభ్యంతరమున. 193

తే. చిత్రఘంటామహాదేవి శివపురంధ్రి
గౌరి నెవ్వాఁడు సేవించుఁ గాశినగరి
నతఁడును వినండు ప్రాణప్రయాణవేళ
యమలులాయకఘోరఘంటారవంబు. 194

శా. ఝుంకించుం గరతర్జనీముఖమునన్ జాలేశ్వరీదేవి కా
శ్యంకస్థాయిని భక్తకోటిబహువిఘ్నౌఘంబులన్నిచ్చలున్
హ్రీంకారాక్షర మంత్రసౌధశిఖరక్రీడాకళాలోల సా
హంకారామరవైరిమర్దనవిధివ్యాపారపారీణ యై. 195

గీ. భద్రనాగమహాతీర్థపరిసరమున
భద్రవాపికయందు నాప్లవ మొనర్చి
భద్రకాళిక వీక్షించు పంచజనుఁడు
భద్రసంస్థితిఁ గాంచు వింధ్యాద్రిదమన ! 196

క. సిద్ధివినాయకుఁ గేడ వర
సిద్ధిఁ ద్రిసంధ్యంబు సేవసేసిన నెరయన్
సిద్ధించును మానవునకు
శ్రద్ధానంతునకు విభవసంపత్సిద్ధుల్. 197

క. విధిశక్తిఁ గాశికాపుర
నిధి నిరవధినిరవసంధినిరవధికకృపా
భ్యధిక విధీశ్వరశివుస
న్నిధిఁ గొలిచిననరుఁడు గాంచు నిరుపమసిద్ధుల్. 198

గీ. అధికభక్తితోడ నమరేశ్వరీదేవి
సిద్ధలక్ష్మి సంభజించి నరుఁడు
నిడివిగాఁగ బ్రదుకు విడువంగ ముడువంగ
వ్రేఁకనైనకలిమి వృద్ధిఁ బొందు. 199

వ. వెండియుఁ ద్రిలోకసుందరి యనుకందర్పదమనుశక్తి యవిముక్తక్షేత్రంబునకుఁ గస్తూరికాతమాలపత్రంబు. శ్రీకంఠసన్నిధియందు మహాలక్ష్మి భజించువారలకు భోగమోక్షలక్ష్ముల నొసంగు. లక్ష్మీపీఠం బనుమహాస్థానంబు సాధకాభీష్టదంబు. కమలాపీఠంబున కుత్తరంబున హయకంఠి యనుదేవి కఠినతరకుఠారధారాఘట్టనంబున విఘ్నద్రుమషండంబు ఖండించు. పాశపాణిదక్షిణంబునఁ గౌర్మికర్మంబులు ఖండించు. వాయవ్యభాగంబున శిఖిచండి శిఖండినీరూపధారిణి యై జాము జామునఁ గేకాధ్వనులు సేయు. భీమచండి యుత్తరద్వారంబు రక్షించుచుండు. 200

గీ. కాశిభీమేశ్వరునిచక్కఁ గట్టెదురనఁ
బాశపుష్కరపాణి యై భద్రకాళి
భీమచండి మహాదేవి భీమకుండ
పార్శ్వభూమండలంబునఁ బాయకుండు. 201

గీ. ఛాగవక్త్రేశ్వరీదేవి శంభుశక్తి
వృషభకేతనుయామ్యదిగ్వీథియందుఁ
గదిసి సేవించువారివిఘ్నముల నెల్ల
మేయుఁ జిగురాకు భక్షించుమేఁకవోలె. 202

గీ. తాటిపాడవున నవిముక్తధామసీమఁ
దాళజంఘేశ్వరీదేవి తలిరుఁబోఁడి

విఘ్నముల నెల్ల జురుకొట్టు వెదకి వెదకి
తాటికంబంబు సవ్యహస్తమునఁ దాల్చి. 203

క. వికటానన యను దేవత
మకుటాంగదకటకహారమండన కాళీ
నికటమున నుండుఁ బాయక
యకలంకశశాంకశకల మాదల వెలుఁగన్. 204

క. ఉద్దాలకతీర్థంబున
నుద్దాలకనామధేయుఁ డుడుపతిమకుటుం
డుద్దండపండధరమద
భిద్దోగఖట్వాంగుఁ డుండుఁ బ్రియ మెసలారన్. 205

గీ. అందు వసియించు యమదంష్ట్రి యనెడు దేవి
పూర్వదిగ్భాగమునకు విభూష యగుచు
నమ్మహాశక్తి నవమందహాస మైన
మెల్లచూపున వలపించు మృడునిమనము. 206

గీ. తారకేశ్వర మనెడుతీర్థంబునందుఁ
దారకేశ్వరదేవు నిద్ధప్రకాశుఁ
దారకేశ్వరరేఖావతంసు శివునిఁ
దారక బ్రహ్మనిధిఁ గొల్చు ధన్యతముఁడు. 207

సీ. ఆతారకేశ్వరం బనుతీర్థ మేలెడు
దారకేశ్వరుని ప్రత్యంతభూమి
సప్తపాతాళవిష్కంభతాలుద్వయీ
భీకరంబును దందశూకరాజ
జిహ్వాలతంబును జీమూతవిద్యుక్త
రోష్ఠంబును ధరాధరోష్ఠదళము

తారకానక్షత్రదశనమండలము వి
ద్యుద్దండదంష్ట్రాచతుష్టయంబు
గీ. నైనవదనంబుఁ దెఱచి బ్రహ్మాండపిండ
కబళనమునకుఁ జేసాచి కాళరాత్రి
కాళి శుష్కోదరీదేవి గరల కుండుఁ
జన్మముండకుఁ జెలికత్తె శైలదమన! 208
సీ. జంగాళముగ వ్యాఘ్రచర్మాంబరముఁ గట్టి
శూలంబు వలచేతఁ గీలుకొలిపి
భసితత్రిపుండ్రంబు ఫాలపట్టికఁ దీర్చి
నిద్దంపుఁజిలువజన్నిదముఁ దాల్చి
చనుదోయిఁ గీకసస్రక్కలాపముఁ బూని
తనువల్లి రక్తచందన మలంది
కరటాంజనము కల్కి క్రాలుకన్నులఁదీర్చి
మధుపానమున నుబ్బు మదికి నొసఁగి
గీ. వాసి గల్గి మహాప్రేతవనమునందు
సంతతంబును విహరించుఁ జన్మముండ
రుండమండన గానిచోఁ రూఢిఁ జన్మ
ముండయ ట్లమ్మహారుండ మునివరేణ్య! 209
శా. హాలాపాన మొనర్చి యిద్దఱును నన్యోన్యంబు మత్తిల్లి కం
కేళీనృత్తవినోదకందుకమణిక్రీడావిహారక్రియా
లీలాహాస్యకళాప్రసంగముల నుల్లేఖించ వర్తింతు రె [తల్.
క్కాలంబుఁ ఘటజన్మ! కాశిఁదుమన్ గర్వించి యద్దేవ
భుజంగప్రయాతము.—
హయగ్రీవతీర్థంబునం దభ్రగంగా

పయోవేణి నిర్ధూతపాదారవింద
ద్వయీరత్నపీఠాంకఁ దాళ ప్రమాణా
భయఘ్ను న్మహోరుండ భావింతు రార్యుల్. 211

వ. మహోరుండకుం బశ్చిమభాగంబున స్వప్నేశ్వరి. ఆస్వప్నేశ్వరి భజించువారలకు భూతభవిష్య[1]చ్ఛుభాశుభార్థంబులు గల లోనం దెలుపుచు నవమ్యష్టమీచతుర్దశీదివసంబులం బూజఁ గొను. ఆస్వప్నేశ్వరికి వరుణదిగ్భాగంబున దుర్గాదేవి. ఆ దుర్గ కాశీక్షేత్రంబున దక్షిణద్వారదేశంబు రక్షించుచుండు ననినం గుంభసంభవుండు శంభుసంభవున కిట్లనియె. 212

గీ. తుహినగిరిరాజకన్యక దుర్గ యయిన
కారణం బేమి? కందర్పవైరితనయ!
ఆనతిమ్మన్న గుహుఁడు వింధ్యాద్రిదమన!
విను మనుచుఁ జెప్పఁ దొడఁగె సవిస్తరముగ. 213

దుర్గామాహాత్మ్యము

వ. దుర్గుం డనుపేర నొక్క రాక్షసుండు రురునికొడుకు తపోబలంబున నవధ్యుఁడై భూర్భువస్స్వర్భువనంబులు బాధింపం దొడంగిన దేవతలు మహేశ్వరు నభయంబు వేఁడిన నట్లగా నొసంగి శివుండును రాక్షసునిం భంజింప దాక్షాయణి నియోగించిన. 214

గీ. గౌరి వింధ్యాద్రి కేతెంచి కాళరాత్రిఁ
బంపె రాత్రించరేంద్రునిఁ బట్టి తేరఁ
జంపఁ బాతాళమున కంపఁ జాలునట్టి
శక్తియును నేర్పు నిచ్చి యైశ్వర్య మెసఁగ. 215

1 ద్వర్తమాన శుభాశుభంబులు.

వ. కాళరాత్రియు సద్రాణియాజ్ఞ శిరంబునఁ దాల్చి యద్దైత్యు
  సన్నిధి కరిగి యతని కిట్లనియె. 216

గీ. రాయబారంబు వచ్చితి రాక్షసేంద్ర!
  యచలకన్యక యనుప వింధ్యమున నుండి
  బుద్ధిమంతుఁడ వై తేని భువనములకు
  బాధ సేయక యుండుము సిష్పాపబుద్ధి. 217

వ. వేదోక్తంబు లైనసర్వక్రియాకలాపంబులుం బ్రతిష్ఠింపం
  బాలుపడునది యమ్మహాదేవియాజ్ఞం జేసి పెద్దకాలంబు
  బ్రతుకుము. అట్లు కాదేని బంట వై యకుంఠితోత్సాహం
  బున నక్కుంఠీరవగమన (మధ్య)తోడ యుద్ధము గావింపుము.

తే. హితము చెప్పితి విన నిచ్చయేని లెస్స
  జగము బాధింప కుండుట చాలు మాకుఁ
  దుహినగిరికన్యయానతిఁ ద్రోచి తేని
  యీడ్చికొని పోదు రెంద్రుక లిరియఁబట్టి. 219

వ. అని గర్వించి పలికినకాళరాత్రిం జూచి కనలి యారాత్రించ
  రేశ్వరుండు. 220

సీ. అట్టహాసము చేసి యారా! ప్రతాపోక్తు
      లాఁటదానికి నింత యదటు వలదు
  నే మన్న ననియెఁ గా కేమి మీయేలిక
      సాని వచ్చితి వీవ చాలు మాకు
  జగదేకసామ్రాజ్యసంపత్తియును బోని
      యీ వుండవలదె మాయింట నెపుడు?
  నేతదర్థమ కదా ఋషి దేవతాకోటి
      దట్టిఁ బెట్టినవాఁడఁ బట్టి తెచ్చి

తే. సంటయిలు సొచ్చెఁ గుందేలు వనజనయన!
మెచ్చినాఁము విధి నిన్నుఁ దెచ్చినపుడ
యడవిలోపల నున్న గేహమున నున్నఁ
బొందఁగలభాగ్యవిభవంబు పొందుఁ బురుషు. 221

వ. అని యంతగపురచరుల 'దీని నభ్యంతరంబునకుం గొనిపొం'
డని పలికినం గళవళింపక కాళరాత్రి రాత్రించరేశ్వరున
కిట్లనియె. 222

ఉ. నీతివిదుండ వీవు రజనీచరవంశవరేణ్య! యర్థమే
దూతలమాటకుం గినియ! దూతలు నేరక యాడినప్పుడుం
గాతురు తప్పు విశ్వనయకార్యధురంధరు లైనభూపతుల్
దూతకు నిష్టసిద్ధికయి తూరఁగ నాడఁగఁ జెల్లు భూపతిన్.

సీ. నయపరాక్రమము లెన్నఁడు ప్రయోగింపరే
దేశకాలములు శోధించి చూచి?
నన్నుఁ బట్టఁగ నైన యది యేమి? పట్టంగ
రాదె న న్నేలినరాజవదన?
నెంద అబ్బరు నీకు నేను నైతంబుగాఁ
బర్వతాత్మజ పట్టువడినయపుడు
నే నాఁక నుండనీ కెవ్వారు చూపెద
రింక నెఱింగి యీయిందువదన?

తే. వేఁటకానికి మృగము లేవెంట వచ్చుఁ
దెలియుమా దీముఁ గాలిచి తినిన పిదప?
నన్నుఁ బట్టిన దొరకునే నగతనూజ
ప్రథననిర్జితదిగధీశ! రాక్షసేశ! 224

తే. కాంతఁ గందువఁ బెట్టి నీకడకు మేలు
చెప్ప వచ్చిననన్ను శిక్షింపఁ దగునె?
మొనసి హిత వాచరించిన 'ముండముక్కు-
కోఁతపడె' ననుమాటయె గోచరించె. 225

శా. నీయాజ్ఞన్ గడుగాసి వెట్టెదవు నన్ బెక్కండ్రు రంతఃపుర
స్థాయుల్ శౌర్యపరుల్ పయోధరతటీసంవ్యానముల్ గొప్పునుం
జేయుం జెట్టయుఁ బట్టి రాజులు పరస్త్రీసింతసేయింతురే?, న్యా
యంబౌయిది? మాన్పునిగ్రహము మేలందింతునీకెమ్మెయిన్.

వ. అని కాళరాత్రి సకరుణంబుగాఁ బలుకం గ్రోధాంధుం డై
యవ్విబుధవిరోధి వినియు విననియట్ల యూరకుండె. పొద
పొద మని సౌవిదల్లులు హస్తపంకజంబులు పట్టి తివిచిన
నప్పంకజాక్షి కరకంకణఝణఝణాత్కారంబుగాఁ గెంగేలు
గుదిలిచి తివిచికొని వికటకుటిలభ్రుకుటినటనభీషణ ఫాలఫల
కయై కలకలం గటికినగవు నగి కన్నుల నిప్పులురుల హుంకా
రంబు సేసినం గల్పాంతకాలవికరాళకాలవ్యాళఘనాఘన
ఘటాకఠోరదీర్ఘనిర్ఘాతచ్ఛటాపాతంబునకుఁ దాత యగు నా
నిర్ఘోషంబు విని గుండియ లవిసి బెండువడి యంగజాలలు
గాలుగాలం బెనచుకొని చాఁపచుట్టువడం గూలి రచ్చెరువును
మచ్చరంబును గోపంబును నాటోపంబు నెఱయ మెఱయ
దుర్గాసురుండు ఖడ్గఖేటకంబులు ధరియించి డిగ్గన గద్దియదిగ
నుఱికిన నప్పు డడ్డంబు సొచ్చి దుర్ముఖుండును సీరపాణియుఁ
బాశపాణియు సురేంద్రదమనుండు ఖడ్గరోముండు నుగ్రా
క్షుండు దేవకంపనుండు నహంపూర్వికాసంఫుల్లపటలంబు
లగు చేతస్సంపుటంబులం బుటపుటనియవష్టంభంబుం బూని

కుంభినీధ్రసన్నిభాకారులు కుఠారభిండివాల మండలాగ్ర
త్రిశూలపట్టిసప్రాసతోమరంబులు ధరియించి యమ్మహాదేవిం
జుట్టుముట్టి పట్టు నురవడించిన. 227

మ. ఘనరౌద్రోద్ధతిభద్రకాళికకటాక్షజ్యోత్స్న కెంపార నుష్ణా
ని వక్త్రంబుబిగించి యూఁదుటయు నుల్కాగ్నిచ్ఛటల్ గ్రమ్మవె
చ్చనిజంఝాపవమాన ముప్పతిలి నక్షత్రకోటినొక్కుమ్మడిఁ
గొనిపోయెన్విసువీథిఁ జొప్పసొరువాకుంబోలె నెందేనియున్.

తే. పగర నిబ్భంగి శతకోటిఁ బొలియ నూఁది
కఠినహాసం బొనర్చి యాకాళరాత్రి
యరిగె నాకాశవీథి వింధ్యాద్రిసీమ
కసురయును శక్తి వెంటాడి యరుగుటయును. 229

తే. అంబరక్షోణిచక్రమధ్యమున నుండి
కోటి కోటి నిశాటులు గొల్చి నడువఁ
గాళరాత్రి మహాశక్తిఁ గవిసి వెంట
నేగుదెంచె దుర్గాసురుం డేకధాటి. 230

వ. అప్పుడు శతకోటిరథంబులు నర్బుదశతద్వయగజంబులు
గోట్యర్బుదహయంబులు నసంఖ్యాతయోధులుం గొలువ నే
తెంచుదుర్గాసురుండు ముందట బృందారకమార్గంబున నిరర్గళా
టోపంబున నేతెంచు కాళరాత్రిని దవ్వుదవ్వులం గనుంగొని
మహాభుజసహస్రదివ్యాయుధయు మహాతేజోపబృంహి
తయు మహాఘోరప్రహరణ పరంపరాధగద్ధగితధామచ్ఛటా
చ్ఛాదితాంబరయుఁ బ్రోద్యచ్చండమార్తాండమండలసహస్ర
కాంతిజ్యోతిశ్చక్రమధ్యవర్తినియు లావణ్యవార్ధి సమృద్ధి

చంద్రికయు నై త్రైలోక్యకల్యాణమంటపప్రదీపికయు నై
యాసర్వమంగళకట్టాయితం బై నిలిచె నప్పుడు. 231

తే. ధరణిధరరాజకన్యపాదముల కెఱఁగి
కరసరోజద్వయము మోడ్చి కాళరాత్రి
యాదినుండియుఁ దనదువృత్తాంత మెల్లఁ
బూస గ్రుచ్చినచందానఁ బోసఁగఁ జెప్పె. 232

వ. అనంతరంబ దుర్గాసురుండు వింధ్యాటవీమధ్యంబున వేలంబు విడిసి జంభ మహాజంభ శుంభ వికటానన లంబోష్ఠ పింగాక్ష హయగ్రీవ మహోగ్రాత్యుగ్రవిగ్రహ కూరా(?)స్య క్రోధన సంక్రందన మహాలయ జితాంతక దుందుభ వృకానన సింహాస్య కూరాస్య ఖర శివారావ మధుపోత్కట ఘోరకతుండ ప్రచండ ముండ మహాభీషణాదు లగు దొరల రావించి యండఱం గలయం గనుంగొని యుచ్చైస్స్వనంబున నిట్లనియె. 233

ఉ. తెం పెసలారఁ గా మనల దీకొనియున్నది యొక్క లేమ దో
స్సంపద వింధ్యభూధరవిశాలశిలాస్థలి నీతలోదరిం
జంపక పట్టి తేవలయుఁ జయ్యన నేగి సరోరుహాక్షులం
జంపకపుష్పకోమలులఁ జంపుట శౌర్యమె! వీరధర్మమే? 234

క. చలమున నొండెను నొండెను
బలమున బంధించి యొండెఁ బ్రార్థనలీలా
కలనమున వేగ కొని రా
వలయుఁ దరుణిఁ గంద కుండ వాడక యుండన్. 235

ఉ. క్రచ్చఱ నెవ్వఁ డేనిఁ గసుగందక యుండఁ సరోజలోచనం
దెచ్చు నుపాయమార్గమునఁ దెచ్చినయప్పుడ యేనువానికిన్

మెచ్చుడివోకయుండ మఱిమీఁదటియోగులు వేయుచుండనీ
యిచ్చితి మింద్రలోకపదమిందఱుసాక్షిగఁ బొందు గ్రమ్మఱన్.

వ. అనుటయు సన్నద్ధులై రాక్షసులు సంవర్తకాలంబున జల
ధులు మేర దప్పినచందంబున భువనంబులు ముంచి మించు
కొండకూఁతుపై విజృంభించి శంఖభేరీపటహకాహళారా
వంబు రోదసీకుహరంబు ఫూరటిల్లంజేయ ధాత్రీమండలంబు
వడవడ వడంక నడచి రాసమయంబున. 237

తే. శక్తి రాక్షసుతోడ రాక్షసుఁడు శక్తి
తోడఁ దలపడ సమధికాద్భుతము గాఁగ
ద్వంద్వయుద్ధంబుసాగె వింధ్యంబుమీఁదఁ
బ్రకరసిష్ఠురబహువిధ ప్రహరణములు. 238

వ. త్రైలోక్యవిజయతోడ దుర్ధరుండును, దారతోడ దుర్ముఖుం
డును, జయతోడ ఖరుండును, త్రైలోక్యసుందరితోడ సిరపా
ణియుఁ, ద్రిపురహరతోడఁ బాణపాణియుఁ, జగన్మాతతోడ సు
రేంద్రదమనుండును, త్రిపురభైరవితోడ దేవకంపనుండును,
గామాక్షితోడ ఖడ్గరోముండును, గమలాక్షితోడ వజ్రపా
ణియుఁ, ద్రిపురతాపనితోడఁ బింగళాక్షుండును, జయంతి
తోడఁ గుక్కుటాస్యుండును, విజయతోడఁ గపింజలుం
డును, నపరాజితతోడఁ గాకవక్త్రుండును, శంఖినితోడ
ఘూకరవుండును, గజవక్త్రతోడ శంఖకర్ణుండును, మహి
షాక్షితోడ జలంధరుండును, రణప్రియతోడ బకుండును,
శుభానందతోడఁ గిమ్మీరుండును, గోటరాక్షితోడ ధూమ్ర
వర్ణుండును, శివారావతోడ ధూమ్రాక్షుండును, త్రినేత్ర

తోడఁ బింగళాత్ముండును దలపడినం బోరుమహాఘోరం
బయ్యె నయ్యవసరంబున. 239

శా. ద్యావాపృథ్వ్యవకాశముల్ బుగులుకో నందంద వింధ్యాద్రి
ఘంటావీథిఁ జెలంగెఁ గఠోరతరకంఠక్ష్వేళనాదంబుతో
దేవీదానవకోటినిష్ఠురభుజాతిప్రౌఢనానాధను
ర్జ్యావల్లీభవభూరిటాంకృతు లుటుద్రాఘిష్ఠవీరధ్వనుల్. 240

క. శక్తులతో సరి పోరెను
నక్తంచరకోటి ప్రహారణవ్రాతములఁ
ముక్తాముక్తంబులఁ గర
ముక్తంబుల యంత్రముక్తముల ముక్తములన్. 241

మ. తిమిరంబుఁ ఘటియించెఁ బట్టపగటఁ దేవీమరుద్విద్విష
త్సమరారంభములఁ సముద్భటభుజాచక్రీభవద్దీర్ఘదు
ర్ధమకోదండవినిర్గతంబు లయి హేరాళంబు పాదత్రుర
ప్రమహాభల్లశిలీముఖాంజలికనారాచార్ధచంద్రాస్త్రముల్. 242

వ. ఇవ్విధంబున నుభయ సైన్యంబులు సరి పోరుచుండనయ్యెడ
వింధ్యవాసిని మహామాయ వాయవ్యాస్త్రంబు ప్రయోగించి
రాక్షసులయస్త్రశస్త్రంబులు తూల నడఁచిన నిరాయుధు లై
యద్దైతేయులు విఱిగి పఱచి రంత దుర్గాసురుండు డగ్గరి
మహాశక్తిం గొని వైచిన. 243

తే. రాక్షసుఁడు వైచినట్టియాప్రబలశక్తి
శక్తి వైచి విఖండించె శంభుశక్తి
చక్రమున వైచె వింధ్యాద్రిసదన నసుర
శైలకన్యక యది త్రుంచెఁ జక్రమునను. 244

తే. అనిమిషారాతి విల్లెత్త నగజ త్రుంచె
శూల మెత్తిన ఖండించె నీలవేణి
పఱియలుగఁ జేసె గద యెత్త భద్రకాళి
ఖడ్గమెత్తిన జక్కాడెఁ గంబుకంఠి. 245

మ. వడి వింధ్యాచలగండశైలములఁ దన్నైవంగ నేతెంచుచో
నుడురాజార్ధశిఖావతంసుసతి యత్యుగ్రంబువహ్న్యస్త్రమున్
ద్వోడి దుర్గాసురునేయ వాఁడు వడియెన్ దుర్వారవజ్రాహతిన్
బహుశైలంబునఁ బోలి మెచ్చిరి హరిబ్రహ్మాదిబృందారకుల్.

వ. అప్పుడు "దేవీ! జగద్ధాత్రీ! జగత్త్రయీజననీ! మహేశ్వర మహాశక్తీ! దైత్యద్రుమకుఠారికా! త్రైలోక్యవ్యాపినీ! శివా! శంఖచక్రగదాశార్ఙ్గధారిణీ! విష్ణుస్వరూపిణీ! హంస! యాన! సర్వసృష్టివిధాయినీ! అనాదినిధనవాగ్జన్మభూమి! చతురానన! ఐంద్రీ! కౌబేరీ! వాయవీ! వారుణీ! యామినీ! నైరృతీ! ఐశీ! పావకీ! శశాంకకౌముదీ! సౌరీ! సర్వదేవమయీ! పరమేశ్వరీ! గౌరీ! సావిత్రీ! గాయత్రీ! సరస్వతీ! ప్రకృతీ! మతీ! అహంకృతీ! బ్రహ్మాండాంతస్థమహాదేవీ! పర! పరాపరపరమ! పరమాత్మస్వరూపిణీ! సర్వస్వరూప! సర్వగ! చిచ్ఛక్తిమహామాయ! స్వాహా! స్వధా! శ్రౌషడ్వౌషట్స్వరూపిణీ! ప్రణవాత్మిక! సర్వమంత్రమయీ! చతుర్వర్గాత్మిక! చతుర్వర్గఫలోదయ! యని యిట్లనేకప్రకారంబుల దేవతలందఱు ప్రస్తుతించిరి. భద్రకాళియు నిర్జరుల కభీష్టవరంబులు ప్రసాదించె. దుర్గాసురుని మర్దించి జగంబులదుర్గంతి మాన్పుటం జేసి భర్గగృహిణికి దుర్గాభిధానంబు గలిగె. దుర్గాదేవి గాశీ క్షేత్రంబునందు నుపసర్గాదిదోషంబులు మాన్పు. దుర్గా

కుండంబునం గృతస్నానుం డైన నరుండు దౌర్గత్యంబులు వాయు. దుర్గాశరీరంబునం బుట్టిన శక్తులు దుర్గాసమీపంబున వసించి పంచక్రోశంబున నిరాక్రోశంబుగా శాసింతురు. మఱియు శతనేత్ర సహస్రాస్య యయుతభుజ యశ్వారూఢ గజాస్య త్వరిత శతవాహిని విశ్వసౌభాగ్య గౌరి యన్వీరు తొమ్మండ్రును శక్తులు. రురుండు చండుం డసితాంగుండు కపాలి క్రోధనుం డున్మత్తభైరవుండు సంహారుండు భీషణుం డీ యెనమండ్రు భైరవులు విద్యుజ్జిహ్వుండు లలజ్జిహ్వుండు క్రూరాస్యుండు క్రూరలోచనుం డుగ్రలోచనుండు వికటదంష్ట్రుండు వక్రాస్యుండు వక్రనాసికుండు జంభకుండు జృంభణాముఖుండు జ్వాలానేత్రుండు వృకోదరుండు గర్తరినేత్రుండు మహానేత్రుండు తుంగనేత్రుండు అంత్రమండనుండు జ్వలత్కేశుండు కంబుశిరుండు పృథుగ్రీవుండు మహాహనుండు మహానాసుండు లంబకర్ణుండు కర్ణప్రావరణుం డనాదిగాఁ గలబేతాళు లసంఖ్యాతులు. భూతంబు లసంఖ్యంబులు గల రిందఱు కాశీక్షేత్రంబు సంరక్షింతు రనినఁ గుంభసంభవుండు గాశీస్థానంబున దివ్యలింగంబు లెన్ని? తత్ప్రభావంబు లెట్టివి యానతి మ్మనినఁ బార్వతీదేవికి భవుం డానతిచ్చిన ప్రకారంబున నయ్యగస్త్యునకుఁ గుమారుం డిట్లని చెప్పె. 247

ఓంకారేశ్వరమాహాత్మ్యము

సీ. ఆనందవిపినంబునం దాదిమ బ్రహ్మ
దప మాచరించె నత్యంతనిష్ఠఁ

బర్యాయమున నేగెఁ బదినూఱులుయుగంబు
లంతఁ బాతాళలోకాంతరమున
నుండి యుత్థిత మయ్యె నొకదివ్యలింగంబు
బహుకోటిసూర్యసద్భాసితంబు
విధి మనోవీధి భావించు నేతేజ మా
తేజంబు లింగమూ ర్తిత్వ మొందె

తే. భూరిభువనాగ్ర భాగవిస్ఫుటనవేళ
సంభవించినచటచటచ్ఛబ్దధాటిఁ
గ్రమముతోడ సమాధియోగంబు విడిచి
కన్ను లెనిమిదియును విచ్చెఁ గమలభవుఁడు. 243

సీ. ఆదిమతేజంబునం దకారము దోఁచెఁ
గైటభారాతియాకారరేఖ
నటఁ జూడఁ జూడఁ బ్రత్యక్షమయ్యె నుకార
మంబుజాసనుని రూపంబుఁ దాల్చి
తదనంతరంబ చంద్రశిఖావతంసు చం
దంబుఁ గైకొని మకారంబు మెఱసె
నంత శబ్దబ్రహ్మ మైన నాదంబున
భువనహేతువును బిందువును దోఁచె

తే. నఖిలములు గూడి యోంకార మయ్యెఁ బిదపఁ
గ్రమముతోఁ గుంభభవ! యకారము నుకార
మును మకారంబు నగు వర్ణములును నాద
బిందువులు ధాతయగ్రమునందు నిలిచె. 249

వ. ఎయ్యది సంసారతారకం బగుటఁ దారకం బయ్యె. ఎయ్యది
ప్రకర్షంబునం జేసి యశేషవిక్రియావిరహంబునం గూటస్థ

నిత్యం బయ్యును బరమానందప్రకాశంబున సర్వదా యభి
నవం బగు పరబ్రహ్మంబునకు వాచకం బగుటఁ బ్రణవాభిధా
నంబు వహించె. ఎయ్యది యకారోకారమకారబిందునా
దంబు లైదవయవంబులవలనను బంచాశత్కళారూపమగు
మాతృకకుం గారణభూతం బయ్యె. ఎయ్యది త్రయీమ
యంబు తురీయంబు తురీయాతీతంబు నిఖిలాత్మకం బనం
బరగు; ఎయ్యది చతుశ్శృంగంబు సప్తహస్తంబు ద్విశీర్షంబు
త్రిపాదంబు త్రిధాబద్ధం బై వృషభాకారం బై మ్రోయు;
ఎద్దానియందు బ్రహ్మాండం బగుజగం బఖిలీనం బై యుండు?
ఎయ్యది యకారోకారమకారంబు లను వర్ణత్రితయం
బుచే వేదచతుష్టయాత్మకంబును గార్హపత్యదక్షిణాహవనీయ
సంవర్తకాగ్నిరూపంబును బృథివ్యంతరిక్షద్యుసోమలోకాత్మ
కంబు సుదాత్తానుదాత్తస్వరితప్రచయాత్మకంబును భూతభవి
ష్యద్వర్తమానసాధారణకాలాత్మకంబును నాఁ జను? ఎద్దా
నియం దాదర్శంబునందు ముఖంబునుం బోలె స్వప్రకాశక
చిద్రూపుండు నీశ్వరుండు ప్రతిబింబించు? ఎయ్యది యకా
రాదివర్ణంబు లేకత్వంబు నొందునట్లుగా సంయోజింప
'నాద్గుణ' యనుసంధిఁ గూడి మంత్రత్వంబు నొందు? అట్టి.
యోంకారమంత్రత్వంబు దివ్యలింగస్వరూపంబై యావిర్భ
వించినం గనుంగొని పంకజాసనుండు 'నమ ఓంకార స్వరూ
పాయ, నమస్సర్వరూపస్వరూపిణే, నమో రుద్రాయ, నమో
భవాయ, నమ శ్శర్వాయ, నమ ఉగ్రాయ, నమ స్సామర్గ్యజు
స్స్వరూపాయ, నమోనాదాత్మనే, నమో బిందుకలాత్మనే,
నమో లింగాయ, నమో లింగస్వరూపాయ, నమో భీమా

య, నమఃపశుపతయే, నమస్తారస్వరూపాయ, నమశ్శివాయ,
నమఃకపర్దినే, నమశ్శితికంఠాయ, నమో మీఢుష్టమాయ,
నమో గరిష్ఠాయ, నమ శ్శిపివిష్టాయ, నమో హ్రస్వాయ,
నమో బృహతే, నమోవృద్ధరూపిణే, నమః కుమారగురవే,
నమ శ్శ్వేతాయ, నమః కృష్ణాయ, నమః పీతాయ, నమోఽ
రుణమూర్తయే, నమో ధూమ్రవర్ణాయ, నమః పింగళాయ,
నమః కిర్మీరవర్చసే, నమః పాటలవర్ణాయ, నమో హరితతే
జసే, నమో నానావర్ణస్వరూపాయ, నమో వర్ణపతయే, నమ
స్స్వరరూపాయ, నమో వ్యంజనరూపిణే, నమ ఉదాత్తాను
దాత్తస్వరితరూపాయ, నమో హ్రస్వదీర్ఘప్లుతవిసర్గాత్మనే,
నమోఽనుస్వారస్వరూపాయ, నమ స్సానునాసికాయ, నమో
నిరనునాసికాయ, నమో దంత్యాయ, నమస్తాలవ్యాయ,
నమ ఓష్ఠ్యాయ, నమ ఉరస్యాయ, నమఊష్మస్వరూపాయ,
నమోఽంతస్థాయ, నమః పినాకినే, నమోనిషాదాయ, నమో
నిషాదపతయే, నమ స్తారాయ, నమో మంద్రాయ, నమో
మధ్యమాయ, నమో ఘోరాయ, నమోఽఘోరమూర్తయే,
నమ స్తానస్వరూపాయ, నమో మూర్ఛనాస్వరూపాయ,
నమస్స్థాయిసంచారస్వరూపాయ, నమో లాస్యతాండవ
జన్మనే, నమ స్తౌర్యత్రికస్వరూపాయ, నమ స్థూలాయ,
నమ స్సూక్ష్మాయ, నమోఽదృశ్యాయ, నమోఽర్వాచీ
నాయ, నమ పరాచీనాయ, నమో వాక్ప్రపంచస్వరూ
పాయ, నమ ఏకాయ, నమోఽనేకభేదాయ, నమ స్సదస
స్పతయే, నమ శ్శబ్దబ్రహ్మణే, నమః పరబ్రహ్మణే, నమో
వేదాంతవేద్యాయ, నమో వేదపతయే, నమః పార్వతీశ్వ

రాయ, నమోజగదీశ్వరాయ, నమో దేవదేవాయ, నమశ్శం
కరాయ, నమస్తుభ్యం మహేశ్వర! నమస్తుభ్యం జగదా
నంద! నమస్తుభ్యం చంద్రశేఖర! నమస్తుభ్యం మృత్యుం
జయ! నమస్తుభ్యం త్ర్యంబక! నమస్తే పినాకహస్తాయ,
నమస్తే త్రిశూలధారిణే. నమస్తే త్రిపురఘ్నాయ, నమస్తే
ఽంధకనిషూదనాయ, నమః, కందర్పదర్పదళనాయ, నమో
జాలంధరారయే, నమః కాలాయ, నమః కాలకూటవిషాదినే,
నమో భక్తవిషాదహంత్రే, నమోనమ" యని యనేకప్రకా
రంబులం బ్రస్తుతించిన. 250

సీ. హరుఁ డకారేశ్వరుం డై కైటభారాతి
యాకారరేఖఁ బ్రత్యక్ష మయ్యె
శివుఁ డుకారేశ్వర శ్రీమహాదేవుఁ డై
ధాతృస్వరూపంబుఁ దాల్చి యలరె
గంగాధరుండు మకారేశ్వరుం డయి
విధుమౌళి శేవ నావిర్భవించె
నాగకేయూరుండు నాదేశ్వరుం డయి
భాసిల్లి శబ్దరూపత వహించె
తే. విశ్వలోకైకభర్త బిందీశ్వరుఁ డయి
భువనకారణభావంబుఁ బూని మెఱసె
నిం(త)ఱును బ్రహ్మ కిచ్చి రభీప్సితంబు
లైదులింగంబులును బ్రణవాత్మకములు. 251

వ. ఈ యైదును దివ్యలింగంబులు. 252

తే. దమనుఁ డను బ్రాహ్మణుఁడు భరద్వాజగోత్రుఁ
డాదిమాశ్రమమునను వింధ్యాద్రిదమన!

పాశుపతదీక్షఁ గైకొని కాశియందు
సిద్ధి గైకొనె నవిముక్త సీమయందు. 253

తే. భారభూతేశ్వరుఁడు యక్షభర్తదిశకు
నింద్రు దెసకును మణికర్ణికేశ్వరుండు
బ్రహ్మగోకర్ణవరు లవాక్పశ్చిమముల
కవధు లవిముక్తమునకు వింధ్యాద్రిదమన! 254

వ. అట్టహాసుఁడు ప్రాగ్ద్వారంబును, భూతధాత్రీశ్వరుండు దక్షిణ ద్వారంబును, గోకర్ణుండు పశ్చిమద్వారంబును, ఘంటాకర్ణుం డుత్తరద్వారంబును, ఛాగవక్త్రుం డీశదిక్కోణంబును, భీష ణుండు వహ్నిదిక్కోణంబును, శంకకర్ణుండు రాక్షస దిక్కో ణంబును, ద్రుమిచండుండు వాయుదిక్కోణంబును, నానా ప్రమథగణ పరివృతులై రక్షింతురు. కాలారక్షణ భద్ర కౌలేయకాలకంపనులు గంగాతీరంబును, వీరభద్ర నభకర్దమా లిప్తవిగ్రహస్థూలకర్ణ మహాబాహు లసితీరంబును, విశాలాక్ష మహాభీమకుండోదరమహీధరులు దేహళీదేశంబును నంది షేణ పాంచాల ఖరపాద కరండ కానంద గోపకబభ్రులు వర ణాతీరంబును గాచియుండుదురు. 255

తే. కపిల సావర్ణులకును శ్రీకంఠ పింగ
ళాంశుమంతులకును నొక్కయవసరమున
నేగురకుఁ గల్గె నాశ్చర్య మేమి చెప్పఁ
దనువుతోడన శివుఁ గూడికొనఁగఁ గాశి ! 256

చ. కలశతనూజ! యచ్చెరువు కాశికయం దొక శంభులింగముం
దిలలను నక్షతంబులను ధీనిధి యొక్కఁడు పూజచేసి పో

నొలికినవాని మేయుటకు నోలిఁ బ్రదక్షిణ మాచరించి చి
ట్టెలుక శరీరముం †దొరఁగ కెక్కొనుబోరజతాద్రికూటమున్.

క. ఘటసంభవ! శ్రీకాశీ
కటకమునకు నికట గగనగంగాతటినీ
చటులకృపీటోర్మిఘటా
స్ఫుటదఘమున కెనయె యితరపుట భేదనముల్? 258

శా. అంభోజాసను నంతవానికిని శక్యంబె నుతింపంగ నో
కుంభీసంభవ! ఢుంఠిరాజకపటక్రోడక్షురద్దానవా
స్తంభేప్రవిజృంభమాణ వరణాసంపర్కసంపన్న కౌ
క్షీంభర్యామరసింధునైకటికముఁ శ్రీకాశికాక్షేత్రమున్?

క. అవిముక్తం బవిముక్తం
బవిముక్తం బనుచుఁ బ్రాతరారంభములం
దవధానపరత నెవ్వాం
డు పఠించును వాఁడు ధన్యుఁడు మునిప్రవరా! 260

తే. మొగుచు జంతువు కాశికానగరసీమ
నపునరున్మీలనమున కై యక్షియుగముఁ
గాంచు నిక్కలగా నొక్కకలయు నపుడు
త్రిణయనుఁడుగాఁగఁ దన్ను నాదీర్ఘనిద్ర. 261

ఉ. ఎట్టు నుతింతు నల్పమతి నిల్వలమర్దన! యేను గాశికా
పట్టణశంభుమూర్తులఁ గృపాగుణ! యోర్తు లతాంగి తేపెదు
ర్కట్టున ముంగిటంగసవుగాండ్రయుఁ బుచ్చుచుఁ జేతిచీపురుం
గట్టయుఁ దానుఁజొచ్చెఁ గఱకంఠుని నోంకృతినాథదేవునిన్.

---

† 'దొఱఁగి యెక్కె రహిన్' అని పాఠాంతరము మూలవిరుద్ధము.

తే. ఓంకృతి శ్రీమహాదేవునొద్దఁ గలదు
బిలము పాతాళమునకేగు పెద్దత్రోవ
దానివాఁకిట నుండ్రు వాతాపిదమన!
సౌవిదల్లులు కుఱుపల్ల జడలమునులు. 263

తే. వెంటఁ బడి వచ్చు కాకికి వెఱచి భేకి
తిరిగి నందంద నోంకారదేవుభవన
మటఁ బ్రదక్షిణ మొనరించి నట్టిమహిమ
నొడలితోడనె యాకప్ప మృడునిఁ గలసె. 264

తే. పాడి మెచ్చించె నొకయింతి పంజళమున
నాడి మెచ్చించె లేమ లాస్యమున నొర్తు
పొగడి మెచ్చించె నొక్క లేఁజిగురుఁబోఁడి
కరుణ గలవాఁడు కాశి నోంకారభర్త. 265

మ. మనుజుం డెవ్వఁడు కాశికిం జనఁడు శ్రీమత్స్వర్దరీతీర్థముం
గనఁ డోంకారశశాంకమూర్ధునకు మ్రొక్కం డద్దురాత్ముండపో
మునిశార్దూల! వినాశకారణము దోర్మూలాగ్రకూలంకష
స్తనభారాలససూక్ష్మమధ్యజననీతారుణ్యసంపత్తికిన్. 266

చ. పనివడి ఫాలలోచనుఁడు పర్వతరాజతనూజ కానతి
చ్చినపరిపాటి నీకు నఱి సేయక చెప్పెద సావధానతన్
విను కలశీతనూభవ! త్రివిష్టపదివ్యసమాహ్వయత్రిలో
చనచరితంబు సర్వకలుషఘ్నము పుణ్యసమృద్ధ్యపఘ్నమున్.

క. విరజాహ్వయ మగువివరము
పరమఋషిప్రవర! కాశిపట్టణరత్నా
భరణము తద్దర్శనమున

†నరుఁడును విరజస్కుఁ డగు ననఘ! నిమిషమునన్. 268

తే. అనఘచారిత్ర! కాళిందియును సరస్వ
తియును నర్మదయును దదంతికమునందుఁ
గాలువిక్కనఁ బ్రవహించుఁ గాలకూట
కంఠపాదాబ్జపీఠోపకంఠ మొఱసి. 269

ఉ. సంభృతభక్తిభావనఁ ద్రిసంధ్యమునందును నాతరంగిణుల్
శంభుఁ ద్రివిష్టపేశ్వరు శశాంకకళాధరుఁ దీర్థమార్చు వి
స్రంభమునం గరాంబురుహసంగతమంగళశాతకుంభకుం
భోంభితగంధసారరసయోగసుగంధనవాంబుధారలన్. 270

క. స్థాపించె నాస్థలంబున
నాపుణ్యతరంగిణీత్రయము చంద్రకళా
నైపథ్యంబుల భుజగక
లాపంబుల వివిధమణిశిలాలింగములన్. 271

ఉ. నిండుమనంబుతోడ రజనీచరమౌళిఁ ద్రివిష్టపేశ్వరున్
దండనమస్కృతప్రణతిన్ భజియించిన మర్త్యకోటికిన్
వెండియుఁ గర్మబంధములె? వెండియు నాధివికారబాధలే?
వెండియు మాతృయోనిపదవీచ్యుతిసంకటమే? ఘటోద్భవా!

మ. గయ కేలా యరుగంగ మానవులకుం? గాశీపురీవాహినీ
త్రయవేణీపులినంబులందు నిడ రాదా తల్లి నిం దండ్రి నిం
బ్రియమాతామహులం బితామహులనుం బేర్కొంచుఁ బిండా
న్నము?, ల్గయికో రాప్రమదంబుతోడఁ బితరు ల్హస్తాబ్జ
ముల్ సాచుచున్? 273

---

† 'నరుఁడును విగతాఘుఁ డగును నరనిముసమునన్' అని పాఠాంతము.

తే. దక్షిణమున త్రివిష్టపస్థానమునకుఁ
జెంగట సరస్వతీశ్వరక్షేత్ర మనఘ!
యిచ్చుఁ గొలిచినవారి కయ్యిందుధరుఁడు
గరుణ సారస్వతం బైనపరమపదము. 274

క. యమునేశ్వరుఁడు త్రివిష్టప
సమీపమున నంబుపతిదెస వసియించుఁ గా
యమపుటభేదనికట
క్రమవాటికఁ జూడ దవ్విధుధరునిభక్తుల్. 275

తే. అత్రిలోచనుప్రాగ్దిక్కునందు నుండు
నర్మదేశుండు నిజభక్తశర్మదాయి
శైవనీరూపధిజ్ఞ! తత్సేవకులకు
మాతృగర్భభకత్వంబు*మందు సుమ్ము. 276

తే. అఖిలనిర్వాణముష్టింపచాగ్రగణ్య!
ప్రత్యహంబు త్రివిష్టపద్రష్ట యెవ్వఁ
డవ్విశిష్టుఁడు శిష్టసాభ్యంతరమున
వీసమంతటిమాత్రంబు వెలితి స్రష్ట. 277

ఉత్సాహ. లీల మనుజుఁ డెవ్వఁ డేఁ బిలిప్పిలాతరంగిణిం
దేలి శ్రీత్రివిష్టపేశు త్రిపురమథను శశికళా
మౌళిఁ బూజ సేయుఁ గుసుమమాల్యముల నతండు డా
కాలిమడమఁ జప్పళించుఁ గాలమృత్యువక్త్రమున్. 278

---

* అచ్చుపుస్తకమున 'మూడు కొడుకు' అనియు, వ్రాతపుస్తకమున 'మందు కుడుక' యనియు, మఱియొక వ్రాఁతపుస్తకమున 'మందు సుమ్ము' అనియున్నది. దీనికి "దృష్ట్వా త్రిలోచనా త్ప్రాచ్యాం నర్మదేశం సుశర్మదం, తల్లింగార్చనతో నృణాం గర్భవాసో నిషిధ్యతే" అని సంస్కృతమూలము.

మానిని. ఉత్తరవాహినియై ప్రవహించుచున్న పిలిప్పిలఁ గ్రుంకి
మదిం, దత్తరపా టొకయించుక లేక యథావిధిఁ గోమల
తారకరా, డ్భిత్తకిరీటుఁ ద్రివిష్టపనాయకుఁ *బెన్నసనంబునఁ
గొల్చిన భా, గ్యోత్తరుఁ గాంచి నమస్కృతిసేయుచు నుప్పర
వీథిఁ జరించుసుకల్. 279

తే. ఇతరదేశంబులం దుపార్జితము లైన
పాపములు వాయుఁ గాశికాపట్టణమునఁ
గాశిఁ జేసినపాప మెక్కడను బాయ
దదియుఁ బాయుఁ ద్రివిష్టపోపాంతభూమి. 280

తే. కాశి జంబూతరుద్వీపకనకభూష
కాశియం దుత్తమంబులు క్రమవిభూతి
సింధుసంభేద మోంకారశివపదంబు
శ్రీత్రివిష్టపనాయకక్షేత్రతలము. 281

క. విదితముగఁ గాశినడుమం
ద్రిదశమణికిరీటకోటిదీధితివిలస
త్పదునిఁ ద్రివిష్టపుఁ గొలిచిన
†నొదవునుసిరి మోక్షపదముదునయవివేకా! 282

శా. కుంభీసంభవ! యాత్రివిష్టపుని గ్లాకోటీరు సింధుత్రయీ
సంభేదస్థలవాసుఁ గొల్చునరునిక్ సాధింపఁగాఁ జాలునే
కుంభీపాకముఖప్రధాననరక కూర్మిప్రకారవ్యథా
సంభారంబుల నీగఁ జాలు మదిరాస్వాదాదిపాపౌఘముల్.

---

* 'శ్రేమమనసంబునఁ' అని వ్రాఁతపుస్తకము. 'బెన్నసమంబుగఁ' అని అచ్చుపుస్తకము. †'నొదవును శివమోక్షపదములు దితవివేకా!' అని పాఠాంతరము.

సీ. క్రూరుండు పిశునుండు కొండీఁడు భక్ష్యభ
క్షకుఁడు విస్రంభవిఘాతుకుండు
గురుతల్పగుఁడు నిందకుఁడు నాస్తికుఁడు కూట
సాక్షి పరద్రవ్యచౌర్యపరుఁడు
మాతాపితృత్యాగి యాతతాయి శఠుండు
పరదారలోలుండు గరళదుండు
కులధర్మవిముఖుండు గురుజనద్వేషుండు
బ్రహ్మహత్యాసురాపానరతుఁడు
తే. నాఁగఁ గల పాపుల కఘంబు నీఁగ దిక్కు
శ్రీత్రివిష్టపదేవుండు శ్రీప్రదుండు
శీలలోహితు నభవు నిందించునట్టి
కర్మచండాలునకు దిక్కుఁ గాఁడు యెంచ. 284

క. ఇందుకళాశేఖరునిన్
నిందించుట ముజ్జగంబు నిందించుట త
ల్లిం దండ్రిని నిందించుట
నిందించుట హర్యజాదినిర్జరకోటిన్. 285

క. శివనింద సేయుపాతకు
దవునవ్వులఁ జూచి తొలఁగఁ దగు శైవులకున్
శివనిందాపరుపలుకులు
చెవి యొడ్డి వినంగఁ దగదు శివభక్తులకున్. 286

ఉ. సత్యము పల్కెదన్ శ్రుతులు శాస్త్రము లాగమముల్
పురాణముల్, ప్రత్యయ మయ్యెనే నిజముఁ బల్కెద రింతియు
కాక యేమి? దు, స్సత్యపహాంపదకు యగుకాశియ తీర్థము

త్రిదశకోటిలోఁ, నిత్యుఁడు విశ్వనాయకుఁడు నిక్కపుదైవము దేవకోటిలోన్. 237

తే. ఆదిఁ బంచనదంబునయందు మునుఁగు
నాఁడు మణికర్ణికాతీర్థ మంతమీఁద
విశ్వనాథుని భక్తి సేవించి పదప
నట విఖండించు మనుజుఁ డొక్కఁడ యఘంబు. 288

శా. వాతాపీల్వలదైత్యమర్దన! తగుఁగా వర్ణింప దివ్యామృత
జ్యోతిర్లింగతనుం ద్రివిష్టపుని నస్తోకప్రభావాన్వితుం
బాతాళంబున నుండి వెల్వడి పురీత్రత్యంతభాగీకృత
స్రోతస్విన్యుపకంఠ భూమిఁ గృతవాసుం డైన సర్వేశ్వరున్.

వ. త్రివిష్టపేశ్వరునకుఁ బశ్చిమభాగంబున ద్రోణేశ్వరలింగంబు, తదగ్రభాగంబున నశ్వత్థామేశ్వరలింగంబు, నటుపిఱుంద శాంతనవేశ్వరలింగంబు, నందులకు వాయవ్యదిగ్భాగంబున వాలఖిల్యేశ్వరలింగంబు, తత్సమీపంబున వాల్మీకేశ్వరలింగంబు గల వందు. మఱియుఁ ద్రివిష్టపేశ్వరు మాహాత్మ్యం బభివర్ణించెద. 290

త్రివిష్టపేశ్వరమాహాత్మ్యము

తే. అమ్మహాదేవుప్రాసాద మాశ్రయించి
యుండుపారావతంబులు రెండు నెలమి
నాలుమగఁడును ననఁగ గాఢస్వార్థగరిమ
సకలకాలంబుఁ గవఁగూడి సంచరించు. 291

సీ. పక్షాగ్రముల విచ్చి ప్రాసాదవలభికా
పర్యంతముల ధూళి పాఱఁ దుడుచుఁ

జలువు యాతాయాతములఁ బ్రదక్షిణములు
మాటిమాటికి గర్భమంటపికకు
సోమసూత్రప్రణాళీమార్గనిష్ఠ్యూత
తీర్థోదకంబులు దివుటఁ గ్రోలు
భక్షించు గేహాళిబల్యసిక్థవితతి ప్త
పిండోదకములు సంప్రీతి యొసఁగ

తే. వినుఁ ద్రికాలంబు నచ్చినా వేళలందు
శంఖకాహళపటహఝర్ఝరరవంబు
కాశినగరంబునఁ ద్రివిష్టపేశునగర
నవ్విహంగమరత్నంబు లనుదినంబు. 292

వ. ఇవ్విధంబునం బారావతస్త్రీపుంసంబులు సంసారసుఖంబు లను
భవించుచు నొక్కనాఁడు నద్దివ్యదేవుదివ్యభవనచంద్ర
శాలాగర్భవితర్దికానిర్వ్యూహావిటంకనీడంబునం గూడి
మెలంగి యాడుచుండ నొక్కశ్యేనం బమ్మిథునంబు దవు
దవ్వులం గనుంగొని చేర వచ్చి జాలకంబులలో నుండి తన్ను
నలవోకయుం బోలెఁ గనుంగొనుచు దుర్గసమాశ్రయబలం
బున నయ్యుగ్మంబు లెక్కసేయకయున్న నప్పటికి నోడుపు
దప్పి తొలంగి యెక్కడికేనియుం బోయె. పరేంగితజ్ఞాన
చతుర యగు నప్పారావతి తనపతి కిట్లనియె. 293

సీ. మనపాలివేరువిత్తని యెఱుంగుము గాదె
యెఱుఁగవో శ్యేనంబు హృదయనాథ!
ప్రబల మైనట్టి దుర్గంబులో నున్నార
మగుట నేఁటికిఁ దప్పెఁ బ్రాణభయము

వైపు దప్పిన మహాకోపంబుతోడన
పోయె వైరం బాత్మఁ బూని డాయ
కొండుచోటికిఁ బోవు టుచితంబు మన మింక
వానికిన్నకు నోర్చువార మెట్లు?

తే. చిచ్చువాతను బడువాతఁ జిక్కుపడక
తప్పిపోయిన వా రెపో తజ్ఞు లెందుఁ
దాఁతకట్టినచెఱు వంచుఁ దగునె మునుఁగ?
*నిల్లు విడువంగ లేక చా నేల మనకు. 294

చ. అన విని పారువం బడరి యావనగర్వమునం బడంతికి
ట్లను నిది యేమి? నాబలపరాక్రమసంపద యింతమాత్రమే?
తనసరివారికి న్వెఱచి ధామముఁ బాడుఱఁ జేసి దాఁగఁ బో
యిన సరియిండ్లవారునగరే? ఖగమా యనియే మిదయ్యమో?

తే. అది విహంగమ మేను విహంగమంబ
పెసరగింజకుఁ దక్కువే పెసరగి జ?
యబల! యిటు చూడు మప్పతుయదటు మాంతుఁ
గుటిలచంచూపుటీకోటికుట్టనముల. 296

వ. అనిన 'ధర్మో జయతి' యనుచుం బారావతి యూరకుండె
నంత మఱునాఁడు తేపకడ నాశ్వసంబు ప్రవిష్టవేశ్వరునగరి
ప్రాకారంబుమీఁద నిర్గమద్వారంబు నిరోధించి పొంచి
యుండి సంచారార్థంబు దిక్కులకు వెడలునక్కలరవంబుల
నుక్కఁ దండసంబువోనిముక్కున నంకుశంబులం బోలు
చరణనఖాంకురంబులం బెట్టనుం బోతునుం గఱచియు
నూఁదియు నొక యేకాంతప్రదేశంబునం భక్షించునదియై

---

* 'ఇల్లు వెడలక చావంగ నేల మనకు? అని పాఠాంతరము.

యంతరిక్షంబున నవ్వు(గాఁ) గొని చనియె నప్పుడు సేయు
నది లేక కాందిశీకత్వంబునఁ జీకాకుపడియు వివేకనిధి యైన
పారావతి పారువంబుఁ దప్పక చూచి నయనసంజ్ఞం గాలుం
గఱువు మని కఱపిన. 297

ఉ. శ్యేనము కాలివ్రేలు గఱచెన్ బెట దప్పక పారువంబు లో
నూనిన తీవ్రవేదనకు నోర్వఁగ జాలక చీత్క్రియాసుసం
ధానము సాంద్రధూనముఁ దత్సమయంబునఁ జేసెఁ బత్త్రియా
మానము దూరి పాటిఁ బసమానదయంబునఁ బక్షిదంపతుల్.

వ. పాటికి యొక్కచోటం గూడి బలవద్విరోధంబునం జేసి గాశి
నుండ వెడలి యయోధ్యానగరంబున సరయూతీరంబునం
బెద్దకాలంబు మనువు మని యపరజన్మంబున మందరధార
కుండను విద్యాధరుండును రత్నావళి యనునాగకన్యకయు
నై జన్మించి జాతిస్మృతివశంబున నప్పారువంబులు రెండును
దంపతు లై కాలక్రమంబునఁ గాశీత్రివిష్టపేశ్వరు సేవించి
ముక్తులైరి. ఇది త్రివిష్టపేశ్వరమాహాత్మ్యంబు. 299

కేదారేశ్వరమాహాత్మ్యము

తే. ఆదిఁ బరమేశ్వరుండు గౌరి కానతిచ్చి
నట్టిపరిపాటిఁ జెప్పెద ననఘ! నీకుఁ
గాశికేదార శంభులింగంబుమహిమ
సావధానత వినుము వింధ్యాద్రిదమన! 300

వ. అనేకజన్మార్జితంబు లైనపాపంబులు గేదారేశ్వరస్మరణం
బునం బాయు. సాయంప్రాతఃకాలంబులఁ గేదారేశ్వరస్మర
ణంబు సర్వదురితహరంబు. 301

శా. ప్రాతఃకాలమునందు మర్త్యుఁడు *హారత్పాపాభిధానహ్రద
స్రోతఃపూరమునన్ మునింగి పరమజ్యోతిర్మయంబు న్మని
ధ్యాతవ్యంబును శాశ్వతంబు నగు కేదారేశలింగంబు సం
ప్రీతిం జేరి భజించి కాంచు విశదాభీష్టార్థసంసిద్ధులన్. 302

వ. తొల్లి రథంతరకల్పంబునందు వశిష్ఠుండను విప్రుండు హిరణ్యగర్భాచార్యునలనం బాశుపతదీక్ష వడసి కేదారేశ్వరుని సేవించి ముక్తుం డయ్యె వెండియు. 303

సీ. శిశిరభూధరకన్య చిఱుబంతిపసుపాడిం
నెందు సాయంకాల మిం పొనర్చ
నటుఁ డెందు జలము సుధార్ణంబు సేవించి
శంభులింగముఁ దాల్పు జరపిరరి
వినువీథిఁ బోరాడి వివశంబులై కూలి
హంసంబు లయ్యె వాయసము లెందుఁ
బ్రవహించు నెందు శ్రీభాగీరథికిఁ బోటి
యమృతప్రవాహ్వాయ గైరవతిని

తే. యది విముక్తివధూకంఠహారతిలక
దివ్యకేదారలింగేశతీర్థభూమి
నవనదీవాపిపల్వలహ్రదసముగ్ర
ద్రాక్షపందిరి కాశికోద్యానమునకు. 304

వ. అందు గౌరికుండంబు గౌరితీర్థం బమృతప్రవాహతీర్థంబు మానసతీర్థంబు కలహంసతీర్థంబు మొదలుగా ననేకతీర్థం

---

* 'హారుర్ బాపాభిధాన' యని యచ్చుపుస్తకము. 'హారం పాపాభిధాన' యని యొకవ్రాతపుస్తకము. 'హారపాపహ్రదేస్నాత్వా' యని సంస్కృతమూలము. ఛందోభంగనివృత్తికై 'హారత్పాప' యని సవరింపఁబడినది.

బులు గలవు. కేదారేశ్వరంబునకు నుత్తరంబునఁ జిత్రాంగ
దేశ్వరలింగంబు, తత్సమీపంబునం గేదారేశ్వరస్థానంబు,
దక్షిణంబున నీలకంఠేశ్వరలింగంబు, నీలకంఠక్షేత్రంబునకు
వాయవ్యభాగంబున నంబరీషేశ్వరలింగంబు, తత్సమీ
పంబున నింద్రద్యుమ్నేశ్వరలింగంబు, నాదక్షిణంబునఁ గాలం
జరేశ్వరలింగంబు, చిత్రాంగదేశ్వరు నుత్తరంబున క్షేమే
శ్వరలింగం, బివి కేదారలింగమాహాత్మ్యంబు. ఇంక ధర్మరా
జేశ్వరలింగ మాహాత్మ్యం బభివర్ణించెద. 305

తే. అనినఁ బ్రియ మంది నైమిశమునిగణంబు
సూతు నర్చించి భక్తిసమేతు లగుచు
ధర్మరాజేశ శివమహాస్థానమహిమ
గుహుఁడు సెప్పె నెవ్విధమునఁ గుంభజునకు? 306

వ. అవ్విధంబు మాకు నానతి మ్మనుటయు. 307

ఆశ్వాసాంతము

శా. కల్పాంతానిలఘూర్ణమానజలముగ్గర్జానినాదోద్భటా
నల్పాటోపకఠోరధాటిపటహోగ్రఘోషవిధ్వస్తసం
కల్పారాతినృపాలసంశ్రితకులక్ష్మాభృద్గుహాగేహా! యా
కల్పక్షౌమపటీపటీరవిశదా కాశ్మీరచంద్రప్రదా! 308

క. వీరావతార! వితరణ
పారాయణహృదయ! రాజపరమేశ్వర! ది
గ్వారణకరసన్నిభభుజ!
ధారాసురతాణదర్పధరణీధ్రపవీ! 309

మాలిని. ధరణిభరణహేలాధఃకృతక్రోడలీలా
జనకకమఠభూభృచ్చక్రచక్రీశ్వరాశా!
ద్విరదనివహశుంభద్దీర్ఘదోస్స్తంభయుగ్మా
భరితగుణదిలీపా! పంటవంశప్రదీపా! 310

గద్యము. ఇది శ్రీమత్కమలనాభపౌత్ర మారయామాత్యపుత్ర సుకవిజనవిధేయ కవిసార్వభౌమ శ్రీనాథనామధేయ ప్రణీతంబైన కాశీఖండం బను మహాకావ్యంబునందు షష్ఠాశ్వాసము సమాప్తము.

సప్తమాశ్వాసము

శ్రీరాజరాజ ! సుగుణా
ధార ! ధరాభరణైకరణధౌరంధర్య
స్ఫారభుజార్గళ ! భక్తిస
మారాధితభుజగహార ! యల్లయవీరా! 1

వ. అక్కథకుండు శౌనకాది మహామునుల కిట్లనియె. 2

ధర్మరాజేశ్వరలింగమాహాత్మ్యము

తే. నృపవిభో! ధర్మేశ్వరతీర్థమహిమ
యబ్జజునకైన వర్ణింప నలవి యగునె?
యమ్మహాక్షేత్రమున నున్న యండజములు
బ్రహ్మవిజ్ఞానవాసనాప్రవణమతులు 3

వ. కాశీమధ్యంబున నవరత్నమణినిర్మితం బై, మోక్షలక్ష్మీవిహారస్థానం బై, సముత్తంభితశాతకుంభకుంభమండలీమండితసుధాధవళసౌధవీథివిభ్రాజితం బై, యవతరణరభసశీర్ణస్వర్ణదీస్రోతశ్శలాకానుకారిపుంగవపతాకాలంకృతం బై గవాక్షవివరోదీర్ణగుగ్గులువాసనాసాక్షిధూపధూమరేఖాస్మారితస్మరహరకంఠమూలకరాళకాలకూటవిషచ్ఛాయాఘటాగుళుచ్ఛం బై యుండు ముక్తిమంటపంబునకు ముక్కంటి మధ్యాహ్నకాలంబున బ్రాహ్మణవేషంబున వైశ్వదేవబలి

హారణంబులు సేయు మహాప్రాసాదంబునకు నింద్రదిగ్భాగం
బున జ్ఞానమంటపంబునందు బాలేందుధరుండు దక్షిణామూర్తి
స్వరూపంబు ధరియించి బ్రహ్మాదులకు జ్ఞానోపదేశంబు
సేయుఁ; దత్ప్రాంతంబున విశాలాక్షీహర్మ్యంబునందును
బ్రతివాసరంబును గుతపకాలంబునందు. 4

సీ. పసిఁడికమ్ములతోడి కుసుముపూవన్నియ
నిద్దంపుఁబుట్టంబు నెఱికఁ గట్టి
యింద్రనీలములతో నెడకట్టి గ్రుచ్చిన
రమణీయ తారహారము ధరించి
పారిజాతకతరుప్రసవగర్భితమైన
కబరిపైఁ జెంగల్వకచ్చు నిలిపి
ఫాలభాగంబునఁ బన్నీట మేదించి
కమ్మకస్తురితిలకమ్ము దీర్చి

తే. వలుఁదచన్నుల జిలుగుఁగంచెలుసుఁ దొడిగి
కటిభరంబున వజ్రాల కాంచిఁ దాల్చి
యరసి యాఁకొన్నవారికి నమృతభిక్షఁ
గరుణ నిడు శ్రీవిశాలాక్షి కాశియందు. 5

వ. విశాలాక్షీపీఠస్థానంబునకు సమీపంబునఁ జంద్రపుష్కరిణీ
తీర్థంబు. 6

తే. భవ్యతరనిష్ఠ నుభయదర్భలను దాల్చి
సంధ్య వారుచుఁ జంద్రపుష్కరిణియందు
ఫాలనేత్రుండు దారకబ్రహ్మమంత్ర
వర్ణ కర్ణజాపుఁడు ప్రతివాసరమున. 7

వ. ఆతీర్థంబునకు ననంతరంబున ధర్మేశ్వరలింగంబు, తత్సమీ

పంబున వృషభధ్వజలింగంబు, తత్సమీపంబున నర్ధనారీశ్వర
పీఠంబు, తత్సమీపంబునఁ బంచనదతీర్థంబు, తత్సమీపం
బునఁ బంచముద్రమహాపీఠంబు, తత్సమీపంబున వీరేశ్వర
లింగంబు, తత్సమీపంబున సిద్ధేశ్వరలింగంబు, తత్సమీపం
బున యోగినీపీఠంబు. 8

తే. కలవు పీఠంబు లానందకాననమునఁ
*జెట్టు వ్రేసిన చోట దాక్షిణ్యపుణ్య!
యర్థవాదంబు కాదు సత్యంబ కాని
పెద్దపీఠంబు ధర్మేశపీఠకంబు. 9

విశ్వభుజాఖ్యానము

క. విశ్వభుజాగౌరీపర
మేశ్వరి సేవించి యందు నింద్రాణి సమ
గ్రైశ్వర్యము సౌభాగ్యము
శాశ్వతముగ భర్తృసంప్రసాదముఁ గాంచెన్. 10

వ. విశ్వభుజాదేవి మనోరథతృతీయావ్రతంబున నారాధించి శచీదేవి యింద్రుని, నరుంధతి వసిష్ఠు, ననసూయ యత్రిని, సునీతి యుత్తానపాదుని భర్తలంగా వరంబు వడసిరి. ఈ విశ్వభుజాదేవిసమీపంబున నాశావినాయకుండు ప్రణతాఖిలభక్తజనమనోరథసిద్ధిదాయకుండై యుండు. 11

తే. వృత్రవధయాదిగాఁ గలవృజినములకు
శాంతి గాఁ గాశికాపురి జంభభేది
ధర్మపీఠంబునకు సుపాంతంబునందు
నిష్ఠతో శంభులింగ ప్రతిష్ఠ చేసె. 12

---

*'జెట్టు వ్రేసినఁ జేటెఁ దక్షిణపుణ్య!' అని పూర్వముద్రితపుస్తకపాఠము.

ధర్మేశమాహాత్మ్యము

వ. ధర్మతీర్థంబు బ్రహ్మహత్యాదిపాపంబుల నపనయింపంజాలుఁ, దారకేశ్వరునకుఁ బశ్చిమభాగంబున నింద్రేశ్వరుండు, దక్షిణ భాగంబున శచీశ్వరుండును, నింద్రేశ్వరుం బరివేష్టించి లోక పాలేశ్వరులును, ధర్మేశ్వరునకుం బశ్చిమభాగంబున సూర్య శీశ్వరుండును, ధర్మేశ్వరునకుఁ నాలుగుదిక్కుల దత్త్వేశ్వర వైరాగ్యేశ్వర జ్ఞానేశ్వ రైశ్వర్యేశ్వరులును నుండ్రు. కదంబశిఖరంబున వింధ్యపాదంబున దమునికొడుకు దుర్ద ముం డనువాఁడు జరాభారపీడితుం డై యొక్క పుణ్యపురు షువలన జ్ఞానోపదేశంబు వడసి కాశికిం జని లింగప్రతిష్ఠ చేసె. ఆదుర్దమేశ్వరుఁడు భజించువారలకు భోగమోక్షప్రదా యకుండై యుండు. అమిత్రజిత్తను రాజు విష్ణుభక్తిపరాయ ణుండు నారదునుపదేశంబువలనఁ గంకాలకేతుం డనురాక్ష సుని చేత నపహరింపఁబడి పాతాళలోకంబునం జంపకావతి యను పట్టణంబుననుండి కమలగంధి యనువిద్యాధరకన్యకం బెండ్లియాడి యానందకాననంబున కరిగి వీరేశ్వరదివ్యలింగ స్థానంబునం దనకాంత మనోరథతృతీయావ్రతంబు నోమించి పుత్రవంతుఁ డయ్యె. 13

తే. మఱి హయగ్రీవతీర్థంబు మౌనివర్య!
కాశికాతీర్థములలోన ఘనము మహిమ
నంతకంటెను గజతీర్థ మభ్యధికము
ప్రథమఁ గోలావరాహతీర్థంబు నట్ల. 14

వ. దిలీపతీర్థంబు సప్తమునితీర్థంబు హంసగోవ్యాఘ్రేశ్వరముచు కుంద పృథు పరశురామబలభద్రదివోదాసహరశ్వాపదశా

శ్వమేధబదరీశుకశుక భవానీ ప్రభాసగరుడ బ్రహ్మావృద్ధార్క
నృసింహ చైత్రరథధర్మవిశాల లలితాగౌతమీ గంగా కేశవ
నర్మదా వసిష్ఠ మార్కండేయ భాగీరథీఖురక స్వర్ణదివిపత్ హ
య తీర్థంబు లనునివి మహాపుణ్యతీర్థంబులు.* 15

తే. ఇపుడు చెప్పినతీర్థంబు లెన్ని గలవు
వీని నన్నిటి రాశి గావించి యందు
మూఁడుకోటులు శివలింగములను నిలిపి
రెలమి నవియు వీరేశ్వరు నెనయ లేవు. 16

వీరేశ్వరాఖ్యానము

తే. అర్థి నేతీర్థమునఁ దీర్థ మాడె నెవ్వఁ
డతని కాతీర్థమాడిన యంతఫలమె
అనఘ! వీరేశతీర్థ మాడిననరుండు
గాంచు నిశ్శేషతీర్థావగాహఫలము. 17

తే. కమలగంధితనూజుండు కలశజన్మ!
వీరుఁ డనువాఁడు హరుని (భక్తి) సేవింపఁబట్టి
యబ్బె శివునకు వీరేశుఁ డనెడునామ
మనఘ! యానందకాననాభ్యంతరమున. 18

వ. మఱియు సంగమేశ్వరతీర్థంబు పాదోదకతీర్థంబు క్షీరాబ్ధి
తీర్థంబు శంఖతీర్థంబు మఱియుఁ జక్రపద్మగరుత్మద్వైకుంఠ
నారద ప్రహ్లాదాంబరీషాదిత్యకేశవ దత్తాత్రేయ భార్గవ
వామన నీలగ్రీవోద్దాలక నరనారాయణ యజ్ఞవరాహ
విదారణ నరసింహలక్ష్మీనృసింహ గోపీ గోవింద శేషసాంఖ్య
మహిషాసురబాణ వైతరణీ ప్రణవపిశంగిలాపిలిప్పిలానాగే

* అన్నింటికిని తీర్థంబు అని చేర్పఁబడినది.

శ్వర కర్ణాదిత్యభైరవ ఖర్వనృసింహ పంచనదతీర్థంబులు
భోగమోక్షప్రదంబులు. 19

స్రగ్ధర. ఆనందారణ్యభూమధ్యమునఁ గలవుఁ గో
ట్యర్బుదన్యర్బుదంబుల్
నానాముక్తిప్రదంబుల్ నలినజముఖభి
న్నాకరాద్యంకితంబుల్
స్నానంబుల్ గల్గ నీపంచనదమును మహా
శంభుతీర్థంబుతోడన్
వానిన్ సామ్యంబు సేయన్ వలదు బహులని
ర్వాణలక్ష్మీసమృద్ధిన్. 20

వ. మఱియు జ్ఞానప్రపాతంబు మంగళతీర్థంబు, మయూఖాదిత్య
తీర్థంబు మఖతీర్థంబు, బిందుతీర్థంబు పిప్పలా(ద)తీర్థంబు,
మఱియు వరాహమగుత్తేశ్వరమిత్రావరుణాగ్న్యంగార కా
కోలచంద్ర విఘ్నేశ్వరహరిశ్చంద్ర పర్వతకంబలాశ్వతరసర
స్వత్యుమాభామమణికర్ణికాతీర్థంబు లివి తీర్థోత్తమంబులు
ముక్తిదాయికంబులు. 21

తే. వింటి వీవు తీర్థంబులు వేనవేలు
కలశ సంభవ! చెప్పితి గారవమున
హెచ్చు గుందాడఁగాఁ గూడ దిల్వలారి!
యన్నిటికిఁ బెద్ద మణికర్ణి యని యెఱుంగు. 22

ఆ. అని దశాశ్వమేధ మఖ్యంబు తీర్థంబు
పంచనదము కాశిఁ బస గలయది
వానికంటెఁ బెద్ద వాతాపితాపన!
చక్రపుష్కరిణి యసంశయంబు. 23

దుర్వాసోలింగమాహాత్మ్యము

వ. ఇంక దుర్వాసేశ్వరలింగమాహాత్మ్యం బభివర్ణించెద నాకర్ణింపుము. 24

తే. సకలదేశంబులందును సంచరించి
ఋషివరేణ్యుఁడు దుర్వాసుఁ డేగుదెంచె
నఖిలముక్తివధూవిహారావరోధ
సౌధవీథికిఁ గాశికాస్థానమునకు. 25

వ. ఇట్లు వచ్చి యమ్మహాభాగుండు భాగీరథీనదీమాతృకంబులై ముక్కారును బండు పంటవలంతి కేదారక్షేత్రంబులు, నిర్ధూత కలధౌతశిలాకాశికలశంక నంకురింపఁ జేయఁ జాలు క్రొత్త మొలక లొత్తునవియును, సుకుమారశుకచ్ఛదచ్ఛటాదాయాదంబులై యద్దపచ్చఁ గొనునవియును, నార్యావర్తదేశమత్తకాశినీజంఘాకాండ పాండిత్యంబు గండూషించి చిగురుపొట్టలఁ గనుపట్టునవియును, బలియాలు వన్నియకడానికుందనంబు నొచ్చు కుందాడు పసిమిఁ బచేళిమంబు లగునవియు నైన ప్రాసంగుం జేలును, వికటఘటీయంత్రప్రాంతవాపికా సలిలధారాధోరణీ ప్రవాహాసేకసంవర్ధితంబు లై జంబూజంబీర నారికేళ పనస సహకారకురవకవకుళాశోకశాకోటకుటజముఖ నిఖిలవిటపివాటికాభిరామంబులైన యారామంబులును, సముద్దండపుండరీక కువలయ కుముదషండమండితంబు లగు తీర్థకుండంబులును, [1]నారసాతలగంభీరసలిలసంభారంబు లైన పరిఖాచక్రంబులును, గనకగిరిప్రదీప్తవప్రాకారంబు లగు ప్రాకారంబులునుం గనుంగొనుచు, భూర్భువస్స్వర్మహాలింగ

1 సారసోత్పలామోదంచితసలిలసంభారరసాతల.

మకుటగంగాతరంగకూటకోలాహలవ్యాజృంభి సముత్తంభితశాతకుంభసౌధ వనచంద్ర శాలావలభిగర్భక్రోడంబులును, ఖఖోల్కాదిత్యప్రత్యగ్రకిరణకందళీ సందోహస్పందకందళిత మందాకినీకనకారవిందకాననంబును, జైగిషవ్యేశ్వరభూమాభుజంగ ఫూత్కారపవనధారాతరంగితోత్తుంగపుంగవపతాకాకౌశేయపట్టపటీపల్లీ వేల్లితన భోంగణంబును, వికటాదేవీ కరకరోటడమరుఢాంకార బృంహిత బ్రహ్మాండమండలంబును, ధ్రుమిచండవతీ కరాళకంఠ మూలకాకోలవిషమషీవిసృత్వరాంధకారచ్ఛటాసంఘాతజ్యోతిర్లింగాయమానశశిపతంగసమండలంబును, మహేశ్వరివాహనవృషలంబకగళకంబళకిఘణాఘస్మృత్వ క్వాణాస్కంధపరిణాబంధుపవనాసింధురోధగ ప్రత్యాసన్నచైత్రద్రుమంబును, ఢుంఢిరాజశుండాకాండ చుళికితోన్ముక్తజ్ఞానవాపికా సలిలనిర్ఝర జలాంతరితంబును, క్రోధభైరవప్రబలహుంకార కరిపతిహుంకారాట్టహాసముఖరిత ప్రాకారగోపురాట్టాలకంబును, గర్భబీజంబులకుం నూషరంబును, బుట్టువులకు వీడుకోలును, కలుషంబులకుం గత్తరియును, మంగళంబులకు నాస్పదంబును, కైవల్యంబునకు ఘంటాపథంబును, జ్ఞానంబులకుం దానకంబును, విరక్తికి నెలవును, విభవంబులకుం బ్రభవంబును, విలాసంబులకు నివాసంబును నయినకాశికాపట్టణంబుం బ్రవేశించి. 26

తే. తపసి పెద్దయుంగాలంబు తపము సేసి
కాలగళుపీట నానందకాననమున

ఫలము గడుదూర మైనఁ గోపంబు పుట్టి
కాశినగరంబు శపియింపఁ గాఁ దలంచె. 27

వ. అప్పు డు ప్రత్యక్షంబై. 28

చ. అహాహా సర్వ దంష్ట్రికలగల్గ మెఱుంగులు భానుదీప్తిసం
గ్రహముఁ దిరస్కరింప శితికంఠుఁడు కుంచితరోషదీప్తుఁడై
యహహా! దురాత్మ! కాశిపు నిట్లని వే? యనుపల్కు పల్కియా
గ్రహమున నేను ఘంటిగణరాజు నెదిర్చితి మమ్మునీంద్రునిన్.

వ. అప్పుడు. 30

సీ. నందిసేనుపలోచనముల నిప్పులు రాలె
శూలంబు చేనందె సోమనంది
మృత్యుప్రకంపను మే నెల్లఁ జెమరించె
చండుఁ డాస్ఫోటించె ధరణి వగులఁ
గుంభోదరుండు భ్రూకుటి ఫాలమునఁ బూనెఁ
గోకిలాక్షుఁడు పండ్లు గొఱికికొనియె
నగ్నిజిహ్వాఖ్యుండు ఘోరాట్టహాసము సేసెఁ
గృత్తివాసుండు హుంకృతియొనర్చె

తే. భృంగితండులు తాండవప్రియుఁడు రేఁగి
డమరుకంబులు వాయించి రమితపటిమ
రాజరేఖాధరుండు దుర్వాసుమీఁద
నలుగు టెక్కెఁగి తదీయరోషానువృత్తి. 31

శా. ఆభుగ్నభ్రుకుటీకరాళముఖులై యంగంబులుప్పొంగ ద్యా
వాభూమ్యంతర మట్టహాసదమదధ్వానంబులన్ బిట్టు సం
క్షోభింపం బ్రమథధ్వజిన్యధిపతుల్కుంభోదరాదుల్మహా [న్.
భూభృత్సన్నిభులన్ఘనుల్ ధరణి నాస్ఫోటించి తాటించుచు

క. జడముడులు సడల భ్రుకుటులు
ముడివడఁ గనుఁగడలఁ గెంపు మొలతేరంగా
మృడు ప్రమథులు పులితోలుం
గడవసములు వి(న్ను)డిచికొనుచుఁ గడురభసములన్. 33

ఉ. చంపుదు మే కృతాంతు? శిఖిచండమయూఖుల బారిగొం
దు మే?, డంపుదు మే కుభృత్పరివృఢంబుల? మొత్తుదు మే య
జాండము౯?, జింపుదు మే చతుర్దిశలు జృంభితబాహుపరా
క్రమక్రియా, సంపద సొంపు మీఱఁ? *బురసంహరునానతి
యింత గల్గినన్. 34

వ. అని వెండియు. 35

తే. మాటిమాటికిఁ గోపసంభ్రమము పేర్మిఁ
గక్షపాత్రంబులం దున్న కర్మభూతి
వదనములఁ బ్రామికొనుచు నిర్వక్రలీల
'హాహహా రా!' యని పల్కి రత్యాగ్రహమున. 36

వ. అప్పుడు దుర్వాసుండు శర్వాణీపతికి దండప్రణామంబు లాచరించి తలవకారముండక ఛాందోగ్య శ్వేతాశ్వతరాద్యుపనిషదర్థగర్భితంబు లైనబహువిధస్తోత్రసందర్భంబులనమ్మహాదేవుం బ్రస్తుతించె. శివుండును బ్రసన్నుండయి యమ్మునీంద్రునకుం గోరినవరంబు లొసంగి యంతర్హితుం డయ్యె నంతరంబ. 37

తే. అమ్మునీంద్రుండు దనపేర నధికభక్తిఁ
గాశియందుఁ బ్రతిష్ఠించెఁ గాలకంఠు

* 'పురశాసన! మాకు ననుజ్ఞ గల్గినన్.' అని తాళపత్రపుస్తకపాఠము.

దివ్యలింగంబు భాగీరథీతటంబు
నందు మణికర్ణికాప్రాదోపాంతభూమి. 38

విశ్వకర్మేశ్వరలింగప్రాదుర్భావము

వ. దూర్వాసేశ్వరలింగంబు సర్వాభీష్టఫలప్రదాయకంబు. మఱి విశ్వకర్మేశ్వరలింగంబు ప్రాదుర్భావంబు వివరించెద సావధాన మతివై యాకర్ణింపుము. త్వష్ట్రప్రజాపతికొడుకువిశ్వకర్మ బ్రహ్మచర్యంబున భిక్షాన్నభోజియై గురుగృహవాసియై విద్యాభ్యాసంబు చేయుచుండె నంత. 39

సీ. వానకాలము వచ్చె వర్షంబు లందందుఁ
జడిపట్టి కురిసె నాసావియందు
గురుఁడు నాకొక్కమందిరము నిర్మింపువిగా
వర్షధారలచేత నుఱియకుండ
గురుపత్ని నా కొక్కకుపసంబుఁ గుట్టుము
చలిగాలి యొడలిపైఁ బొలయకుండ
గురునందనుండు నాకు రచింపు పావాల
నడుసు పాదంబులనంటకుండ
తే. గురుతనూభవ నాకు బంగరుపుతొడవు
*వజ్రభూషలు సేయు తాల్పంగవలయు
ననుచుఁ బ్రార్థించి రందఱు కతఁడు మ్రొక్కి
యిన్నియును దాను గల్పింప నియ్యకొనియె. 40

వ. ఇవ్విధంబున గురునకు గురుపత్నికి గురుపుత్రులకు గురుతనూభవకు, వారలు కోరినయర్థంబులు సంఘటింప నను వెఱుంగక చింతాక్రాంతుండై యుండెనంత దైవయోగంబున

---

* 'వజ్రభూషణములు నాకు వలయుఁ దాల్ప' అని వ్రాతపుస్తకము.

నొక్క పుణ్యపురుషునుపదేశంబునం గాశి కరిగి శివలింగంబుఁ
బ్రతిష్ఠించి పరమనిష్ఠం బెద్దకాలంబు తపం బాచరింప బ్రత్య
క్షుం బై విరూపాక్షుం డనుగ్రహింప సర్వధాతువులకు,
సర్వదారువులకు, సర్వశిలలకు, సర్వమణులకు, సర్వరత్నంబు
లకు, సర్వపుష్పంబులకు, సర్వవస్త్రంబులకు, సర్వసుగంధం
బులకు, సర్వకందమూలఫలంబులకు, సర్వచక్రంబులకుఁ
దాన కర్త యగునట్లుగా వరంబు వడసి, గురుజనంబుల
యాజ్ఞ చెల్లించి సర్వోపకారపరుం డయ్యె. అతనిపేరఁ గాశి
విశ్వకర్మేశ్వరుండు విశ్వాభీష్టఫలప్రదాయకుండయి యున్న
వాఁ డింక దక్షేశ్వరలింగప్రాదుర్భావంబు వివరించెద. 41

దక్షేశ్వరలింగప్రాదుర్భావము

ఉ. సామజదైత్యశాసనుఁడు సారసగర్భుఁడు నచ్యుతుండు సు
త్రాముఁడు నాది గా సురకదంబము గొల్వ నశేషలోకర
క్షామహనీయతన్ రజతశైలముపైఁ గొలు వుండె శుద్ధము
క్తామణిభూషితం బయిన కాంచనహర్మ్య శిలాతలంబునన్.

వ. తదనంతరంబ. 43

తే. వేలుపుల నెల్లఁ బరిపాటి వీడుకొలిపి
సముచితం బైనతారతమ్యమున శివుఁడు
మఱచె దక్షప్రజాపతి మామ ననుచు
నెట్టివారికి మఱపు లేదే యొకపుడు? 44

వ. ఖిన్నుం డై యతం డుస్సురని నిజస్థానంబునకుం బోయి
నిజాంతర్గతంబున. 45

సీ. ఇతనివంశం బెద్ది యెఱుఁగంగ వచ్చునే?
యితనిగోత్రం బెవ్వఁ డెఱిఁగినాఁడు?

దేశంబు గుఱుతు సాధింపంగ వచ్చునే?
వర్తనం బెఱుఁగంగ వచ్చు నెట్లు?
వృషభవాహనుఁ డఁట విషముఁ దిన్నాఁడఁట!
యితనిసమాచార మేమి చెప్ప?
యస్త్రంబు ధరియించు నఁట తపస్వియు నట్టె!
యిట్టివేడబము లెయ్యేడలఁ గలవె?
తే. కాశిలో నుండు గాఁ బ్రాణసర్వగణన యెట్లు?
బ్రహ్మచారియు గృహియు నెట్లుంగి నయ్యె?
శూద్రుఁడో! బ్రాహ్మణుండో! వైశ్యుండో! రాజో!
తెలియవచ్చునె యాతని కల తెఱంగు? 46

వ. అర్ధనారి గావునం బురుషుండు గాఁడు; గడ్డంబు గలదు గావున యోష గాదు; సముచ్ఛ్రీయలింగమూర్తి గావున నపుంసకుండు కాఁడు; పెద్దకాలంబువాఁడు గావున బాలుండు గాఁడు; చిరంతనుండు గావునఁ దరుణుండు కాఁడు; జరామరణవర్జితుండు గావున వృద్ధుండు గాఁడు; మహాకల్పాంతంబునం బ్రహ్మాదుల వధియించియుఁ బాతకి కాఁడు; ఈతని చందం బెవ్వం డెఱుంగు? నని యట్లుండె. 47

క. మామ గురుస్థానంబు న
సామాన్యుఁడ నెట్లు? జలజసంభవసుతుఁడన్
సౌముఖ్యంబున యోగ
క్షేమం బారసి ప్రియంబు చెప్పఁగవలదే? 48

క. మాతాపితృవర్జితుఁ డగు
†నీతని కే నెట్లు బిడ్డ నిచ్చితి? నవియున్

† 'నీతనికిని నెట్లు బిడ్డ నిచ్చితి (నదియున్) నాదిన్' అచ్చుపుస్తకము.

నాతప్పు గాక యిది తా
నీతనితప్పెట్లు? నాకు నిది కావలయున్. 49

తే. వేద లయ్యును గడు బిఱ్ఱబిగిసి యుండ్రు
వట్టియభిమానములును గర్వములుఁ బట్టి
యల్లువారికి నెల్ల నీయవగుణంబు
వెన్నతోఁ బెట్టినది యింత వినుట నేల? 50

తే. అహహా! † యలచంద్రుఁ డనువాఁ డహంకరించి
రోహిణీదేవి నొల్లక రోసి యుండెఁ
బాపి నతని క్షయవ్యాధిబాధితుఁడుగఁ
గినిసి శపియింపనే? కల్ల వినఁగ నోర్వ. 51

క. ఇది ధర్మం బకులీనుల
కిది విధి మాతాపితృప్రహీనుల కహహా!
యిది కట్టడి తిరిపెములకు
నెదిరిం దను నెఱుఁగ కునికి యేలా మాటల్? 52

శా. తా నెట్లేనిఁ దిరస్కరించె నను నాస్థానంబునం దేవతా
మాని వ్రాతములోన మామ యనుసన్మానంబు శూన్యంబుగా
నేనుం దన్నుఁ దిరస్కరించెద మఖం బిప్పాటఁ గల్పించి సం
స్థానీయత్వముఁ బూని యల్లుఁడను సన్మానంబుశూన్యంబుగన్.

వ. అని యజ్ఞసంభారంబులొడంగూర్చి యజ్ఞపురుషుం డైనపురు
షోత్తముం డుపద్రష్టగా, బ్రహ్మవాదు లగుమరీచ్యత్రిభర
ద్వాజాదిసప్తర్షులు ఋత్విజులుగాఁ, త్రైలోక్యంబును దక్షిణా
ద్రవ్యంబుగా, భృగుండు బ్రహ్మగా, నాంగిరసుం డాచార్యుం

---

†-'మునుచంద్రుఁ; యిలచంద్రుఁ ..రోహిణీదేవి నొకకొంత రోసి' అని వ్రాఁతపుస్తకము.

డుగా, భగపూషాదులుసదస్యులుగా, దిక్పాలకులు రక్షకు
లుగా, నల్లురు ధర్ముండును జంద్రుండును గశ్యపుండు సహా
యులుగాఁ, గామధేనువు హవిస్సును గల్పవృక్షంబులు సమి
త్కుశంబులును విశ్వకర్మ దారుపాత్రశకటమంటపాలంకా
రంబులును గల్పించువారుగా, ధర్మపత్ని యగు శతరూపా
దేవితోఁ గూడి మహాధ్వరంబు సేయం దొడంగె నంత. 54

తే. అరణిసంగ్రహ మొనరించి యజ్ఞనిష్పత్తి
పెద్దకొలు వుండె ముత్యాలగద్దె యెక్కి
చుట్టు బలిసి కూర్చుండిరి సురలు మునులు
వింజ మాఁ కిపిన ట్లుండె విశ్వసభయు. 55

వ. అప్పుడు పరమమాహేశ్వరుం డగు దధీచి యను బ్రహ్మర్షి
సభామధ్యంబున నిలిచి యెల్లవారును విన నిట్లనియె. 56

సీ. భారతీదేవి †కైవారకావ్యంబులు
పఠియించుచున్నది ప్రస్ఫుటముగ
నాచార్యపదవికి నర్హమై నాయితం
బైయున్న వాఁడుచధ్యానుజుండు

---

†'ఇచటఁ గైవారశబ్దము సంస్కృతసమాసఘటితమై యున్నది. ఇది సంస్కృతశబ్దముగూడ నని శబ్దరత్నాకరమున నున్నదిగాని యచ్ఛకర్ణాటశబ్దముగఁ గర్ణాటనిఘంటువులో నున్నది. ప్రాచీనసంస్కృతనిఘంటుగ్రంథములలో నెక్కడ నీ శబ్దము గానఁబడదు కావున నిది దేశ్యమొండెఁ గవివార(కవులకులు) శబ్దతద్భవమొండెం గావలయును. ఈశబ్దము స్తుతిపరముగనే యఱవమునను గన్నడమునను వాడఁబడుచున్నది. ఇట్టే శృంగారనైషధమునను 'మీకైవారదుర్భాషణం, ఖలకుం గాని' (ఆ-7. ప-89)యని ప్రయోగించియున్నాఁడు. శ్రీనాథుఁడు సంస్కృతశబ్దముగ భ్రమించె నని తోఁచుచున్నది.

కర్మకాండవిదుండు గాఁడియున్నాఁడు బ్ర
    హ్మత్వమునకు ఋణం బంది భృగుఁడు
గట్టువా లై లక్ష్మి కై సేయుచున్నది
    చేరి యంతఃపురస్త్రీజనముల
తే. దేవి శతరూప జాలియఁ దీర్చె మాళి
నీవు దీక్షిష్యమాణుండ విధమహీమ
నధ్వరారంభ మిం కొప్పు నయ్య! పటు!
శివునిఁ దో డ్తేనియొక్కయొచ్చెంబు తక్క. 57

క. అపరాధ మింక నెట్టిది?
చెపుడా! మఖమునకుఁ దన్నుఁ జీరినమాత్రన్
ద్రిపురాంతకుఁ దప్పింపక
యుపపన్నన మాచరింప నుచితమె హరికిన్. 58

క. వామాంగము వైకుంఠుఁడ
వామాంగము వేధ సుదన్వై రికి నని యో
సోమప! యెఱుఁగుదొ? యెఱుఁగవొ?
యామృడు దప్పింపవలదె యధ్వరమునకున్? 59

సీ. శితికంధరునకు నెచ్చెలికాఁడు గాఁ డొకో
    యటమటీఁ డైనయీయక్షభర్త?
యహికంకణునకు మూఁడవకన్ను గాఁ డొకో
    పాల్మాలినట్టియీపావకుండు?
పురవైరి కవతంసపుష్పంబు గాఁ డొకో
    నిర్భాగ్యుఁ డైనయీనీరజారి?
గంగాధరునకు లెంకలలెంక గాఁ డొకో
    పెనుగూళ యైనయీయనిమిషేంద్రుఁ?

తే. డేమి గుడువంగ వచ్చినా రిండ్లు విడిచి
హరుని వెలిపెట్టినట్టి యీయాగమునకుఁ?
బంచవదనునికను జేవుఱించె నేని
తత్క్షణంబున తమయాండ్ర తాళ్లు దెగవె? 60

తే. ఏల వచ్చినవాఁడు బాలేందుమౌళి
విరహితం బైనయీ యాగవిధికి జముఁడు?
మఱచెనే శూలి డాకాలిమడమతాఁకు
దీర్ఘనిర్ఘాతసంపాతనిర్ఘృణంబు. 61

క. వినరే! 'శ్వేతాశ్వతరో
పనిషత్తు హరుండు భోక్త భర్గుఁడు భోగ్యం
బనిలాశిధరుఁడు ప్రేరిత'
యని చెప్పెనో లేదో యది ప్రయత్నముతోడన్? 62

వ. వియదాదిపరమాణ్వంతం బైనచరాచరాత్మకజగత్ప్రపంచం
బునకు సృష్టిస్థితిలయకారణం బైనశంభుండు నీకు మాననీ
యుండు గాకుండుట యెట్లు? విచారించి చెప్పుము. 63

తే. బ్రాహ్మణుఁడ నాశ్రితుఁడ నీకుఁ బరమహితుఁడ
దక్ష! యొకమాట వినవయ్య తగవు గల్గి
క్రతుఫలాధీశు భువనరక్షాధురీణు
భోగికంకణు రప్పింపు యాగమునకు. 64

వ. అర్థహీనం బైనవాక్యంబును, గర్మహీనం బైనశరీరంబును,
బతిహీనం బైననారీరత్నంబును, గంగాహీనం బైనదేశం
బును, బుత్రహీనం బైనదాంపత్యంబును, దానహీనం బైన
వైభవంబును, మంత్రిహీనం బైనరాజ్యంబును, శ్రుతిహీనం
బైనయాకారంబును, యోషాహీనం బైనసౌఖ్యంబును,

దర్భహీనం బైనసంధ్యాదికృత్యంబును, దిలహీనం బైన పైతృకంబును, హవిర్హీనం బైనహోమంబును, శివహీనం బైనక్రియాకలాపంబులు నిరర్థకంబులు. 65

తే. అనినఁ గోపించి దక్షుఁ డీయవనిసురుని
వెడలఁ ద్రోయుఁడు ప్రాగ్వంశవేశ్మ మనినఁ
దనకుఁ దాన దధీచి యాస్థాన మెల్లఁ
దల్లడిల్లంగ వెడలె నుద్దామభంగి. 66

వ. అతనితోడ దుర్వాసుండును, సుపేంకుండును, సుపమన్యుండును, రుచికుండును, గాలవుండును, మాండవ్యుండును, వామదేవుండును, నుద్దాలకుండును వెడలిరి. అంతకమున్న మీఁదెత్తెంగి బ్రహ్మసత్యలోకంబునకుం జనియె. మఖంబు ప్రారంభింపఁబడియె. తద్వృత్తాంతం బంతయు నారదువలన విని సతీదేవి మహేశ్వరానుమతి వడసి దివ్యరథారూఢ యై తండ్రికి బుద్ధిచెప్పఁదలంపునఁ గైలాసంబున నుండి యేతెంచి. 67

తే. యజ్ఞవాటంబు సొత్తెంచి యఖిలజనని
యర్థిఁ జూచ్చెండె రత్నసింహాసనమున
భక్తితో దేవసభయును బ్రహ్మసభయు
నంజలులు ఫాలభాగంబులందుఁ జూర్చ. 68

వ. అప్పుడు దక్షప్రజాపతి కోపించి వచ్చినకూఁతుచిత్తం బెఱింగి యి ట్లనియె. 69

సీ. హరుఁ డమంగళవేషుఁ డౌనొ కాఁడో చెప్పు
మెఱుఁగ కిచ్చితిమి నిన్నేమి చెప్ప?
నిటు చూడు † మిందఱు నిం తొప్పి యున్నవా

---

† వీరంద ఱిం తొప్పి' అని ప్రా. ప్ర.

రఖిలభూషణభూషితాంగు లగుచుఁ
దనరూపునకుఁ దోడు దలము దప్పినగర్వ
మరకంటఁ జూడఁ దే నరిగినపుడు
నా పెండ్లికొడుకులం దేపాటివాఁడు తా?
నేల రప్పింతు నే నిట్టివాని?
తే. నీవు వచ్చితి మే లయ్యె నింతెచాలు
నతఁడు రాకున్నఁ గొదువ లేదంశమైనఁ
దాను భిక్షాకపాలంబు దాల్చి వచ్చి
బంసు నేయుటకంటె రాకుండు టొప్పు. 70

వ. అనిన విని సతీదేవి తండ్రి కి ట్లనియె. 71

శా. ఆహా! లెస్స! వివేకమే! పురహరుం డాసించియున్నాఁడె నీ
స్వాహాకారము? శంభుఁ బాసి యిట నీసత్త్రంబునం దేనుమృ
ష్టాహారంబు భుజింపవచ్చితినె మోహాంధుండ వై యీశ్వర
ద్రోహం బేటికిఁ జేసెదంచు హితబుద్ధుల్ చెప్పఁగా వచ్చితిన్.
తే. శివుఁడు దాత భోక్త శ్రీమహాదేవుండు
సర్వమును హరుండు శాశ్వతుండు
శంభు వేఱు సేసి సాగింప వచ్చునే
క్రియలు? వెఱ్ఱి బేల వయితి? చెపుమ. 73

దండకము. మఱి యతఁడు, సదానిధిధ్యాసితవ్యుండు మంతవ్యుఁ
డాతండు శ్రోతవ్యుఁ డాతండు ద్రష్టవ్యుఁ డాతండు జన్మస్థితి
ధ్వంసనమ్ముల్ తిరోభావమోక్షంబులుం గృత్యముల్గాఁగ నా
తండు లోకంబులం బట్టి పాలార్చు రుద్రుండు విశ్వాధికుం
డంచు నామ్నాయసంఘాత మామ్రేడనప్రక్రియం దోర
మై యాతనిం జెప్పు సత్యంబు నిత్యంబు శుద్ధంబు బుదం

బనంతంబు శాంతంబు కూటస్థమాత్మ ప్రతిష్ఠంబఖండంబు దత్త
ద్వితీయంబచింత్యైక మానంద మాద్యం బవేద్యంబు
దిగ్దేశకాలవ్యవచ్ఛేదనీయంబు బ్రహ్మంబు దత్తత్త్వమున్ వేదవే
దాంతవిద్యామహావాక్యమీమాంసహంసు ల్విచారింతు
రధ్యాత్మయోగంబునన్ షణ్ణవత్యంగుళీమానయుగ్దేహమ
ధ్యాంతరాళానలావాస కోణత్రయీగేహరోహత్ప్రభా
కీలికాస్యూతనిర్భిన్న షట్పుష్కరీగర్భ విష్కంభనిష్కంపనీవా
రశూకోపమాధామధా మచ్ఛటాకోటిశంపాలతా లంఘిత
ద్వాదశారేందునిష్యందమానామృతాసారధారాప్లవాస్పంది
తానందులై యోగిబృందారకుల్ లీలతో లోనఁ గంద్రా
తనిన్ నిక్కమై యాతఁ డొక్కండు భూతాత్మభూతంబు
నం దుండి నానాత్వముం బొందిన ట్లుండు నట్లే ఘటాంత
స్థితం బై ఘటాకాశమయ్యున్ పటాంతస్థితంబై పటా
కాశ మయ్యున్ నిజం బొక్కయాకాశ మాకాశముల్ పెక్కు
లైనట్టిచందంబులన్ భ్రాంతిదోఁచుం గదా! త్రిపురమథను
ఫాలనేత్రుం త్రిలోకీగృహస్థుం త్రయీమౌళిమాణిక్య
ఖండంబు బ్రహ్మాండకుటుంభరున్ శంభుఁ గుంభీనసగ్రామణీ
కంఠహారున్ గటీభాగశాటీభవత్సింధురక్రవ్యభుక్కృత్తి
మృత్యుంజయుం గూఢపాత్కుండలుం బాండురాంగుం
గురంగాంకఖండావతంసుం గిరీశున్ లలాటేక్షణావిర్భవ
ద్భీషణోషర్బుధజ్వాలమాలాసమాలీఢ పుండ్రేక్షుకోదం
డునిన్ భూర్భువస్స్వర్జగద్దాహలీలాకనద్దోహలవ్యాళహా
లాహలగ్రాసకల్మాషకంఠోపకంఠున్ నమద్బ్రహ్మవైకుంఠ
ముఖ్యామరవ్రాతకోటీరకోటీమణిశ్రేణిశోణప్రభాజాల

బాలాతపస్మేరపాదారవిందుఁ భజింపం డగుఁ సత్ప్రియా
రంభకాలంబునఁ, జనక! కనకశైలకోదండుం డల్పుండు
గాఁ జూచితే? తండ్రి! కల్పాంతసంధ్యామహాతాండవాడం
బరారంభ సంరంభ సంక్షోభితాశేష లోకప్రపంచుండు
వంచింప నర్హుండొకో? యయ్య! త్రయ్యంత విద్యావధూ
రత్నసీమంతసిందూరపాంసుచ్ఛటాపాటల శ్రీపదాంభోజ
యుగ్ముం డిమ స్నాత్ముఁడే? తాత! దైతేయ లీలావతీగండ
పాళీపరిస్ఫూర్తకస్తూరికాపత్రవల్లీ మతల్లీ కళాద్రోహిబాహా
ర్గళ స్తంభుపై నీ కవష్టంభసంరంభ మేలయ్య యీలా
గునఁ? మధుమథన! మహోగ్ర బుద్ధుండ వీ విట్టిదుశ్చేష్టితం
బెట్లు వీక్షింపుచున్నాఁడ? నబ్జాక్ష! సియ్యల్లువెల్వాండ నీబండ
దుర్గోష్ఠితోఁగూడియున్నాఁడ విం కొక్కమాఱైన నేమో
ముఖం జూచె నీశానుపాదాబ్జముల్? వహ్ని! యీకూడు
దీఁ డయ్యెనే నీకు నిర్భాగ్య? శశాంక! యింతెగకళంకంబుఁ
దెల్లంబుగానించి తిన్నాళ్లకుఁ లెస్స గాకేమి? పౌలస్త్య!
నిన్నుం గనుంగొన్న సిగ్గయ్యెడుఁ? శక్ర! నీమొక్కలంబు
ల్వీనంబడ్డవే కావె? వాచస్పతీ! నీచరిత్రంబు (చిత్రంబు)
నీచంబు చాలుఁ వృథాలాపముల్ (నేయ నీయున్నవారింద
ఉన్నారు) చూడంగ నేఁ డెల్లి యెల్లుండి యీలోన నేపా
కముం బొంద నున్నారొ? యేదుర్గతిం జెంద నున్నారొ?
యేయాపదం దూల నున్నారొ? యేపంచలం దూల
నున్నారొ? యామీఁద దైవం బొకం డెర్గఁడుఁ. 74

వ. అని పలికి భవాని కన్ను మొగిచి(న.) 75

సీ. పాదపద్మములందుఁ బ్రభవించునప్పుడు
ప్రత్యగ్రయావకద్రవము చెలువు
కటిమండలంబుపైఁ గనుపట్టునప్పుడు
కనకకాంచీదామకంబుడాలు
వలుఁదచన్నులమీఁద మొలతెంచునప్పుడు
కాశ్మీరజాంగరాగంబుపొలుపు
సీమంతపదమునఁ జిగురొత్తునప్పుడు
రమణీయసిందూరరజముసొబగు
తే. ప్రోడిసేయుచు భర్గుస భుజగహారు
రాణివాసంబు దివ్యవిగ్రహమునందుఁ
గవులుకొని మండె నాస్థానరంగభూమి
నధికరోషోత్థితంబు యోగానలంబు. 76

సీ. ఆక్రోశ మొనరించె నాహారవంబుతో
బంధువర్గము శోకపరవశమున
మొగములు తెల్లనై మునులు దేవతలును
భీతిల్లి చేతులు పిసికికొనిరి
చ్యుతవికంకతతరుస్రుక్స్రువప్రకరమై
విభ్రాంతిఁ బొందె ఋత్విగ్గణంబు
† ప్రజ్వలింపఁగనాఱుభంగి యేమియు లేక
యుడివోయి చల్లనై యుండె వహ్ని
తే. పుట్టె నుత్పాతములు పెక్కు భువిని దివిని
విడిచిపోయిరి యొకపాటి విబుధమునులు

---

† 'ప్రజ్వలింపఁగరాసిభంగి గా కొకభంగిఁ దఱచుగానుండె వైతా[illegible] వహ్ని' అని అచ్చుపుస్తకము.

యజ్ఞవాటంబునందుఁ గామారిదేవి
యోగవహ్నికి దేహ మాహుతి యొనర్ప. 77

తే. భామతోఁ గూడి వచ్చినపారిషదులు
వేగమున నేగి సతిసుద్ది విన్నవింప
భవుఁడు కోపించి భ్రూకుటిభయదఫాల
భాగుఁ డౌనప్పుడొకమహాప్రభ జనించె. 78

వ. ఆప్రభామండలంబునడుమ నొక్కదివ్యపురుషుం డావిర్భవించి యమ్మహాదేవునకు నమస్కరించి. 79

సీ. వదనంబు దెఱచి మ్రింగుదునో బ్రహ్మాండంబు
పలుమోద కుండంగఁ బాండురాంగ?
పిండిపీచంబుగా బృథివీధరంబు ల
డంతునో కాలదండమున నభవ?
దందశూకాధీశుతలలు దండసిలంగఁ
దాటింతునో కాల ధర మహేశ?
వ్రచ్చి వైతునో కేలి వాలారునఖముల
నఖిలదిక్కులు శశాంకార్ధమకుట?

తే. యేమి సేయుదు? నానతి యిమ్ము నాకు
ననుచుఁ గ్రమ్మఱ మ్రొక్కి బాహాప్పళించెఁ
దన్మహాధ్వనిఁ గలఁగి యుత్కటము లగుచు
జడధు లేడును గలుషింప శంభుసుతుఁడు. 80

వ. అనిన రుద్రుం డతని రౌద్రోద్రేకంబునకువీరరసరేఖాముద్రకుం బ్రమోదం బంది భద్ర! నీకు వీరభద్రనామం బిచ్చితి; నాయధిక్షేపంబున దక్షయజ్ఞంబుసంక్షయంబు నొందింపుము; ప్రమథాక్షౌహిణీబలంబు నీకు సహాయం బయ్యెడు నని

యానతిచ్చిన మహాప్రసాదంబని విరూపాక్షుం బ్రదక్షిణంబు
వచ్చి దక్షిణాభిముఖుండై ధాటీసంరంభంబున నరిగెనప్పుడు.

క. సంగడిఁ బిఱుంద ముందట
నింగియు నేలయును నిండె నిష్ఠుర భంగిం
బుంగవకేతను సుభటుల
భంగురవీరప్రతాపభయదస్ఫురణన్. 82

క. కొండలు మహీరుహంబులు
గండోపలములు ధరించి కహకహ నగుచున్
మెండుకొని యజ్ఞవాటిక
† కొండొరు గడవంగ బారి రుద్భటభంగిన్. 83

వ. అందుఁ గొందఱు యూపస్తంభంబు లుద్ఘాటించిరి. కొందఱు కుండంబులను బూడ్చిరి. కొందఱు మంటపంబులు పడఁద్రోచిరి. కొందఱు వేదికలు గ్రొచ్చిరి. కొందఱు హవిస్సులు భక్షించిరి. కొందఱు అన్నంబు లారగించిరి. కొందఱు పాయసంబులు మెసఁగిరి. కొందఱు పిండివంటకంబులు మ్రింగిరి. కొందఱు ఘృతదధిక్షీరక్షౌద్రపుండ్రేక్షుఫలాదు లాస్వాదించిరి. కొందఱు యజ్ఞపాత్రంబులు పగుల మొత్తిరి. కొందఱు స్రుక్స్రువంబులు విఱిచిరి. కొందఱు శకటంబులు విటతాటనంబులు సేసిరి. కొందఱు చషాలంబులు చెవులం దగిలించుకొనిరి. ఇవ్విధంబున నిర్మర్యాదంబై నిరవగ్రహంబై పారిషదుల యాగ్రహంబులు చెల్లుచుండం గోపాటోపసమున్నిద్రుండై.

† 'కొండొరుఁగడవంగఁ జొచ్చి రుగ్రత మెఱయన్' అని వ్రాఁతపుస్తకము.

సీ. తనమీఁద వైవంగ దంభోళి యెత్తినఁ
జేలఁగి సంస్తంభించె జిష్ణుభుజము
కైటభారాతి చక్రము ప్రయోగించిన
వేసఁ జక్కిలముఁ బోలె నిఱిచి బొక్కెఁ
బటుచపేటంబునఁ బండ్లు డుల్లఁగ మొత్తి
పూషార్కు వదనంబు బోసిపుచ్చెఁ
జప్పము త్రైనులు రాల్చెనభంగి నలవోక
భగునిగ్రుడ్ల పోంగ బలిమిఁ దన్నె
తే. నర్ధచంద్రబాణంబున యజ్ఞమృగము
శిరముఁ దెగ నేసి కట్టె నంబరముమీఁద
ధాతపతిముక్కు సోణంబు దాఁకఁ గోసెఁ
ప్రకటవిస్ఫూర్తి శ్రీవీరభద్రమూర్తి. 85
తే. ద్రోహు లగు వేలుపులలోన వోలి యున్న
పదియునొక్కండ్రు రుద్రులఁ బాఱ విడిచె
గాసి చేయక కాకోలకంఠుఁ డట్టి
తండ్రిపేరివారగుట చిత్తమునఁ దలఁచి. 86

వ. అంతట. 87

క. సిగ్గుచెడి భీతిఁ బాఱిరి
బగ్గనఁ బోధించి వీరభద్రునిధాటిన్
నుగ్గు లయి యవురుసవు రయి
గగ్గులకాండ్రై వికావిక లయి యమర్త్యుల్. 88
తే. దక్షునల్లుండ్ర మెడల సూత్రములఁ గట్టి
యూపములు సూత్రములతోడ నుద్దిసేసి

దామెనలు గూర్చి నడిపించెఁ దరతరంబ
వీరభద్రుండు పశువుల వెల్చునట్లు. 89

మ. పనిలే దేటికి బాధ పెట్టెదను? నబ్రహ్మణ్యమేతో? మొఱో
యని యుచ్చైర్ధ్వనిఁ గూఁతవెట్ట మఖశాలాంతంబునన్ శ్రా
ద్ధదేవునిఁ గట్టించెను వీరభద్రుఁడు భటవ్యూహంబుచే నా
గ్రహంబున ధూమోష్ణపయోధరద్వితయమున్ ముద్దాడు
హస్తాబ్జముల్. 90

క. *రాపించె భృగుని పండ్లను
గూపెట్టఁగఁ గాలకంఠుకోడు కుత్తరవే
దీపాషాణాంచలమునఁ
బాపపుయాగమునఁ దొట్రుపడి రంతమునుల్. 91

చ. మతకరిపాకశాసనుఁడు మత్తశిఖావళశాబకంబునా
కృతి ధరియించి ప్రాంతమునఁ గేలిమహీధరశృంగమెక్కి ని
ర్వ్రతమతి నుండె వేలుపుల వేదనఁ బెట్టెడువీరభద్రు ను
ద్ధతి పరికించుచున్ †నయపథంబు బృహస్పతిచే బెలుంగఁడే?

తే. తఱిగె నద్యముదీర్ఘదోర్దండయుగము
క్రకచమున వీరభద్రుఁడు కరుణ వొలఁగి
త్ర్యంబకునిపట్టి పవను వధ్యంబు సేసె
వానియంతఃపురస్త్రీలు వనటఁ బొంద. 93

చ. వలపలికాల ముక్కునను వాత సుధారస ముప్పతిల్లఁ గా
వెలికిల వైచి మట్టి రణవీరశిఖామణి వీరభద్రుఁడ

* క. 'రావించె భృగుని' పాఠాంతరము.

† 'నయపథంబు బృహస్పతి చెప్పెఱుంగఁడే.' ఒక వ్రా. ప్ర. 'చేఁబె
ఱుంగఁడే' పూ. ము. ప్ర.

చ్ఛలమున రోహిణీరమణుచారుశరీరముఁ దత్పదాహతిం
గలిగిన కుంపుగాదె పొడగానఁగ నయ్యెడు నేఁడుచిహ్నమై?

తే. ఈశ్వరద్రోహి! గర్వాంధ! ఋషిసురేంద్ర
బంధునాశైకకారణ! పాపకర్మ!
చావు మని యొక్కపెట్టునఁ జక్రధార
దక్షుతలఁ ద్రెవ్వఁగొట్టె ఫాలాక్షసుతుఁడు. 95

వ. ఇవ్విధంబున మధుమథనుచక్రాయుధంబు విఱిచి, జంభాంతకు
భుజాస్తంభంబు సంస్తంభించి, భగునికన్నులు కెలికి, పూషు
పండ్లు వెఱికి, మఖమృగంబుశిరంబు ఖండించి, దక్షుతల ద్రెవ్వ
వ్రేసి, దాక్షాయణీసుతుఁ బొట్టగుజ్జులుక ద్రొక్కి, భారతీ
దేవిముక్కు చిదిమి, గాలివధ్యంబుచేసి, జముని మెడ దండె
పగిల్చి, యదితియధరపల్లవంబు చక్కడచి, యగ్ని నాలుకలు
గోసి, నిరృతిఁ దలపట్టి వంచి, కింపురుషపతి మొగంబు
పాషాణపట్టంబున బిట్టు రాచి, యనంతరంబ గరుడులంద్రోచి,
ఖచరులఁ బొరకొట్టి, యచ్చరల సిగ్గువుచ్చి, కిన్నరులఁ దునిమి,
గుహ్యకుల గోడుకుడిపి, సాధ్యులం జెఱిచి, రుద్రులం
బఱపి, మరుత్తులఁ ద్రోపెంచి, విశ్వుల వేఁచి, విద్యాధరుల
వెలిచి, గంధర్వుల గారించి, యక్షుల నధిక్షేపించి, చక్షు
శ్శ్రవుల శిక్షించి, చారణుల జంకించి, కింపురుషులఁ బరిభ
వించి, వీరభద్రుండు మాఱులేక మలయుచుండె నివ్విధం
బున. 96

ఉ. తామరసాసనుం డగు పితామహుఁ గూరిమిపట్టి యైనమా
తామహు యాగతంత్రమునఁ దంత్రముచేసి శివాజ్ఞ విక్రమో

ద్దాముఁడు వీరభద్రుఁడు పదంపడి యంపఱఁ గాచె దేవతా
గ్రామణులం దను వ్రణవికారములన్నియు మానునట్లుగన్.

తే. రణములో నైనతనువికారంబు లెల్ల
దేవతలకు శమించె నద్దేవుకరుణఁ
దాల్చె దక్షుఁడు వీతవ్యథాబలమునఁ
గంఠనాళాగ్రముననుండ మేండశిరము. 98

తే. శంకరద్రోహపాపప్రశాంతిఁ గోరి
దక్షుఁ డెంతయుఁ గాలంబు తపము సేసె
బహుళకైవల్యసామ్రాజ్యపట్టభద్ర
సింహపీఠికఁ గాశికాక్షేత్రసీమ. 99

వ. దక్షుండును దనపేర దక్షేశ్వరలింగంబుఁ బ్రతిష్ఠించె. 100

తే. అంబికకుఁ బుట్టినిల్లు నీహారశిఖరి
యత్తవారిల్లు కాశీమహాపురంబు
హిమకరోత్తంసునకుఁ బుట్టినిల్లు కాశి
యత్తవారిగృహంబు నీహారశిఖరి. 101

వ. నర్మదేశ్వరుండును సరస్వతీశ్వరుండును రత్నేశ్వరుపురోభాగంబున
నధివసింతు రింక వ్యాసేశ్వరమాహాత్మ్యం బభివర్ణించెద. 102

వ్యాసేశ్వరమాహాత్మ్యము

తే. బాదరాయణుఁ డఖిలభూపరిధియందు
సకలతీర్థంబులను నాడి శాంతబుద్ధి
నైమిశం బనుపుణ్యకాంతారమునకు
నరుగుదెంచెను శిష్యసంహతియుఁ దాను. 103

క. ఆతతమతి నతఁ డష్టా
శీతిసహస్రములు మునులు శివుఁ గొలువంగా

నేతెంచి శిష్యులును దాఁ
బ్రాతఃకాలమునఁ బొగడఁ బద్మేక్షణునిన్. 104

వ. లక్ష్మీశ్వరుండె దైవంబు, జనార్దనుండె భుక్తిముక్తిప్రదుండు, విష్ణుధర్మంబె ధర్మంబు. 105

సీ. సత్యంబు భుజగేంద్రశయనుండె దైవంబు
సత్యంబు దైవంబు చక్రధరుఁడు
సత్యంబు వైకుంఠపదనుండె దైవంబు
సత్యంబు దైవంబు శాశ్వతుండు
సత్యంబు కైటభశత్రుండె దైవంబు
సత్యంబు దైవంబు శార్ఙ్గధరుఁడు
సత్యంబు వార్ధిజాసహితుండె దైవంబు
సత్యంబు దైవంబు శ్యామతనుఁడు

తే. మఱియు సత్యంబు దైవంబు మాధవుండు
మఱియు సత్యంబు దైవంబు మకరగురుఁడు
మాట లేటికి? దైవంబు మఱియుఁ గలఁడె
పుండరీకదళాయతాక్షుండు దక్క. 106

వ. అని యీప్రకారంబు వారణాశియందుఁ బంచనదంబునం బావనోదకంబులం దీర్థం బాడి యాదికేశవదేవుం బాంచరాత్రదివ్యాగమమార్గంబున నర్చించి విశ్వేశ్వరశ్రీమన్మహాదేవుభవనద్వారంబున నిల్చి యూర్ధ్వభుజంబెత్తి సకలవేదపురాణేతిహాససిద్ధాంత నిశ్చితార్థంబు, సత్యంబు, పునస్సత్యంబు, వేదశాస్త్రంబులకంటెఁ బరం బైనజ్ఞానంబును, గేశవులకంటెఁ బరంబైనదైవంబు లే దని పలికిన విని. 107

శా. 'ఎట్టెట్టూ! వినమైతిమింక నొకమా టేర్పాటుగాఁ జెప్పుమా
భట్టారా!' యని నందికేశ్వరుఁడు విస్పష్టంబుగాఁ బల్కినన్
బట్టెన్ గంఠబిలంబు చెయ్యి దివియన్ బ్రాదయ్యె వారాణసీ
హట్టప్రాంగణమందు వ్యాసునకు శిష్యశ్రేణి భీతిల్లఁగన్. 108

క. భుజవాక్స్తంభంబునఁ
బ్రజనితభయుఁ డగుచు ముట్టఁబడి మఱిఁ గొలిచెన్
గజరాజవరదు గరుడ
ధ్వజుఁ డప్పుడ యరుగుదెంచె వ్యాసునికడకున్. 109

వ. వచ్చి 'యో బాదరాయణుండ! బుద్ధిమంతుండ విట్టియపరాధం బెట్టు సేసి?' తని కినిసి. 'నందికేశ్వర! నాకుం బ్రియంబుగా నీతని(యపరాధంబు క్షమించి) కరుణాదృష్టిం జూడు మని వేఁడుకొనియె. అప్పుడు సత్యవతీనందనునకు వాగ్భుజాస్తంభనంబులు నివర్తిల్లె. కృష్ణద్వైపాయనుండును బహుప్రకారంబులం బరమేశ్వరుం బ్రస్తుతించి తన పేర వ్యాసేశ్వర లింగంబుఁ బ్రతిష్ఠించె. ఆలింగంబును దప్పక భజించువారలకు భోగమోక్షప్రదాయకుండై యుండు. అనిన విని కుంభసంభవుండు శంభునందనున కభివాదనంబు సేసి సవినయంబుగా నిట్లనియె. 110

సీ. శైలారి వాగ్భుజాస్తంభం బొనర్పుట
నజ్ఞానవిరహితుం డయ్యె నేని
భాగీరథీతటోపాంతస్థలంబున
లింగప్రతిష్ఠఁ గల్పించె నేని
పుణ్యపంచక్రోశభూతీర్థమహిమంబు
నెరవుగా సర్వంబు నెఱిఁగె నేని

మార్కండేయతీర్థసమీపంబున వసిష్ఠతీర్థంబు. తత్తీర్థ
సమీపంబున నరుంధతీతీర్థంబు. వసిష్ఠతీర్థంబునకు యామ్య
దిగ్భాగంబున నర్మదాతీర్థంబు. తత్సమీపంబునఁ ద్రిసంధ్య
తీర్థంబు. తత్సమీపంబున యోగినీతీర్థంబు. తత్సమీపం
బున నగస్త్యతీర్థంబు. తత్సమీపంబున గంగాకేశవతీర్థంబు.
తత్సమీపంబున వైకుంఠమాధవతీర్థంబు. తత్సమీపంబున
వీరమాధవతీర్థంబు. తత్సమీపంబునఁ గోలాహలనరసింహ
తీర్థంబు. తత్సమీపంబునఁ గాలమాధవతీర్థంబు. తత్సమీ
పంబున నిర్వాణమాధవతీర్థంబు. తత్సమీపంబున మహాబల
నరసింహతీర్థంబు. తత్సమీపంబున జ్వాలామాలి నరసింహ
తీర్థంబు. తత్సమీపంబున మహాభయనరసింహతీర్థంబు.
తత్సమీపంబున నత్యుగ్రనరసింహతీర్థంబు. తత్సమీపంబున
వికటనరసింహతీర్థంబు. తత్సమీపంబున ననంతవామన
తీర్థంబు. తత్సమీపంబున దధివామనతీర్థంబు. తత్సమీపం
బునఁ దామ్రవారాహతీర్థంబు. 130

సీ. వారాకరంబులో వటపత్త్రశయను లౌ
యబ్జనాభులు నూఱు నైదుపదులు
తఱితోడ నమృతాబ్ధిఁ ద్రచ్చుచోఁ గుదురైన
ముదురుకచ్ఛపములు మూఁడుపదులు
సోమకాసురుఁ జంపి శ్రుతులు విధాత్రున
కర్పించునట్టి మత్స్యము లిఱువది
ఛద్మగోపాలవేషమున వ్రేపల్లెలో
విహరించుకృష్ణులు వేలసంఖ్య

జక్రపుష్కరిణి నిచ్చలుఁ దీర్థ మాడంగ
వలయు సంకల్పపూర్వకము గాఁగ
నర్చింప వలయు గంధాక్షతంబులఁ బుష్ప
ఫలపత్రముల విశ్వపతి మహేశు
నిలుపంగ వలయును నెఱసు వాటిలకుండ
నాత్మ ధర్మస్వవర్ణాశ్రమముల

తే. స్నానమహిమంబు భక్తి నాత్మఁ బ్రకటము
వినఁగ వలయుఁ బురాణార్థవిదులవలనఁ
దనయథాశక్తి వలయును దాన మిడఁగఁ
గాశిఁ గైవల్య మిచ్చుటఁ గాన లేమి. 115

తే. యాత్ర విధ్యుక్తసరణిఁ జేయంగ వలయు
వలయుఁ బరివారక్షేత్రదేవతలఁ గొలువ
వలదు బొంకంగఁ బరజీవముల నలుగ
వలదు నగిషైనఁ బరమర్మములు వచింప. 116

తే. ప్రాణసందేహమైనట్టిపట్టునందు
ననృతములు వల్కకైనను నోర్వశేయ!
యనుష్ఠింప వలయు నత్యంత మైన
పరమధర్మంబు కాశికాపట్టణమున. 117

క. కాలాంతకుకటకమునఁ బి
పీలికఁ గాచుట మహర్షిబృందారక! యీ
త్రైలోక్యంబును గాచుట
పోలఁగ శివధర్మసూక్ష్మములు దెలియు మదిన్. 118

తే. తీర్థసంవాసకారులై ధీరబుద్ధిఁ
గాశి వసియించు పెద్దల గారవించు

టధికధర్మంబు దాన నాప్లోవమొందు
వివిధకైవల్యసంధాయి విశ్వభర్త. 119

సీ. కుదియించునది నెట్టుకొని యింద్రియవ్యాప్తి
మనసుచాంచల్యంబు మాన్చునది
మదిలోన మోక్షకామనము పెంపొందునది
సాయంగ నిచ్చు ప్రాణాభయము
వ్రతదానధర్మసంపత్తుణార్థంబుగాఁ
గావించునది యాత్మకామరక్ష
తన్కాలదేహమాత్రామాత్రమునఁ గాక
సమకూర్చునది ధాన్యసంగ్రహంబు

గీ. నణఁచునది పంథ మాజ్జగించునది యీర్ష్య
యుడుగునది రాగలోభగర్వోదయములు
శాంతిదాంతతతితిక్షాప్రశంసపత్త్రి
నిరతుఁ డగునది కాశిలో నిలుచు నరుఁడు. 120

క. ఒకవర్షశతంబున నొం
డొకతీర్థమునందుఁ గల్గు ప్రయోజనలాభం
బొకదివసంబున నానం
దకాననమునందు సర్వదా సిద్ధించుఁ. 121

క. నేమం బన నొకప్రాణా
యామంబునఁ నరుఁడు పడయు నట్టిఫలశ్రీ
సామగ్రి యొందెడ ముని
గ్రామణి! సాష్టాంగయోగగతిఁ గనరు నరుల్. 122

సీ. *చక్రవాళపరీతసర్వసర్వంసహా
పరిధితీర్థములలో గరిమ కాశి
కాశికాపట్టణక్రోశపంచకతీర్థ
సమితిలో సారంబు జహ్నుకన్య
జహ్నుకన్యాతీర్థసముదాయకమునందుఁ
గడుఁ బెద్ద మణికర్ణికాప్రాంతంబు
మణికర్ణికాతీర్థమజ్జనప్రతతికం
టెను విశ్వనాథుదర్శన మధికము

గీ. విశ్వపతికంటెఁ గైవల్యవిభునికంటెఁ
గాలకంఠునికంటె ముక్కంటికంటెఁ
దీర్థములు దైవములు లేవు త్రిభువనముల
సత్య మింకను సత్యంబు సంయమీంద్ర! 123

సీ. అఖిలకాలము శంభు నర్చించినఫలంబు
సకృదీక్షణంబున సంభవించు
భవసహస్రముల సంపాదితం బగుపుణ్య
మొక ప్రదక్షిణమున కుపమ గాదు
పుష్పప్రదానంబుఁ బోలంగ లేవు షో
డశమహాదానకాండములు కూడి
తలకూడదు నశ్వమేధఫలంబు పంచామృ
తాభిషేకవిధాన మాచరింప

---

* 'చక్రవాళపరీత సర్వసర్వంసహా ప్రథితతీర్థములలోఁ బెరుగుఁగాశి' యనుపూర్వముద్రితపుస్తకపాఠములోయతిభంగము. ఈపాఠమిష్టమేని 'చక్రవాళ......పృథులతీర్థములలోఁ బెరుఁగు కాశి' యని సవరించుకొనఁదగు.

గీ. వాజపేయసహస్రప్రవర్తనమునఁ
గలఫలం బబ్బు నైవేద్యకల్పనమున
నిన్నియును జిత్తగించి విశ్వేశు నభవుఁ
గాశికాధీశు భజియింపు కలశజన్మ ! 124

క. గొడుగులు వింజామరములుఁ
బడగలును దాలవృంతపటవాసకముల్
మృడుని కొసంగినధన్యుఁడు
పుడమి జిత్తై కాతపత్రముగఁ బాలించున్. 125

వ. మఱి యాస్తిక్యబుద్ధి, వినయంబు, మానావమానంబుల
వికృతిలేమి, యకామిత్వం, బనౌద్ధత్యం, బహింసకత్వంబప్రతి
గ్రహావృత్తి, యదాంభికత్వం, బలుబ్ధత, యనాలస్యం, బపా
రుష్యం, బదీనత, యాదిగాఁ గలగుణంబులు కాశీతీర్థవాసి
కవశ్యంబును సంభావనీయంబులు. 126

తే. కలశసంభవ! 'వ్యాసుండు కాశిమీఁద
నేల కోపించెఁ జెప్పు' మం చీ వడిగితి
బాదరాయణకోపప్రపంచమునకుఁ
గారణము చెప్పెదను విను గౌరవమున. 127

వ్యాసుండు కాశిమీఁదఁ గోపించుట

సీ. త్రిషవణస్నానంబు దీర్చు భాగీరథి
శివధర్మములు చెప్పు శిష్యతతికి
నుదరపోషణము సేయును మాధుకరవృత్తి
లింగార్చనంబుఁ గల్పించు నియతి
ముక్తిమంటపమధ్యమునఁ బురాణము చెప్పుఁ
బంచాక్షరంబు జపంబు సేయు

భూతి సర్వాంగకంబుల సముద్ధూళించు
ధరియించు రుద్రాక్షదామకములు
తే. శ్రుతులు నాల్గేర్పఱచినట్టి సూక్ష్మబుద్ధి
బ్రహ్మసంవేది యాదిపురాణకర్త
భారతాఖ్యానసంహితా ప్రథమసుకవి
గంధవతిపట్టి యానందకాననమున. 128

వ. ఇవ్విధంబునం బెద్దకాలంబు కాశీనగరంబునం గృష్ణద్వైపా
యనుండు శిష్యవర్గంబును దానును నపవర్గపదవీకల్యాణ
లాభార్థంబు వసియింప నమ్మునిమనస్థైర్యంబు పరీక్షింపం
దలంచి విశ్వేశ్వర శ్రీమహాదేవుండు విశాలాక్షి కిట్లనియె.

గీ. బాదరాయణుచిత్త మేపాటిదియనియొ
యరయుదము గాని యతఁడు భిక్షాటనమున
కేగుదెంచినయప్పు డింటింట భిక్ష
కలుగకుండంగఁ జేయంగ వలయు నీవు. 130

వ. అనిన నద్దేవి మహాప్రసాదం బని యఖిలభూతాంతర్యామిని
గావునం గాశికానగరంబున గృహిణీగృహస్థులయంతరం
గంబుల నధివసించి భిక్షాప్రదానప్రతిష్టంభకారణం బై
యుండె; నంత కృష్ణద్వైపాయనుండును. 131

సీ. *కాలోచితము లైనకరణీయములు దీర్చి

---

* 'గంగాఁ జక్రపుష్కరిణీప్రదేశంబున నఘమర్షణస్నాన మాచరించి
నిలుచుండి కావించి నియతిమై గాయత్రి సంఖ్య యష్టోత్తరశతము గాఁగఁ
బఠియించి యప్పుడు పత్త్రపుష్పములతో శివు నీలకంఠుని సేవ చేసి
యంతరంగంబున నభవుని నిడుకొని శాంతచిత్తంబున సంధ్యవార్చి
గీ. యగ్నికార్యముఁ దీర్చి కౌమారిఁ గొల్చి' అని యొకవ్రాతపుస్తకమునఁ
బాఠాంతరము.

నరుణోదయము గానియటక మున్న
గంగలోఁ జక్రపుష్కరిణీహ్రదంబున
నఘమర్షణస్నాన మాచరించి
యరుణాంశుమండలం బర్ధోదయమునొందు
సమయంబు వీక్షించి సంధ్య వార్చి
నిలుచుండి జపియించి నియతితో గాయత్రి
సంఖ్య యష్టోత్తరశతము గాఁగ

తే. నగ్ని కార్యముదీర్చిఁ గామారిఁ గొల్చి
ముక్తిమంటపికామధ్యమునఁ బఠించె
శివపురాణంబు మధ్యాహ్నసీమదాఁక
నపరనారాయణుఁడు బాదరాయణుండు. 132

మ. ఝటితిసూర్యాతపలాశపత్రపుటికాశాటీ ప్రసేవంబులున్
ఘటముల్ తామరపాకులున్ గుహాళులున్ గండోలముల్
పూని బా, సట వేదంబుఁ బఠించుచుం గదిసి వైశంపాయ
నాదుల్ సము, త్కటభంగిం గొలువంగ నేగె ముని భిక్షా
కృత్యయాత్రార్థమై. 133

తే. నెట్టుకొని కాయు బిట్టెండఁ బట్టపగలు
తాను శిష్యులు నింటింట దప్పకుండఁ
గాశికావిప్రగృహవాటికలఁ బొనర్చె
నఖిలవిద్యాగురుండు భిక్షాటనమును. 134

శా. ఛాత్రుల్ పైలసుమంతజైమినులువైశంపాయనుండాదిగాఁ
బాత్రంబుల్ధరియించి యన్నిదెసలన్ భైక్షంబు వేఁడంగ న
క్షత్రాధీశ్వరమౌళిపట్టణమునం గాశిం దలంప న్మహా
చిత్రంబోగిరమబ్బదయ్యె బుషికింజేకూరదయ్యెందుదిన్. 135

తే. తిరిగె నింటింట భిక్షాం ప్రదేహి యనుచు
బాదరాయణుఁ డీశానుపట్టణమున
నొట్టు వెట్టినయట్ల నేయుగ్మలియును
బిలిచి యొకపట్టెఁడన్నంబు వెట్టదయ్యె. 136

తే. వండుచున్నార మనె నొక్కవనజనేత్ర
తిరిగి రమ్మనె నొక్కలేఁదీఁగెఁబోఁడి
దేవకార్యంబు నేఁ డనెఁ దెఱువ యొర్తు
ద్వాఃకవాటంబుఁ దెఱవదు వనిత యొకతె. 137

వ. ఇవ్విధంబున భాగ్యహీనుండు ధనంబునుం బోలె భిక్షాన్నంబు వడయ నేరక మఠంబునకుం జని జఠర క్షుధావ్యథాదూయమానమానసుండై కృష్ణద్వైపాయనుండు శిష్యుల రావించి వారల కిట్లనియె. 138

తే. అబ్బెనే నేఁడు మీకు మధ్యాహ్నభిక్ష
బ్రహ్మపురివాడఁ గాశికాపట్టణమున ?
సబ్బదో నాకపోలె మహర్షులార !
వాడవాడల నీపెద్దవల్లకాట? 139

సీ. దుర్భిక్షదోషంబు దొరకొన్నఁ గడపని
కడపనిగృహసూతకంబునందు
నింటఁ బీనుఁగు వోయె నేనియుఁ గడపని
కడపనిమ్ముక్కుడి గవిసె నేని
కువలయేశుఁడు దండుగులు గొన్నఁ గడపని
కడపనిభవనంబు గాలె నేని
పితృకార్యవిధి సమాప్తింపక గడపని
కడపనిముట్టంటు గలసె నేని

తే. వేళఁ గాకున్నఁ గడపని వేలుపులకు
మీఁదు వోకున్నఁ గడపని మిన్న కెట్లు
గడపి రింటింట నీ కాశికాపురమునఁ
బుణ్యగేహిను లిది మహాద్భుతము గాదె ? 140

వ. పెద్దకాలమునంబట్టి మన మున్నవార, మిక్కాశీపట్టణంబున
భిక్షాన్నంబుపుట్టనిదినంబునుం గలదె ? కుతపకాలంబునందు.

సీ. ముంగిట గోమయంబున గోముఖము దీర్చి
కడలు నాల్గుగ మ్రుగ్గుకట్టువెట్టి
యతిథి నచ్చో నిల్పి యర్ఘ్యపాద్యము లిచ్చి
పుష్పగంధంబులఁ బూజ చేసి
ప్రక్షాళితం బైన పసిఁడిచట్టువముతో
నన్నంబు మీఁద నెయ్యభిఘరించి
ఫలపాయసాపూపబహుపదార్థములతో
భక్తివిశ్వాసతాత్పర్యగరిమఁ

తే. బెట్టుదురు మాధుకరభిక్ష భిక్షుకులకుఁ
గంకణంబులతో సూడిగములు రాయఁ
గమ్రకరముల బ్రాహ్మణాంగనలు కాశి
నన్నపూర్ణభవాని కట్టనుఁగుఁజెలులు. 142

క. ఆపరమపురంధ్రులయం
దేపుణ్యాంగనయు భిక్ష యిడదయ్యెఁ గటా !
రేపాడి మేలుకొని మన
మేపాపాత్మునిముఖంబు నీక్షించితిమో? 143

తే. వాడఁబాఱినయవి వక్త్రవనరుహములు
భాజనంబులలోన నిష్ప్రచ్చరంబు

మీకు భిక్షాన్నములు లేమి నాకుఁ దెలిసెఁ
జేలపంటలఁ గొయ్యలు చెప్పఁగాన. 144

వ. చతుర్విధపురుషార్థములకు నకట! పుట్టినిల్లైన యిక్కాశీనగ
రంబున మనకు నేఁడు భిక్షాన్నంబు పుట్టమికిఁ గారణం
బేమియో మీర పరామర్శించి రం డనిన నట్లకాక యని
గురునియోగంబున నందఱు నన్నిముఖంబుల(ను)ం జని
యేయవకరంబునుం బొడగానక కృష్ణులవచ్చి శిష్యులు
బాదరాయణున కిట్లనిరి. 145

తే. అవధరింపుము నారాయణావతార!
బాదరాయణ! కాశికాపట్టణమున
నరకము లేదు మీయట్టి యధికపుణ్యు
లుండ నివ్వీటి కెట్లు గీ డొంద నేర్చు? 146

సీ. విశ్వేశ్వరుం డెందు విచ్చేసియున్నాఁడు
కైలాసశైలశృంగంబు విడిచి
ప్రవహించు నెందేని భాగీరథీగంగ
యుపకంఠమున హారమో యనంగ
నాఁకొన్న వారికి నమృతభిక్షాన్నంబుఁ
గృప సేయు నెందేని గిరితనూజ
యుండు డుంఠివినాయకుం డెందు నొసలిపై
యువరాజపట్టంబు నవధరించి

తే. యెందునుందురు తమయంతవేసివారు
పరమపుణ్యులు సంయమీశ్వరు లనేకు
లట్టికాశిని భిక్షాన్న మబ్బ దనుట
వినఁగఁ బొసఁగునె యిది యేమి విధమొ కాక. 147

సీ. జిలుఁగుసంధ్యారాగచీనాంబరము గట్టి
కుసుమగర్భపుఁ గీలుకొప్పు తనర
కస్తూరితోఁ గూర్చి గంధసార మలంది
ముక్తాలతాటంకములు ధరించి
సీమంతపథమునఁ జేర్చుచుక్క సవరించి
కురులపైఁ జిన్నిపూ గుస్తరించి
శ్రీపాదముల హేమనూపురంబులు దాల్చి
కటిమీఁద వజ్రాలకమరు నిల్పి
తే. యన్నపూర్ణ విశాలాక్షి యనెడు పేళ్లఁ
గాశికామధ్యశృంగాటకములయందు
విశ్వపతిదేవి మధ్యాహ్నవేళఁ బెట్టు
నమృతపాయసదివ్యాన్న మనుదినంబు. 148

తే. మనము మనమనపూర్వజన్మములయందుఁ
గడపినారము మధ్యాహ్నకాలభిక్ష
యనుభవింపక పోవంగ నలవి యగునె
కమలజుని కైనఁ బ్రారబ్ధకర్మఫలము.? 149

క. అందఱు భుజంగభూషణు
* లందఱునుం గాలకంఠు లందఱు గిరిశుల్
అందఱు ధృతేందుకళ లా
నందవనీనగరనివసన స్థిరులు నరుల్ 150

తే. బ్రహ్మలోకంబు గాశికి బడిసివాటు
విష్ణులోకంబు గాశికి వినిమయంబు

---

* 'లందఱున ద్రిశూలపాణు లందఱును గిశో, శేందూత్తంసులు' అనిపా.

దాసదాసానుదాసబృందంబు గాశి
కింద్రచంద్రాదిలోకంబు లిద్ధమహిమ! 151

సీ. శివుని నివాళించు శేషాహి నడురేయి
బహుఫణారత్నదీపములచేత
నంతర్హితంబులై యర్చించు నీశాను
ఫలపుష్పములఁ గల్పపాదపములు
కామధేనువులై దుఖండేందు శేఖరు
నాధస్యధారల నోలలార్చు
నిధులు తొమ్మిదియుఁ గంఠేకాలునకు నిచ్చు
నిర్మలమణులు కానికలు గాఁగ

తే. గాశికాపట్టణంబు శంకరుని నెలవు
కలి ప్రవేశింప దానందకాననమున
శ్రీనివాసంబు వారాణసీపురంబు
ముక్తిసంధాయకం బవిముక్తమెపుడు. 152

వ. అని శిష్యులు గాశీమాహాత్మ్యంబు వర్ణించిన విని బాద
రాయణుండు వారి కిట్లనియె. 153

తే. ఉపవసింతుము గాక నేఁ డుఁగి మఱిఁగి
యస్తమించుచు నున్నవాఁ డహిమభానుఁ
డెల్లి పారణకైన లే దెట్టు మనకు
మాధుకరభిక్ష బ్రాహ్మణమందిరముల. 154

వ. అని యారాత్రి గడపి మఱునాఁడు మధ్యాహ్న కాలంబున
శిష్యులుం దాను వేఱువేఱ వేదవ్యాసుండు విప్రభవనవా
టికలభిక్షాటనం బొనర్పంబోయి తొలునాఁటియట్ల ముక్కంటి
మాయ నేమచ్చకంటియు వంటకంబు వెట్టకున్నఁ గటకటం

బడి భిక్షాపాత్రంబు నట్టనడువీథిం బగుల వైచి కోపావేశం
బున. 155

తే. ధనమదంబును వేదవిద్యామదంబు
మోక్షలక్ష్మీమదంబును ముదిరి కాదె
కాశికాపట్టణంబునఁ గరుణ లేక
బ్రాహ్మణులు నన్ను నిటు భంగపఱిచి రనుచు. 156

వ. కృష్ణద్వైపాయనుం డాత్మగతంబున. 157

తే. ధనము లేకుండెదరు మూఁడుతరములందు
మూఁడుతరములఁ జెడుఁ గాక మోక్షలక్ష్మి
విద్యయును మూఁడు తరముల [1]వెలయవలయుఁ
బంచజనులకుఁ గాశికాపట్టణమున. 158

వ. అని పారాశర్యుండు క్షుత్పిపాసాపరవశుండై శపియింపం
దలంచునవసరంబున నొక్కవిప్రగృహంబువాకిటఁ బార్వతి
[2]ప్రకృతస్త్రీవేషంబున. 159

ఉ. వేనలి పాటపాట నరవెండ్రుకతోఁ దిలతండులాన్వయ
శ్రీ నటియింపఁ గై సడలి ప్రేఁకనిచన్నుల పాలవంకపైఁ
గా నసియాడ్పవాలుఁ దెలికన్నులు గల్కితనంబు వీడ్కొనం
మానిని హస్త మూఁదియొకమంజులభాషిణి వచ్చె వీథికిన్.

ఉ. వేదపురాణశాస్త్రపదవీనదవీయసి నైన పెద్దము
త్తైదువ కాశికానగరహాటకపీఠశిఖాధిరూఢ య
య్యాదిమశక్తిసంయమివరా! యిటు రమ్మని పిల్చె హస్త సం
జ్ఞాదరలీలరత్నకటకాభరణంబులు ఘల్లుఘల్లనన్. 161

వ. చేరం బిల్చి యమ్మత్తకాశిని సాత్యవతేయున కిట్లనియె. 162

1. వెడలవలయు 2. ప్రాకృత.

శా. ఆకంఠంబుగ వేడ్కతో నిపుడు భిక్షాన్నంబు భక్షింపఁగా
లేకున్నం గడు నంగలార్చెదవు మేలే! లెస్స! శాంతుండవే!
నీకంటె న్మతిహీనులే కటకటా! నీవారముష్టింపచుల్, శాకా
హారులుఁ గందభోజులు శిలోంఛప్రక్రముల్ దాపసుల్

తే. ఓమునీశ్వర! వినవయ్య యున్నయూరఁ
గన్నతల్లియు నొక్కరూ పన్నరీతి?
యటు విశేషించి శివుని యర్ధాంగలక్ష్మి
కాశి యివ్వీటిమీఁద నాగ్రహము దగునె? 164

తే. వేయుశాఖలతో సామవేదరాశి
యేకవింశతిరూప మై ఋగ్నిగమము
తొమ్మిదియు నూటయొక్కండ్రు త్రోవ లంది
మెరివొ నాథర్వణయజుస్సు లుండుఁ గాశి. 165

వ. ఇట్టి కాశికానగరంబుమీఁద భిక్ష లేకుండ కారణంబుగా నీయంతవాఁడు గటకటంబడి శపియింపం దలంచునె? బ్రాహ్మణుండవు గదా: నీకు నేమన్నను జెల్లు. అటు విశేషించి యాఁకొన్నవాఁడవు కావున నీయవసరంబున నిన్ను హెచ్చుకుందాడుట మముబోఁటిగృహిణులకు మెచ్చుగాదు. మాయింటికిం గుడువ రమ్ము. కుడిచి కూర్చున్న పిమ్మటం గొన్నిమాటలు నీతోడ నాడఁ గల విప్పుడు. 166

తే. వైశ్వదేవాదివిధుల సర్వమును దీర్చి
యరసియున్నాఁడు నాభర్త యతిథిరాక
నతిథి పంక్తికి రాకున్న నారగింపఁ
డొంటి నొకనాఁడుఁ బతి యొట్టియొఱకమునను. 167

తే. అభ్రగంగ నుపస్పర్శ మాచరించి
వేగ విచ్ఛేయ వలయు నావిభుఁడు దసిలి
యాఁకటికి నోర్వ లేఁడు బ్రాహ్మణవరేణ్య!
యర్కమండల మిదె వ్రాలె నపరదిశకు. 168

వ. అనిన వేదవ్యాసుండు ముత్తైదువ కిట్లనియె. 169

తే. కమలలోచన! కిన్నరాంగనవె నీవు
నీవు గంధర్వభామవే నీలవేణి?
యప్సరస్త్రీవె నీవు బింబాధరోష్ఠి?
రమణి! నీవు విద్యాధరరాజసుతవె?

సీ. కల్యాణి! నిన్ను నీకాశీపురములోన
నెన్నండుఁ గాన నీ వెవ్వరమ్మ?
నిన్ను దర్శింపంగ నిఖిలేంద్రియములకు
నత్యంతసంతృప్తి యావహిల్లె
రాహుదంష్ట్రాంకురక్రకచఘట్టనభీతి
జగతి కేతెంచినచంద్రకళవె?
నన్ను రక్షింపంగ నాపాలఁ గల్గిన
భాగ్యదేవతవొ తప్పదు నిజంబు

తే. ఒండెఁ గైవల్యలక్ష్మివి యొండె నీవు
కామినీత్వంబుఁ గైకొన్న కాశిపురివె ?
యొండె నాఁకొన్నవారల నూఱడించి
యమృతభిక్షొసఁగు మిడువిశాలాక్షి వీవు. 171

తే. చేయఁ గలవాఁడ నేను నీ చెప్పినట్లు
బ్రాహ్మణుఁడఁ గాన నాకుఁ జాపలము ప్రకృతి

బుద్ధిఁ గృప సేసి రక్షింపు పుణ్యసాధ్వి!
కాన! నీపేరు నాకు నిక్కముగఁ జెప్పు. 172

వ. అనిన నమ్మత్తకాశిని సాత్యవతేయున కిట్లనియె. 173

శా. ఊఁకోఁ జెప్పఁగ నెంత యేని తడ వౌ నో విప్రశార్దూల! నీ
వాఁకొన్నాఁడవు భోజనోత్తరమునం దాస్థానమై యుండి య
త్త్రాఁకం బెట్టక చెప్పెదన్ వినుము వృత్తాంతంబునుం దేటగా
వీఁక న్వేళ యతిక్రమించెఁ గుడువన్ వేంచేయుమా గ్ర
క్కునన్ 174

వ. అనినం బారాశర్యుం డయ్యార్యతో నమ్మా! యొక్కవిన్న
పంబు గల దాకర్ణింపు మని యిట్లనియె. 175

తే. అయుతసంఖ్యశిష్యు లాయాయివీథుల
వేలువేలు భిక్ష వేఁడితేలు
నేను నొక్కవీథి నేకాంతవృత్తిమైఁ
బర్యటించి తెత్తుఁ బంచభిక్ష. 176

చ. దినను దినంబుఁ దప్పకిటు ద్రిమ్మరిచాలఁగ భిక్ష చేసియుం
జను నెడఁ గూడ వత్తురు కృశానుసమానులు నన్నుఁ బైలజై
మినిముఖు లైనశిష్యులు సమిద్ధమతిం బురసూర్యవీథికిన్
మునుకొని యొయ్యనొయ్యఁ గరముం గరవల్లియునుంబరిం
[చుచున్

తే. శిష్యులును నేను గూడి రాజీవనేత్ర!
యాశ్రమమునఁ బాషాణమతాంతరమున
రాశి వోయుదు మఖిలపాత్రికలయందు
నందలును దెచ్చినట్టి భిక్షాశనముల. 173

సీ. పాయసాపూపాదిపక్వాన్ననివహంబు
లేకీభవించిన నేర్పరించి

యన్నింట సగ మతిథ్యభాగ్యగతార్థంబు
భాజనంబుల నించి పాయఁ బెట్టి
సగము భాగీరథీసలిలధారాప్రవా
రంబునఁ బ్రక్షాళితంబు సేసి
తారతమ్యమున వృద్ధపురస్సరంబుగాఁ
బరిపాటి వేర్వేఱ బంతి సాగి
తే. యర్థి 'నమృతాయతా' మని యనుమతించి
యేను మున్ను ప్రాణాహుతు లెత్తఁ జూచి
చేయుఁ బ్రాణాగ్నిహోత్రంబు శిష్యకోటి
యింతగాలంబు నీ వ్రతం బిట్లు సెల్లె. 179
ఉ. ఎన్నఁడుఁజూడ మున్వినమె యిట్టిమహాద్భుతమేమిచెప్పుదుం
గిన్నరకంఠి ? యొ ట్టిడినకీలునఁ గాశిపురంబునందు భి
క్షాన్నము లేదు నీయడుఁగు ఆన నిజంబుగ విన్నవించెదన్
నిన్నటబట్టి యేము నిరు సీఁగియు నుంటిమి నిట్టుపాసముల్.
ఉ. చట్టలు డప్పిమై నవురుసౌ రయి పాత్రలుఁ దారుఁ గాశికా
పట్టమునందుఁ గూటికి నుపాయము లేక పరిభ్రమింప వా
రెట్టటపోవ నిమ్మనుచు నించుకయేనియుఁ దాల్మి లేక యే
నెట్టుభుజించువాఁడఁదరళేక్షణ! యొక్కఁడనీగృహంబునన్.
తే. అస్తమింపంగఁ జేరినాఁ డహిమకరుఁడు
శిష్యులే కాక యఁయుతంబుఁ జిగురుఁబోఁడి!
వ్రతము దప్పి భుజింపంగ వలను గాదు
నేఁడు నిన్నటిమఱునాఁడు నిక్కువంబు. 182
చ. అనవుడు నల్ల నవ్వి కమలానన యి ట్లను లెస్సగాక యో
మునివర! నీవు శిష్యగణముం గొని రమ్మిట వేడ విశ్వనా

థుని కృపపేర్మి నెంద అతిథుల్ చనుదెంచినఁ గామధేనువుం
బనిగొనునట్లు పెట్టుదు నపారము లైనయభీప్సితాన్నముల్.

వ. అనిన నట్లకాక మహాప్రసాదం బని వేదవ్యాసుండు శిష్యు
లం గూర్చుకొని భాగీరథికిం జని యుపస్పర్శ్నం బాచరించి
యేతెంచిన. 184

తే. గొడుగు పాఁగలు గిలుకలు గులుకరింప
నిందుబింబాస్య యెదురుగా నేగుదెంచి
ఛాత్ర సహితంబుగాఁ బరాశరతనూజు
బంతి సాఁగించె ముక్తిశాలాంతరమున. 195

ప. అనంతరం బావిశాలాక్షీ మహాదేవియనుభావంబున నమ్మహా
మునులముందటం గనకరంభాపలాశపాత్రంబులయందు విచి
త్రంబుగాఁ గలవంటకంబులు, నపూపంబులు, లడ్డుకంబులు,
నిడ్డెనలు, గుడుములు, నప్పడంబులు, నిప్పట్లు, గొల్లెడలు,
దోసియలు, సేవియలు, *వంగరపోలియలు, పోవెలు, †సార
సత్తులుఁ‡బొత్తరలు,జక్కిలంబులు, మణుఁగుఁబూవులు, మో
రుండలుఁ, బుండ్రేక్షుఖండంబులుఁ, బిండఖర్జూరద్రాక్షానారికేళ
కదళీపనసజంబూచూతలికుచదాడిమీ కపిత్థకర్కంధూఫలం
బులు, గసగసలుఁ, బెసరుపులగములుఁ, జెఱకుగుడుములు,.
నరిసెలుఁ, బిసకిసలయములవరుగులుఁ, జిఱుగడములుఁ, బడి
దెములుఁ, బులుపలుఁ, బులివరుగులు, నప్పడంబులుః, బప్పు
(లు), రొట్టియలును, జాపట్లుఁ, బాయసంబులుఁ, గర్కరీ
కారవేల్లకూశ్మాండ నిష్పావకపటోలికాకోశాతక్యలాబూ

---

* 'అంగరోల్లె' లని శబ్దరత్నాకరము. † 'సారెసత్తులు' అని శ. ర.
‡ బొంతరకుడుములు.

శిగ్రూపాంబరవార్తాకబింబికారవింద శలాటువులును, గం
దయుఁ, బొందయుఁ, జారులుఁ, దియ్యగూరలుఁ, బచ్చ
డులు, భజ్జీగలు, భిజ్జిగిణులు, వడియంబులుఁ, గడియంబులుఁ,
గాయంబులు, గంధతోయంబులు, సుంద్రాలు, నానబాలు,
ననుములు, మినుములు, బుడుకులు, నడుకులు, నిలిమిడి
గుసు, జలిమిడియును, ద్రెబ్బడయు, వడయు, నుక్కెరలుఁ,
జక్కెరలును, నేతులుఁ, దేనెతోలలుఁ, బిట్టును, గుట్టును,
ద్రోఁపలుఁ, ఘాలతిమ్మనం బూపలు, మోదకంబులు, గుడో
దకంబులు, శాకంబులు, చెఱకుపాకంబులు, ముక్కులు, మొర
యని (మురియని) చొక్కంపుటేరుఁ బ్రాలమిలమిలని మడుం
గు రాజనంపుటోగిరంబులు, పాడబంబులతోడఁ, బానకం
బులతోడఁ, దిమ్మనంబులతోడఁ, దధిపిండఖండంబులతోడ,
మీఁగడలతోడఁ, మజ్జిగలతోడ, నూరుఁగాయలతోడ, నంబ
కబళంబులతోడ, దసావళులతోడంగూడ, భుగభుగలం దగు
బొరగఁగంపులతోడం బ్రతిభటించు రామఠామోదంబును,
రామఠామోదంబుతో మంతనంబాడు మెంతుల నెత్తా
వులు, మెంతులనెత్తావులతో బిత్తరించు జీరకంబులసౌర
భంబులును, జీరకంబులసౌరభ(వ్య)ంబులతోడం బ్రస్తరించు
కుస్తుంబురుకిసలయవాసనలును, కుస్తుంబురుకిసలయ
వాసవలతోడం బిసాళించుచుఁ గఱివేపాకుపరిమళంబును,
గఱివేపాకుపరిమళంబుతో సంబంధించుకమ్మకసిందగంధంబులు
ను, గమ్మకసిందగంధంబులతోడం దార్కొను నేలకులసౌరభం
బులును, నేలకులసౌరభంబులతో సాళగించుకాలాగురుకు
రంగనాభి కర్పూరగంధసార నీహారవాగపూరంబుల వలపు

లును, కాలాగురుకురంగనాభికర్పూరగంధసారనీహారవాః పూరంబులవలపులను, వానితోడం గలహించు మహిసాక్షీ గుగ్గులుధూపధూమంబుల కమ్మదనంబును, గూడిభోజనా గారగవాక్షమార్గంబుల వెడలి కాశికానగరఘంటావీథులం బౌరజననాసికాపుటకుటీరంబులకుఁ గుటుంబకంబులుగా మిరియంబు పెరిమయుఁ, బసుపుపసయు, శొంఠిసొబగు, నావ లేవయుఁ, జెందుప్పుచేఁగయుఁ, కరాంబువుమవ్వంబును, బిప్పలి యొప్పును, నల్లంబు, మొల్లంబును, జింతగొజ్జురజ్జును, జేలపిండిమెండును, నిప్పపూమొగ్గల యగ్గలికయు, వెన్నపెన్నాటకంబునుం గలిగి యొక్కొక్కమటియుఁ దనకుఁ దాన నులివేఁడికట్టావితో నావిర్భవించిన. 186

సీ. తరుణకంకోలపాదపపల్లవముచాయ
తవణించుజడలజూటంబు ముడిచి
హైమంబు లైనరుద్రాక్షకుండలములు
శ్రవణపార్శ్వములందు సంతరించి
నిర్నాభిబిలముగా నెఱి వీఁగుబొజ్జపై
సలిలకాషాయవస్త్రము ధరించి
యాపాదమస్తకం బఖిలాంగకంబుల
నవ్యభస్మోద్ధూళనంబు సేసి
తే. పాశుపతదీక్ష రూపంబు పడసినట్లు
శాంతి పుంభావ మొందినసౌష్ఠవమున
బంటినడిమికి నేతెంచి భవనభర్త
తపసులకు భక్తి నన్నంబు దారవోసె. 187

వ. అంత. 188

తే. ఆరగించెఁ జతుర్విధాహారములను
మనసుకోరిక నిండంగ మునిగణంబు
వారిబంతిన కుడిచె నావాసభర్త
ధర్మగేహిని తాలవృంతంబు వీవ. 189

వ. భోజనానంతరంబున నాస్థానమంటపంబున సుఖోపవిష్టుండై ధర్మపత్నియుం దాను గృహపతి బాదరాయణు రావించి కూర్చుండ నియమించి కనుసన్నఁజేసి విశాలాక్షికి నతనితో నాడఁ గలమాట లాడు మనిన నమ్మహాదేవి సాత్యవతేయున కిట్లనియె. 190

తే. ఆరగించితె కడుపు నిండార నీవు?
శిష్యతతి భోజనంబు సేసెనె యథేచ్ఛ?
నదను దప్పినఁ దలఁగి యంతంత నున్న
వారు లేరు గదయ్య మీవంగడమున? 191

వ. అనిన బాదరాయణుండు మహాదేవీ! షడ్రసంబులయందు నొక్కొక్కరసం బుల్బణంబును, ననుల్బణంబునుఁ, నుల్బణానుల్బణంబును ననుమూఁడు ప్రకారంబుల ముయ్యాఱు భేదంబుల నాస్వాదనీయంబులై చతుర్విధాహారంబులయందు మాజిహ్వలకుం బండువుసేసె. కడుపు నిండ భుజించితిమి. వాసరద్వయోపవాస సంప్రభూత జఠర గోళక్షుధాగ్ని తాపం బుపశమించె. అవసరంబు దప్పి భోజనంబు లేక యంతంత నున్నవారు మాయం దెవ్వరును లేరు. మున్నెన్నఁడుం జూడము వినము. ఇట్టియుద్భుతంబుం గలదె? పాత్రంబులయందు విచిత్రంబు లగునన్నంబులు సవ్యంజనంబులయి తమకుండా మావిర్భవించు టెట్లు? మీ

ప్రభావంబు మీఁద యెఱుంగుదురు. మాకుఁజూడ నీవు విశా
లాక్షి పీయయ్య యావిశ్వేశ్వర శ్రీమన్మహాదేవుండును
గావలయు ననిపలికిన విని యీశానియు నలిగి యతండు కాశీ
నగరంబునకుం జేసిన యపరాధంబునకుం దగినశిక్ష సేయం
గలదై యిట్లనియె 192

క. *మేలుగఁ గాశీనగరం
బీలాగున భక్తి గలిగెనే భోజన మే
వేళం బుట్టదు? పుట్టని
వేళం గినియంగఁ దగునె వేదవ్యాసా? 193

ఉ. ఎట్టు పురాణము ల్పదియు నెన్మిదిఁ జెప్పితి? వెట్లు వేదముల్
గట్టితి వేర్పఱించి? నుడికారము దప్పకయుండ భారతం
బెట్టు రచించి? తీవు ఋషివెట్టయి? తొక్కదినంబుమాత్రలోఁ
బొట్టకు లేక తిట్టెదవు పుణ్యగుణంబుల రాశిఁ గాశికన్. 194

క. క్రోధంబు ఫలమె నిర్మల
బోధమునకుఁ? దీర్థవాసమున కర్థం బే
క్రోధము? వారాణసిపైఁ
గ్రోధించిన విశ్వభర్త క్రోధింపఁ డొకో? 195

వ. వారాణసీ ముక్తిస్థానం బీతీర్థముమీఁద నెవ్వం డన్యా
యము దలంచువాఁడు రుద్రపిశాచం బగు నని పలికి
భవాని భవునియాసనం బాలోకించిన. 196

---

* ఒక వ్రాఁతపుస్తకమున దీనికిఁ బద్యాంతరము:—

'మేలుగఁ గాశీనగరం, బీలాగున భుక్తి గలిగె నీభోజన మే
వేళం బుట్టదు? పుట్టని వేళం గినియంగ దగునె వేదవ్యాసా!'

మఱియొక ప్రతిలో 'కినియుటెటిది తగవె' ఇంకొకదానిలో 'వేళనునీకిడియె తగవు' యనియు నున్నది.

తే. కాశి నుండంగ నర్హుండు గాఁడు వీఁడు
వెడలి పొ మ్మనుమాటలు వేయు నేల?
క్రోధనుం డెట్లు? కైవల్యకులగృహంబు
నానివాసంబు కాశికానగర మెట్లు? 197

వ. అని విరూపాక్షుండు రూక్షాక్షరంబుల (ఁదన్ను)నధిక్షేపించి
పలికినం గలంగి వడవడ వడంకుచు వేదవ్యాసుం డయ్యాదిమ
దంపతులపాదారవిందంబులకుం బ్రణమిల్లి యేనపరాధంబు
సేసితిఁ గోపం బుపసంహరింపవలయు నని ప్రార్థించిన. 198

సీ. కాశికాపురిఁ దొంటికట్టడ నుండక
పుణ్యకాలమునందు భూతతిథుల
వచ్చువాఁడవు శిష్యవర్గంబు నీవును
నైదుక్రోశములకు నవలినేల
నుండువాఁడవు పైఁడికుండలు ప్రాకార
వలయంబుఁ బొడగానవచ్చుచోటఁ
దక్కన్యతిథులఁ దీర్థముల నిందింపకు
బుద్ధిమంతుఁడవు గాఁ బొమ్ము బ్రదుకు

తే. మంచు నంతర్హితుం డయ్యె నగజతోడ
విశ్వనాథుండు మునియును విశ్వభర్త
యాన తిచ్చినచోటనే యధివసించెఁ
గాశికాపురి కెడదవ్వు కలుగునడవి. 199

తే. అనిన విని కుంభసంభవుఁ డాదరమున
నాంబికేయున కభివాదనంబు సేసి
కాశిఁ గలతీర్థములును లింగములు నాకు
నాన తి మ్మని ప్రార్థించి యడుగుటయును. 200

వ. కార్తికేయుం డౌర్వశేయున కిట్లనియె. 201

క్షేత్రతీర్థకదంబవర్ణనము

తే. అనఘ! యిట్టుల మాతల్లి యడిగె శంభు
హస్తములు మోడ్చి యడిగిన నధికకరుణ
నాన తిచ్చె విశాలాక్షి యనెడుపేరి
యస్మదంబకుఁ దరుణచంద్రార్ధమౌళి. 202

వ. విశాలాక్షీ! మోక్షలక్ష్మికిం బుట్టినిల్లగు కాశీపట్టణంబున విశ్వేశ్వరాభిధానుండ నైననాచుట్టునను బంచక్రోశమధ్యంబునను విరించి హరిపురందరాదిబృందారకవందనీయంబులై నిగూఢంబులు నగూఢంబులు గూఢాగూఢంబు లగు దివ్యలింగంబులుం బుణ్యతీర్థంబులు బావనవాపీకూపతటాకంబులు లెక్కించి చెప్ప గోచరంబులుగావు. లేశమాత్రంబునుఁ జెప్పెద. సావధానమతివై యాకర్ణింపుము. సారసలోచన! సారస్వతేశ్వరుండు సారస్వతప్రదుండు; నీలవేణి; గోప్రేక్షుండు దాక్షిణ్యనిధి; అచలకన్యక! దధీచీశ్వరుండు పాపవిమోచనిండు; కనకకేతకీ (కుసుమ) గర్భపత్ర (సగోత్ర గాత్రి!) గౌరి! యత్రీశ్వరుం డిహాముత్రఫలప్రదాత; లజ్జావతి! విజ్వరేశ్వరుండు గుజ్జుకల్పతరువు; తలోదరి! వేధేశ్వరుండు కరుణానిధి; కుశేశయగంధి! యాదికేశవుం డఖిలక్లేశనాశకుండు; తన్వంగి! సంగమేశ్వరుండు తంగేటిజున్ను; తీఁగబోఁడి! చతుర్ముఖేశ్వరుండు భయత్రాత; ఇంతి! శాంతీశ్వరుండు చింతామణి; కాంత! కాంతీశ్వరుండు సంతతికరుండు; విపులశ్రోణి! కాసిలహ్రదం బఘగదాగదంకారంబు; కిసలయోష్ఠి! యనసూయేశ్వరుండు కొంగుపసిఁడి; ముగ్ధ!

సిద్ధివినాయకుండు కామధుగ్ధేనువు; తరుణి! హిరణ్యకశిపు
లింగంబు ముంగిటినిధానంబు; మందగమన! మందాసురేశ్వ
రుండు వందారుజనమందారంబు; సుదతి! సతీశ్వరస్కందే
శ్వర ప్రసన్నవదనేశ్వరులు శాశ్వతైశ్వర్యసంధాయులు;
చండి! ప్రసన్నోదకుండంబు దురితఖండనంబు; అష్టాదశ
యోగపీఠికాధిష్ఠాత్రి! యట్టహాసేశ్వరుండు ఘటితాఘ
ప్రఘట్టుండు; జగద్ధాత్రి! మిత్రావరుణ వృద్ధవసిష్ఠకృష్ణ
యాజ్ఞవల్క్య ప్రహ్లాదవైరోచనేశ్వరులు సర్వాభీష్ట ఫల
ప్రదాయకులు;పల్లవపాణి! బాణచంద్రవిద్యేశ్వరులు క్షుద్రోప
ద్రవ విద్రావణులు; కర్ణమోటీ! వికటాదేవి జంబేటికాలువ;
గౌరి! వీరేశ్వరుండు వారాణసీపంచముద్రమహాపీఠ పట్టాభి
షిక్తుండు; లీలావతి! వాలిహనూమదధీశ్వరుల లింగంబులు
మంగళప్రదంబు లనిచెప్పి వెండియు. 203

దండకము. విను మభినవవిద్రుమాతామ్రదంతచ్ఛదా! భద్రకుం
డంబు గండూషితాశేషదోషంబు భద్రేశ్వరశ్రీమహాదేవుం
డందుండుఁ, జతుష్కుండపూర్వోత్తరాశావిభాగంబునం జక్ర
కుండంబు చక్రేశుఁ డందుండుఁ, దత్సేవ సంసారచక్రక్రమ
ప్రక్రియాధిక్కృతి, ప్రౌఢ! తన్నైరృతాశం ద్రికూటేశ్వరుం
డుండు, నాచేరువన్ శూలికుండంబు, శూలాహ్రదస్నానపా
నంబులన్ మానవుం డొందు నేనోనివృత్తిం దదగ్రంబున
న్నారదేశుండు గోటీశుఁడుం గోటితీర్థంబు నంగారకాధీశుఁ
డున్, దుర్గ! చాముండియున్ భార్గవేశుండునున్నాపిలేశుండు
నోంకారమత్స్యోదరీతీర్థరాజంబులున్ శంకుకర్ణేశ్వరాఘోర
నాథేశుఁడున్ రుద్రవాసాహ్రదంబున్ మహాపాతకోపద్రవో

ద్రేకవిద్రావణ ప్రౌఢిముద్రాసమున్నిద్రరౌద్రోదయస్ఫూర్తినై
యుండు, రాచక్కటిం గౌస్తుభేశుండు సిద్ధేశుఁడుం గామ
కుండంబు లక్ష్మీశ సత్యావ్రతేశానులుం జంద్రకుండంబు
సింద్రేశచంద్రేశ్వరాగ్నీశులుం బాలచంద్రేశుఁడుం వృద్ధ
కాళేశలింగంబు నష్టేశలింగంబునై గావణాధీశలింగంబు
ధన్వంతరీశానలింగంబునుం దంగనాధేశలింగంబు శ్రీభై
వాధీశలింగంబు దక్షించు మన్త్రీశుఁడు వృత్యోఘ్నకంబైన
భీత్యుద్గమంబుల్ బెడంబాపు వ్యాసేశ్వ వ్యాసకుండం
బులుం బంచచూడాసరోమధ్యమేశానమందాకినీతీర్థముల్
రామభద్రేశుఁడుం జంబుకశ్రీమతంగేశులుం సిద్ధరూపంబు
సిద్ధేశుఁడుం వ్యాఘ్రలింగంబు వాణాత్మపేశానుఁడుం హరి
త్రేశుండుగాణాదరూపంబుగాణాదలింగంబునాషాఢనాధేశుఁ
డుం భారభూతేశుఁడుం శ్రీగభస్తీశుఁడుం మంగళేశుండు
నుం ద్వష్ట్రునాధేశుఁడుం దైవదైతేశుఁడుం మంగళాదే
వియుం శ్రీమయూఖార్కుఁడుం వ్యాఘ్రపాదేశుఁడుం
శ్రీవిభాండేశలింగంబు సిద్ధేశలింగంబునాలక్షకోట్యర్బుసర్వ
ర్బుదానేకలింగంబు లాకాశగంగాప్రతీపంబునం గాశికా
క్షేత్ర సీమావిభాగంబునం భోగమోక్షంబులుం సేవక
శ్రేణికిఁజాలుఁ గల్యాణి! కాత్యాయనీ! దేవి! నారాయణీ!
శ్రీవిశాలాక్షి! సత్యంబు సత్యంబు సత్యంబు ముమ్మాటికిన్.

క. గంగాధరుసన్నిధి హరి
ముంగలఁ జదివినను విన్న ముక్తిధరిత్రీ

---

1. శ్రీఘ్రచండీశుఁడుం చిత్రగుప్తేశుఁడుం నిర్జరాధీశుఁడుం విఘ్న గేశుండు శుక్రేశుఁడుం శక్రరూపంబు శ్రీదాదికాధీశుఁడుం శ్రీఆదికేశే శుఁడుం పిశాచేశుఁడుం.

లింగాభిధానమాలిక
భంగించును బంచజనునిపాపౌఘంబుల్. 205

తే. ఒక్క పేరిలింగంబులు పెక్కు గలవు
కలవు పెక్కొకపేరిన కలువకొలఁకు
లొక్క పేరిన కలవు పెక్కు వనములు
గాశికాపట్టణమునందుఁ గంబుకంఠి. 206

తే. అంధువులసంఖ్య లెక్కింప నలవి గాదు
కుండములసంఖ్య లెక్కింప గొలఁది గాదు
వాపికలసంఖ్య లెక్కింప వలను గాదు
పద్మలోచన! కాశికాపట్టణమున. 207

మ. మునుపు స్మచ్ఛటయు న్రహస్యమునను స్ముద్రించి నానాదివౌ
కసు లాస్థానముఁ గూడియాడుదురు శ్రీకాశీప్రదేశంబునన్
గనవె పుట్టెడుభాగ్యమైన మనకున్ గల్పింపదా దైవ మీ
కసుమాళం బగునాక మేల యనియుత్కంఠాతిరేకంబునన్.

తే. కాశి శివలింగకోటులఁ గన్నతల్లి
కాశి కైవల్యఫలసవకల్పవల్లి
గంగగారాబునెచ్చెలికత్తె కాశి
సురనరోరగదైత్యసంస్తుత్య కాశి. 209

తే. శైలసుత, సర్వతీర్థైకజన్మభూమి
సర్వవేదపురాణశాస్త్రములగరిడి
సర్వపాపౌఘజలదజంఝామరుత్తు
సర్వమోక్షమ్ములకు శుభాస్పదము కాశి. 210

ఉ. దుర్గ! హిమాచలంబుపయి దుస్సహమైన తపంబు సేసి త
ద్భార్గరిమంబున న్ననుఁ గుతూహలిఁ జేసితి వీవు కాశి నె

సర్గిక మైనతేజమున సంతస మందఁగఁ జేయు నన్ను నీ
మార్గముకాశికానగరిమార్గముఁజూడుమయెద్దియెక్కడో ?

క. నీ వెంత ప్రియవు నాకును
దేవి! విశాలాక్షి సర్వదేవనమస్యా
కైవల్యజన్మనిలయము
శ్రీవారాణసియు నంత ప్రియ మైయుండున్. 212

తే. స్కందనందిమహాకాళకరటిముఖులు
నైగమేషవిశాఖులు నలిననేత్ర?
పట్టిమూడంగ నా కెంత పరమహితులు
పాయ కవిముక్తమున నున్న ప్రజలు నట్లు. 213

తే. వేల్చినారు తపంబు గావించినారు
తీర్థములు సర్వములును సాధించినారు
కమలలోచన! యానంద కాననమునఁ
బాయకుండెడుజనులు ప్రాగ్భవమునందు. 214

తే. భువనభారంబునకుఁ గాఁగఁ బుట్టినారు
కాశిఁ గాఁపున్న ప్రజలు దక్కఁగ లతాంగి
యక్షగంధర్వగరుడవిద్యాధరులును
దందశూకులు నర్థవాదంబుగాదు. 215

తే. *కాశిపురి నున్నయట్టిపుల్కసునిఁ బోల
రితరభూముల నున్నవా రెంతవారు
శ్రోత్రియులయింటఁ బుట్టనీ శ్రుతులు నాల్గు
నభ్యసింపంగ నీసరోజాయతాక్షి?

సీ. సార్ధద్విసంఖ్యాధికేక్షణుం డనవచ్చుఁ
గాశిఁ గాఁపుర మున్న కాఁపుకొడుకు

---

* కాశికాపురినున్న పుల్కసుని.

కాశిఁ బంచక్రోశికడసీమ మొలచిన
గఱికతో సరిరావు కల్పకములు
కల్పాంతకాలంబు గరుసు దాఁటిననాఁడుఁ
గాశి మునుఁగ లేదు కడలివెల్లి
బ్రహ్మాదులకుఁ గాశిఁ బాదచారమ కాని
యొక్క మర్యాద లే దెక్కిరింత
తే. సుదతి! పాపములకునెదుర్చుక్క కాశి
వెలఁది! యుపపాతకములకు విషము కాశి
భామ! కల్యాణమున కాటపట్టు కాశి
ఇంతి! మోక్షంబునకుఁ బుట్టినిల్లు కాశి. 217
తే. అన్ని కుండంబులను దీర్థమాడినఫల
మన్ని లింగంబులకు మ్రొక్కినట్టిఫలము
గలదు నీహారగిరిరాజకన్య! నిజము
మరియు నీతీర్థములు విన్న మానవులకు. 218
సీ. జపియింపఁ దగుఁ బితృశ్రాద్ధకాలంబుల
నిమ్మహాస్తోత్ర, మద్రీంద్రతనయ!
పంచమహాపాపభద్రేభపంచాస్య
మిమ్మహాస్తోత్ర మద్రీంద్రతనయ!
పఠియించువారలపాలి కల్పద్రుమం
బిమ్మహాస్తోత్ర మద్రీంద్రతనయ!
నాకు సత్యంతమనగ ప్రమోదావహం
బిమ్మహాస్తోత్ర మద్రీంద్రతనయ!
తే. డాంబికున కుద్ధతునకు నధార్మికునకుఁ
గూటసాక్షికి శఠునకుఁ గుత్సితునకు

హేతువాదికిఁ గ్రూరున కిది యనర్హ
మిమ్మహాస్తోత్రరాజ మద్రీంద్రతనయ! 291

వ. అని గంగాధరుండు కాశీలింగతీర్థమాహాత్మ్యంబు విశాలాక్షికి వినిపించుచుండె. ఆసమయంబున మందరాచలంబుననుండి దివోదాసోచ్చాటనానంతరంబు గాశి కేగుదెంచి బహిర్గేహంబునం బట్టాభిషేకంబు గైకొని యంతర్గేహప్రవేశంబునకు శుభముహూర్తంబు ప్రతీక్షించుచుండ నమ్మహోత్సవకాలం బాసన్నం బగుటయు నందికేశ్వరుం డేగుదెంచి యిట్లనియె. 220

సీ. ఊర్జమాసంబున సుదురాజునభివృద్ధి
ప్రతిపద్దినంబున భాస్కరుండు
గగనహర్మ్యశిఖాగ్రకనకకుంభంబు గా
నభిజిత్తునందు మధ్యాహ్నవేళఁ
బ్రాలేయకరుఁడు సప్తమరాశితోఁ గూడఁ
బంచగ్రహము లుచ్చపదవి నుండఁ
గరణంబు యోగ నక్షత్రంబులును లెస్స
గా లగ్నసంశుద్ధి కలిమి మెఱయ

తే. మంచికాలంబు సాధించి మనసు గెలిచి
బ్రహ్మహరివాసవాదుల పరమనిష్ఠఁ
గాచి యున్నారు మీరాకఁ గాలకంఠ!
వేగ విచ్చేయు గేహప్రవేశమునకు.

వ. అది నందికేశ్వరుండు విన్నవించినం బరమానందకందళితహృదయారవిందుండై యయ్యిందుశేఖరుండు విశాలాక్షీసహితుం డై మోక్షలక్ష్మీలీలదర్పణం బైనయంతఃపురప్రాసాద

మందిరంబు ప్రవేశించె. సురభిగంధంబులై గంధవాహం
బులు వొలసె. గంధర్వులు దివ్యగాంధర్వంబున మద్రకాది
(మహా)ప్రబంధంబులు పాడిరి. అప్సరస లాడిరి. మహర్షులు
హర్షించిరి. చారణులు సంస్తుతించిరి. ప్రమథులు ప్రమో
దించిరి. విద్యాధరులు పుష్పవర్షంబులుగురియించిరి. చరా
చరభూతజాలంబు సంప్రీతిమేదురంబులయ్యె. పంచమహావా
ద్యంబులు సెలంగె. ఇబ్భంగి గృహప్రవేశమహోత్సవారం
భంబు త్రిభువనచరదృక్కారంభం బయ్యె నయ్యవసరంబున.

ఉ. వెగ్గల మైనవాసనలు విశ్వజగంబులఁ గ్రమ్మ వేల్వఁగా
గుగ్గులుధూపధూమము లగోచరలీల నజాండగోళము
న్నగ్గలిఁ బాఱె వానిమిళనంబునఁ గాదె నభంబు గల్వపూ
*మొగ్గయుఁబోలియిప్పుడు సమున్నతినీలిమమయ్యెఁజూడ్కికిన్.

తే. అవసరం బిచ్చి శివుఁడు బ్రహ్మాచ్యుతాది
దేవతల గారవించె నతిప్రియమున
నటు విశేషించి మధుకైటభాసురారి
నాదరించెను గారవం బతిశయిల్ల. 223

వ. ఆదరించి యిట్లని యానతిచ్చె 224

తే. నీకతనంబునఁ గాదె నాళీకనయన?
కలిగెఁ గ్రమ్మఱ నానందకాననంబు
తక్కరుఁడు నేర్చునే దివోదాసనృపతి
విబుధసందోహవిద్వేషి వెడల నడుప? 225

వ. నీకుం బ్రియం బెయ్యది? యదియ వరంబుగా నిత్తు ననిన
నచ్యుతుం డంబికావల్లభున కిట్లనియె. 226

---

* 'మగ్గయుఁబోలె నిప్పుడు సమంచిత' ఇత్యాది విచార్యము.

తే. ప్రియము నా కొంత గలుగ దీత్రిభువనములఁ
గలదు ప్రియ మొక్కటియ చూడఁ గాలకంఠ!
కాశికాపట్టణమున నివేశనంబుఁ
గరుణ నొసఁగర నిమ్ము నీ పాదుగునందు. 227

విశ్వేశలింగమాహాత్మ్యము

వ. అనిన విని శంభుం డట్లయగుంగాక యో విశ్వంభర! నా చేరువనే యుండు. మొదల నిన్ను నారాధించి పిమ్మటఁ బ్రజలు నన్నారాధించువారు. ఇదె చూడు. దక్షిణమంటపం బైన యీయపవర్గ మంటపంబునఁ గాశీమాహాత్మ్యపుణ్య కథలు వినునది. మణికర్ణికా స్నానానంతరంబు ముక్తిమంట పంబునఁ బురాణంబు వినుట కర్తవ్యంబు. 228

తే. కాశిఁ దీర్థంబు లెన్నేని గలుగనిమ్ము
చక్రతీర్థంబు తీర్థంబె శార్ఙ్గపాణి!
కాశి లింగంబు లెన్నేని గలుగనిమ్ము
విశ్వపతి మేటి లింగంబు విహగగమన! 229

క. కైవల్యమంటపం బిదె
నావిహారణభూమిపద్మనాభ! విముక్త
శ్రీవనితాశుద్ధాంతము
గ్రైవేయవిభూషణంబు కాశీపురికిన్. 230

వ. ఈముక్తిమంటపంబునకు భవిష్యద్ద్వాపరంబునఁ గుక్కుట మంటపం బనునామాంతరంబు గలుగఁ గలయది. యావృత్తాంతంబు వివరించెద. ఆకర్ణింపుము. ఆనందకాననంబున మహానందుం డనుబ్రాహ్మణుం డగ్రవేది పిన్ననాఁట పితృ

మాతృవియోగంబు నొంది యవినయనిధానం బైనయౌవ
నంబున విషయాసక్తుండై విషమశరశరశలాకాకీలితం బైన
చిత్తంబున నుత్తమాంగన(నుం)బొరుగింటి బ్రాహ్మణు(ని)
భార్య మైత్రీచ్ఛద్మంబున నపహరించి యపేయపానం బభక్ష్య
భక్షణం బగమ్యాగమనం బనాచారాచరణంబు గర్తవ్యం
బులుగా వర్తించుచు. 231

సీ. శైవుఁ డై యొకవేళ సర్వాంగకంబుల
భూతియు రుద్రాక్షములు ధరించుఁ
బఠియించు శ్రీగీతఁ బరమభాగవతుఁ డై
యుద్ధతి నటియించు నొక్కనాఁడు
గొరగ యై మైలారుఁ గొనియాడు నొకవేళ
నొసలిపై బండారుపసుపుఁ దాల్చి
ప్రణుతించు నొక్కవీరాదేవి నొకవేళ
బవినీఁ డయి సమగ్రభక్తిగరిమ

తే. బౌద్ధుఁ డై యొకవేళఁ గాపాలికుఁ డయి
యొక్కవేళను జైనుఁ డై యొక్కవేళ
దిరుగు నాయాయిచిహ్నము ల్పరిఢవించి
యర్థకాంక్ష మహానందుఁ డనెడు సురుఁడు 222

తే. శైవపరిషత్తుఁ గూడి వైష్ణవుల నవ్వుఁ
బదరు శైవుల వైష్ణవప్రతతిఁ గూడి
శైవుఁడును గాఁడు తాను వైష్ణవుఁడు గాఁడు
పరమధూర్తాగ్రగణ్యుండు బ్రాహ్మణుండు. 233

క. ఏవేషము ధరియించిన
నావేషము తనకు నడ్డమైః యద్ధాత్రీ

దేవుఁడు చెట్టునఁ బుడికిన
భావంబున నుండు రూపు ప్రాయము కలిమిన్. 234

తే. ద్వారవతి గంగమట్టి హస్తమునఁ గరఁచి
ఫాలమున నూర్ధ్వపుండ్రంబు పట్టె దీర్చి
యుభయదర్భలు ధరియించి యుదయవేళ
గంగదరి నుండు దానాభికాంక్ష నతఁడు. 235

ఉ. ఏమని చెప్పఁ గాశిపురి నెంపసు సంకుచితాగ్రహస్తుఁడై
భూమిసురుండు దానములు పుచ్చుకొనండు దరిద్రుఁడయ్యు నే
నేమము పాటునం గనిన నేటితటంబున నర్థకాంక్షఁ బే
రాముదపాకునట్లు తనహస్తము విచ్చియయుండు వానికిన్.

తే. ఇవ్విధంబున బ్రాహ్మణుం డేపురేగి
తిరుగుచుండఁగఁ బెక్కువత్సరము లరుగఁ
గలుగుదురు పుత్రు లిద్ద అక్కాలమునకుఁ
గుండగోళకశబ్దంబు కొనలు సాగ. 237

వ. అక్కాలంబునం దొక్కచండాలుండు బహుధనాఢ్యుండు వింధ్యపర్వతదేశవాసి తీర్థయాత్రాప్రసంగంబునం గాశికేతెంచి చక్రపుష్కరిణీహ్రదంబునఁ దీర్థంబాడి యార్ద్రవస్త్రధరుండై దరికేతెంచి నలుదిక్కులం జూచి యుచ్చైస్స్వనంబున.

శా. చండాలుం డను వింధ్యభూధరమహాసానుస్థలీపక్కణ
స్థుండం గాశికి వచ్చి సిద్ధతటినీతోయంబులం గ్రుంకితిఁ
వెండిం బైఁడియుఁ దెచ్చినాఁడఁ గల దేవిప్రుండు విద్యాసము
ద్రుం డీయర్థము వాని కేను బితృసంతోషార్థమై యిచ్చెదన్.

తే. అనిన విని భూసురోత్తము లద్దిరయ్య!
కాశి యఁట గంగ యఁట మణికర్ణిక యఁట

విశ్వపతి యఁట యవిముక్తవిహృతిభూమి
మాలచే దారగొనెడు బ్రాహ్మణుఁడు గలఁడె? 240

తే. అనుచుఁ జేతులఁ గర్ణంబు లదిమికొనుచుఁ
బోవ నున్నారు నది నున్న భూమిసురులు
చూప నున్నాఁడు వ్రేల భూసురుఁ డొకండు
సాహసికుఁడు మహానందు సన్న నేసి. 241

సీ. ప్రార్థింప నున్నాఁడు పాదాబ్జముల వ్రాలి
వెలివాడవాఁడు తద్విప్రకులుని
మేల్కొన నున్నాఁడు మిథ్యాసమాధిన
క్కపటధార్మికుఁ డప్డు కన్నుఁ దెఱచి
ప్రణుతింప నున్నాఁడు బ్రాహ్మణబ్రువు మాల
కేల్దోయి నొసలిపైఁ గీలుకొలిపి
దీవింప నున్నాఁడు దెలిసి దోహారిబంటు
చెవి నక్షమాలిక చెరివి ద్విజుఁడు

తే. ప్రబలతరభక్తి నీరీతి బ్రస్ఫుటముగ
వివిధదంభంబు లిబ్భంగి విస్తరిల్ల
నంత్యజుండును నగ్రజన్మాధముండు
గంగదరిఁ దీర్తు రుచితసత్కారవిధులు. 242

వ. అనంతరంబ పరద్రవ్యజిహీర్షాలోభగ్రహగ్రస్తుండై నయ
య్యగ్రజన్మాధముండు చండాలునిం గటాక్షమున వీక్షించి
నిస్పృహత్వంబు నటించుచు. 243

తే. ఆస లేదు ధనంబుపై నంత్యజన్మ!
చాలు యాయావరము శిలోంఛంబు మాకుఁ

నలుగురం బట్టి ధన మెల్ల నొలిచికొందు ! 252

వ. ఒలిచికొని యాదొంగ లిట్లని వితర్కింతురు. 253

తే. ధనము పేరాశ మబ్బె నీతఁడు బళాయి
వీఁడు ప్రాణాన కలిగిన వెదకి వెదకి
మనల బరి మార్చుఁ గా కేల మనఁగ నిచ్చు
నితని వధియింత మని నిశ్చయింతు రపుడు. 254

వ. వధియింప నిశ్చయించి బ్రాహ్మణునిం జేరి కత్తిఁ దీటి యోయి విప్రుండ ; నీవు కళత్రంబును నీతనయులును మీయిష్ట దైవంబులం దలంచికొండనుటయు. 255

తే. అంబురుహనేత్ర శ్రీవిశాలాక్షిఁ దలఁచు
బ్రాహ్మణుఁడు చిత్తమున విశ్వభర్తఁ దలఁచుఁ
దలఁచుఁ బుత్రద్వయంబు సద్భక్తియుక్తిఁ
గంఠపీఠాగ్ర కరిరాజు ఢుంఠిరాజు. 256

వ. వెండియు మహానందుం డాత్మగతంబున. 257

సీ. పొరిగింటిబ్రాహ్మణిఁ బుణ్యగేహిని నేల
యపహరించితిఁ గన్ను లార్చి యార్చి
పడరానిబ్రాహ్మణపదవి భస్మంబుగా
మధుమాంసముల కేల మరులుగొంటిఁ ?
బరమనాస్తికుఁడ నై పాషండవేషంబు
ఘటియించుకొని యేల కొర్కి నైతిఁ?
జక్రపుష్కరిణిలోఁ జండాలకులజుచే
ధన మపారం బేల ధారఁ గొంటి ?

తే. నాతతాయికి శఠున కన్యాయరతికిఁ
బాపబుద్ధికి విశ్వాసపాతకునకు

నాకు నిదిస్రష్ట మని మహానందుఁ డుండు
మస్తకము వాంచి కాంతారమధ్యభూమి. 258

చ. తలలు దెగంగ వ్రేయుదురు తస్కరవీరులు వారి నల్వురన్
నలువురుఁ జచ్చియన్యజననంబునఁ గుక్కుటజాతిఁబుట్టుటం
గోలఁకులకోళ్లలోఁ గలసి కోళ్లును నాలుగు నుండుఁగానయ
ప్పగుఁలుఁగూటఁబెట్టుకొనిపోదురు కాశికిసార్థవాహకుల్.

సీ. రేపాడి మణికర్ణికాపయోవేణిక
మజ్జనం బాడు నేమంబు మెఱయ
ముక్తిమంటపములో మునిజనంబు పఠింప
విను నాదిమపురాణవిస్తరంబు
విశ్వనాథునిదివ్యవేశ్మంబునకు జేయు
మైత్రి మీఁదఁ బ్రదక్షిణాత్రయంబు
ద్వారభూములఁ జల్లునీరాజనక్రియా
దివ్యాన్నములఁ దీర్చు దేహయాత్ర

తే. గోరి భజియించు నొకవేళఁ గొమరుసామిఁ
నాల్గుజాలును సంజ్ఞాస్వనం బొనర్చుఁ
బ్రణవమంత్రంబుఁ క్రేంకారపదముఁ గూర్చు
మిక్కుటం బగుగరిమతోఁ గుక్కుటములు. 260

వ. ప్రాగ్జన్మవాసనావశంబున నజ్ఞానతస్కరత్వంబు గలిగి యాకు
క్కుట చతుష్కంబు ముక్తిమంటపంబు నాశ్రయించి మో
క్షంబు వడయం గావున నమ్మంటపంబునకుఁ గుక్కుటమంట
పంబను సంజ్ఞాంతరంబు సంభవించు నని శంభుండు విశ్వంభ
రునకు నావృత్తాంతం బానతిచ్చె విశ్వంభరుండును విశ్వేశ్వర
లింగంబుతోడి సాంగత్యంబు వహించె నని చెప్పుటయు. 261

తే. కుంభసంభవుఁ డంబికాసంభవునకు
ప్రణతుఁ డై దేవతాయాత్రపదము దెలుపు
క్రమముతో నది మొదలుగాఁ గాశియందుఁ
దీర్థ మాడంగ నర్హంబు దివిజవంద్య ? 262

దేవతాయాత్రావిధానము

వ. అనినం గుమారస్వామి చక్రపుష్కరిణీతీర్థంబున దేవర్షిపితృ తర్పణంబు సేసి యాదిత్యద్రౌపదీవిష్ణుదండపాణిమహేశ్వర ఢుంఠివినాయకజ్ఞానవాపీనందికేశ్వర తారకేశ్వర కాలేశ్వరుల సేవించి విష్ణువిశ్వేశ్వరుల నారాధించునది. అనంతరంబ ఓంకారలింగంబు మత్స్యోదరీకృత్తివాసోలింగంబు రత్నేశ్వరుండు చంద్రేశ్వర కేదారేశ్వర కరవీరేశ్వరదక్షేశ్వర పార్వతీశ్వరపశుపతీశ్వర గంగేశ్వర నర్మదేశ్వరగభస్తీశ్వర సరస్వతీశ్వర తారకేశ్వరుల దర్శించునది. శైలేశ్వరసంగమేశ్వర మందాకినీశ్వర మణికర్ణికేశ్వర గోప్రేక్షేశ్వర కాపిలేశ్వర శుక్రేశ్వరేశ్వరవహ్నీశ్వగనకులేశ్వరభారభూతేశ్వర లాంగలీశ్వరమ (౦) దాలసేశ్వరతిలపర్ణేశ్వర . త్రిపురాంతకేశ్వర మనఃప్రకారేశ్వర ప్రీతికేశ్వర బ్రహ్మేశ్వరాగస్తీశ్వరకశ్యపేశ్వర త్రిసంధేశ్వర హాటకేశ్వర సీమావినాయకత్రిసంధ్యేశ్వర విశాలాక్షీశ్వర రమేశ్వర ధర్మేశ్వర వినాయకవృద్ధాదిత్యచండిచండీశ్వర భవానీశ్వర పరాన్నేశ్వర వీరభద్రేశ్వరుఁ పంచవినాయకులం బూజించునది. 263

సీ. యాత్రాక్రమం బిది యానందకానన
వాస్తవ్యదేవతావర్గమునకు